# శభాష్ గౌండ్ల రామక్కా!

ప్రభాకర్ జైనీ, 79898 25420

**'అవును..** ఆమె గౌండ్ల రామక్కేనా?'

నా ముఖ కవళికలు తనను గుర్తు పట్టినట్టుగా మారుతుండేసరికి.. 'ఆఁ! యాదికొచ్చిన్నా?' అని నా భుజంమీద రాస్తూ అడిగింది.

వార్ధక్యం వల్ల ఆమె గొంతు బలహీనంగా ఉందో, లేక ఆ పెండ్లిపందిరిలో మోగుతున్న మంగళ వాయిద్యాల హోరులో నాకు సరిగ్గా వినపడటం లేదో గానీ.. నాకు ఆమె మాటలు సరిగ్గా వినిపించడం లేదు. కానీ, ఆమె ఎవరో మెల్లిమెల్లిగా గుర్తుకు రాసాగింది. ఆమె పేరు నోటిదాకా వస్తున్నది గానీ, ఆ పేరుకు సరిపడ పదాలు అందక, పలుకలేకపోతున్నా! ఇంతలో తనే..

'గౌండ్ల రామక్కను! మర్చిపోయినవా ఇజ్జమ్మా?' అంది తొర్రిపండ్లతో నవ్వుతూ. అప్పుడు నా నాలుకమీద నానుతున్న అస్పష్ట భావానికి ఒక పేరు, ఒక రూపం కండ్లముందు మెదిలాయి.

'ఎక్కడి గౌండ్ల రామక్క? ఎక్కడి జొన్నల మల్యాల? ముప్పై ఏండ్లు గడిచిపోయాయి..' అనుకుంటుండగానే కండ్లలో నీళ్లు తిరిగాయి. నా కండ్లలో నీళ్లు చూసి రామక్క కంగారు పడుతూ, నా భుజంమీద మరింత ఆప్యాయంగా రాస్తూ..'ఏమైంది ఇజ్జమ్మా? అంతా పయిలమే కద?' అన్నది.

నేను రామక్క చేతిని ఆప్యాయంగా, పెన్నిధి జారిపోతుందేమోనన్నంత అపురూపంగా పట్టుకొని లేచి నిలబడి, పెండ్లిపందిరి బయటకు నడిచాను. రామక్క మెల్లిగా నడుస్తూ నన్ను అనుసరించింది. రామక్కను చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంది. నిలువెత్తు మనిషి వంగిపోయి, వడలిపోయి, ముసలి వగ్గయి, పండువృక్షంలా, మెల్లిగా కర్ర పట్టుకొని నడుస్తున్నది. పెండ్లిపందిరికి దూరంగా, మా కారు దగ్గరకు నడిచాము. తలుపు తీసి లోపలికి రమ్మంటే..

'మీదేనా ఇజ్జమ్మా?' అని గుసగుసగా అడిగింది. నేను నవ్వుతూ..

'మనదే రామక్కా! దా లోపలికి రా!' అని నా చేయి అందించి లోపలికి లాగి కూర్చోబెట్టాను. కొత్తగా కొన్న ఇన్నోవా క్రిస్టా కారులోని బకెట్ సీటులో కూర్చుని,

**'మంచిగ చూసుకుంటడు!**
**కొట్టుడు కాదు గద తిట్టను కూడ**
**తిట్టడు!' అన్నాను.**
**'పోనీయ్ లే బిడ్డ! మహారాజుల**
**ఇంటబుట్టినవ్! కని చివరికి**
**ఘనంగ పెండ్లి చేసే దిక్కు కూడ**
**లేకపాయే! కని దేవుడు చల్లంగ**
**చూసిండు.**
**ఘనమైన ఇంట్ల పడ్డవు.**

చుట్టూ చూస్తూ.. 'ఇజ్జమ్మా! గాలి మోటరు లెక్కుంది. ఐదారు షేర్ ఆటోలంత పెద్దగుంది!' అని సంబురపడింది. నేను కూలింగ్ కంపార్ట్‌మెంట్ లోనుండి స్ప్రైట్ కూల్ డ్రింక్ తీసి ప్లాస్టిక్ గ్లాసులో పోసి ఇస్తే..

'కల్లా?' అని అడిగింది.

నేను ఫక్కున నవ్వి..

'మేం కల్లు తాగుతమా రామక్కా? కూల్ డ్రింక్! తాగు!' అన్నాను.

కూల్ డ్రింక్ తాగుతూ నన్ను తేరిపార చూస్తూ, నా చేతులకున్న బంగారు గాజులనూ, మెడలో ఉన్న నెక్లెసును చేయితో ఆప్యాయంగా తడిమి చూసి..

'అవేనా?' అని అన్నట్టు చూసింది. నేను నవ్వుతూ.. 'అవును' అన్నట్టుగా తలూపాను.

'మీ ఆయిన మంచిగ చూసుకుంటడ? కొడ్తడ ఎప్పుడైన?' అని నా చెవిలో గుసగుసగా అడిగింది. నేను నవ్వాపుకోలేకపోయాను.

'మంచిగ చూసుకుంటడు! కొట్టుడు కాదు గద తిట్టనుకూడ తిట్టడు!' అన్నాను.

'పోనీయ్ లే బిడ్డ! మహారాజుల ఇంట బుట్టినవ్! కని చివరికి ఘనంగ పెండ్లి చేసే దిక్కుకూడ లేకపాయె! కని దేవుడు చల్లంగ చూసిండు. ఘనమైన ఇంట్ల పడ్డవు. మారాణి లెక్కున్నవ్! చిన్నప్పుడు మీ నాయిన, పెద్ద సావుకారు బతికున్నప్పుడు ఎట్లున్నవో గట్లున్నవ్! అసలూ గీ కమాన్‌పూర్ల పెండ్లికి నేను రాకనే పోదును గనీ, నువ్వొస్తున్నవని మనూర్లె తపాలా పంతులు పెద్దబిడ్డ, నీతోటి కలిసి చదువుకున్నది చూడు.. గా రాధమ్మ దొరసాని చెప్పింది. గందుకె వచ్చిన. లేకపోతే ఎక్కడ మల్యాల? ఎక్కడ కమాన్‌పూరూ? గీ వయసుల నాతోటి అయితదా? నిన్ను చూడాలని కండ్లు తపన పడతా ఉండే! నువ్వేమో మనూరి ముఖమే చూస్త లేవాయె? గందుకె మీ అన్న కొడుకును బతిలాడి, ఆ పెండ్లి బస్సుల పడి వొచ్చిన. వొచ్చినందుకు నిన్ను జూసిన. చాలు, ఈ జన్మకు గీ తృప్తి చాలు..' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది.

నేను రామక్క కండ్లు తుడుస్తూ, అప్రయత్నంగానే ఆమె కాళ్లకు మొక్కాను. రామక్క చప్పున కాళ్లను వెనుకకు లాక్కొని..

'అయ్యో.. గిదేంది ఇజ్జమ్మా! నా కాళ్లు మొక్కుతున్నవ్! తప్పు కాదు. మీరు మా ఊరి షావుకార్లు. మా ఇంటిని మీ అమ్మ లక్ష్మమ్మే నిలబెట్టింది' అంటూ నా కాళ్లు మొక్కబోయింది. నేను వారిస్తూ, చేతులు జోడించి ఆమెకు నమస్కరిస్తూ.. 'రామక్కా!

నేనెందుకు దండం పెడుతున్ననో నీకు తెలుసు!' అన్నాను.

'యే! గవన్ని గిప్పుడెందుకమ్మా! పెండ్లికొచ్చినవ్! నిన్ను చూడాలని నేనొచ్చిన గని గా పాత విషయాలన్నీ గుర్తుకు తెచ్చుకునేటందుకు కాదు!' అంటూ నా చేతులు పట్టుకొంది. తర్వాత అనేక విషయాలు ముచ్చటించుకొన్నాం.

తన భర్త చనిపోయాడనీ, పిల్లలందరికీ పెండ్లిళ్లయి వాళ్ల కాపురాలు వాళ్లు చేసుకుంటున్నారనీ, తను మాత్రం మల్యాలలోనే ఉంటూ తన వంతుకు వచ్చిన మూడు తాటిచెట్లను కౌలుకు ఇవ్వగా వచ్చిన సొమ్ముతోపాటు తనకొచ్చే వృద్ధాప్య పింఛనుతో కాలం వెళ్లదీస్తున్నానని చెప్పుకొచ్చింది రామక్క. అది విని నేను..

'మరి మీ కొడుకుల దగ్గరికి వెళ్లి ఉండవచ్చు కదా?' అని ప్రశ్నించాను.

'ఇజ్జమ్మా! అడ్డాలనాడు బిడ్డలుగనీ గిప్పుడు గడ్డాలనాడు మన పిల్లలు కాదు. పెండ్లిండ్లు, సదువులు, నౌకర్లు పడి ఎవరి సంసారం వాండ్లకు ఏర్పడినంక గిప్పుడు.. గిప్పుడు.. నేను వాండ్లకు సొంతతల్లిని కానని గుర్తుకొచ్చింది. నేనుగూడ ఒకమాట పడేదాన్ని కాదు! వాళ్ల కాళ్ల దగ్గర పడుండే ఖర్మ నాకేం పట్టిందమ్మా! నా పాలుకొచ్చిన మూడు తాటి చెట్లున్నయి. ఇల్లున్నది. సర్కారిచ్చే పింఛనొస్తాంది. దర్జాగ బతుకుతున్న. ఎప్పటికైన గౌండ్ల రామక్క శభాష్ అనిపించుకొనేటట్టే బతుకుత! గంతేగని సవతి కొడుకులూ, వాండ్ల పెండ్లాలూ ఈసడించుకుంటాంటే వాండ్ల కాళ్లదగ్గర పడి ఉండను. అయినా ఇజ్జవ్వా! నాకంత గనం కష్టమొస్తే నువ్వు లేవా?' అన్నది.

రామక్కకు సుమారు ఎనభై ఏండ్ల వయసొచ్చినా మునుపటి ఆ ధైర్యం, ధీరత్వం పోలేదు. కానీ, చివరకు తనన్న 'నువ్వు లేవా?' అన్న మాటకు నా గుండె కలుక్కుమంది. ఈ ముప్పై ఏండ్లు రామక్క నన్ను తలచుకుంటూనే ఉంది. అందుకే ఆ భరోసాతోనే 'నువ్వు లేవా?' అన్నది.

కానీ, ఈ ముప్పై ఏండ్లలో నేను రామక్క గురించి ఒక్కసారి కూడా ఆలోచించలేదు. రామక్క చూపిన ఔదార్యానికి నేను కృతజ్ఞత చూపించలేదు. కనీసం ఆమెను తలచుకోలేదు కూడా! గిల్టీనెస్‌తో నా హృదయం భారమైంది.

అయితే, దానికి కూడా ఓ కారణం ఉంది. అయినా సరే నేను చేసింది తప్పే! కంప్యూటర్‌లో 'డిలీట్' అన్న బటన్ ప్రెస్ చేసి అప్పటివరకు స్టోర్ చేసిన మెమొరీస్‌ను డిలీట్ చేసినట్టుగా.. నేను నా మనసులో నుండి నా పుట్టింటి జ్ఞాపకాలన్నిటినీ, 'పెండ్లి' అనే బటన్‌తో తుడిచి పారేశాను.

నేను ఆ ఊరినుండి వచ్చేసిన తర్వాత కొన్ని సంవత్సరాలకు ఆస్తులన్నీ కరిగిపోయినయ్. మా అన్నల దగ్గర అప్పులు తీసుకున్న వాళ్లు, 'అన్నల' పేర్లు చెప్పి బెదిరించడంతో ప్రాణాలు అరచేతబట్టుకొని మా అన్నలిద్దరూ తట్టాబుట్టా సర్దుకొని

ఒకరు కరీంనగర్‌కు, ఒకరు వరంగల్‌కు చేరుకొన్నారు. తర్వాత కొన్ని రోజులకు అమ్మ చనిపోయినప్పుడు, వరంగల్‌కు వెళ్లి అమ్మకు అంతిమ నివాళులు అర్పించి వచ్చాను.

అందుకే, నాకు మా ఊరు జొన్నల మల్యాలతో ఇప్పుడు సంబంధం ఏముంటుంది?

ఆ రోజు మల్యాలను వదిలిపెట్టి వస్తున్నప్పుడు నా మనసులో ముద్రించుకున్న భవంతి చిత్రమే ఇప్పటికీ నాకు గుర్తుంది. కానీ, ఇప్పుడు ఆ భవంతి ఆనవాళ్లు కూడా లేవని తెలిసిన తర్వాత.. అమ్మ లేని, ఇల్లు లేని, ఆప్యాయతలు మృగ్యమైన ఆ పుట్టిన ఊరితో నాకేం పని?

**అయితే, దానికి కూడా ఓ కారణం ఉంది. అయినా సరే నేను చేసింది తప్పే! కంప్యూటర్‌లో 'డిలీట్' అన్న బటన్ ప్రెస్ చేసి అప్పటివరకు స్టోర్ చేసిన మెమొరీస్‌ను డిలీట్ చేసినట్టుగా.. నేను నా మనసులో నుండి నా పుట్టింటి జ్ఞాపకాలన్నిటినీ, 'పెండ్లి' అనే బటన్‌తో తుడిచి పారేశాను.**

ఇలా నా ఆలోచనల్లో నేను ఉండగానే, రామక్క ఏదేదో చెబుతున్నది. కాసేపు తనుకూడా ఆలోచనల్లో మునిగింది. కాసేపటి తర్వాత అమ్మను తలచుకొని ఇద్దరం కన్నీరు కార్చాము. తర్వాత రామక్క నా సంసారం గురించి అడిగి వివరాలు తెలుసుకొన్నది. నా పిల్లలు ప్రయోజకులయ్యారనీ, నేను మహాలక్ష్మిలా ఉన్నానని చెబుతూ మరొకసారి చెంపలు నిమిరింది.

తర్వాత కారు దిగబోతుంటే..

'ఇజ్జమ్మా! గదొకటి ఇంకో గ్లాసు పోస్తవా?' అని స్ప్రైట్ బాటిల్ వంక చూపించింది రామక్క.

నేను నవ్వుతూ.. ఆమె గ్లాసు నింపాను. తను తాగిన తర్వాత పెండ్లిపందిరిలోకి నడిచాము.

కమాన్‌పూర్‌లో మా అన్న కొడుకు పెండ్లి అయిన తర్వాత తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరాను. మా ఆయన, పిల్లలూ రాననడంతో డ్రైవర్‌ను తీసుకొని నేనొక్కదాన్నే వచ్చాను. కారు కమాన్‌పూర్ ఊరు దాటుతుంటే, మనసు బాల్యంలోకి పరిగెత్తింది.

కమాన్‌పూర్ మా అమ్మమ్మగారి ఊరు. చాలా చిన్నప్పుడు మా అమ్మ చేయి పట్టుకొని ఆ ఊరికి వచ్చినట్టు లీలగా గుర్తుంది. మా ఆస్తులు తరిగిపోవడంతో మాకు ఆప్తులు కరువయ్యారు. ఆ ఊర్లో బంధువులెవ్వరూ లేరు.

మాది జొన్నల మల్యాల. నా బాల్యం అంతా అక్కడే గడిచింది. మా నాన్న బతికి ఉన్నంత కాలం మహారాణిలా తలెత్తుకొని బతికిన నేను, ఆయన హఠాత్తుగా

**మొగణ్ణి చడామడా తిట్టి, ఒక రోజు ఎవ్వరికీ చెప్పకుండా పొత్కపల్లికి పోయి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకుని రెండు రోజుల తర్వాత వచ్చింది. ఊరంతా ముందు 'ఔరా!' అని ఆశ్చర్యపోయింది. తర్వాత 'శభాష్ రామక్కా!' అని మెచ్చుకుంది.**

చనిపోవడంతో.. అన్నదమ్ముల ఆస్తి తగాదాలలో కుటుంబం చితికి పోవడంతో గుంభనంగా, దీనంగా, రహస్యంగా, పేదగా గడపాల్సిన రోజులు దాపురించాయి.

నేను ఐదో తరగతో ఆరో తరగతో చదువుతున్నప్పుడు, మా భవంతికి కొంచెం దూరంలో ఉండే శంకర్‌గౌడ్ భార్య చనిపోయింది. ఆ గౌండ్లాయనకు ఆరోగ్యం బాగుండదు. ఆరుగురు పిల్లలు. ఇంట్లో ఆడదిక్కు లేకపోవడంతో ఊర్లో పెద్దలందరూ కలిసి తల్లీదండ్రీ లేని రామక్కను తీసుకొచ్చి శంకర్‌గౌడుకిచ్చి పెండ్లి చేశారు. వాళ్లిద్దరి మధ్య ఇరవై ఏండ్ల వయసు తేడా ఉంది. తల్లిదండ్రుల ఆలనాపాలనా లేకపోవడంతో పిల్లలంతా ఆవారాగా తిరగడం చూసి రామక్క రంగంలోకి దిగింది. రామక్క పనిమంతురాలు అని నెలరోజుల్లోనే నిరూపించుకొంది. రోగిష్టి భర్తను కట్టడి చేసింది. కొడుకులను తీసుకొని తనే తాళ్లల్లకు పోయి కల్లు కుండలు దింపించుకొని ఇంటికి తీసుకొచ్చేది. వాడుక ప్రకారం ఎవరి ఇంటికి కల్లు పంపాలో పంపి, మిగిలిన కల్లును నగదు ఇచ్చిన వారికే పోసేది. ఉద్దెర అడిగిన వారికి నిర్మొహమాటంగా కల్లు లేదని చెప్పేది. కల్లు అమ్మకం పూర్తయ్యేసరికి, ఎదిగిన ఆడపిల్లలు స్నానం చేసి చిన్న పిల్లలు ఇద్దరినీ తయారుచేసి బడికి పంపాలనే రూల్ పాస్ చేసింది. పిల్లలు బడికి పోగానే తనూ, మిగిలిన నలుగురూ కలిసి కూలీకి పోయేవారు. ఎప్పుడూ చింపిరి తలలతో, పాత బట్టలు కట్టుకొని ఉండే పిల్లలు ఆరోగ్యంగా తయారవ్వడం, శంకర్‌గౌడ్ ఆరోగ్యం బాగుపడి పదేళ్ల వయసు తగ్గినట్టుగా కనిపించడం, మొండిగోడల ఇల్లును బాగు చేసుకొని సున్నాలు వేసుకోవడంతో శంకర్‌గౌడ్ ఇల్లు కళకళలాడింది.

రామక్క ప్రతిరోజూ పిల్లలను తీసుకొని పొలం పనులకు కూలీకి పోయేది. పొలం పనులు లేనప్పుడు కుట్టు మిషన్ పనికి పోయేది. ఆడపిల్లలిద్దరికీ పెద్దపల్లిలో శిక్షణ ఇప్పించి, బ్యాంకు లోనుతో రెండు కుట్టుమిషిన్లు కొని మా ఊళ్లోనే టైలరింగ్ పనులు చేయించేది.

రామక్క మొగుడు రోగిష్టి. రామక్క వయసులో ఉందని కొంతమంది ఆమెమీద, ఈడొచ్చిన ఆడపిల్లలమీద కన్నేశారు. ఒకరోజు పట్టపగలు తనమీద చేయి వేయ-ంబోయిన ఒక తాగుబోతు మర్మాంగాన్ని గట్టిగా పట్టుకొని, వాడిని ఊరి నడిమధ్యలోకి లాక్కొని వచ్చి, అందరి ముందూ 'ఖబడ్దార్!' అని హెచ్చరించింది.

అప్పటినుంచి రామక్క అన్నా, ఆ ఇంటి ఆడపిల్లలన్నా ఊరి ప్రజలకు హడల్ పుట్టింది.

రామక్కతో పిల్లలు కనాలని ఉందని శంకర్‌గౌడ్ చెప్పడంతో.. మొగణ్ణి చడామడా తిట్టింది. ఒకరోజు ఎవ్వరికీ చెప్పకుండా పొత్కపల్లికి పోయి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకొని రెండు రోజుల తర్వాత వచ్చింది. ఊరంతా ముందు 'ఔరా!' అని ఆశ్చర్యపోయింది. తర్వాత 'శభాష్ రామక్కా!' అని మెచ్చుకొంది.

అంతటి సమర్థురాలైన గౌండ్ల రామక్క, మా అమ్మకు ప్రియమైన భక్తురాలు. తీరికగా ఉన్నప్పుడు అమ్మ దగ్గరకు వచ్చేది. నన్ను ఒళ్లో కూర్చోబెట్టుకొని ముచ్చట్లాడుకునే వారు. అమ్మకు కూడా రామక్క అంటే ఎంతో అభిమానం. కూలిపోబోతున్న తన సంసారాన్ని చక్కదిద్దుకొన్న వైనం చూసి మెచ్చుకునేది. తనకా సామర్థ్యం లేనందుకు అమ్మ చింతించేది. రామక్క వెళ్తున్నప్పుడు ఇంట్లో మిగిలిన పాలో, పెరుగో, పచ్చడో ఇచ్చేది. మాకున్న అనేక వ్యాపారాల్లో పిండిగిర్ని ఒకటి. అందులో అడుగున మిగిలిన పిండిని తను కొన్న పశువుల కోసం తీసుకెళ్లేది. రామక్కకు ఎప్పుడైనా అవసరమైతే అమ్మ తను దాచుకున్న డబ్బులో నుంచి కొంత సాయం చేసేది. రామక్క తనకు వెసులుబాటు కాగానే తిరిగి ఇచ్చేది.

రెండేండ్లలోనే తమ ఇంటిపక్కన ఉన్న జాగాను కొని, అందులో రెండు గదులు కట్టి పెద్ద కొడుకు పెండ్లి చేసింది. మరో నాలుగేండ్లలో మిగిలిన ముగ్గురి పెండ్లిళ్లూ చేసింది. చిన్న పిల్లలిద్దరినీ పెద్దపల్లి బీసీ హాస్టల్లో చేర్పించింది.

ఊరంతా మరొకసారి 'శభాష్ రామక్కా!' అని ఆమెను మెచ్చుకొన్నారు.

రామక్క సంసారం పెరుగుతున్న సమయంలోనే, మా ఇంటి సంసారం కృంగిపోసాగింది. దగ్గరి బంధువులు, రక్త సంబంధీకులే అందిన కాడికి పందికొక్కుల్లా దోచుకొని మా ఇల్లును గుల్ల చేశారు. నాకు పెళ్లీడు వచ్చినా అన్నదమ్ములు పట్టించుకోకపోవడంతో అమ్మ రామక్కను రహస్యంగా వరంగల్‌కు పంపి, మాకు వరసయిన వారితో మాట్లాడి నా పెండ్లికి ఒప్పించింది. పల్లెటూళ్లో ఏ విషయమూ దాగదు. అందుకే, అత్యంత పకడ్బందీగా అమ్మా, రామక్క వేసిన ప్లాన్ ప్రకారం మూడో మనిషికి తెలియకుండా నేను వరంగల్‌కు చేరుకున్నాను. గుళ్లో నా పెండ్లి జరిగింది. నేను లేచిపోయాననే వార్త ఊరంతా గుప్పుమన్నది. మా అన్నదమ్ములు ఆగ్రహోదగ్రులై మా అమ్మనూ, రామక్కనూ తిట్టారు. వరంగల్‌లో మా అత్తగారింటి మీదకు దాడికి వచ్చారు. కానీ, మా వాళ్లు తిట్టి పంపడంతో వెనుతిరిగారు.

ఆ నరకం నుండి బయటపడ్డా నా పెండ్లిని మా అమ్మ చూడలేదనే బాధ నాకుండేది. అమ్మ నన్ను కలువకుండా నా అన్నదమ్ములు కట్టడి చేశారు. ఇంతలో

నేను గర్భవతినయ్యాను. అయిదో నెలలో సీమంతం జరిగింది. మా పుట్టింటి తరఫున వొచ్చిన ఒకే ఒక వ్యక్తి రామక్క. ఆ సంబురం ముగిసిన తర్వాత వెళుతూ వెళుతూ నా చేతిలో ఒక మూట పెట్టింది.

నా సీమంతానికి రామక్క ద్వారా అమ్మ పంపిన నగలు ధరించి ఈరోజు నేనీ పెండ్లికి రావడం మంచిదైంది. అమ్మెలాగూ లేదు. కనీసం అమ్మ పంపిన దూత రామక్క అయినా నేను ధరించిన నగలను చూసి సంబురపడ్డది. పెండ్లి అయిన తర్వాత నేను బయలుదేరుతూ కొన్ని డబ్బులు ఇవ్వబోతే, రామక్క తల అడ్డంగా ఊపి.. మరొక్కసారి అమ్మ గాజులను, గొలుసులను తడిమి నవ్వి వెళ్లిపోయింది. నేను అప్రయత్నంగా ఆ గాజులను తడుముతుంటే.. అమ్మను తాకినట్టుగానే అనిపించి కండ్లు చెమర్చాయి. మరోసారి మనసులోనే..

'శభాష్ రామక్కా!' అనుకున్నాను.

పల్లెటూళ్లో ఏ విషయమూ దాగదు. అందుకే, అత్యంత పకడ్బందీగా అమ్మా, రామక్క వేసిన ప్లాన్ ప్రకారం మూడో మనిషికి తెలియకుండా నేను వరంగల్‌కు చేరుకున్నాను. గుళ్లో నా పెండ్లి జరిగింది. నేను లేచిపోయాననే వార్త ఊరంతా గుప్పుమన్నది. మా అన్నదమ్ములు ఆగ్రహోదగ్రులై మా అమ్మనూ, రామక్కనూ తిట్టారు. వరంగల్‌లో మా అత్తగారింటి మీదకు దాడికి వచ్చారు. కానీ, మా వాళ్లు తిట్టి పంపడంతో వెనుతిరిగారు.

## డాక్టర్ ప్రభాకర్ జైనీ

రచయితగా, సినీ దర్శకుడిగా చిరపరిచితులు డాక్టర్ ప్రభాకర్ జైనీ. వీరి స్వస్థలం వరంగల్. ఉన్నత విద్యాభ్యాసం తర్వాత వాణిజ్య పన్నులశాఖలో సీటీవోగా పనిచేసి విరమణ పొందారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. బాల్యంలో చూసిన సంఘటనలు, అనుభవాలతో రచయితగా మారారు. 1981లో 'ఎదను ధర్మం' పేరుతో మొదటి కథ రాశారు. సామాజిక కోణంలో నవలలు రాస్తున్నారు. ఇప్పటివరకూ అనేక కథలు, 24 నవలలు వెలువరించారు. ప్రస్తుతం వీరి ఐదు నవలలు ఏకకాలంలో వివిధ పత్రికలలో ప్రచురితమవుతున్నాయి. పాలపిట్ట మాసపత్రికలో 'సమర్థుని జీవయాత్ర', ఆంధ్రప్రభ సాహితీ గవాక్షంలో 'కన్యాశుల్కం రివిజిటెడ్ ఇన్ 2021', సాహో మాస పత్రికలో 'కాళీ', సినీవాలి అంతర్జాల వారపత్రికలో 'హైటెక్ సిటీలో హైటెక్ హత్య' ప్రచురితమవుతుండగా, 'గురుభ్యోన్నమః' నవల త్వరలో మరో పత్రికలో రానున్నది.

# నియ్యతి గల్లోడు

శిరంశెట్టి కాంతారావు
98498 90322

**చాలా ఏండ్ల** తరువాత బతుకమ్మ పండక్కని పిల్లల్ని తీసుకొని ఫణిగిరి వెళ్లాం. రేపు సద్దుల బతుకమ్మ అనగా ఆ మధ్యాహ్నం భోజనాలు చేసిన తరువాత ఇంటి వెనుకనున్న పశువుల కొట్టంలో నులక మంచాలు వాల్చుకొని, ముచ్చట్లు చెప్పుకొంటున్నాం. ఇంతలో..

లింగంపల్లివాళ్ల సందునుండి 'చిలుక పస్తీ చెప్తాం.. చిలుక పస్తీ చెప్తాం..' అంటూ ఓ కేక వినిపించింది.

ఆ కేక వింటూనే.. 'రేయ్! మీరంతా చిలుక పస్తీ చూయించుకొంటా్రా?' అంటూ మా పెద్ద బావమరిది, పిల్లలందరినీ ఊరించాడు.

'ఆ.. చూపించుకొంటాం.. చూపించుకొంటాం' అంటూ పిల్లలంతా హుషారుగా అన్నారు.

పక్కనే ఎడ్లగాట్లో ఆవుదూడలకు నీళ్లు తాపుతున్న చిన్న జీతగాని దిక్కు చూస్తూ..

'వారీ ముత్తులూ! జర చిలక పస్తోన్నిటు పిల్వరా!' అంటూ ఉరికించాడు.

'ఓ చిల్క పస్తీ.. చిల్క పస్తీ..' అనుకుంట వాడు బైటకు పరిగెత్తాడు.

అప్పటికే చిలుక జోస్యం మనిషి లింగంపల్లి వాళ్ల సందు తిరిగి, చిన్న కోయిలదాకా వెళ్లిపోయాడు. అయినా వదిలిపెట్టకుండా వెళ్లిన ముత్తులు, చిలుక పస్తీవాణ్ని పట్టుకొని, వెనుక సందుగుండా పశువుల కొట్టంలోకి తీసుకొచ్చాడు.

ఆ చిలుక జోస్యమతను ఐదు ఐదున్నర అడుగుల ఎత్తున, చామనఛాయతో, బక్కపల్చగా ఉన్నాడు. నూనెపెట్టి మధ్య పాపిటలో దువ్విన గిరజాల జుట్టు నల్లగా మెరుస్తున్నది. పేటంచు 'కోరా' పంచమీద తెల్లటి సిల్క్ లాల్చీ తొడుక్కొన్నాడు.

పాన్లు తింటాడేమో.. పండ్లన్నీ గార పట్టి ఉన్నాయి. ఎడమ భుజానికున్న గుడ్డసంచీ మోకాళ్లను తాకుతున్నది. కుడిచేత పట్టుకొన్న నలుచదరపు చెక్కపెట్టె పంజరంలో ఉన్న రామచిలుక.. ఉలుకు పలుకూ లేకుండా తన మానాన తను కూర్చొని ఉంది. అతణ్నోసారి కిందకి, మీదకి ఎగాదిగా పరికించి చూసిన మా నడిపి బావమరిది..

'నీ పేరేందివయా?' అంటూ అడిగాడు.

'పాండయ్య..' చేతిలోని పంజరాన్ని కింద పెడుతూ బదులిచ్చాడతను.

'పస్తీ ఏస్తే ఎంత?'.. ప్రతి చిన్న విషయాన్ని కూడా ముందు డబ్బుల లెక్కతో మొదలుపెట్టే మా చిన్న బావమరిది యథాప్రకారం తన పంథాలో అడిగాడు.

'పది రూపాయలు'.. కొట్టంలో ఉన్న వాళ్లందరినీ కండ్లతోనే లెక్క వేసుకొంటూ చెప్పాడు పాండయ్య.

'అందరూ గల్సి పదముగ్గురు. అబ్బో! శానా పైసలయ్యేటట్టుంది. పస్తీ వద్దు.. పాడొద్దులే పో' అన్నాడు మా చిన్న బావమరిది.

కొంతసేపు పాదులాట తర్వాత మా నడిపి బావమరిది కలుగజేసుకొని..

'సర్లే! పైసల్ నేనిస్తలే..' ఎందుకో నా దిక్కు అదోమాదిరిగా చూస్తూ అన్నాడు.

'హమ్మయ్య! మంచి గిరాకీ పోద్దేమో అనుకున్న' అన్నట్టు శ్వాస తీసుకొన్న పాండయ్య తన సంచిని కిందపెట్టి, దాన్లోనుండి ఓ పాత ఫ్లెక్సీ పట్టాను తీసి, దాన్ని సరిగ్గా కొట్టంలోని 'అటుకు' కింద పరిచి, దానిమీద పంజరాన్ని ఉంచాడు.

పట్టా మీద సర్దుకొని కూర్చున్న పాండయ్య సంచిలోనుండి చతురస్రాకారంలో ఉన్న ఓ పది పదిహేను కవర్లకట్టను బయటకు తీసి, వాటిని పంజరం ముందు అడ్డంగా పర్చాడు.

అట్లా ఐదు నిమిషాలపాటు తన సరంజామానంతా ఒక క్రమపద్ధతిలో సర్దిపెట్టుకొన్న పాండయ్య, ఆఖరికి 'ఇక రాండ్రి' అన్నాడు జనాంతికంగా.

అందుకోసమే ఎదురు చూస్తున్న పిల్లలంతా ఒక్కసారిగా లేచి, ఒకరినొకరు తోసుకొంటూ.. 'నేను, నేను' అంటూ ముందుకు రాసాగారు.

'ఆగండాగండి! ముందల నేను చూయించుకొని, మంచిగ చెప్తుండనుకొంటె.. అప్పుడు మీరంతా ఒకలెమ్మటొకలు చూపించుకొందురు గాని' అంటూ మా చిన్న బావమరిది వాళ్లమధ్య ఓ రాజీ ఫార్ములాను ప్రతిపాదించాడు.

ఇక దాంతో పిల్లలంతా 'సరే' అన్నట్టు సర్దుక్కూర్చున్నారు.

ఒప్పందం ప్రకారం అందరికన్నా ముందుగా మా చిన్న బావమరిది పాండయ్య

ముందు కూర్చున్నాడు.

'ముందల కారట్లమీద పదినోటు పెట్టి, మీ పేరు చెప్పుండ్రి' అన్నాడు పాండయ్య.

'అందరైనంక లెక్కజూసి పైసలన్నీ ఒక్కసారే ఇస్తం గాని, నువ్వైతే ముందల కారట్ తీయించు' ఎప్పటి మాదిరిగానే గంపగుత్త లెక్కకు దిగాడు మా చిన్న బావమరిది.

'ఎవల్ల పైసలు వాళ్లు కారట్లమీద పెట్టి కూసోంది చిలుక కారట్ తియ్యది!' మా చిన్న బావమరిది ముఖంలోకి అసహనంగా చూస్తూ అన్నాడు పాండయ్య.

'ఆఁ నీ మాటలు గానీ, ఎందుకు తియ్యది? మంచిగనే తీస్తది గాని ఒదులు చిలుకను' పాండయ్య దిక్కు వెటకారంగా జూస్తూ అన్నాడు మా చిన్న బావమరిది.

**'హమ్మయ్య! మంచి గిరాకీ పోద్దేమో అనుకున్న' అన్నట్టు శ్వాస తీసుకొన్న పాండయ్య తన సంచిని కిందపెట్టి, దాన్లోనుండి ఓ పాత ఫ్లెక్సీ పట్టాను తీసి, దాన్ని సరిగ్గా కొట్టంలోని 'అటుకు' కింద పరిచి, దానిమీద పంజరాన్ని ఉంచాడు. పట్టా మీద సర్దుకొని కూర్చున్న పాండయ్య సంచిలోనుండి చతురస్రాకారంలో ఉన్న ఓ పది పదిహేను కవర్లకట్టను బయటకు తీసి, వాటిని పంజరం ముందు అడ్డంగా పర్చాడు.**

పాదులాట తరువాత.. 'చెప్తే నమ్మాల!' అంటూ పంజరం తలుపు లేపాడు పాండయ్య. మెల్లగా బయటకొచ్చిన చిలుక, కవర్లమీద కాసేపు అటూ ఇటూ తిరుగులాడి కవర్ను తియ్యకుండానే తిరిగి లోపలికెళ్లి కూర్చుంది.

అది చూసిన మా చిన్న బావమరిది..

'అబ్బో! ట్రైనింగ్ బాగానే ఇచ్చినవే!' అంటూ జేబులో నుండి పది రూపాయల నోటుతీసి కవర్లమీద పెట్టి తన పేరు చెప్పాడు.

పాండయ్య వెంటనే కుడిచేతి పిడికిట్లో ఆ నోటును పట్టుకొని నుదురుకు తాకించుకొని, దేవుళ్లను తల్చుకొని పంజరం రెక్క పైకిలేపి..

'ఓ చిలుకమ్మా! నిమ్మలంగ బైటికొచ్చి సంజీవరావు పటేల్ పేరుమీద కారట్ తీసిపో..' ఇందాకటి శైలికి భిన్నంగా అదోరకమైన స్నేహపూరిత యాసతో చిలుకను స్వాగతించాడు.

పంజరంలో నుండి వయ్యారంగా బయటికొచ్చిన చిలుక కవర్ల ముందు కొద్దిసేపు

ఏదో ఆలోచిస్తున్నట్టుగా నిల్చుని, ఆ తరువాత తలవంచి ఓ కవర్ను బైటికిలాగి తిరిగి పంజరంలోకి వెళ్లి కూర్చుంది.

అప్పటిదాకా 'చిలుక ఎలా బైటికొస్తుందో? ఏ కవర్ను తీస్తుందో?' అన్న కుతూహలంతో ఎదురుచూసిన పిల్లలంతా చిలుక కవర్ను తీసి, లోపలికెళ్లిపోగానే సంతోషంతో తప్పట్లు చరుస్తూ కేరింతలు కొట్టసాగారు.

వాళ్ల కేరింతలను అడ్డుకొంటూ.. 'మీరంతా ఇట్ల గోలజేస్తే చిలుక బెదిరిపొయ్యి మీ వొంతచ్చినప్పుడు కారట్ తియ్యది' అంటూ వాళ్ల ఉత్సాహపు పొంగుమీద హెచ్చరిక నీళ్లు చిలుకరించాడు పాండయ్య.

దాంతో పాపం.. పిల్లలంతా ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయారు.

చిలుక బైటకు తీసిన కవర్ను చేతిలోకి తీసుకొన్న పాండయ్య, కండ్లు మూసుకొని ఏదో స్మరించుకొంటూ కవర్లోని కార్డ్ను బైటికి తీశాడు.

అది సీతా, రామ, లక్ష్మణ సమేత ఆంజనేయుడి బొమ్మలున్న కార్డ్. ఆ బొమ్మలకింద దేవనాగరి లిపిలో ఎర్రటిరంగులో ఏదో రాసి ఉంది. దాన్ని తనలోతను ఒకసారి చదువుకొన్న పాండయ్య, సంజీవరావు ముఖంలోకి చూస్తూ..

'నీ ఇష్టదైవం రాములవారు. ఆయినెప్పుడూ మిమ్ముల్ని సల్లంగా జూస్తుంటడు. పైసల ముచ్చట్ల మాత్రం నువ్వు బవు పిసినారోనివి..' అంటూ ఇంకేదో చెప్పబోతుండగానే పిల్లలంతా అడ్డుపడి..

'నిజం.. నిజం..' అంటూ గోలగోలగా అరుస్తూ తప్పట్లు కొట్టసాగారు.

'మీరిట్ల జేస్తే నేను లేసిపోత' పాండయ్య మాటలతో అసలే ఉడుక్కుంటున్న సంజీవరావు పిల్లల్ని బెదిరిస్తూ వాళ్ల నోర్లు మూయించాడు.

మళ్లీ ఉత్సాహంగా గొంతువిప్పిన పాండయ్య..

'నువ్వు పుట్టినూరు ఇడ్సిపెట్టి పట్నంల పడ్డదాన్క దెంకపోయినవ్‌గాదు?' అన్నాడు.

పిల్లలు వెంటనే 'నిజం.. నిజం..' అంటూ మళ్లీ ఉత్సాహంతో కేకలేశారు.

వాళ్ల మాటలు ఏమాత్రం పట్టించుకోకుండా..

'నువ్వు ఎనభై ఏండ్ల పైన్నే బత్కుతవ్. పట్నంల ఇల్లు గడ్తవ్' అంటూ చెప్పుకొచ్చాడు పాండయ్య.

ఆ మాటలు వింటూనే.. 'ఆఉ కిరాయి ఇంటికే రికానా లేదుగాని పట్నంల ఇల్లు గడ్తాను? ఏం జెప్పినవ్ లే ఊకో!' అంటూ పాండయ్య మూతిమీద పొడిచినంత పన్జేశాడు సంజీవరావు.

'నేనేం జెయ్యాల పటేలా? చిలుక దీసిందే నేను జెప్తున్న!' నీలాంటోళ్లను బొచ్చెడు మందిని జూస్కుంట వస్తున్న అన్నట్లు సంజీవరావు ముఖంలోకి చూస్తూ అన్నాడు

పాండయ్య.

'సర్లే చెప్పు' లోపల ఆనందంగా ఉన్నా, పైకి గంభీరంగా అన్నాడు సంజీవరావు.

'మీ అమ్మ, నాయిన్లు నిన్ను బాగ సదివిచ్చి అమీన్‌సాబ్‌ను చేయిచ్చాల్నని బాగ ఖాయిష్ బడ్డరు. కానీ, ఏం లాభం? నువ్వు వాళ్లనుకున్నట్టు సద్వలేదు' మరోసారి తన మాటల అమ్ములపొదిలోని మరో అస్త్రాన్ని సంజీవరావు మనసు మీదికి సంధించి వదిలాడు చిలుక జోస్యం పాండయ్య.

ఆ మాటలు వింటూనే.. 'ఇది మాత్రం పక్కామాట. అమ్మనాయినోల్లు బడికి పొయ్యి బుద్ధిగ సద్వుకో కొడకా.. అంటే వీడు పొయినట్టే పొయ్యి, అట్నుంచటే బాయికాడికి బొయ్యి కూసునేది' మా పెద్దాదిన తమ్మునిమీద గారాబాన్ని కురిపిస్తూ ఆనందంగా అన్నది.

పాండయ్య చెప్పే ప్రతి మాట వెనుకా మనసును ఆకట్టుకొనే ఒక సూత్రం దాగుంటుందన్న అవగాహన లేని అక్కడివాళ్లంతా ఏదో ఒక వ్యాఖ్యానాన్ని జోడిస్తూ అతనికి పరోక్షంగా సహకరించసాగారు.

అట్లా మరికొంతసేపు ఏవేవో చెప్పిన పాండయ్య.. 'ఇంగ ఇంతే!' అన్నట్టు కార్డును కింద పెట్టేసి 'ఇంకొకలు రాండ్రి!' అన్నాడు.

అతని మాటలు వినడంతోనే తొండికి దిగిన సంజీవరావు..

'నువ్వు చెప్పిందేదీ నాకు కలువలేదు. మల్లోసారి చిలుకతోటి కారట్ తీయిచ్చి చెప్తేనే మిగిల్నోల్లకు పస్తీ జూయిస్త. లేకుంటె పెట్టె సంకన బెట్టుకొని వచ్చిన తొవ్వ బట్టుకొని ఎన్కకు తిరిగి సూడకుంట బో..' కరాఖండిగా అన్నాడు.

'నా చిలుక తప్పుడు కారట్ తియ్యది. అది తీసిన కారట్ల ఉన్నదే నేను జెప్పినగాదు!' బతిమాలుతున్నట్టుగా అన్నాడు పాండయ్య.

'మొండివాడు రాజుకన్నా బలవంతుడు' అన్నట్టు సంజీవరావు, పాండయ్య మాట పెడచెవిన పెట్టాడు. ఇక గత్యంతరం లేని పాండయ్య..

'ఇగోండ్రి! ఈ పదినోటు మల్ల కారట్లమీద పెట్టుండ్రి!' అంటూ ఇందాకటి నోటును తిరిగి సంజీవరావు చేతికిచ్చాడు. నోటును వెంటనే కవర్లమీద పెట్టి సర్దుక్కూర్చున్నాడు సంజీవరావు.

పాండయ్య మళ్లీ చిలుకను వదిలాడు. నెమ్మదిగా బయటికొచ్చిన చిలుక ఎప్పటి మాదిరిగానే కవర్లమీద కొద్దిసేపు అటూ, ఇటూ తిరుగాడి చటుక్కున ఓ కవర్ను బైటికి లాగి, తిరిగి పంజరంలోకి వెళ్లిపోయింది. చిత్రంగా మళ్లీ ఇందాకటి కార్డే వచ్చింది.

దాన్ని చూపించిన పాండయ్య..

'చూసింగ్రా పటేలా? నా చిలుక నియ్యతి తప్పదని ముందల్నే చెప్పిన్నా? లేదా?' అంటూ దాన్ని మళ్లీ కవర్లబొత్తిలో కలిపేసి..

'ఇంకోలు రాంగ్రి!' అన్నాడు.

మళ్లీ అడ్డం తిరిగిన సంజీవరావు 'అంటే.. నాకు నియ్యతి లేదన్నట్టా? నాకు నీ పస్తీ నచ్చలేదు. ముచ్చెంగం మూడోపాలి తియ్యాల్సిందే' అంటూ హఠం పట్టు పట్టాడు.

అప్పటికే అతని జిత్తులమారి తనాన్ని అర్థం చేసుకొన్న పాండయ్య.. 'వీడితోని పంచాయితీ ఎందుకులే' అనుకొని ఆ పది నోటును తిరిగి కవర్లమీద పెట్టించాడు. తిరిగి సంజీవరావు పేరు చెప్పి, పంజరం మూత తీశాడు పాండయ్య. చిలుక మెల్లగా బయటకొచ్చి కవర్లమీద తచ్చాడ సాగింది. ఇంతలో.. మేమెవ్వరం ఊహించలేని ఘటన జరిగిపోయింది.

కొట్టంలోని అటుకుమీద ఎప్పటి నుండి మాటుపెట్టుకొని కూర్చుందో తెలియదుగాని, మూడోసారి చిలుక బయటకు రాగానే చడీచప్పుడూ లేకుండా నేరుగా చిలుకమీదనే దూకి, దాన్ని నోట కర్చుకొని పక్కనే ఉన్న గోడదూకి గట్టు సూరయ్యోళ్ల పాతగోడల్లో మాయమై పోయింది పిల్లి.

రెప్పపాటులో జరిగిపోయిన ఆ సంఘటనకు మేమంతా దిగ్భ్రాంతికి లోనయ్యాం.

మరుక్షణంలోనే తేరుకొన్న పాండయ్య.. 'ఓ దేవుడో నా చిలుక, నా చిలుక' అని కేకలు వేస్తూ గుండెలు బాదుకొంటూ పిల్లి వెనుక పడ్డాడు.

ఇంకెక్కడి పిల్లి? చిలుకతోసహా ఎప్పుడో మాయమైపోయింది. కొంతసేపటికి గసపోసుకొంటూ వెనుదిరిగి వచ్చిన పాండయ్య, ఖాళీగా ఉన్న పంజరాన్ని చూసి..

'నా నోటికాడి కూడు పిల్లెత్కపోయింది. ఇక రేపట్నుంచి నా పెండ్లం, పిల్లలను ఎట్ల బత్కిచ్చుకోవాల?' అంటూ బావురుమన్నాడు.

అంత మనిషి చిన్నపిల్లవాడి మాదిరిగా ఏడుస్తుండటంతో విన్న ఇరుగు, పొరుగు వాళ్లు గబగబా వచ్చి..

'ఏందేంది?' అంటూ ఆరా తీశారు.

'నా చిలుకను ఈల్ల పిల్లెత్కపోయింది. నా కంచం బోలైంది. నా చిలుకను నాకు తెచ్చన్న ఇయ్యాల, లేదంటే మూడు వేలు దండగ కట్టన్న ఇయ్యాల. ఎట్టనన్న జేసి మీరే నాకు నాయం జెయ్యాల' అంటూ వచ్చిన వాళ్లందరికీ పడిపడి దండాలు పెట్టసాగాడు.

ఇదంతా గమనించిన మా అత్తగారు.. 'వ్యవహారం ఏదో అడ్డం తిరిగేటట్టుందే?' అనుకొని వెంటనే రంగంలోకి దిగారు. పాండయ్య దిక్కు చూస్తూ..

'హ్వాఁ ఊకో.. నీ పిల్లిమీద, నీమీద ముత్తాలమ్మబడ. మాకేడ పిల్లిపాడువడింది? మంది పిల్లులొచ్చి మా కోల్లన్ని మింగి నీళ్లు తాగినయని మేమేడుస్తుంటే.. నువ్వేమో మా పిల్లి, మా పిల్లి అంట తోక గోసిన మేకలెక్క మొత్తుకొంటున్నవేంది?' అంటూ నష్టనివారణ చర్యకు దిగింది.

మా అత్తగారి వాళ్లకు పిల్లి ఉందో? లేదో నాకైతే నిజంగా తెలియదు. అయితే, పిల్లి ఎవరిదైనా పాపం! పేదవాడు రోజంతా సంపాయించిపెట్టే చిలుకను నష్టపోయాడు. కాబట్టి, పాండయ్యకు అంతో, ఇంతో ఇచ్చి పంపడం ధర్మం అనుకొన్నాను మనసులో.

'ఆ పిల్లి మాదికాదు. మేం పైసాగూడ ఇచ్చేది లేదు. యాడ ఫిర్యాదు జేస్కుంటవో జేస్కో పో' అంటూ మా పెద్ద బావమరిది భార్యతోపాటు సంజీవరావు ముందుకొచ్చి అన్నారు.

'ఏం మాట్లాడ్తే.. ఏమంటరో? గాలికి బొయ్యే కంపను ముడ్డిగొట్టుకొన్నట్టు మనకెందుకొచ్చిన గోల? బుచ్చమ్మోల్లతోటి పెట్టుకొని ఈ సందున మనం నెగుల్తమా?' అనుకొంటూ ఇరుగుపొరుగువాళ్లు గుసగుసలాడుకొంటూ ఎవరికి వాళ్లు మెల్లగా జారుకొన్నారు.

పాపం దుఃఖంతో బిక్క చచ్చిపోయిన పాండయ్యా గాటిమీద ముద్చుక్కూర్చున్నాడు.

'తప్పదు ఇక ఏదో ఒకటి చెయ్యాల్సిందే' అనుకొన్న నేను, పాండయ్యా దిక్కు చూస్తూ..

'పోయిన చిలుకను తీసుకురాలేం. మా వాళ్లేమో పిల్లి మాదికాదు. మేమెందుకు పైసలిస్తం? అంటున్నరు. కాబట్టి ఓ పనిచెయ్యి' అన్నాను.

'ఏందో చెప్పుండ్రి!' నీళ్లలో కొట్టుకుపోయేవాడికి చొప్పకట్ట దొరికినట్టు నా దిక్కు చేతులు జోడిస్తూ అన్నాడు పాండయ్యా.

'నేనో వెయ్యి రూపాలిస్తాగాని, తీసుకుపోయి ఇంకో చిలుకను కొనుక్కో' అన్నాను.

'అయ్యా! ఇద్దె నేర్చిన చిలుకను కొనాల్నంటే మూడు వేలకు తక్కువ గాదు. నా పెండ్లాం, పిల్లలమీద ఒట్టు. చిలుకల్ని పట్టి ఇద్దెలు నేర్పెటోళ్లు ఏరే ఉంటరు. మేం వాళ్లకాడ కొంటం' అంటూ పాండయ్యా తన ఇబ్బందుల చిట్టా నా ముందు పరవసాగాడు.

'సర్లే పోనివ్వు' అనుకొంటూ ఇంకో ఐదొందలు కలిపి, పదిహేనొందలు అతని చేతికిచ్చాను.

వాటిని కండ్లకద్దుకొని జేబులో పెట్టుకొన్న పాండయ్యా, నాకు పదేపదే దండాలు పెడుతూ ఖాళీ పంజరాన్ని తీసుకొని ఉసూరుమంటూ వెళ్లిపోయాడు. ఆఖరికి పిల్లల

**అతను చెప్పినట్టే చేసిన మేమంతా ఎక్కడ కాస్త నీడ కనిపిస్తే అక్కడికెళ్లి నిలబడి, కాకులకోసం ఎదురు చూడసాగాం. గంట, రెండు గంటలపాటు ఎదురుచూసినా మచ్చుక్కూడా ఒక్క కాకి కనబడితే ఒట్టు. అవి కనబడక మేమేడుస్తుంటే మధ్యమధ్యలో పిండాలమీదికి కుక్కలు, పందులు దూసుకొస్తుంటే, వాటిని తరమలేక చచ్చిపోయాం.**

చిలుక జోస్యం కోరిక తీరకుండానే చిలుక మాయమైపోయింది.

పాండయ్యా అటు వెళ్లాడో లేదో అతని భవిష్యత్తును చూసి జాలి పడినట్టుగా ఒక్కసారిగా ఫెళఫెళమంటూ ఉరుములు, మెరుపులతో గాలివాన అందుకొంది.

హోరుగాలికి పున్నాగపూలు రాలిపడినంత వేగంగా ఇరవై నాలుగు పున్నములు గిర్రున తిరిగిపోయాయి.

ఓరోజు నేను ఆఫీస్‌నుండి వచ్చానో లేదో మా చిన్నాన్న కొడుకు ఫోన్ చేశాడు.

'నాన్న చనిపోయాడు!' అని చెప్పాడు.

నేను వెంటనే నాకూ, నా భార్యకు ఆన్‌లైన్‌లో తత్కాల్ టిక్కెట్స్ బుక్ చేశాను. తెల్లవారి ఏడు గంటలకల్లా బోడుప్పల్‌లోని చిన్నాన్న వాళ్ల ఇంటికి చేరాం. ఇంటికి పది, పదిహేను కిలోమీటర్ల దూరంలో ఔటర్ రింగ్‌రోడ్డును ఆనుకొని కొత్తగా వెలుస్తున్న కాలనీల మధ్యనున్న ఓ శ్మశానవాటికలో చిన్నాన్నకు దహన సంస్కారాలు నిర్వహించాం.

పదో రోజున చిన్నకర్మ. బూడిద ఎత్తి పోయించిన తరువాత తంతులన్నీ పూర్తి చేసిన అయ్యవారు..

'చనిపోయినాయనకు ఇష్టమైన పదార్థాలన్నీ తెచ్చి పిండాలు పెట్టినంక, పాలోల్లంతా దండాలు పెట్టి పక్కకు తప్పుకోండ్రి' అన్నాడు.

అతను చెప్పినట్టే చేసిన మేమంతా ఎక్కడ కాస్త నీడ కనిపిస్తే అక్కడికెళ్లి నిలబడి, కాకులకోసం ఎదురు చూడసాగాం. గంట, రెండు గంటలపాటు ఎదురుచూసినా మచ్చుక్కూడా ఒక్క కాకి కనబడితే ఒట్టు. అవి కనబడక మేమేడుస్తుంటే మధ్యమధ్యలో పిండాలమీదికి కుక్కలు, పందులు దూసుకొస్తుంటే, వాటిని తరమలేక చచ్చిపోయాం.

చూసీ చూసీ విసుగొచ్చిన అయ్యవారు.. 'ఈ హైద్రాబాద్ కాకులన్నీ తూడ్చిపెట్టుకొని పోయాయి. ఒకవేళ ఒకటీ, అరా ఉన్నా ఈ ఇండ్ల మధ్యకొచ్చి పిండాలు ముట్టడానికి ధైర్యం చెయ్యడం లేదు. ఇంతసేపు మీ తృప్తికోసం నేనూ

ఎదురు చూశాను. కానీ, ఇక లాభం లేదు. ఆ పిండాలను తీసుకుపోయి, దూరంగా ఎక్కడన్నా నీళ్లుంటే అందులో కలిపి రాండి' అంటూ మొహమాటం లేకుండా చెప్పాడు.

'ఇప్పుడు నీళ్లను వెతుక్కొంటూ ఎంతదూరం పోవాలో?' అనుకోసాగాం.

ఇంతలో.. ఇద్దరు వ్యక్తులు రాజ్‌దూత్ బండిమీద వస్తూ కనిపించారు. వాళ్లను చూడ్డంతోనే.. 'హమ్మయ్యా! రెండు గంటల్నుండి కాకులకోసం ఎదురుచూస్తున్న మన కష్టాలు తీరిపొయ్యాయిలే!' గట్టిగా ఊపిరి తీసుకొంటూ అన్నాడు అయ్యవారు.

* * *

## శిరంశెట్టి కాంతారావు

శిరంశెట్టి కాంతారావు స్వస్థలం సూర్యాపేట జిల్లా ఫణిగిరి. పిచ్చమ్మ-అనంతయ్య దంపతులకు 25 జూలై 1958న జన్మించారు. బి.ఎ. పూర్తయ్యాక ఎల్.ఎల్.బి చదివారు. ఖమ్మం జిల్లా పాల్వంచలోని ఎన్.ఎం.డి.సి. సంస్థకు చెందిన ఎస్.ఐ.ఐ.ఎల్ యూనిట్‌లో ఆఫీస్ అసిస్టెంట్‌గా పనిచేసి, 2018లో ఉద్యోగ విరమణ పొందారు. సాహిత్యాభిలాషతో 2003నుండి కథలు రాయడం మొదలుపెట్టారు. వీరు రాసిన 300లకు పైగా కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. వీటిలోని 60కి పైగా కథలు, వివిధ సాహితీ సంస్థలనుండి పురస్కారాలు అందుకొన్నాయి. 'కంచిమేకలు', 'మట్టితాళ్ల వల', 'ఊతకర్రలు', 'చొరబాటు', 'మా ఫణిగిరి గుట్టకథలు', జంగ్ (హిందీ) పేరుతో కథా సంపుటాలను వెలువరించారు. 'ఆకుపచ్చ విధ్వంసం', 'వ్యూహం', 'పూలకుండీలు', 'వాళ్లు గెలవాలి', 'పరంపర' నవలలు రాశారు. ప్రతి నవలా ఏదో ఒక పురస్కారాన్ని అందుకొన్నది. తెలంగాణ సాహిత్య అకాడమీ మొట్టమొదటిసారిగా నిర్వహించిన నవలల పోటీలో వీరి 'పరంపర' నవలకు 'ఉత్తమ నవల' బహుమతి దక్కింది. తాను రాసిన మరికొన్ని వ్యాసాలతోపాటు యాత్రా కథనాలను సంకలనంగా తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు కాంతారావు.

23-50-1_Layout 1 9/25/2021 3:33 PM Page 222

# గుప్పెడు గంధం

**రావుల పుల్లాచారి**
**99492 08476**

**ఉదయం** నాలుగు గంటలకు నిద్ర లేచిన జగన్నాథం మంచం పక్కన స్టూల్ మీదున్న భగవద్గీతను తీసుకొని, తనకిష్టమైన నాలుగో అధ్యాయాన్ని చదివాడు. ఈ డబ్భై ఐదేండ్ల వయస్సులో కూడా క్రమం తప్పకుండా ఏదో ఒక అధ్యాయాన్ని చదవడం ఆయన ఏనాడూ మరువలేదు. ఒక్కొక్కప్పుడు తనకు జీవితమంటేనే విరక్తి కలుగుతుంటుంది. కానీ, గీతలోని ఇరవై రెండో శ్లోకంలో

భగవాన్ చెప్పినట్లుగా..

'తనకు లభించిన దానితోనే తృప్తి పడేవాడు శంకా రహితుడు, మాత్సర్యం లేనివాడు. కార్యం సిద్ధించినా, సిద్ధించక పోయినా సమాన బుద్ధి గలవాడు ఏ కర్మలు చేసినా, బంధనాలలో చిక్కుకోడు' అనే ఉవాచ తనను ముందుకు నడిపిస్తున్నది.

గది తలుపు తీసుకొని వరండాలోకి వచ్చి, పచార్లు చేయసాగాడు. అప్పటికీ ఎవరూ నిద్ర లేవలేదు. బయట గేటు.. శబ్దంతో తెరుచుకున్నది. పేపర్ పిల్లవాడు దినపత్రికను వరండాలోకి విసిరేసి వెళ్లిపోయాడు. జగన్నాథం ఆ పేపరును తెచ్చుకొని, బెంచిమీద కూర్చొని తిరగేయసాగాడు. ఒకటి, రెండు పేజీలు తిరగేసిన జగన్నాథం కండ్లు ఒక దగ్గర మిలమిలా మెరుస్తూ ఆగిపోయాయి. ఆ ప్రకటన ఒకటికి రెండుసార్లు చదివాడు. అది తన మస్తిష్కంలో ఏవో తీయని ఉద్విగ్నభరితమైన ప్రకంపనలు రేపుతున్నది.

'హుజూరాబాద్ హైస్కూల్లో 1965–66లో హెచ్ఎస్సీ పూర్తి చేసిన విద్యార్థి సోదరీ, సోదరులారా.. మనమంతా మన స్కూలులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించబోతున్నాం. దయచేసి మీరంతా ఎక్కడ ఉన్నా, ఎన్ని పనులున్నా, మీమీ కుటుంబాలతో వచ్చి, నాటి మధుర స్మృతులను పంచుకోవాలని, మీ అనుభవాలు చెప్పుకోవాలనీ ఆశిస్తున్నాం.'

మీ రాకకోసం ఎదురు చూసే.. రాజశేఖరం ఆ ప్రకటన చూసిన వెంటనే.. 'ఒరే రాజశేఖరం! ఎలా ఉన్నావురా!' అంటూ పేపర్‌ను గుండెలకు హత్తుకొన్నాడు జగన్నాథం. ఎన్నో జ్ఞాపకాలు, ఎన్నో కోరికలు తన్నుకొస్తుంటే, తన మనసు గాలిలో తేలిపోతున్నట్టు అనిపిస్తున్నది. 'జగ్గు.. జగ్గు..' అంటూ తనను ఆప్యాయంగా పిలిచే రాజశేఖరం కండ్లముందు కదిలాడు. నాటి మిత్రులంతా ఆనందబాష్పాల మధ్య

మసక మసకగా కదలాడసాగారు.

'విద్యార్థి దశలో మా పేర్లకు బదులుగా నిక్

నేమ్‌లు పెట్టుకొని పిలుచుకొనే వాళ్లం. ఆ పేర్లు ఇప్పుడు గుర్తున్నాయో లేదో? అప్పటి మిత్రులందరూ అప్పటిలాగానే ఉంటారా? ఇంత సుదీర్ఘ జీవితంలో పిల్లలతో, ఉద్యోగాలతో ఎన్నో ఒడుదొడుకులు వారినికూడా కుంగిపోయేలా చేసుంటాయి. శారీరకంగా మొహాల్లో వృద్ధాప్యపు ఛాయలు వచ్చే ఉంటాయి. వయోభారంతో చేతి కర్రలతో వస్తారేమో!' పెదాలమీద చిరునవ్వు మెరుస్తుంటే గతం జగన్నాథాన్ని ఒకటో తరగతి నుండి స్కూల్ చదువు పూర్తి అయ్యేంత వరకూ లాక్కెళ్లింది. అప్పటి లంగోటి దోస్తులు అందరూ కలిసి స్కూల్ మైదానంలో ఆడిన సిర్ర గోనె, గోళీల ఆటలు. వాటి మధ్యలోనే కొట్టుకోవడాలు, తిట్టుకోవడాలు, అంతలోనే కలసిపోవడాలు, ప్రేమాభిమానాలు.. అన్నీ అతణ్ని ఊరించి మరీ పిలుస్తున్నాయి. ఆరోజు పాత మిత్రులందరినీ కలుసుకొని బాల్యంలో గడిపిన తీపి జ్ఞాపకాలన్నిటినీ పంచుకోవాలనే ఆకాంక్షతో ప్రకటనలోని రోజుకోసం ఎదురు చూడటం ఆ క్షణం నుండే ప్రారంభమైంది. గదిలోకి వెళ్లి బ్రష్ చేసుకొని వచ్చేసరికి, టేబుల్‌మీద పాలగ్లాసు ఉంది. యాంత్రికంగా ఆలోచిస్తూ పాలు తాగాడు. ముప్పిరి గొల్పుతున్న ఆలోచనల నుండి ఇంకా తేరుకోలేక పోతున్నాడు. ఇన్ని రోజులుగా జవసత్వాలు ఉడిగి శుష్కించిన శరీరంలో నుండి ఏదో తెలియని అనుభూతి అమృతంలా ప్రవహిస్తున్నట్లు అనిపిస్తున్నది. బతుకులో ఎక్కవలసిన చిరు ఆశల నిచ్చెన మెట్లు ఆగిపోయాయని అనుకొన్నాడు. కానీ, అడుగుపొరల్లోని జ్ఞాపకాల మెట్లలోకి ఒకసారి తొంగిచూస్తే.. బాల్యం, యవ్వనం, ఉద్యోగం ఎన్నో దశలు గడిచిపోయాయి. దిగుతున్న మెట్టు మెట్టులో.. జగన్నాథం స్మృతిపథంలో ఒక్కో దశ తెరమీది బొమ్మల్లా కదులుతున్నాయి.

సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన జగన్నాథం బాల్యమంతా తన సొంతూరు హుజూరాబాద్‌లోనే సాగింది. ఊరి పెద్దబడిలో తనతోపాటు చేరిన వారంతా ఆటపాటలతో చదువుసంధ్యలతో పన్నెండు ఏండ్లపాటు కలిసి చదువుకొన్నారు. ఆనాడు వీళ్లకు విద్యను బోధించిన ఉపాధ్యాయుల్లో కొందరే గుర్తున్నారు. యాభైమంది విద్యార్థులు, పదిమంది విద్యార్థినుల్లో కొంతమంది మాత్రమే లీలగా చెరిగిపోకుండా తన మనసులో మెదులుతూ ఉన్నారు. ఆ విద్యాసంవత్సరం వాళ్లంతా హెచ్‌ఎస్‌సీ పరీక్షలు రాసి, భారంగా బడిలో నుండి టీసీలు తీసుకొని, పంజరం నుంచి విముక్తి పొందిన పావురాల్లా స్వేచ్ఛగా చెట్టుకొకరు పుట్టకొకరుగా ఎగిరిపోయారు. అలా వెళ్లిన ఆ విద్యార్థుల్లో చాలామంది పై చదువులు చదివి, పెద్ద ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మరికొందరు వివిధ వ్యాపకాలతో గడిపేస్తున్నామంటూ

అప్పుడప్పుడూ రాసుకొనే ఉత్తరాలద్వారా గాని, తరచుగా కలుసుకునే మిత్రులద్వారా గానీ.. ఒకరి విషయం ఇంకొకరి ద్వారా తెలుసుకొంటూనే ఉన్నారు.

గిర్రున తిరిగిన కాలం, అందరి విషయాలు అందరికీ తెలియనంత దూరంగా తీసుకు వెళ్లిపోయింది. జగన్నాథం మనసు పుట్టి పెరిగిన ఊరికి వెళ్లాలని మనసు ఆరాటపడేది. ఆవేదన చెందేది. ఎన్నోసార్లు వెళ్లాలని ప్రయత్నించినా కాలు కదలలేదు. దానికి బలమైన కారణం.. ఆనాడు తను అనుభవించిన పరిస్థితులు. ఊర్లో పొలం, ఇల్లు కాపాడుకోవాలని ఎంత ప్రయత్నించినా, తన జానా బెత్తెడు ప్రభుత్వ జీతంతో, పిల్లల పైచదువులతో సంసారం గడవడం కష్టంగా అనిపించింది. ఊర్లో ఏమీ మిగలకుండా అమ్ముకొన్నాడు. ఎప్పుడు ఊరికెళ్లా లని అనుకొన్నా.. 'ఎవరి ఇంటికి వెళ్లాలి?' అన్నది ప్రశ్న. 'ఊరి వారికి ఏం సమాధానం చెప్పాలి?' అనే బాధతో మనసు మెలితిరిగి పోయేది. అందుకే ఆ ఆలోచనలను పూర్తిగా మానుకొన్నాడు. ఆ ప్రకటన చూసిన తర్వాత, తప్పకుండా వెళ్లాలనే తపన ప్రారంభమైంది. కానీ, మనసు గిల్టీగా.. 'వెళ్లొద్దు' అంటూ మారాం చేస్తున్నది. 'పశ్చాత్తాపం కోసమైనా ఊరికి వెళ్లాలి. ఇక ఎవరి ఇంటికీ వెళ్లాల్సిన అవసరం లేదు. వెళ్లిన ఒకరోజు అయినా, నేను చదువుకొన్న స్కూల్‌లో మిత్రులందరితో గడిపే అవకాశం వచ్చింది. ఈ అవకాశాన్ని వదులుకోకుండా.. తప్పకుండా వెళ్లాలి' అనే నిర్ణయానికి వచ్చాడు. ఎదురు చూసిన రోజు రానే వచ్చింది. తెల్లవారేసరికి తన మిత్రుల ముందు, తన బడిముందు ఉండబోతున్నందుకు మనసు దూదిపింజలా మారిపోయింది. ఊరు వెళ్లడానికి ముందు రాత్రి ఇస్త్రీ చేసి పెట్టుకొన్న డ్రెస్ వేసుకొని, ఉదయం నాలుగు గంటలకే బయలు దేరాడు.

'అయ్యా! ఇంత పొద్దున్నే ఎక్కడికి వెళ్తున్నారు?' అంటూ అడిగాడు గేటు ముందున్న వాచ్‌మన్.

'నేను తిరిగి వచ్చేసరికి బాగా రాత్రి కావచ్చు. నువ్వు టీ తాగు' అంటూ అతడి చేతిలో పది రూపాయలు పెట్టి, గబగబా స్టేషన్ దారి పట్టాడు. కాజీపేట స్టేషన్‌లో దిగేసరికి ఎనిమిది అయింది. అక్కడ బస్సు ఎక్కితే హుజూరాబాద్ చేరుకొనేసరికి మరో గంట పట్టింది. బస్టాండ్‌లో అడుగుపెట్టిన జగన్నాథానికి తన ఊరు ఓ పట్నం లాగా, కొత్తగా కనిపించసాగింది. స్కూలుకు వెళ్లే దారి వెతుక్కొనే సరికి పది నిమిషాలు పట్టింది. ఊర్లోకి వెళ్లే పిల్లదారులన్నిటినీ మింగేసిన సిమెంటు రోడ్డు చుట్టూ తిప్పుతూ తనకు తెలిసిన స్కూల్‌కు దూరంగా నడిపించుకొని తీసుకెళ్లింది. అప్పటి బడిగోడల పైభాగాన పెళుసులు రాలిపోయి, కళావిహీనంగా కనిపిస్తున్నది. తన బిడ్డను చూసి, ఆప్యాయంగా అక్కున చేర్చుకోవడానికి తనను పిలుస్తున్నట్లు కనిపించింది. ఆతృతగా మరో రెండు అడుగులు ముందుకు వేశాడు. స్కూల్ మెయిన్

గేటుకు కొందరు 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వజ్రోత్సవ సమావేశం' అని రాసి ఉన్న పెద్ద ఫ్లెక్సీని కడుతున్నారు. జగన్నాథాన్ని చూసి అక్కడున్న వారి మొహాల్లో సంతోషం విరబూసి పోతుంటే..

'ఒరేయ్! నువ్వు.. నువ్వు.. జగన్నాథం!' అంటూ ఒక్కసారిగా అన్నారు.

'అవును. నేనే రా! రాజశేఖర్' అంటూ రాజశేఖరాన్ని గట్టిగా కౌగిలించుకొన్నాడు జగన్నాథం.

'వీళ్లను గుర్తుపట్టావా? ఏదీ వీళ్ల పేర్లు చెప్పు చూద్దాం!' అంటూ.. రాజశేఖరం అక్కడున్న వాళ్లందరినీ చూపించాడు.

'వీడు.. వీడు.. ప్రకాష్! వీడు నారాయణరెడ్డి. వీళ్లు ముస్తాక్, రంగాచారి, భగవాన్, సదాశివ..' అంటూ అందర్నీ కష్టంగా పోల్చుకొంటూ చెప్పాడు. అందరూ పెద్దగా.. 'హేయ్!' అంటూ అరుస్తూ జగన్నాథాన్ని గట్టిగా పట్టుకొన్నారు. ఆనందం పొంగిపొర్లుతున్న ఆత్మీయుల మధ్య మాటలు మూగబోయాయి జగన్నాథానికి. గేటుముందు నుండి ఒకరికొకరు ఆలింగనాలు చేసుకొంటూ స్కూల్ మెట్లు ఎక్కుతున్నారు. జగన్నాథం మెట్టు మెట్టునూ ముద్దాడుకొంటూ లోపలికి వెళ్లాడు.

వరండా మధ్యలో పెద్ద స్టేజీ ఏర్పాటు చేసి బంతిపూలు, మామిడి తోరణాలతో అలంకరిస్తున్నారు.

'ఆ బంతిపూలు కడుతున్నది మన క్లాస్‌మేట్ కమల కుమారి కదూ.. మరి మామిడి తోరణాలు కడుతున్నావిడ?' అడిగాడు జగన్నాథం.

'ఆమేరా! మన స్కూలులో పాటలు బాగా పాడేవారు.. విజయలక్ష్మి, పక్కనే ఉన్నవారు భారతి' అంటూ చెప్పాడు రాజశేఖరం. ముగ్గు బుట్టలాంటి తెల్లటి వెంట్రుకలకు రంగు పులిమి, మాతో చదివిన విద్యార్థినులు కూడా ఎంత మారిపోయారు. తనతో చదువుకొన్నవారిలో నలభైమందికి పైగా ఆ సమావేశానికి వచ్చారు. కొందరైతే కుటుంబాలతోసహా హాజరయ్యారు. వాళ్లందరితో బడి మొత్తం సందడిగా మారింది. ఇండ్లలో జరుపుకొనే పెద్ద పండుగలాగా అనిపిస్తున్నది. ఇలాంటి సందడినుండి, పండుగనుండి తన కుటుంబం దూరమైపోయి ఎన్నేండ్లు అయిందోననుకొంటూ జగన్నాథం కండ్లలో కన్నీటి పొరలు కమ్ముకొన్నాయి.

'వచ్చిన మిత్రులంతా వారి కుటుంబాలతో వెళ్లి మన తరగతి గదిలో టిఫిన్ చేయండి. మరికొద్ది సేపట్లో సభ ప్రారంభం కాబోతున్నది' అంటూ రాజశేఖరం మైక్‌లో చెబుతున్నాడు.

టిఫిన్ ముగించుకొని అందరూ సభాస్థలికి వచ్చేసరికి, వేదికమీద నలుగురైదుగురు ఆసీనులై ఉన్నారు. పూర్వ విద్యార్థులంతా వరండాలో వేసిన కుర్చీల్లో కూర్చున్నారు. జగన్నాథం పక్కనే కూర్చున్న ప్రకాష్..

'అదిగో ఆయనే రా.. మనకు హిందీ చెప్పిన వెంకట్రామయ్య సార్!' అని చెప్పాడు.

'ఆయన పక్కన కూర్చున్న వారు?' అంటూ ఆసక్తిగా అడిగాడు జగన్నాథం.

'మనకు హాకీ, ఫుట్‌బాల్ కోచింగ్ ఇచ్చిన రాఘవులు సార్ రా! ఆ పక్క అతను రాజన్న సార్!'.. గుర్తుపట్టలేదా? అన్నంత ఆశ్చర్యంగా చెప్పాడు నారాయణరెడ్డి.

'ఓ.. ఓ.. జ్ఞాపకం వచ్చింది! గుర్తుపట్టాను. అందరు ఉపాధ్యాయులూ కాలం చేసి వెళ్లిపోగా, వీళ్లు ముగ్గురు మిగిలారన్నమాట!' అప్రయత్నంగా బాధగా అనేసి, అక్కడినుండే సార్లకు నమస్కారం చేశాడు జగన్నాథం. అందరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. జ్యోతి ప్రజ్వలనతో సభ ప్రారంభమైంది. వేదికమీద రాజశేఖరం వ్యాఖ్యానం ప్రారంభించాడు. విద్యార్థి దశనుండే రాజశేఖర్‌కు సభల్లో మాట్లాడటం, వేదికలపై వణుకు బెణుకు లేకుండా వ్యాఖ్యానాలు చేయడం అలవాటు.

'మిత్రులారా! మనమందరం ఈ బడిలో హెచ్‌ఎస్‌సీ పూర్తి చేసుకొని నేటికి అరవై వసంతాలు. నేడు వజ్రోత్సవం జరుపుకొంటున్న ఈ శుభతరుణంలో ముందుగా స్వర్గస్తులైన మన తోటి విద్యార్థులకు శ్రద్ధాంజలి కార్యక్రమం ఉంటుంది. తదుపరి మన మిత్రులు వారి జ్ఞాపకాలు, అనుభవాలు, ఇన్నేండ్ల బతుకు ప్రయాణంలో సాధించిన విజయాలు, పిల్లల అభివృద్ధి గురించి అందరితో పంచుకోవాల్సిందిగా కోరుతున్నాను' అని చెప్పాడు.

ఆ తర్వాత తమ బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల్లో కీర్తిశేషులైన పదిమంది మిత్రుల ఫొటోలను ముద్రించిన ఒక ఫ్లెక్సీని వేదికకు కుడివైపున కట్టారు. ఆ ఫ్లెక్సీ ఎదుట చుట్టూ ప్రమిదలతో ఉన్న ఎత్తయిన దీపపు చిమ్మెను పెట్టారు. వారందరి ఆత్మశాంతి కోసం ఐదు నిమిషాలు మౌనం పాటించారు. ఒక్కరొక్కరుగా వెళ్లి ఆ చెమ్మెలోని ఒక దీపాన్ని వెలిగించి, పూలు చల్లి, కలశంలోని గంధాన్ని మునివేళ్లకు అంటించుకొని, నివాళిగా ఫొటోలమీద చిలుకరించి, తిరిగి వచ్చి యథాస్థానాల్లో కూర్చోసాగారు.

ఈ కార్యక్రమానికి సమాంతరంగా నివాళులు అర్పించిన మిత్రులు వేదికమీదకు వెళ్లి, తమ స్కూల్ జ్ఞాపకాలు, అనుభవాలతోపాటు ఈనాటి వాళ్ల ఉనికి గురించి చాలా గొప్పగా చెప్పడం ప్రారంభించారు. ప్రతి మాటా జగన్నాథం శ్రద్ధగా వింటున్నాడు. వచ్చిన మిత్రుల్లో చాలామంది తమ పిల్లలు ఇంజినీర్లుగా, డాక్టర్లుగా, పెద్ద చదువులు చదివి ప్రస్తుతం అమెరికాలో గ్రీన్‌కార్డు హోల్డర్లుగా ఉంటున్నారని చెప్పుకొంటున్నారు. ఇంకొందరు తమ అబ్బాయి ఫలానా జిల్లాకు కలెక్టర్‌గా, పోలీసు ఆఫీసరుగా చేస్తున్నారంటూ మొహాల్లో గర్వం తొణికిసలాడగా చెబుతున్నారు. ఎవరు ఎన్ని చెప్పినా, చివరికి తమ పిల్లల చదువులు, హోదాలు, వాళ్లు సంపాదించిన

ఆస్తులను గురించిన ప్రస్తావన మాత్రం తప్పకుండా తీసుకొస్తున్నారు. ఈ విషయంలో ఎవరూ తగ్గడం లేదు. ఆనాటి తోటి విద్యార్థుల ప్రగతి గురించిన విశేషాలు వింటున్న జగన్నాథం మనసు.. సముద్రంలోని అలల్లాగా, అల్లకల్లోలంగా మారింది. అప్పుడే స్టేజీపై నుండి..

'ఇప్పుడు మన జగన్నాథంను తన లైఫ్ జర్నీ గురించి చెప్పాలని కోరుకుంటున్నాను' అంటూ రాజశేఖరం వేదికపైకి ఆహ్వానించాడు.

తొట్రుపాటుతో వేదికనెక్కిన జగన్నాథం, అక్కడ ఆసీనులైన ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి, మైకుముందు నిలబడ్డాడు. రాజశేఖరం మైక్ ఆన్ చేసి ఇచ్చాడు. రెండు నిమిషాలు మైకును పట్టుకొన్న జగన్నాథం.. స్వరం సవరించుకొని, ఉద్విగ్నభరితంగా తన గురించిన వివరాలు చెప్పడం ప్రారంభించాడు.

'సభకు నమస్కారం! ఈ స్కూల్‌ను విడిచి వెళ్లాక బి.ఎ. పూర్తి చేశాను. ఇరిగేషన్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి, చివరికి సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ పొందాను. నా జీవితం అప్పుడు, ఇప్పుడు సంతోషంగానే గడుస్తున్నది. మాకు ఇద్దరు మగపిల్లలు. బాల్యం నుండి కూడా నా పిల్లలు చదువులో బాగా ముందుండేవారు. పెద్దవాడు డాక్టర్, చిన్నవాడు సైంటిస్ట్‌గా మంచి ర్యాంకుల్లో ఉత్తీర్ణులయ్యారు. పెద్దబాబు అమెరికాలోని టెక్సాస్‌లో ఉంటున్నాడు. చిన్నవాడు లండన్‌లో సెటిలయ్యాడు. నిజంగా నా కొడుకులు అక్కడ ఉంటున్నారన్న మాటేగానీ, రోజూ ఫోన్ చేస్తూ తమ తల్లితో, నాతో గంటలు గంటలు మాట్లాడుతుంటారు. వేళకు మందులు వేసుకోమంటూ ఎన్నో జాగ్రత్తలు చెబుతుంటారు. అన్నదమ్ములిద్దరూ పోటీ పడుతున్నట్లుగా ప్రతినెలా మా జాయింట్ అకౌంట్‌లో డబ్బులు వేస్తూనే ఉన్నారు. ఇప్పటి నా ఉన్నతికి కారణం మా పిల్లలనే భావిస్తాను. వారిని భగవంతుడు నాకిచ్చిన వరంగా తీసుకుంటాను. అన్నిటికన్నా ముఖ్యం.. దేవాలయం లాంటి మన బడికి సదా రుణపడి ఉంటాను'.. ఈ మాటలు అంటున్నప్పుడు జగన్నాథం కంఠం గద్గదికంగా మారింది. కండ్లలోనుండి కన్నీరు చిమ్ము కొస్తుంటే భావోద్వేగానికి లోనయ్యాడు.

పక్కనే ఉన్న రాజశేఖరం.. 'కూల్ డౌన్.. కూల్ డౌన్' అంటూ చేతిలోని మైకు తీసుకొని, జగన్నాథాన్ని గట్టిగా గుండెలకు హత్తుకొన్నాడు. స్టేజీమీదే తన పక్కన కూర్చోబెట్టుకొన్నాడు.

మళ్లీ మైక్ అందుకొన్న రాజశేఖరం.. 'మన పూర్వ విద్యార్థిని విజయలక్ష్మి గారిని ఒక పాట పాడాలని, అలాగే మిత్రుడు రంగాచారిని కూడా ఒక పాట పాడి వినిపించాలని అభ్యర్థిస్తున్నాం. ఇదే సమయంలో మీరు ఎక్కడి వారు అక్కడే కూర్చొని, మేము ఇచ్చిన బయోడేటా ఫారంలో, మీ అడ్రస్, ఫోన్ నంబర్స్‌తోపాటు

23-50-1_Layout 1 9/25/2021 3:33 PM Page 228

ఈ కార్యక్రమంలో మీరు పొందిన అనుభూతులను రాసి ఇవ్వాల్సిందిగా మనవి చేస్తున్నాను' అన్నాడు.

విజయలక్ష్మి, రంగాచారి పాటలు పాడిన తర్వాత..

'కాలాతీతం అయింది మిత్రులారా! గురువులకు సన్మాన కార్యక్రమం తర్వాత, మీరంతా భోజనాలకు వెళ్లాల్సిందిగా ప్రార్థన' అని చెప్పి, మిగతా పనుల్లో మునిగిపోయాడు రాజశేఖరం.

మిత్రులందరూ తమ జ్ఞాపకాలను, అనుభవాలను నింపిన ఫారాలను కవర్లో పెట్టి, ఒక్కొక్కరుగా రాజశేఖరానికి భద్రంగా అప్పగించి భోజనాలకు వెళ్తున్నారు. జగన్నాథం కూడా ఒక ఫారాన్ని తీసుకొని తాను చదువుకొన్న తరగతి గదిలోకి వెళ్లి రాయడం ప్రారంభించాడు. ఆ ఫారానికి రెండు పక్కలా రాసి, పదేపదే చదువుకొని కవర్లో పెట్టి తన జేబులో పెట్టుకొన్నాడు. భోజనాలు ముగించుకొన్న వాళ్లంతా రాజశేఖరం వద్ద సెలవు తీసుకొని ఇంటిదారి పడుతున్నారు. అప్పటికి సాయంత్రం ఆరయ్యింది. మరికొంత మంది విద్యార్థులు ప్రతి ఐదేండ్లకోసారి ఇలాంటి సమావేశాన్ని ఏర్పాటు చేయాలనీ, అందుకు తగిన ఆర్థిక సాయం అందిస్తామని రాజశేఖరంతో చెప్పారు. ఇంతటితో ఈ ఆత్మీయ సమ్మేళనం ఆగిపోకుండా, తమ శేష జీవితమంతా ఈరోజు సభకు హాజరైన మిత్రులందరూ ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకొంటూ ఉండాలని మరీ మరీ చెబుతూ.. భారంగా వీడ్కోలు తీసుకొంటున్నారు. ప్రకాశ్, నారాయణ రెడ్డి తదితర మిత్రులతో కలిసి భోజనం చేసిన జగన్నాథం, ఒంటరిగా ఏదో పనిలో ఉన్న రాజశేఖరం దగ్గరకు వెళ్లాడు.

'రాజశేఖరం! ఇదిగోరా నా బయో డేటా. దీనిని గుండెల్లో దాచుకొని ప్రశాంతంగా చదువురా!' అంటూ వణుకుతున్న చేతులతో అందించాడు. ఆ కవర్‌ను తీసుకొన్న రాజశేఖరం, జబ్బకు ఉన్న బ్యాగులో దానిని భద్రంగా పెట్టుకొన్నాడు.

'ఈ ఉత్సవాన్ని ఎంతో కన్నుల పండుగలా జరిపించావురా! మేమంతా నీకు రుణపడి ఉంటాం. నన్ను మాత్రం మర్చిపోకురా!' అంటూ రాజశేఖరం చేతిని, తన చేతిలోకి తీసుకొని గట్టిగా కండ్లకద్దుకొన్నాడు జగన్నాథం.

ఆ వెంటనే.. 'ఇక సెలవు.. వస్తాను రా!' అంటూ గేటువైపు గబగబా నడవసాగాడు. చిత్రంగా ప్రవర్తిస్తున్న జగన్నాథం తీరుపట్ల ఆశ్చర్యపోయిన రాజశేఖరం వెంటనే తేరుకొని..

'జగ్గు.. జగ్గూ..' అంటూ వెంబడించాడు. అయినా వెనక్కి తిరిగి చూడకుండా, అప్పటికే స్కూల్ మెయిన్ గేటు దాటి వెళ్లిపోయాడు జగన్నాథం.

రాజశేఖరం కార్యక్రమాలన్నీ ముగించుకొని, తన ఇల్లు చేరేసరికి రాత్రి పది అయింది. జగన్నాథం పోతూ పోతూ ఇచ్చిన కవర్లో ఏముందో చూడాలనే ఆతృత

రాజశేఖరాన్ని నిలువనివ్వడం లేదు. జబ్బకున్న సంచీలోంచి కవర్‌ను తీసి, కుర్చీలో కూర్చుంటూ ఆ కవర్‌ను చించాడు.

'జగన్నాథం చేతిరాతలో ఏమాత్రం మార్పు రాలేదు. అక్షరాలు గుండ్రంగా, అందంగా, చదువుకున్నప్పటి లాగానే ఉన్నాయి' అనుకొంటూ గబగబా ఆ ఫారాన్ని చదవసాగాడు.

'ఒరే.. రాజశేఖరం! నువ్వు ఇవ్వాళ జరిపించిన ఆత్మీయ సమ్మేళనంలో నిండుగా, స్నేహంతో విరజిమ్మిన గుప్పెడు గంధాన్ని, నిస్సారమైపోయిన నా మనసునిండా పూసుకొని వెళ్తున్నానురా! తులసివనంలా ఎదిగిన మిత్రుల కుటుంబాల్లోని సంతోషాలను చూశాను. కానీ.. కానీ.. గంజాయి వనంలా పెరిగిన నా కుటుంబం గురించి చెప్పుకోలేక పోయాను. మీ సహచరుడిగా, మీ సానుభూతి పొందకూడదనే ఒకే ఒక అభిప్రాయంతో, నిజాలు చెప్పవలసిన చోట ఆత్మవంచనతో, అపరాధ భావంతో అబద్ధాల కథ అందంగా అల్లి చెప్పాను. నన్ను క్షమిస్తావు కదరా! నా పిల్లలు నేను చెప్పుకొన్నట్లుగా అభివృద్ధిలోకి రాలేదు రా. పేడలో పురుగుల్లాగా తయారయ్యారు.

నేను ఎంత ప్రయత్నించినా ఇద్దరు కొడుకులు ఇంటర్మీడియట్ కూడా దాటలేకపోయారు. ప్రస్తుతం ఒకడు ఆటో నడుపుతున్నాడు. మరొకడు ప్రయివేటు దవాఖానలో వార్డ్ బాయ్‌గా పని చేస్తున్నాడు. అయినా వాళ్ల బతుకులు వాళ్లు బతుకుతున్నారని సంతోషించాను. కానీ, మద్యానికి బానిసలయ్యారు. తల్లిదండ్రులంటే లెక్క చేయకుండా ఎదిరించేవాళ్లు.

నాకు వచ్చే పింఛన్ మొత్తం లాక్కొనేవాళ్లు. చేతిలో పైసాలేక మేమిద్దరం పస్తులు పడుకొన్న రోజులు ఎన్నో. అయినా తల్లిగా తల్లడిల్లిపోతూ.. వాళ్లకు తోడు చూసి పెళ్లిళ్లు చేయమని నా భార్య నన్ను వేడుకొనేది రా. అమాయకులైన మరో ఇద్దరు అమ్మాయిల జీవితాలను ఈ భ్రష్టులకు కట్టబెట్టి, వాళ్లకు అన్యాయం చేయకూడదని నిశ్చయించుకొన్నాను. నా మౌనానికి కారణం తెలియని నా భార్య కుమిలి కుమిలి ఏడ్చేది రా.

కొడుకులు చేస్తున్న అఘాయిత్యాలను తట్టుకోలేని ఆమె.. ఒకనాటి అర్ధరాత్రి నా చేతిని గుండెలకు హత్తుకొని ఒకే ఒకమాట అర్థిస్తూ చెప్పిందిరా.. ఆ పిచ్చిది ఏమందో తెలుసా! 'ఏమండీ నేను లేని ఇంట్లో మీరు ఒక్కరుగా ఉండలేరు. నేను దాటిపోయిన తర్వాత మీరు ఏదైనా వృద్ధాశ్రమానికి వెళ్లండి. మీరు ఇక్కడే ఉంటే మనశ్శాంతి లేకుండా చేస్తారు. దయచేసి వెళ్లండి.. వెళ్లండి' అంటూ రాత్రంతా ఏడుస్తూ, ఆయాసపడుతూ, తెల్లవారుజామున కన్నుమూసింది.

ఆమె చెప్పినట్లుగానే నా కొడుకులకు తెలియని ప్రాంతంలోని ఓ వృద్ధాశ్రమంలో చేరి, ఒంటరిగా ఉంటున్నా. ప్రస్తుతం నా ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది.

మిత్రమా! ఈ చరమాంకంలో మీ జ్ఞాపకాలు తప్ప ఇంకా నాకేం మిగిలాయి చెప్పు. నాకు మిగిలిన ఒకే ఒక్క కోరికను తీర్చే బాధ్యతను నీకే అప్పగిస్తున్నానురా! నా మరణాంతరం మన బడిలో జరిపించే మన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో నా ఫోటోకు కూడా మీరంతా ఒక నిమిషం మౌనం పాటించి, ఒక్క దీపం ముట్టించి, గుప్పెడు గంధం చల్లి నాకు శ్రద్ధాంజలి ఘటించాలి రా!

ఆశ్రమంలో నీ పేరు, నీ ఫోన్ నంబరు కూడా ఇచ్చానురా! నేను రాలిపోయిన రోజున నీకే ఫోన్ వస్తుంది. ఈ జన్మకు నాకీ సంతోషం చాలు రా.. రాజశేఖరం! తిరిగి ఆశ్రమానికే వెళ్తున్నాను.. సెలవు'

బరువెక్కిన గుండెతో ఉత్తరం చదివిన రాజశేఖరం కండ్లనుండి ధారగా వస్తున్న కన్నీళ్లతో తన చేతిలోని ఉత్తరం తడిసి ముద్దయింది.

..ఈ మాటలు అంటున్నప్పుడు జగన్నాథం కంఠం గద్గదికంగా మారింది. కండ్లలోనుండి కన్నీరు చిమ్ము కొస్తుంటే భావోద్వేగానికి లోనయ్యాడు. పక్కనే ఉన్న రాజశేఖరం.. 'కూల్ డౌన్.. కూల్ డౌన్' అంటూ చేతిలోని మైకు తీసుకొని, జగన్నాథాన్ని గట్టిగా గుండెలకు హత్తుకొన్నాడు. స్టేజీమీదే తన పక్కన కూర్చోబెట్టుకొన్నాడు.

* * *

## రావుల పుల్లాచారి

స్వస్థలం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్. తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, రావుల దశరథం. 10 మే 1950న జన్మించిన పుల్లాచారి, బీకాం తర్వాత నీటి పారుదల శాఖలో ఉద్యోగంలో చేరారు. వివిధ హోదాల్లో పనిచేసి 2008లో సూపరింటెంట్‌గా పదవీ విరమణ పొందారు. అంతకు ముందునుండే సాహిత్యం వైపు అడుగులేశారు. కవిగా, కథకులుగా, నాటక రచయితగా ప్రత్యేకత చాటుకొన్నారు. ఇప్పటివరకూ ఇరవై నాటికలతోపాటు 'బెత్తెడు జాగ' కథా సంపుటి, 'నాలోకి' వ్యాస సంపుటి, 'వాళ్లిద్దరు' కవితా సంపుటి ప్రచురించారు.

# కొత్త వెలుగు

సుంకోజి దేవేంద్రచారి

**99491 18082**

దిగ్గున లేచి కూర్చున్నాడు శ్రీకాంత్. ఒళ్లంతా చెమటలు పట్టాయి. చీకటిగా ఉంది. కాసేపు తాను ఎక్కడున్నాడో అర్థం కాలేదు. 'నేను చనిపోయానా.. ఇది నరకమా.. నరకానికి వచ్చానా.. నరకలోకం చీకటిగా ఉంటుందా. అయినా నేను నరకానికి వచ్చేంత పాపాలేం చేశాను' ఒకదాని వెనక ఒకటి ప్రశ్నల్లాంటి భయాలు బుర్రలో తిరిగాయి.

'మీనాన్న మనం చెప్పింది ఏదీ వినడు... ఇన్వర్టర్ పెట్టుకోనుంటే కనీసం రెండు ఫ్యాన్లు, రెండు లైట్లయినా పనిచేసేవి' భార్య శ్రావణి మాటలు వినిపించాయి.

'సరేలేమ్మా.. ఇప్పుడంటే కరోనా అని అందరం డోర్లేసుకుని ఇంట్లో ఉంటున్నాం.. మామూలుగా అయితే కరెంటు పోతే మెయిన్ డోర్, విండో డో కూడా తెరిచేవాళ్లం కదా..' కూతురు పావని మాటలు వినిపించాయి.

'హమ్మయ్యా.. బతికే ఉన్నా.. కరెంటు పోయి గదంతా చీకటిగా ఉంది..' అనుకోవడంతో కాస్త ధైర్యం వచ్చింది శ్రీకాంత్ కు.

తలుపు దగ్గరకు పోయాడు తెరుద్దామని.. తనకు కరోనా పాజిటివ్ వచ్చిన విషయం గుర్తొచ్చి ఆ ప్రయత్నం మానుకున్నాడు. వెనక్కు వచ్చి బెడ్ పైన కూర్చున్నాడు. ఊపిరి ఆడనట్టుగా అనిపిస్తే మూతికున్న మాస్కు తీసి పక్కన పెట్టాడు. సెల్ ఫోన్ చేతిలోకి తీసుకుని టైమ్ చూశాడు. మూడుగంటలు. మామూలుగా ఈ వేళలో కరెంటు పోదు. ఎప్పుడైనా కరెంటు పోయినా నిముషంలోపే వచ్చేస్తుంది. ఎక్కడ ఏం తేడా జరిగిందో అనుకున్నాడు.

'శ్రావణి మాట విని ఇన్వర్టర్ పెట్టుకోనుంటే బాగుండేది. ఇప్పుడు ఈ ఇబ్బంది

ఉండేది కాదు. అయినా ఇలాంటి రోజులు వస్తాయని కలగన్నామా.. నాయన అనేవాడు.. కాలం ఎప్పుడూ ఇట్లే ఉంటుందని అనుకోవద్దు, ఏదైనా అనుకోని ఉపద్ర వచ్చిందంటే నువ్వనుకున్నవన్నీ తలకిందులై పోతాయి, అన్నింటికీ సిద్ధంగా ఉండాల అని.. ఇంతగా కాలం తలకిందులైపోయే కాలం వస్తుందని నాయన కూడా ఊహించి ఉండడు'

'ఆన్ లైన్ క్లాసుందిమ్మా.. ల్యాప్ టాప్ లో చార్జింగ్ అయిపోయింది..' మెల్లగా వినిపించాయి పావని మాటలు.

'నువ్వు కూడా మీ నాన్నలాగే.. ముందు జాగ్రత్తే ఉండదు కదా.. కరెంటున్నప్పుడే ఫుల్ చార్జింగ్ పెట్టుకోనుంటే ఏమి?' శ్రావణి కూతురి పై కోప్పడింది.

తలుపులన్నీ వేసేసినా.. తలుపులను గోడలను దాటుకుని మాటలు మెల్లగా శ్రీకాంత్ చెవుల్లో దూరుతున్నాయి. నిజంగా నేను ముందు జాగ్రత్త లేని మనిషినా? ప్రశ్నించుకున్నాడు.

'నలభై ఏళ్లకే నగరంలో సొంత ఇల్లు కట్టాడు. ఇల్లు కట్టి కూడా పదేళ్లు అయింది. తన వయసు వాళ్లు సొంత సంపాదనతో ఇల్లు కట్టుకున్న వారు చాలా తక్కువ. చదువు అయిపోగానే మంచి కంపెనీలో ఉద్యోగం రావడం, పెద్దగా బాధ్యతలేవీ లేకపోవడంతో.. ఖర్చులు తగ్గించుకుని, పైసా పైసా కూడబెట్టి ఇల్లు కట్టాడు. తక్కువైన డబ్బుకు బ్యాంకులో లోను తీసుకున్నాడు. పునాదులు వేయడానికి గుంతలు తవ్వినప్పటి నుంచి దగ్గరుండి ఇల్లు కట్టించాడు. ప్రతి పనిలో జోక్యం చేసుకున్నాడు. మళ్లీ మళ్లీ కట్టేది కాదని, అన్నీ నాణ్యమైనవే వాడాడు. కింద వేసిన మార్బుల్స్ దగ్గర నుంచి పైనున్న ఫాల్ సీలింగ్ వరకూ.. అక్కడే ఉండి అక్కరగా పనులు చేయించాడు. ఇరవై ఏళ్లు రంగు తగ్గని పెయింట్ వేయించాడు. లోపలే కాదు, బయట ఎండావానకు కూడా ఆ రంగు ఏమీ కాదు. ప్రధాన ద్వారబంధం మొదలు చిన్న కిటికీ వరకూ.. కాస్త ఖరీదు ఎక్కువైనా సరే, ప్రతి కొయ్యా బలాషా టేకే వాడాడు.

డోర్లకు కిందుండే స్టాపర్ దగ్గరనుంచి పైనుండే టవర్ బోల్ట్ వరకూ.. వెతికి వెతికి మంచివే తెచ్చాడు. గృహప్రవేశం రోజు వచ్చిన బంధువులు, స్నేహితులు ఎంత ఆశ్చర్యపోయారని.. ఇంత శ్రద్ధగా, ముందు జాగ్రత్తగా ఇల్లు కట్టడం ఎవ్వరికీ సాధ్యం కాదని చెప్పారు. ఆ మాటలు విని శ్రావణి ఆ రోజు ఎంతో మురిసిపోయింది. ఎప్పుడూ తనను ఎదరించి మాట్లాడదు. విమర్శించదు. ఇప్పుడెందుకు ఇలా మాట్లాడుతోంది. ?' ప్రశ్నించుకున్నాడు శ్రీకాంత్.

శ్రీకాంత్ కు కరోనా పాజిటివ్ వచ్చి రెండు రోజులైంది. పరీక్ష చేసిన వైద్యులు కరోనా తక్కువ స్థాయిలో ఉందని, హెరీం ఐసోలేషన్లో ఉండి మందులు వాడితే

23-50-1_Layout 1 9/25/2021 3:33 PM Page 233

చాలని చెప్పారు. సరే అన్నాడు శ్రీకాంత్. వైద్యాధికారి, వైద్య సిబ్బంది, మున్సిపాలిటీ వాళ్లు వచ్చారు. ఇంటిని పరిశీలించారు. అది డబుల్ బెడ్రూమ్ ఇల్లు. ఒకగదిని శ్రీకాంత్ కు కేటాయించారు. ఇల్లంతా శానిటైజ్ చేశారు. ప్రత్యేకంగా శ్రీకాంత్ ఉండాల్సిన బెడ్ రూమ్ ను మరింత శుభ్రం చేశారు. వాడాల్సిన మందుల కిట్ ఇచ్చారు. రోజుకు ఒకసారైనా డాక్టర్ ఫోన్ చేసి మాట్లాడతారని ధైర్యం చెప్పారు. కుటుంబసభ్యులు, కరోనా వచ్చిన వ్యక్తి పాటించాల్సిన జాగ్రత్తలు చెప్పి వెళ్లారు.

రెండు రోజుల నుంచి శ్రీకాంత్ గదికే పరమితమైపోయాడు. పొద్దున్నే టిఫన్ తెచ్చి తలుపు అవతల పెడతారు. తలుపు తట్టి వెళ్లిపోతారు. శబ్దం వచ్చిన రెండు నిముషాలకు తలుపు తెరిచి అటువైపుండే ఆహారాన్ని లోనికి తీసుకుని తలుపేసుకుంటాడు. మధ్యాహ్నం కూడా అంతే.

సాయంకాలం టీ ఇస్తారు. అప్పుడు కూడా ఇదే పద్ధతి. ఎవ్వరినీ ఎవ్వరూ చూసే పరిస్థితిలేదు. ఏదైనా పనిబడి బయటూరెళ్లి ఒక్కరోజు ఉండాల్సి వస్తేనే చానా ఇబ్బంది పడిపోయేవాడు. ఒక్కరోజు భార్యను కూతురిని చూడకుండా ఉండలేనని అనుకునేవాడు. ఎప్పుడెప్పుడు ఇంటికి పోదామా అని మనసు కొట్టకలాడేది. ఇప్పుడు..? రెండు రోజులైంది. ఒకే ఇంట్లోనే ఉన్నారు. కానీ భార్యను, కూతురిని చూసే యోగం లేదు. వాళ్లతో కలసి భోంచేసే అవకాశం లేదు. పొద్దున్నే, సాయంకాలం – బాల్కనీలో కూర్చొని కాఫీ టీ తాగే పరిస్థితి లేదు.

ఫోన్లలో మాట్లాడుకోవచ్చు. ఒకే ఇంట్లో ఉండి గోడకు అటొకరు ఇటొకరు ఆనుకుని కూర్చుని ఫోన్లో మాట్లాడడం అంటే ఏదో తెలీని ఇబ్బందిగా ఉంది శ్రీకాంత్ కు. అలా అని తలుపు తీసి హాల్లోకి పోయే ధైర్యం లేదు. తన ద్వారా భార్య, కూతురికి వస్తే.. తాను తట్టుకోగలడు.. వాళ్లిద్దరూ తట్టుకోలేరు అని భయపడుతున్నాడు.

తనకు కరోనా ఎలా సోకింది? అనేది ఇప్పటికీ శ్రీకాంత్ కు అంతుచిక్కని ప్రశ్నే. బయటెళ్లినప్పుడు శానిటైజర్ తీసుకెళుతున్నాడు. ముఖానికి మంచి నాణ్యమైన మాస్కు పెట్టుకుంటున్నాడు. ఎవ్వరితోనూ చేతిని కలపడం లేదు. జనంలోకి పోవడం లేదు. చాలా జాగ్రత్తగా ఉంటున్నాడు. అయినా ఎలా కరోనా సోకిందో అర్థం కావడం లేదు.

ఆ కాలనీలో దాదాపు ప్రతి ఇంటిలో ఒక్కరికైనా కరోనా సోకింది. కొందరిళ్లల్లో ఎందరుంటే అందరికీ కరోనా వచ్చింది. ఎవరు ఎవరితో ఫోన్లో మాట్లాడినా కరోనా విషయాలే. కంటికి కనిపించని సూక్ష్మజీవి అందరి గుండెల్లో కొలువై భయపెడుతోంది.

'ఇంట్లో కూరగాయలు అయిపోయినాయి.. ఎన్నాళ్లు తింటాం పప్పుకూరలు. డాక్టర్లేమో మంచి ఆహారం తీసుకోండి, ఇమ్యూనిటీ పెంచుకోండి అని చెబుతున్నారు. మంచి ఆహారం తయారు చేసుకోవాలంటే దానికి కావలసిన దినుసులు కావద్దా.. ఎవరొస్తారు మనింటికి.. ? కరోనా కదా..? అందరూ భయపడతా ఉన్నారు' శ్రావణి కూతురితో మాట్లాడుతోంది. కూతురితో మాట్లాడుతున్నా ఆ మాటాలన్నీ తనను దెప్పి పొడిచేవే అని అర్థమయింది శ్రీకాంత్ కు.

శ్రావణిలో ఎందుకంత అసహనం.. ఇప్పుడంటే తాను ఇంటికే పరిమితం కావల్సి వచ్చింది. మామూలుగా అయితే ఇంట్లో ఏమి కావాలన్నా వెంటనే వెళ్లి తెచ్చేవాడు. కరోనా కేసులు పెరుగుతాయి అని తెలియగానే మూడు నెలలకు సరిపడా సరుకులు తెచ్చాడు. ఆ సరుకులన్నీ అయిపోయాయి. ఇప్పుడు నాలుగోనెల. కరోనా ఉధృతి పెరిగిందే కానీ తగ్గలేదు. తను చేసిన తప్పేమిటో అర్థమయింది శ్రీకాంత్ కు. 'మార్కెట్టుకు వెళ్లి కూరగాయలు, సరుకులు తెచ్చుకునేలా శ్రావణికి అలవాటు చేసి ఉంటే, ఇప్పుడీ సమస్య ఉండేది కాదేమో. బాగా చూసుకుంటున్నా అనే భ్రమలో పడి పంజరంలోని చిలకలా తయారు చేశానేమో..! ఏదైనా అవసరం అయితే వెంటనే బయటకు పోయేదారి లేదు. ఇంటికి వచ్చే మనిషి లేరు. కంటికి కనిపించని కరోనా మనుషులను శారీరకంగానే కాదు.. మానసికంగానూ హింస పెడుతోంది' అనుకున్నాడు.

ఇంతలో కరెంటు రావడంతో గదిలో ఫ్యాను తిరగడం మొదలుపెట్టింది. లైటు వెలిగింది. మామూలుగా శ్రీకాంత్ కు గదిలో లైటు వేసుకుంటే నిద్ర రాదు. చిమ్మచీకటిగా ఉంటే బాగా నిద్రపోతాడు. ఇప్పుడు ఒంటరిగా ఉండడంతో, లైటు వెలగకపోతే ఒంటరితనం ఫీలింగ్ మరింత ఎక్కువ అనిపిస్తుందని.. 24 గంటలూ లైటు వేసే ఉంచుకుంటున్నాడు.

ఎదురుగా ఉన్న అద్దంలో చూసుకున్నాడు. రెండు రోజులకే చాలా మారిపోయాడు. ముఖంలో దిగులు చాలా స్పష్టంగా కనిపిస్తా ఉంది. చాలా వయ–సు పైబడ్డ వాడిలా ఉన్నాడు. ఎంత ధైర్యంగా ఉండేదానికి ప్రయత్నిస్తున్నా.. ఎక్కడో భయం చిన్నగా మొదలై మొత్తాన్ని ఆక్రమించేస్తోంది.

శ్రీకాంత్ కు తన మిత్రుడు సురేష్ గుర్తొచ్చాడు. అతనికి కూడా కరోనా వచ్చిందని తెలిసింది. నిన్ననే ప్రైవేటు ఆసుపత్రి నిర్వహిస్తున్న కోవిడ్ సెంటర్‌లో చేరాడట. అతను చాలా ధనవంతుడు. ఎంతో పలుకుబడి ఉండేవాడు. ఎన్నో ఆస్తులు కూడబెట్టాడు. అటువంటి వాడికి కూడా కరోనా వచ్చింది. ఎలా ఉన్నాడో ఒకసారి పలకరిస్తే బాగుండు అనిపించింది. వెంటనే చేతిలోకి ఫోన్ తీసుకున్నాడు.

* * *

కుర్చీ వేసుకుని కూర్చుని కిటికీలోంచి చూస్తున్నాడు సురేష్.

నీలాకాశాన్ని నింపుకున్న నదిపై సూర్యకిరణాలు పడుతుంటే అలలు మెరుపుల్లా కదులుతున్నాయి. నదిలో టూరిజం వాళ్ల బోట్లు రెండు నీటిని చీల్చుకుంటూ పర్యాటకులతో చక్కర్లు కొడుతున్నాయి. ఒడ్డున పచ్చని చెట్లు కాపలా కంచెలా ఉన్నాయి. ఆకతాయి ఎవడో రాయి విసిరినట్టున్నాడు.. చెట్టుపైన గుంపుగా విశ్రాంతి తీసుకుంటున్న పక్షులు ఒక్కసారిగా పైకి లేచాయి. నది వంతెనపై వాహనాలు అటు ఇటు వేగంగా సాగుతున్నాయి. ఫుట్ పాత్ మీద మనుషులు నడుస్తూ నది అందాలను కళ్లతో జుర్రుకుంటున్నారు. కిటికీలోంచి పక్షి ఒకటి టకామని లోనికి దూరింది.

ఉలికిపాటుగా తల విదిలించాడు సురేష్. అప్పటి వరకూ కళ్లకు కనిపిస్తున్న మనసు చూపించే దృశ్యాలన్నీ మాయమై.. కళ్లకు ఎదురుగా పెద్ద గోడ స్పష్టంగా కనిపించింది. ఆ గోడకున్న అద్దాల్లో ఏవో అస్పష్టపు నీడలు. కరోనా పాజిటివ్ రావడంతో నిన్నటి నుంచి ఆ గదిలో ఉన్నాడు.

ప్రైవేటు హాస్పిటల్ నిర్వహిస్తున్న కోవిడ్–19 సెంటర్ అది. మూడంతస్తుల భవనం. కుర్చీలోంచి లేచి కిటికీ వద్దకు వెళ్లి తల బయటకు పెట్టి చూశాడు. కనిపించేంత దూరమూ గోడలు తప్ప మరేమీ లేవు. కుర్చీని దగ్గరకు లాక్కుని, దాని పైకి ఎక్కి చూశాడు. ఎటు చూసినా గోడలు గోడలు గోడలు.. మనిషి జాడ కనిపించలేదు. పక్షి అరుపూ వినిపించలేదు. వెలుగు తప్ప వేడి సూర్య కిరణమూ లేదు.

ఛ.. అంటూ తల విదిలిస్తూ వచ్చి బెడ్ పైన కూర్చున్నాడు. చేతులు వెనక్కి పెట్టి, వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాడు. జ్ఞాపకాల మెదడు తుట్టె కదిలింది. ఏవేవో గుర్తొస్తున్నాయి.

నగరంలో నాలుగు భవనాలు, పది ఫ్లాట్లు, పది ఇళ్ల స్థలాలు.. వేర్వేరు చోట్ల యాభై ఎకరాల పొలాలు ఉన్నాయి. అన్నీ ఒక్కొక్కటిగా సురేష్ కళ్లముందుకు వచ్చి పోతున్నాయి.

సురేష్ నగరంలో పేరుమోసిన బిల్డర్. ప్రస్తుతం తను చికిత్సకోసం ఉన్న ఆ భవనం తోపాటు ఆ చుట్టుపక్కల చాలా భవనాలు, అపార్ట్ మెంట్లు తను కట్టించినవే. ధనదాహం ఎప్పుడు మొదలైందో తెలీదు కానీ.. ఇంకా ఇంకా అంటూ.. బ్యాంకు బీరువాలో నోట్ల కట్టలు పేర్చినట్టు, నగరంలో నిర్మాణాలు చేశాడు. సంపాదనే ధ్యేయంగా ఎన్ని రకాల మోసాలు చేశాడో, ఎవరెవరిని ఏమార్చాడో తనకు మాత్రమే తెలుసు. చాలా సందర్భాల్లో తాము మోసపోయామనే విషయం

కూడా ఎదుటి మనిషికి తెలీదు. అంత తెలివిగా ఏమార్చిన సందర్భాలూ ఉన్నాయి. ఎంత కూడబెట్టాడో తనకు, భార్య అరుణకు తప్ప మూడోకంటికి తెలీదు.

ఫోన్ రింగయింది.. చూస్తే శ్రీకాంత్.. బాల్యమిత్రుడు. సురేష్ పెదాలపై చిర్నవ్వు. ఆపదలో ఆదుకునే మనిషి ఎదురైన ఆనందం. ఆన్ చేసి 'హలో..' అన్నాడు. గొంతులో సన్నటి వణుకు. బహుశా భయం కావచ్చు.

'ఎలా ఉన్నావ్.. గొంతు తేడాగా ఉందే..' 'ఏం లేదు.. మామూలుగానే ఉన్నా..' సర్దుకుంటూ మాట్లాడాడు. 'కరోనా అంట కదా.. నాక్కూడా...?' 'ఓ.. ఔనా.. ఎక్కడున్నావు?' 'ఇంట్లోనే.. నువ్వు పూర్ణా ప్యాలెస్ లో ఉన్నావట కదా..' 'అవును..' అంటూనే ఒక్కపెట్టున వెక్కిళ్లు పెట్టి ఏడ్చేశాడు సురేష్.

'ఏమయిందిరా.. సూరి ఏమయింది..' కంగారుగా అడిగాడు శ్రీకాంత్. ఇద్దరూ బాల్యమిత్రులు కావడంతో ఒకరినొకరు ఒరే అనే పిల్చుకునేవారు. సురేష్ ను సూరి అని ముద్దుగా పిలిచేవాడు. ఏళ్లు గడిచేకొద్దీ.. దారులు వేరై సురేష్ పెద్ద ఆస్తిపరుడయ్యాక ఆ పిలుపులు పోయాయి. సురేష్ దీనిని ఎప్పుడో గమనించాడు. నిజానికి అతనికి కూడా ఒరే అని పిలిపించుకోవడం ఇష్టం లేదు. ఇప్పుడు ఆ ఒరే మిత్రుడి ముందు గట్టుతెగిన చెరువు అయిపోయాడు. దాదాపు నిమిషంపాటు అటువైపు నుంచి శ్రీకాంత్ ఏమీ మాట్లాడలేదు. అప్పటికి సురేష్ కాస్త తేరుకున్నాడు.

'సారీ రా..' అన్నాడు కళ్లను తుడుచుకుంటూ. అటు ఇటు చూశాడు తను ఏడ్చింది ఎవరైనా చూశారేమో అని. అది నాలుగ్గోడల గది. తను తప్ప ఎవ్వరూ లేరనే విషయం గుర్తొచ్చింది.

'ఎందుకు అంతగా ఏడ్చావు. కరోనా వచ్చినందుకు భయపడ్డావా..?' అడిగాడు శ్రీకాంత్. అప్పటి వరకూ శ్రీకాంత్ ను కొంచెంగా వెంటాడుతున్న భయం మిత్రుడి ఏడుపుతో పూర్తిగా పోయింది. 'కరోనాకు భయపడని వారు ఎవరుంటారు?' ఎదురు ప్రశ్న వేశాడు సురేష్.

'భయమెందుకు రా.. ఎంతమంది కోలుకోలేదు..? చనిపోయినవాళ్లు తక్కువ. నీకేం.. ఆరోగ్యంగా ఉన్నావు. రోజూ ఎక్సర్ సైజ్ చేస్తావు. ఇతర అనారోగ్య సమస్యలేవీ లేవు. మంచి వైద్యం తీసుకుంటున్నావు. మంచి ఆహారం తీసుకుంటావు? ఏం కాదులే.. భయపడొద్దు' ధైర్యం చెప్పాడు శ్రీకాంత్.

'నేను భయపడింది అందుకు కాదురా.. నిన్న విజయవాడలో స్వర్ణ ప్యాలెస్ లో ఫైర్ యాక్సిడెంట్ జరిగింది కదా.. నిన్ననే నేను ఇక్కడికి వచ్చా.. టీవీలో ఆ మంటలు చూసి భయంవేసింది. నేనుండే పూర్ణా ప్యాలెస్ కూడా మంటల్లో చిక్కుకుంటే..' అంటూ ఆపేశాడు. గొంతునుంచి మాటలు పెగల్లేదు.

'ఎందుకురా అంత భయపడతావు.. ఏమవుతుంది.. మహా అయితే ప్రాణం పోతుంది అంతే.. మీ వాళ్లు ఏడుతరాలు కూర్చొని తిన్నా తరగనంత ఆస్తి సంపాదించావు.. ఎందుకు బాధ, భయం.. మనమైనా ఇంకెంత కాలం బతుకుతాం'

'నీకు తెలీదురా.. మా అరుణ పిచ్చిదై పోయింది..' 'పిచ్చిదా..' ఆశ్చర్యంగా అటువైపు నుంచి గట్టిగా అరిచినట్టుగా అన్నాడు శ్రీకాంత్.

'పిచ్చి అంటే పిచ్చి అని కాదు.. వారం నుంచి ఇంట్లో ఉండే బంగారు నగలన్నీ వేసుకోని తిరుగుతా ఉంది. నడుముకు వడ్డాణం కూడా పెట్టుకుంటా ఉంది. ఎందుకే అంటే వినదు.. కరోనా వచ్చి సచ్చిపోతే మళ్ల పెట్టుకోలేము కదా అంటుంది.. ఎవరికైనా ఈ విషయం చెప్పుకోవాలన్నా సిగ్గుగా ఉంది. డాక్టర్‌కు చూపించాలన్నా అవమానంగా అనిపిస్తా ఉంది'

'ఆ నగలు కొనిండేది వేసుకునేదానికే కదా.. వేసుకోనీలే..' 'దేనికైనా సమయం సందర్భం ఉంటాయి.. ఇంట్లో ఇప్పుడు ఒంటినిండా నగలు వేసుకోని తిరిగే కాలమా ఇది..?' 'అరుణాకు కాదురా పిచ్చి.. నీకు.. ఇన్నాళ్లు నీతో అనలేదు కానీ, ఎందుకురా నీకు డబ్బంటే అంత పిచ్చి.. ఇప్పుడేమి చేసుకుంటావు ఉండే ఆస్తి అంతా.. ఎత్తుకోని పోతారా?' 'అదేరా ఇప్పుడు నా భయం.. అక్కడ ఫైర్ యాక్సిడెంట్ చూడగానే చాలా భయం వేసింది. నేను చనిపోతే.. నా ఆస్తుల వివరాలన్నీ అరుణకు మాత్రమే తెలుసు. పిల్లలకు ఎవ్వరికీ చెప్పలా... ఇప్పుడు తనేమో పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తోంది..

పిల్లలు ఇంకా సెటిల్ కాలా.. అవన్నీ గుర్తొచ్చి విపరీతమైన భయం వేసింది.'

'పిల్లలను ఏరోజైనా వాళ్ల కాళ్లతో వాళ్లను నడవనిచ్చావా..? వాళ్ల గురించి ఇప్పుడు దిగులు పడితే ఎలా? భయముంటే హెం ఐసోలేషన్లో ఉండు.. గోడలు మాత్రమే అడ్డం. ఒకేచోట ఉన్నామనే ఫీలింగ్ ఉంటుంది' 'ఇంట్లో వాళ్లకు అంటుకుంటే.. అందరం ఏమైనా అయిపోతే..'

'ఏమయితాదిరా.. ఈ లోకం, మనం ఈ లోకంలోకి రాకముందూ ఉంది. మనం లోకం విడిచిపోయాక కూడా ఈ లోకం ఉంటుంది.. ఎప్పుడూ తీసుకునే బుద్ధే కానీ ఇచ్చే బుద్ధి లేదురా నీకు.. అందుకే అంత భయం'

మాట్లాడుతున్నది ఫోన్ లోనే అయినా.. ఆవునన్నట్టుగా తలూపాడు సురేష్. తిరిగి శ్రీకాంత్ మాట్లాడాడు. 'మన కళ్లముందే ఈ మూడు నెలల్లో మన మిత్రులు, బంధువులు ఎంతమంది చనిపోలా..? మరణాన్ని నెత్తిన పెట్టుకోని పుట్టినోళ్లం. అది ఎప్పుడు మనలను నేలలోకి తొక్కేస్తుందో తెలీదు.. జీవితంలో అన్నీ అనుభవించావు.. ఎందుకురా మ–రణమంటే భయం.. ఇప్పటికైనా ఉండేదాంట్లో ఎవరికైనా సాయం చేయరా..' ,

సురేష్ ఏమీ మాట్లాడలేదు. మిత్రుడు చెప్పేది మౌనంగా వింటున్నాడు. భయం

ఏ ద్వారాలు తెరచుకుని ఎప్పుడు తన గుండెలో మెల్లగా తిష్ట వేసిందో కొంచెం కొంచెమే అర్థమవుతోంది.

'నీకుండే డబ్బుకు.. ఒక వందమంది పేద పిల్లలను చదివించొచ్చు. వంద కుటుంబాలకు ఉపాధి కల్పించొచ్చు.. మారుమూల పల్లెలకు రోడ్లు వేయించొచ్చు.. ఆసుపత్రులు, స్కూళ్లు కట్టించొచ్చు.. అనుకోవాలే కానీ.. ఎన్నో చేయొచ్చు.. ఇచ్చేది అలవాటు చేసుకుంటే ఉండేది పోతుందనే భయమూ ఉండదు, మనం చనిపోతే ఎలా అనే దిగులూ ఉండదు' అన్నాడు శ్రీకాంత్.

అప్పటికి కాస్త తేరుకున్నాడు సురేష్ 'ఆలోచిస్తారా.. ఏదైనా చేయాల.. బంగారు గిన్నెలో తింటే ఒక్కడి ఆకలే తీరుతుంది. అదే బంగారు గిన్నెను అమ్మేసి తింటే కనీసం పదివేలమంది ఆకలి తీరుతుంది.. సరే.. నీ ఆరోగ్యం ఎలా ఉంది.? శ్రావణి, పాప ఎలా ఉన్నారు?' మాట్లాడుతూ వెళ్లి కిటికీ ఎదురుగా నిల్చున్నాడు. ఎదురుగా గోడపైన నీలిరంగు బుల్లిపిట్ట ఒకటి వచ్చి వాలింది.

దాన్ని చూస్తే సురేష్ కు ఎందుకో ఆత్మీయున్ని చూసినంత ఆనందమేసింది. 'అందరం బాగున్నాం.. చెప్పా కదా, నేను ఇంట్లోనే ఉన్నా.. డాక్టర్ మెడిసిన్ ఇచ్చారు. వాడుతున్నా..' 'నువ్వుకూడా ఇక్కడికి వచ్చెయ్ రా.. ఇద్దరం నా రూములోనే ఉందాం' మిత్రుడిని ఆహ్వానించాడు శ్రీకాంత్. 'లేదులేరా.. అక్కడ డబ్బు మరీ ఎక్కువ. ఇంట్లోనే ఉంటా. జాగ్రత్తగా ఉంటే చాలు'

'డబ్బు నేను పెట్టుకుంటాలే.. వచ్చెయ్.. ఇద్దరం మాటలు చెప్పుకుంటూ, పేకాట ఆడుకుంటూ కాలేజ్ డేలా హ్యాపీగా కరోనా డేస్ గడిపేద్దాం'

'సారీ సురేష్.. నేను ఇంట్లోనే ఉంటా.. ఎవ్వరు ఖర్చు పెట్టినా డబ్బు డబ్బే కదా.. నాకు కరోనా మైల్డ్ గానే అటాక్ అయింది. భయపడాల్సిన అవసరం లేదన్నారు డాక్టర్.. నువ్వు జాగ్రత్త.. దిగులేమీ పెట్టుకోవద్దు.. నేను చెప్పింది అలోచించు.. ఉంటా' అని అటువైపు ఫోన్ పెట్టేశాడు శ్రీకాంత్.

కాసేపు ఫోన్ నే చూస్తూ ఉండిపోయాడు సురేష్. ఇక్కడ పదిరోజులకు కనీసం పదిలక్షలైనా ఖర్చవుతుంది. అది తనదృష్టిలో చాలా చిన్నమొత్తం. ఇంట్లో ఉండి పదివేల రూపాయల మందులతో బాగైపోయేదానికి పదిలక్షలు ఖర్చు చేయడం అంటే దుబారానే కదా..? ఈ అదనపు డబ్బంతా ఎవరికి చేరుతుంది? ఈ డబ్బు చేరే వాళ్లంతా కూడా తనలాంటి ఆశపోతులే అయి ఉంటారు అనుకున్నాడు సురేష్.

ఫోన్ మోగింది. సర్వీస్ బాయ్. కాఫీ ప్లాస్క్ బయట పెట్టానని చెప్పాడు. సురేష్ వెళ్లి తలుపు ఓరగా తెరిచి బయటున్న ప్లాను లోనికి తెచ్చి టేబుల్ మీద పెట్టాడు. అక్కడే ఉన్న గాజు గ్లాసులో కాఫీ ఒంపుకుని, చక్కెర కొద్దిగా వేసుకుని తిరిగి కుర్చీలో

కూర్చున్నాడు. ఎదురుగా గోడను చూస్తూ రెండు సిప్పులు తాగాడు. పేరుకే కాఫీ. అందులో ఏమీ లేదు. ఘుమఘుమలాడే కాఫీ పెట్టే వంటమనిషి శివమ్మ గుర్తొచ్చింది సురేష్ కు.

శివమ్మ వంటలు అద్భుతంగా చేస్తుంది. ఇంటి పనులన్నీ చాలా శ్రద్ధగా చేస్తుంది. ఆమెకు కూడా కరోనా వచ్చి నాలుగురోజులైంది. ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. దానికి ముందు పదిరోజులుగా భర్తకు ఆరోగ్యం బాగలేదని, పనికి రాలేదు. భర్తను ఆసుపత్రికి తీసుకుపోయి చూపించడం, మందుల కోసం, ఇంట్లో వస్తువులకోసం తిరగడంలో ఎక్కడో ఆమెకు కరోనా అటాక్ అయింది. తమ ఇంటికి పనికి రావడం లేదనే కోపంతో, శివమ్మకు కరోనా పాజిటివ్ వచ్చిందని తెలిసినా ఫోన్ చేసి మాట్లాడలేదు సురేష్ దంపతులు. ఆమెపట్ల నిర్లక్ష్యాన్ని తలచుకుంటే చిన్నతనంగా అనిపించింది. ఒకసారి మాట్లాడాలి అనుకుంటూ సెల్ ఫోను చేతిలోకి తీసుకున్నాడు.

* * *

బెడ్ పైన పద్మాసనం వేసుకుని కూర్చోనుంది శివమ్మ. ఆమె ముఖానికి మాస్క్ ఉంది. చేతులకు గ్లవ్స్ ఉన్నాయి. గదిలో పది బెడ్లున్నాయి. అన్నింటిలో కరోనా పేషెంట్లున్నారు. ఇద్దరు మాత్రం పడుకుని నిద్రపోతున్నారు. మిగిలిన వారంతా పక్కనుండే వాళ్లతో పిచ్చాపాటి మాట్లాడుతున్నారు. తమ బతుకుల్లోని కష్టనష్టాలను పంచుకుంటున్నారు. ఆసుపత్రిలో అందని సౌకర్యాలపై తూర్పారపడుతున్నారు. అందరి ముఖాల్లో భయం ఉన్నా, నలుగురికి అయింది మనకూ అవుతుందనే ధైర్యమూ కనిపిస్తోంది.

ఆ గదిలో పదిమందికి కలిపి ఒకే బాత్ రూమ్ ఉంది. ఒక్కటే టాయ్ లెట్ ఉంది. రాత్రి పదిగంటలు దాటితే నీళ్లుండవు. తాగే నీళ్లు కూడా పొద్దున్నే కేవలం రెండు లీటర్లు మాత్రమే ఇస్తున్నారు. రోజంతా ఆ రెండులీటర్ల నీళ్లే.

రాత్రి 8గంటలకు భోజనం ఇచ్చేసి ఆసుపత్రి మెయిన్ గేటు తాళం వేసుకుని వెళ్లిపోతారు. డ్యూటీ డాక్టరుండరు. ఎవరికైనా ఏమైనా ఇబ్బంది అనిపించినా వచ్చి చూసేవాళ్లుండరు. కుటుంబసభ్యులకు ఫోన్ చేసి ఇక్కడుండే వారు గోడుగోడుమంటూ ఉంటారు. ఈ విషయాలన్నీ మాట్లాడుకుంటూ ఉన్నారంతా. కొందరిలో అసహనం మరీ ఎక్కువై ప్రభుత్వాన్ని, వైద్యులను, అధికారులను, ప్రజాప్రతినిధులను తిడుతున్నారు.

'ఏదోలే... టయానికింత పెడతాండారు.. పడుకునేదానికి మంచముండాది. కప్పుకునేదానికి దుప్పటుండాది.. ఒగరా ఇద్దరా.. వేలమంది కదా.. అందరికీ చూడాలంటే అయితాదా.. మన ఇండ్లల్లో నలుగురుంటేనే మనం

సమాళించుకోలేమే.. ఇంతమందికి అన్నీ సక్రమంగా చేయాలంటే అయితాదా?' అంది శివమ్మ.

ఆమె మాటలతో కొందరు ఏకీభవించారు. కొందరు విభేదించారు. ఆ రెండు వర్గాలూ తిరిగి చర్చ మొదలుపెట్టాయి.

ఇంతలో శివమ్మ ఫోన్ రింగయింది. అది ఎప్పటిదో కీప్యాడ్ ఫోన్. డిస్ ప్లే కూడా సరిగా ఉండదు. ఆన్ బటన్ నొక్కి చెవి దగ్గర పెట్టుకుని 'హలో' అంది.

'బాగుండావా శివమ్మా..' అటువైపు నుంచి సురేష్. అతని గొంతులో అభిమానం. గొంతును ఒక్క క్షణంలో పోల్చుకుంది.. ఆశ్చర్యంగా 'బాగుండాను సార్. మీరెలా ఉండారు?' అడిగింది. 'నీకు కరోనా వచ్చి నాలుగు రోజులైనా పలకరించలేదు. సారీ శివమ్మా..' అన్నాడు. 'అయ్యో.. ఏముందిలే సార్.. ఇప్పుడు మాట్లాడినారు.. అదే పదివేలు.. అయినా కరోనాదేముండాదిలే సార్.. పెద్ద జొరం అంతే.. పద్దినాలు ఆస్పత్రిలో ఉండి ఇంటికి పొయ్యేదే కదా..' అంది చాలా తేలిగ్గా.

'నీకేం భయం వేయలేదా శివమ్మా..'

'ఎందుకు సార్ భయం.. మాకేమన్నా మీ మాదిర్తో మేడలు మిద్దెలు ఉండాయా.. నగా నట్రా ఉండాయా? కష్టపడుకుంటాం. తింటాం.. ఈ భూమ్మీద నూకలు ఎన్నిరోజులు రాసి పెట్టింటే అన్ని రోజులుంటాం.. తీరిపోయిన్నాడు మట్టిలో కలిసిపోతాం.. దానికెందుకు సార్ భయం' ఎదురు ప్రశ్న వేసింది శివమ్మ.

అటువైపు నుంచి సురేష్ మాట్లాడలేదు. 'ఏం సార్.. మీరెలా ఉండారు?.. మేడమ్ బాగుందా..? పిల్లలు బాగుండారా?..' 'మేమందరం బాగున్నాం. ఏమైనా సాయం కావాలంటే చెప్పు. ఇంటికి మీ పాపను పంపించు..'

'ఏమొద్దులేసార్.. ముందు మేడమ్ కు చూపించండి.. డబ్బు అవసరం అయ్యి పాపను మొన్న పంపిన్నా మీ ఇంటికాడికి.. మేడమ్ ఒళ్లంతా నగలు దిగేసుకోని అమ్మోరు మాదిర్తో ఇళ్లంతా తిరగతా ఉన్నిందంట.. మా పాప చూసి భయపడి, గడపకాన్నుంటి ఇట్లే వచ్చేసింది..'

'మీక్కూడా తెలిసిపోయిందా..? నాక్కూడా కరోనా వచ్చింది శివమ్మా.. నీ అంత ధైర్యం లేదు నాకు' అన్నాడు సురేష్ నిజాయితీగా. 'మీకు ధైర్యం ఉండదు సార్.. మీరేమనుకోనంటే ఒగమాట చెప్తా.. మీకు లేంది మాకుండేది అదే.. కష్టపడుకుంటాం.. ఎవరినీ మోసం చేసి సంపాదించాలనుకోం.. ఉన్నంతలో ఎవరైనా అడిగితే సాయం చేస్తాం.. ఉంటే కడుపు నిండా తింటాం.. లేదంటే కడుపు నిండా నీళ్లు తాగైనా పడుకుంటాం.. ఏదైనా ఒగటే.. అందుకే మాకు ధైర్యం ఎక్కువ' అంది శివమ్మ.

'నాకు మాత్రం ఈ రోజు పొద్దున దాకా చాలా భయంగా ఉన్నింది శివమ్మా.. అసలు రేపటి సూర్యోదయాన్ని చూస్తానో చూడనో అనుకున్నా. ఇంతకుముందే మా ఫ్రెండ్ శ్రీకాంత్ ఫోన్ చేశాడు. వాడు రెండుమూడు సార్లు మా ఇంటికొచ్చాడు. నువ్వు కూడా చూశావ్. వాడితో మాట్లాడాక కాస్త ధైర్యం వచ్చింది. ఇప్పుడు నీతో మాట్లాడాక ధైర్యం ఇంకా పెరిగింది. ఖచ్చితంగా రేపటి సూర్యోదయాన్ని చూస్తాను' అన్నాడు ఉద్విగ్నంగా సురేష్.

'పొద్దు పుట్టకముందే నిద్ర లేచి బయటొస్తే సూర్యోదయాన్ని ఎందుకు చూడం సార్?' అంటూ ప్రశ్నించింది అమాయకంగా. 'నిజమే శివమ్మా.. ఇన్నాళ్లూ నిద్రపోయాను. ఇప్పుడైనా సూర్యోదయం కోసం అందరితోపాటు పొద్దున్నే నిద్రలేస్తా' అన్నాడు సురేష్.

ఎంత ఎక్కువ పనిచేసినా ఏ రోజూ జీతానికి మించి ఒక్కరూపాయి కూడా ఎక్కువ ఇవ్వని విషయం గుర్తొచ్చి 'మీలాంటోళ్లు మేలుకుంటే లోకం బాగుపడుతుంది.. ఆరోగ్యం జాగ్రత్త సార్..' అంది శివమ్మ.

అప్పటివరకూ ఉన్న మబ్బులు పక్కకు పోయినట్టున్నాయి. సూర్యకిరణాలు అటువైపు గోడకున్న అద్దాల పైన పడి, కిటికీలోంచి గదిలోకి ఏటవాలుగా ప్రసరిస్తున్నాయి. సురేష్ మనసుతో పాటు గదంతా కొత్త వెలుగు పరచుకుంది.

## సుంకోజి దేవేంద్రాచారి

సుంకోజి దేవేంద్రాచారి.. చిత్తూరు జిల్లా కేవీపల్లె మండలంలోని గుడ్రెడ్డిగారిపల్లె. తల్లిదండ్రులు సుంకోజి ఈశ్వరమ్మ, సుంకోజి రెడ్డెప్పాచారి. ప్రస్తుత నివాసం కడప. వృత్తి జర్నలిస్టు. ప్రవృత్తి సాహితీవ్యాసంగం. మొదటి కథ 'బంగారుపంజరం' 1997లో వార్త దినపత్రిక లో వచ్చింది. ఇప్పటి వరకూ దాదాపు 100 కథలు, వందకు పైగా కవితలు, 7నవలలు రాశారు.

# హనీ

**తటపర్తి నాగేశ్వరి,**
**99897 73549**

**'ఈ టార్చర్ భరించలేను'** అంది హని. 'ఏమయింది బంగారం' అన్నాను నేను. 'ఈ పెళ్లి గొడవేంటో? ఆమెగారు టపా కడుతుందట. నా పెళ్లి చూసాకే కన్ను మూస్తుందట' చెప్పింది హని. 'మీ నానమ్మ పేరు ఏదో చెప్పావు. గుర్తు రావడం లేదు' అన్నాను నేను. 'అదేం అంత గొప్ప పేరు కాదులే' అంది హని. 'పర్వాలేదులే చెప్పు' అన్నాను. 'సుబ్బరత్నమ్మ' చెప్పింది. 'సుబ్బరత్నమ్మగారికి చెప్పు..నా లైఫ్‌లో హృతిక్ రోషన్‌లాంటి అందగాడు 'వల్లభ్' ఉన్నాడు. చేసుకుంటే అతగాణ్ణే చేసుకుంటా అని చెప్పు' అన్నాను.

'ఒకవేళ అలా చెబితే.. నీ చదువు గిదువు మానేసి తాళి కట్టించుకో అంటుంది. పెళ్లి జరిగితే నువ్వు అసలు ఊరుకుంటావా స్వామీ.. పగలూ రాత్రీ నన్ను వేపుకు తినవు.నా చదువు కొండెక్కడం ఖాయం' అంది అల్లరిగా. నవ్వాను. చదువుకుంటూనే పార్ట్ టైమ్ జాబ్ చేస్తుంది హనీ. చదువు పూర్తయ్యే వరకు పెళ్లి సాధ్యం కాదు అంటుంది. నిజంగా తను రొమాంటిక్ పర్సనాలిటీ. సరిగ్గా ఆరునెలల క్రితం నాకు ఒక ఫోన్ వచ్చింది.

'మీ పేరు వల్లభ్ కదూ?' అడిగింది తను. 'పేరు తెలియకుండానే ఫోన్ చేశారా?' అడిగాను నేను. 'మొన్న అమృత షాపింగ్ మాల్‌లో ఒక కూపన్ నింపారు కదూ లక్కీ డిప్లో మీ నెంబర్ వచ్చింది' చెప్పింది. 'మై గుడ్‌నెస్.. అవునా!' అన్నాను ఆనందంగా. 'ఎస్.. మీకు ఒక గిఫ్ట్ హేంపర్ వచ్చింది' చెప్పింది. ఆశ్చర్యంతో నేను నోరెళ్లబెట్టాను. 'ఏమొచ్చింది?' అడిగాను ఆశగా. తను వెంటనే ఏమీ చెప్పలేదు. ఆ అమ్మాయి గొంతు చాలా స్వీట్‌గా ఉంది. 'అది నేనిప్పుడు వచ్చి తీసుకోవచ్చా?' అడిగాను. 'ఇప్పుడు కాదు. రేపు పదకొండు గంటలకు రండి. బేగంపేట దగ్గర మా ఆఫీసు. అక్కడున్న షాపర్స్ స్టాప్ దగ్గరకొచ్చి కాల్ చేయండి. మా వాళ్ళు గైడ్ చేస్తారు' చెప్పింది. 'ఎస్ మేడమ్' చెప్పాను. 'ఒన్ మినిట్..' అంది. 'ఏంటి మేడమ్?' అడిగాను. 'మీరు సింగిల్‌గా రాకూడదు. మీ వైఫ్‌ని కూడా తీసుకొని రండి' చెప్పింది.

నేను కిసుక్కున నవ్వాను. 'ఏంటి నవ్వుతున్నారు?' అడిగింది. 'నేనింకా సింగిల్ మేడమ్' అన్నాను. అయితే 'మీ అమ్మా నాన్నను పంపండి' అంది. మళ్లీ నవ్వాను. 'ఏంటి అన్నింటికీ నవ్వుతారు' అంది. 'అమ్మా నాన్న మా ఊర్లో ఉంటారు. నేను ఇక్కడ మాదాపూర్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ చేస్తున్నాను' చెప్పాను. అయితే 'ఈ కాన్సెప్ట్ మీకు కాదు' అంది. 'ఒన్ మినిట్' అన్నాను. 'ఏంటి?' అంది. 'కాన్సెప్ట్ అంటే..?' అడిగాను. 'పెళ్ళయిన వాళ్ళకే ఇది వర్కౌట్ అవుతుంది. మీకు గాళ్ ఫ్రెండ్ ఉన్నా తెచ్చుకోండి' అంది. 'ఇంకా ఎవరూ దొరకలేదు' చెప్పాను. తను కిలకిలా నవ్వింది. 'మీ పేరు తెలుసుకోవచ్చా?' అడిగాను. 'ఎందుకు?' అడిగింది. 'మీ వాయిస్ స్వీట్‌గా ఉంది' చెప్పాను. అయితే 'హని' అనుకోండి అంది ఫోన్ కట్ చేస్తూ. అప్పటి నుండి తన పేరు 'హనీ' గానే ఫిక్సయిపోయాను. ఒకరోజు హనీ నుండి ఫోన్ వచ్చింది.

**'కుటుంబ అవసరాల కోసం ఫ్రెండ్ రిఫరెన్స్‌తో వాళ్ల కాల్ సెంటర్‌లో జాయినయ్యాను. పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాను. జనాన్ని మోసం చేయలేక మానేశాను' 'మరి.. జాబ్?' అడిగాను సానుభూతిగా. 'ఇప్పుడు అదే నాకు ఒక సమస్య అయింది. నాన్న షాపింగ్ మాల్‌లో పని చేస్తుంటారు. ఆయన సంపాదన ఇంటికి సరిపోవడం లేదు.**

కానీ ఆ నెంబర్ వేరు. 'వల్లభ్ కదూ?' అంది. 'ఎస్' అన్నాను. 'ఇది నా పర్సనల్ నెంబర్ నోట్ చేసుకోండి' అంది. 'ఏంటి ఫోన్ చేశారు?' అడిగా.'మీరు నేను పని చేసిన సంస్థమీద కంప్లైంట్ చేయాలి' అంది. 'ఏ సంస్థమీద?' అడిగాను. 'నేను మీకు కాల్ చేసిన సంస్థ మీద' చెప్పింది. 'ఏం జరిగింది? అడిగాను. 'వాళ్లదంతా చీటింగ్' అంది. 'అంటే?' అడిగాను. 'మీలాంటి వాళ్ల నెంబర్లు ఏ సినిమా హాల్లోనో షాపింగ్ మాల్‌లోనో కలెక్ట్ చేస్తారు. కపుల్స్‌గా రమ్మంటారు. ఆశగా వచ్చిన వాళ్ళకి కంపెనీ కాన్సెప్ట్ చెప్తారు. నచ్చితే తమ కాన్సెప్ట్‌లో జాయిన్ కమ్మంటారు. నచ్చకపోతే రెండు గిఫ్ట్ హేంపర్లు ప్లాస్టిక్ డొమెస్టిక్ వస్తువులు ఇచ్చి పంపిస్తారు. కాన్సెప్ట్‌లో భాగంగా ఏదైనా విహార యాత్రకు వాళ్లు వెళితే తమతో టైఅప్ ఉన్న హెటల్స్ అకామిడేషన్ యాభై పర్సంట్ ఆఫ్ అంటారు..' హనీ చెబుతున్న మాటలకు అడ్డుపడి 'ఇందులో మోసం ఏముంది?' 'ఇక్కడే అసలు మోసం మొదలవుతుంది. ఫ్లైట్ చార్జీలు ఇస్తారు.

పైసలు లేవు అన్న వాళ్ళకు లోన్ కూడా ప్రొవైడ్ చేస్తారు. షరతులు వర్తిస్తాయి అనే చిన్నకాలమ్ ఉంటుంది కానీ అది మనం గమనించం. కమిటయ్యి వెళ్లిన వాళ్లకు ఖర్చులు తడిసి మోపెడవుతాయ్. వీళ్ల ట్రాప్లో చిక్కిన వాళ్లకు చుక్కలు కనపడతాయి. వాళ్లు తిరిగి వచ్చాక.. వాళ్ల ఆస్తులు కూడా రాయించుకుంటారు. అంతా లీగల్‌గా కనపడుతుంది కానీ.. పచ్చి దోపిడి కన్పిస్తుంది. డబ్బు కట్టలేం అన్న వాళ్ళతో వ్యభిచారం కూడా చేయిస్తారు. కాల్‌మనీ, సెక్స్ రాకెట్ కంటే వీళ్లు చాలా ఘోరం. ఎవరైనా కనిపెట్టి నిలదీయడానికి వస్తే బౌన్సర్లతో నెట్టించేస్తారు. పోలీసులనీ.. మీడియాని కూడా ఆర్గనైజ్ చేస్తారు' అంది హని. 'మరి ఇంత దుర్మార్గం జరుగుతుందని తెలిసి నువ్వెందుకు జాబ్ చేస్తున్నావ్?' అని అడిగాను. హనీ మాట్లాడలేదు. 'చెప్పవేం..' అడిగాను. 'కుటుంబ అవసరాల కోసం ఫ్రెండ్ రిఫరెన్స్‌తో వాళ్ల కాల్ సెంటర్‌లో జాయినయ్యాను. పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాను. జనాన్ని మోసం చేయలేక మానేశాను' 'మరి.. జాబ్?' అడిగాను సానుభూతిగా. 'ఇప్పుడు అదే నాకు ఒక సమస్య అయింది. నాన్న షాపింగ్ మాల్‌లో పని చేస్తుంటారు. ఆయన సంపాదన ఇంటికి సరిపోవడం లేదు. అమ్మకేమో షుగర్ వల్ల కిడ్నీ సమస్య వచ్చింది. వారానికి రెండుసార్లు డయాలలిస్ చేయాలి. ఇప్పుడు మీకు ఫోన్ చేసిన కారణం ఇప్పుడు మీ దృష్టిలోకి వచ్చిన జాబ్స్ ఏమైనా ఉంటే చెప్పండి. ఆ సంస్థ వాళ్ళపై ఒక కంప్లైంట్ కూడా ఇవ్వండి' అంది. 'అలాంటి మోసగాళ్ళకి వ్యతిరేకంగా పోరాడే శక్తి నాకు ఉందో లేదో తెలియదు. బట్.. మీ జాబ్ కోసం ట్రై చేస్తా' చెప్పాను. నా మెయిల్ ఐ.డి తీసుకొని తన బయోడేటా మెయిల్ చేసింది. తను కేవలం బి.కాం మాత్రమే చదివింది. యం.బి.ఏ పార్ట్ టైం చదువుతుంది. తనకు తగ్గ జాబ్ నాకేమీ కన్పించలేదు. తన జాబ్ విషయం గురించి అప్పుడప్పుడు ఫోన్ చేసేది. ఏవేవో జోకులు చెప్పి నవ్వించేది. తనతో మాట్లాడుతుంటే కాలం కూడా తెలిసేది కాదు. వారం రోజులు తన నుండి ఏ కమ్యూనికేషన్ లేదు. వారం తర్వాత నేనే కాల్ చేశాను. తనేం మాట్లాడలేదు. 'ఏంటి అలా ఉన్నారు?' అడిగాను. 'మా అమ్మకు బాగలేదు' అంది. 'ఏం' అడిగాను. 'పైసల్లేక ఈ వారం డయాలసిస్ చేయించలేదు' చెప్పింది. 'అయ్యో..' అన్నాను. తనేం మాట్లాడలేదు. 'నన్ను అడగొచ్చు కదా' అన్నాను.

'మీతో నాకేం పరిచయం ఉంది అని అడుగుతాను' అంది. 'సాయం చేయడానికి పరిచయం అవసరమా?' అన్నాను. 'నాకు కాస్త మొహమాటం ఎక్కువ. నాన్న ఎవర్నో అడుగుతాను అన్నారు' అంది. 'ఫర్వాలేదు.. మీకు వచ్చిన తర్వాత నాకు రిటన్ చేయండి' చెప్పాను. చెప్పడమే కాకుండా వెంటనే పదివేల రూపాయలు తన అకౌంట్ నెంబర్ తీసుకొని సెండ్ చేశాను. తను వెక్కి వెక్కి ఏడ్చింది. 'ఏయ్ ఎందుకు

ఏడుపు..' అన్నాను. 'మీరు నాకు దేవుడిలా కనపడుతున్నారు' అంది. 'మనుషుల్ని దేవుణ్ణి చేస్తే ఎలా' అన్నాను. 'ఈ దేవుడికి ఒక ముద్దు కానుకగా ఇవ్వనా' అంది. నాకేం అర్థం కాలేదు. 'అదే స్వామీ.. దేవుడికి నైవేద్యం ఇస్తారుగా అలా' అంది. 'యూ..నాటీ' అని ఫోన్ పెట్టేశాను. ఆ తర్వాత హని తరచుగా ఫోన్ చేసేది. ఒక్కోసారి తెల్లవారి మూడు గంటల దాకా కూడా మాట్లాడేది. ఆ చొరవ ఎక్కడి దాకా వెళ్లిందంటే 'నామీద నుండి లేయ్ స్వామీ.. బరువుగా ఉన్నావు' అనేది. నాకు ఊపిరి ఆగిపోయినట్టు ఉండేది హని కవ్వింతలకు. నా ఫోటో అడిగింది ఒకసారి. వాట్సప్ లో పంపాను. తన ఫోటో అడిగాను. 'వద్దు, మీ అబ్బాయిలను నమ్మలేం వేరే వాళ్లకి సెండ్ చేస్తారు. లేదా చూపుతారు' అనేది. 'మరి నిన్ను చూడ్డం ఎలా?' అడిగేవాణ్ణి. 'ఏదో ఒకరోజు ఎవరూ ఇంట్లో లేనప్పుడు ఇంటికి పిలుస్తాను. తనివి తీరేలా విందు భోజనం పెడతాను' అనేది అల్లరిగా. ఒకసారి ఫోన్ పెట్టేస్తూ 'ఇప్పుడు నేను చన్నీళ్ల స్నానం చేయాలి బాబూ' అంది. 'ఏం మీ ఇంట్లో గీజర్ లేదా?' అడిగాను. 'అసలే ఒళ్లు కాలిపోతుంటే వేడి నీళ్లు పోసుకోవాలా' అంది వెక్కిరింతగా. అర్థమయ్యి.. నా ఒళ్లు వేడెక్కింది. 'నీతో మాట్లాడి ఫోన్ పెట్టేశాక గంట వరకు నేను మనిషిని కాలేను స్వామీ. జాకెట్ బిగుతుగా మారుతుంది. ఒంట్లో ఆవిరులు వస్తాయి. నరాలు వశం తప్పుతాయి. రేపు నీతో పెళ్లయ్యాక నన్ను బతకనిస్తావా బాబూ' అనేది అల్లరిగా.. హస్కీగా.

ఇంటినుంచి నాన్న ఫోన్ చేసేవాడు. పురుగు మందులకనో, విత్తనాలకనో డబ్బులు కావాలి అని నేనేదో సాకులు చెప్పి తప్పించుకొనేవాణ్ణి. 'నా మెయింటనెన్స్‌కే సరిపోవడం లేదు. ఆరు నెలల తరువాత శాలరీ పెరుగుతుంది. అప్పుడు పంపుతాను' అని దాటేసేవాణ్ణి. హనీ వాళ్ల అమ్మ డయాలసిస్‌కనీ, కాలు విరిగిన నానమ్మ ఫిజియోతెరిఫికనీ.. ఇంటి ఖర్చులకని నా శాలరీలో డెబ్బైశాతం పంపేవాణ్ణి. 'పెళ్లి చేసుకుందామనుకుంటున్నాను' అన్నాను. 'ఒక్క జీతం మనకి సరిపోదు. ఇంటికి కూడా నేను హెల్ప్ చేయాలి. నాక్కూడా జాబ్ రానీ' చెప్పింది. 'మరి మీ నానమ్మ కోరిక తీర్చవా?' అడిగాను. 'అది దుక్కలా ఉంది. పదేళ్ళనుండి పోతా అంటుంది కానీ పోవడం లేదు' అంది నవ్వుతూ. 'తప్పు అలా మాట్లాడకు' అన్నాను. 'సరదాగా అంటున్నాలే. మా నానమ్మ మా ఇంటికి పెద్ద దిక్కు తనని ఆట పట్టిస్తుంటాను నువ్వు ఎప్పుడు పోతావే అని' చెబుతూ నవ్వింది. 'ఒకసారి వచ్చి మీ నానమ్మని చూడనా?' అడిగాను. 'అలా వస్తే వెంటనే నీకూ నాకూ జత కట్టేస్తుంది. కాచుకొని కూర్చొంది. నాన్న షాపింగ్ మాల్ కూడా సరిగ్గా నడవడం లేదట. రెండు నెలలకొకసారి అతడు జీతం ఇస్తున్నాడు. నాకు జాబ్ వచ్చాక పెళ్లి చేసుకుందాం. నా జీతంలో సగం ఇంట్లోకి ఇచ్చినా సగం మనం వాడుకోవచ్చు' అంది. 'జీతం గొడవదేముందిలే.. ఇంకో కంపెనీ

చూసుకొంటే శాలరీ హైక్ కూడా ఉంటుంది. మీ ఇంట్లో వాళ్లను కూడా నేనే చూసుకుంటా. అందరం కలిసే ఉందాం' అన్నాను. నా ప్రపోజల్ వింటూనే 'అయినా నువ్వేదో పస్తులున్నట్టు.. ఈ వెంపర్లాట ఏంటి స్వామీ. ఎప్పుడు వీలు పడితే అప్పుడు నాతో రొమాన్స్ చేస్తున్నావు కదా పగలు రాత్రి తేడా లేకుండా' అంది నవ్వుతూ. 'ఏంటి ఈ టెలిఫోన్ కాపురమా? భలేదానివే..నీ దొండపండు పెదవులు సుతారంగా వత్తాలి. నీ నున్నని బుగ్గలపై నా బుగ్గలతో రాపాడించాలి. నీ అనాచ్ఛిదిత ఎత్తైన గుండెలపై నా పెదాలను ఆనించి చుంబించాలి. నీ చెవి తమ్మెలను నా పెదవులతో సుతారంగా ముద్దాడాలి. నీ నున్నటి నాభి చుట్టూ నా పెదవులతో నఖక్షతం చేయాలి..' అంటూ ఉంటే.. 'స్టాప్ స్టాప్.. రాఘవేంద్రరావు సినిమా నాకు చూపించకు బాబూ.. ఒళ్లు వేడెక్కుతుంది' అంది.

నాన్న ఊరినుంచి వచ్చాడు. 'అరే నాన్నా.. నీ చదువుకోసం తెచ్చిన అప్పులు ఇంకా తీరలేదు. నీకొచ్చే జీతం పెట్టుబడిగా పెట్టి వ్యవసాయం చేద్దాం అనుకున్నాం. నీ జీతం చేతికంది రావడం లేదు. నాకు ఇక వ్యవసాయం చేసే ఓపిక లేదు. నువ్వు ఈ జాబ్ మానేసి వచ్చేయ్.. ఎక్కడో దగ్గర అప్పు పుట్టించుకొని వ్యవసాయం చేసుకుందాం' చెప్పాడు. నాకేం మాట్లాడాలో అర్థం కాలేదు. 'ఇంత చదువుకొని నేను వ్యవసాయం చేయడం ఏంటి నాన్నా? అన్నాను. 'చేతికందిరాని చదువు, ఉద్యోగం ఎందుకురా?' అన్నాడు నిస్సహాయంగా. నిజమే ఇంతకుముందు ఎంతో కొంత డబ్బు పంపేవాణ్ణి. అప్పులు తీర్చేవాడు నాన్న. హనీతో స్నేహం మొదలయ్యాక ఇంటికి ఏం సాయం చేయలేకపోతున్నాను. 'నాన్నా.. మీకో మాట చెప్పాలి' అన్నాను. 'ఏంట్రా..' అడిగాడు నాన్న. 'నేను ఒక అమ్మాయిని ప్రేమించాను' చెప్పాను. నీకు అంత సీనుందా అన్నట్టు నా మొఖం చూసి.. 'ఎవర్రా ఆ పిల్ల.. పేరేంటి?' అడిగాడు. 'తెలీదు.. నేను హనీ అని పిలుస్తాను' చెప్పాను. 'ఊ.. హనీనో.. మనీనో ఆ పిల్లది ఏ కులం?' అడిగాడు. 'తెలీదు..' చెప్పాను. 'కనీసం ఆ పిల్ల ఫోటో అయినా చూపరా.. మీ అమ్మకు చూపిస్తాను' అన్నాడు. 'నేనే ఇప్పటిదాకా చూడలేదు నాన్నా' చెప్పాను. నన్ను వెర్రి వెంగళప్పలా చూశాడు. 'పేరు తెలీదు. పిల్లను చూడలేదు. మరి ప్రేమేంటిరా?' అడిగాడు అసహనంగా. 'మాది టెలిఫోన్ ప్రేమ నాన్నా..' చెప్పాను. పిచ్చెక్కినట్టు చూశాడు. 'కనీసం ఒకసారి కోడలి పిల్లతో మాట్లాడించరా' అన్నాడు. 'అంటే నా ప్రేమను అంగీకరించినట్టేనా నాన్నా నువ్వు!' అన్నాను ఆశగా. 'నేను అంగీకరించకపోతే నీలాంటి కుర్రాళ్లు ఊరుకుంటారా? నేరుగా ఇంటికి తెచ్చేయరా' అన్నాడు. నాన్నకీ బాగానే జనరల్ నాలెడ్జి ఉందని అర్థం అయ్యింది. హనీతో మాట్లాడించాలని ఫోన్ రింగ్ చేశాను. కాల్ రిజెక్ట్ చేసింది. 'బహుశా హనీ డాడీ ప్రక్కన

ఉన్నాడేమో అందుకే ఫోన్ రిజెక్ట్ చేసింది' చెప్పాను. 'వాళ్ళింట్లో వాళ్లకి తెలీదా?' అడిగాడు. 'ఇంకా చెప్పలేదు నాన్నా.. తను కూడా ఉద్యోగ ప్రయత్నాలు చేస్తుంది. జాబ్ వచ్చాక చెబుదాం అనుకుంటున్నాం' చెప్పాను. మరో మూడు సార్లు ట్రై చేస్తే ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. కాస్త కోపం వచ్చింది.. నాన్నని నిస్సహాయంగా చూశాను.

నాన్న భుజం మీద ఉండే కండువా తీసి రెండుసార్లు విదిలించి 'వచ్చే ఆదివారం నేనూ మీ అమ్మ వస్తాం ఆపిల్ల ఇంటికి తీసుకెళ్లు' చెప్పి కదిలాడు. నేను తాత్కాలికంగా రిలాక్స్ గా ఫీలయ్యాను. సగం నాన్న ఒప్పుకొన్నందుకు సంతోషం అన్పించింది. సరిగ్గా రాత్రి పదకొండు గంటలకు నా ఫోన్‌కి ఎస్.ఎమ్ ఎస్. వచ్చింది. హని ఫోన్ స్విచ్ ఆన్ అయినట్టుంది. హనీ అవైలబుల్ అన్నది ఆ ఎస్.ఎమ్.ఎస్ సమాచారం. పిచ్చ కోపం వచ్చింది నాకు. ఆ టైమ్‌లో ఫోన్ చేస్తే మాట్లాడడం కష్టమవుతుందేమోనని 'ఏయ్ ఏమయిపోయావ్' అని అడిగాను కోపంగా ఎమోజీ వాట్సప్లో పెట్టి. 'నా బంగారుకి కోపం వచ్చిందని అర్థమయింది. అమ్మని తీసుకొని నేనూ, నాన్నా యాదగిరి గుట్టకు వెళ్ళాం. మీరు ఫోన్ చేసినప్పుడు నాన్న ప్రక్కన ఉన్నాడు. తర్వాత బ్యాటరీ డౌన్ అయిపోయింది' 'పోయేప్పుడు ఒక మెసేజ్ పెట్టాల్సిన అవసరం లేదా?' అడిగాను కోపంగా. 'ఉ..తప్పయిపోయింది బాబూ.. అక్కడికెళ్లాక మాట్లాడుదాం అనుకున్నా.. పైగా నాన్న పక్కనే ఉన్నాడు. యూట్యూబ్‌లో అమ్మకి భక్తి గీతాలు చూపించడంతో నా బ్యాటరీలో చార్జింగ్ అయిపోయింది. పవర్ బ్యాంక్ తీసుకెళ్ళడం మర్చిపోయా' సంజాయిషీ ఇచ్చింది. 'అయినా.. ఐ హర్ట్..' అన్నాను. 'నేను కూడా బుంగమూతి పెట్టాను' మెసేజ్ ఇచ్చింది. నాకు నవ్వొచ్చింది. 'నా బంగారు కదూ, నా బుజ్జి తండ్రివి కదూ..' బ్రతిమిలాడడం మొదలు పెట్టింది. 'నేను మాట్లాడను పో..' అన్నాను నేను కూడా బుంగమూతి పెట్టి. 'నా బంగారు కదూ.. బుగ్గమీద ఒక ముద్దు పెట్టనా?' అడిగింది. నేనేం సమాధానం ఇవ్వలేదు. 'ఇదిగో ఈ ముద్దు నీ నుదుటి మీద.. ఈ ముద్దు బుగ్గల మీద.. ఈ ముద్దు పెదవుల మీద..' అని ఆపింది. కాసేపు గడిచింది, 'ఏం దిగిరావా?' అన్నాను మెసేజ్‌లో. 'నా పెదవుల్ని ఒదిలితేగా బాబూ.. మామిడిపండు రసాన్ని జుర్రుకున్నట్టు జుర్రుకుంటున్నావ్' అంది. నాకు నవ్వొచ్చింది. తను మెసేజ్ లతోనే ఒళ్లు వేడిక్కెస్తుందని తెలుసు. నా బింకం సడలిపోయింది 'సర్లే.. ఒక అరగంట ఇలాగే లిప్‌లాక్‌లో ఉంచు' అన్నాను. సరిగ్గా అరగంట తర్వాత అన్లాక్ అని మెసేజ్ పెట్టి 'నాన్న వచ్చాడు' చెప్పాను. 'ఓ.. గాడ్ మావయ్యా!' అంది. 'అవును' చెప్పాను. 'ఎందుకొచ్చాడు?' అడిగింది. 'నేనిక్కడ జాబ్ చేస్తూ డబ్బులు పంపడం లేదుగా.. ఊరికి తీసుకెళ్లి వ్యవసాయం చేయించాలనుకుంటున్నాడు' చెప్పాను. 'పాపం.. నిజమే మీ శాలరీలో సింహభాగం నాకే ఇస్తున్నారు. అయినా ఆ పొలాల్లో

నీతో పాటు వచ్చి వ్యవసాయం చేయలేను స్వామీ' అంది. 'నీకంత సీన్ లేదని నాకు తెలుసులే.. విషయం ఏంటంటే.. నీ గురించి నాన్నకు చెప్పేశాను' 'ఓ మై గాడ్' అంది. 'వచ్చేవారం అమ్మ కూడా వస్తుంది' చెప్పాను. 'ఎందుకు?' అడిగింది. 'అమ్మ వచ్చాక నీకో సర్‌ప్రైజ్ ఉంటుంది చూడూ' చెప్పాను. 'నన్ను కంగారు పెట్టకు బాబూ..ఆ సర్‌ప్రైజ్ ఏంటో చెప్పు' అంది. 'తినబోతు రుచెందుకు' అన్నాను. 'నీ సర్‌ప్రైజ్ చల్లంగుండా.. బిగ్ హగ్ ఇవ్వు.. నిన్ను ఆలాగే హత్తుకొని నిద్రపోతాను' అంది.

మాటల్తో కవ్వించడంలో తను దిట్ట. 'సర్లే' చెప్పాను. 'నన్ను నిద్రపోనివ్వు.. మధ్య రాత్రుల్లో లేపి అల్లరి వేషాలు వెయ్యకు' అని మెసేజ్ పెట్టి స్విచ్ ఆఫ్ చేసి పడుకుంది. నా ఒళ్లు వేడెక్కడం మొదలైంది.

***

ఆదివారం అమ్మని తీసుకొని నాన్న వచ్చాడు. 'ఎవర్రా ఆ పిల్ల?' అడిగింది అమ్మ. నేను నీళ్లు నమిలాను. 'ఏదో సక్కంగా నౌకరీ చేసుకొని మీ నాన్నకు చేదోడు వాదోడుగా ఉంటావనుకుంటే ఇలా లవ్వులూ గివ్వులూ అని తిరుగుతుండావేందిరా..' అంది మందలిస్తూ. 'అది కాదమ్మా..' అంటూ ఉంటే.. మళ్లీ గయ్యిమని లేచి.. 'పిల్ల పేరు తెలీదు.. రూపం తెలీదు. కులం తెలీదు. వయసుదో ముసలిదో తెలీదూ.. ఈ గుడ్డి లవ్వేంటిరా' అంది మా అమ్మ తులసమ్మ. మా నాన్న వెంకట్రావ్ దూరిపొయ్యాడు. 'పిల్లాణ్ణి గదమాయించడానికి కాదు కదే నేను నిన్ను తెచ్చింది. జరగాల్సింది చూడు' అన్నాడు. 'ఏంటి జరిగేది.. పదా.. దాని ఇంటికి వెళ్దాం' అంది. నాకు కాళ్లూ చేతులూ ఆడడం లేదు. ఆదివారం అమ్మని తీసుకొని నాన్న వస్తాడని తెలుసు. అమ్మ అసలే మమతా బెనర్జీ లెక్క, ఫైర్‌బ్రాండ్, తెలుగు సీరియల్స్‌లో అత్త మాదిరి. పైగా ఈ మధ్య తెలుగు సీరియల్స్‌ని కూడా అమ్మ బాగానే చూస్తుంది. హనీనీ.. వాళ్లింట్లో వాళ్ళని బెదరగొట్టి కచడా..కచడా.. చెయ్యదు కదా అన్న సందేహం వచ్చింది. 'అదికాదమ్మా..' అంటూ ఉంటే.. 'వీడు ఇలాగే బుర్ర కరాబు చేస్తుంటాడు. నేను రెండు చెంబులు నీళ్లు పోసుకొని అరగంటలో రడీ అవుతాను. క్యాబ్ తెప్పించవయ్యా' చెప్పింది. అమ్మ ఐదో క్లాస్ వరకూ చదివినా నాలెడ్జ్ ఎక్కువే. చిన్నప్పుడు నాన్న నన్ను వీధిబడిలో వెయ్యాలనుకుంటే అమ్మ పట్టుబట్టి కాన్వెంట్‌లో వేసి చదివించింది. అరగంట గడిచింది. పాత సినిమాలో కన్నాంబలా రడీ అయ్యి బయటకొచ్చింది. చెప్పకుండా వెళితే హనీ ఎలా రిసీవ్ చేసుకుంటుందో అన్న టెన్షన్ నాకు. ఓలా క్యాబ్ పిలిపించాను. నా దగ్గర ఉన్న అడ్రస్‌ని డ్రాప్ లొకేషన్‌గా పెట్టా. 'అంతకు ముందు వెళ్లలేదా కోడలు పిల్ల ఇంటికి' అడిగాడు నాన్న. 'ఏవయ్యా.. నీకు దిమాక్ పని చేస్తుందా.. లేదా.. గీడు అసలు ఆపిల్ల ఫోటోనే చూడలేదని మొన్న నువ్వేగా చెప్పావ్' అంది. అమ్మకు జ్ఞాపకశక్తి

ఎక్కువే. 'నిజమే' అన్నాడు నాన్న. 'ఈ అడ్రసన్నా ఎలా పట్టావ్' అడిగింది. 'తన బయోడేటాలోని అడ్రస్ అమ్మా ఇది' చెప్పాను. 'ఫోటో లేదా.. గా బయోడేటాలో? అడిగింది. మా అమ్మ తెలివి సూపర్ అన్పించింది. 'బయోడేటాలో ఫొటో లేదేం?' అడిగాను ఒకసారి. 'జాబ్ ఇచ్చేది నా క్వాలిఫికేషన్ కా.. అందానికా' అంది. అప్పుడు నవ్వి ఊరుకొన్నా. గంట తర్వాత నానక్ రాం గూడాలో దిగాను. 'మీరు పెట్టిన లొకేషన్‌కి తెచ్చాను సాబ్' చెప్పాడు అతను. కారు దిగి నా దగ్గరున్న అడ్రస్లోని ఇంటి నెంబర్‌ని బట్టి ఆ ఇంటికి వెళ్లి తలుపు తట్టాను. డెబ్బై ఏళ్ళ వృద్ధుడు వచ్చి తలుపు తీశాడు. అతనికి పొడవాటి గడ్డం ఉంది. అది ఏపుగా పెరిగి ఉంది. 'ఏంటి వీడు ప్రేమించిన పిల్ల సాయిబుల పిల్లా..?' అడిగింది అమ్మ. 'ఏమో తెలీదు' అన్నాడు నాన్న. 'ఆప్ కౌన్ హై?' అడిగాడు ఆ వృద్ధుడు.

నేను అప్రయత్నంగా 'హనీ ఉందా?' అడిగాను. 'హనీ.. కౌన్ హనీ?' అన్నాడు. 'ఈ అడ్రస్‌లో నాకు తెలిసిన ఒక అమ్మాయి ఉంది. తనని కలవడానికి నేనూ మా పేరెంట్స్ వచ్చాం' అన్నాను వచ్చీ రాని హిందీలో. 'ఈ ఇంట్లో గత పదిహేనేళ్లుగా మేమే ఉన్నాం' చెప్పాడు ఆ ముసలాడు.

ఆయన వెంట పద్దెనిమిదేళ్ల వయసున్న ఒక అమ్మాయి వచ్చింది. విషయం చెప్పా.. 'ఆ అమ్మాయి ఫోటో ఏమైనా ఉంటే చూపండి. ఈ వీధిలో ఎక్కడైనా చూశానేమో చెబుతా' అంది ఆ పిల్ల. లేదని చెప్పాను. ఇంకో ముసలావిడ కూడా బయటకి వచ్చింది. నన్ను తేరిపారా చూసింది. ఆ చూపులో తృణీకారం కన్పించింది. నన్ను వాళ్లు చూసిన చూపుకి భూమిలోకి కూరుకుపోవాలన్పించింది. మా అమ్మకి నా మెడమీద కాలు వేసి చంపేయాలన్పిస్తుందేమో అన్పించింది ఆమె చూపుని చూస్తే.. 'అంధర్ అయీయే.. లోపలికి రండి' అని పిలిచింది ఆ పిల్ల. రెండు వాటర్ బాటిల్స్‌లో నీళ్లు తెచ్చి అమ్మ చేతికి నాన్న చేతికి ఇచ్చింది. 'నాకేం తాగాలని లేదులే' అంది అమ్మ. 'ఇది నా మనవరాలు.. ఆయేషా.. ఇక్కడే ఇంటర్ చదువుతుంది. నా కొడుకు, కోడలు దుబాయ్‌లో ఉన్నారు' చెప్పాడు ఆ ముసలాడు. హని ఇచ్చిన అడ్రస్ 'ఫేక్' అని అర్థమైంది. అమ్మకి నన్ను నమిలి మింగేయాలన్నంత కోపం వస్తుంది అని అర్థమైంది. 'ఇక బయల్దేరరా.. బద్మాష్' అంది నా వైపు తిరిగి. నా గదికి వచ్చాం. 'అదెవరో బేవకూఫ్.. వీడ్ని పాగల్‌గాణ్ణి చేసింది' అంది. మా అమ్మ హిందీ సీరియల్స్ కూడా బాగనే చూస్తుంది. అందుకే హిందీ పదాలు కూడా అలవోకగా వస్తున్నాయ్. బహుశా సాయిబుల ఇంటినుండి వచ్చిన ప్రభావం కూడా అయి ఉండవచ్చు. హనీకి ఫోన్ చేశాను. ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. 'సర్లే.. సెలవు పడేసి బయలుదేరు. ఇక్కడ నువ్వు కొలువు చేసింది చాలు' అంది అమ్మ. నాకెందుకో ఉక్రోషం వచ్చింది. 'నాకో ఇరవై

నాలుగు గంటలు టైమ్ ఇవ్వమ్మా' అన్నాను. 'కుదరదు' అంది. 'ఒకరోజు టైం అడుగుతున్నాడుకదా.. ఇవ్వవే' అన్నాడు నాన్న. ఆ సమయంలో నాన్న వరాలిచ్చే విష్ణుదేవుడిలా కన్పించాడు.

***

నన్ను పిలిచిన కంపెనీ అడ్రస్ పట్టుకొని బేగంపేట వెళ్ళాను. ఆ కంపెనీ మేనేజర్ విక్రమ్ అక్కడే ఉన్నాడు. ముందు హాల్లో జంటలు కూర్చొని ఉన్నారు. వాళ్లకెదురుగా కూర్చొని కొందరు అబ్బాయిలు అమ్మాయిలు ఏదో వివరిస్తున్నారు. హనీ చెప్పిన జంటలు.. అదే బకరాలు వాళ్ళే అని అర్థమైంది. నేను చెప్పింది అంతా విని 'ఇలా కంప్లైంట్స్‌తో రావడం మీరు నాలుగో వ్యక్తి. మా కష్టమర్ల ఫోన్ నెంబర్ తీసుకొని ఆ పిల్ల ఎవరో ట్రాప్ చేస్తుందని తెలుస్తుంది' అన్నాడు అతడు. 'మనమే మోసగాళ్ళం అనుకుంటే.. అది మనల్ని మించిన మోసగత్తె అని అర్థమవుతుంది' చెప్పాడు అక్కడే నా కంప్లైంట్ వింటున్న మరొక వ్యక్తి. 'మా మీద కంప్లైంట్స్ ఇప్పించి సొమ్ము చేసుకోవాలని చూసింది' చెప్పాడు విక్రమ్. నాకు కళ్ళు తిరిగినట్టు అన్పించింది. ఎక్కడో మిలటరీ సైనికుల్ని 'హనీ ట్రాప్' చేస్తారని తెలుసు కానీ ఇలా 'హనీ' అని ముద్దుగా పిలిచుకొన్న నా ప్రియురాలు ఇలా చేస్తుంది అనుకోలేదు. అవును 'హనీ' నన్ను ట్రాప్ చేసిందని నాకర్థం కావడానికి ఎక్కువసేపు పట్టలేదు.

***

# తటవర్తి నాగేశ్వరి

తటవర్తి నాగేశ్వరి స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లాలోని గౌరవరం గ్రామం. తల్లిదండ్రులు కావూరి వెంకట రవణమ్మ – కావూరి వెంకట సత్యనారాయణ. తెలుగు లిటచరేచర్ లో ఎం.ఎ. చేసిన నాగేశ్వరి, ఆంధ్రప్రదేశ్ వికాస బ్యాంక్ లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణలోని వివిధ శాఖల్లో పనిచేసి, బ్యాంక్ మేనేజర్ గా విరమణ పొందారు. సాహిత్యా భిలాషతో 2012 నుంచి కథలు రాయడం ప్రారంభించారు. వీరి మొదటి కథ 'తదనంతనం' ఆంధ్రజ్యోతి 'నవ్య' వీక్లీలో ప్రచు రితమైంది. వీటితోపాటు పలు దిన, వార, మాస పత్రికలు నిర్వహించిన కథల పోటీల్లో పాల్గొని, బహుమతులను గెలుచుకొన్నారు. వీరి మొదటి నవల 'మమజీవన హేతునా', 'స్వాతి' మాస పత్రికలో అనుబంధ నవలగా ప్రచురితమైంది. 'నవ్య' వీక్లీ, 'తురగా' ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన సీరియల్స్ రచనా పోటీలో వీరు రాసిన 'కల్కి' సీరియల్ తృతీయ బహుమతిని గెలుచుకొన్నది.

# వారసత్వం

గన్నవరపు నరసింహమూర్తి
7752020123

'**రా**నురాను మీనాన్నగారి ఛాదస్తం మీక్కూడా వంటబడుతున్నట్లుంది' అంది నీలాంబరి.

ఆ మాటలకు నేను ఉలిక్కిపడ్డాను. నేను మానాన్నగారిలా మారిపోతున్నానా? ఎప్పుడూ లేంది ఈరోజు నీలాంబరి ఎందుకు అలా మాట్లాడింది? నాప్రవర్తనలో ఏమైనా మార్పు వచ్చిందా? నాన్నగారిని ఊళ్ళోవాళ్ళంతా నాస్తికుడు అంటూ ఉండడం నేను చాలాసార్లు విన్నాను. ఆ మాటలకు నాకు కోపం వచ్చేది. నాకు మా నాన్నగారు ఎన్ని సూక్తులు, సుద్దులు చెప్పినా వినేవాడిని కాను. అపుడు నాన్నంటే కోపం కూడా వచ్చేది.

కానీ ఊళ్ళోవాళ్ళు నాన్నగారినంటే మాత్రం నాకు కోపం తారాస్థాయిలో వస్తుంది.

నాన్నగారు ఊరి మున్సబు, కరణంగా పనిచేసేవారు. మా కుటుంబానికి ఆ ఉద్యోగం వారసత్వంగా వస్తోందని నాన్నగారు ఎవ్వరితోనో చెబుతుంటే విన్నాను. వారసత్వం అంటే ఆరోజుల్లో నాకు తెలియదు. నాన్నని అడుగుదామని అనుకున్నా భయమపడి ఊరుకునేవాడిని. అమ్మని అడిగితే 'అంత పెద్దమాటలు నీకెందుకు' అని కసురుకునేది.

మా తాతగారు సూర్యనారాయణ. ఊళ్ళో అందరూ అతన్ని 'మడి రావన్న' అని అనేవారట! నాన్న తాతకి ఒక్కడే కొడుకు. అత్తలు మాత్రం ఆరుగురు. నాన్నకి పదిహేనేళ్ళ వయసప్పుడు మా మామ్మ చనిపోయిందిట. మా మామ్మ ఫోటోలేదు కాబట్టి ఆమె ఎలాగుంటుందో ఎవరికీ తెలియదు కానీ, ఆమె చాలా అందగత్తె అని ఊళ్ళోవాళ్ళు చెప్పుకునేవారట.

ఆమె చనిపోయేనాటికి మా తాత వయసు 35 సంవత్సరాలే.. అయినా ఆయన మళ్లీ పెళ్లి చేసుకోలేదు. పిల్లలకోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్పవ్యక్తి అని తాత గురించి అమ్మ చెబుతుండేది.

మా తాత చాలా నిజాయితీ పరుడని పాతతరం వాళ్ళు చెప్పేవారు. ఎప్పుడూ తడి బట్టలతో మడిగా ఉండేవాడట. ఎవర్నీ దగ్గరికి రానిచ్చేవాడు కాదట. ప్రతిరోజు దేవతార్చన చేసి, నైవేద్యం పెట్టి, తను తిన్న తరువాత పిల్లలకి పెట్టేవాడట.

నాన్నంటే తాతకి ఎనలేని ప్రాణం. మా తాత నాకు పదేళ్ళ వయసపుడు చనిపోయాడు.

నిజానికి ఆయన మనస్తత్వానికి గ్రామ కరణీకం వృత్తి సరిపోదు. అంతటి నిజాయితీ పరుడు. కానీ అప్పటి ప్రజలు కూడా అమాయకులు కాబట్టి అతని ఉద్యోగ ప్రస్తానం సుఖంగా సాగింది.

మా మామ్మ పోలిక వచ్చిందేమో కానీ నాన్న స్పురద్రూపి. ఆరడుగుల ఎత్తు, తెల్లగా ఆకర్షణీయయంగా ఉండేవాడు. మా నాన్నని మా తాత 'వెంకటరమణా' అని పిలవడం నాకింకా లీలామాత్రంగా గుర్తు.

ఇరవైఐదేళ్ళు నిండగానే తాత నాన్నకు కరణీకం వృత్తి ఇచ్చేసాడట. అప్పట్నుంచీ మా నాన్న జీవితం రామబాణంలా అప్రతిహతంగా ముందుకుసాగింది.

నా చిన్నప్పుడు మా గది గోడమీద తాత హార్మోనియం పెట్టె వాయిస్తూ తీయించుకున్న బ్లాక్ అండ్ వైట్ ఫోటో ఉండేది. మా తాతకి ఒక ట్రంక్ పెట్టె, రికార్డు వ్రాసుకోవడానికి డెస్క్ పెట్టె ఉ ండేవి. ఆ ట్రంక్ పెట్టెనిండా హరికథలు వ్రాసిన నోట్ పుస్తకాలు, వాటిలో సిరాతో వ్రాసే పొడవైన కలాలు ఉండేవి. రకరకాల రంగుల్లో ఉండే ఆ కలాలకు చివరన పాళిలుండేవి. వాటిని ఇంకులోముంచి వ్రాసేవారట. నేను అప్పుడప్పుడు ఆ పుస్తకాలను తిరగవేస్తూ ఉండేవాడిని. అందులో కాకినాడ, రాజమండ్రి హరికథలు చెప్పడానికి వెళ్ళినపుడు పెట్టిన జమాఖర్చుల వివరాలన్నీ అణా, బేడల్లో వ్రాసి ఉండేవి.

నాన్నకి ఇరవై ఒకటి వచ్చేసరికి మా అమ్మతో వివాహం జరిగింది. అమ్మ పేరు సీతాలక్ష్మీ, ఆమె తండ్రి స్టేషన్ మాస్టారు.

మా తాతగారు నాన్న పెళ్ళికి ముందే ఐదుగురు అత్తలకు పెళ్లి చేసారుట. ఆఖరి అత్తకి మాత్రం నాన్న తన పెళ్లి తరువాత వివాహం జరిపించాడు.

ఆడ దక్షతలేని ఇల్లు అనీ, పిల్ల కష్టపడిపోతుందోమోననీ మా తాతగారు మా అమ్మని నాన్నకిచ్చి పెళ్లిచెయ్యడానికి చాలా రోజులు తటపటాయించాడట.

ఏ వేళ అమ్మ మా ఇంట్లోకి కోడలిగా అడుగు పెట్టిందో కానీ అప్పట్నుంచీ మా ఇంటికి మళ్లీ మంచిరోజులు వచ్చాయనీ ఊరంతా చెప్పుకునేవారట.

మాకు పది హేనుకరాల పొలం ఉండేది. మొదట్లో నాన్న కష్టపడి వ్యవసాయం చేసేవాడు. పేదవారికి సహాయం చెయ్యడంలో ఎప్పుడూ ముందుండేవాడు. హరిజనులకు డి–పట్టా భూములిచ్చి మా వీధి వాళ్లందరితో శత్రుత్వం తెచ్చుకున్నాడు. మీ నాన్న బ్రాహ్మణులల్లో తప్ప పుట్టాడని మా చుట్టాలు తిడుతుంటే మానాన్న మీద నాకు విపరీతంగా కోపం వచ్చేది.

మాది ముప్పై ఇళ్ళ అగ్రహారం. తూర్పు వాహినిగా పారే వేగావతి ఒడ్డున ఉండేది. తెల్లవారితే చాలు బ్రాహ్మణవీధి అంతా ఏట్లోనే ఉండేది. స్త్రీలకు ప్రత్యేకంగా ఒకరేవు ఉండేది.

పండగలన్నీ ఎంతో సంబరంగా జరుపుకునేవాళ్ళం. నేను మాపక్క ఊరి హైస్కూల్లోనే పదివరకు చదువుకున్నాను.

వినాయకచవితికి మావీధిలో నవరాత్రులు జరిపేవాళ్ళు. తొమ్మిది రోజులు పూజలు, మావీధి వారందరికీ భోజనాలు, రాత్రి పూజలు, ఉదయం పురాణ కాలక్షేపం జరుగుతుండేవి.

కానీ మానాన్న మాత్రం ఒక్కసారి కూడా అటువేపు వచ్చేవాడు కాదు. అందరూ మానాన్నని కమ్యూనిస్టు అనీ, నాస్తికుడనీ, దేవుణ్ణి నమ్మడనీ విమర్శిస్తుండేవారు.

నాన్న అప్పట్లో ఎనిమిది వరకు చదివాడు.

కానీ మహా తెలివైనవాడు. మాఊరితో సహా చుట్టుపక్కల గ్రామాల్లోని భూముల వివరాలు మెట్ట పల్లాలతో సహా కంఠోపాఠం. ప్రతీ రైతు పేరు తెలుసు. వ్యక్తి మాత్రం చాలా సామాన్యంగా, సాదాసీదాగా ఉండేవాడు. చెప్పులు వేసుకునేవాడు కాదు. చొక్కా బయటకు వెళితేనే లేకపోతే తువ్వాలు వేసుకునేవాడు.

ఊళ్ళో ఏ తగువొచ్చినా మాఇంటికి రావలసిందే. ఒకసారి పంచాయితీ ఎన్నికలపుడు ఊళ్లోని రెండు వర్గాల మధ్య చాలా పెద్ద గొడవ జరిగి కర్రలతో కొట్టుకుంటున్నపుడు మానాన్నకి తెలిసి అక్కడికి వెళ్ళేసరికి అందరూ కర్రలను దించి మానాన్నకి దండాలు పెట్టారు.

మానాన్న బతికున్నంతవరకూ ఊళ్లోకి ఒక్క పోలీసు కూడా ప్రవేశించలేదు. ఏ పెళ్లిజరిగినా రైతువారంతా మా ఇంటికొచ్చి నాన్న ఆశీర్వాదాలు తీసుకునేవారు.

నాన్నంటే ఊరివాళ్ళందరికీ గొప్ప గౌరవం. దానికి కారణం ఆయన నిజాయితీ. ఆయన తీర్పులిచ్చినపుడు పక్షపాతం వహించేవాడుకాదు. అందుకే ప్రజలకి ఆయనంటే అంత గురి.

ఆయనకి పద్యనాటకాలంటే ఇష్టం. నాన్న నాస్తికుడు కాబట్టి పురాణాల గురించి తెలియదని అనుకునేవాణ్ణి. కానీ రామాయణ, భారత, భగవతాల్లోని చాలా పద్యాలు ఆయనకు కరతలామలోకం.

చాలా పద్యాలు ఆసువుగా పాడి వినిపించేవాడు.

పురాణాల్లోని ఎన్నో సందేహాలను అలవోకగా తీర్చేవాడు. మహా పండితులనీ చెప్పుకునే మాఊళ్లోని చాలామంది పెద్దలని అవే సందేహాలని అడిగినపుడు వాళ్లు కోప్పడటం లేదా మీనాన్నలాగే నువ్వు కూడా నాస్తికుడవనీ దెప్పిపొడిచి

తప్పించుకోవడం బట్టి వాళ్ళు పురాణాలను లోతుగా చదవలేదని నాకు అర్థమయ్యేది.

నాన్న ఎంత గొప్పవాడు కాకపోతే మేము బస్సులో వస్తున్నపుడు అప్పటికే సీట్లలో కూర్చున్న మాఊరి రైతులు మమ్మల్ని చూడగానే లేచి నిలబడి దండాలు పెడుతూ తమ సీట్లను మాకిచ్చేవారు. మిగతా ఇంకెవరి పిల్లలకు ఆ గౌరవం దక్కేది కాదు. ఆ గౌరవం నాన్న మున్సబుద్యోగం నుంచి రిటైరైన తరువాత కూడా కొనసాగింది.

ఇదీ మానాన్న చరిత్ర. గతించిన మధురగతం. అతని వ్యక్తిత్వాన్ని, మంచితనాన్ని, మానవాళిపట్ల ఉండే సమదృష్టిని చూసి పెరిగాం మా అన్నదమ్ములందరం.

ఆ ఉన్న కొద్దిపాటి ఆస్తితోనే మమ్మల్నిందర్ని కష్టపడి చదివించాడు. ఎవర్నీ మోసం చెయ్యలేదు. ఎవరి కడుపూ కొట్టలేదు. తామరాకు మీద నీటి బొట్టులా బతికాడు.

అతని వల్లే నాకు ఎవరినీ మోసం చెయ్యకూడదనీ, డబ్బుకోసం గడ్డి తినకూడదనీ తెలిసింది.

నేను ఇంజనీరింగ్ చదివి కేంద్ర ప్రభుత్వంలో ఇంజనీర్‌గా పెద్దస్థాయిలో స్థిరపడ్డాను. ఉద్యోగ ప్రస్థానంలో ఎన్నోసార్లు పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదించే అవకాశాలు వచ్చినపుడు మానాన్న గుర్తుకు వచ్చేవాడు. అంతే నా కాళ్లూ చేతులూ వణికేవి. ఒక్కనాడు కూడా అతను నీతులు చెప్పేవాడు కాదు.

కానీ పూదండలోని దారానికి పూలపరిమళం వచ్చినట్లు మాకు అతని వ్యక్తిత్వం అంతర్లీనంగా అబ్బింది.

జీవితంలో నిజాయితీగా ఉంటే ఇబ్బందులు వస్తాయి. అవి తాత్కాలికం కానీ తరువాత వచ్చే ఫలితాలు మనకు చెప్పలేని ఆనందాన్నిస్తాయి అని నా ఉద్యోగ జీవితం నాకు నేర్పింది.

నేను ఉద్యోగంలో చేరిన ఐదేళ్ళ తరువాత ఆయన చనిపోయారు. ఆయన ఉండగానే నా పెళ్లి, పిల్లలు.. ఉద్యోగం రావడం ఇలా నా ప్రస్థానం కొనసాగింది.

పిల్లలు చదువుల కోసం ఎన్నోసార్లు బదిలీల వల్ల ఎలా ప్రవర్తిస్తున్నారో, ఎలా చదువుతున్నారో పరిశీలించే అవకాశం దొరకలేదు.

మిగతా ఆఫీసర్ల పిల్లలు బాగా చదువుకుంటున్నారనే వార్తలు వింటున్నపుడు మాత్రం మా పిల్లలు గురొచ్చి భయంవేసేది. నేను వాళ్ళకోసం ఏమీ చెయ్యలేక పోతున్నాననే బాధ వెంటాడుతుండేది. నాతరం అంటే వేరు. అప్పుడన్నీ పల్లె జీవితాలు, పేద బ్రతుకులు.. చదువు ఎలాగోలా పూర్తి చేస్తే చాలనుకున్న తరం.

కానీ ఇపుడలా కాదు. అన్ని సదుపాయాలు వచ్చాయి. డబ్బుకి కొదవలేదు. ఇప్పుడు మన పిల్లల చదువుల్ని, జీవితాన్ని శాసించే అవకాశం ఉంది. డబ్బుతో ఏదైనా చెయ్యవచ్చు. చాలామంది తమ డబ్బుతో, పలుకుబడితో మనల్ని దాటి

ముందుకెళ్లిపోవడం చూస్తునే ఉన్నాను. అన్నింటికీ ఆ దేవుడే ఉన్నాడన్న ఆలోచన ఇప్పుడు పనికిరాదు.

ఒకరోజు నేను ఆఫీసులో ఉండగా నా శ్రీమతి ఫోన్ చేసి, అబ్బాయికి పదవతరగతిలో మంచి ర్యాంకు వచ్చిందని చెప్పేసరికి నమ్మలేకపోయాను. వాడు ఆరులోకి వచ్చిన దగ్గర్నుంచీ పదవతరగతి దాకా ఎలా చదువుతున్నాడో, వాడి తెలివితేటలేమిటో తెలుసుకునే అవకాశం దొరకలేదు నాకు. వాడు ఇంటర్‌లో కూడా రాష్ట్రంలో ర్యాంకు తెచ్చుకున్నాడు.

ఆ తరువాత వాడు బిట్స్ పిలానీలో ఇంజనీరింగ్ చదివాడు. తరువాత కేంద్ర ప్రభుత్వ సంస్థలో గ్రూప్–ఏ ఆఫీసర్‌గా ఉద్యోగం వచ్చింది. పెళ్లి.. పిల్లలు ఇలా ఓ పది సంవత్సరాల్లో అన్నీ జరిగిపోయాయి.

వాడు బాగా చదివి మంచి ఉద్యోగంలో చేరినా వాడికి నా లక్షణాలేవీ అలవడలేదని నాకనిపించింది. నేను ఎక్కువగా ఉద్యోగ విషయంలో తిరగడం వల్ల వాడిమీద నా ప్రభావం పెద్దగా పడలేదు. అదీకాక నేటి చదువుల విధానం. ఎంతసేపూ రాత్రీపగలు పుస్తకాలతో యుద్ధం, ప్రైవేట్ క్లాసులు, ప్రతీ ఆదివారాలు పరీక్షలు.. ఇలాగే చదవడం వల్ల వాడికి నాలా పురాణాలు, చరిత్ర, ఆంత్రోపాలజీ, ఇంగ్లీషు సాహిత్యం లాంటి పుస్తకాలు చదివే అవకాశం దొరకలేదు.

**‘మీకు ఈ పచ్చడి చాలా ఇష్టమనీ, కారం చాలకపోతే అత్తగారిని కోప్పడేవారనీ చెబుతుంటారు. ఆయనకీ ఈ పచ్చడి చాలా ఇష్టం. కారం తక్కువైతే పచ్చిమిరపకాయలు కలుపుకుంటారు. ఆదివారం వస్తే చాలు మానాన్నగారి పచ్చడి చెయ్యి అంటారు. అలాగే మీకిష్టమైన చేదుకాకర వేపుడు, కొబ్బరి పచ్చడి, తోటకూర పులుసు, తియ్యగుమ్మడి వడియాలు, అప్పడాలు నాక్కూడా ఇవే అలవాటు ఇవే తింటాను.’ అని ఆమె చెబుతుంటే ఏం చెప్పాలో అర్థం కాలేదు.**

వాడి వయసు వచ్చేసరికి నేను మానాన్న గారి బీరువాలో ఉండే పుస్తకాలన్నీ కంఠతా పెట్టేసాను. అవన్నీ మాతాత పుస్తకాలు. వాటినన్నింటినీ మానాన్న చదివేడనీ ఆ పస్తకాల్లో మానాన్న స్వదస్తూరీతో వ్రాసిన వాక్యాల వల్ల తెలుసుకున్నాను.

పుస్తకాలు ప్రపంచాన్ని చూపించే గవాక్షాలు అని చదివాను. కానీ ఆ గవాక్షాలు నా కొడుక్కి లేవని తెలిసి బాధపడుతుండేవాడిని.

తండ్రిని చూస్తూ పెరగడం, తండ్రి లక్షణాలు పుణికిపుచ్చుకోవడం అన్నది ఓ వరం. మనిషిని క్రమమైన మార్గంలో పెట్టి ఉత్తముడిగా తయారవటానికి అవి పనికొస్తాయి,

కానీ ఈతరం పిల్లల ఆలోచనాధోరణులు వేరు. తల్లితండ్రుల గురించి పెద్దగా ఆలోచించటం లేదు. ఏదో డబ్బు పంపిస్తే చాలని భావిస్తున్నారు. వృద్ధాప్యంలో వానప్రస్త సమయంలో తల్లితండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలన్నది ఈతరం నేర్చుకోలేదు. వీళ్ళమీద పడమటి దేశాల ప్రభావం బాగా ఉంది.

నామీద మానాన్న ప్రభావం ఉందని మొన్నటిదాకా నాకూ తెలీదు. ఈ మధ్యనే నా శ్రీమతి నీలాంబరి మీరు కూడా రానురాను మామగార్లా తయారవుతున్నారు. బుద్ధుల్లోనే కాదు రూపులోనూ మీకూ ఆయన బుద్ధులు వచ్చేస్తున్నాయని అప్పుడప్పుడు అంటూ ఉండటంతో నాలో అంతర్మథనం మొదలైంది.

***

ఆమధ్య నేను మావాడింటికి వెళ్లాను. మాకోడలు కూడా ఉద్యోగస్థురాలే. మనవరాళ్లిద్దరూ చాలా చెలాకైనవాళ్ళు.

వాడు ఆఫీసుకి వెళ్లిన తరువాత ఒకరోజు కోడలు కౌముది నాకు వంకాయ పులుసుపచ్చడి వడ్డించింది. అది చాలా కారంగా ఉంది. 'ఇంత కారం వాడు తినడు కదమ్మా..?' అని అడిగాను.

'మీకు ఈ పచ్చడి చాలా ఇష్టమనీ, కారం చాలకపోతే అత్తగారిని కోప్పడేవారనీ చెబుతుంటారు. ఆయనకీ ఈ పచ్చడి చాలా ఇష్టం. కారం తక్కువైతే పచ్చిమిరపకాయలు కలుపుకుంటారు. ఆదివారం వస్తే చాలు మానాన్నగారి పచ్చడి చెయ్యి అంటారు. అలాగే మీకిష్టమైన చేదుకాకర వేపుడు, కొబ్బరి పచ్చడి, తోటకూర పులుసు, తియ్యగుమ్మడి వడియాలు, అప్పడాలు నాక్కూడా ఇవే అలవాటు ఇవే తింటాను.' అని ఆమె చెబుతుంటే ఏం చెప్పాలో అర్థం కాలేదు.

భోజనాల తరువాత వాడి డ్రాయింగ్ రూమ్ని పరిశీలించాను. ఎదురుగా ఉండే షెల్ఫ్ నిండా పుస్తకాలు.. తలుపు తీసి చూడగానే నాకు మతిపోయింది.

వాల్మీకి రామాయణం, పోతన భాగవతం, మహాభారతంలోని అన్ని పర్వాలు.... ఆ పుస్తకాలను తిరగవేస్తే వాటినిండా పెన్సిల్తో అండర్లైన్లు చేసి వాటికి అర్థాలు రాయబడి ఉన్నాయి. అంటే వాడు వాటిని ఎంతో లోతుగా అధ్యయనం చేస్తున్నట్లు తెలుస్తుంది. వాటికి తోడు ఇంగ్లీషు సాహిత్యం, ఛార్లెస్ డికెన్స్, ఓ హెన్రీ, ఆస్కార్ వైల్డ్ ఎర్నెస్ట్ హెమింగ్వేల పుస్తకాలు, ఆధునిక తెలుగు సాహిత్యం వేయి పడగలు, మహాప్రస్థానం, కన్యాశుల్కం, అమృతం కురిసినరాత్రి.. ఇలా ఎన్నో.

ఈ పుస్తకాలన్నీ నేను చదివినవే.. నేను తిన్నవీ, నేను చదివినవీ వీడికెలా తెలుసు

అనీ ఆశ్చర్యపోయాను.

రెండు నెలలు తరువాత ఇంటికి తిరిగి వచ్చేసాను.

ఆ వేసవికి మావాడు, కోడలు, మనవలు మాఊరు వచ్చారు. నేనే వాడిని శలవు పెట్టుకొని రమ్మని చెప్పాను. అక్కడ బాగా ఎండలు కాస్తుండటంతో పల్లె అయితే చల్లగా ఉంటుందని వచ్చారు.

వచ్చిందగ్గర్నుంచి మావాడు ఇంట్లో ఉంటే సరి. రోజు ఉదయం, సాయంత్రం పిల్లలతో ఏటికి స్నానానికి వెళ్లి గంటలతరబడి స్నానం చేయడం, ఆ తరువాత పొలానికి వెళ్లటం, రైతులతో కలిసి పొలానికి నీరు పెట్టటం.. ఇలా క్షణం తీరుబడి లేకుండా ఉండేవాడు.

ఒకరోజు ఉదయాన్నే నేను పేపరు చదువుతుండగా వాడు వచ్చి 'నాన్నగారూ, మన రైతు సన్యాసి చాలా రోజులనుంచీ మన పొలాన్ని చేస్తున్నాడు కదా. ముప్పై ఏళ్ళ నుంచీ చేస్తున్నా వాడు ఒక్క రూపాయి కూడా వెనకేసుకోలేకపోయాడు. వాడి పిల్లలు చదువుకుంటున్నారు. పెళ్లిళ్లు కూడా చెయ్యాలి. చెరువుకి దూరంగా ఉన్న మెట్టు పొలం రెండెకరాలు వాడికిచ్చేస్తే వాడి అవసరాలకు ఉపయోగపడుతుంది. ఆ పొలం వల్ల మనకేమీ పెద్ద ఉపయోగం లేదు' అన్నాడు.

వాడి మాటలు నాకు ఆశ్చర్యం కలిగించాయి. ఇన్నాళ్ల నుంచీ నాకు రాని ఆలోచన అది. 'పరోపకారార్థం మిదం' శరీరం అని మానాన్న తరుచూ అందరితో చెబుతుండేవాడు. అవే ఆలోచనలు.. పేదలకు మంచి చేయాలన్నది నాకు మానాన్నను చూసే కలిగింది. మరిపుడు నాకొడుక్కి ఎలా వచ్చింది? ఈ పరిణామ క్రమం ఎలా వచ్చింది?

రెండు రోజుల తరువాత వాడు కోడలితో కలిసి విశాఖపట్నం వెళ్లాడు. ఆ మర్నాడు మాఇంటి ముందర వ్యాన్ ఆగింది. దాన్నిండా వందల టెక్ట్స్ బుక్స్, నోట్ బుక్స్, కంప్యూటర్లు, టీవీలు, ఏంటెన్నాలు..

'నాన్న గారూ.. మన స్కూలుకి మొన్న వెళ్లాను. అక్కడ వాళ్లకు కూర్చునేందుకు బల్లలుగానీ, తాగడానికి సరియైన నీరుగానీ, బాత్ రూములు గానీ లేవు. అందుకే ఇవన్నీ తెచ్చాను. ఈరోజు నుంచీ పనులు ప్రారంభిస్తారు. మన కుటుంబం తరుపున పదిలక్షలిచ్చి వాటిని కట్టిస్తున్నాను. అదీ కాకుండా మన ఊరికి గ్రంథాలయం లేదు. గ్రంథాలయం ఉంటే యువత చెడిపోదు. మన రెండో ఇల్లు ఖాళీగా పడి ఉంది కదా.. దాన్ని గ్రంథాలయంగా మార్చుదామనకుంటున్నాను. అందుకే మొదటి ప్రయత్నంగా రెండువేల పుస్తకాలు కొన్నాను. మీకిష్టమే కదా?' అని వాడు నన్నుడుగుతుంటే ఏం చెప్పాలో తెలియని స్థితిలో నేను.. నా కళ్లల్లో చెమ్మగిల్లిన నీరు.. చిన్నపుడు చదివిన

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 258

పద్యం.. 'జనులాపుత్రుని కనుగొని పొగిడిన పుత్రోత్సాహము కలుగు' గుర్తుకొస్తుంది.

మనింట్లో ఉన్న పుస్తకాలు కూడా చెదలుపట్టి పాడైపోతున్నాయి. వాటిని కూడా గ్రంథాలయానికి ఇచ్చేయండి. వేలమంది సాధించలేనిది ఒక పుస్తకం సాధిస్తుంది.' అని చెప్పి వెళ్ళిపోయాడు.

మరోవారం తరువాత ఒకరోజు సబ్ కలెక్టర్, తహసీల్దార్ మాఇంటికి వచ్చారు.

'నాన్నగారూ.. ఇతను గిరిధర్. ఇంజనీరింగ్‌లో నా క్లాస్‌మేట్ ప్రస్తుతం మన సబ్–కలెక్టర్. చాలా రోజులనుంచి మన ఊరికి మంచి నీటి పథకం గురించి చెబుతూవచ్చాను. ఇప్పుడది మంజూరైంది. ఒక వాటర్ ట్యాంక్, ప్రతి ఇంటికి కుళాయి మంజూరు చెయ్యబడ్డాయి. ఐదారు నెలల్లో ఈ పనులు పూర్తవుతాయి' అని చెప్పాడు.

ఇప్పుడు మాఊరివాళ్ళంతా మావాడి గురించి చెప్పుకుంటున్నారు. వాడు వెళ్లిపోయిన రోజున వందలమంది మాఇంటికి వచ్చి 'బాబూ.. అబ్బాయిగోరు ఊరికి ఎంతో మంచి చేసారు.' అని చెప్పడం నాకమితానందాన్ని కలిగించింది.

మావూరి సర్పంచ్ నాయుడైతే 'తమరి కుటుంబానికిది అలవాటే. తమరి నాన్నగారి నుంచి అబ్బాయిదాకా.. ఊరికోసమే బతికింది మీ కుటుంబం. అబ్బాయికన్నీ తమరి బుద్ధులే.' అన్నాడు.

ఆ మాట చాలు.. నా కడుపు నిండిపోయింది. ఇన్నాళ్ళు మా అబ్బాయి గురించిన నా ఆలోచనలు తప్పని ఋజువయింది. వాడు ఈతరానికి చెందినవాడైనా ఆలోచనలన్నీ మంచివే. మనిషి ఏతరంవాడైనా, కాలాలు మారినా మంచి చెయ్యాలన్న దృక్పథం మారదు. కుటుంబ పెద్దల అడుగుజాడల్లోనే పిల్లలు నడుస్తారనీ, తల్లితండ్రుల నడవడి వారికి వారసత్వంగా వస్తుందనడానికి మావాడే సజీవ సాక్ష్యం .

తండ్రి నుంచి మనద్వారా కొడుకు వైపు ఈ వారసత్వ ప్రస్థానం కొనసాగుతూనే ఉంటుంది. ఇది తరం తరం.. నిరంతరం.. కాలచక్రం భ్రమణశీలి.. అది నిత్యం చలిస్తూనే ఉంటుంది.


## గన్నవరపు నరసింహమూర్తి

నరసింహమూర్తి విజయనగరం జిల్లా కుసుమూరు అగ్రహారంలో పుట్టారు. సివిల్ ఇంజనీరింగ్ లో ఎమ్ టెక్ చదివారు. ప్రస్తుతం రైల్వే లో పని చేస్తున్నారు. భార్య శకుంతల. ఇద్దరు పిల్లలు శ్రీనివాస్, శ్రీకీర్తన. ఇప్పటి వరకు 10 నవలలు, 370 కథలు, ఆంగ్లంలో రైల్వే ఇంజనీర్ల కోసం ఒక పుస్తకం, పత్రికల్లో కొన్ని వ్యాసాలు రాశారు. ఇప్పటి వరకు గంధం చెట్టు, తూర్పు పడమర, ఉడుతాభక్తి, గాలివాన, వీణావేదనం, గమ్యం అన్న కథా సంపుటాలు, మట్టిమనుషులు, అగ్నిపథం నవలలు వెలువరించారు.

# పునరాగమనం

**డాక్టర్ రాయపెద్ది వివేకానంద్,**
**92463 71893**

'వాట్! ఫ్రాన్సిస్ విజయ్ కుమార్ చనిపోయారా?'

అని ఉద్వేగంగా కేక పెట్టాడు రఘుపతి.

అతని కంఠంలొ దుఃఖం సుడులు తిరుగుతోంది. దేశంలొ మొదటి అయిదు మంది బిలియనీర్లలో ఒకడైన రఘుపతి ఉద్వేగాన్ని ఆపుకోలేక పసి పిల్లాడిలా దుఃఖించాడు.

అదీ కాసేపే. వెంటనే తేరుకున్నాడు.

అప్పుడు రాత్రి పదకొండు అయి ఉంటుంది. ఎకాఎకిన తన అపాయింట్ మెంట్స్ అన్నీ నిరవధికంగా రద్దు చేసేసి జమ్మలమడుగుకు బయలుదేరాడు.

* * *

సమయం రాత్రి రెండు దాటింది.

'ఇంకాస్త వేగంగా నడపవచ్చు కద, ఇంకా ఎంతసేపు పట్టవచ్చు?' వెనుక సీట్లో నుంచి రఘుపతి తొందరించాడు.

'సర్! మనం తెల్లవారి అయిందిటిలోపల ఖచ్చితంగా చేరుకుంటాము సర్' వేగంగా నడుపుతూనే వినయంగా సమాధానం చెప్పాడు డ్రైవర్. హైదరాబాద్ నుంచి కర్నూలు రెండే రెండు గంటల్లో దాటేశారు అప్పటికే.

జమ్మలమడుగు దిశగా చిమ్మచీకట్లో మెర్సిడీస్ బెంజ్ కార్ గంటకు దాదాపు నూటాయాభై కిలోమీటర్ల వేగంతో వెళుతోంది. కారు దీపాల వెలుగు ప్రసరించిన మేరా తప్పనిచ్చి ఎటు చూసినా కాటుక పులిమినట్టు చిక్కటి చీకటి ఆవరించి ఉంది.

చాలా ఏకాగ్రతగా నడుపుతున్నాడు డ్రైవర్.

డ్రైవర్ పక్కసీట్లో కూర్చుని ఉన్న విక్రంకి ఆశ్చర్యంగా ఉంది తమ యజమాని ప్రవర్తన.

'ఎప్పుడూ నెమ్మదిగా వెళ్ళమని, వేగం వద్దని' హెచ్చరించే ఆయన ఇవ్వాళ ఇలా తొందరించటం విక్రంకి చాలా ఆశ్చర్యంగా ఉంది.

విక్రం రఘుపతికి వ్యక్తగత సహాయకుడు (సెక్రటరీ). దాదాపు పదిహేను

సంవత్సరాల నుంచి రఘుపతి దగ్గర నమ్మకంగా పని చేస్తున్నాడు.

రఘుపతి దేశం గర్వించదగ్గ బిలియనీర్లలో ఒకరు. దేశంలోని మొదటి అయిదు మంది బిలియనీర్ల జాబితాలో అతని స్థానం గత పది సంవత్సరాలుగా పదిలంగా ఉంటూ వస్తోంది.

అతను అడుగుపెట్టని రంగం లేదని చెప్పవచ్చు. హోటల్స్, ఔషధరంగం, భవననిర్మాణం, ఇన్ఫ్రా, సాఫ్ట్ వేర్, విద్యారంగం – ప్రతి రంగంలో విలువతో కూడిన తనదైన ముద్ర వేస్తూ తన ప్రత్యేకత నిలబెట్టుకుంటూ వస్తున్నాడు. ఆయన కంపెనీ తాలూకూ షేర్లు దగ్గర ఉన్నాయి అంటే భరోసాగా నిద్రించవచ్చు ఎవ్వరైనా.

విలువల విషయంలో రాజీపడకుండా, విశ్వసనీయతకు పెద్దపీట వేస్తూ అతడు చాలా మంచి పేరే తెచ్చుకున్నాడు. అతన్ని కలిసి ముచ్చటించటానికి, ప్రధాన మంత్రి, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎదురుచూస్తూ ఉంటారు. అతన్ని ఇంటర్వ్యూ చేయటానికి దేశవిదేశ మీడియా హవుస్‌లు అన్నీ ఉవ్విళ్ళూరుతుంటాయి.

ప్రతి పని ఎంతో ప్రణాళికాబద్ధంగా జరిగిపోతూ ఉంటుంది రఘుపతి విషయంలో. అలాంటిది, రాత్రికి రాత్రి అన్ని అపాయింట్ మెంట్లూ నిరవధికంగా రద్దు చేసుకుని, జమ్మలమడుగుకు ఈ ప్రయాణం పెట్టుకున్నారు.

విక్రం అసలీ జమ్మలమడుగు అన్న ఊరిపేరే మొదటి సారి వింటున్నాడు. ఆ రోజు రాత్రి దాదాపు పదకొండు గంటలప్పుడు ఎవరో ఫోన్ చేశారు, రఘుపతి వ్యక్తిగత నెంబర్ కి.

ఆ కాల్‌ని అందుకుని, 'వాట్! ఫ్రాన్సిస్ విజయ్ కుమార్ చనిపోయారా?' అని ఉద్వేగంగా కేక పెట్టాడు రఘుపతి.

అంతే ఆ తరువాత పరిణామాలన్నీ చకచకా జరిగిపోయాయి. అపాయింట్ మెంట్లన్నీ రద్దు చేసుకోవటం, డ్రైవర్ ని పురమాయించి ప్రయాణానికి సిద్ధం కావటం ఇవన్నీ కేవలం ఒక అర గంటలో జరిగి పోయాయి.

వాతావరణం అనుమతించని కారణంగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వారు హెలికాప్టర్ ప్రయాణానికి అనుమతి ఇవ్వలేదు. అందుకే ఆయన కార్లో జమ్మలమడుగుకు బయలుదేరారు.

'సర్ కాస్తా హార్లిక్స్ గానీ, టీ గానీ తీసుకుంటారా తన వద్ద ఉన్న ఫ్లాస్క్ ని చేతిలోకి తీసుకుంటూ అడిగాడు విక్రం.

'వద్ద' న్నట్టు తలూపాడు రఘుపతి. తన పదిహేను సంవత్సరాల సర్వీసు లో తన యజమానిని ఇంత ఉద్విగ్నంగా చూడటం ఇదే మొదటి సారి విక్రంకి.

రఘుపతి వయసు నలభై ఎనిమిదికి అటు ఇటుగా ఉంటుంది.

ఎప్పుడో పాతిక సంవత్సరాల క్రితం ఫ్రాన్సిస్ విజయ్ కుమార్ విజయ్ కుమార్

ఆతని జీవితంలోకి రాకుంటే ఆతని జీవితం ఎలా ఉండి ఉండేదో.

ఆయన చూపిన మార్గ దర్శనం, ఇచ్చిన భరోసా కారణంగా తను డిప్రెషన్ అన్న పెను భూతాన్ని వదిలించుకుని ఈ వేళ దేశం గర్వించదగ్గ ఒక ప్రముఖ వ్యాపార వేత్తగా ఎదగగలిగాడు.

ఆ తర్వాత ఫ్రాన్సిస్ విజయకుమార్ ని చూడటానికి వీలే కాలేదు. ఆయన చిరునామా కూడా దొరకలేదు. ఎంత ప్రయత్నించినా ఆయన ఎక్కడున్నాడో కూడా తెలుసుకోలేకపోయాడు.

కేవలం తన జీవితాన్ని మార్చే దానికి ఆయన ఒక దేవదూతలాగా తనజీవితంలోకి వచ్చాడేమో.

ఇవ్వాళ ఆయన చిరునామా తన దగ్గర ఉంది. ఆయన్ని కలవటానికే తను ఇప్పుడు వెళుతున్నాడు. కానీ ఆయన్ని మాట్లాడించలేడు. కేవలం ఆయన్ని విగత జీవుడిగా చూడగలడు అంతే.

రాత్రి ఫోన్ చేసి ఎవరో, ఫ్రాన్సిస్ విజయ్ కుమార్ ఫోన్ నెంబర్, చిరునామా చెప్పినప్పుడు ఎగిరి గంతేసి ఆయన్ని కలవాలి అని అనుకునేటంతలోనే, ఆయన చనిపోయారని కూడా చల్లగా చెప్పారు. చావు కబురు చల్లగా చెప్పటం అంటే అదేనేమో.

ఎన్ని ఏండ్ల అన్వేషణ ఇది. ఇప్పుడు ఫలించింది. కానీ ఏమి లాభం?

లాభనష్టాలు ఆలోచించాల్సిన సమయం కాదిది. అందుకే తక్షణం బయలు దేరాడు జమ్మలమడుక్కి.

శాటిలైట్ జీపీఎస్ సిగ్నల్స్ ని అనుసరిస్తూ హైవే పై నుంచి బనగానపల్లి వైపు కారు మలుపు తీశాడు డ్రైవర్.

రోడ్డు ఏమాత్రం బాగాలేదుబీ అయినా వింటి నుంచి సంధించిన బాణం లాగా దూసుకుపోతోంది కారు.

అంతకన్నా వేగంగా రఘుపతి ఆలోచనలు గతంలోకి పరుగులు తీశాయి.

అప్పటికి రఘుపతి వయస్సు ఇరవై ఒక్క సంవత్సరాలు .

అప్పటి రఘుపతి సామాన్యుడు. సామాన్యులలోకెల్లా సామాన్యుడు. పాదాలకు హవాయి చెప్పులు ధరించి సాదాసీదా దుస్తులలో, చెప్పుకోడానికి ఏదయినా ఉంది అంటే అత్తెసరు మార్కులతో పాసయిన బీ,కాం డిగ్రీతో భవిష్యత్ వంక ఆశగా చూసేవాడు. దూరదర్శన్ మినహా దేశం కూడా సాధించిన ప్రగతేం లేదు ఆ కాలానికి.

సాఫ్ట్‌వేర్లు, కేబుల్ టీవీలు, సెల్ ఫోన్లు, మెట్రో రైళ్ళూ, ఇంటర్ నెట్ ఇటువంటి పదజాలం కూడా తెలియని రోజులు. ' సినిమా స్కోప్ – కలర్' అని ప్రత్యేకంగా

సినిమా టైటిల్ చివర వేసుకుంటున్న రోజులు అవి.

పద్దెనిమిదో ఏట ప్రేమలో పడకున్నా, ఇరవయ్యో ఏట కమ్యూనిజం పట్ల మొగ్గ చూపకున్నా నీకు హృదయం లేదు అని అర్థం అని ఎవరో మేధావి చెప్పిన ప్రకారం, తనకు హృదయం ఉందని రఘుపతి తన పద్దెనిమిదో ఏట నిరూపించుకున్నాడు అప్పటికే. కానీ తన ప్రేమ వల్ల అతను అశాంతినే పొందాడు. భగ్నమయిన హృదయం, దానికి తోడు వామపక్ష భావజాలంతో నిండిన సాహిత్యం అతని అశాంతి అనే అగ్నికి ఆజ్యం పోసేది.

చివరికి శ్రీశ్రీ 'సంధ్యా సమస్యలు' లో చివరి వాక్యంలా తయారయింది అతడి పరిస్థితి. ఆత్మహత్య కి ఏది సరి అయిన దారి అనే దిశగా సాగుతున్నాయి అతడి ఆలోచనలు.

అలాంటి పరిస్థితిలో అతనికి తారస పడ్డాడు ఫ్రాన్సిస్ విజయ్ కుమార్.

క్యాంటిన్ లో నెలకొని ఉన్న రణగొణ ధ్వనులను అన్నిటిని అధిగమిస్తూ సుస్పష్టమైన ఒక స్వరం అతని చెవులను చేరుతోంది. తన వెనుక టేబుల్ వద్ద నుంచి వినిపిస్తున్న ఆ మాటల్ని తనకు అన్వయించుకుని ఒక్క సారిగ ఏదో కుదుపు వచ్చినట్టు నిలువెల్లా కదిలిపోయాడు రఘుపతి

'నువ్వు డిప్రెషన్ లో ఉన్నావు అంటే నీ ఆలోచనలు గతం తాలూకు ఊబిలో కూరుకుపోయి ఉన్నాయి అని అర్థం.

నువ్వు ఆందోళనలో ఉన్నావు అంటే నీ ఆలోచనలు భవిష్యత్ ముఖచిత్రాన్ని భయం కోణంలొ చూస్తూ ఉన్నాయి అని అర్థం. అలాకాకుండా ప్రశాంతంగా,ఆనందంగా, ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తూ ఉల్లాసంగా ఉన్నావు అంటే నీవు జీవితాన్ని సరయిన విధంగా జివిస్తున్నావు అని అర్థం. దీన్నేవర్తమానంలో జివించటం అంటారు'

ఎవరినొ ఉద్దేశించి, ఎవరో అపరిచితుడు చెప్పిన ఆ వాక్యాలు రఘుపతిపై గాఢమైన ప్రభావాన్నే చూపాయి. ఆయన్ని ఇంతకూ సరిగ్గా చూడలేక పోయాడు ఆ రద్దీలో. కానీ ఆ రూపం చూచాయగా గుర్తు పెట్టుకున్నాడు రఘు.

ఆ మాటల ప్రభావం వల్ల అతని జీవితంలో ఎకాఎకిన పెను మార్పులు సంభవించాయి అని చెప్పలేం కాని, తన ఆలోచనల్ని తనే ఒక సాక్షిగా గమనించడం ప్రారంభించాడు ఆ రోజు నుంచి. ఆ చర్య వల్ల అతని ఆలోచనలు ఒక సకారాత్మక మలుపు ఖచ్చితంగా తిరిగాయి ఆ రోజు నుంచి.

మరి కొన్ని రోజుల తరువాత అంతే ఆశ్చర్యకరమైన పరిస్థితిలో ఆయనని కలిశాడు రఘుపతి, ప్రాప్తంబు గలచోట ఫలమేల దప్పురా అని అననే అన్నారు కద పెద్దలు.

దేవుని కడపలో వేంకటేశ్వర స్వామి గుడిలో ఉత్సవాలు జరుగుతుంటే వెళ్ళాడు రఘు. స్పీకర్లలోంచి అన్నమయ్య కీర్తనలు అద్భుతంగా వినిపిస్తున్నాయి.

గుడిలోని వేదిక పై నుంచి అద్భుతంగా ఆలపిస్తున్నారు ఎవరో. 'అహా ఇది దేవగానం. ఇలాంటి స్వరం దైవదత్తం. ఈ అమృతస్వరం ఉన్న వ్యక్తిని దగ్గర నుంచి చూడాలి అని అర్చన, తీర్థ ప్రసాదాలు, శఠగోపం అనంతరం కచేరి వైపు దారి తీశాడు రఘు.

ఆశ్చర్యపోవటం తిరిగి రఘు వంతయింది. ఆ అమృతస్వరం ఎవరిదో కాదు, హెూటల్లో తన మాటలతో తనపై తెలియకుండానే తీవ్రప్రభావాన్ని చూపాడో ఆ వ్యక్తి స్వరమే అది. ఆ వ్యక్తే మైకు ముందు కూర్చుని కమ్మగా పాడుతున్నాడు.

అప్పటికి ఆయన పేరు తెలియదు రఘుకు.

తనకు వాద్య సహకారం అందిస్తున్న కళాకారులందరికీ తన చూపులు హావభావాలతో కొత్త శక్తిని అందిస్తూ, తంబురా శృతికి అనుగుణంగా స్వరాలని పలికిస్తూ మూడు గంటలసేపు శ్రోతలను రంజింప జేస్తూ అందర్నీ ఏదో లోకాలకు తీసుకు వెళ్ళాడు.

మూడు గంటలు మూడు క్షణాలలాగా గడిచిపోయాయి. చివర్లో సవినయంగా చేతులు జోడించి సభికులందరికి నమస్కరించి సభ ముగించాడు.

ఆ తర్వాత ఆయనకు జరిగిన సన్మానం సందర్భంగా నిర్వాహకులు ఇచ్చిన ఉపన్యాసంలో ఆయన పేరుతెలిసింది. మరొక్కసారి ఉలిక్కి పడి ఆశ్చర్యపోవాల్సి రావటం రఘు వంతయ్యింది. ఆయన పేరు ఫ్రాన్సిస్ విజయ్ కుమార్.

' ఓ మైగాడ్! ఈయన క్రిష్టియనా?' ప్రేక్షకులలోని చాలా మందిలా రఘు కూడా ఆశ్చర్యపోయాడు.

ఆయన ఒక బ్యాంక్ ఆఫీసరని ఆయన ఇల్లు తమ ఇంటికి దగ్గరే అని తెలిసింది. ఆయనింటికి వెళ్ళి తనని తాను పరిచయం చేసుకున్నాడు మరుసటి రోజు.

అది ఒక పొదరిల్లు అని చెప్పవచ్చు. ఇంటి చుట్టు చిన్ని తోట. ఆకట్టుకునే లాంటి ఆహ్లాదకరమైన వాతావరణం.

అణుకువతో ఆయన మాటలు శిరసావహించే అందమైన భార్య, సంస్కారం ఉట్టిపడే ఇద్దరు చిన్నపిల్లలు. ఎందుకో తెలియదు కానీ ఆ ఇంటి వాతావరణంలో ఒక విధమైన కారుణ్యం, ప్రేమ పొంగి ప్రవహించేవి.

ఆయన తనను ఆదరించి ఆహ్వానించిన తీరులో ఎంతో ప్రేమ, సంస్కారం ఉట్టిపడుతున్నాయి. అప్పటికి రఘు ఏ విధంగానూ స్థిరపడలేదు, వయసు ఇరవై ఒకటికి మించి ఉండవు. ఏ ప్రత్యేకతా లేని ఒక సాధారణ వ్యక్తి అతను. ' నా

పేరు రఘు' అని తప్పనిచ్చి తన గురించి చెప్పుకోవటానికి ఏ ప్రత్యేకతలు లేని పరిస్థితి.

కానీ గడపతొక్కి వచ్చిన అతిధిని ఆయన ఆదరించిన తీరు అద్భుతం, ఎంతో జన్మ సంస్కారం ఉంటేనే అది సాధ్యం. అదే అనుకున్నాడు రఘు అతని గురించి.

ప్రేమ, దయ, జాలీ జాలువారే కంఠంతో ఆయన మాట్లాడుతూ ఉంటే గంటలు క్షణాల్లా గడిచిపోయాయి.

ఇవన్నీ ఒకెత్తు, ఆయన పర్సనల్ లైబ్రరీ ఒక్కటీ ఒకెత్తు.

శృతి, స్మృతి పురాణాదులు, వేదవేదాంగల తాలూకూ భాష్యాలు, ఉపనిషద్ గ్రంధాలు, కన్ఫ్యూషియస్, బెర్ట్రాండ్ రస్సెల్స్, ఖలీల్ ఘిబ్రాన్,,జీన్ పాల్ సార్త్రే వంటి మేధావుల గ్రంధాలు,జీవిత చరిత్రలు, అబ్బో అదో అద్భుత ప్రపంచం. అంతకుమించి వేరే పదమేది తోచలేదు రఘుకి.

'పుస్తకాలు అంటే ఆసక్తి' అన్న మాటకి సరాసరి తన పర్సనల్ లైబ్రరీలోకి తోడ్కొని వెళ్ళి అవన్నీ చూపించి ఏది కావాలన్నా తీసుక్కుని, చదువుకుని తెచ్చి ఇవ్వవచ్చు అని చెప్పాడు. ఓ జీవిత కాలం సరిపోతుందా ఈ గ్రంధాలు అన్నీ చదవటానికి అని అనిపించింది రఘుకి.

ఆ తరువాత ఆయన్ని కలవటానికి ఎన్నో సార్లు వారింటికి వెళ్ళాడు. అప్పుడప్పుడూ ఆయన పనిచేసే బ్యాంకు కు కూడా వెళ్ళే వాడు రఘు. ఆయన్ని కలవాలి, ఆయన్తో మాట్లాడాలి అని తనలాగే చెవి కోసుకుంటారు చాలా మంది అని త్వరలోనే తెలుసుకున్నాడు రఘు.

ఓ రోజు ఓగ్ మేండినో వ్రాసిన' ది గ్రేటెస్ట్ సేల్స్ మేన్ ఇన్ ది వరల్డ్' అనే చిన్ని పుస్తకం ఇచ్చి దాన్ని బాగా చదవమన్నాడు రఘుని.

'ఏంటి సార్, నన్ను సేల్స్ మాన్ జాబ్ చేయమంటారా?' నవ్వుతూ అడిగాడు రఘు.

'అది సేల్స్ కి సంబంధించిన పుస్తకం కాదు. పేరలా ఉందంతే. దీన్ని బాగా చదువు. ఆ తర్వాత ఆ పుస్తకం గురించి మనం సుధీర్ఘంగా మాట్లాడుకుందాం' అంటూ రఘు అరచేతిని నొక్కి వదులుతూ, 'ఓకేనా' అన్నట్టు దయగా చూశారు రఘు వంక.

చదవటం ప్రారంభించాడు రఘు. అంతే ఇక తన ప్రమేయం లేకుండానే అక్షరాల వెంబడి తన చూపులు పరిగెత్తనారంభించాయి.

అది పుస్తకమా? కానే కాదు.

అది ఒక మాయా తివాచి. అది ఒక మంత్ర నగరి. అది ఒక మంత్ర దండం. అందులోని ప్రతి అక్షరం తనలోని అణువణువునా ఏదో కొత్త శక్తిని నింపినట్టు

అనిపించింది.

ఆ పుస్తకం చివర్లో ఏసుక్రీస్తు జననం, బాల ఏసుని చుట్టిన ఖరీదైన దుప్పటి, ఆ దుప్పటి లో దాగున్న కీలకమైన రహస్యం, కథలోని ఆ చివరి మలుపు దాకా ఊపిరి బిగబట్టి చదివాడు రఘు.

వెన్నెల వర్షంలో కూర్చుని అమృతం త్రాగిన అనుభూతి.

తనలో ఏదో శక్తిపాతం జరిగిన అనుభూతి.

తనలోని శక్తి జాగృతం అయిన భావన. కుండలినీ శక్తి జాగృతం అవడం అంటే ఇదేనా? రఘుకి మాటలు రావటం లేదు. కండ్ల వెంబడి అశ్రు ధారలు. ఒక ఆనందానుభూతికి గురయ్యాడు రఘు.

దత్తావతారల గూర్చి సిద్దుడు బోధించగా, నామధారకుడు సమాధి స్థితిలోకి వెళ్ళీ ఆ అనందానుభూతినుండి బయటి ప్రపంచంలోకి రావటానికి ఇచ్ఛగించనట్టు అయింది రఘు పరిస్థితి.

ప్రపంచాన్నే శాసించగలిగేటంతటి ఐశ్వర్యవంతుడు అవటానికి పది చిట్కాలు, ప్రపంచాన్ని వసుధైక కుటుంబంగా మార్చగలిగే సూచనలు, విజయరహస్యాలు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇది ఆ పుస్తకం తాలుకు సారాంశం.

ఆ పుస్తకం చదివిన రాత్రి నిదుర రాలేదు రఘుకు. ఏదో ఉద్వేగం, ఏదో భావ తీవ్రత.

'చదివావా' మరుసటి రోజు కలవంగానే ఆయన అడిగిన మొదటి ప్రశ్న.

'చదివాను సర్. చాలా బాగుంది. నాలో ఏదో కొత్త శక్తి ప్రవహిస్తున్నట్టు అనుభూతి కలుగుతోంది. ఇన్నాళ్ళూ నాకే తెలియకుండా నన్ను ఏదో శక్తి అడ్డు పడుతున్నట్టు అనిపించేది. ఇప్పుడు నాకు ఏ అడ్డూ లేదు' చాలా భావ తీవ్రతతో చెప్పాడు రఘు.

తనిచ్చిన మందు పుచ్చుకున్న రోగి, తనకు గుణంగా ఉందని తన స్థితిని వర్ణిస్తుంటే అతని వంక దయగా చూసే వైద్యునిలా దయగా చూస్తుండి పోయాడు ఫ్రాన్సిస్.

రఘులోని ఆత్మహత్యా ధోరణులని మొదట్లోనే అర్థం చేసుకున్న వాడై, అతనికి ఆ సమయంలో పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇవ్వకుండా, అతనికి ఇష్టమైన అభిరుచి అయిన పుస్తక పఠనం ద్వారానే అతనిలో గణనీయమైన మార్పులని తీసుకు రాగలిగాడు ఫ్రాన్సిస్.

ఆ తరువాత పుస్తకాల వెల్లువ కొనసాగింది.

యువర్ ఎర్రెనియస్ జోన్స్, టఫ్ టైంస్ నెవ్వర్ ల్యాస్ట్ – టఫ్ పీపుల్ డూ, బార్న్ టు విన్, ది పవరాఫ్ పాజిటివ్ థింకింగ్, ది ఏకర్స్ ఆఫ్ డైమండ్స్, ది స్ట్రేంజెస్ట్

సీక్రెట్ ఇన్ ది వరల్డ్. ఇలాంటి వ్యక్తిత్వ వికాస గ్రంథాల ద్వార అతని వ్యక్తిత్వంలో సమూలమైన మార్పులు తీస్కుని వచ్చాడు ఫ్రాన్సిస్.

మరో వైపు విశ్లేషణతో కూడిన సంభాషణలు, తర్కంతో కూడిన చిన్న వాగ్వివాదాలకు తెరనెత్తుతూ రఘు ఆలోచనల్లో పెద్ద సునామినే సృష్టించాడు ఫ్రాన్సిస్ ఆ రోజుల్లో.

ఆయన ఇచ్చిన ప్రేరణతో పై చదువులు చదవటం, సీఏ కోర్స్ చేయటం చక చకా జరిగిపోయాయి.

సీఏ కోర్స్ కై అతను బొంబాయి కి బయలుదేరుతున్నప్పుడు, ఆయన రైల్వే స్టేషన్ కొచ్చి వీడ్కోలు ఇస్తూ రఘుతో చెప్పిన మాటలు అతను ఎప్పటికీ మరచిపోలేదు

'రఘూ! ప్రేమ ఎప్పటికీ కార్య రూపేణా మాత్రమే వ్యక్తమవుతుంది. అందులోనూ నిరంతర ప్రేమ, నిష్కామ ప్రేమ, ఎల్లలు లేని ప్రేమ భగవంతుని రూపం అని చెప్పచ్చు. ప్రేమకి ప్రతిగా ప్రేమనే నీవు వాంఛించడం ఎప్పుడు ప్రారంభిస్తావో మానసిక క్లేశాలు కలుగుతాయి, అది పతనానికి నాంది. నీవు ఏ ప్రతిఫలం ఆశించకుండా సాటి మనిషికి ఎప్పుడైతే, నీ సాయం ద్వారా నీ ప్రేమని అందిస్తావో అప్పుడు నీవే దేవుడివి. ఏదో కోరుకుంటూ నీ ప్రేమని నీవు అందించటం ప్రారంభించావో అప్పుడు నీవు మనిషిలాగా కనిపిస్తున్నా కూడా ఒక రాక్షసుడివి. అప్పుడు నీకే తెలియకుండా నీలో ప్రతికూల భావాలు గూడు కట్టుకుంటాయి. నిన్ను వలచి వంచించిన అమ్మాయిని క్షమించు. నీలొ కరుణ కట్టలు తెంచుకుని ప్రవహించనీయ్. దీని వల్ల నీకే మంచి జరుగుతుంది.'

రఘు ఆశ్చర్యంతో ఆయన వంక చూస్తుండిపోయాడు. తను ప్రేమోపహతుడు అని ఆయనకు తాను ఎన్నడూ చెప్పుకోలేదు వాస్తవానికి. ఆయన కురిపిస్తున్న దయా వర్షంలో తడిసి ముద్దయ్యాడు రఘు.

ప్లాట్ ఫాం పై నిలబడ్డ ఫ్రాన్సిస్ ని, భారమైన హృదయంతో, సజలమైన కండ్లతో కదిలే రైల్లోంచి చూస్తూ ఉండిపోయాడు రఘు. అదే ఆయన్ని చివరి సారి చూడటం.

అయన్ని ఆ తరువాత ఎన్నడూ చూడలేకపోయాడు.

ట్రాన్స్ఫర్ అయ్యిందని ఒక సారి, వాలంటరీ రిటైర్ మెంట్ తీస్కుని ఎక్కడొ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో తలమునకలుగా ఉన్నారని ఒకసారి తెలిసింది.

ఆయనని ఎన్నడూ మరచి పోలేకున్నా, ఆ తర్వాత తన ఎదుగుదల క్రమంలో తన గొడవలో తాను తలమునకలు అయ్యాడు రఘు. కానీ ఏ క్షణమూ ఆయనని మరచి పోలేదు.

ఆ తర్వాత ఆయన అందించిన జీవనోత్సాహంతో, ఆయన తనతో చదివించిన పుస్తకాల తాలుకు ప్రేరణతో, పట్టుదల క్రమశిక్షణల తో దిన దిన

ప్రవర్ధమానమయ్యాయి రఘుపతి చేపట్టిన వ్యాపారాలు అన్నీ.

అంతా లక్ అంటారు విమర్శకులు.

* * *

జమ్మలమడుగు క్యాంబెల్ ఆసుపత్రి ఆవరణలో ఫ్రీజర్ బాక్స్ లో ఉంచిన ఫ్రాన్సిస్ శవాన్ని చూసి చిన్న పిల్లాడిలా ఏడ్చేశాడు రఘుపతి.

అంతచిన్న ఊరికి రఘుపతి రావటమే వార్త అనుకుంటే, ఆయన చిన్న పిల్లాడిలా ఏడ్చేసిన దృశ్యాన్ని ఒడిసి పట్టుకోవటానికి పోటీలే పడ్డారు మీడియా వాళ్ళు.

అంత్యక్రియలు ముగిశాయి.

మీడియా వారికి ఏమి అర్థం కావటం లేదు, వారికి పిచ్చెక్కిపోతోంది. ఒక సామాన్యుడైన ఫ్రాన్సిస్ మృతికి రఘుపతి ఎందుకు ఇంత ప్రాముఖ్యతని ఇస్తున్నాడో తెలుగు రాష్ట్ర మీడియా, జాతీయ మీడియా అంతటా ఇదే చర్చ.

మధ్యాహ్నం ఆయన ఇంటికి వెళ్ళాడు రఘుపతి. చాలా చిన్న ఇల్లు. ఆయన తన యావదాస్తిని దానధర్మాలకు వినియోగించాడు అని ఆసుపత్రి ఎండీ ఆయనకి చెప్పారు. ఆయనింటి వాతావరణాన్ని చూస్తే అది నిజమే అని తెలుస్తోంది.

ఇంటి బయట అంతా మీడియా తాలూకు ఓ బీ వ్యానులు బారులు తీరాయి.

నుదుటన ఎర్రటి బొట్టుతో శ్రీలక్ష్మిలాగా ఉంది వారమ్మాయి. ఆ అమ్మాయి పేరు సరస్వతి అట.

వారి కుటుంబానికి సహాయం చేస్తాను అన్న ఆయన ప్రతిపాదనని శ్రీమతి ఫ్రాన్సిస్ సున్నితంగా తిరస్కరించారు.' మాకు తగినంత ఉంచి వెళ్ళారు. మాకే లోటు లేదు.' అని కాసేపాగి ఆవిడ ఇలా అన్నారు

'వారు మిమ్మల్ని తన చివరి రోజుల్లో బాగా అనుకున్నారు. వారు ఎన్నడూ ఎవరి నుంచి ఏ సహాయం ఆశించలేదు. కానీ వారికి మీరేదో సాయం చేయాలట. ఈ ఉత్తరంలో వ్రాసి ఉందట అది. ఈ ఉత్తరం మీకు ఇమ్మన్నారు' అంటూ ఒక సీల్డ్ ఉత్తరం తెచ్చి ఇచ్చారు. తెరిచాడు రఘుపతి.

ముత్యాల్లాంటి అక్షరాల వెంబడి అప్యాయంగా అతని చూపులు పరుగులు ప్రారంభించాయి.

*'ప్రియమైన రఘు...*

ఎలాఉన్నావు? ఇప్పుడు నివ్వు ఉన్న స్థితిలో నిన్ను ఏకవచనం తో సంబోధించే చనువు నాకు ఉన్నందుకు నాకు గర్వంగా ఉంది. రఘూ నువ్వు సాధిస్తున్న విజయాలు, ప్రగతీ గమనిస్తూనే ఉన్నాను. అయామ్ ప్రౌడాఫ్ యూ మై బాయ్.

ఎన్నో టీవీ ఇంటర్వ్యూలలో నాగురించి ప్రస్తావించావు. నన్ను గురువు అన్నావు.

**మీడియా వారికి ఏమి అర్థం కావటం లేదు, వారికి పిచ్చెక్కిపోతోంది. ఒక సామాన్యుడైన ఫ్రాన్సిస్ మృతికి రఘుపతి ఎందుకు ఇంత ప్రాముఖ్యతని ఇస్తున్నాడో తెలుగు రాష్ట్ర మీడియా, జాతీయ మీడియా అంతటా ఇదే చర్చ.**

దైవం అన్నావు. అదంతా నీ సంస్కారం, పెద్దలు నీకు అందించిన వినయం.

అదే మన సనాతన సంప్రదాయంలో ఉన్న విశిష్టత.

నీ ప్రతి విజయం వెనుక నీ కృషి ఉంది, నీ పట్టుదల ఉంది. నేను కేవలం కొన్ని పుస్తకాలు చదవమని ప్రేరేపించాను నిన్ను. నీలో ఉన్న కసికి సరైన సమయంలో ఒక సన్మార్గం కల్పించాను. అది దైవ కృప. అందులో నా గొప్పతనం ఏదీ లేదు.

నీవు బొంబాయి వెళ్ళిపోయిన తర్వాత నాక్కూడా బదిలి అయింది. పదోన్నతుల మీద దేశం అంతటా తిరిగాను. పనిలో పనిగా అనేక మంది మహనీయుల సాంగత్యం లభించింది. అనేక క్షేత్రాలను దర్శించే భాగ్యం కలిగింది.

న్జ్ఞానాన్ని మరింత విస్తృత పరచుకున్నాను. దాదాపు అయిదేళ్ళ క్రితం వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని జమ్మలమడుగులో స్థిర పడ్డాను.

రఘూ నీ బిజీ జీవితంలో ప్రవేశించి నిన్ను డిస్టర్బ్ చేయదల్చుకోలేదు, అందుకే నేను నీతో టచ్ లోకి రాలేదు.

నేను ఒక సామాన్యుడిని, కానీ నీతో సహా చాలా మంది తమకు కొత్త జీవితాన్ని అందించానని చెబుతూ ఉంటారు, అనేక మందికి దుఃఖోపశమనం కల్పించాను అని అంటుంటారు. అది మీ అందరి మంచితనం.

నాకో సాయం చేయగలవా? రఘూ నాకు దుఃఖోపశమనం కావాలి. మీకెవ్వరికీ తెలియని దుఃఖం నాలో ఒక జ్వాల లాగా నిరంతరం రగులుతూనే ఉండినది ఇన్నేళ్ళూ. వయస్సు పెరిగే కొద్ది నాలో దుఃఖం పెరుగుతూ వచ్చిందే తప్ప తరగలేదు. ఇది ఒక చిత్రమైన పరిస్తితి.

నా బాల్యం నుండి కూడా ఎక్కడైనా గుడి గంటలు వినపడితే నాలో ఒక విధమైన పారవశ్యం కలిగేది.

వేదనాదం విన్నా, మంత్రోచ్ఛారణ విన్నా మనసు ఆనందంతో గంతులు వేసేది. కానీ మా తల్లితండ్రులు నన్ను ఒక ' ఆడ్ మాన్ అవుట్' అన్నట్టు చూసే వారు. ఆ దిశగా నా అభిరుచిని ప్రోత్సహించే బదులు, మా మతపెద్దలతో చెప్పి నా అవగుణాన్ని మాన్పించే ప్రయత్నం చేసేవారు.

పరమత సహనం అటుంచి, కన్నతల్లి లాంటి సనాతన సంప్రదాయం పట్ల ద్వేషం రగిల్చే ప్రయత్నం చేసే వారు. దేవి దేవతల్ని చులకనగా మాట్లాడటం నాకు

చాలా దుఃఖం కలిగించేది.

క్రైస్తవం పుచ్చుకున్న ప్రతి ఒక్కరూ అలాగే ప్రవర్తిస్తారు అని చెప్పను కానీ, నాకు తారసపడిన ప్రతి ఒక్కరూ సనాతన ధర్మం పట్ల ద్వేషం రగిల్చే ప్రయత్నమే చేశారు. జ్ఞానం వికసించే కొద్ది నాలో ఈ సంఘర్షణ పెరుగుతూ వచ్చింది.

విదేశీ పాలకులు ఒక ప్రణాళికతో మనల్ని మన సంస్కృతికి ఎలా దూరం చేశారో తెలుసుకునే కొద్ది, మన సంస్కృతికి వారు చేసిన ద్రోహం తెలుసుకునే కొద్దీ నాలో ఈ దుఃఖం పెరుగుతూ వచ్చింది.

సనాతన ధర్మం ఏదయితే ఉందో, ఇది మతం అనే సంకుచిత చట్రంలో ఇమిడే అంశం కాదు. ఇది మతం కాదు. మతం అనేది కొందరు మహానుభావులచే స్థాపింపబడి, వారు రూపొందించిన కఠిన నియమావళిని తూచ తప్పకుండా పాఠించే లాగా రూపుదిద్దబడ్డ పిల్లకాలువల లాంటివి.

సనాతన ధర్మం అనేది ఎవరిచేతా స్థాపింపబడలేదు. ఇది మతం కాదు, ఇది ఒక ధర్మం. యావత్తు మానవాళి ఆనందంగా జీవించటానికి ఇది ఒక మాన్యువల్ లాంటిది. ఇది అత్యంత పురాతనమయినది, అత్యంత నవీనమైనది కుడా.

ఇది విన్–విన్ సిట్యుయేషన్ లాంటి నిరంతర ప్రక్రియ. నా గెలుపు కై నీవు ఓడి పోనక్కరలేదు. నీవు ఆనందంగా జీవించు, నేనూ ఆనందంగా జీవిస్తాను. నాకు నీవు రక్ష – నీకు నేను రక్ష. మనిద్దరం యావత్తు విశ్వానికి రక్ష, ఇలాంటి మహదోద్దేశాలతో రూపుదిద్దబడ్డ ఒక విశ్వమానవ సంక్షేమానికై ఏర్పడ్డ ధర్మం ఇది. దీనికి దేశ, కాల, లింగ పరిమితులు లేవు.

పాశ్చాత్యులు మొదటి సారి మనల్ని చూచినప్పుడు మన సంస్కృతిని మన జీవన విధానాన్ని చూసి అవాక్కయ్యారు. సుఖ శాంతులతో, ఆనందంతో, అష్టైశ్వార్యాలతో తులతూగుతున్న మనల్ని చూసి దిగ్భ్రమకి గురయ్యారు.

నాగరికతతో విలసిల్లుతున్న మన స్థితికి అబ్బురపడ్డారు.

దోచుకోడానికి వచ్చిన దొంగ ఇంటి వారి ఐశ్వర్యాన్ని చూసి ' శభాష్' అని అభినందించి వెళ్ళిపోడు కద. ఎలా దోచుకోవాలా అని ఆలోచిస్తాడు.

సరిగ్గా అలాగే జరిగింది మన సంస్కృతి పట్ల దాడి.

బ్రిటిష్ వారు మన సంపదల్ని దోచుకుని, మనల్ని బానిసలను చేసుకొనినదే కాక, మన సంస్కృతిని మనమే ద్వేషించే లాగా చేయటం అనే ఒక భయంకరమైన కుట్రని విజయవంతంగా అమలు చేయగలిగారు.

' హిందుత్వం అనేది ఒక మతం కాదు. ప్రపంచంలో మానవుడు ఎలా జీవించాలి అన్నవిధానాన్ని ప్రతిపాదించిన ఒక శాస్త్రీయ పద్ధతి. ఒక సిలబస్. సనాతన ధర్మాన్ని ధిక్కరిచ్చటం అంటే మనం కూర్చున్న చెట్టుకొమ్మ మనం

నరుక్కోవటం మాత్రమే. ప్రకృతితో, పంచభూతాలతో, మమేకం అవుతూ ఎక్కడా సిమెట్రీ దెబ్బతినకుండా సుఖసంతోషాలతో ఎలా జీవించాలో తెలిపే ఒక అద్భుతమైన విధానం. దీనికి మతాలతో సంబంధం లేదు.

విశాలమైన ఇలాంటి అమృత సాగరాన్ని వదులుకుని, ఒక చెంచాడు నీటిలో ఈత కొట్టమని శాశిస్తే ఎలాఉంటుందో అలా ఉండేది నా పరిస్థితి.

రఘూ ప్రపంచంలో అన్ని మతాలు మంచివే.

ప్రజలు భ్రష్టుపట్టిపోకుండా ఉండేందుకు కొందరు మహానుభావులు నడుం బిగించి కొన్ని నియమాలు ఏర్పరిచిన వ్యవస్థలే మతాలన్ని. ఏ మతమూ చెడుపు చేయమని చెప్పదు.

కాకపోతే అందులో చెప్పబడ్డ విషయాలని ఆ మతావలంబకులు అర్థం చేసుకోవటంలో పొరపాట్లు జరిగి మూఢ విశ్వాసులుగా మారి ఇతరులను ద్వేషించటం మొదలయ్యింది. ఆయా మతాల్లోని పెద్దలు తర్కించే జ్ఞానవంతులని తృప్తిపరచలేరు తమకున్న పరిమితమైన అవగాహన వల్ల.

కానీ సర్వేజనా సుఖినోభవంతు అన్న ఆర్యోక్తిని విశ్వసించే సనాతనధర్మం నాస్తికుల్ని, చార్వాకుల్ని కూడా ప్రోత్సహిస్తుంది వారి సందేహాల్ని ఎప్పటికప్పుడు తీరుస్తూ పోతుంది. ప్రశ్నించటం అభివృద్ధికి సూచన అని విశ్వసించే విధానం ఇది. అందుకే సనాతన ధర్మ అత్యంత ప్రాచీనం మరియూ నిత్య నూతనం.

ఇలా చెప్పుకుంటూ పోతే దీనికి అంతులేదు రఘు. మనం ఏదయితే సైన్స్ అనుకుంటున్నామో ఈ సైన్స్ ఇంకా టెలిస్కోపు కాదు కద, అందులో లెన్సుకి వాడే గాజు ముక్కను కూడా కనుగొనక ముందే ఖగోళ శాస్త్రంపై పూర్తి పట్టు సాధించి గ్రహగతుల్ని, గ్రహణాల్ని ముందుగా లెక్కించి చెప్పింది ఈ ధర్మం. శాస్త్రజ్ఞులు కనుగొనక ముందే భూమి గోళాకారంలో ఉందని తమ పురాణాల్లోనే పేర్కొన్న నాగరిక ధర్మం ఇది.

రఘు నువ్వు నాకు ఒక చిన్న సహాయం చేయాలి. అమ్మానాన్నల్ని అయిన వాళ్ళనీ నొప్పించటం ఇష్టం లేక అన్య మతస్తుడిగానే చలామణి అయ్యాను బ్రతికినంతకాలము.

రిజర్వేషన్ల సౌకర్యాల కోసం అదే బంధువుల ద్వంద్వప్రమాణాల వల్ల రికార్డ్ ప్రకారం హిందువుగానే చలామణి అయ్యాను. కానీ నేను ఏనాడు రిజర్వేషన్ సౌకర్యం వాడుకోలేదు. నేనేనాడు ఇలాంటి మోసం చేయలేదు. ఏది సాధించినా మెరిట్ పైనే సాధించాను.

ఇక ఈ కపట నాటకం చాలు రఘు, నా అంతరాత్మ ఒప్పుకోవట్లేదు.

రఘూ నీవు చేయాల్సిన సాయం చాలా చిన్నది, చాలా చిత్రమైనది కూడా. నా ఆత్మ కనీసం హిందువుగా సాగిపోని. జీవించినంత కాలం సంఘర్షణ అనుభవించాను.

ఇలాంటి సంఘర్షణే నేను శ్రీ ఏపిజే కలాం గారిలో కూడా గమనించాను. నా ఇలా సతమతమయ్యే చాలా మందిని నా జీవన యాత్రలో నేను గమనించాను.

రఘూ నా కోరిక చాలా చిత్రమైనది అని చెప్పాను కద. నీవేం చెయ్యాలి అంటే కాశీ విశ్వనాథుని క్షేత్రమైన వారణాసిలో గంగానది తీరంలో సశాస్త్రీయంగా నాకు పిండ ప్రదానం చేయి.

శాస్త్రోక్తంగా నాకు పదవరోజు, పదమూడోరోజు జరగాల్సిన కర్మకాండ, మాసికాలు, పిండ ప్రదానం, సాంవత్సరికం జరిపించు. కనీసం నా ఆత్మ హిందువుగా ప్రయాణం చేయనీ.

యద్భావం తద్భవతి. నా భావనే నిజమవు గాక.

నువ్వు నన్ను గురువు అని అనేక వేదికల మీద పేర్కొన్నావు కద. నేను చెప్పగా నీవు చదివిన గ్రంధాలన్నీ పాశ్చాత్య సమాజం నుండి మనకు దిగుమతి అయినవే. నేటి మేటి వ్యక్తిత్వ వికాస గ్రంధాలన్నీ మన శాస్త్రాలలో, గీతలో చెప్పబడ్డ విషయాలే. అదంతా తమ సృజనే అని జబ్బలు చరచుకుంటూ ఉంటారు పాశ్చాత్య మేధావులు.

మాకు ప్రేరణ సనాతన ధర్మం తాలూకు గ్రంధాలే అని చెప్పుకోవాలి అనే కనీస మర్యాద పాటించరు ఈ రచయితలు.

నా చివరి కోరిక తీర్చటం ద్వారా నీవు నాకు గురుదక్షిణ చెల్లించిన వాడివి అవుతావు.

నేనిటీవల ఒక గ్రంధం చదివాను, వ్రాసింది వామదేవ శాస్త్రి. నిజానికి ఇతడు పాశ్చాత్యుడు. అతని అసలు పేరు 'డేవిడ్ ఫ్రాలే' . అతడు వ్రాసిన ఆ గ్రంధం పేరు 'నేనెందుకు హిందువుగా మారాను?'

ఈ గ్రంధం చదివి చాలా ఉద్వేగానికి గురయ్యాను. వీలయితే నీవు చదువు.

ఉండనా మరి!

***–ఫ్రాన్సిస్ విజయ్ కుమార్.***

* * *

# డాక్టర్.రాయపెద్ది వివేకానంద్

వ్యక్తిత్వ వికాస నిపుణులు. హైదరాబాద్ లో ఉంటున్నారు. రాయల్ సాఫ్ట్ స్కిల్స్ కాంపస్ ట్రెయినింగ్ సంస్థని నిర్వహిస్తున్నారు. పన్నెండవ ఏట నుంచే రాయటం మొదలెట్టారు. మొదటి కథ పదిహేనో ఏట 'పల్లకి' వారపత్రికలో ప్రచురితం అయ్యింది. ఆకాశవాణి కడప కేంద్రం యువవాణీ కార్యక్రమం ద్వారా చాలా కథానికలు ప్రసారం అయ్యాయి.

# లెక్క తేల్చండి

ఈమని కోటేశ్వరరావు ,
98485 47981

ఫోన్ రింగవుతూనే ఉంది గంట గంటకూ.. ఉదయం నుండి.

ఫోన్ లిఫ్ట్ చెయ్యదలచలేదు రామకృష్ణ.

ఆ తరవాత నందిని ఫోన్ రింగయ్యింది.

'ఆ నంబరు నుంచే'.. అన్నది నందిని.

'ఒక్కసారి మాట్లాడవచ్చు కదా! ఎంత అత్యవసరమై చేస్తున్నారో?' అనునయంగా అన్నది.

'కొన్ని బంధాలు బందాలై మెడకు చుట్టుకొంటే వాటిని ఉంచుకోవాలా? తెంచుకోవాలా నందూ?' అన్నాడు నిస్తేజంగా.

'తెంచుకున్నా తెగని బంధాలు కొన్ని ఉంటవి క్రిష్. ఏం కష్టమొచ్చిందో? మనం చెయ్యదగ్గ సహాయం అయితే చేద్దాం. ప్లీజ్' అన్నది .

'ఒకే.. మాట్లాడు. నేను ఇంట్లో లేనని చెప్పు.. నాతో మాట్లాడాలి అని అడిగితే!' అన్నాడు రామకృష్ణ.

నందిని మళ్లీ కాల్‌బ్యాక్ చేసింది.

'ఉదయం అమ్మ చనిపోయింది వదినా. అన్నయ్య రాడని తెలుసు. అయినా తెలియజెయ్యాలి కదా!' అని చెప్పి, ఫోన్ కట్‌చేశాడు చంద్రం. స్థాణువులా బిగుసుకు పోయింది నందిని. నోట మాట రాలేదు.. కొన్ని క్షణాలపాటు.

కంగారుపడ్డాడు రామకృష్ణ .

'ఏమైంది నందూ? ఏమిటట? ఆవిడేనా మాట్లాడింది?! చెప్పు నందూ' ఆదుర్దాని ఆణచి పెట్టుకొంటూ అడిగాడు రామకృష్ణ.

'అత్తయ్యగారు చనిపోయారట!' గద్గదమైన గొంతుకతో చెప్పింది నందిని.

*నా బాల్యం గాయాలమయం నందూ! గుర్తుకొస్తే మానిన గాయాలు మళ్లీ రేగి, నన్ను నానుంచి దూరం చేస్తుందని నా భయం. నా జీవితంలోకి నువ్వు ప్రవేశించాకే నేను మనిషిని కాగలిగాను.*

ఆ మాట వింటూనే సోఫాలో ఒక్కసారిగా వెనక్కి వాలిపోయాడు రామకృష్ణ. మెదడు తోపాటు శరీరమూ మొద్దు బారినట్లయింది.

అంతలోనే తేరుకొన్నది నందిని.

'ఎన్ని గంటలకు బయల్దేరుదాం?' అడిగింది రామకృష్ణను.

'వెళ్లాలా?' అన్నాడు రామకృష్ణ.

'ఏం మాట్లాడుతున్నావ్? చనిపోయింది మీ అమ్మ! తెంచేసుకున్నావనుకొంటున్న బంధం.. నిజానికి ఈ రోజుతోఎ తెగిపోయింది. చివరిసారిగా నువ్వు చేయవలసిన కర్మలు కొన్ని మిగిలిఉన్నయ్. బయలుదేరండి .. బ్యాగ్ సర్దుతాను' అంటూ రామకృష్ణ సమాధానం కోసం ఎదురు చూడకుండా లేచి ఇంట్లోకి వెళ్లింది.

***

నందిని కారు నడుపుతోంది.

రామకృష్ణ మౌనం నందినికి అసహనాన్ని కలిగిస్తున్నా, అతని గుండె లోతులోని అలజడిని గ్రహించగలుగుతున్నది.

'చెడ్డ భర్తలు ఉంటారు, చెడ్డ భార్యలు ఉంటారు. చెడ్డ తండ్రులు ఉంటారు, చెడ్డ కొడుకులు ఉంటారు. కానీ, చెడ్డ తల్లి ఉండదు. అన్నది నా వ్యక్తి గత అభిప్రాయం క్రిష్' అన్నది నందిని.

రామకృష్ణ ఏం మాట్లాడలేదు. మళ్లీ తనే..

'అత్తయ్య గారంటే మీకు ఎందుకు అంత ద్వేషం? సారీ క్రిష్. నీ గతం గురించి ప్రస్తావించ వద్దని మన పెండ్లికి ముందే నా నుంచి మాట తీసుకున్నావ్. ఇప్పటికీ ఆ మాటకు కట్టుబడే ఉన్నాను. చివరి చూపు కోసం వెళ్తున్నాం. ఎంతో బలమైన కారణం ఉంటేగానీ, కన్న తల్లిని ఒక వ్యక్తి ఇంతగా ద్వేషించడు. నీ వైపునుండే ఆలోచిస్తున్నాను క్రిష్' సున్నితంగా అన్నది నందిని.

భారంగా నిట్టూర్చాడు రామకృష్ణ.

'నా బాల్యం గాయాలమయం నందూ! గుర్తుకొస్తే మానిన గాయాలు మళ్లీ రేగి, నన్ను నానుంచి దూరం చేస్తుందని నా భయం. నా జీవితంలోకి నువ్వు ప్రవేశించాకే నేను మనిషిని కాగలిగాను. సమాజం మీద, మానవ సంబంధాల మీద, బవబంధాల మీదా నాలో రగిలిన ద్వేషాన్ని సమాధి కట్టాను నందూ!' అన్నాడు భారంగా శ్వాస

తీసుకొంటూ.

'సారీ క్రిష్' నొచ్చుకున్నట్లుగా అన్నది నందిని.

'ఇప్పుడు నువ్వు తెలుసుకొని తీరాలి నందూ. చనిపోయిన వ్యక్తి గురించి ఒక్క చుక్కకూడా కన్నీరు రాల్చని నా మీద ఎక్కడో.. ఏ మూలో కించిత్తు అసహ్యం కలగవచ్చు నీకు. ఇప్పుడు కాకపోయినా.. భవిష్యత్తులో ఎప్పుడైనా'

'క్రిష్! నువ్వు ఎంత సున్నితమైన వ్యక్తివో, ఎంత పాజిటివ్‌గా ఆలోచిస్తావో నాకు బాగా తెలుసు. నీ బాధ వెనుక ఉన్న కథను వినాలన్న ఆసక్తి కూడా నాకు లేదు. ప్లీజ్.. రిలాక్స్' మంచినీటి బాటిల్ ఇవ్వబోతూ చెప్పింది.

వద్దనట్లే సైగ చేశాడు.

'ఇప్పుడు నీకు చెప్పకపోతే ఇంకెప్పుడూ చెప్పాల్సిన అవసరం రాదేమో నందు' అన్నాడు రామకృష్ణ.

'నాకు చెబితే నీకు రిలీఫ్ లభిస్తుందనుకొంటే చెప్పు. బాధను పెంచుతుందనిపిస్తే చెప్పనక్కరలేదు' అన్నదామె.

కొన్ని క్షణాల మౌనం తర్వాత చెప్పడం మొదలుపెట్టాడు రామకృష్ణ.

***

'నేను ఆరో తరగతి చదువుతున్నప్పుడు పొలంలో పాము కరిచి మా నాన్న చనిపోయారు. ఒక్కసారిగా మా బతుకుబండి తల్లకిందులైపోయింది. అప్పటికి తమ్ముడు ఏడాది పసికందు. కౌలుకు ఇచ్చిన యజమాని, పొలాన్ని లాగేసుకొన్నాడు. సర్కారు స్థలంలో అక్రమ కట్టడమంటూ ఇల్లును కూల్చేశారు పంచాయితీవాళ్లు. నాన్న ఉన్నంతవరకూ కూలి పనికి వెళ్లడంకూడా తెలియదు మా అమ్మకు. పరామర్శించడానికి వచ్చిన బంధుగణం పట్టెడన్నం పెట్టింది లేదు. ఒక రోజు నన్నూ, తమ్ముణ్నీ ఏరు దగ్గరకు తీసుకెళ్లింది అమ్మ. భోరున ఏడుస్తున్నది. తమ్ముడూ ఏడుస్తున్నాడు. ఏమీ అర్థం కాక, నేనూ ఏడుస్తున్నాను. అటుగా వెళ్తున్న సూర్యం మాష్టారు.. మా దగ్గరకు వచ్చాడు. అమ్మను పలుకరించాడు. మాస్టారుకేదో చెప్పబోయింది అమ్మ. ఆమెను మందలించి మమ్మల్ని తన ఇంటికి తీసుకెళ్లాడు. అన్నం పెట్టాడు. ఆదరించాడు. నన్ను స్కూల్లో చేర్పించాడు' అని చెబుతూ ఒక్క క్షణం ఆగాడు రామకృష్ణ.

'మనుషుల్లో మంచి మనుషులు ఉంటారు క్రిష్!'' అన్నది నందిని.

'నేనూ అలాగే అనుకున్నాను నందూ. ఊరు అలా అనుకోలేదు. 'మొగుడు పోయి ముప్పై రోజులయినా కాలేదు.. పంతులుగారి పక్కలో చేరింది' అన్నారు. 'ఉంపుడు గత్తె' అన్నారు. క్లాసులో పాఠాలు చెవికెక్కేవి కావు. తోటి పిల్లల గేలి మాటలతో

చెవులు పోటెక్కేవి. ఒక్కణ్నే కూర్చొని ఎక్కిఎక్కి ఏడుస్తుంటే.. ఓదార్చడానికి తల నిమిరే చెయ్యిలేదు. కన్నీరు తుడిచే వేలులేదు. అమ్మ ఏడవడం మానేసింది. అమ్మను చంపేయ్యాలన్నంత కోపం ఒక పక్క.. పాలు మానని తమ్ముడు మరోపక్క. దీంతో అమ్మతో మాట్లాడటం మానేశాను. అతనితో అసలు మాట్లాడే వాడినే కాదు. రెండేళ్లు ఎలా గడిపానో తెలియదు. ఊళ్లో ఉండలేక పోయాను. పారిపోయి వచ్చి, సిటీకి చేరాను. దొరికిన పనల్లా చేశాను. ఓ పెద్దాయన ఇంట్లో పనికి కుదిరి, ఆయన పుణ్యాన చదువును కొనసాగించాను. ఒక్కసారికూడా ఊరికి తిరిగి వెళ్లాలనిపించలేదు నందిని' చెప్పడం ముగించాడు రామకృష్ణ.

'మీ తమ్ముణ్ని కూడా ఆ ఊబి నుంచి బయటకు తీసుకు రావలసింది!' అన్నది నందిని.

'నా కాళ్ల మీద నేను నిలబడ్డాక ఆ ప్రయత్నం చేశాను నందూ! ససేమిరా రానన్నాడు. అమ్మనూ, నాన్ననూ.. అదే ఆ స్కూలు పంతుళ్ను వదిలి రాలేనన్నాడు. వాడి ఖర్మకు వాణ్ని వదిలేశాను. మన ఫోన్ నెంబర్లు వాడికి అందేలా చేశాను. ఏదైనా అవసరం వచ్చినప్పుడు చేస్తారేమోనని.. ఇదిగో.. ఇప్పుడు చేశాడు' అన్నాడు రామకృష్ణ.

'వదిలెయ్ క్రిష్! నీ ప్రయత్నం నువ్వు చేశావ్. రిలాక్స్‌గా ఉండు' అన్నది రామకృష్ణ చెయ్యి వొత్తుతూ.

'ఇంకొంచెం ముందుకు పోయి లెఫ్ట్ తీసుకో! అక్కడి నుండి ఓ ఆరు కిలోమీటర్లు లోపలికి పోవాలి' అన్నాడు రామకృష్ణ.. గతంనుంచి తేరుకొంటూ.

కారు ఊర్లోకి చేరుకొంది.

ఊరు పెద్దగా మారలేదు.. కొన్ని పెంకుటిండ్లు స్లాబులు అవడం తప్పించి..

'రూట్ కొంచెం గైడ్ చెయ్యి' అన్నది నందిని.. ఇరుకు సందులో నిదానంగా డ్రైవ్ చేస్తూ.

'రైట్ తీసుకో! రోడ్డు చివరన రామాలయం వస్తుంది' అన్నాడు రామకృష్ణ.

నెమ్మదిగా కారును అక్కడకు చేర్చింది నందిని.

రామాలయం పక్కనే పెంకుటిల్లు. ఇంటి ఎదుట షామియానా, కుర్చీలు, గుమిగూడిన జనాన్ని చూసి, అదే ఇల్లని గ్రహించింది. ఓపెన్‌గా ఉన్న చోట కారును పార్క్ చేసింది.

కారు దిగారు రామకృష్ణ, నందిని.

వీళ్లను చూసిన కొందరు రామకృష్ణను చుట్టుముట్టారు.

వాళ్లందర్నీ తోసుకొంటూ వచ్చాడు చంద్రం. అదాటుగా వాటేసుకొన్నాడు

రామకృష్ణను.

'అమ్మ చనిపోయిందన్నయ్యా!' అంటూ భోరున ఏడుస్తున్నాడు. చుట్టూ ఉన్నవాళ్లంతా రామకృష్ణను ముందుకూ, వెనక్కూ కుదిపేస్తున్నారు. చంద్రం భుజాన్ని పట్టుకొని సముదాయించే ప్రయత్నం చేశాడు రామకృష్ణ.

'రాయ్యా! బతికినంత కాలం నీ దిగులుతోనే బతికిందయ్యా! సాగనంపడానికైనా వచ్చావు. చాల్లే అయ్యా! ఆ మాత్రం పున్నెం చేసుకొంది ఆ తల్లి' బాధా, ఎత్తిపొడుపూ కలగలిపి ఏడుస్తున్నది ఒకావిడ. నలుగురూ నానా మాటలు అంటూనే ఏడుస్తున్నారు. ఏడుస్తూనే అంటున్నారు.

రామకృష్ణ పక్కకు వచ్చి చేరింది నందిని. ఇద్దరూ కలిసి పార్థీవదేహం వద్దకు చేశారు.

నందిని అందించిన గులాబీ దండను తల్లి మెడలో వేసి, దండం పెట్టుకొన్నాడు రామకృష్ణ.

అప్రయత్నంగానే రామకృష్ణ కండ్లు చెమ్మగిల్లినయ్.

నాన్న వీపుమీద ఎక్కి 'ఏనుగమ్మ ఏనుగు' అంటూ ఆడుతూ ఉంటే.. వెంటబడి అన్నం తినిపిస్తున్న అమ్మ జ్ఞాపకం.. గుండె పొరల్లోంచి పెల్లుబికి రామకృష్ణ గుండెను తట్టింది.

తల్లి తల దగ్గర మోకాళ్లపై కూలబడి పోయాడు. గుండె బిగబట్టినట్టు అయ్యింది రామకృష్ణకు.

నందిని అతని భుజం మీద చెయ్యివేసింది.. ఓదార్చుతున్నట్లుగా!

'కావాల్సిన వాళ్లు వచ్చేశారు.. మొదలెట్టండ్రా!' అంటూ పొలికేక వేశాడో పెద్దమనిషి.

తప్పెట్ల, తాళాల మోత మొదలయ్యింది. అంతిమయాత్రకు హడావిడి మొదలైంది.

చుట్టూ పరికిస్తున్నాడు రామకృష్ణ. అది గమనించిన చంద్రం అతని చేయిపట్టుకొని ఇంట్లోకి తీసుకెళ్లాడు.

ఓ గదిలో.. మంచంమీద సూర్యం మాష్టారు కనిపించారు.

'సంవత్సరం నుండీ పక్షవాతం వేధిస్తున్నది' అన్నాడు చంద్రం.

లేచే ప్రయత్నం చేస్తున్నాడు కానీ, లేవలేకపోతున్నాడు.

ఏవో సంజ్ఞలతో చంద్రాన్ని దగ్గరకు పిలిచాడు. మాట్లాడే ప్రయత్నం చేస్తున్నా.. మాట రావడం లేదు. తలగడ మీద చేయి పెట్టాడు. చంద్రానికి అర్థమయినట్లుంది. తలగడ కిందనుండి ఓ పుస్తకం తీసి, అందులో నుంచి ఓ కవరు తీశాడు. దాన్ని

రామకృష్ణ చేతిలో పెట్టాడు.

'ఇది నీకు అందజెయ్యమని రెండేండ్ల నుండి పోరు పెడుతున్నారు నాన్న' అన్నాడు చంద్రం.

అయోమయంగానే ఆ కవర్ను జేబులో పెట్టుకొన్నాడు రామకృష్ణ. మౌనంగానే బయటకు వచ్చేశాడు. తపెట్ల మోత తారాస్థాయినందుకుంటుండగా అంతిమ యాత్ర మొదలయ్యింది.

***

'ఎప్పుడు ఏ అవసరం వచ్చినా కబురు చెయ్యి' అంటా నందిని హ్యాండ్ బ్యాగ్ నుండి తీసిన డబ్బు కట్టలు, విజిటింగ్ కార్డు చంద్రానికి ఇవ్వబోయాడు రామకృష్ణ.

'డబ్బు అక్కర్లేదు' అన్నట్టు చెయ్యి ఊపి, విజిటింగ్ కార్డు ఒక్కటే తీసుకున్నాడు.

'పెద్దకర్మ తేదీ గురించి కబురు చేస్తాను. వస్తే.. ఎక్కడ ఉన్నా అమ్మ సంతోషిస్తుంది. నలుగురిలో ఆమెకు కాస్తంత గౌరవం దక్కుతుంది' అన్నాడు చంద్రం.

మారు మాట్లాడకుండా కారు దగ్గరకొచ్చాడు రామకృష్ణ. అతన్ని అనుసరించింది నందిని. కారు స్టార్ట్ చేశాడు. ఊరి పొలిమేర దాటుతుండగా, జేబులోంచి కవరు తీసి, నందినికి ఇచ్చాడు.. చదవమన్నట్టుగా!

కవరు చించింది నందిని. అందులో ఒకే ఒక్క పేపర్ ఉన్నది.

రామకృష్ణను సంభోదిస్తూ రాసిన ఉత్తరం. నందిని కండ్లు అక్షరాల వెంట పరిగెడుతున్నాయ్.

***

ఎప్పటికయినా నువ్వు తిరిగివస్తావని.. అమ్మను అక్కున చేర్చుకొంటావని నాకు తెలుసు నాయనా. ఆసరాలు అవసరాలకు, అవసరాలు ఆసరాలకు అనుబంధాలవుతాయి కొందరికి. పిల్లల్ని యేట్లో విసిరేసి, తనూ దూకేద్దామని సిద్ధమయిన మీ అమ్మకు ధైర్యం చెప్పాను. నీడను ఇవ్వాలనిపించింది. పిల్లల్ని బతికించుకోలేకే చావాలనుకుంది. పిల్లల కోసమే బతకడానికి ఊతమిచ్చాను. రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయం నుండి బయటపడ్డ నేను.. సంసారానికి పనికిరాని ఒక కొయ్యను మాత్రమే అయ్యుండొచ్చు. అమ్మకు ఆలంబనగా, లతలా అల్లుకోవడానికి ఓ పందిరి నయ్యానన్న తృప్తి చాలు ఈ జీవితానికి. రాళ్లు విసిరే చేతులకూ, నిందలు వేసే నోళ్లకూ ఎదురొడ్డి నిలబడ్డాం గానీ.. నీకు అర్థమయ్యేటట్లు చెప్పడంలో విఫలమయ్యాం. తప్పు మాదే! అమ్మకూ, తమ్ముడికీ ఆసరాగా నిలబడతావని నా ఆశ. వమ్ము చెయ్యకు నాయనా.

నీకు ఏమీ కాని..

సూర్యం మాష్టారు.

***

'క్రిష్!' చదవడం పూర్తవ్వడంతోనే కేక పెడుతున్నట్టుగా అరిచినంత పనిచేసింది నందిని.

కంగారుపడ్డ రామకృష్ణ.. కారును పక్కకు తీసి ఆపాడు. ఉత్తరం అతని చేతిలో పెట్టింది.

అతను చదవడం.. క్షణాల్లో జరిగిపోయింది. రామకృష్ణలో వొణుకు ప్రారంభమైంది. కంగారు పడింది నందిని.

కారును సర్రున వెనక్కి తిప్పాడు. నిశ్చేష్టురాలయ్యింది నందిని. చూస్తూ ఉండగానే కారు ఊరివైపు దూసుకుపోయింది.

పొలిమేరల్లో ఉన్న శ్మశానం ముందు కారు అగింది.

నందిని వారించేంతలోనే ఒక్క ఉదుటున కారు దిగిన రామకృష్ణ.. శ్మశానంలోకి పరిగెడుతున్నాడు. కాళ్లు తడబడుతున్నాయి. కండ్లు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. కాలి బూడిదైన కుప్ప ముందు కూలబడిపోయాడు. బూడిదను ఎత్తి పోస్తూ..

'అమ్మా! అమ్మా! లే అమ్మా! నా చెంపలు పగల కొట్టమ్మా! లేచొచ్చి నా జుట్టు పట్టుకొని నా వీపు పగల కొటమ్మా! లేమ్మా! బ్రతికున్నంతకాలం ఈ భారం నేనెట్లా మోసేదమ్మా? నేను వస్తానమ్మా.. నన్నూ తీసుకెళ్లమ్మా!' అంటూ గుండెలవిశేలా ఏడుస్తున్నాడు రామకృష్ణ.

అతని రెండు భుజాలను పట్టుకొని పైకి లేపింది నందిని. అతన్ని పొదివి పట్టుకొంది.

'జీవితాంతం ఈ క్షోభను నేనెట్లా మొయ్యగలను నందూ! చెప్పునందూ..' అంటూ పసి పిల్లాడిలా ఏడుస్తున్నాడు.

అంతా గమనిస్తున్న కాటికాపరి వారిద్దరినీ సమీపించాడు. జానకమ్మ కొడుకని గ్రహించాడు.

'పోయినోళ్లను తిరిగి తెచ్చుకోలేం బాబూ!ఆళ్లతో ఎల్లిపోనూలేం! ఆళ్ల రుణం తీర్చుకోడానికి.. నీ భారం దించుకోడానికి ఆళ్లు మనకు ఏదో ఒక పని మిగిల్చే ఎల్తారు బాబూ! అదేదో ఎరిగి పూర్తిసెయ్ బాబూ.. లెక్క సరిపోద్ది' అనుభవంతో కూడిన నిబ్బరత అతని మాటల్లో స్పష్టమవుతున్నది.

'క్రిష్! ప్లీజ్.. నేనున్నాను. అన్నీ సర్దుకొంటాయి. నీ క్షోభ తీరుతుంది. నేను చూసుకొంటాను క్రిష్' అని ఓదారుస్తూ, రామకృష్ణను కారు దగ్గరకు తీసుకొచ్చింది

నందిని. వాటర్ బాటిల్ తీసుకొని అతని ముఖం కడిగింది. తిరిగి కారులో కూర్చోబెట్టింది. నందిని డ్రైవింగ్ సీట్‌లో కూర్చుంది.

***

'తాతగారూ! నా హోం వర్క్ అయిపోయింది. ఇక మీరు కథ చెప్పాల్సిందే' అంటూ అంటూ సూర్యం మాష్టారు మెడను చుట్టేసింది జానకి.

'తాతయ్యకు రెస్ట్ ఇస్తావా?.. లేదా?' అంటూ తన కూతుర్ని సున్నితంగా మందలించింది నందిని. టాబ్లెట్, మంచినీళ్లు సూర్యం మాష్టారుకు అందించింది.

'నా తల్లితో ఆడుకోవడమే నాకు రెస్టమ్మా!' అంటూ మనవరాలిని ఒళ్లోకి తీసుకున్నాడు.

తాతా, మనవరాలి సరదాల్ని గమనిస్తూ.. లాప్‌టాప్‌లో ప్రశాంతంగా వర్క్ చేసుకొంటున్నాడు రామకృష్ణ.

లెక్క తేల్చేసిన గణితకారుడిలో కనిపించే ఆనందం.. ఇప్పుడు రామకృష్ణ మనసంతా, ఇల్లంతా, హృదయమంతా, లోకమంతా.. అదే ఆనందం.

***

# ఈమని కోటేశ్వరరావు

ఈమని కోటేశ్వరరావు, పుట్టి కొంతకాలం పెరిగింది ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా,బాపట్ల. గత ఇరవై ఏళ్లుగా పెరుగుతున్నది హైదరాబాద్ లో. న్యాయవాద వృత్తిలో ఉన్నాను. అడపాదడపా రాసిన కథలు వివిధ పత్రికలలో ప్రచురింపబడినవి. నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజా గ్రంథాలయం వారు అందించిన ప్రోత్సహానికి కృతజ్ఞతలు. అల్లకల్లోలం సృష్టించిన కరోనా... 'కథ' ను నానో మీటర్ కూడా కుదపలేకపోయిందనటానికి నిదర్శనం ఈ కథా సంకలనం. వ్యథలున్నంత వరకూ కథలుంటాయి.

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 280

# సంస్కృతి రక్షితో...

**కంచర్ల శ్రీనివాస్,**

**93466 11455**

ఈ రెండు గంటల సమయంలో ఇప్పటికే చాలా ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానమిచ్చారు లాస్ట్ బట్ నాట్ లీస్ట్.. ఐటీడీఏ పీవోగా మీ ప్రధానాశయం ఏంటిసార్..అడిగింది యంగ్ జర్నలిస్ట్ గీత తన ఇంటర్వ్యూ ముగింపుగా .. గిరిజన హక్కుల్ని కాపాడటం..అభివృద్ధికి కృషిచేయటం.. సమాధానమిచ్చాడు ఇస్లావత్ సేవాలాల్ నాయక్ తన మొదటి పోస్టింగ్ లో అతను ఆరోజే సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ గా బాధ్యతలుస్వీకరించాడు..

మరుసటిరోజు సేవాలాల్ కు కాల్ చేసింది గీత... ఇంటర్వ్యూ పబ్లిష్ అయ్యింది చూశారా అని తను అడగబోతుండగా.. థాంక్యూ..థాంక్యూ సోమచ్ గీత గారు ఇంటర్వ్యూ బాగా ప్రెజెంట్ చేశారు నా వ్యూని బాగాహైలెట్ చేశారు అంటూ కృతజ్ఞత తెలుపుతుండేసరికి ఆశ్చర్యపోయింది గీత పీవోగారుభలేఫాస్ట్ గురూ..అనుకుంటూ.. ఆ చనువుతోనే అడిగింది..సార్ ఇఫ్ యూ డోంట్ మైండ్ కెన్ ఐ ఆస్క్ వన్ ఆఫ్ ది రికార్డ్..అంటుండగానే ఆమెకాల్ కట్అయ్యింది..ఏజెన్సీ ఏరియా కావటంతో సిగ్నల్స్ సరిగా ఉండని ప్రాంతమది..

ఫోన్ కట్ కావటంతో చేతిలో అలానే పట్టుకొని సేవాలాల్ వేగంగా ఆలోచించటం మొదలుపెట్టాడు జస్ట్ నిన్నపరిచయమైన అమ్మాయికి తనదగ్గర ఆఫ్ ది రికార్డ్ ఏముంటుంది...అయినా ఫస్ట్ సైట్ ప్రభావం చూపుతుందని సైకాలజీ సబ్జెక్ట్ లో చదివాను కదా అనుకున్నాడు..

ఒకవేళ తనేమన్నా క్రష్ కు గురయ్యిందా..అని చిలిపిగాఊహించి నవ్వుకునాడు.. బట్ ఐయాం నాట్ సో.. అని అనుకుంటూనే.. నేను నాతెగ యు–ంవతినే ఇష్టపడతాను ప్రేమిస్తాను పెళ్లి చేసుకుంటాను.. అసలు లవ్ఎట్ ఫస్ట్ సైట్ అనేది నా విషయంలో జరిగితే...కచ్చితంగా ఆ అమ్మాయిని నేనునాతెగ ప్రత్యేకమైన ఎరుపు, గులాల్, నీలం రంగుల బంజారా గాంగ్రా డ్రెస్ లోనే చూడటం జరిగేది..

ఆమె పొలంగట్టు పై నుండి గడ్డిమోపు ఎత్తుకొస్తూనో నాకెదురుపడేది..పచ్చగడ్డి పరకను మునిపంటితో కొరుకుతూ నన్నుచూసి సిగ్గుపడేది, తన పొలఒంటిపై పచ్చబొట్లు, తన రవికఅద్దాల్లో నేను ఎన్నోనేనులుగా కనపడే వాడిని, తన కడియాలగాజులు, రూపాయి బిళ్ళల అలంకరణ మా గతజన్మబంధాన్ని గుర్తుచేసేది, తనను అనుసరిస్తూ నడుస్తున్న మేక మందలో నేనూ ఒకడినై ఎడారిలో పిరమిడ్ లా ఎంతో ప్రత్యేకంగా ఉండే ఆమె తండాకు ఈపాటికి తప్పిపోయేవాడిని, అసలు నన్నుచూడగానే ఆమెకూ క్రితం స్మరణకొచ్చి ఎడబాటు విరహంతో గుండె బరువెక్కి తమ సంప్రదాయ ఎలిజీ వ్యక్తమైన ధావలో పాటిస్తూ ఎంత విరహ వేదన అనుభవించిందీ ఇన్నాళ్ళూ ఒకరికొకరం దూరమై ఏకరువు పెట్టేది కదా.. నాడ్రోక్రి నన్ను చూడగానే ఢోక్రా అని పిలిచేది కదా.. తలపాగా చుట్టుకున్న వాళ్లనాన్న ఎడ్లను నడిపిస్తుంటె బండిలో కూర్చున్నఆమె పునాస దోసకాయమ్ముతూనో, ఎర్రమట్టి అమ్ముతూనో, గనుసు గడ్డలమ్ముతూనో మొక్కజొన్న కంకులమ్ముతూనో కనిపిచేదికదా..

> **ఆపాట వింటున్నంత సేపు ఆసినిమాలో హీరో హీరోయిన్ల మధ్య ప్రేమ సన్నివేశాలే కళ్లముందు మెదిలాయి.. లాక్డవున్ మొదలవుతుందనగా దియేటర్ లో చూసిన ఆఖరి సినిమాఅది కనుక బాగా గుర్తుందతనికి తను దుల్కర్ అభిమాని కావటం కూడా మరో కారణమేమో.. తను మళ్ళీ లిఫ్ట్ చేయకపోవటంతో ఆపని విరమించి ఎటో బయటికెళ్ళేందుకు రడీ అవుతున్నాడు బయటకు వెళితే కారులో డ్రైవర్ వినేలా ఫోన్ మాట్లాడటం బాగోదనే ఆమెకు మూడు సార్లు కాల్ చేశాడు ఆమె సంభాషణ పూర్తిచేస్తే ఓ పనైపోతుందన్న ఉద్దేశ్యంతోనే.**

తలపై కప్పుకున్న తనకొంగుకు ఇరుపక్కలా వెండిగంటలు వేళాడుతుండేవి కదా.. అని అనుకుంటుండగా మళ్లీ అదే నంబర్ నుంచి రింగ్ అయ్యింది.. సారీ సార్ కాల్ కట్ అయ్యింది ఇందాకట్నుంచి ట్రైచేస్తున్నా బట్ కలవట్లేదు మేబీ సిగ్నల్స్ పూర్ అంటూ గడగడా మాట్లాడుతుంటే తమ తండాను ఆనుకొని ప్రవహించే మోతె వాగు గుర్తొస్తోందతనికి.. అంతే వేగంగా మాట్లాడుతోంది.. ఉదయం సాయంత్రాల్లో ఆనీళ్లపై సూర్య కిరణాలు పడి తళుక్కుమన్నట్టుగానే ఈమె మాట్లాడుతుంటే కూడా ఆమె తెల్లని పలు వరస తళుక్కుమంటుందని గుర్తు తెచ్చుకుంటున్నాడు..

నిన్న ఇంటర్వ్యూ చేస్తున్నప్పటి కంటే ఈరోజెందుకో తనస్వరం మరింత తియ్యగా ఉందనిపిస్తోంది.. మళ్ళీ మాటల్లోకొస్తూ ..ఇంతకూ ఏమిటో ఆ ఆఫ్ ది రికార్డ్ విషయం చెప్పండి అనిఅడగగానే.. అది..అది తరువాత అడుగుతాను ఆటాపిక్ ఇప్పుడొదిలేయండి.. రేపు ఆదివారంకదా మీ ప్లాన్స్ ఏమిటి అని అడిగింది.. ఏంలేవు... కలెక్టర్ గారు సీఎం గారి మీటింగ్ కి హైదరాబాద్ వెళ్లారు సో..మేబీ ఐయాం ఫ్రీ అన్నాడు...గుడ్ అయితే ఎటన్నా బయటికెళదామా అని అడిగింది గీత ఆమె అలాఅడుగుతుండేడే సరికి ఏంసమాధానమివ్వాలో తెలీక తడబడుతుండటంతో అదేంటి సార్ నేనేదో మిమ్మల్ని డేటింగ్ కి పిలిచినట్టు ఇబ్బంది పడిపోతున్నారు అంది గీత కొంటెగా నవ్వుతూ.. ఇంతలో మళ్ళీ కాల్ కట్ కావటంతో... క్రేజీ అనుకుంటూ ఫోన్ కిందికి దించాడు సేవాలాల్..

డేటింగ్ అనే మాట అతని చెవుల్లో ధ్వనిస్తోంది...ప్రేయసీ ప్రియుల ఏకాంత కాలక్షేపం కదూ డేటింగ్ అంటే అనుకున్నాడు... గీత బయటకు వెళదామా అని ఎందుకు అంటోందో అర్థం కాలేదు కానీ తను డేటింగ్ కి వెళ్లదలిస్తే తనునచ్చే అమ్మాయి తనకోసం ఏచెరకు తోటకో, ఏ కాలువ గట్టుకో పజ్జొన్న రొట్టెల చందమామలకు ఎర్రెర్రని ఎల్లిపాయ కారం కళ్ళు పెట్టి ఉల్లిగడ్డ, పచ్చి మిర్చి తెస్తుంది వాటిని నంజుకుంటుంటే ఓహ్.. అంతకన్నా రొమాన్స్ ఏముంటుంది అనుకుంటున్నాడు.. తనకాల్ కట్ అయ్యింది కనుక మళ్లీ ఫోన్ చేస్తుందని అక్కడే వెయిట్ చేస్తున్నాడు సేవాలాల్.. అయిదు నిమిషాలు పది నిమిషాలు అర్ధ గంటకూ ఫోన్ రాకపోవటంతో తనే ఆనంబర్ కు కాల్ చేశాడు.. మణిరత్నం తాజా సినిమాలో ప్రేమపాట తనకాలర్ ట్యూన్ గా వినవస్తోంది... పాట పూర్తవుతున్నా తను లిఫ్ట్ చేయకపోవటంతో వద్దు వద్దనుకుంటూనే పావుగంట గ్యాప్ తో మరో రెండు సార్లు కాల్ చేశాడు

ఆపాట వింటున్నంత సేపు ఆసినిమాలో హీరో హీరోయిన్ల మధ్య ప్రేమ సన్నివేశాలే కళ్లముందు మెదిలాయి.. లాక్డవున్ మొదలవుతుందనగా దియేటర్ లో చూసిన ఆఖరి సినిమాఅది కనుక బాగా గుర్తుందతనికి తను దుల్కర్ అభిమాని కావటం కూడా మరో కారణమేమో.. తను మళ్ళీ లిఫ్ట్ చేయకపోవటంతో ఆపని విరమించి ఎటో బయటికెళ్ళేందుకు రడీ అవుతున్నాడు బయటకు వెళితే కారులో డ్రైవర్ వినేలా ఫోన్ మాట్లాడటం బాగోదనే ఆమెకు మూడు సార్లు కాల్ చేశాడు ఆమె సంభాషణ పూర్తిచేస్తే ఓ పనైపోతుందన్న ఉద్దేశ్యంతోనే.

ఇంతలో ఆమె కాల్ చేసింది..వెరీ సారీ సార్ స్నానానికెళ్ళాను..అయినా మీ గురించే ఆలోచిస్తున్నాను అనేసరికి సేవాలాల్ నవ్వుతూ వాట్ నాగురించా

స్నానంచేస్తూనా అనటంతో ఏదో గుర్తొచ్చి నాలిక్కరుచుకుంటూనే గట్టిగా నవ్వేసింది గీత...ఇద్దరినవ్వులూ కొంచెం సేపు కంటిన్యూ అయ్యాక..ఇంతకూ ఏంటోచెప్పండి ..బయటకన్నారు ఎక్కడికో అని అడిగాడు..

ఏదన్నా తండాకెళదాం సార్ అంది గీత..తండా అనగానే సేవాలాల్ మనసు పులకించింది.. నిజమా.. ఎందుకూ, ఏతండాకు తండాల్లో అందరూ వలస కూలీలే కదా ఇంతకూ జనం ఉంటారా ఈ రోజుల్లో అని ప్రశ్నలుగుప్పిస్తుండగా... ఉంటారు సార్.. హైదరాబాద్ ముంబై లకు వలస వెళ్లిన వాళ్ళంతా మొన్న లాక్ డవున్ రోజుల్లో తిరిగొచ్చారు..ఇదివరికంటే సరైన సాగునీటి సదుపాయాలు లేక తెలంగాణ బీడుగా ఉండేది ఇప్పుడు కొత్త ప్రాజెక్టుల వల్ల అన్ని జలాశయాల్లో నీరు పుష్కలంగా ఉండి కొస్తా అంధ్ర ప్రాంతాలకు ధీటుగా పంటలు పండుతూ పచ్చగా కళకళలాడుతోంది..ఇప్పుడిది బంగారు తెలంగాణ ఇక్కడినుండి ఇప్పుడెవరూ వలసపోమంటున్నారు అని అనగానే..ఏంటి జర్నలిస్టు కూడా గవర్నమెంట్ కు ప్రో గా మాట్లాడుతారా అన్నాడు సేవాలాల్.. నేనుచెప్పేది నిజంసార్ లాక్డవున్ ఆననతరం మేం వాళ్ళను ఇంటర్వ్యూ చేసేందుకు వెళ్లినపుడు వాళ్లు చెప్పిన అభిప్రాయమది అంది గీత..

ఆమద్యాన్నం డ్రైవర్ హఠాత్తుగా జ్వరం అని చెప్పటంతో కరోనా లక్షణమేమో ఎందుకైనా మంచిదని అతనికి సెలవిచ్చిపంపాడు సేవాలాల్..ఆవిషయం గీతకు కాల్ చేసి ప్రోగ్రాం క్యాన్సిల్ చేయమని చెప్పాడు.. అది చెప్పేందుకే ఆమెకు కాల్ చేశాడు..కానీ అందుకు గీత ఒప్పుకోలేదు తను ప్రిపేరయ్యానని డ్రైవర్ లేకుంటే తనకారులో వెళ్దామని తాను డ్రైవ్ చేస్తానని అనటంతో సరే అనక తప్పలేదు సేవాలాల్ కు..

కారులో వెళ్తున్నప్పుడు ఆతృతగా అడిగాడు సేవాలాల్ పొద్దున ఏదో ఆఫ్ ది రికార్డ్ విషయం అన్నారు ఏమిటది అని..తను నవ్వుతూ..ఓ..అదా అంది గీత తేలిగ్గా తీసుకుంటూ.. అదే ఇంతకూ ఏమిటో అడగండి అని అన్టుండటంతో..

గిరిజనుల హక్కుల్ని కాపాడటం అంటే వన్ బై సెవెంటీ నిభంధన అమలుచేయటమా, అట్రాసిటీ చట్టాన్ని పరిరక్షించటమా.. పోడుసాగుకు మద్దతివ్వటమాని అడిగింది గీత.. తనేదో ఊహిస్తే అందుకు భిన్నంగా తనేమో మాట్లాడుతుండేసరికి షాకవ్వటూణ్ణాఆదూ సేవాలాల్... ఆటాణెదో చెప్పబోతుండగా అభివృద్ధి అంటే రోడ్లు, ఇండ్లు, నీళ్ళు, లైట్లు మాత్రమేనా..సంస్కృతి పరిరక్షణ ప్రభుత్వం చేయూత ఇవ్వదా, సంస్కృతి పరాయి కరణ, తెగ సంప్రదాయ విచ్ఛిన్నతను, అడ్డుకొని ప్రత్యేకతను కాపాడాల్సిన అవసరం ప్రభుత్వాధికారికి ఉన్నా

లేకున్నా తెగను ప్రేమించే, తెగకు చెందిన వ్యక్తిగా మీకుందిసార్ అనేసరికి తనుదేనిగురించి మాట్లాడుతోందో తనను బయటకు ఎందుకు వెళ్దామందో అర్థమ–య్యింది సేవాలాల్ కు.. కార్యాలయానికే పరిమితమైతే క్షేత్రస్థాయిలో ఏంజరుగుతుందో తెలియదు కనుక ఈతండా సందర్శణ ఏర్పాటు చేసింది.. గిరిజన పౌరుడిగా, ఆశాఖ అధికారిగా ఇదీతనకు మంచిదే అనుకున్నాడు..

తండానిండా జనంఉన్నారు.. కారు చూసేసరికి గుమికూడారు...తండా పరిసరాలు, అక్కడి గిరిజనులనూ చూసాక గీత చెప్పిన సంస్కృతివిచ్ఛిన్నం నిజమే అనిపించింది.. జొన్నలు దంచుతున్న దృశ్యం ఎక్కడాలేదు రొట్టెలు చేస్తున్న, కాల్చుతున్న వాసనేం లేదు మగాళ్ళలోతలపాగాదర్జా లేదు మహిళలకు ప్రత్యేక వస్త్రధారణ నగలూ లేవు.. నోరువిప్పి మాట్లాడుతున్న భాషలో సైతం పరాయి పదాలు దొర్లుతున్నాయి..అందరూ చొక్కాలు టీ షర్టులు మారిన తలకట్టుల్లోనే ఉ న్నారు.. యాస తప్ప వాళ్ళదైన సొంత ఆచారమూ వేషమూ సంప్రదాయమూ ఒక్కటీ కానరావటంలేదు..అందరి చేతుల్లోనూ సెల్ ఫోన్స్ ఉన్నాయి..అక్కడి నుండి వెనుదిరిగి మరో మూడు తండాలను సందర్శించారు అంతటా అదే సంస్కృతి పతనం..

ఆరాత్రి ఎంతసేపటికీ నిద్ర పట్టలేదు సేవాలాల్ కు..పరాయి ప్రభావానికి లోనై ఒక దీర్ఘ కాల చారిత్రక సంస్కృతిని చేజేతులా చేటు కలిగించుకుంటున్న వైనమే కళ్ళముందు మెదులుతోంది..సినిమాలు, టీవీలు, నగరీకరణ, రియల్ ఎస్టేట్ విస్తరణ, అడవుల విధ్వంసం సంస్కృతి ఆచార వ్యవహారాలకు ఎలా చేటుకలిగిస్తోందో ఎరుకయ్యింది.. రిజర్వేషన్లు అమలు చేయటం ఒక్కటేకాదు తెగసంస్కృతి ప్రత్యేకతను సం రక్షించేందుకు జనాన్ని జాగృతం చేయటమూ తండా బిడ్డగా తన బాధ్యత అని భావించాడు సేవాలాల్.. తనను గీత బయటకు తీసుకు రాకపోతే క్షేత్రస్థాయి వివరాలు తెలిసేవి కావనుకున్నాడు..అప్పటికి టైం రాత్రి పదవుతోంది.. ఆసమయంలో కాల్ చేయటం బావోదని ఆమె ఫోన్ నంబర్కు మెసేజ్ చేశాడు థ్యాంక్స్ అని.. ఆమెసేజ్ చూసాక గీత పెదవులపై సంతోషంతో కూడిన చిరునవ్వు చోటు చేసుకుంది..తనూ ఏదో టైప్ చేసింది కానీ వెంటనే ఎరేజ్ చేసి ఒక ఎమోజీ సెండ్ చేసింది..

ఐటీడీఏ అధికారిగా తన విధులు నిర్వర్తిస్తూనే కలెక్టర్ ప్రత్యేక అనుమతితో తన పరిధిలోని తండాలన్నిటినీ వాట్స్ ఆప్ గ్రూప్ లోకి తెచ్చి యువతను అనుసంధానించే సంస్కృతి పరిరక్షణకు పాటుపడే చైతన్యం కల్పిస్తున్నాడు .. గిరిజన వీరులగాధలు చారిత్రక పౌరాణిక అంశాలను పోస్ట్ చేయటం వారిని ఆవిషయాలపై

మమేకం చేయటం చేస్తున్నాడు..తెగకే ప్రత్యేకమైన దుస్తులు అలంకరణలు వేష ధారణలపై కొత్త మమకారాన్ని కలగజేస్తుండటంతో పెట్టెల్లో బీరువాల్లో ఎక్కడో అడుగుకుపోయినవి వెలుగు చూస్తున్నాయి.. ప్రతి ఆదివారం ప్రత్యేక తండా సభలను నిర్వహిస్తున్నాడు..

బతుకమ్మ పండుగ ఈసారి సంప్రదాయబద్ధంగా జరగాలి మీఅందరి వీలుచూసుకొని ఈవారంలో మొదలయ్యేటట్టు చూడండి అని సేవాలాల్ అనగానే... అది సెప్టెంబర్ నెలలోకదా సార్ అని అన్నాడు తండా పెద్ద హర్యానాయక్... నేనుచెప్పేది మన బంజారాబతుకమ్మ గురించి...అది ఈఆగస్ట్ నెలలోనే జరగాలి అనటంతో సేవాలాల్ తీజ్ పండుగ గురించి చెపుతున్నాడని అర్ధమయ్యింది నాయక్ కి.. నిజానికి గత పదేళ్ళ క్రితం వరకు తీజ్ ఉత్సవం ఏటా జరిపేవారు..కానీ తండా చిన్నా చితక జనం వలసలుపోవటంవల్ల తండాలో ముసలీముతక తప్ప తీజ్ పండుగ జరిపే పడుచులు అంతగా లేకపోవటంతో ఆ ఉత్సవం క్రమంగా మరుగున పడింది...

అన్ని తండాల్లో తీజ్ ఉత్సవం మొదలయ్యింది బతుకమ్మ పండుగలా తొమ్మిది రోజుల ఉత్సవమిది.. 'మారో బాపూ బజరజ్ హూంసియో కనాయియో' 'ఓరి ఛేటీవూన తీజ్ బొరాదూ కేరోయే.. పాటలు మార్మోగుతున్నాయ్ పెండ్లీడు యు-ువతులు తీజ్ లో ప్రత్యేక ఆకర్షణగా మారారు.. బతుకమ్మను పూలతో అలంకరిస్తే తీజ్ లో గోధుమ మొలకలను పూజించి ఉత్సవం జరుపుతున్నారు, 'శీత్లా యాడీ బొరాయీ తీజ్, బాయీ తారో పాలేణా,

సోనేరో డాక్నో ఘలాన, బాయీ తారో పాలేణా' అంటూ బతుకమ్మ తరహాలో బంజారా బతుకమ్మ సాగుతోంది.. నిమజ్జనం అన్ని తండాలూ ఒకే చెరువు వద్ద జరిపేటట్టు ముందుగా నిర్ణయించటంతో పలు తండాలనుంచి గోధుమ మొలకల బుట్టలతో పూజా ద్రవ్యాలతో హాజరవుతున్నారు యువతులు మహిళలు యువకులు..

ఆకార్యక్రమానికి అథిథిగా హాజరయ్యాడు సేవాలాల్.. ఆ గుంపులో గీత తమతెగ సంప్రదాయ దుస్తుల్లో కనపడే సరికి ఆశ్చర్యపోయాడు.. సేవాలాల్ దగ్గరికొస్తూనే మార్ నాం గీతా నాయక్ అంటూ తెగ సంప్రదాయ భాషలో చెపుతుండటంతోపాటు తన తల్లిదండ్రులను ఇతర బంధువులనూ పరిచయం చేసింది.. ఆమెతండ్రి గుబురుమీసాలు తలపాగాతో దర్జాగా ఉన్నాడు తల్లి పూర్తి సంప్రదాయ దుస్తుల్లోఉంది...గీతా గోధుమ మొలకల బుట్ట ఎత్తుకొస్తున్నప్పుడు, సీత్లాబాయి, మేరామా భవాని దేవతలను పూజిస్తున్నప్పుడు సంప్రదాయ పాటలు పాడుతూ నృత్యం చేస్తున్నప్పుడు.. ఎడ్లబండి వద్ద నిలుచున్నప్పుడు పొలం గట్టుపై

నడుస్తున్నప్పుడు, జొన్నరొట్టెల ప్రసాదం పంచుతున్నప్పుడు...ఇన్నేళ్ళు తను ఏరూపాన్నైతే ఊహించుకున్నాడో ఆరూపమే గీతలో కనిపిస్తుండే సరికి అలవికాని ఆనందానికి గురవుతున్నాడు..

కార్యక్రమంలో ప్రసంగిస్తూ.. నాగరికత అవసరమే కానీ అది సంస్కృతిని ధ్వంసం చేసేదిగా ఉండకూడదు.. మన ఆచారం మనవేషం మనభాష ఎప్పటికీ మనగర్వకారణం కావాలి రాబోయే తరాలకు మన అస్థిత్వాన్ని వారసత్వంగా అందించాలి ...తండాలను పంచాయతీలుగా ప్రకటించాలని అభివృద్ధిచేయాలని ప్రభుత్వాలతో పోరాడుతున్నాం..కానీ మరోవంక మనమే మనసంస్కృతి విచ్చిన్నానికి కారణమవుతున్నాం.. కళ్లు రొండున్నా చూపు ఒక్కటిగా కనపడుతుంది కానీ మనకు ఒక్క నాలుక ఉన్నా రొండునాల్కలుగా వ్యవహరిస్తున్నాం... మనసంప్రదాయ వస్త్రాలంకరణ ఎటు పోయింది..మనకే ప్రత్యేకమైన ఆ నగలేమయ్యాయి.. ఆనృత్యాలను సినిమాలు ఎందుకు మింగేస్తున్నాయ్.. మన తండాలు ప్రత్యేకత కోల్పోటానికి కారణమెవరు.. ఊళ్లకు దూరంగా కేవలం మనతెగ జనాభాతోనే తండాలెందుకు ఏర్పడ్డాయో ఎవరికైనా తెలుసా... మనపిల్లలకు మన ఇండ్లు,పొలాలు, డబ్బు,నగళూ ఆస్థులే ఖాఆడూ వాళ్లకు మనతెగ సంస్కృతినీ పంచుదాం.. మనసంప్రదాయం మనఆస్థి.. ఇతరులతో కలిసి ఉండొద్దని ఇతరులొ కలుపుకోవద్దనీ నాఉద్దేశ్యం కాదు కానీ మన అస్తిత్వం కలుషితంకాకూడదని నావిన్నపం.. అంటూ ముగిస్తుండగా ఆప్రాంతం చప్పట్లతో దద్దరిల్లింది..ఆ వెంటనే సంప్రదాయ ఉత్సవ హంగామా మొదలయ్యింది.. ఆరాత్రి గీత ఫోన్ కు టాణా భాఆషాళొ మెసేజ్ చేశాడు అది చదివి ఆమె బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కాయి .. అంటే ఆమాటకర్థం నువ్వు బంజారా బతుకమ్మవి అని.

* * *

## కంచర్ల శ్రీనివాస్

శ్రీనివాస్ ఖమ్మం వాసి. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో గత ఇరవయ్యేళ్లుగా జర్నలిస్ట్ గా ఉన్నారు. ఏడాది కాలంగా కథలు రాస్తున్నారు. ఇప్పటివరకు ఇరవై కథలు రాశారు. వాటిలో ఐదుకథలు వేర్వేరు పోటీల్లో బహుమతులుసాధించాయి. కథావ్యాప్తికి ముల్కనూరు గ్రంథాలయం చేస్తున్న కృషి గొప్పది.

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 287

# ఊరు పొమ్మంది రమ్మంది

పంతంగి శ్రీనివాస రావు
– 98851 12517

ఎక్కడి మహారాష్ట్ర సరిహద్దు.. మరెక్కడి హైదరాబాద్. పొట్ట చేత పట్టుకుని వచ్చింది ఆ కుటుంబం. ఆదిలాబాద్ జిల్లాలోని ఓ పల్లెటూరు అది. బతుకుతెరువుకు భాగ్యనగరానికి వచ్చాడు మల్లయ్య. కొడుకు చిన్నవాడు. కుటుంబ పోషణ నిమిత్తం నగరానికి వచ్చాడు. ఉన్నది రెండెకరాలు. ఒక్కో ఏడాది కరువు. తల్లిదండ్రి ఉన్నచోటే ఉండి, పొలాన్ని సాగు చేసుకుంటూ కలో, గంజో తాగి బతుకుదామన్నారు. అదీ మంచికే అనిపించింది మల్లయ్యకు. ఎందుకంటే, తమకే తాడూ, బొంగరం లేదు. మరో ఇద్దరు జీవుల పోషణంటే కష్టమే.

విపరీతంగా విస్తరిస్తున్న నగరంలో ఎక్కడెక్కడినుంచో చివరకు పక్క రాష్ట్రాల నుంచి సైతం 'వలసలు' పెరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి జనం నగరంపై వాలసాగారు.

హైదరాబాదుకు వచ్చిన కొత్తలో చాలా ఇబ్బంది పడ్డాడు మల్లయ్య. కరువు సమస్యలతో, ఇంటిల్లిపాదికీ గ్రాసం సరిపోక వలస వచ్చిన కుటుంబాలలో మల్లయ్య కుటుంబం కూడా ఉంది. ప్రతిరోజూ ఉదయం 'అడ్డా' మీద నిలబడేవాడు మల్లయ్య. నాలుగు రోజులు వేచి చూశాక ఒక 'మేస్త్రీ' పని ఇచ్చాడు. అది మొదలు కష్టించి పనిచేయసాగాడు మల్లయ్య. అందుకే మేస్త్రీలో అభిమానం పెరిగింది అతనంటే.. రెగ్యులర్‌గా పని కల్పించసాగాడు మల్లయ్యకు.

భార్య లక్ష్మి కూడా తనూ ఏదేని పని చేస్తానని చెప్పింది మల్లయ్యకు. ఉన్న ఊళ్లోనయితే 'కలుపు'తీతకు వెళ్ళేది. ఈ పట్టణాల్లో ఏ పని చేయగలదు. అదీకాక వయసులో ఉన్న లక్ష్మి ఛామనచాయ రంగులో 'కళ' గల మొహంతో ఎంతో అందంగా ఉంది. చూపరులను ఇట్టే ఆకర్షించే మొహం ఆమెది. ఈ నగరంలో ఎన్నో

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 288

'ఘోరాలు' జరుగుతూంటాయి. అదే భయపడ్డాడు మల్లయ్య.

'నా పదిలంలో నేనుంటానయ్యా.. పొద్దుగానే రెండు మూడు ఇళ్ళల్లో పనికెళ్తానయ్యా. నాకేం కాదు. చుట్టుపక్కల అపార్ట్‌మెంట్లలోనే పనిచేస్తానయ్యా. బుడ్డోడు ఆ రెండు మూడు గంటలు పక్కింటి పిల్లతో ఆడుకుంటాడు.' అని సర్ది చెప్పింది లక్ష్మి.

అయిష్టంగానే ఒప్పుకున్నాడు మల్లయ్య. వచ్చే ఏడు బుడ్డోడిని ఇంగిలీసు బడికి పంపాలి. ఖర్చులుంటాయి. ఏదో 'వేడి నీళ్ళకు చన్నీళ్ళు' అనుకున్నాడు. 'జాగ్రత్త లక్ష్మి..' పదే పదే చెప్పాడు.

మొగుడి భయానికి నవ్వుకుంది లక్ష్మి. తను నిప్పు.. ఆ భరోసా తనకుంది.

రోజులు ప్రశాంతంగా గడుస్తున్నాయి. ఏడాదికొకసారి మల్లయ్య తల్లిదండ్రులు వస్తారు. రెండు మూడు రోజులు ఉంటారు. ఉండేది రెండు చిన్న గదుల పోర్షన్.. రేకులది. దాని అద్దెనే ఎక్కువ మల్లయ్యకు.

మల్లయ్య మాత్రం, ఎన్ని పనులున్నా ప్రతి ఏటా తమ ఊరికి దగ్గరలో జరిగే 'నాగోబా' గిరిజన జాతరకు హాజరవుతాడు. వారి ఆచారం ప్రకారం ఘనంగా జరుగుతుంది జాతర. కేస్లాపూర్ గ్రామంలో జరిగే ఆ జాతర, దేశంలోనే రెండో అతి పెద్ద గిరిజన జాతర. ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షల సంఖ్యలో గిరిజనులు హాజరవుతారు. నియమానుసారం మొక్కులు చెల్లించుకుంటుంది మల్లయ్య కుటుంబం.

**మల్లయ్య మాత్రం, ఎన్ని పనులున్నా ప్రతి ఏటా తమ ఊరికి దగ్గరలో జరిగే 'నాగోబా' గిరిజన జాతరకు హాజరవుతాడు. వారి ఆచారం ప్రకారం ఘనంగా జరుగుతుంది జాతర. కేస్లాపూర్ గ్రామంలో జరిగే ఆ జాతర, దేశంలోనే రెండో అతి పెద్ద గిరిజన జాతర. ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షల సంఖ్యలో గిరిజనులు హాజరవుతారు.**

మధ్య మధ్యలో ఊరికి వెళ్లాలి అంటే బోలెడు ఖర్చుతో పాటు, ఒకరోజు పని లేకపోతే అదో నష్టం. అందుకే మల్లయ్య సొంత ఊరికి వెళ్లడానికి మక్కువ చూపడు. ఏడాదిలో ఒక పండుగకు తల్లిదండ్రులను పిలిపించుకుంటాడు. తండ్రికి వయసు మీద పడుతుంది. తన దగ్గరకు పిలిపించుకుని కొడుకుగా బాధ్యత తీర్చుకుందామంటే ఆర్థిక సమస్యలు..

ఒక్కోసారి అనిపిస్తుంది 'ఏంటో ఈ బతుకు' అని, రెక్కాడితే గానీ డొక్కాడదు.

నగరంలో భవన నిర్మాణ రంగం బాగా పుంజుకుంటోంది. మల్లయ్యకు రోజూ పని దొరుకుతోంది. బుడ్డోడిని ఇంటికి దగ్గరలోనే ఓ కాన్వెంట్‌లో చేర్పించారు. ఆ ఫీజులు తలుచుకుంటుంటే, కట్టేటప్పుడు మల్లయ్య గుండె ఝల్లుమంది. 'వామ్మో..!' అనుకున్నాడు.

అయితే కొడుకును మంచిగా చదివించాలి. తమలాంటి 'మట్టి' బతుకులు వాడికొద్దు. వాడే ఆశగా, శ్వాసగా బతుకీడుస్తున్నారు.

లక్ష్మి మరో రెండిళ్ళలో పాచి పనులు కుదుర్చుకుంది. వారి వారి ఇళ్లలో మిగిలిన అన్నం, కూరలు ఆ యా యజమానురాలు లక్ష్మికి ఇస్తుంటారు. చాలాసార్లు వంట పని చేయాల్సిన అవసరం తప్పుతుంది లక్ష్మికి.

ఇదిలా ఉండగా, ఒకరోజు తను పనిచేసే అపార్ట్మెంట్‌కు పనికి వెళ్ళింది లక్ష్మి. బుడ్డోడిని రెడీ చేసి మరీ వెళ్ళిందామె. ఆ ఇంట్లో పని చేసి వచ్చేసరికి బుడ్డోడు స్కూల్ టైం అవుతుంది. తను దించి వస్తుంది.

అందరి ఇళ్లలోనూ పనులు ముగించేసరికి స్కూల్‌కి 'లంచ్ బ్రేక్' ఇస్తారు. అప్పుడు లక్ష్మి బుడ్డోడికి బాక్స్ తీసుకుని వెళ్లి, తినిపించి వస్తుంది. ఇలా దినమంతా అలుపెరుగక కష్టపడుతుంది లక్ష్మి. మల్లయ్య మాత్రం పొద్దున్నే ఇంత 'చద్ది' కట్టుకొని వెళ్తాడు.

ఆ రోజూ మామూలుగానే పద్మావతమ్మ ఇంటికి పనికి వెళ్ళింది లక్ష్మి.

'అమ్మగారు అమ్మాయి దగ్గరకు వెళ్ళింది లక్ష్మీ. ఇల్లు మాత్రం ఊడ్చి వెళ్ళు.' చెప్పాడు ఇంటాయన.

ఆయనకు అరవై సంవత్సరాల వయస్సు ఉంటుంది.

ఇల్లు ఊడ్చడం మొదలుపెట్టింది లక్ష్మి.

'ఇదిగో లక్ష్మీ.. ఒకసారి ఇటు వస్తావా..' పిలిచాడు ఆ పెద్దాయన.

'ఏంటి అయ్యగారు..' అంటూ ఆయన ఉన్న బెడ్‌రూంలోకి వెళ్ళింది లక్ష్మి.

'ఇదిగో చూడు.. ఈ మూలన దుమ్ము పోలేదు' అంటూ ఒక వైపు చూపించాడాయన.

'పొరక' పట్టుకుని అటువైపు చూసింది లక్ష్మి.

చాలా శుభ్రంగా ఉంది అక్కడ.

'ఇక్కడ ఏమీ లేదు అయ్యగారు..' అంటూ వెళ్ళబోయింది.

' ఇదుగో ఇటు చూడు. ఇది చాలా బాగుంది కదూ..' అంటూ తన చేతిలోని సెల్‌ఫోన్ చూపించాడు డోర్ దగ్గరే నిలబడి.

చూసింది లక్ష్మి.

'ఛీ.. ఏంటిది అయ్యగారు.. తప్పుకదు..' అంటూ విసురుగా వెళ్ళబోయింది. అది 'నీలి' చిత్రం. ఆమె చేయి పట్టుకుని ఆపాడాయన.

'లక్ష్మీ.. ఒక్కసారి.. ఈ అవకాశం మరలా రాదు. అమ్మ గారు కూడా లేదు. నీకు ఎంత అంటే అంత ఇస్తాను. నువ్వు కష్టపడితే నీకేం వస్తుంది చెప్పు..' బతిమాలసాగాడు.

'అయ్యగోరు.. నేను అటువంటి దాన్ని కాదు. నన్ను వదలండి. నేను కేకలు వేస్తాను. మీ..' అంటూ విడిపించుకుని విసవిసా బయటకు వచ్చింది లక్ష్మి.

ఇంటికి చేరుకున్న లక్ష్మికి తేరుకోడానికి అరగంట సమయం పట్టింది.

దుఃఖం తన్నుకొస్తోందామెకు.

ఛీ.. ఇటువంటి మనుషులుంటారా..

పెద్దాయన కదా అని ఎంత గౌరవంగా చూసింది.

రెండు రోజుల తర్వాత, వాచ్‌మన్‌తో కబురు పెట్టింది పద్మావతమ్మ.

'ఏవిటి లక్ష్మి.. పనికి రావడం లేదు.  చెప్పాలని తెలీదా..' తీక్షణంగా అడిగిందామె.

సోఫాలో కూర్చుని పేపర్‌లోంచి తలెత్తకుండా దొంగచూపులు చూడసాగాడు ఆవిడ భర్త.

'చమించండి అమ్మగారూ.. నాకు చేత కావడం లేదు. నేను పనికి రాను ఇక. వేరే వారిని చూసుకోండి.' చెప్పింది లక్ష్మి.

'ఆ విషయం నువ్వు చెప్పనవసరం లేదులే గాని, ఏవయిందే వయస్సులోనున్నదానివి. నీకేం తక్కువ చేశాను?' నింపాదిగా అడిగింది పద్మావతమ్మ.

'వద్దు అమ్మగారు.. అవన్నీ అడక్కండి. నాకు చేత కావడం లేదు.. అంతే.'

'నిజం చెప్పవే.. నేను ఊర్లో లేనప్పుడు పని మానేశావ్. ఏం జరిగిందసలు..' అంటూ భర్త వైపు దృష్టి సారించిందా ఇల్లాలు.

ఆమె ప్రశ్నకు జవాబు చెప్పలేక తల పక్కకి తిప్పుకుని 'దయుంచండి అమ్మా..ఇక వెళ్తాను..' అంటూ వెనుతిరిగింది లక్ష్మి.

ఆ సాయంత్రం మల్లయ్యతో చెప్పింది లక్ష్మి.

'మనూరుకు ఎళ్దామయ్యా.. కలో గంజో తాగుదాం. మనూరుకు కూడా పట్నం నుంచి స్కూల్ బస్సులు వస్తాయట కదా. బుడ్డోడిని అక్కడ చదివిద్దాం.'

'సరేగానీ.. అక్కడ ఎలా బతకాలే. బతకలేకే కదా ఇక్కడికి వచ్చింది. ఏవయిందే.. నీ బుర్రలో పురుగు తొలిచిందేమిటి? అడిగాడు.

ఇక ఉండబట్టలేక జరిగింది చెప్పి..

చేతుల్లో 'మొహం' దాచుకుని ఏడవసాగింది లక్ష్మి.

'ఓస్.. ఊరుకోవే. పట్నంలో తోడేలు మందలుంటాయే. మనమే పదిలంగా ఉండాలి జర.' అంటూ ఊరడించసాగాడు.

'నేను ఇక్కడ ఉండలేనయ్యా.. ఆబాబుగోరు ఇటే వెళ్తాడు బజారుకు. నాకు

భయంగా ఉందయ్యా.. ' మొగుడిని కౌగిలించుకుంది.

ఇప్పటికిప్పుడు ఎలాగే.. బుడ్డోడిని ఇక్కడి దగ్గర స్కూల్లో చేర్పించాము. మరలా బోలెడు ఖర్చు. నేను వెళ్ళి పంచాయతీ పెట్టుకుని వస్తా ఉండు.'

'ఈ లొల్లలు మనకు వద్దయ్యా.. మనమసలే గరీబోళ్ళం. ఆ ఇంట్లో పని మానేశాను. నా జాగ్రత్తలో నేనుంటాలే..' చెప్పింది.

మరుసటి రోజు పద్మావతమ్మ కొంత డబ్బు పంపింది వాచ్‌మన్ ద్వారా. లక్ష్మి అర్థం చేసుకుంది. ఈ విషయం బయటకు తెలిస్తే అమ్మగారి పరువేపోతుందనుకుందేమో.

**పోదామంటే బస్సులు, రైళ్లు బందయినాయి. ఒక్క గోస కాదు. హారి భగవంతుడా.. ఏమిటయ్యా ఈ పరిస్థితులు తెచ్చావు. కరోనా బారిన పడితే, జరగకూడదని ఏదైనా జరిగితే.. అప్పటికే వార్తలు వస్తున్నాయి, కరోనా చావుల గురించి. ఎవరైనా చస్తే ఈడ్చి పాడేస్తున్నారు.**

అదే రోజు పద్మావతమ్మ భర్త తన ఇంటి ముందు నుంచి తలవంచుకుని పోవడం గమనించింది లక్ష్మి. తల కూడా ఎత్తి చూడలేదు ఆ పెద్దాయన. తప్పు ఆలోచన చేసింది ఆయినా తానెందుకు ఇక్కడి నుంచి వెళ్ళాలి. ధైర్యం చిక్కబుచ్చుకుంది ఆమె.

నగర జీవనానికి అలవాటు పడుతున్నారు మల్లయ్య, లక్ష్మీలు. బుడ్డోడిని 'సీమ' చదువులు చదివిస్తున్నారు. మల్లయ్యకు చేతినిండా పని దొరుకుతోంది. రోజూ పనికి వెళ్తున్నాడు. ఒక్క ఇల్లు పోతేనేం.. మరో ఇల్లు చూసుకుంది లక్ష్మి. పని చేయాలే కానీ, పనిమనుషులకు 'డిమాండ్' బాగానే ఉంది సిటీలో. ఏదో బుడ్డోడికి చదువు బాగా వస్తే చాలు.

తమ ఊరిలో ఏముందక్కడ, తాము తొందరపడకూడదు. ఇక్కడే ఉండి కాళ్ళు ముడుచుకోవాలి. ఇలా ఆలోచనలో నిమగ్నమైంది లక్ష్మి.

రోజులు సాఫీగా జరిగితే కాలానికి కూడా కుళ్లే. ప్రపంచం మొత్తం పడగ విప్పింది మహమ్మారి 'కరోనా'. నగర జీవితాలను అతలాకుతలం చేయసాగింది ఆ రక్కసి. జనజీవనం స్తంభించింది. పనులు మూలనపడ్డాయి. చిన్నా చితకా పనులు చేసుకునేవారు పస్తులుండడం మొదలు పెట్టారు.

అందరిలాగానే మల్లయ్య కూడా.. నిర్మాణ రంగం పడకేసింది. పదేను దినాలయింది మల్లయ్య పనికెళ్ళి. పని మనుషులను కూడా ఇళ్లలోకి రానివ్వడం లేదు.

భయం భయం.. అంతా భయం..

బుడ్డోడు చదువు బందయింది.

ఇంట్లో ఉన్న 'సరంజామా' అడుక్కొచ్చింది.

వచ్చే నెల ఇంటి 'బాడుగ' ఎలా ఇవ్వాలో తెలియదు. ఇద్దరూ పని చేస్తేనే బొటాబొటిగా గడుస్తుంది.

భవన నిర్మాణ కార్మికులలో అత్యధిక శాతం తమ తమ ఊళ్లకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అక్కడ వుంటే కలో గంజో తాగొచ్చు. లేదా ఉపవాసం ఉండొచ్చు. ఇక్కడే ఉంటే చచ్చినా పట్టించుకునే దిక్కులేదు. పనీపాటా లేకుండా ఇక్కడ ఉండి చేసేదేముంది. అద్దె కొంపల్లో యజమానులు ఊరికినే ఉండనిస్తారా..

పోదామంటే బస్సులు, రైళ్లు బందయినాయి. ఒక్క గోస కాదు. హోరి భగవంతుడా.. ఏమిటయ్యా ఈ పరిస్థితులు తెచ్చావు. కరోనా బారిన పడితే, జరగకూడదని ఏదైనా జరిగితే.. అప్పటికే వార్తలు వస్తున్నాయి, కరోనా చావుల గురించి. ఎవరైనా చస్తే ఈడ్చి పాడేస్తున్నారు. అటు నుంచి అటే వల్లకాటికి తీసుకెళ్తున్నారు. కడసారి చూపుకు అయినవారు, కన్నవారు, చివరకు కట్టుకున్నవారు సైతం నోచుకోవడంలేదు. రాజు–పేద తేడాలేదు.

ఒకవేళ సాధారణ చావే అయినా, చూడటానికి ఎవరూ రావడం లేదు. బతుకు భయం పీడించసాగింది అందరినీ. తిందామంటే తిండి లేదు, చేద్దామంటే పని లేదు.

'ఏం చేద్దామయ్యా..?' అడిగింది లక్ష్మి.

'అదే అర్థం కావడం లేదే.. బతుకు కనా కష్టంగా ఉంది. ఎలాగో ఏమో?' మల్లయ్యలో దిగులు.

'ఇక్కడ ఉండి చేసేదేముందయ్యా.. మన ఊరు ఎళ్దాం' సలహా చెప్పింది లక్ష్మి.

'నిజమేనే అయ్యకు కూడా చేతకావడం లేదు. ఆ రెండు ఎకరాలు మనమే సాగు చేద్దాం.'

'అవునయ్యా.. ఇప్పుడిప్పుడే ఈ రోగం తగ్గట్టు లేదట.. చావో, బతుకో అక్కడే ఉందామయ్యా. అందరం కలిసే ఉందాం. లేకపోతే ఎవరు చచ్చినా కబురు వెళ్లదు. ఎళ్దామయ్యా.. బతికుంటే బలుసాకు తినొచ్చు.' స్థిరంగా చెప్పింది లక్ష్మి.

'మరి బుడ్డోడి చదువు?'

'ఇంకేం చదువయ్యా.. బడులన్నీ మూతపడ్డాయి. అక్కడ మాత్రం దగ్గర పట్టణంలో చదివిద్దాం.'

'ఎలా ఎళ్తుందే?'

'ఎలాగో అలా నడిపిద్దామయ్యా. మనం పస్తులుండైనా వాడిని చదివిద్దాం. రేపు వాడే మనకు దిక్కు అవుతాడు.' ఆమె కళ్ళల్లో ఒక విధమైన వెలుగు.

ఆమెకు స్వతహాగా ఈ నగర జీవితం నచ్చలేదు. కాలనీలో మగ జనాల చూపులు

ఆమె భరించలేకపోతోంది. కాలనీ చివర ఓ అపార్ట్మెంట్ వాచ్‌మన్ బిడ్డను మానభంగం చేశారు. డబ్బున్న మారాజులు దాన్ని కప్పిపెట్టారు.

అమ్మో.. ఈ తోడేళ్ళను తలచుకుంటేనే భయం వేస్తోంది. తనను తాను ఎలా కాపాడుకోవాలో తెలియడంలేదు. ఇంకా నయం పెనిమిటికి చెబితే బాధపడతాడని చెప్పడం లేదు. తనను తానే స్వీయ రక్షణ చేసుకుంటుంది.

ఎవరి దారి వారిదే..

మాయదారి 'రోగం' కబళిస్తే అందరిలాగే తాము తట్టుకోలేరు.

అప్పటికే 'వలసలు' ప్రారంభమయ్యాయి.

చిన్న చిన్న వ్యాపారాలు మూతబడ్డాయి.

బస్సులు, రైళ్ళు 'సర్వం' బందయినాయి.

అంతదూరం ఉన్న తమ ఊరికి ఎలా, ఏవిధంగా వెళ్లాలో అంతుచిక్కడం లేదు.

తమ తమ ఊళ్ళు వేలకొలది కిలోమీటర్ల దూరం ఉన్నా, నడక సాగిస్తున్నారు వేలాదిమంది.

భయం భయం.. అందరిలోనూ భయం.

అంతంత 'దూరం' నడవాలంటే మాటలా..

బతుకుభయం నడిపిస్తోంది అందరినీ.

పొట్ట చేత్తో పట్టుకుని వచ్చినవారు, ఆ పొట్ట నింపుకొనే దారులు మూసుకుపోయిన వేళ 'నగరం' ఖాళీ అవసాగింది.

చీమల బారుల్లా మూటాముల్లె తలపై పెట్టుకుని, చంటోళ్లని చంకన ఇరికించుకుని ఉన్న ఊరి బాటపట్టారు.

ఇక, తమకు అదే దారి.. అనుకున్నారు మల్లయ్య, లక్ష్మిలు కూడాను.

ఏడుపు తన్నుకొస్తోంది. ఇక వేరే మార్గం లేదు.

తమ ఊరు కొన్ని వందల కిలోమీటర్లు. నడక సాగిస్తే ఎన్ని రోజులు పడుతుందో..

కొద్దిపాటి 'చిల్లర' ఉంది.

దారిలో దయగల దాతలు అక్కడక్కడా తిండితిప్పల సంగతి చూస్తున్నారన్న సంగతి తెలిసింది.

ఇక, నడక ప్రస్థానం మొదలుపెట్టారు.

కాళ్లు తీపులు పెడుతున్నాయి. అక్కడక్కడా ఆగుతున్నారు. చెట్ల నీడన 'సేద' తీరుతున్నారు.

ఎవరో మనసున్న మారాజు 'దూప' తీరుస్తున్నారు.

బతుకుదామని పట్నం వస్తే, ఆశ నిరాశలు చేసిన 'మహమ్మారి'ని దుమ్మెత్తి పోస్తూ, దారిలో గుడిలో దాక్కున్న దేవుళ్ళకు దూరం నుండే దండాలు పెడుతూ నడక సాగించారు.

ఉన్న ఊరిని, కన్నవారిని వదిలి బతుకుచిత్రం గీసిన ఆ వ్యధార్త జీవులను ఆ ఊరే అక్కున చేర్చుకోవడానికి రమ్మంటోంది.

ఒక విధమైన బతుకు అలవాటుపడిన వారు, విధి పరిహాసం చేయగా, విపత్కర పరిస్థితుల్లో తమ ఊరి బాటపట్టారు. కన్న కలలు ఛిద్రంకాగా, బతుకు మీద ఆపేక్ష వారిని సొంత ఊరు బాట పట్టిస్తోంది.

ఎంత కాలానికో మరల పరిస్థితులు చెక్కబడినా.. స్వార్థంగా ఉన్న ఊరిని వదల వద్దని, ప్రకృతి గాలి పిలుస్తూ, ఉన్నంతలోనే హాయిగా బతకాలని, చస్తే అందరి మధ్య చావాలని, దిక్కులేని చావు చావకూడదని లక్ష్మి ఒక నిర్ణయం తీసుకుంది. అందుకే, మధ్య మధ్య సొమ్మసిల్లే స్థితి వస్తున్నా, లేని ఓపిక తెచ్చుకుంటూ, వదిలిన ఊరి పొత్తిళ్లలో 'సేద' తీరాలనే తాపత్రయంలో అలా..అలా.. నడుస్తున్నారు లక్ష్మి, మల్లయ్య బుడ్డోడితో పాటు.

* * *

## పంతంగి శ్రీనివాస రావు

పంతంగి శ్రీనివాస రావు.. సూర్యాపేట వాసి. విద్యుత్ శాఖలో పనిచేసి పదవీ విరమణ పొందారు. ప్రస్తుత హైదరాబాద్ లో ఉంటున్నారు. రచనలు చేయడం హాబీ. ఇరవై కథలు వివిధ పత్రికలలో అచ్చయ్యాయి. 'నా రచనల వెనుక నా భార్య రాజశ్రీ ప్రోత్సాహం చాలా ఉంది' అని చెప్తారు శ్రీనివాస్.

# వీర

## (చారిత్రాత్మక కథ)

**ఎనుగంటి వేణుగోపాల్,**

**94402 36055**

గోల్కొండ కోట గుమ్మానికి వేలాడ దీయబడిన తలలేని గా మొండెం.. ఉడుకు నెత్తురు ఉరకలెత్తుతున్న మనిషి లెక్క ఎగిరెగిరి పడుతంది. ఉప్పెనలా విరుచుకుపడి శత్రుమూకను తుదిముట్టించి తన తోటి పేద జన సమూహాన్ని కాపాడుకోవాల్నని.. ఇప్పటికీ తహతహలాడుతంది.

ఎక్కడో దూరాన వనంలా మొలిచిన పొడవాటి తాటిచెట్లు కవాతు చేస్తున్న సైనిక సమూహంలా నిటారుగా నిలబడినట్టు.. కొమ్మల చేతులతో ఆ తెలంగాణ ముద్దుబిడ్డకు గౌరవ వందనం చేస్తున్నయి. అప్పటివరకు పిల్లల ఆటలు ఆడుకుంటూ సరదాగా తిరుగాడుతున్న గాలి పోరలు ఒక్కసారిగా స్తంభించి.

**'వీరుడా వందనం**

**ధీరుడా నీకు కన్నీటి వందనం..'**

అంటూ శోకతప్త వదనంతో ఆర్తి గీతాలు పల్లవిస్తున్నట్టు గాలి ఆగకుండ వీస్తోంది. రెక్కలల్లార్చుకుంటూ గగన వీధి వైపు ఎగరబోతున్న పక్షుల గుంపు పయనమాపి.. తిరిగి చెట్ల కొమ్మల మీద వాలి ఆ కరుణ రసాత్మక దృశ్యానికి కన్నీటి బొట్లు రాలుస్తూ అశ్రుతర్పణం చేస్తున్నయి.

మొండెం నుంచి వేరవుతూ నేలకొరగాల్సిన అరుణారుణ రక్తపు చుక్కలు.. ఇంకా పౌరుషం తగ్గక భగభగమని మండుతున్న నిప్పు కణికల్లా ఉవ్వెత్తున ఎగిసిపడుకుంట.. చరిత్ర పుటలపై అక్షరాకృతి దాల్చుతూ తమ వీరోచిత చేవ్రాలు లిఖించుకుంటున్నయి.

***

అది వరంగల్ జిల్లా రఘునాథపల్లి మండలంలోని మారుమూల పల్లె. ఖిలాషాపూర్ గ్రామ శివారు.. 'నీయవ్వ! పీకల్దాక తాగి తాగి తూలితూలి పైసలియ్యకనే వోతున్నరు. పేదోల్లు గాదుర గా నిజాం సైనికులు.' కసిగా అన్నడు కొమురన్న. పాపన్న గౌడ్ పోసిన కళ్ళు తాగి పైసలియ్యకుండనే ఎల్లిపోబోతున్న నిజాం సైనికులు కొమురన్న మాటలకు ఒక్కసారిగా త్రాచుల్లా బుసలు కొట్టింద్రు.

'గాళ్ళెప్పుడు గీ ఊరిదిక్కచ్చినా బేవుసయేదాక కల్లుదాగి పైసలియ్యక పోవుడు పాతముచ్చటేనాయె..!' మల్లెవరో అన్నరు.

'ఊరూర్కి దిర్గుతు జనం కాడ శిస్తు అసూలు జేస్కపోయే సైనికుల కాడ పైసల్ తీసుకునుడెందుకని పాపన్న గౌడ్ మంచి మనసుతో పెద్దగా పట్టించుకుంటలేడు.గా పైసల్ ఖజానాకు సేరుడేగదా ఎట్లయితేందనుకుంటుంటె.. గీల్లేమో బగ్గ దాగుడు.. ఉత్తగనే ఎల్లిపోవుడు.' రొయ్యల మీసాలు తిప్పుకుంట సోమయ్య అన్నడు. సైనికులు కళ్ళుతాగే టైముకి గా పాపన్న కల్లుమండువకోపక్కన.. కల్లు తాగెతందుకు అచ్చినోళ్ళకు యాపసెట్టుకింద కల్లువోసుకుంట ఉండే మరో కల్లుగీత కార్మికుడు కొమురన్నగౌడ్‌కు కుతకుతలాడేది.

'తాటి సెట్టెక్కినమంటె పేణాల్ని గాలిల దీపంలెక్క వెట్టినట్టే నాయె! ఉత్తపున్నానికే వొళ్ళు సొలిగేంత కల్లుదాగి పైసలు ఎగ్గొట్టెటోల్లంటె నీయవ్వ.. పెయ్యంత కారంబూసినట్టు మండుతది.' అని ఎన్నోమల్కల తెలిసినోల్లకు, తాగెతందుకు తనకాడికి అచ్చినోల్లకు సెప్పెటోడు.

గసువంటి బద్మాష్ ఆలోచన్లు ఎవలన్న జేయకుంట సుదురాయించుకుంటరని కొమురన్న ముందుజాగ్రత్త. అప్పటికే గుర్రం ఎక్కబోతున్న గా సైనిక పటాలం పెద్ద కళ్ళెర్ర జేసుకుంట కొమురన్న మీదికి ఉరికచ్చి కోపంతో ఊగిపోత కాలెత్తి తన్నబోయిండు.

గా హఠాత్ పరిణామాన్ని, ఒక సామాన్యుడిపై అకారణంగా సైనికుల ప్రతాపాన్ని ఊహించని పాపన్న గౌడ్ కోపోద్రిక్తుడవుతూ.. పాదరసంలా కదిలి తన నడుముకు వేలాడుతున్న కల్లుగీసే కత్తిలాగి తోటి మిత్రుడిపై కాలెత్తిన సైనికుడి మెడపై పిడాత వొక్క వేటు వేసి పడగొట్టిండు.

క్షణంలో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. మిగతా సైనికులు పాపన్నపై గుర్రాలు దిగచ్చి కలియబడ్డరు. కబురందుకొని ఆడికి ఉరికచ్చింద్రు పాపన్న గౌడ్ దగ్గరి దోస్తులు. చెరువు కట్ట కాడ బట్టలు ఉతుకుతున్న చాకలి సర్వన్న, ఊరి రచ్చబండ కాడ ఎవలకో

గడ్డం గీస్తున్న మంగలి మాసన్న, పొలంకాడ వరి నాటేస్తున్న జక్కుల పెరుమాండ్లు, ఇంటి ముందుర పందిరి కింద కుమ్మరి సారెతో కుండలు ఆనుతున్న కుమ్మరి గోవిందు, పాత సీరెలతో బొంతలు కుడుతున్న దూదేకుల పీరు, ఏదో పనివడి పక్కూరుకు పోవడానికి తయారవుతున్న కొత్వాల్ మీర్ సాహెబ్‌లు.

సమయానికి చేరిన తన ఆరుగురు సోపతోళ్ళ సాయంతో.. తాటి చెట్లు ఎక్కి ఎక్కి ఆరుపలకల దేహంలా తయారైన దేహ దారుఢ్యంతో బలంగా ఉన్న పాపన్న అవలీలగ గాళ్లందరిని మట్టికరిపించిండు. పరిస్థితి తమకు అననుకూలంగా ఉండడంతో సైనికులు గుర్రాలను, శిస్తు మూటలను అక్కడే వదిలి ప్రాణభయంతో వెనుదిరిగి పారిపోయిండ్రు.

గొడంత సేపటిదాక రణరంగాన్ని తలపించిన గా కల్లు మండవ పరిసర ప్రాంతమంతా ప్రశాంతతను సంతరించుకుంది. ఈ సంఘటన పాపన్న గౌడ్ జీవితంలో సరికొత్త అధ్యాయానికి తెరలేపింది. రాచరికపు 'అరాచకానికి, అన్యాయానికి అతడు వినిపించిన తొలి ధిక్కార స్వరమిది.

ఆరుగురు దోస్తులు పాపన్న దగ్గర చేరిండ్రు. 'గీ పైసలు ఏం జేద్దాం పాపన్నా?' అడిగిండు దూదేకుల పీరు. వెంటనే బదులివ్వలేదు పాపన్న గౌడ్ ఏవేవో ఆలోచనలు అతని మదిలో సుడులు తిరుగుతున్నయి.

ఒక సరికొత్త పథకం అతనిలో రూపుదిద్దుకుంటుంటె 'ఏం జేసుడేంది? గియన్ని ఎవల పైసలు? బీద బిక్కి కాయ కష్టం సేసుకునే బడుగు జనాలవి. మనోల్లయే. మనసువంటి పేదోళ్లను పీడించి పీడించి వసూలు జేసిన గీ ధనరాసులు ఆల్లకే దక్కాలె. ఆల్లకే పంచాలె. గీ పైసల మూటలు ఎత్తుండ్రి ఊర్లెకు పోదాం పాండ్రి.' పాపన్న సెప్పుడాలస్యం దవ దవ మనిషికి ఒకటి, రెండు మూటలు తీసుకొని పట్టుకున్నరు.

'మరి గీ గుర్రాల సంగతి..' సందేహం వెలిబుచ్చిండు కుమ్మరి గోవిందు. 'మీర్ సాహెబ్!' అని పిలిసి అతని దిక్కు సూసుకుంట 'జరంత గుర్రాల సంగతి నువ్వే సూస్కో. గుర్రాలను కల్లు మండువలో కట్టేసిరా. గా గుర్రాలను ఏం జేసుడో అటెన్క ఆలోచిద్దాం. మేం ఊర్లెకు వోయి పైసల్ పంచుతం.' అనుకుంట దోస్తులతో కలిసి తన ఊరి ప్రజలకు డబ్బులు పంచడానికి ఖిలాషాపూర్ ఊర్లెకు చిన్నపాటి సైనిక దండులా కదిలిపోయిండు పాపన్న గౌడ్.

* * *

పడుకున్నాడన్న మాటే గానీ గా దినం రాత్రంతా నిద్ర వట్టలేదు పాపన్న గౌడ్‌కి.

సోపతోళ్ళతోని గలిసి ప్రజలకు డబ్బులు పంచుతున్నప్పుడు ఆళ్ల కళ్ళలోని కాంతులు ఇప్పటికీ అతడిని కలవరపెడుతున్నయి. తాను చేసింది చిన్న పనే గని జనమంతా వంగి వంగి రెండు సేతులెత్తి పెట్టిన దండాలు అతడిని ఆలోచనలోకి నెట్టేశాయి.

గీ బడుగు వర్గాల కోసం తనేమి చేయలేడా ? పేదల ఆనందాన్ని శాశ్వతపర్చలేడా ? తెలతెలవారుతుండగా భగభగ మండే ఒక పిడుగులా.. ఫెళ్ళున విరుచుకుపడే ఒక ఉప్పెనలా.. అతడి మనో పేటికలోకి దూసుకు వచ్చిందొక ఆలోచన. కప్పిన దుప్పటిని ఎగదన్ని మంచం మీది నుంచి కొదమ సింగమోలె కిందికి దుమికిండు.

***

పొద్దు పొద్దుగాల్నె ఆగమాగం ఇంటికురికచ్చిన పాపన్న గౌడ్‌ను జూసి విస్తుపోయిన చాకలి సర్వన్న 'పాపన్న గీ టైంల అచ్చినవేంది?' అనుకుంట ముందు గూకో అని గుంజకాన్చి చిన్న నులక మంచాన్ని వాల్చిండు. 'కూసోని ముచ్చట వెట్టేటందుకు రాలేదు గని. నువ్వు వోయి మన సోపతోల్ల నందర్ని కల్లు మండువ కాడికి రమ్మని సెప్పిరాపో. నేనాడుంట.' అనుకుంట లేసిండు పాపన్న.

ఎందుకని అడగలేదు చాకలి సర్వన్న. పాపన్న ఏది సేసినా మంచి కోసమే సేత్తడు. మంది కోసమే సేత్తడు. తనకు, తన సోపుతోళ్ళకే గాదు. ఊరందరికీ తెలుసు అనుకుంట గట్లనే అన్నట్టు తలూపిండు. ఎన్కకు దిరిగి ఎల్లిపోతున్న పాపన్న నడకల కొత్త కొత్తగ ఏదో రాజసం ఉట్టి పడుతున్నట్టు మొదటిసారిగ కనిపించింది చాకలి సర్వన్న కళ్ళకు.

***

'బలహీన వర్గాలకు ఆర్థికంగనే గాక, అన్నిట్ల గూడ సమంగ న్యాయం జరగాలె. పుట్టుక అందరిదీ ఒకటే అయినప్పుడు గిట్ల ఎక్కువ తక్కువలు ఎందుకుండాలె? సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగనే మన పోరాటం. పొట్ట కోసం, బట్టకోసం, బతుకు కోసం ప్రతిక్షణం పోరాటం సేసుకుంట సచ్చి బతుకుతున్న పేద జనం పక్షాన మనముండాలె. మనం బిగించిన వొక్క పిడికిలి పది పిడికిళ్ళు గావాలె. గా పది వంద.. వంద పిడికిళ్ళు వేలకు వేలై అన్యాయానికి అడ్డుగోడై.. పేదోళ్లకు అండగ నిలవాలె.'

తన ఆలోచనని కార్యాచరణను తన ఎదురుంగ గూసున్న మిత్రులకు వెల్లడించిండు పాపన్న గౌడ్. బదులుగా సామూహికంగ తలలూపిండ్రు. గీ ఆరుగురు దోస్తులే గాక ఊర్లోని మరికొంత మంది యువకులను కూడగట్టుకున్నడు పాపన్న. వాళ్లందరికీ తనకు తెలిసినవి కొన్ని, తెలుసుకున్నవి కొన్ని మెళుకువలు నేర్పిండు.

**'ఆకాశంలో ఉరుములు, మెరుపులు, మేఘాల పరుగులు లెక్క.. వొక దిక్కు నుంచి బాణాలు,బడిసెలు... మల్లొక దిక్కు నుంచి విరిగిన చిన్న చిన్న చెట్ల కొమ్మలు,గుల్లేరు తోని రాళ్ల దెబ్బలు... వశ పడకుండ ఎర్క లేకుండ ఏడి నుంచో మీది వడుతుంటె సైనికులు ఉ క్కిరిబిక్కిరై పోయింండ్రు.'**

'సావుకు వెనుకడుగు వేసుడులేదు. పేదోళ్ల కోసమే మన గీ పోరాటం. గది మర్వకుండ్రి.' మానసికంగ, శారీరకంగ ధైర్యంగ ఉండేటట్టు క్షణక్షణం తన సహచరులకు ఆత్మస్థైర్యాన్ని నూరిపోసిండు. మెరుపు దాడులు చేయడం, ఎదురుదాడి నుండి తప్పించుకోవడం, శత్రువుకి దొరకకుండా దాక్కోవడం వంటివాటిపై పూర్తి శిక్షణ నిచ్చి.. తన అనుచరులతో మెరికల్లాంటి గెరిల్లా సైన్యాన్ని తయారు చేసిండు పాపన్న గౌడ్. 'జనాన్ని పీడించి బలవంతంగ శిస్తులు వసూలు చేసుకొని సైనికులు వెనుదిరిగి పోయే తొవ్వలోనె మనం మాటు వేసుడు. మనకు ప్రాణహాని లేనంతవరకు వాళ్లకి కూడా ప్రాణహాని కలగకుండ గా సైనికుల్ని భయంతో పారి పోయేటట్టు సేయాలె. వాళ్లు వదిలిపెట్టి వెళ్లిన గుర్రాలు, ధనరాసులు మనం సొంతం చేసుకోవాలె.' పాపన్న గౌడ్ మాటలింక పూర్తి కానే లేదు కుమ్మరి గోవిందు గట్టిగ 'ఆగాగు పాపన్న..' అనంగనే పాపన్నతో పాటు గా గెరిల్లా యువ దళం నిశ్శబ్దమై పోయింది.

'ఇంటుండ్రా! గుర్రాల సప్పుడు ఇనవడతంది. దరిదాపుల్లోకి అచ్చేసినట్టున్నరు.' సెప్పిండు కుమ్మరి గోవిందు.

పాపన్న గౌడ్ ఎల్లమ్మ తల్లిని స్మరించుకొని 'ఎవలకు యే జాగలు అనుకున్నామో గాడనే ఉండుండ్రి. ప్రతి వొక్కల్ల సూపు అచ్చే సైనికులందరి మీద ఉండాలె. గప్పుడే మనల్ని మనం రక్షించుకుంటం. ప్రమాదాన్ని పసిగట్టి శత్రువు మీద దాడి చేయగలం. వూ ఉరుకుండ్రి.' అంటూ తన సహచరులను మెరుపు వేగంతో ఉరికిచ్చిండు.

పాపన్న గూడ ఆకలిగొన్న పులి లెక్క, ఎక్కుపెట్టిన మొనదేలిన బాణం లెక్క, దేన్నైనా చీల్చి చెండాడడానికి ట్రిగ్గర్ నొక్కబోయే ముందు సిద్ధంగా ఉండే తుపాకీలోని గుండు లెక్క. వొక్క అంగలో తనకు కేటాయించిన చెట్టు దిక్కు పరుగెత్తి సుశిక్షితుడిలా దవ్వ దవ్వ చెట్టుపైకి పాకి కొమ్మల మధ్య దాక్కున్నడు.

పాపన్న గెరిల్లా దళం ఊరి పొలిమేరలు దాటి ఏ అడవి ప్రాంతన్నైతే మెరుపు దాడికి ఎంచుకుందో అక్కడికి సైనికులు చేరుకోంగనే తమ దాడి వాటం చూపెట్టింది దళం.

ఊహించని ఆ దాడికి సహజంగనే బెదిరిపోయిండ్రు సైనికులు. అసలేం జరుగుతుందిక్కడని వాళ్ళనుకునే లోపల్నే గెరిల్లా దాడిలోని వ్యూహంలో భాగంగ తనకు కేటాయించిన నలుగురు సహచరులతో జక్కుల పెరుమాండ్లు మొదటగా సైనికులను చెల్లా చెదురు అయ్యేటట్టు చేసిండు. గప్పుడు మొదలైనయ్ దళంలోని మిగతా సభ్యుల దాడులు.

ఆకాశంలో ఉరుములు, మెరుపులు, మేఘాల పరుగులు లెక్క. వొక దిక్కు నుంచి బాణాలు, బడిసెలు.. మల్లొక దిక్కు నుంచి విరిగిన చిన్న చిన్న చెట్లకొమ్మలు, గుల్లేరుతోని రాళ్ల దెబ్బలు. వశ పడకుండ ఎర్క లేకుండ ఏడి నుంచో మీది వడుతుంటె సైనికులు ఉక్కిరిబిక్కిరై పోయిండ్రు.

బెదిరిపోయిన గుర్రాలు సైనికుల్ని కింద వడగొట్టినయ్. అసలు ఎవలు గీ పని సేత్తున్నరో ఎందుకు సేత్తున్నరో అర్థంగాక అయోమయానికి గురవుతూ భీతిల్లిన సైనికులు చెట్టుకొకల్లు పుట్ట కొక్కల్ల లెక్క పొదల్లోకి సైతం దూరు కుంట ముళ్ళ కంపలు గాయాలు చేసి రక్తం కార్చుతున్నా.. వేటిని లెక్క సేయకుండ పడుతూ లేస్తూ బతుకు జీవుడా అనుకుంట పారి పోయిండ్రు.

గిది మొదలు గెరిల్లా దాడులు ఆపలేదు పాపన్న. తురుష్క సైనికులు హింసాత్మకంగా, ఇబ్బందులకు గురి చేస్తూ పేద ప్రజలను పీడించి మరీ భూమి పన్నులని, కులాల మతాల పేరుతో పన్నులని, తాటి చెట్లుకు సైతం పన్నులని గిట్ల రకరకాలుగ వసూలు చేసిన శిస్తుల మూటలను, గెరిల్లా దాడుల్లో దొరికిన తురుష్క సైనికుల ఆయుధాలను, గుర్రాలను, తన పరం చేసుకున్నడు.

ధన రాశులను పక్క ఊర్లలోని పేదవారికి సైతం సహాయం చేయడానికి ఉపయోగించడంతో పాపన్న పేరు జనగాం ప్రాంతమంతా మార్మోగింది. చాలా గ్రామాల్లోని యువకులు పాపన్న ఏర్పాటుచేసిన సైన్యంలో చేరిండ్రు. పాపన్న తాను యుద్ధవిద్యలు నేర్చుకోవడంతో పాటు వారికి గూడ నేర్పించిండు. అలా తొందర్లోనే మూడు వేలమంది సైనికుల్ని తన బలగంగ తయారు చేసుకున్నడు. మర ఫిరంగుల నుంచి అశ్వబలం వరకు అన్నిరకాల సైనిక సంపత్తిని సమకూర్చుకున్నడు.

***

'బిడ్డా! సిన్నప్పుడే అయ్య సచ్చిపోతే.. గీ గుండెలమీద పెంచిన. కండ్లల్ల వెట్టుకొని, కడుపుల దాసుకుంట సాదిన. కండ్లల్ల నీళ్లు దెప్పించకు. కడుపు కోత వెట్టకు' కొడుకు గోల్కొండ రాజులపై తిరుగుబాటుకు తయారైతండని తెలిసిన తల్లి సర్వమ్మ పాపన్న

ముందు కన్నీళ్ల పర్యంతమయ్యింది.

'అమ్మా! దిగులు పడకు. సబ్బండ వర్ణాల పేదజనం కోసం మొదలుపెట్టిన యజ్ఞమిది. గీ పోరాటంల సత్తినా.. నీ గుండెల్లో నీటి ఊటై ఊరుత నేమో గని జనం బతుకుల్లల్ల దీపమై వెలుగుత.'

'నాకు గవన్నీ తెల్వదు బిడ్డా! మీ నాయిన చేసి ఇడిసి పెట్టి పోయిన కల్లు గీత పని సేసుకోక పరేషానెందుకురా అయ్యా!' అంటూ కొడుక్కి నచ్చ జెప్పింది సర్వమ్మ.

'అమ్మా! ఇగ నా కోసమో, నా కుటుంబం కోసమో తాటిచెట్టు ఎక్కను. లొట్టి పట్టను. తాబేదార్లు, జమీందారులు, జాగీర్దారులు చేసే దురాగతాలను అడ్డుకొని గోల్కొండ కోటపై బహుజనుల జెండా ఎగిరేసుడే నా కల.' తల్లి దగ్గర నుంచి వెళ్ళిపోయిండు పాపన్న.

**'మనం గెరిల్లా సైన్యంతో మొఘల్ సైన్యంపై దాడికి దిగ బోతున్నమని ఔరంగజేబుకు తెలిసిందట. ఔరంగజేబు తన సువిశాల సైన్యాన్ని మనపై ఎదురుదాడికి సిద్ధం చేస్తున్నడట.' అసలు విషయం చెప్పిండు చాకలి సర్వన్న.**

తల్లితో చెప్పిన మాటల ప్రకారం అతి తొందర్లోనే తన గెరిల్లా సైన్య బలగంతో మొఘలు సైన్యంపై దాడి చేసి ఖిలాషాపూర్‌ని రాజధానిగా చేసుకుని సర్వాయిపేటలో తన కొత్త రాజ్యాన్ని స్థాపించుకున్నడు సర్వాయి పాపన్న.

పాపన్న ప్రజల కష్టనష్టాలు తెలిసినోడు. అతని రాజ్యంలో పన్నులేం లేవు. సామాజిక న్యాయం పాటించిండు. గందుకే ప్రజల మనిషి అయ్యిండు. ప్రజల గుండెల్లో కొలువయ్యిండు.

***

'మన యుద్ధ వ్యూహం ఫలించింది. తాటికొండ, వేములకొండ మన పరమయ్యాయి.' ఉద్వేగాన్ని అణుచుకుంటూ ఆనందంతో గా కబురు చేరవేసిండు మంగలి మాసన్న. అలా ఒక్కొక్క మెట్టు పైకి ఎగబాకుతూ దాదాపు ఇరవై కోటలను స్వాధీనంలోకి తెచ్చుకున్నడు పాపన్న.

సుమారు పన్నెండు వేల సైన్యాన్ని విస్తరించుకుని చివరకు గోల్కొండ కోటనే స్వాధీన పరుచుకొని ఏడు నెలలపాటు అధికారం చెలాయించిండు. గట్ల మొగలాయి సామ్రాజ్య విస్తరణను మొదలుకు మొదలు అడ్డుకున్న ఘనత తెలంగాణ తేజం ధీశాలి

**ఒక వీరుడి వీరత్వం అణగారిపోదు. అదును కోసం పాపన్న ఎదురుచూస్తున్నడు. పాపన్న కోరుకుంటున్న అవకాశం చిక్కే సమయం రాబోతున్నది. ఔరంగజేబు మరణానంతరం దక్కను పాలకుడు కంబక్ష్ ఖాన్ బలహీన పాలన పాపన్నలో సరికొత్త ఆశలు చిగురింప చేసింది.**

సర్వాయి పాపన్నదే. తర్వాత భువనగిరి కోటను రాజధానిగ చేసుకుని ముప్పై ఏండ్లపాటు నిరాటంకంగ పరిపాలన సాగించిన యోధుడితడు.

***

'పాపన్నా! వొక దుర్వార్త వేగుల ద్వారా తెలిసింది.' పాపన్నని తన ప్రాణమిత్రులందరితో పాటు రహస్య సమావేశం ఏర్పాటు చేసినంక చాకలి సర్వన్న కబురు చేరవేసిండు.

'ప్రజల కోసం ప్రజల కష్టాలు తీర్చడం కోసం పరిపాలిస్తున్న మనకు దుర్వార్తా?' అనుకుంట బిగ్గరగా నవ్విండు పాపన్న.

అది మామూలు నవ్వులా లేదు. యుద్ధానికి సిద్ధమై వచ్చిన శత్రువుని బెదరగొట్టేలా చేసే కొదమసింహం గర్జనలా వినిపించింది అక్కడి వాళ్ళకి. 'కొండ అద్దమందు కొంచమై కనవడుతదేమోగని నిజంగ సూత్తె కొండకు, అద్దానికి పోలికేమైన ఉంటదా? నీవు అందుకున్న కబర్ ఏందో ఢొంకతిరుగుడు లేకుండ సెప్పరాదు.' ఇసుక్కున్నడు దూదేకుల పీరు.

'మనం గెరిల్లా సైన్యంతో మొఘల్ సైన్యంపై దాడికి దిగ బోతున్నమని ఔరంగజేబుకు తెలిసిందట. ఔరంగజేబు తన సువిశాల సైన్యాన్ని మనపై ఎదురుదాడికి సిద్ధం చేస్తున్నడట.' అసలు విషయం చెప్పిండు చాకలి సర్వన్న.

'గీ పనికి పూనుకోకపోయే దుండేదేమో! అనవసరంగ మనమే కయ్యానికి కాలు దువ్వినట్టయ్యింది.' కుమ్మరి గోవిందు కలగజేసుకున్నడు. 'ఒక బహుజనుడు రాజ్యపాలన చేయడాన్ని అగ్రవర్ణాలు తట్టుకోలేకపోతున్నయ్ పాపన్నా! ఉన్నవి లేనివి చెప్పి ఔరంగజేబుని మనపై ఉసిగొలిపేలా చేసినట్టున్నరు. మనం యుద్ధానికి సిద్ధం కాకపోయినా ఎప్పుడో ఒకప్పుడు వీళ్ళ మాటలు చెవిన పడ్డ ఔరంగజేబు మనపై తప్పక సైన్యాన్ని పంపించి ఉండేవాడు.' తన అభిప్రాయాన్ని వెల్లడించిందడు మంగలి మాసన్న.

'మునుపటి మీ అందరి ధైర్యసాహసాలు, పౌరుషాగ్ని ఎటువోయినయ్. గిట్ల

పిరికోల్ల లెక్క మాట్లాడుతున్నరేంది? మీసం మెలిదిప్పి శూరుల లెక్క ముందుకు దూకుడే మల్లొక ఆలోచన చేయకుండ్రి. మన సైన్యాన్ని ఎప్పటి లెక్కనే సిద్ధం చేయుండ్రి.' అజ్ఞాపించిండు సర్వాయి పాపన్న.

***

మొగలాయి సైన్యంతో మూడు నెలల పాటు పాపన్న సైన్యం ఎదురొడ్డి పోరాడింది. భీకరంగా ఎగిసిపడే సముద్రపు కెరటాల ముందు పిల్ల కాలువ అలల కుప్పిగంతులు ఏపాటివి? హోరాహోరీగా జరిగిన ఆ యుద్ధంలో పాపన్న తన ప్రాణ స్నేహితులు కోల్పోవాల్సి వచ్చింది.

మొదటిసారి అతడిలో ప్రవేశించిన నైరాశ్యం యుద్ధాన్ని విరమింపజేసి.. అలుపెరుగని ఒక ధీరుడిని వెనుతిరిగి అజ్ఞాతంలోకి వెళ్లేలా చేసింది. తన ప్రాంతానికి తిరిగిపోయి గౌడ కులం వారు ఎక్కువగా ఉండే ప్రాంతంలో అజ్ఞాత జీవితం గడిపిండు.

***

ఒక వీరుడి వీరత్వం అణగారిపోదు. అదును కోసం పాపన్న ఎదురుచూస్తున్నడు. పాపన్న కోరుకుంటున్న అవకాశం చిక్కే సమయం రాబోతున్నది. ఔరంగజేబు మరణానంతరం దక్కను పాలకుడు కంబక్ష్ ఖాన్ బలహీన పాలన పాపన్నలో సరికొత్త ఆశలు చిగురింప చేసింది. అతి తక్కువ సమయంలో తిరిగి తన సేనను సమాయత్తం చేసుకొని వరంగల్ కోటపై దాడికి దిగిండు పాపన్న. కానీ అతడి స్వప్నం నెరవేరలేదు. గా దాడిలో పాపన్న అనూహ్యంగ పట్టువడ్డడు గని రవ్వంత కూడా బెదరలేదు పాపన్న.

> గెలుపైనా ఓటమైనా వీరుడెప్పుడూ వీర మరణమే పొందాలె. శత్రువు సేతిలో సచ్చి చరిత్రపుటల్లో ఒక మరకగా మిగిలే కన్నా.. గీ వీర తెలంగాణ గడ్డపై పుట్టిన బిడ్డగా నా మరణ శాసనాన్ని నేనే రాసుకుంటున్న

'గెలుపైనా ఓటమైనా వీరుడెప్పుడూ వీర మరణమే పొందాలె. శత్రువు సేతిలో సచ్చి చరిత్రపుటల్లో ఒక మరకగా మిగిలే కన్నా.. గీ వీర తెలంగాణ గడ్డపై పుట్టిన బిడ్డగా నా మరణ శాసనాన్ని నేనే రాసుకుంటున్న.' అని పౌరుషాగ్ని కురిపిస్తూ.

శత్రుసేన కత్తులు దూసి అతనిపై దుమకడానికి వెనుకాడుతున్నా నడుముకున్న ఒరలోంచి మెరుపు వేగంతో బాకు తీసుకొని తన గుండెల్లో పొడుచుకొని నేల కొరిగిండు. బహుజన కులాల బాగుకోసం తన జీవితాన్ని అర్పించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. విగత జీవుడై ఆర్తితో మౌనంగా విలపిస్తున్న నేలమ్మ తల్లి వొడిని చేరిండు.

అతడు మరణించిండని చాలా సేపటికి నిర్ధారించుకున్న శత్రువులు అతని తలను వేరు చేసి మొండాన్ని తీస్కపోయి ఏకంగ గోల్కొండ కోట గుమ్మానికి వేలాడదీసింగ్రు.

***

గోల్కొండ కోట గుమ్మానికి వేలాడ తీయబడిన తల లేని గా మొండెం.. ఉడుకు నెత్తురు ఉరకలెత్తుతున్న మనిషి లెక్క ఎగిరెగిరి పడుతంది. ఉప్పెనలా విరుచుకుపడి శత్రుమూకను తుదిముట్టించి తన తోటి పేదజన సమూహాన్ని కాపాడుకోవాల్నని ఇప్పటికీ తహతహలాడుతంది.

ఒక వీరుడు ప్రాణ త్యాగం చేసుకున్నడెమో గని.. జనంకోసం పోరాడే పౌరుషం తెలంగాణ గడ్డపై ఊపిరి పోసుకుంటూనే ఉంటుంది.

'వీరుడా నీకు వందనం ధీరుడా నీకు కన్నీటి వందనం' గీ ఉద్వేగభరిత పాట పరిమళం తాజా శ్వాసలా ప్రతి తెలంగాణీయుడి గుండెలో లయాత్మకంగ వినిపిస్తంది.


## ఎనుగంటి వేణుగోపాల్

వేణుగోపాల్‌ది జగిత్యాల. సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు. ఇప్పటి వరకు 172 కథలు, 30 కవితలు, 60 వ్యాసాలు రాశారు. ఇతర నవలలూ రాశారు.

# చావు

**మంచికంటి వెంకటేశ్వర్లు,**

**99495 35695**

'ఏడవండి.. బాగా ఏడవండి. ఇంకా.. ఇంకా గొంతులు పెంచి నలుగురికీ వినపడేటట్టు ఎక్కెక్కి ఏడవండి. దీనికి బాధపడాల్సిన పనేముందమ్మా. సంతోషంగానే ఏడవండి.

ఆనందం తన్నుకు వొస్తుంది కదా! పొగిలి పొగిలి ఏడవండి'

'మీ ఇంట్లో ముసలివాసనే వెయ్యదింక. మీ వసారాలో ఒంటేలు వాసనే కొట్టదింక. మీ కాళ్ళకూ చేతులకూ అడ్డంపడే వాళ్ళే ఉండరింక. అటుఇటూ పోయేవాళ్ళని పలకరించి మీ అరుగుల మీదకు తీసుకువచ్చే వాళ్లే ఉండరు. తెలిసినవాళ్లని తెలియనివాళ్ళని తీసుకు వచ్చి, మంచాల మీద కూర్చోబెట్టి మంచాలు విరగ్గొట్టేవాళ్ళే ఉండరు. ఇంటి ముంగిట్లో నలుగురు మణుసులు కూర్చోని గలగలా మాట్లాడే మాటలే వినబడవింక. హాయిగా శ్మశానంలోలాగా ఎంత నిశ్శబ్దంగా ఉంటుందో మీ ఇల్లు. అందుకే బాగా ఏడవండి. మనసుని పిచ్చి గంతులు వేయిస్తూ ఏడవండి'

'మీ పిల్లలకింకా పిట్టకథలూ, నీతి కథలు చెప్పి చెడగొట్టడానికి ఎవ్వరూ లేరుగా. ఆటలు ఆడిస్తూ పాటలు పాడిస్తూ కాలాన్ని వృథా చేసే వాళ్ళే లేరుగా. ఇంక మీరు పిల్లల్ని పిచ్చి పట్టిందాకా చదివించొచ్చు'

'నిండు ముత్తైదువ అట్టా ఉండకూడదమ్మా. అలా ఉంటే ఇంటికే అరిష్టమమ్మా, పొద్దున్నే లేచి మొఖం కడుక్కుని, తల దువ్వుకుని, బొట్టు పెట్టుకొని నట్టింట్లో తిరుగుతా ఉంటే ధనలక్ష్మి ఘల్లు ఘల్లుమంటూ గజ్జెలు కట్టుకొని తిరుగుతుందమ్మా అని చెవినిల్లు కట్టుకొని పోరు పెట్టేవాళ్ళెవరు ఉన్నారమ్మా ఇంక'

'అయ్యా నీకు మాత్రమేం నాయనా. పనులు చేసుకోకుండా బలాదూరు తిరుగుతారెందుకురా! తాగితందనాలు తొక్కడం మన ఇంటావంటా ఉందంట్రా అని వెంట బడేవాళ్ళే లేరు కదా! ఇరుగింటి కాకి పొరుగింటి కాకి ఇంక మీ ఇంటి మీద వాలనే వాలదుకదా! ఎందుకింత దుఃఖ పడతారు. కాస్త సుఖంగానే ఏడవండమ్మా'

'అమ్మాయ్ బాధంతా నీదేనమ్మాయ్. టంచన్‌గా ముప్పూట మూడు పొద్దులూ పిండం పెట్టేబాధ్యత తీరిపోయింది కదమ్మా. నువ్వే బాగా ఏడవాలి తల్లీ. ఇంతకాలం బరువూ బాధ్యతలూ మోసిన దానిని కదా! కాస్త బలంగా ఏడవాలమ్మా'

'దమ్ము చాలడం లేదా! ఎట్టమ్మా అలాగంటే. కాస్త.. ఆఅ.. ఆఅ.. ఇంకాస్త.. నాభి నుండి ఊపిరి బిగపట్టమ్మా. కాస్త ఎగిరెగిరి పడినట్టుంటే కదా! ఎక్కిళ్ళు వచ్చినట్టు ఉండాలమ్మా. ఆఅ.. ఇప్పుడు కాస్త పరవాలేదు. అటు చూడమ్మా.. తెలియకపోతే చూసి నేర్చుకోవాలి కదమ్మా!'

'పెద్దకూతురు చూడు చాలినంత బంగారం చేయించలేదని బతికినంతకాలం సాధించినా

ఇప్పుడు చూడు ఎంత బాగా ఏడుస్తుందో! ఏం పిల్లవో ఏదీ దాచుకో లేవు'

'అబ్బెబ్బే.. నువ్వు ఏడుస్తున్నట్టే లేదమ్మా. ఎంత పరాయింటి దానివైనా, కోడలన్న తరువాత బాధ్యత ఎక్కువే కదంటమ్మా. అందరికన్నా నువ్వే ముందుండాల.

ఇదుగో ఇంక లాభం లేదుకానీ ఆ పవిట చెంగు నోట్లోనన్నా దోపుకో తల్లీ. ఆఅ.. ఇప్పుడు కాస్త పరవాలేదులే. ఏడుపు కళ వొచ్చేసింది'

'అబ్బాయ్ ఇట్రాయ్యా. నువ్వు మరీ అంత సిగ్గూ శరమూ లేకుండా బరితెగించి తిరుగుతాండావే. ఇయ్యాల ఒక్కరోజన్నా మీ ఆనందాల్ని లోపల దాచుకోండయ్యా. రా.. ఇక్కడొచ్చి కూర్చో. కాస్త యాడవడం నేర్చుకోండయ్యా బాబూ. పెద్దవాళ్ళంటే బతికున్నప్పుడు మర్యాదా మన్ననా ఎలాగూ లేదు. పోయినప్పుడైనా నటించకపోతే ఎలాగయ్యా'

'పాడె కట్టడానికి పోతుండావా! వోయబ్బో.. నువ్వు కట్టకపోతే అక్కడ చాలామంది ఉండార్లేవయ్యా. వాళ్ళు కడతారు పాడె నువ్విట్రా.. ఎట్టా బతికినోడయ్యా మీ నాయన. ఎంతమంది నోళ్ళల్లో నానతా ఉండేవాడు. సాయం చెయ్యమని అడిగినోళ్ళకి ఏదోరకంగా చెయ్యి అందించే వాడే కానీ, కాదూ.. లేదూ.. అనేమాట ఆయన నోట్లోనుండి ఎప్పుడైనా వచ్చిందంటయ్యా. ఎవురెవురో వొచ్చి ఏడుస్తా ఉంటే నువ్వు యాడవకపోతే ఏం బాగుంటదయ్యా'

'రా.. రా.. ఇటొచ్చి కూర్చో. ఇంక మొదలుపెట్టు. రైట్.. ఇంకొంచెం శృతి

పెంచవయ్యా. ఆ.. పెళపెళ్లాడే చొక్కావిప్పి అవతల పారెయ్యవయ్యా. శవం ముందు ఎట్టా కూర్చోవాలో కూడా తెలవకపోతే ఎట్ట. లోపల సంతోషం ఈ ఒక్కరోజన్నా ముఖంలో కనిపించ నియ్యకూడదయ్యా. ఆ.. ఇప్పుడు కాస్త పరవాలేదులే. సెల్లులో చూసుకోని ఏడుస్తావా! చూశావులే అయ్యా.. పెద్ద.. సెల్లులో..! సెల్లంట సెల్లు పేద్ద నీకే ఉండట్టు సెల్లు.

వొద్దులే.. అన్నీ చూసుకోవడానికి నేనొకణ్ణి తగలబడ్డానుకదయ్యా. పెద్దరికం పెద్దరికం అంటూ ఒకటి ఏడ్చింది నా మొఖాన. అమ్మాయ్ ఒక టవలియ్యమ్మా. ఇదుగో ఇది తీసుకుని నెత్తిమీద వేసుకో. ఆ.. ఇప్పుడు కాస్త అవతారం కుదిరిందిలే. ఇంక కానీయ్. మరీ ఇంత చిన్న మూలుగేనా! కాస్త రాగాలు తియ్యవయ్యా'

'ఎట్టనా! ఎట్టేముంది. నువ్వు పూటుగా తాగినప్పుడు తీస్తావే అట్టా! ఆ..అద్దీ అదీ పట్టు. ఇంక కానీయ్..'

'ఇప్పుడు నలుగురూ శవం ముందు కూర్చోని ఒకరికొకరు తోడుగా ఏడుస్తుంటే కళకళ లాడుతుళ్ళా! మణిసి పోయిన ఇంట్లో ఈ మాత్రం కళ కూడా లేకపోతే ఎట్టయ్యా!'

'ఎవురయ్యా అక్కడ? ఏందదీ. యాడవడం బాగానే ఉందా! కన్నీళ్ళే రావడం లేదంటావా! బాధపడి బాధపడి ఇంకిపోయాయి కన్నీళ్లు. యాణ్ణుండి కారతయ్యంట కన్నీళ్లు. కన్నీళ్లంట.. కన్నీళ్లు.. బాగానే ఉంది సంబడం'

'ఇదుగో అమ్మాయ్! వాళ్ళేదో అంటన్నారు చూడండమ్మా. యాడవడమే గొప్పంటారా! అమ్మమ్మా.. అట్టంటే ఎట్టమ్మా! ఆడగూతుళ్ళు మీ వల్లే అయిద్దమ్మా. మీ దగ్గిరే బోలెడన్ని కన్నీళ్ళు ఉంటయ్యి కదమ్మా. నీ పెళ్ళిచెయ్యడానికి ఆయన పడని కష్టం లేదమ్మా. నువ్వు కాస్త పెద్ద మనసు చేసుకోమ్మా'

'ఏందమ్మా నీ పెళ్ళికి మంచి పట్టుచీర కొనియ్య లేదంటావా! పోనియ్యిలే తల్లీ ఆయన పాపాన ఆయనే పోయాడు. నువ్వే కాస్త పెద్ద మనసు చేసుకోని, కాసిని కన్నీళ్ళు ధార పోయమ్మా'

'పాపం ఏ పని తల పెట్టినా చచ్చి దుగ్గయ్యే వాడమ్మా. ఆయన కాబట్టీ అవసరానికి ఎంతైనా అప్పు తెచ్చి పని గడిపేవాడమ్మా. అంత గుండె ధైర్యం కలవాడిని నేనింత వరకూ చూళ్లేదమ్మా. ఎంత కావాలన్నా, ఏమి కావాలన్నా తెల్లారేసరికి పుట్టిచ్చేవాడమ్మా. నీ పెళ్ళి అంత బ్రహ్మాండంగా జరపకపోయినా, ఉన్నంతలో నీకు బాగానే చేశాడమ్మా. అయినా నా వల్ల కాదంటున్నావా తల్లీ. ఒక్క కన్నీటి బొట్టు కూడా లేదంటమ్మా'

'అమ్మా చిన్నతల్లీ నువ్వమ్మా.. బాగా చదువుకుంటున్నావని, నువ్వంటే పంచ ప్రాణాలుగా చూసుకున్నాడమ్మా. నువ్వన్నా ప్రయత్నించమ్మా. ఏంటమ్మా! నావంక అట్లా గుడ్లు మిటకరించుకోని చూస్తావు. ఏందమ్మా కళ్ళు వాచిపోతయ్యా. బుగ్గలు కందిపోతాయా! ఏందమ్మా అంత అమాయకంగా మాట్లాడుతుండావు. ఏడిస్తే మాత్రం పోయిన వాళ్ళు తిరిగొస్తారంటావా! నువ్వు చెప్పింది కూడా నిజమేనమ్మా. వస్తారనేనా అందరూ ఏడ్చేది'

'అప్పటిదాకా అందరి బాగోగులు చూసి, అందరితో పాటు కలిసిమెలిసి ఉన్న ఒక మణిసి హఠాత్తుగా మన మధ్యనుండి వెళ్ళిపోతే ఎట్టా ఉంటుందమ్మా! ఇంటి ముందు ఎంతో ఎత్తు ఎదిగిన వేపచెట్టును కొట్టేసినట్టు ఉండదా! కళ్ళముందున్న పెద్ద కొండను తొవ్వేసినట్టు ఉండదా! కొద్దిగా ప్రయత్నించమ్మా!అస్సలు లాభంలేదా! అయ్యయ్యో ఎంత గాశారం వచ్చిందిరా బాబు'

'ఏమయ్యా కొడకా నీ సంగతేంది! నువ్వు తగలెట్టినవన్నీ పోగుచేసుకోవడం, నువ్వు అప్పులు చేసొస్తే వెనకనే వెళ్ళి వాటిని తీర్చేదాకా నిదరపోయేవాడే కాదుకదా మీ అయ్య. నువ్వన్నా పూనుకోవయ్యా!'

'మరీ అంత నిర్మొహమాటంగా మాట్లాడబాకండయ్యా. కొంచెం పెద్ద మనసు చేసుకోండి. అవతల నలుగురూ చూస్తుండారయ్యా. చూస్తే చూడనియ్యి అంటావా. అయ్యో.. తండ్రీ.. ఎప్పుడూ ఆయన అట్ట అనుకోలేదయ్యా. అనుకునే వాడైతే నువ్వు పేకాట్లో బాకీ పడ్డప్పుడు వొంటి గుడ్డలు కూడా విప్పేసి, నిన్ను అక్కడ కూర్చోబెడితే, పోతే పోయాళ్ళే అని నీ ఖర్మకు నిన్నొదిలేశాడా! తన తలకు మించిన భారమైనా అప్పుడలా అనుకోలేదయ్యా. ఈసారి చూద్దాము ఈసారి చూద్దామని ప్రతీసారీ నీ తప్పును కాసుకున్నాడే కానీ, పోతే పోయాళ్ళే.. వాడి మానాన వాడు పోతాడని.. నిన్ను గాలికి వొదిలెయ్య లేదయ్యా'

'అదేందయ్యా మరీ అట్టా మూతి బిగబట్టి కూర్చోబాకు. కాస్త వాళ్ళని జూడు. లోపల లేకపోయినా ఏడుపుని ఎంత బాగా పెళ్ళగించి పెళ్ళగించి ఏడుస్తున్నారో చూడు. చూసి నేర్చుకోవాలి'

'ఆ.. ఆ.. ఇప్పుడు పరవాలేదు. ఈ ఫోజు కొంచం దగ్గరగా వొచ్చిందిలే. ఆ..ఆ.. ఇప్పుడు అచ్చంగా ఏడుస్తున్నట్టే ఉన్నావు. కానీ కన్నీళ్లేయి. ఆ ఫోను కొంచెం పక్కన పడెయ్యి. ఇప్పుడు కూడా ఫోన్ లేకుండా బతకలేకపోతున్నారు. ఏంటమ్మా అర్జెంట్ కాలూ. చావు కంటే అర్జెంట్ కాలు ఏమన్నా ఉంటదా! అబ్బా.. ఏందిరా నాయనా మనుషులు ఇట్టా ఉండారు. చచ్చే చావొచ్చి పడిందయ్యా. మరీ ఇంత ఇదిగా

తయరయ్యారేంది మణుసులు. ఇంత కొయ్యబారి పోయారేంరా బాబు. అస్సలు ఏమైందిరా! ఎవురికీ కాసిని కన్నీళ్ళు వొచ్చి చావడం లేదు'

'ఈ పెద్దరికాన్నొకదాన్ని నా భుజానేశారు. ఎంతమందికని చెప్పాలి. ఏ విధంగా చెప్పాలి. అస్సలు ఈ పరిస్థితి ఒకటొస్తుందని కల్లోగూడా అనుకోలేదు. కనీ పెంచి పెద్దచేసి చదువులు చెప్పించీ ఉద్యోగాలు వేయించి ఇల్లు వొల్లు గుల్ల చేసుకుని చచ్చి దుగ్గయి పోయినా లెక్కలేదు. మనిషిపోయినా పోతే పోయాళ్ళే మంచాన కంచాన పడకుండా పోయాడు. ఈయనకి సేవలు చెయ్యకుండా పీడా పోయిందిలే అనుకుంటుండారు కానీ, కాస్త నలుగురి కోసం పాటు పడ్డ మనిసి కదా! నాలుగు కన్నీటి బొట్లు విడుస్తారంటే అబ్బే అదీ వల్ల కావడం లేదే'

'పైగా దబాయింపొకటి. కాలం తీరింది, పోయాడు. మనమేం చేస్తాం చెప్పండి అంటూ లోకరీతి చెబుతున్నారయ్యా లోకరీతి. ఇంత ఇదైపోయారేంది మణుసులు. మొహమాట మనేదే లేకుండా పోయింది. ఇట్టాంటి మణుసులు పుడతారని కూడా ఊహించలేదే మేము. అవసరమున్నంత వరకే అక్క మొగుడు. అవసరం తీరిన తరువాత కుక్కమొగుడా! మరీ ఇంత అవసరానికి మణుసులై పోయారేందో! కలియుగం కలియుగం అంటారే. ఇది మరీ దానెమ్మ మొగుడు లాగుందే! కూలికి విషం తాగుతున్నారు కదయ్యా మణుసులు'

'పాడె తయారైందా! అయితే ఏం చెయ్యమంటారయ్యా. మా ప్రయత్నం మేము చేస్తుండాము. కొంచం ఊపు చెయ్యండమ్మా. ఆయ్యా.. మీరు కూడా కాస్త శృతి పెంచండి. ఆ..ఆ..అదే. ఆ అద్దీ.. కానియ్యండి. అదీ పట్టు..'

'ఎవర్రా ఏందో! అంటున్నారు. బాగా ఏడుస్తున్నారా! ట్రైనింగ్ ఎలాంటిదంటారు! ఎవరి కళ్ళల్లో నీళ్ళు రావడం లేదా! శత విధాల ప్రయత్నిస్తున్నారయ్యా! చెలమలు ఎండిపోతే ఎవరేం చేస్తారు'

'సాంగెం వొప్పుకోదా! మీ సాంగెం దొడ్లో తోలా. ఎవురయ్యా ఇన్ని సాంగేలు పెట్టినోళ్ళు. అసలు యాడవడమే రాలేదురా నాయనా అంటుంటే. కన్నీళ్ళు రావడం లేదంట. మొదులుకు లేదురా మొగడా అంటే పెసరపప్పే పెళ్ళామా అన్నాడంట యెనకటికి ఎవుడో! అట్టుంది సంబడం'

'కన్నీళ్ళు రాలేదని ఒకరంటారు. ఏడుపులో జీవం లేదని ఒకరంటారు. కూర్చున్న పొజీషనే బాలేదని ఇంకో గన్నాయిగాడంటాడు. ఇయ్యన్నీ ఇప్పుటికిప్పుడు నేర్వాలంటే ఎట్ట కుదురుద్ది'

'ఈసారికి ఎట్టనో కట్ట కానియ్యండి. ఇంకోసారెప్పుడైనా చూద్దాంలే'

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 310

'రాండి.. వొచ్చి శవాన్ని ఎత్తకెళ్ళి పాడె మీద పడుకోబెట్టండి'

'కన్నీళ్ళు రాకుండా కుదరదంటే కుదరదా! ఎత్తుబడే చెయ్యగూడదా! అదుగో ఆ ఆడంగుల్ని మాట్లాడొద్దని చెప్పండి. తలా ఒక మాట మాట్లాడతారు. చివరికి పనేమీ ముందుకు జరగనియ్యరు'

'ఎన్నిటికి ట్రయినింగులియ్యాలమ్మాయ్. అస్సలు బొత్తిగా ఎందుకూ పనికిరాని మణుసులుగా ఉండారేంది'

'కన్నీళ్ళు రాకుండా ఎత్తుబడి చెయ్యడానికిలేదు అంతేగదా! అమ్మాయ్ ఇట్రా. అక్కడ పొయ్యి గణగణా మండుతోందిగానీ కాస్త పచ్చి పుల్లలు నాలుగు తగిలియ్యమ్మా. ఎందుకా! ముందు చెప్పిన పని చెయ్యమ్మా నీకే తెలుస్తుంది'

'ఇప్పుడర్థమైందా ఎందుకో! పొగ వొస్తుందా! ఇంకొద్దిగా పొయ్యి ఊదు, పొగ వొస్తుందా! బాగా.. ఇంకా బాగా.. అరెరే గాలి అటు కొడుతుందే. పొగంతా అటు పోతుందే..! ఆ.. ఇటు మళ్ళిందిలే'

'ఇప్పుడు వస్తయ్యి లేమ్మాయ్ కన్నీళ్ళు తన్నుకుంటా! నలుపుకోండి. కళ్ళు బాగా నలుపుకోండి. కొంచెం మంటగా ఉంటదిలేయ్యా. మీ అయ్య జీవితాంతం మంట మండినోడే! మంటల్లోకి పోతా గూడా మీకు మేలే జేశాడు కదయ్యా. ఈ కాస్త మంటకే అలా మండిపోతే ఎలాగా!'

'ఇప్పుడొస్తున్నయ్యా కన్నీళ్ళు. చూడండమ్మా బాగా చూడండి. ఇంకేం పొరబాటు లేదుకదా! అందరి కళ్ళల్లో కన్నీళ్ళే. కారిపోతున్నయ్యి చూసేరుగా. బాగా చూడండి. ఇంక తంతు మొదలు పెట్టండి. ఎక్కువసేపు కన్నీళ్ళు కార్చలేరు వాళ్ళు. మరీ సుకుమారం తేలి పోయారులే. ఆ జంగం దేవరని శంఖు ఊదమని చెప్పండయ్యా. రాండ్రా నలుగురొచ్చి పట్టండి పాడె మీదకి. ఎక్కడా ఏ ట్రబులూ లేదులే. ఆత్మ నేరుగా పరలోకానికి వెళ్ళి పోతుందిలే. కానియ్యండి కానియ్యండి. పొద్దు నడినెత్తి మీదకు వొచ్చింది కానియ్యండి. ప్రాణం ఉన్నంత కాలం సావు కోసం ఎదురు సూస్తానే బతికేడు. శవంగా మారిన తరువాత గూడా ఇంత దరిద్రం ఏందిరా నాయనా! పిలుస్తుంటే ఒక్కరూ కదలరేంది! ఏం గాశారం వొచ్చిందిరా నాయనా! శవాన్ని అటు నుంచి ఇటు పట్టే దిక్కే లేకుండా పోయింది. పట్టడం చేత కాదంటారా! ఏం చేతనవు తుందయ్యా మీకు'

'ఏం కాలమో! ఏం మణుసులో! తండ్రులెవురో బిడ్డలెవురో! ఎవురికి ఎవురో! ఇదుగో నాగేశ్వరరావు, కోటేశ్వరరావు మీరన్నా రాండయ్యా నేనొక పక్కన పడతాను'

'మీరింక లేవండమ్మా. లేసి ఏం చెయ్యాలా! ఇప్పటి దాకా ఏంజేసేరమ్మా! చాలా

కష్టపడిపోయారు కదా! మీ వొంటికి మించిన శ్రమ చేశారు కదా! కాస్త విశ్రాంతి తీసుకోండి. కాఫీలు టిఫినీలు చెయ్యండి'

'ఆ నిప్పుకుండ తీసుకోవయ్యా. నువ్వు మొయ్యలేవా! అదేం బరువుండదు లేవయ్యా. దానిగ్గూడా ఒక మణిసి కావాలా! ఎంత సున్నితంగా తయారయ్యారయ్యా మణుసులు. ఏం కాలమో! ఏం మణుసులో! ఇది ఒంటికాలి కలియుగం కాదయ్యా. అసలు కాళ్ళే లేకుండా దోగాడతా ఉండే అవిటి యుగమయ్యా'

'పాడెని ఎత్తండింక. నలుగురూ తూకంగా పట్టుకోండి. ముందున్న వాళ్ళు జాగర్త. ఆ.. ఆ.. నెమ్మదిగా సాగండి'

'ఆ.. ఏందమ్మాయ్. ఆ అమ్మాయి ఏందో ఆగమంటుంది చూడండయ్యా. ఏందమ్మా చెవులకు బంగారపు పోగులున్నయ్యా. అవి తీసియ్యాలా! కాళ్లకు వెండి కడియాలు ఉన్నాయా! అవి కూడా తీయాలా' 'ఇప్పటిదాకా మాకు తెలియక తీయలేదు అనుకున్నావా! తీయకపోతే కుదరదంటావా!'

'సరే పాడెని దించండయ్యా. రామ్మా తీసుకో.. తీసుకో.. పూచిక పుల్ల కూడా వదిలేటట్టు లేవు కదమ్మా. బంగారపు తల్లివమ్మా. తీసుకున్నావా! అమ్మా జాగ్రత్తమ్మా జాగ్రత్త. దొంగలెత్తుకు పోయేను'

'ఎత్తండయ్యా పాడెను. ఆలస్యం అయితే మళ్ళీ ఎవరో ఒకరికి ఏదో ఒకటి గుర్తొస్తుంది. ఆ ...ఇంక పదండి పదండి తొందరగా..'

'ఇదో వెంకయ్యా.. ఎక్కడికయ్యా వెళుతున్నావ్? ఏందీ బఱ్ఱెగొడ్లని ఇప్పాలా!'

'సుబ్బయ్యా నువ్వు.. నీగ్గూడా పనులుండయ్యా. దింపుడు కళ్ళాం దాకా గూడా రావడానికి తీరిక లేకుండా పోయింది మణుసులుకి. అరే.. మీరు కూడానా.. హూ.. పోండి పోండి అందరూ వెళ్ళిపోండి'

'అయ్యా మీకేం పనీ పాటా లేవా! ఉండయ్యా! ఓహో.. అయితే! మీరు దాయాదులా! అదా సంగతి. దాయాదులు కాబట్టి తప్పక వొస్తున్నారన్నమాట. లేకుంటే మీరు కూడాపోయే వాళ్ళే'

'ఎవరి దారిన వాళ్ళు పోయినా మొయ్యడానికి నలుగురు మనుషులుంటే చాలుగా'

'నడవండయ్యా. మీరన్నా తొందరగా నడవండి. మీకు ఎలాగూ తప్పదుగా. చావు ఊరేగింపు కూడా తప్పనిసరి తంతై పోయిందిలే. దగ్గరకి వొచ్చేశాములే'

'ఎట్టి నల్లన్న ఏడిరా కనపడ్డం లేదు. కేకేయండి. ఒక డ్రాము వేయడానికి పోయుంటాడు. ఆ.. ఇడుగో వచ్చాడులే'

‘ఇటు కుడి పక్కకు రండి. చుట్టూ మూడు చుట్లు తిరగండి. ఇంక దించండి. ఆ.. దించడానికి లేదా! కాటి సుంకం పెట్టాలా! లేకుంటే సాంగెం ఒప్పుకోదా !పెట్టాల్సిందేనా! పెడతార్లే దించనియ్యరా ముందు. వాళ్ల భుజాలు పోతున్నాయి. ఇటు పుల్ల తీసి అటు పెట్టిన వాళ్ళు కాదు. సుకుమార రత్నాలు. ఎంతసేపు అలా భుజాల మీద పెట్టుకొని మోస్తారు. అయినా కుదరదు అంటావా’

‘నువ్వు కూడా కూలికి విషం తాగుతున్నావు కదరా .దించిన తర్వాత ఇస్తారులే జేబులో ఉన్నాయి. దించనియ్యి ముందు’

‘ఆ.. ఈ రోజుల్లో ఎవరి మాటలు నమ్మటానికి లేదా! పని అయిందాకా సరే అంటారా! పని కావడంతోటే రేపు ఇస్తా.. ఎల్లుండి ఇస్తా.. అంతిస్తా.. ఇంతిస్తా.. అంటారా!’

‘ఒరేయ్ ఈడు ముందు మీదున్నాడు. ఇప్పుడు ఎవరు చెప్పినా వినడు. జేబులో చెయ్యి పెట్టండిరా. ఓహో అంతా ఫోన్లలోనే డబ్బులు ఉంటాయా! జేబులో ఉండవా!’

‘ఏంది ఎవురూ తేలేదా! ఈయకపోతే శవాన్ని పాడె మీదే పెట్టేది లేదంటున్నాడు వాడు. అసలే మొండోడు వాడు. పైగా తాగున్నాడు. ఇంక ఎవురి మాటా వినడు. చేసేదేముంది. శవాన్ని పక్కన దించండి .ఇంటికి పోయి వచ్చిందాకా ఆగుదాం. ఎట్టి నల్లన్నకు గూడా సమాధానం చెప్పలేక పోతుంటిమి. పోంద్రా పోయి తొందరగా రాండి. ఎవురో ఒకరు పోండి తొందరగా..చావుకు కూడా చచ్చే చావొచ్చిందిలే పోండి’

## మంచికంటి వెంకటేశ్వర్లు

వెంకటేశ్వర్లు కలం పేరు శాంతివనం మంచికంటి. ప్రకాశం జిల్లా సింగరాయకొండ కలికివాయ ఊరు. ఉపాధ్యాయవృత్తి. పేద పిల్లల కోసం శాంతివనం ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. వసంతాల ఊసెత్తకు, నీటి పొద్దు, మేం పావురాళ్ళను ప్రేమిస్తాం ఇతర పుస్తకాలు వేశారు. ‘మిత్తవ’ కథకు 2004లో తానా అవార్డు దక్కింది.

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 313

# పుట్టిన ఊరు

**ఈతకోట సుబ్బారావు,**

**94405 29785**

'ఛి.. దీనెమ్మ జీవితం రాత్రి నిదరుండదు. పగలు సుఖముండదు' నిద్రలేస్తూ స్వగతమే అయినా బహిరంగంగా చెప్తున్న నాదముని మాటలు వింటూ క్షణం గుమ్మం ముందు కల్లాపి చల్లటం ఆపింది రేణుకమ్మ. ఆ తర్వాత యథాప్రకారం కల్లాపి చల్లి, ముగ్గులేసి లోపలికి కదిలింది. అప్పటికి నాదముని పళ్లు తోముకొని చద్దన్నం కోసం సిద్ధంగా కూర్చొని ఉన్నాడు.

చద్దన్నం గిన్నె తెచ్చి ముందు పెట్టింది రేణుకమ్మ. ఉదయాన్నే చద్దన్నం ఇష్టంగా తింటాడు నాదముని. కాని ఇవాళ ముద్ద గొంతు దిగటం లేదు. తలలో కోలం కడుపులోకి దిగిపోయింది. అప్పుడే భార్య ఉల్లిపాయ తెచ్చి ఇచ్చింది.

'వద్దులే..' అంటూ గిన్నెముందు నుంచి లేచిపోయాడు నాదముని.

'తినేసి వెళ్లు. మధ్యాన్నం దాకా ఖాళీ కడుపుతో ఎట్లా పని చేస్తావు?' రేణుకమ్మ ఒకమాట అంది.

'ఆ దొరబాబులకి కావలసింది అదేగదా! మనం తిన్నా తినకపోయినా, వాళ్లు పిలిచిన వెంటనే పెట్టె చేతబట్టుకొని గీకటానికి రెడీగా వాళ్ల గుమ్మంలో నిలబడాలి. ఇంకా తెల్లారకుండానే కబురు పంపుతారు' భార్యతో నెమ్మదిగానే మాట్లాడుతున్నా కడుపులో దిగివున్న కోపం మాటల్లో బైటికొస్తున్నట్టుగా అనిపించింది నాదమునికి.

'ఏం చేస్తావు.. నువ్వు చేసేపని అదేనాయె. మంగలివాళ్లని వుదయాన్నే కాకపోతే మిట్టమధ్యాహ్నంగా పిలుస్తారా? ఎవరైనా. ఆ మాత్రం దానికి చద్దన్నం మీద కోపం

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 314

చూపితే సరిపోతుందా? నాలుగు ముద్దలు తినేసి వెళ్లు. ప్రెసిడెంటు పొద్దెకాక కానీ నిద్దర లేవడు. రా.. కూర్చొని తినెయ్.. నేను పిల్లలిద్దర్నీ బడికి సిద్ధం చేయాలి' భార్యకి దేవుడు ఇంత సహనం ఎందుకిచ్చాడో ఇప్పటివరకూ అర్థం కాలేదు నాదమునికి. కోపాన్ని పక్కనపెట్టి వెళ్లి చద్దన్నం గిన్నె ముందు కూచున్నాడు.

కొండకింద పల్లె గ్రామంలో మహా అంటే మూడొందల గడపలుంటాయి. ఆ ఊరికి ఏకైక నాయీబ్రాహ్మడు నాదముని. పంచాయితీ కాకపోయినా ప్రెసిడెంటు మాత్రం ఆ ఊళ్లోనే ఉంటున్నాడు. ప్రెసిడెంటుగారి కోసం ఆయన ఇద్దరు తైనాతీలు కూడా అక్కడే కాపురం పెట్టారు. ప్రతిరోజూ ఆ ముగ్గురికీ గెడ్డం గీకవల్సింది నాదమునే. అప్పటివరకు చెట్టుకింద బంకు తెరవటానికి వీల్లేదు. ఇలా అని శాసనం ఏదీ లేకపోయినా, ఆ ఆనవాయితీ మాత్రం శాసనంగానే చెల్లుబాటు అవుతూ వస్తుంది ఇప్పటిదాకా. ఉదయం కోడికూతకు ముందే ఏదో వొకింటి నుండి కబురొస్తుంది. ఎప్పటిలానే విసుక్కుంటూ నిద్దరలేస్తాడు నాదముని. ఆ తర్వాత కార్యక్రమం షరామామూలే.

ఆపాటికి పిల్లలిద్దర్నీ స్కూలుకు సిద్ధం చేసింది రేణుకమ్మ. వాళ్లకి తలదువ్వి, పౌడరు రాసి, యూనిఫాం తొడిగితే వాళ్లు ఏ గొప్పింటి పిల్లల్లాగో కనబడుతున్నారు. కన్నార్పకుండా తన ఇద్దరు పిల్లల్నే చూస్తూ నిలబడ్డాడు నాదముని.

'ఏందయ్యా! నీ పిల్లలు కానట్టు కొత్తగా చూస్తున్నావు వాళ్లని. నీ దిష్టే తగిలేట్టు ఉంది వాళ్లకి' రేణుకమ్మ మాటలకి ఉలికిపడ్డాడు నాదముని.

'నిజమే. నా దిష్టే తగిలేట్టుంది. బుగ్గన కాటుకచుక్క పెట్టు పిల్లలకి. అసలే వాళ్ల అయ్యోరమ్మ కళ్లు మంచివి కావు. గొడ్డుమోతు కళ్లు' అన్నాడు తేరుకొని.

'పెట్టానులే అరికాళ్లకి. నువ్వు కదులు. స్కూలుగంట కొట్టే వేళయింది' భార్య మాటలకి ఓసారి గడియారం వైపు చూస్తూ బయల్దేరాడు నాదముని పిల్లలతో పాటు.

పిల్లలిద్దర్నీ స్కూలువద్ద దిగబెట్టి ప్రెసిడెంటు గారి ఇంటికి చేరుకొనే వేళకి పెరట్లో రెడీగా కూచొని ఉన్నాడాయన. ఆ కళ్లు చూడగానే అర్థమైపోయింది నాదమునికి, అవెందుకంత ఎర్రబడ్డాయో.

'ఈ పిల్లకాయలకి చదువెందుకే? ఎట్టాగూ పెద్దయ్యాక మన కులవృత్తే కదా చేసుక బతకాల్సిందని చిలక్కి చెప్పినట్టు చెప్పినా మా ఇంటిది ఇనుకోదయ్యా! ఇదిగో వాళ్లని

'పెట్టానులే అరికాళ్లకి. నువ్వు కదులు. స్కూలు గంట కొట్టే వేళయింది' భార్య మాటలకి ఓసారి గడియారం వైపు చూస్తూ బైల్దేరాడు నాదముని పిల్లలతో పాటు.
పిల్లలిద్దర్నీ స్కూలువద్ద దిగబెట్టి ప్రెసిడెంటు గారి యింటికి చేరుకొనే వేళకి పెరట్లో రెడీగా కూచొని వున్నాడాయన. ఆ కళ్లు చూడగానే అర్థమైపోయింది.

స్కూలు దగ్గెర దిగబెట్టి వచ్చేతలికి ఇంత లేటయింది'

'ఏటన్నావూ.. సర్లే కూర్చో.. ' పొడిపొడిగా మూడు ముక్కలు చెప్పేసి చెంబెట్టుకొని వెళ్లిపోయాడు ప్రెసిడెంటు.

ఎక్కడో కాలినట్టయింది నాదమునికి. పిల్లలు జీడికోసం ఆ తీరుగ ఏడుస్తున్నా ఆలస్యమైపోతుందని వాళ్లని స్కూలు దగ్గిర దిగబెట్టి వచ్చాడు. ఆ పసివాళ్ల ముఖమే కళ్లలో తిరుగుతుంది ఇంకా. అప్పటికే ఏదో మునిగిపోయినట్టు ముఖం పెట్టిన ప్రెసిడెంటు తీరా తాను పెట్టె తెరిచేసరికి 'సర్లే కూర్చో.. వస్తాను' అని చెంబెట్టుకెళ్తుంటే అరికాలి మంట నడినెత్తికి చేరింది. 'పల్లెటూళ్లో పుట్టి కులవృత్తి చేసుకొంటున్న పాపానికి ఇలాంటివి ఇంకెన్ని భరించాలో' అనుకున్నాడు నాదముని. అటు రచ్చబండ దగ్గిర బంకుముందు ఎంతమంది ఎదురుచూస్తున్నారో అన్న ఆలోచన వచ్చేసరికి ప్రెసిడెంటు మీద పీకలదాకా కోపం వచ్చింది.

కానీ పేదవాడి కోపం పెదవికి చేటు.

***

బంకు తెరిచేసరికి సూర్యుడు నెత్తికెక్కాడు. అప్పటికే వొకరిద్దరు కస్టమర్లు తిరిగి వెళ్లిపోయారని తెలిసి ప్రెసిడెంటుకి శాపం పెట్టాలన్నంత కోపం వచ్చింది. మూడొందల గడపల్లోంచి రోజుకి వచ్చేదే పదిమంది. ఆ పదిమందిలో మూడో నాలుగో అరువు బేరాలుంటాయి. అలా రోజుకి రెండొందలో, రెండొందల పాతికో చేతబట్టుకొని ఇంటికెళ్లి పెళ్లాం చేతిలో పెడితే ఆమె వొదిలే దీర్ఘ నిస్పృహ చూళ్లేక చాలామార్లు ఊరొదలి పట్నం వెళ్లిపోదామన్న ప్రస్తావన తీసుకొచ్చాడు నాదముని.

'పట్నంబోతే పట్నమంత ఖర్చులు కూడా ఉంటాయి. వద్దులెయ్యా! కలో గంజో ఇక్కడే కాచుకొని తాగుదాం. పరిగెత్తి పాలు తాగటం దేనికి?' అంటూ కొట్టిపారేసింది రేణుకమ్మ.

అలా అలా ఆ సమస్య భార్యాభర్తలిద్దరి మధ్యా నానుతూనే ఉంది. కొద్దిగా భార్య తన ఆలోచన్ని సమర్థించి ఉంటే ఈపాటికి పట్నంలో ఎక్కడో ఓ చోట సెటిల్ అయిపోయి ఉండేవాడు నాదముని. ఆ సమర్ధత లేకపోబట్టే ఇంకా కొండమీద పల్లెలోనే బండరాయిలా మిగిలిపోయాడు.

చెప్పుకోవాలంటే ఆ రోజు నాదముని ఆదాయం అక్షరాలా నూటా ఇరవై రెండు రూపాయలు. అదే పట్నంలో అయివుంటే చివర మరో సున్నా చేరి వెయ్యిన్ని రెండొందల ఇరవై రూపాయలు అయివుండేది. రాత్రి బంకు మూసుకొని ఇంటికి వెళ్తుంటే నాదముని కళ్లలో నీళ్లు తిరిగాయి. బరువెక్కిన గుండెతో అలా గుడిముందు నుండి వెళ్తుంటే పట్నం వెళ్లే బస్సు అప్పుడే వచ్చి ఆగింది. సన్నాబత్తిని వెంకటేశ్వర్లు బస్సుదిగి ఎదురొచ్చాడు. పట్నంలో వడ్రంగి పని చేస్తుంటాడు. నెలకోసారి ఊరికొచ్చి

అమ్మానాన్న చేతుల్లో సంపాదనంతా పెట్టి తిరిగి మరునాడు పట్నం వెళ్లిపోతుంటాడు.

'ఏంటి నాదమునీ! ఇంటికేనా?' పలకరించాడు వెంకటేశ్వర్లు.

'ఔను వెంకటేశూ! నువ్వు పట్నం నుంచేనా?' ముగించేలోగానే 'ఆ.. అమ్మానాన్నకి డబ్బులిచ్చి వెళ్దమని వచ్చా' అన్నాడు వెంకటేశ్వర్లు.

'ఎలా ఉంది పట్నం?' అని అడిగాడు మళ్లీ.

'నువ్వెన్ని చెప్పు నాదమునీ! పట్నం పట్నమే. అంతా మహరాజభోగమే అనుకో. ఎంత అదృష్టం చేసుకొంటే పట్నంలో పుడతాడో మనిషి' అలా వర్ణిస్తున్నప్పుడు వెంకటేశ్వర్లు ముఖంలో కోటి సూర్యుళ్లు వెలగటం గమనించాడు నాదముని.

'అంతేగా మరి. వెళ్లొస్తా వెంకటేశూ!' అంటూ వీధి మలుపు తిరిగాడు నాదముని.

ఆ రాత్రంతా నాదముని దీర్ఘ తపస్సులోకి వెళ్లిపోయాడు. రేణుకమ్మ వొకటికి నాలుగుసార్లు పలకరించినా బదులివ్వలేదు. భర్త వేదన అర్థం చేసుకున్నట్టు రేణుకమ్మ పట్నం వెళ్లే పనుల్లో మునిగిపోయింది.

***

నిజం చెప్పాలంటే నాదముని చాలా అదృష్టవంతుడు. కనుకనే అంత పెద్ద చలువ అద్దాలు బిగించిన ఏ.సి. సెలూన్‌లో కుదురుకున్నాడు. నాగరాజు షాపుకి ఓనరన్నమాటే కానీ నాదమునిని సొంత మనిషిలా తనవాళ్లలో కలిపేసుకున్నాడు. అతను రావటమే షాపుకి అదనపు విలువ చేకూరినట్టైంది. అతడి వేళ్లలో వేయిమంది కళాకారుల ప్రతిభ గమనించాడు నాగరాజు. అవి కదులుతుంటే ఎవరో పెద్ద ఆర్టిస్టు ప్రపంచాన్ని మురిపించే బొమ్మ గీస్తున్నట్టు ఫీలయ్యాడు. ఆ వేళ్ల కదలికలోని చాకచక్యం తనుకూడా చేసి ప్రయత్నించాడు. కానీ ఫలితం మరో విధంగా రావటంతో మానుకున్నాడు.

నాగరాజే చొరవ తీసుకొని తను ఉండే కాలనీలోనే ఓ మోస్తరు ఇల్లు చూసిపెట్టాడు. పెళ్లాం పిల్లల్ని తీసుకురావటానికి నాదముని అడగకుండానే పైకం సర్ది అతడి చేతుల్లో పెట్టాడు. అతణ్ణి బస్సెక్కించటానికి తన మోటారు సైకిల్‌పైనే తీసుకెళ్లాడు. బస్సులో కొండదిగి పల్లెకి టికెట్టు కొనిపెట్టి, దాంతోపాటు చేతిలో ఓ ఆండ్రాయిడ్ ఫోన్ పెట్టాడు. నాదముని ఆనందానికి హద్దులేకుండా పోయింది. రెండు చేతులు జోడించి నమస్కరించాడు నాదముని.

'మన మధ్య ఇవన్నీ దేనికి గురూ! సాటి వర్కర్ని గౌరవించుకోలేకపోతే ఇంతపెద్ద నగరంలో బతకటమే దండగ' అన్నాడు ఎంతో ఆప్యాయంగా.

'పట్నంలో మనుషులే గాని మనసున్నోళ్లు ఉండరని మా పల్లెలో అందరూ అంటారు. కానీ ఓనరయ్యా! వాళ్లెవరికీ మీలాంటి మనసున్నోళ్లు ఎదురుపడి ఉండరు' అన్నాడు నాదముని.

'నిజమే నాదమునీ! నగరంలో ఎవరి స్వార్థం వాళ్లది. అందుకే అలా అనుకొని ఉంటారు' నాగరాజు చెప్పిందీ నిజమే.

'ఏందో ఓనరయ్యా! మిమ్మల్ని, మనోళ్లనీ చూస్తుంటే నాకు అలా అనిపించట్లేదు' నాదముని మాట ముగిసి పోకముందే డ్రైవరు బస్సెక్కి హారన్ కొట్టాడు.

'సరే.. సరే.. జాగర్త. క్షేమంగా వెళ్లి త్వరగా వచ్చెయ్' అంటూ చేయి ఊపాడు నాగరాజు.

బస్సు కలిదిలింది.

**ఇన్నాళ్ల తర్వాత యిప్పుడు తన్నుతాను చూసుకుంటే కొట్టొచ్చినట్టు ఎంతో మార్పు. వెంట్రుకలు తెల్లబడి పోయాయి. ముఖంలో ముడతలతో పాటు ముసలితనం పనిగట్టుకొని కనిపిస్తుంది. పట్నంలో అడుగుపెట్టిన నాటి దారుఢ్యం, ఉత్సాహం, పట్టుదల పేరుకైనా లేదు.**

***

అప్పుడే ఆర్నెళ్ళు దాటిపోయాయి నాదముని నగరానికి షిఫ్ట్ అయ్యి. పిల్లల్ని ఇంగ్లీషు మీడియం స్కూళ్ళో చేర్పించాడు. వాళ్లకోసం స్కూలుబస్సు ఇంటి దగ్గరికొచ్చి ఎక్కించుకొని వెళుతుంటే రేణుకమ్మ ముఖంలోకి దర్జాగా చూసేవాడు. రేణుకమ్మ ముఖంలో కొట్టొచ్చినట్టు కనిపించే ఆనందం చూసి లోలోన ఎంతో మురిసిపోయేవాడు నాదముని.

మంచిరోజులు ఎలా గడిచిపోతాయో ఎవరూ గమనించరు. పొద్దు పొడవటమూ పొద్దు వాలటమూ మాత్రమే తెలుస్తుంటుంది. అంతే.

చూస్తూ చూస్తూనే పిల్లలిద్దరూ బీటెక్ పూర్తి చేశారు. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు సంపాదించారు. వాళ్లకొరకు కంపెనీ కార్లు ఇంటికి రావటం చూస్తుంటే తను ఊహించిన దానికన్నా ఎక్కువే సాధించానన్న తృప్తి నాదమునికి. పైగా నాగరాజు తన ఇద్దరు కూతుళ్లనీ కోరి మరీ నాదముని కొడుకులకిచ్చి పెళ్లి చేయటం స్వర్గానికి నిచ్చెనలు వేసినంత ఆనందం ఇచ్చింది. కానీ నగరాల రివాజు నాదమునిలో ఒక సైద్ధాంతిక విరక్తి తీసుకొస్తుందని ఊహించలేకపోయాడు.

నాగరాజు తన ఇద్దరు బిడ్డలకి రెండు ప్లాట్లు అపార్ట్‌మెంట్‌లో కొనిపెట్టి, వాళ్ల కాపురాన్ని విడదీయటంతో నాదమునిలో ఏదో తెలియని విరక్తి తన ప్రమేయం లేకుండానే ప్రవేశించింది. ఒక శ్వాసతో మొదలైన విరక్తి అన్ని శ్వాసల్నీ ఆక్రమించింది. అయినా ఏదో తృప్తి. మలుపులెన్ని తిరిగినా తన జీవితంలో కొన్ని సంతృప్తులూ ఉన్నాయి. పిల్లల్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలనుకున్నాడు. ఆ కల నెరవేరింది. కొండకింద పల్లెలో ఉండగా మెళ్లో పసుపుతాడుతో మిగిలిపోయిన భార్యని కనకమహాలక్ష్మిగా చూడాలనుకున్నాడు. చూసేశాడు. పట్నంలో తనకంటూ ఓ సొంత ఇల్లు

ఉండాలనుకున్నాడు. అదొక్కటి మాత్రం తీరలేదు. అదీ ఒకందుకు మంచిదే అనుకున్నాడు నాదముని. తను పుట్టిన ఊళ్లోనే మట్టిలో కలిసిపోవాలన్న ఆనందం అది.

ఇన్నాళ్ల తర్వాత ఇప్పుడు తనను తాను చూసుకుంటే కొట్టొచ్చినట్టు ఎంతో మార్పు. వెంట్రుకలు తెల్లబడిపోయాయి. ముఖంలో ముడతలతో పాటు ముసలితనం పనిగట్టుకొని కనిపిస్తుంది. పట్నంలో అడుగుపెట్టిన నాటి దారుఢ్యం, ఉత్సాహం, పట్టదల పేరుకైనా లేదు. వృద్ధాప్యం వస్తూ వస్తూ నిలకడలేని ఆలోచనల్ని వెంటబెట్టుకొచ్చింది. ఇప్పుడు మళ్లీ కొండకింద పల్లె మాటిమాటికీ గుర్తొస్తుంది. కలల్లో కూడా తను పుట్టిన ఊరు తనని వెంటాడుతుంది. ఆ రోజు రాత్రి

'ఏమే! పట్నంలో మనం వచ్చిన పని అయిపోయింది కదూ!' అని మాట కదిపాడు నాదముని.

'ఏ పనయ్యా! ఏమైపోయింది?' ఆశ్చర్యంగా రేణుకమ్మ ప్రశ్న.

'అదే.. పిల్లల్ని బాగా చదివించాలి. వాళ్లని మంచి ఉద్యోగంలో చేర్పించాలి. మంచి ఇంట్లో పెళ్లిళ్లు చేయాలి. ఇంకేం మిగిలింది చేయాల్సిన పని?' సమాధానంలోనే ప్రశ్నను సంధించాడు.

'ఏందీ.. ఇంకేం మిగిలుందా?' అబ్బో ఇంకా చాలా చాలా ఉండాయి' రేణుకమ్మ.

'ఇంకా ఏం ఉండాయి' నాదముని.

'నీ కోడళ్లు కనొద్దూ. మనవళ్లతో ఆడుకోవద్దూ. వాళ్లకి మీ అయ్యపేరు, మా అమ్మపేరు పెట్టొద్దూ..' రేణుకమ్మ ముఖంలో తెలియని ఆనందం.

'ఏమే! నీకు సన్నాబత్తిని వెంకటేశులు గుర్తున్నాడా?' అడిగాడు నాదముని.

'ఆయనే కదా నీకు పట్నమంటే వల్లమాలిన మక్కువ నూరిపోసింది. ఎందుకు గుర్తు ఉండడు మహానుభావుడు' కొంచెం కోపంగానే అంది.

'వెంకటేశు నెల నెలా ఊరికెందుకొస్తాడు. అమ్మానాన్నని పలకరించటానికి, పెళ్లాం పిల్లల్ని చూసుకోవడానికి' ఆ పాటికే అర్థమైపోయింది రేణుకమ్మకి.

వెంటనే 'ఆ..ఆ.. చాల్లే సంబడం. వెంకటేశు పుట్టింది, పెరిగిందీ కొండకింద పల్లెలోనే. నీ పిల్లలు అట్టా కాదుకదా. వాళ్లు ఊళ్లో పుట్టినా పెరిగి పెద్దోళ్లైంది పట్నంలోనే. ఆ తేడా తెలుసుకుంటే నీకే అర్థమౌతుంది' అంది.

'అర్థమయ్యిందే.. కానీ ఆ వెంకటేశులు నాన్నని నువ్వు చూల్లేదు కాని, కొడుకు వచ్చి వెళ్లిన ప్రతిసారీ ఊళ్లో మారాజులా తలెత్తుకు తిరుగుతుంటాడు. సింహం అంటే సింహం లాగా అనుకో' గర్వంగా నాదముని చెబుతుంటే కథ మొత్తం అర్థం అయిపోయింది రేణుకమ్మకి.

లేచి వస్తువులు సర్దటం మొదలెట్టింది.

***

కొండకింది పల్లెకి నాదముని తిరిగి రావటం ఎవరినీ ఆశ్చర్యపర్చలేదు. కారణం పదిహేను, ఇరవై ఏండ్లనాటి ఊరు కాదిప్పుడు అది. అందులోనూ నాదమునికి తెలిసిన ఊరూ కాదు. ఊరు మొత్తం మారిపోయింది. అపార్టుమెంట్లు కాకపోయినా అపార్టుమెంటులాంటి మేడలు వెలిశాయి. మేడలకి కిరీటం పెట్టినట్టు సెల్‌టవర్లు లేచాయి. పట్నంలో లాగ పెద్ద పెద్ద హోర్డింగులు వెలిశాయి. ఏ.సి. షాపులైతే లెక్కపెట్టుకోనవసరం లేదు.

పదేళ్లకిందటే పంచాయితీగా మారిన కొండకింది పల్లె ఎదిగి ఎదిగి మండల స్థాయికి చేరుకొంది. ఊరి చివర నిర్మించిన సిమెంటు ఫ్యాక్టరీ, గ్రానైట్ ఫ్యాక్టరీ పారిశ్రామికంగా ఊరికి మంచిపేరు తీసుకొచ్చాయి. చిన్నా చితక గృహ పరిశ్రమలు, అగరొత్తుల కంపెనీలు సరేసరి.

తను బంకుపెట్టిన రచ్చబండ ఇప్పుడు కూరగాయల మార్కెట్టుగా మారిపోయింది. తన బంకు జాడకూడా లేదక్కడ. పుట్టినూరు మీద మోజు అన్నమాటే కానీ తను పుట్టింది ఈ ఊళ్లోనేనా అన్న అనుమానమూ వచ్చింది నాదమునికి. ఎప్పుడో కూలిపోయి, శిథిలాలుగా మిగిలిన రాజులకోటను మళ్లీకట్టి కొత్తగా రంగులేసి సీరియల్ బట్టలతో సింగారించినట్టు ఊరు ధగధగలాడి పోతుంది. ఒక్కరంటే ఒక్కరు కూడా గుర్తుపట్టే ముఖం కనిపించలేదు. లక్షాధికారులు, కోటీశ్వర్లు మూకుమ్మడిగా దాడిచేసి ఆక్రమించుకున్నట్టు కొత్తగా కనిపించింది ఊరు నాదమునికి.

కార్లు, బైక్ మోటార్ల హడావిడి మధ్య నిరాశగా వెనక్కి తిరిగాడు నాదముని. అతడి చేతిలోని మంగలి పెట్టె అతణ్ణి వెక్కిరిస్తున్నట్టు అనిపించింది.

సిగ్గుతో తలదించుకున్నాడు నాదముని!

***

## ఈత కోట సుబ్బారావు

సుబ్బారావుది నెల్లూరు జిల్లా. దాదాపు 40 ఏళ్ళగా కథలు, కవితలు రాస్తున్నారు. 14 పుస్తకాలు రాశారు. కథలలో సీపీ బ్రౌన్ కథా పురస్కారం అందుకున్నారు. 'నమస్తే తెలంగాణా, ముల్కనూర్ కథ సంకలనానికినా కథ ఎంపిక కావటం అనందంగా ఉంది. నిర్వాహకులకు ధన్యవాదాలు'

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 320

# మరో ప్రపంచం పిలిచింది

**–మండ శ్రీకర్, 77998 13109**

'నాన్న! నాన్న!' అన్న గొంతుతో, నా రోజు ప్రారంభమైంది. ఎందుకో ఈరోజు ఆ గొంతులో ఏదో తెలియని ఆనందం. ఎప్పుడూలేనిది, నా దగ్గరకు వచ్చి, 'నాన్న! ఈరోజు మనం ఒక కొత్త ప్రదేశానికి వెళ్తున్నాం, తొందరగా తయారుకండి' అంటూ నా బ్యాగ్ సర్దాడు.

నేను స్నానంచేసి వచ్చేసరికి, ఎప్పుడూ కస్సుబుస్సుమనే కోడలు, నాకిష్టమైనవన్నీ చేసిపెట్టింది. మూలకున్న కళ్లదాలను చెవులకు జోడించి, క్యాలెండర్ను మార్చిమార్చి చూశాను. ఈరోజు ఎలాంటి పండుగలు లేవు. అలాగని, ఇది కల కూడా కాదు. చూస్తుంటే, ఏదో మహత్తర కార్యక్రమానికి శంకుస్థాపన చేసేలా ఉన్నారు.

నాలోనేను నవ్వుకొని, కోడలుపెట్టిన నాలుగిడ్లీలను కడుపులో వేసుకొని, కొడుకు తెచ్చిన పేపర్ చదువుతూ కుర్చీలో వాలాను. ఇంతలో, వాడచ్చి 'కారులో కూర్చోండి, నాన్న' అంటూ ఆదేశించాడు. నేను వెళ్లిన కొద్దిసేపటికి, కోడలిపిల్లతో ఏదో మాట్లాడుకొని వచ్చాడు. కారు గమనం తెలియని చోటికి పయనమైంది. అసలు విషయమేంటంటే, గమనం తెలియంది నాకొక్కడికే.

చూస్తూండగానే కారు పక్కఊర్లోని వృద్ధాశ్రమం ముందర ఆగింది. ఇదేంటని అడిగేలోగ, 'నాన్న! ఇకముందు మీరుండేదిక్కడే. మేము ఆఫీసుకు వెళ్లాకా, మాకు నీమీద దిగులు ఎక్కువవుతుంది. మీకు కూడా ఒంటరిగా ఉండటం ఇష్టం ఉండదు కదా. పైగా, ఈ వయసులో మీకది కష్టంగా ఉంటుంది. అందుకే, ఇక్కడ ఉండండి. మన అపార్ట్మెంట్ దగ్గరుండే రామారావు అంకుల్, రాయుడు అంకుల్ కూడాఇక్కడే ఉన్నారు.

మీకిక్కడ బాగుంటుంది, వారితో కాలక్షేపం కూడా అవుతుంది' అని వాడే సమాధానమిచ్చి, తిరుగు ప్రయాణమయ్యాడు.

***

నా అడుగులు తడబడుతూ ఆశ్రమంవైపు కదిలాయి. గేటువద్ద రామారావు నా కళ్లముందు వాలాడు. నా భుజంమీద చేయివేసి, ఆశ్రమం లోపలికి తీసుకెళ్లి, అక్కడఉన్న ఆశ్రమవాసులందరిని పరిచయం చేశాడు. పరిచయాలు కాస్త కబుర్లయ్యాయి. కబుర్లతో రాతిరయింది. ఏదో తిని, నా మంచంమీద వాలాను. నా శరీరం నిదురకి సరేనన్నా, మనస్సు ససేమిరా అనడంతో, అలా పరధ్యానంగా కూర్చున్న నాకు ఎప్పుడు నిదురెట్టిందో ఆ దేవుడికే ఎరుక.

ఎప్పటిలాగే పొద్దున్నే లేచి, వాకింగ్‌కు ప్రయాణమయ్యా. గేటుదగ్గర రాయుడు తన బ్యాగ్‌తో కూర్చున్నాడు. తనకోడుకు తనను తీసుకెళ్ళడానికి వస్తున్నాడని కన్నీరు కార్చాడు. రాయుడుతో నా పలుకులు ముగించుకొని వెళ్తుండగా, రామారావు నావెంట వస్తాననడంతో, ఇద్దరం నడకందుకున్నాం.

ఎప్పటిలానే మా నడక కబుర్లతో సాగింది. 'అరేయ్! నాపిల్లలని చదివించి పెద్దతప్పు చేసిన. పెద్దొడు అమెరికా, చిన్నోడు ఆస్ట్రేలియా, పెద్దది లండన్, చిన్నది శ్రీలంక. ఇలా నలుగురు నాలుగు దిక్కులకెల్లి, మమ్మల్ని దిక్కులేనోల్లనుజేసిన్రు. ఆ బెంగతోనే, పొయినేడాది అది సచ్చిపోయింది. కొరివి పెట్టడానికి రానోళ్ళు, దాని దినాలకచ్చి, నన్నిక్కడకి తోలింన్రూ. సిన్నప్పట్నుంచీ, పుత్తడోలే చూసుకున్న మేము, ఇప్పుడు ఇత్తడోల్లమయ్యాం' అంటూ బోరున ఏడ్చాడు. అవును ఏలాంటి చదువు సంధ్యాలేని మేము, మా అమ్మా–బాపులను బతికున్నని రోజులు మంచిగ చూస్కున్నాం. వీళ్ళలాగా గాలికి వదిలేయలే. వీళ్ళకు గడియారం చుట్టూ పరుగెత్తడమే తప్ప, పరుగు నేర్పించిన తల్లిదండ్రులను పట్టించుకునే సమయం ఎక్కడుంది. కబుర్లతో సాగుతున్న ఈ ఓదార్పు యాత్రలో,కన్నీరు తప్ప సాక్షులెవ్వరు లేరు.

***

చకచకా పరుగెడుతున్న మబ్బులు, ఆ తెల్లని ఆకాశాన్ని నల్లగా మార్చాయి. మాకు తోడుగా, ఆ ఆకాశం కన్నీరు కార్చింది. బోరున వర్షం కురవడంతో మా ఆశ్రమం వెనకాలే ఉన్న అనాథాశ్రమం ముందట తడుస్తూ నిల్చున్నాం. ఇంతలో చిన్నిచిన్ని చేతులు మమ్మల్ని తాకాయి. 'తాతయ్యలు.. ఆశ్రమం లోపలికి రండి. తడుస్తూ నిల్చుంటే జలుబులేస్తుంది' అంటూ మమ్మల్ని ఆశ్రమంవైపు నడిపించారు. వారి నవ్వులతో మా మనస్సు తేలికయింది.

వారి ఆశ్రమమంతా పాతదైంది. కొన్నిచోట్ల నీరు కారుతుంది. వర్షంతో గోడలు

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 322

నానిపోయాయి. ఇంత చిన్న ఆశ్రమంలో, వారికే చోటులేకున్నా మమ్మల్ని రమ్మన్న ఆ లేత మనస్సుల్ని చూస్తే నవ్వాలో, ఏడ్వాలో మాకర్థం కాలేదు. అక్కడున్న మేనేజర్‌ను 'ఏంటయ్యా! పిల్లలుండే చోటు, ఇలా ఉంటే ఎలా? అసలే రోజులు బాలేవు. పిల్లలకు జ్వరాలస్తే ఎట్టా? కొంచం మరమత్తులు చేయించరాదు' అంటూ కొంచం గట్టిగానే ప్రశ్నించాడు రామరావు. దానికి బదులుగా 'సార్! వాళ్ళకు తిండి పెట్టడానికే వాళ్ళకాళ్లు వీళ్లకాళ్లు పట్టుకుంటున్నా. అయినా మరమత్తులు చేయించాలంటే నా ఒక్కడివల్ల కాదు సార్. నాకు చేతనయినంత వరకు ప్రయత్నిస్తున్నా. కావడం లేదు. నాకు మాత్రం వీళ్ళను ఇలా ఉంచాలని సరదాన సార్!' అని వినయంగా చెప్పాడు.

**వీళ్ల మాటలతో కాబోలు మబ్బులు పక్కకు జరిగాయి. పిల్లలకి 'టాటా' చెప్పి, మా ఆశ్రమం వైపు అడుగులేసాం. గేటు దగ్గర రాయుడిని చూసి 'కొడుకింకా రాలే! ఎంత సేపు ఇక్కడ కూర్చుంటావ్.**

వీళ్ల మాటలతో కాబోలు మబ్బులు పక్కకు జరిగాయి. పిల్లలకి 'టాటా' చెప్పి, మా ఆశ్రమం వైపు అడుగులేసాం. గేటుదగ్గర రాయుడిని చూసి 'కొడుకింకా రాలే! ఎంతసేపు ఇక్కడ కూర్చుంటావ్. ఫోన్చేసి ఎప్పుడస్తవని కనుక్కో' అని నా మాటలు ఒడిసేలోపే రావుగారు అందుకొని పొద్దుగాలే బ్యాగు పట్టుకొని కొత్తపెళ్లికొడుకోలే ఇక్కడ కూసునుడు, పొద్దుమోపు కొడుకు రాలే అని ఏడ్సుకుంటూ మంచంల పడుకునుడు.దొరగారికి ఈ పైత్యం ఎప్పుడు ఈడుతదో ఎమ్మో!' అంటూ వాడి మీదకు ఎగిరేగిరి పడ్డాడు. 'అసలు ఏమైంది' అని రావుగారిని మర్యాదగా అడిగా. 'ఈడ్నీ, ఈడి కొడుకు ఆరునెలల ముందు ఈ కొంపల ఒదిలేసి పొయిండు. అప్పటినుండి ఇదే తంతు. కొడుకత్తలేడని బెంగతో ఏనుగోలే మనిషి, ఎలుకోలె ఎట్టా పీక్కపోయిండో చూసినవా లింగా!' అంటూ కన్నీరు కార్చాడు. ఈ ఆశ్రమంలో ఉన్న అందరి కథ దాదాపు ఇలాంటిదే.

***

నా పెంకుటిల్లుని అమ్మి, వాడు ఇల్లు కొనుక్కున్నాడు. అలా నా సొంతిల్లు నాకు దూరమైంది. వాడి ఇంట్లోకి నా పాతవస్తువులు తీసుకురావద్దన్నడు, అలా నా జ్ఞాపకాలు దూరమయ్యాయి. నా కూతురుకి ఇంటిపని రావట్లేదని, నా భార్యని తీసుకెళ్లింది. అలా నలభై ఏళ్లుగా కలిసున్న మా బంధం విడిపోయింది. మనుమళ్లు నాతో ఆడుకొని పాడవుతున్నారంటూ, టూషన్లలో చేర్పించారు. అలా నాకు కాలక్షేపం దూరమైంది. రోజంతా నేను, నా పేపరు. జ్ఞాపకాలతో నా కళ్లు కన్నీరు కార్చాయి. ఇందరి జీవిత

చిత్రాలను చూసి, నా కళ్లకంటుకున్న పొర తొలిగిపోయింది. నా జీవిత గమనం, గమ్యం మారింది.

***

ఎప్పటిలాగే, సాయత్రం మేమంతా కూర్చొని మాట్లాడుకుంటున్నాం. 'ఆ అమ్మ, అయ్యలేని పిల్లలకు మనమేమన్న సేయలిరా' అన్నారు రావుగారు. 'మనల్ని చూడటానకి, చేయడానికే ఎవరస్తలేరు. మనం వాళ్లకు ఏం చేయగలుగుతాం రా' అని నిస్సహాయంగా అన్నాడు రాయుడు. 'మనం కష్టపడ్డ సొమ్మంతా, మనల్ని కాదన్నోల్లకి ఇచ్చే బదులు, ఈ పసిపిల్లలకు ఇస్తే తప్పేముంది. మనల్ని కాదనుకున్న వాళ్లకోసం కన్నీరు కార్చే బదులు, ఈ పిల్లలకు కష్టం రాకుండా చూసుకోవడం మేలుకదా. వాళ్లకు మనమీద ధ్యాసే లేనప్పుడు, వాళ్లమీద మనకు దిగులెందుకు. ఎవరి కాళ్లమీద వారే నిల్చోవాలి, అదే జీవితం. అసలు ఈ ఆస్తి పంపకం అనే ఆనవాయితి పోయిననాడే, ఈ ఆశ్రమాలు పోతాయి' అంటూ నాలో ఉన్న ఆవేదననంతా బయటకక్కాను.

**ఇద్దరం బస్సెక్కి, సీట్లో కూర్చున్నామో లేదో, వాడి దగ్గర నుంచి ఫోన్ అచ్చింది. ఫోన్ స్విచ్-ఆఫ్ చేసి, యశోదకి జరిగింది, జరగాల్సిన విషయాలన్నిటిని వివరించా. మొదట్లో తను కాస్త కంగారు పడ్డా, నాలో వచ్చిన మార్పును చూసి వాటన్నిటీకి సరేనంది.**

అంత ఆవేశంతో నన్నెప్పుడూ చూడని నా స్నేహితులు, నన్నలా చూసి బిత్తరపోయారు. అవును నేనెప్పుడు అంత ఆవేశంతో మాట్లాడి ఉండను. నా ఇంటినమ్మినప్పుడు మాట్లాడలేదు, నా భార్యను తీసుకెళ్లినప్పుడు మాట్లాడలేదు, పిల్లలను టూషన్లో చేర్పించినప్పుడు మాట్లాడలేదు, నన్నిక్కడ వొదిలెల్లినప్పుడు మాట్లాడలేదు. ఇక ఇప్పుడు కూడామాట్లాడకుంటే నేనుండి వ్యర్థం. నామనసులో ఉన్న కాంక్ష తీరాలంటే మొదటడుగు నాదే కావాలనుకున్నాను. ఆ మర్నాడే నా ప్రయాణం మొదలెట్టాను.

***

ఎన్నో ఏళ్లయింది తననిచూసి, అప్పుడెప్పుడో తన కూతురితో వెళ్లినప్పుడు చూసా. అప్పుడు తను నామీద చాలా కోపంగా ఉంది. బహూశా వాళ్ళు తీసుకెళ్తున్నప్పుడు నేనేమనలేదని కాబోలు. తన కోపం గుర్తచ్చిన వెంటనే ఆ భగవంతున్ని గట్టిగా ప్రార్థించా. తానున్నన్ని రోజులు మా ఇల్లు కళకళలాడుతూ ఉండేది. నాకోసం, తన గారాల గాడిదలకోసం దానికెప్పుడూ దేవుని ధ్యాసే. తన అగరొత్తుల సువాసనతో

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 324

నారోజు ప్రారంభమయ్యేది. మా ఇంట్లో అలారం ఉండి దండగ. తను రోజూ మ్రోగించే గంట శబ్దంతో, నాకు మెలకువచ్చేది. నేను లేచేవరకు ఆ గంట అలా మ్రోగుతూనే ఉండేది.

***

చూస్తుండగానే నా గమ్యం చేరువైంది. బస్సు దిగి, ఆటో ఎక్కి దానింటి ముందట దిగాను. ఇంటి ముందట నా యశోద వేసిన ముగ్గు దర్శనమిచ్చింది. గేటు తీసుకుని లోపలికి వెళ్తుంటే, ఎవడో బుడ్డోడు గుమ్మం ముందు నిల్చోని 'అమ్మా! ఏవరో బూచోడచ్చాడు' అంటూ కేకేసాడు. వాడి అరుపులకి లోపలున్నోల్లంతా బయటకు కదిలారు. నన్నుచూసి 'ఏంటి నాన్న ఈ బట్టలు, వేషం. పిల్లోడు భయపడ్డాడు. అయినా, అన్నయ్య నిన్ను ఆశ్రమంలో చేర్పించారటగా, ఇక్కడికెందుకచ్చావ్?' అంటూ అరిచింది. ఆ మాటలు విని నన్ను నేను సముదాయించుకొని 'ఇంటికచ్చిన తండ్రిని లోపలకు రమ్మనకుండా, అందరిముందు ఎందుకచ్చావని అడుగుతావా. పొట్టకోస్తే అక్షరం ముక్కరాని నీకు, పెద్దింటి సంబంధం చేసి తప్పు చేసా. కాలికి ముల్లంటకుండా పెంచినోళ్ళనే తందామని చూస్తే ఊరుకునేది లేదు. అయినా ఈ వాదనంతా నాకు అనవసరం. నేనచ్చింది నా యశోదను తీసుకెళ్లడానికి' అంటూ గట్టిగానే నిలదీశా. నా మాటలిని అప్పుడే గుమ్మం నుండి బయటకచ్చింది యశోద. తనని చూసినెంటనే కన్నీరు ఆగలేదు. పెద్దబొట్టు, ఎప్పుడు మొఖంపై వేలాడే నవ్వు, చేతినిండా గాజులు, కాళ్ళకు గలగలమనే గజ్జెలు, చిన్న అమ్మోరులా కనిపించే యశోద బక్కగా అయింది. పని నేర్పంచడానికచ్చి, పనిమనిషిలా తయారయింది. ఏదయితేనేం వాళ్లందరిని ఎదిరించి తనతో నా ప్రయాణాన్ని కొనసాగించా.

**పొట్టకోస్తే అక్షరం ముక్క రాని నీకు, పెద్దింటి సంబంధం చేసి తప్పు చేసా. కాలికి ముల్లంటకుండా పెంచినోళ్ళనే తందామని చూస్తే ఊరుకునేది లేదు. అయినా ఈ వాదనంతా నాకు అనవసరం. నేనచ్చింది నా యశోదను తీసుకెళ్లడానికి' అంటూ గట్టిగానే నిలదీసా.**

ఇద్దరం బస్సెక్కి, సీట్లో కూర్చున్నామో లేదో, వాడి దగ్గరనుంచి ఫోన్ వచ్చింది. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, యశోదకి జరిగింది, జరగాల్సిన విషయాలన్నిటిని వివరించా. మొదట్లో తను కాస్త కంగారుపడ్డా, నాలో వచ్చిన మార్పును చూసి వాటన్నిటీకి సరేనంది.

మాటల్లోనే, ఊరు వచ్చింది. బస్సుదిగి పక్కనే ఉన్న హోటల్కువెళ్లి భోజనంచేసి, ఆశ్రమానికి వెళ్ళాం. అక్కడ నన్ను చూసిన మేనేజర్ 'ఏంటయ్యా? ఎవ్వరికి చెప్పకుండ ఎటుపోయినవ్? నీకెమైన ఐతే ఎట్టా?' అంటూ నన్ను ఎడాపెడా కడిగేశాడు. 'బాబు!

ఇది నా భార్య యశోద. దీన్ని తీసుకురావడానికే పోయినా. చెప్పకుండా పోయినందుకు సారీ బాబు' అంటూ సముదాయించా. 'దీనికి సారీ ఎందుకులేగాని. ఇంకెప్పుడైనా ఎటన్న పోతే చెప్పివెళ్ళు. సరేనా!' అంటూ ఎటో కదలబోయాడు. ఎలా చెప్పాలనుకునేలోపే 'బాబు! ఈ ఆశ్రమాన్ని, వెనకున్న పిల్లల ఆశ్రమాన్ని కలిపేద్దాం. ఈ వయసులో మా ముసలోల్లకి, ఆ పసిపిల్లల నవ్వులు చూస్తేనన్న మమ్మల్ని వొదిలెళ్ళిన మాపిల్లలు గుర్తుకురారు. ఆ పిల్లలకు మాతో కలిసి ఆడుకుంటే వాళ్ళు అనాథలని అనుకోరు. ఈ చివరి క్షణాల్లోనైనా ఈ ముదిరిన మనుషుల్ని అర్థం చేసుకోండి సార్' అంటూ కన్నీరు కార్చింది యశోద. మేనేజర్ సరేననక తప్పలేదు. బ్యాంకులో ఉన్న డబ్బు, పొలం అమ్మగా వచ్చిన డబ్బూ కలిపి ఆ వృద్ధాశ్రమాన్ని, అనాథాశ్రమాన్ని ఒక్కటిగా మార్చాం. కావల్సిన మరమ్మతులు చేపించాం. పిల్లలు, పెద్దలుఆ డుకోడానికి పార్కును, చదువుకోడానికి లైబ్రరీని ఏర్పాటుచేశాం. నా యశోదకి ఇష్టమైన గణపతయ్య గుడిని కట్టించాం. నా కొడుకు వాడింటికి తేవద్దన్న నా పాతవస్తువులు ఇక్కడ పనికచ్చాయి.

ఇరవై ఏళ్ల తర్వాత ఎవరోముసలాయిన నాముందుకచ్చి నిల్చున్నాడు. పక్కనున్న కళ్లద్దాలను ముక్కుమీద నిల్పొపెట్టి సరిగ్గా చూశాను. నా పుత్రరత్నం బ్యాగుతో దర్శనమిచ్చాడు. వాడేదో చెబుతున్నా, నా చెవులకది వినపడడం లేదు. బహుశా!వాడి కొడుకు వీడ్ని ఇక్కడ వొదిలెళ్ళినట్టున్నాడు. పశ్చాత్తాపంతో నిల్చున్న కొడుకుతో 'జరిగిందంతా మర్చిపో, ఇకనైనా హాయిగాఉండటానికి ప్రయత్నించు'అంటూ నేను తెచ్చుకున్న పేపర్ చదువుతూ కుర్చీలో వాలాను. ఇందంతా చూసి ఫోటోలో ఉన్న యశోద నవ్వుకుంది.

(కర్త + కర్మ + క్రియా = జీవితం )

***

# మండ శ్రీకర్

శ్రీకర్ .. వరంగల్ జిల్లా వంగపల్లి గ్రామానికి చెందిన రచయిత. తల్లిదండ్రులు మంజుల–సాంబయ్య. శ్రీకర్కు 21 ఏండ్లు. బీటెక్ చదువుతున్నారు. ఇదే తొలి రచన. స్కూల్లో ఉన్నప్పుడే సాహిత్య పుస్తకాల మీద ఆసక్తి పెంచుకున్నారు. దొరికినప్పుడల్ల పుస్తకాలు చదవడం అలవాటుగా చేసుకున్నాడు. దీంతో రచనల పట్ల ఆసక్తి కలిగింది. ' నమస్తే తెలంగాణ నిర్వహించిన కథల పోటీ ద్వారా నా తొలి రచనకు నాంది పలికాను.'

# క్షమించవా...?

**కటుకోజ్వల మనోహరాచారి**
**-94410 23599**

**'నాన్నకు బాగాలేదు...'** ఇంటిదగ్గర నుండి సమాచారం వచ్చింది.

నేను పెద్దగా స్పందించలేదు. గత పదేళ్లుగా ఈ సమాచారం చాలాసార్లు వచ్చింది. కానీ ఎప్పుడూ నేను అటువైపు అడుగుతొక్కలేదు.

చిన్నప్పట్నుండీ నాన్నంటే నాకు ద్వేషం. అది ద్వేషమో.. కోపమో... కసో... నాకే తెలియని స్టితి.

గత పదేళ్లక్రితం అమ్మచనిపోయాక ఇంట్లో నుండి కాలు బయటపెట్టిన నేను ఇప్పటివరకూ మా ఊళ్లో కాలు మోపలేదు. నాన్నఎట్లా ఉన్నాడని వాకబుచేయలేదు. ఆయన నాపట్ల ప్రవర్తించిన తీరుకు ఇంతకంటే ఏరకంగా కసి తీర్చుకోగలనో తెలియలేదు. తోటిసోదరులు, బంధుమిత్రులు చెప్పినా నా మనసు మారలేదు.

ఇప్పుడు నాన్న మంచంపట్టాడన్న విషయం తెల్సినా కదలాలనే ఉత్సాహం కలగడంలేదు. నా భార్యాపిల్లలు పోరినా పట్టించుకోలేదు. ఎందుకంటే.. నాకు ఎదురైన అనుభవాలు, నేను అనుభవించిన బాధలు వాళ్లకు తెలియవుకదా!

ఒకటా రెండా..ఎన్నని చెప్పను? పుట్టి బుద్దెరిగిన్నుండి ఆయన నాకు చేసిందేమీ లేదు. ఒక్క జన్మనివ్వడం తప్ప. పదిహేనేళ్లవయసులోనే నా బతుకు నేనే చూసుకున్నాను. నా చదువు నేనే చదువుకున్నాను. నా ఉద్యోగం నేనే సంపాదించుకున్నాను. చివరకునా పెళ్లి కూడా నేనే చేసుకున్నాను. ఇవన్నీ కాదు. అసలు నా ఎదుగుదల కోసం ఆయనిచ్చిన ప్రోత్సాహం ఏమీలేదు. పైగా అడుగడునఅవమానపరుస్తూ అవహేళన చేస్తూ అసంతృప్తికి గురిచేశాడు. మెట్టుమెట్టులో కిందికిజార్చే ప్రయత్నం చేశాడు. అటువంటి తండ్రికినేనేం చేసేది?

నాకు చదువే రాదన్నాడు. ఉద్యోగం నీయందున లేదన్నాడు. ఏపని చేసినా వెన్నుతట్టాల్సిందిపోయి, అది నీవల్ల కానే కాదన్నాడు.అసలు నేనెందుకూ పనికిరానివాడన్నట్టు మాట్లాడేవాడు.

పదోతరగతి పరీక్ష ఫీజుకోసం మా ఊరి గుడికి రంగులేశాన్నేను. కొడుక్కోసం ఫీజుకూడా కట్టని మహానుభావుడు... ఈరోజుమంచం పడితే నేనెందుకు వెళ్లాలి?బాధ్యత కాబట్టి.. నలుగురికోసం వెళ్లాలన్నా మనస్కరించనంత నరకం చూపాడు నాకు. ఏతండ్రీఏకొడుకుతో ప్రవర్తించని రీతిలో అడుగడుగునా నిరుత్సాహపరిచాడు. ఈరోజు నా హోదా, పలుకుబడీ, పేరుప్రఖ్యాతులూ అంతా..అంతా నా సొంత సముపార్జన మాత్రమే. తండ్రిగా ఆయన పాత్ర నాజీవితంలో శూన్యం మాత్రమే!

నా భార్య కదిలించి చూసింది. 'ఏవండీ... ఒక్కసారి వెళ్ళొద్దాం...'

నాకు రుచించలేదు. 'అక్కర్లేదు' అన్నాను.

ఆమె నిర్వేదంగా చూసింది నావైపు.

'ఏ.. ఎందుకు వెళ్లాలి...?'

'కన్నతండ్రి కాబట్టి వెళ్లాలి.'

హు! కన్నతండి..! కన్నతండ్రి కొడుకు ఏదైనా సాధిస్తే పొంగిపోతాడు. నలుగురికీ చెప్పి ఆనందపడతాడు. తన తండ్రి అట్లాకాదు. నలుగురిముందూ తనకు ఏదీ సాధ్యం కాదని దెప్పిపొడిచేవాడు. అసలు తనకు ఏ టాలెంటూ లేదని కించపరిచేవాడు. తానుకసిగా తన టాలెంటును నిరూపించుకునే ప్రయత్నం చేసినా సంతృప్తి చెందని వ్యక్తి!

'నీకు తెల్సా భార్గవీ.! ఆయన నన్ను ఎంతగా అణచివేశాడో..??

ఆమె మౌనంగా ఉండిపోయింది.

నా ఆలోచనలు బాల్యంలోకి మళ్లాయి.

***

'నాన్నా.. నేనూ ఇట్లానే కవిత్వం రాస్తా..' అన్నాన్నేను మా తెలుగు ఉపాధ్యాయుడు రాసిన పుస్తకాన్ని చూపిస్తూ.

ఆయన ఎగాదిగా చూశాడు. 'కవిత్వం రాయడమంటే మాటలా? అది అందరివల్లా కాదు. నీలాంటివాడికి అస్సలు రాదు' అన్నాడు.

నాలో కసి బుస కొట్టింది.

అందరివల్లా కాదంటే కొందరివల్ల అవుతుందనేగా. ఆ కొందరు ఎవరు? వాళ్లు ఆకాశం నుండి ఊడిపడి ఉంటారా? నాకెందుకోకవిత్వం రాయడం తేలికే అనిపిస్తుంది.

దీక్షగా కూచొని ఓ పాట రాశాను. తోచిన భావాల్ని ఒకచోట లయబద్ధంగా కూర్చితే పాటయింది. వాళ్లవీళ్ల కవిత్వాల్ని మెచ్చుకొనేనాన్న వద్దకు నా పాటను

తీసుకెళ్లి చూపించాను. ఆయన నాలుగైదు లైన్లు చదివి.. 'దీన్ని కవిత్వం అనరు. అయినా నువ్వు కవిత్వంరాయడమేంది..?' అన్నాడు చులకనగా.

నా మనస్సు చివుక్కుమంది.

బాగానే రాశానే...! నేను పాడి వినిపించాను. రాస్తున్నప్పుడే లయబద్ధంగా పాడుతూ రాశాను కాబట్టి పాడడం తేలికైంది. నేనురాసిన పాట నేనే పాడి వినిపించి గర్వంగా చూశాను మా నాన్న మెప్పుకోసం. ఆయన మెచ్చుకోలేదు.

'కవిత్వం ఎట్లో.. పాడడం కూడా అట్లే ఒక కళ. పాటలు పాడడం, నాటకాలేయడం.. అందరివల్లా అయ్యే పని కాదు. దానికి పెట్టిపుట్టాలి. రాసిపెట్టి ఉండాలి. మనలాంటి వాళ్లు పాడితే వినేవాళ్లుండరు మరి!' అన్నాడు.

మనసు బాధతో మూలిగింది. అంటే.. పాటలు పాడడం కూడా మనతో కాదన్నమాట! కానీ నాకెందుకో నేను మంచిగానే పాడుతున్నాననిపించింది. స్కూల్లో తెలుగు పుస్తకంలోని గేయాలు, పద్యాలుగానీ చదివితే నా తోటి మిత్రులంతా మెచ్చుకునేవారు కూడా.

అంతెందుకు.. మా తెలుగుసారు కూడా 'షబ్బాష్‌రో..' అంటాడు.

మరి పాటలు పాడాలంటే పెట్టిపుట్టాలంటాడేంది నాన్న..?!

పెట్టి పుట్టడమంటే ఆ వయసులో అర్థంకాలేదు. కానీ నేనెందుకు పాడలేను? అనే కసి నాలో బాగా పాడాలనే కోరికను బలంగానాటింది. ఆ ప్రయత్నంలో నేను చాలా సినిమా పాటలు గాయకుల్ని అనుకరించి పాడడం మొదలుపెట్టాను. పాఠశాల వేదికల మీదబహుమతులు కూడా పొందాను. కానీ నాన్న మనసును ఆకర్షించలేక పోయాను. నాన్న నా బహుమతుల్ని చూసి 'నువ్వు పాటలపోటీలో గెలుపొందావా? అతడెవరో తెలివితక్కువ దద్దమ్మ నీ పాటకు ప్రైజు ఇచ్చుంటాడు' అన్నాడు.

నా హృదయం భగ్గుమంది. నా తండ్రిని నలుగురి ముందుకు లాక్కెళ్లి ఆయన ముందు నన్ను పొగడండ్రా.. అని అరవాలనిపించింది. కానీ అది సాధ్యంకాదు. వాళ్లు పొగిడే చోట మానాన్న ఉండడు. అది జరగాలంటే నేను పదిమంది మెచ్చేంత గొప్పగా పాటగాన్ని కావాలి!

మళ్లీ నాలో కసి బుసకొట్టింది. పాటలు పాడడం సాధనతో వస్తుందన్న విషయం నాకు అప్పట్లో తెలియకున్నా నిరంతర శ్రమనిజంగానే నన్ను గాయకునిగా మార్చింది. కాల్యకనుంలో నా పాటకోసం చెవికోసుకునే వాళ్లను తయారు చేసుకున్నాను.

***

ఆరో.. ఏడో చదువుతున్న రోజులవి.

నాగార్జున్ వచ్చాడు మాయింటికి. అతను మా మేనత్త కొడుకు. బొమ్మలు చక్కగా వేస్తాడు. ఆరోజు కాలక్షేపం కోసం కొండనెత్తుతున్న హనుమంతుడి బొమ్మ వేశాడు.

మానాన్నకు అది బాగానచ్చింది. తెగ పొగిడేశాడు. 'బొమ్మలు గీయడం ఒకకళ. అది అందరికీరాదు...' అన్నాడు నన్ను చూస్తూ.

నాకు నాగార్జున్ మీద ఈర్ష్యతో పాటు అతనితో పోటీ పడాలనిపించింది. నేనెందుకు గీయొద్దు అనిపించింది. అతను గీసినహనుమంతుడి బొమ్మనే నేనూ గీశాను. కొంచెం అటూ ఇటుగా నాదీ బాగానే వచ్చింది. నాన్నకు చూపిస్తే వెటకారంగా నవ్వి 'నీకుబొమ్మలు గీయడం కూడా వస్తదా..? అదేమన్నా అల్లాటప్పా పని అనుకున్నావా..?' అన్నాడు.

ఒళ్లంతా కంపరమెత్తింది నాకు. గీసిన చిత్రాన్ని ఉక్రోశంతో ముక్కలు చేసి పడేశాను. మానాన్న నన్ను జాలిగా చూస్తూ 'మొకంబాగా లేదని అద్దం పగలగొట్టుకుంటే ఏమొస్తది..' అంటూ 'అందరికీ ఈ కళ అబ్బేది కాదు.. ' అన్నాడు ఎప్పట్లానే.

నాలో ఉక్రోశం పెళ్లుబికింది. దాంతో పంతం కూడా పెరిగింది. మానాన్న.. చిత్రకారుల్ని మెచ్చుకుంటుంటే.. ఎట్లాగైనా చిత్రకారున్నికావాలన్నంత కసి. కంటికి నచ్చిన ప్రతి బొమ్మా గీయడం మొదలుపెట్టాను. ఆ వయసులోనే ప్రకృతి చిత్రాలతో పాటు, సినిమానటుల్ని, జాతీయ నాయకుల్ని, స్నేహితుల రూపురేఖల్ని కూడా గీశాను.

అందరూ నన్ను చిత్రకారుడని ఒప్పుకొంటుంటే మా నాన్న మాత్రం ఏనాడూ మావాడు మంచి ఆర్టిస్టు అనలేకపోయాడు. అందుకేతండ్రంటే రోషం రోజురోజుకూ పెరిగిపోయింది. నేను నాటకాలేసినా.. శిల్పాలు చెక్కినా.. చతుష్షష్టి కళల్లో నైపుణ్యం ప్రదర్శించినా..మెచ్చిన దాఖలాలు లేవు.

ఆ వైఖరి నాలో అసంతృప్తిని మరింత పెంచి.. అది పెనుభూతమై కుదిపేసింది. పదోతరగతి పూర్తయినా పెద్దచదువులు చదివించేఆలోచన చేయని నాన్న.. ఏపనీ నాతో చేతకాదని నిరుత్సాహపరిచే నాన్నతో ఎట్లా వేగేది? ఇంట్లో నుండి వెళ్లిపోవడానికి సిద్ధపడితేబయటకెళ్తే ఉప్పుకూడా పుట్టదని ఈసడించిన నాన్న. ఫలితం... ఇల్లు వదిలి కాలు బయటపెట్టి సిటీ బాట పట్టడం.

పదో తరగతి చదువుతో పట్నంబాట పట్టిన నాకు ఆదరణ చూపేదెవరు? కసిగా బుసకొట్టి మానాన్న నాతో సాధ్యం కాదన్నవన్నీసాధించి చూపిన నేను ఇప్పుడు బతుకుదెరువును వెదుక్కోవడం ఎట్లా?

ఆ ప్రయత్నంలో నాకు అండగా దొరికింది చిత్రకళ. నాన్న నాతో కాదన్న చిత్రలేఖనమే నాకు ఆదరణ అయింది. అదే నాకుఅన్నం పెట్టింది. పదిహేనేళ్లు పూర్తిగానిండని నేను ఆర్టిస్టుగా అవతారం ఎత్తాను. బతుకుదెరువుకు మెలమెల్లగా బాటలు వేసుకొన్నాను.ఎండనకా వాననకా రాత్రనకా పగలనకా భుజాన

రంగుడబ్బాలేసుకొని ఎక్కడికి పడితే అక్కడికి తిరిగాను. ఒక్కో రూపాయినీ అపురూపంగా వెనుకేస్తూ నా జీవన దుర్గాన్ని నిర్మించుకున్నాను.

'మన ఇంట ఉన్నత చదువులు అబ్బ'వన్న మానాన్న భావనను అధిగమిస్తూ నాకుగా నేను ఉన్నత చదువులకు ఉపక్రమించాను.దూరవిద్యలో డిగ్రీ చేశాను. కమర్శియల్ ఆర్టిస్టుగా నేను సంపాదిస్తున్న ఒక్కో పైసా నా చదువులకు వెచ్చించాను. దూరవిద్యలోనే పీజీ పూర్తి చేశాను. పనిలో పనిగా ఉపాధ్యాయ శిక్షణా పూర్తి చేశాను. ఈ ప్రయత్నంలో ఎన్నో ఆటుపోట్లు..ఎన్నో నిద్రలేని రాత్రులు..ఎన్నో ఉపవాసదీక్షలు. ఆకలిని జయించిన అజేయున్ని నేను! నిద్రను దిగమింగిన నిశాచరున్ని నేను!

***

'నీకు ఉద్యోగం రావడం కల్ల..' అన్నాడు ఆరోజు బంధువుల పెళ్లిలో కనిపించిన నాన్న.

నేను ఆయనకు దూరంగా బతుకుతూ... నన్ను నేను నిరూపించుకున్నా.. మళ్లీ అదే దిగజార్చుడు మాట.

'ఎందుకు రాదు?? చదువుకున్నానుగదా..!' అన్నాను ఉక్రోషంగా.

'మన కుటుంబంలో ఉద్యోగాలు రాసిపెట్టిలేవు..' అన్నాడు తనో జ్యోతీషశాస్త్రవేత్తలా.

నాకు ఒళ్లంతా కంపరమెత్తింది. ఏవో ఛాదస్తపు భావాలు పట్టుకొని వేలాడే తండ్రికి నా జాతకాన్ని నిర్దేశించే అధికారం ఎక్కడిది?నన్ను నీరుగార్చే అవసరం ఏమిటి?కసిగా బయటకొచ్చిన నేను మరో మజిలీ కోసం ప్రస్థానం మొదలుపెట్టాను.

ఇప్పుడు నేను ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి. అది ఎట్లా నాకు రాసిపెట్టిలేదో నిర్ధారించుకోవాలి. కేవలం మా నాన్నమీద కసితోచదివాను. నిద్రాహారాలు మాని చదివాను. అదో యజ్ఞం! సుదీర్ఘంగా మూడేళ్లపాటు నా మెదడులోని ప్రతికణమూ ప్రభుత్యోద్యోగంకోసమే పనిచేసింది.

ఫలితం... వేలమందితో పోటీపడి సాధించిన ఉద్యోగం... నాకు పదిమందిలో కార్యసాధకుడిగా గుర్తింపునిచ్చినా మా తండ్రిమాత్రం నా ఉన్నతిని ఒప్పుకున్నట్టే అనిపించలేదు.

తర్వాత నా సహోపాధ్యాయినితో జరిగిన నా పెళ్లికీ పెద్దగా నిలవలేదు. నేను నిలపలేదనడం సరైందేమో!

ooooo

'వెళ్దాంపదండీ..' మరోసారి గుర్తు చేసింది మా ఆవిడ.

'ఎక్కడికి వెళ్లేది ?' నేను తలయెత్తి చూశాను.

'మీ నాన్నగారికి ఏమాత్రం ఆరోగ్యం బాగాలేదట. ఆసుపత్రికి తీసుకెళ్తే నాల్రోజులు ట్రీట్‌మెంట్ ఇచ్చి కోలుకోవడం కష్టమనిమళ్లీ ఇంటికి పంపించేశారట. నేడో రేపో అన్నట్టు ఉన్నారట! అవసానదశలో ఉన్నాయనతో పంతాలేంటి మీకు?' అంది అర్ధాంగి.

పంతమా..??

పట్టుమని పదిరూపాయలు కూడా ఇచ్చిఎరుగని.. పదోతరగతి పరీక్ష ఫీజుకూడా కట్టి ఎరుగని... చదువుకోవడానికో, స్వావలంభనకోబాసటగా నిలువని అయోగ్యుడైన తండ్రిని... అవసాన దశలోనైనా దర్శించాలనే ఆసక్తి కలగని నాది.. పంతమేనా..?

కాదు. ఇది అయిష్టత అంతే!

'నన్ను ఎందుకూ పనికిరావన్నాడు. ఈరోజు యోగ్యున్నయ్యాను. నాకు ఉద్యోగమే రాదన్నాడు. నేను ప్రభుత్వ ఉపాధ్యాయున్నయ్యాను. అంతెందుకు... నాకు కవిత్వమే రాదన్నాడు.. వందలాది కథలు, కవితలు, పాటలు రాసి పదులసంఖ్యలో పుస్తకాలు వెలువరించిననేను సమాజం గుర్తించిన విశిష్ట కవిని నేడు. నా రచనలు చదవడానికి అమితాసక్తి కనబరుస్తారు పాఠకలోకం. నా గాత్రంవినడానికి ఉవ్విళ్లూరతారు శ్రోతలు.ఒకనాడు ఇవేవీ నాతో కానేకావన్న శాడిస్టు మానాన్న. ఇప్పటికీ నా గొప్పతనాన్ని ఒప్పుకోని అహంభావి ఆయన..' అన్నాను కసిగా.

'ఆయన మీ గొప్పతనాన్ని ఒప్పుకోకుంటేనేమి? సమాజం ఒప్పుకునేలా చేశారుకదా..!' అంది భార్గవి.

చటుక్కున తలయెత్తి చూశాను ఆమెవైపు.

'అవును! మీరు ఈ స్థాయికి రావడంలో మీ నాన్నగారి పాత్ర ఏమీ లేదన్న అసంతృప్తితో ఇప్పటివరకూ ఆయనమీద ద్వేషంపెంచుకున్నారుకాని.. అసలు మీరు ఈ స్థాయికి రావడంలో మీ నాన్న పాత్రే ఉందన్న అసలు సత్యం గ్రహించడం లేదు'

నేను వెర్రిగా చూస్తున్నాను ఆమెనే.

ఆమె కొనసాగిస్తూ 'ఏళ్ల తరబడిగా మీరు మీ నాన్నగారిమీద కోపంతో రగిలిపోతుంటే, అప్పుడప్పుడు మీరు ఆయన గురించిబయటపడిన తీరునుబట్టి నిజంగానే ఆయన మీపట్ల అన్యాయంగా ప్రవర్తించారనుకున్నాను. ఇప్పుడు మీ ఆవేదన, ఆక్రోశం దాచుకోకుండా వెలగక్కాక ఆలోచిస్తే మీ నాన్నగారు నిజంగానే మీకు ఎనలేని మేలు చేశారనిపిస్తుంది' విస్పష్టంగా అంది భార్గవి.

ఆమె ఏం చెబుతుందో అర్థం కానట్టు చూస్తుండిపోయాను.

'నిజానికి 'మీతో ఇది కాదు' అని రెచ్చగొడితే అది సాధించితీరుతారని, మీకై మీరు దేనిమీదా దృష్టిసారించరని నాకూ తెల్సు. ఈవిషయం మీ నాన్నగారు అప్పుడే

గుర్తించారు. అందుకే ప్రతిదీ నీతో కాదని మీలో వ్యతిరేక ప్రేరణ కలిగించారు. ఏదైతే మీరు చేయలేరన్నారో దాన్ని కసితో చేసిచూపించారు. అయితే.. మీరు ఒకటి సాధించి అంతే తీవ్రంగా.. అది చేయలేవన్న మీనాన్నగారిని ద్వేషిస్తూ మిమ్మల్ని గుర్తించే అవకాశం లేనంతగా దూరం చేసుకున్నారు. ఏదేమైనా ఆయన మిమ్మల్ని అసమర్థులు అనడంవల్లే మీ సమర్థతనునిరూపించుకున్నారన్నది వాస్తవం..'

నేను విచలితున్నయ్యాను.

ఎక్కడో.. హృదయాంతరాలల్లో.. మనసు అంతర్గత పొరల్లో ఏదో కదలిన సవ్వడి. నా మనోగృహానికి కట్టిన తెరలు నెమ్మదినెమ్మదిగా తొలగిపోతున్న భావన.

అవునా...?

చిన్నప్పట్నుండీ నాకుగా నేను ఏపనికీ పూనుకోనన్నది నాకూ తెల్సుకదా! అందుకే నన్ను రెచ్చగొట్టి,ఆయా కళల్లో రాణించేందుకుపురిగొల్పాడా??నిజంగా... నా మనోభావాలపై దెబ్బకొట్టి ఉండకపోతే తానసలు ఇల్లు దాటి కాలు బయట మోపేవాడా?? అసలాయనఅట్లా గుచ్చిగుచ్చి నీవల్ల కాదనకుంటే తాను ఆర్టిస్టు అయ్యేవాడా? తనను కవిత్వం రాయలేవు అనడం వల్లనే ఇన్ని పుస్తకాలు రాసేస్థితికి ఎదిగాడా? చివరకు తాను ఉద్యోగం కోసం పట్టువదలని విక్రమార్కుడిలా అహరహం శ్రమించిందీ వ్యతిరేక ప్రేరణ వల్లేనా..??

అసలు నాలో ఇంతగా కసి రగుల్కొనడానికి ప్రేరకుడెవరు?....ఎవరు?

మా నాన్నే కదా...

నా మనోఫలకంపై పరుచుకున్న మకిలి పూర్తిగా తొలగిపోయిందిప్పుడు. నా కనులముందు మా నాన్న మహోన్నత రూపంగీతోపదేశం చేస్తున్న శ్రీకృష్ణుడిలా గోచరిస్తుంది.

'యద్యద్విభూతి మత్సత్వం శ్రీమదూర్జితమేవ వాతత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోంశ సంభవం' అన్న గీతా శ్లోకం గుర్తుకొస్తుంది.

ఇప్పటివరకూ నా జీవితంలో నాన్న పాత్ర జీరో అనుకున్నాను. కానీ నన్ను జీరోగా చూడకుండా ఉండడం కోసం తన పాత్రనుసమర్థంగా పోషించిన మహోన్నతుడు.

నాన్న!! నాన్నను చూడాలి.

'భార్గవీ! పదా... నాన్నను చూడాలి. ఇంతకాలం నా అవివేకం, అహంభావంతో ఆయన్ను చాలా బాధించాను. ఆయన కాళ్లమీదపడి క్షమించమని వేడుకోవాలి. పద..'

నా హృదయోద్వేగాన్ని అర్థంచేసుకున్న భార్గవి వెంటనే కదిలింది.

ఇపుడు మేం పయనిస్తున్న కారు మా పుట్టినూరువైపు పరుగులుతీస్తుంది.

ఎట్లాగైనా నాన్నను చూడాలి. ఆయనతో మాట్లాడాలి.పదేళ్ల సుదీర్ఘ ఎడబాటును, ఇన్నేళ్లుగా నానుండి పొందని ఆత్మీయతను ఆయన ఎదనిండా నింపాలి!

పదేళ్ల తర్వాత మా ఊల్లో అడుగుపెట్టిన నేను ఆత్రంగా మా ఇంటిముందు వాహనాన్ని ఆపాను. నలుగురైదుగురు చుట్టుపక్కలవాళ్లు ఇంటిముందు చేరిఉన్నారు. నా గుండె లయతప్పి కొట్టుకొంటుంటే ఆర్తిగా ఇంట్లోకి ప్రవేశించాను. అప్పటికే నా సోదరులిద్దరూ,ఇద్దరుముగ్గురు బంధువులు వచ్చియున్నారు.

'నా..న్నా...!' నా పిలుపు ఇంట్లో నలువైపులకూ వినిపించింది.

అక్కడ... వరండాలో మంచంపై... నా...న్న! నా పిలుపువిని కళ్లు తెరిచి ఆనందించలేదు. అట్లాగే నిస్తేజంగా పడుకొని ఉన్నాడు.నేను మంచం పక్కనే చేరి నాన్న గుండెలపై తల ఆన్చి ఏడ్చాను.

'నాన్నా..! నన్ను క్షమించు! ఇన్నాళ్లు మిమ్మ నిరాదరించి, మీకు దూరంగా ఉండిపోయిన ఈ దౌర్భాగ్యున్ని ఒక్కసారి క్షమించాననిచెప్పు నాన్నా... ' గుండెల్లో గూడుకట్టుకొనియున్న దుఃఖం కన్నీళ్లరూపంలో పొంగి పొర్లుతుందితప్ప మాట బయటకు రావడం లేదు.

చుట్టూ చేరిన బంధుమిత్రులు నన్ను లేవనెత్తే ప్రయత్నం చేస్తున్నారు.

నాన్న కళ్లు తెరవలేదు... క్షమించానని చెప్పనూలేదు.

అప్పటికే ఆయన ప్రాణాలు అనంతవాయువుల్లో కలసిపోయాయి.

నా వేదన... అరణ్యరోదనగానే మిగిలిపోయింది.

## కటుకోజ్వల మనోహరాచారి

కటుకోజ్వల మనోహరాచారి తెలుగు ఉపాధ్యాయులు. కోరుట్ల పట్టణం, జగిత్యాల జిల్లా. ఎం.ఎ., ఎం.ఫిల్ చదివారు. కవిత, కథ, గేయం, నాటిక రచనల్లో అనుభవాజ్ఞులు. 1997లో స్వాతి వీక్లీ కథలపోటీలో 'వర్షంలో వనకన్య' మొదటి కథ ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఇప్పటికి 45 కథలు, 100 కు పైగా కవితలు, 7 పుస్తకాలు వెలువరించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా సాహిత్య పురస్కారం అందుకున్నారు.

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 334

# పాయమాలు..!

**ఐతా చంద్రయ్య,**

**93912 05299**

'ఎన్ని రోజుల నుండి అనుకుంటున్నా. హైదరాబాద్ పోయి, మెట్రో రైలు ఎక్కి అన్నీ సూసి రావాల్నని, గిన్ని రోజులకు నా కాయుషు తీరుతాంది. నిన్ననే నా బామర్ది సత్నారి ఇంటికి అచ్చిన. రేపు అయితారం గదా.. బామర్దికి తాతిల్ దొరుకుద్ది. ఏం సక్క ఇద్దరం కలిసి గత్తి గత్తీ తిరిగత్తం'

***

'ఓ.. ఇత్తారి బావ! జెప్ప జెప్పా చాయి దాగంటే, కోపుల ఊదుకుంట దాగుతానవ్? గది గా సాసర్లో బోసుకొని తాగు. గిప్పటికే ఆలస్యమైంది'

'ఓ.. బామర్ది! ఉడుకు ఉడుకు చాయి దాగితే, గొంతు సాప్ అయితదని, ఊదుకుంట.. ఊదుకుంట దాగుతాన. సాసర్లో బోసుకొని తాగితే సల్లారుతుంది. ఎంతసేపు.. అయిపోయేనే.. అయిపోయే! ఇగ బా.. పోదాం'

ఇద్దరం కలిసి బయిలుదెరినం.

***

ఇద్దరం కలిసి నడుసుకుంట మెట్రోరైలు స్టేషన్ కాడికి అత్తానం.

'ఇత్తారి బావ.. నువ్వు గూడా హైదరాబాద్ రారాదు. నాలెక్క ఎక్కడైనా వాచ్‌మెన్‌గా చేస్తే నెలకు పదివేలు జీతం. అయితారం తాతీలు దొరుకుద్ది. గప్పుడు గీ పట్నంలో ఉన్నయన్ని తిరిగి సూడొచ్చు'

'బామర్ది..! గీ పట్నంలో ఉండుడు నాకేం వాక? గా పల్లె మీద గీ పట్నం సాటత్తదా? గా పల్లెలో నేను ఊర్లవున్న గొడ్లు, బర్లు గాత్తాన. గవి గాస్తే, కుంచడో.. గించడో జీతం

**గవిరోడ్ల మీద తిరుగుతూ... చెత్తా చెదారం తింటాయి. ఒక్కొక్క సారి చెత్తతో బాటు ప్లాస్టిక్ కవర్లు తిని సచ్చి పోతుంటాయి. రైలు పట్టాలు దాటుతూ...లోకల్ రైలు కింద పడి సచ్చి పోతుంటాయి.**

ఇత్తాండ్లు. గా మంద పొలాల్లో, చెలకల్లో తోలి మంద బెడితే డబ్బులిత్తరు. పెండ కూడేసి అమ్మితే కూడా డబ్బులత్తయి. ఊరిలో ఏ పండగో పబ్బమో అయితే మంచిగా కవుసుతో బువ్వ పెడతరు, అప్పాలు ఇత్తరు. సేనుకాడికి పోతే పండిన పంటలో కొంత నాకు దానంగా పెడ్తరు. గిన్ని సవులతులు ఇడిసిపెట్టి గీడ నేను బతకలేను. నువ్వంటే.. ఎండ పని సేతగాక, వచ్చి నీడకు కూసుంటున్నవు. గది నా వళ్ళగాదు. ఎప్పుడో.. అప్పుడు ఒకపారి సుట్టం సూపుగా అత్తాన గదా? గది సాలు'

'మనసుల లేంది ఎన్నిసార్లు చెప్పినా నువ్వు అత్తవా? సరే..గట్లనే ఉండు'

***

'మేము నడుత్తు వత్తానం. మా ముందే రోడ్ మీదనే శాన గొడ్లు, బర్లు, మేకలు తిరుగుతానయి. కొన్ని రోడ్ మీదనే దర్జాగా పడుకొని నెమరు వెత్తానయి. 'బామర్ది.. గీ గొడ్లెంది? గిట్ల దిరుగుతూ.. రోడ్ మీదనే పన్నయి? గివిటిని బందెల దొడ్లో తోలి పాయమాలు గట్టించరా?'

'గీడ గిట్లనే తిరుగుతాయి బావ! గిక్కడ బందెల దొడ్లు ఎక్కడుంటాయి? ఎవ్వరు పట్టించుకోరు? గవి రోడ్లమీద తిరుగుతూ.. చెత్తా చెదారం తింటాయి. ఒక్కొక్కసారి చెత్తతో బాటు ప్లాస్టిక్ కవర్లు తిని సచ్చిపోతుంటాయి. రైలు పట్టాలు దాటుతూ.. లోకల్ రైలు కింద పడి సచ్చిపోతుంటాయి. గవాటి గురించి గా ఆసాములే పట్టించుకోరు? పాలు పిండుకొని బయిటికి ఇడిసి పెట్టడమే తెలుసు? వాళ్లకు లేని అక్కర మిగితా వాళ్లకు ఎందుకుంటది?'

'గిదేం పట్నం బామర్ది? గింత అన్యాలమా? గివిటి వలన జనాలకు ఎంత ఇబ్బంది? వచ్చే, పోయే మోటర్లకు ఎంత ఇబ్బంది? గిదే మన పల్లెల అయితే.. దొరకబట్టి బందెల దోలి పాయమాలు గట్టించెటోల్లు. గిప్పుడు గా హరిత హారం చెట్లు మెత్తెనే.. దొరక బట్టి వేలకు వేలు పాయమాలు గట్టిత్తాండ్లు! గిట్ల గాదు బామర్ది. గివిటిని అన్ని ఒక్కదిక్కు సేసి, మున్సీపాల్టీ వాళ్ళ దగ్గరకు తోలుకుపోయి బందెల తోలుదాం! కొట్టుకు పోయి నందుకు మనకు డబ్బులిత్తరు! దా..దా!'

'గిదేంది బావ! గొడ్లూ, బర్లూ.. కాసిన బుద్ధి పోనిచ్చుకున్నవుగాదు? అసలే పొద్దు పోతాంది అంటే, గివిటిని జమచేసి బందెలకు తోలుకపోదాం అంటానవు? ఎవ్వలకు

లేని అక్కెర మనకెందుకు? పట్నం సూపిత్త పదా.. పదా'

'ఓ.. బామర్ది! పట్నం ఇయ్యాలగాకుంటే, రేపు సూడచ్చు. ముందు గివిటి పని పడదాం. ఖర్చులకు కొన్ని డబ్బులు అత్తయి. రా.. రా..! ఓ.. బా..బా! నియయ్య.. రోడ్లమీద ఎంత సక్కగా తిరుగుతూ.. పడుకున్నరే! మీ పనిజెబుతా నుండుండ్లి. అన్ని ఒక్కదిక్కు జమజెత్తాన'

'పొద్దున్నే.. మంచిగ దొరికినట్లున్నవు బావ' అని గులుక్కుంట నాతో పాటు వాటిని జమ జెత్తాండు బామర్ది.

ఇద్దరం కలిసి వాటిని తోలుకుంట రోడ్ దాటిత్తన్నం.

***

గది ఒక జంక్షన్. గొడ్లు, బర్లు రోడ్ దాటుతాంటే, గాడ డ్యూటి జెత్తాన ట్రాపిక్ పోలీస్ ఆయన అరుత్తాండు 'ఒరేయ్..! పొద్దున్నే ఎక్కడ దొరికిండ్లురా? నేను ట్రాపిక్ అదుపు చేయలక సత్తుంటే, సందులో సడేమియా లాగా.. గివిటిని గిప్పుడే రోడ్ దాటియ్యాల్నారా? తొందరగా దాటీయ్యిండ్లి.. దాటియ్యిండ్లి..'

'అబ్బో.. ఏం మచిగున్నవు? మోటార్ల డ్యూటినే జెత్తవా? గివిటి డ్యూటి నీది కాదా? మనం గవాటి డ్యూటి జెయ్యకున్నా.. గవాల్లు జెత్తున్నరని మెచ్చుకునుడు బోయి లొల్లి జెత్తానవా?'

'ఓర్నీ.. పొద్దున్నే భలే దొరికినవురా.. గీడ నిలబడి గీ డ్యూటి జెత్తే తెలుత్తదిరా! నిలబడ లేక కాళ్ళు గుంజి, నోట్లోకి దుమ్ముపోయి ఊపిరి ఆడకుండా సత్తున్న. జెప్ప జెప్ప దాటియుండ్లిరా..'

'గా.. ట్రాపిక్ పోలీస్ లొల్లి జెత్తాంటే నేను, నా బామర్ది జెప్ప జెప్ప రోడు దాటించి గొడ్లు, బర్లు తోలుకొని పోతున్నం.

***

కొద్దిదూరంలో ట్రాపిక్ పోలీసులు మోటర్లు ఆపుతూ.. చాలన్ రాస్తున్నరు. మమ్ముల సూడంగనే,

'అరె.. గిదెందిరా? గొడ్లు, బర్ల జమ జేసుకొని గిటు గొట్టుకత్తాండ్లు. ఎనుక్కు కొట్టుకు పోండ్లి..'గా పోలీసులు అరవగానే,

'మోటర్లకు చాలాండ్లు రాస్తారుగాని, రోడ్ల మీద తిరుగుతూ ట్రాపిక్కు ఇబ్బంది పెడుతున్న గివిటికి పాయమాలు రాయారా? గిప్పుడు వీటికి పాయమాలు రాయిండ్లి. గప్పుడే గివిటిని సాదుకున్నోళ్లకు బుద్ధి అత్తది!'

'గట్లనా..! అయితే గివ్వి మియ్యి గాదా?'

'మాయి అయితే గిట్ల రోడ్ల మీద ఇడ్చి పెడ్తమా? మంచిగ సాదుకుంటం!'

'ఒరేయ్.. ! మియ్యి గానప్పుడు మీకెందుకురా.. దురద? గిప్పటికె గీ మోటర్లు దొంగయా? దొరయా? కాయితాలు ఉన్నాయా? డ్రైవింగ్ లైసెన్స్ ఉందా లేదా? అని చెక్ చేసి, చాలన్స్ రాయలేక చస్తున్నాం!మీరు విటిని తోలుకొచ్చి పాయమాలు రాయంటే ఎట్లరా? గిది మా డ్యూటి కాదు? తోలుకు పొండ్లిరా?'

'రోడ్ల కావాలి గాసేది మీరే కదా? గా మోటర్లకు దండుగ రాసినట్లు గివిటికి దండగ రాయిండ్లి'

'ఒరేయ్.. పొయ్యి గా.. మున్సిపాల్టీ దొడ్లో తోలి పాయమాలు రాయించుకొండ్లిరా. ఎళ్లుండ్లి'

'అబ్బో.. మోటర్లు అయితే పైసలు రాల్తాయి. గివీటికి రాలయని భలే ఇకమతు పడుతున్నరు. మీరు దండగ రాయకపోతే పొండ్లి. గా మున్సీ పాల్టి ఆపీసుకే తొలుక పోతం! రా.. బామర్ది'

'అరె.. నీకేం పిచ్చి పట్టింది బావ! గా పోలీసులతో తిట్లు తినుకుంట వీటిని తోలుక పోవుడు అవసరమా? సప్పుడు సేకుంట ఇడ్చిపెట్టి పోదాం పదా'

'అందరూ గిట్లనుకుంటే ఎట్లా బామర్దీ! ఎవరో ఒకరు పూనుకుంటేనే దారికొత్తరు. మున్సీ పాల్టి ఆఫీసుకు తోలుకపోదాం' బామర్దికి సర్దిచెప్పి వాటిని మున్సీ పాల్టి ఆఫీసుకు తోలుకు పోయినం.

***

గొడ్లు, బర్లు 'అంబా..' అని అరుత్తానయి. గా అరుపులకు లోపల ఉన్న ఆఫీసర్ బయిటికి ఉరికచ్చిండు. మమ్ముల్ని, గొడ్లు, బర్లు సూసి ఎవరు మీరు గివిటిని గిక్కడికి తోలుకొచ్చిండ్లు? బయిటికి తోలుకు పొండ్లి' గట్టిగా అరిచిండు.

'ఓ.. సారు! మేం ఎవరమైతే ఎందిగాని, గీ గొడ్లు బర్లు రోడ్ల మీద తిరుగుతూ.. మోటర్లకు, జనాలకు శాన ఇబ్బంది పెడుతున్నయి. గందుకనే గివిటిని బందెల దొలడానికి కొట్టుకొచ్చినం. గివిటిని గిక్కడ కట్టేసి పాయమాలు వసూలు జేయ్యిండ్లి. కొట్టు కొచ్చినందుకు మాకు కొన్ని డబ్బులు ఇయ్యిండ్లి. సరెనా..?'

'ఓరి.. మీ దుంప తెగ! గివిటిని గిక్కడ ఎక్కడ కట్టెత్తం. గవాటికి నీళ్ళు ఎవ్వడు పెట్టాలి? మేత ఎవ్వడు ఎయ్యాలి? ఎక్కడ నుండి కొట్టు కొచ్చిండ్లో గక్కడికే తోలుకుపోయి ఇడ్చిపెట్టుండ్లి. ఎల్లుండ్లి.. ఎల్లుండ్లి'

'మీరు సెయ్యని పని మేం జెత్తె, బందెల కట్టేసి పాయమాలు వసూలు జెయ్యిండ్లి అంటే, ఎక్కడ నుంచి తోలుకొచ్చిండ్లో గక్కడికె తోలుకు పొమ్మంటాడ్లు. గిది మీ డ్యూటి గాదా? బందెల కట్టేయిండ్లి'

'గిప్పటికే ఉన్న డ్యూటీలు చెయ్యలేక సత్తున్నం. ఒకడు రోడ్లు చెత్తగా ఉన్నాయి అని

ఫోన్ జెత్తడు. మరొకడు డ్రైనేజ్ పొంగిందని లొల్లి జేస్తడు. ఒకడు మంచినీళ్లు రాలేదని గొడవ జెత్తడు. ఒకడు దోమలని, ఈగలని లొల్లి లొల్లి జెత్తడు. గీ తల నొప్పులతో చావలేక సత్తాంటే, గివిటిని బందెల దోలుమని కొట్టుకొత్తరు. గిదేమ్మన పల్లెటూరా కట్టెయ్యడానికి? సప్పుడు సేయకుంట కొట్టుక పొండ్లీ' అని కొప్పడుతూ.. బయిటికి తర్మిండు.

గొడ్లు, బర్లు 'అంబా.. అంబా..' అని అరుసుకుంట ఉరుకుతానయి.

'గిదేం పట్నంర బామర్ది?ఎవ్వడిని సూసినా.. నాకు అక్కరలేదు అనట్లు మాట్లాడుతున్నరు? గిదెందిరా రాముడు లేని అయ్యోద్య లెక్క?'

'నీకు ఎవ్వరు జెప్పిన బుద్ధి అత్తలేదు బావ! ఎవ్వడికి లేని అక్కర నీకే ఉన్నట్లు నన్ను గూడా తిప్పితిప్పి సంపుతుంటివి. సప్పుడుసేక పోదాం పదా' అని నా బామర్ది గూడా కోపానికొచ్చిండు.

'గింత దూరం అచ్చినంక ఇగ ఇడ్చిపెడ్తమా బామర్దీ? వీళ్ళు బందెల కట్టేయకుంటే.. నేను తోలుకు పోయి బందెల గట్టెత్త. రా..రా..తోలుకుపోదాం!'

'గీడ ఎక్కడ కట్టెత్తవు బావ?'

'మన ఊరికి తోలుకపోయి కట్టేత్త'

'గిపుడు నువ్వు గివిటిని వరంగల్‌కు తొలుకపోయి కట్టెత్తవా!'

'అవును..!'

'వరంగల్ ఎంత దూరమో తెలుసా? నూటయాభై మైళ్ళు. నీకు ఎదో పిచ్చి పట్టింది అనుకుంటా.. సప్పుడు సేకుంట పోదాం పదా. పగటిలి అయ్యింది. ఆకలి సురసుర అంటాంది. పా.. బావ!'

'ఎంత దూరం? రెండు రోజుల్లో నడ్చి ఎల్లిపోతా! పోతాంటే.. పోతాంటే రోడ్ పొంట శాన గడ్డి ఉంటది. గది మేపుకుంట.. మేపుకుంట పోతే పాయే. గప్పుడు గివిటి జాడకు గవాల్లే వత్తరు సచ్చినట్లు పాయమాలు గట్టి ఇడిపించుకుంటరు. నాకు మస్తు డబ్బు లత్తయి గదా? హైదరాబాద్ అచ్చినందుకు ఓ మంచి పని జరిగింది'

'నాకేం.. పని పాట లేదనుకున్నవా? నీకు బగ్గ బలుపు ఉన్నది. పోతే..పో..! నేను ఇంటికి పోతాన'

'ఓ.. బామర్ది! నువ్వు రాకపోతే రాకపోతివిగని, నన్ను గీ పట్నం దాటించు. నా తిప్పలు నేను పడ్తా!'

'సుట్టమయి అచ్చి దయ్యమై పట్టినవు! ఇగ తప్పుతుందా? ఊరు దాటిత్త పా..'

మా బామర్ది అనంగనే..గొడ్లు, బర్లు ఒక్కదిక్కు జమచేసి తోలుకు పోతున్నం.

***

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 339

మేము పట్నం శివారు దాటినం. గప్పుడే, ఊరు బయిట జాగింగ్ పోయిన కుర్రోళ్ళు ఉరుక్కుంట మాకు ఎదురుగా అత్తాండ్లు. గవాళ్లు గీ గొడ్లు, బర్లు మమ్ములను సూసి,

'ఎవ్వర్రా.. మీరు? గీ గొడ్లు, బర్లు యాడికి తోలుక పోతాండ్లు?'

'నా పేరు ఇత్తారి. ఇతను నా బామర్ది సత్నారి. గీ గొడ్లు, బర్లు రోడ్ల మీద తిరుగుతూ.. జనాలకు, మోటార్లకు శాన ఇబ్బంది పెడుతున్నయి. ఎవరికి సెప్పిన పట్టించుకుంట లేరు. గందుకే గివిటిని ఊరుకు తోలుకపోయి బందెల గట్టేసి పాయమాలు వసూలు జెత్త. గప్పుడుగాని, గివి పెంచుకునేటొళ్లకు బుద్ధి అత్తది!'

'గిన్ని రోజులనుండి పట్నంలో గొడ్లు, బర్లు మాయమైపోతున్నయంటే కారణం మీరన్న మాట! ఎవ్వరికి తెలియకుంట రోడ్ల మీద తిరుగుతూ.. చెత్త చెదారం తిని బతికే వాటిని తోలుకుపోయి కబేళాలకు అమ్ముతున్నది మీరేనా..?'

'అయ్యా.. బాబోయ్! భలే వాళ్ళండి. మేము దొంగల్లాగ కనిపిత్తానమా? మేము దొంగలం కాదండి' అని నేను అంటుండగానే,

'ఇంకా.. సూత్తవేంది మామ? ఇద్దర్ని పట్టుకొని మక్కిలిరుగ తన్నితే ఇగ జన్మలో గీ పని జెయ్యరు' అని ఒకడు అనగానే, నలుగురు కలిసి మా ఇద్దర్ని దొరకబట్టి మక్కిలిరుగ తన్ను తాండ్లు.

'నీ.. యవ్వ నేను గాడికి సెప్పుతునే ఉన్న వద్దు బావ.. వద్దు.. అని నా మాట ఇన్నవు గాదు. ఉత్త పుణ్యానికి మక్కిలిరుగ దన్నిత్తాంటివి' లబోదిబో ఎడ్వబట్టిండు.

ఇద్దర్ని పొరుక పొరుక గొట్టి, 'మళ్ళెప్పుడైనా.. గిటోంటి పని జేత్తె.. కాళ్ళు, చేతులు ఇరుగ్గొట్టి మూలన ఎత్తం' హెచ్చరించి గొడ్లు, బర్లు ఎనక్కు తోలుక పోతాండ్లు.

'పాయమాలు.. పాయమాలు అని ఈపుకు సున్నం బెట్టిత్తివి! నీ ఇంట్లో పీనుగెళ్ళ!' శాపాలు పెడుతు ఏడుస్తున్నడు నా బామర్ది.

'తూ.. గీ పట్నం ఒళ్లకు దిమాకు లేదు బామర్దీ! నీ ఏడుపే ముంగలపడే. ఇగ మెల్లగ లే.. పోదాం!'

బామర్ది రెక్కపట్టి లేపుకొని పోతాన.

జైహింద్ .

## ఐతా చంద్రయ్య

ఐతా చంద్రయ్యది సిద్దిపేట. శతాధిక గ్రంథ కర్త. కవిత, కథ, నవల, నాటకాలు, వ్యాసాలు, మొదలైన ప్రక్రియల్లో 130 పుస్తకాలు రచించారు. కథలు 700.తె.వి.వి. 3 పురిస్కారాలు అందుకున్నారు.

# కుదుపు

డా. బివిన్ స్వామి

92478 17732

***చిల్లర రాళ్ళకు మొక్కుతు ఉంటే చిత్తము చెడురా ఒరే ఒరే***
***చిత్తము నందున చిన్మయ రూపిని జూచూచునుండుట సరే సరే***
***ఒక్కపొద్దులని ఎండుతు ఉంటే ఒనరు చెడుదువురా ఒరే ఒరే***
***ఏకమైన యావైభవమూర్తిని చూచూచునుండుట సరే సరే***

ఖంగుమంది కంఠం. కోడికూతకు బదులు, తత్వగీతి వినడం అలవడింది. ఎనిమిది పదులు దాటిన మనిషి. ఏడు ఫీట్ల మానవుడు. ఆ స్వరానికి చుట్టుపక్కల కుటుంబాలన్నీ లేవక తప్పదు. రుతుమార్పు వల్ల ఉదయవేళల్లో మార్పు కనబడుతుంది. అతని పాట మాత్రం వేళ తప్పని అలారం. చిన్నప్పటి నుండి అతని స్వరం వింటూ పెరిగిన వాణ్ణి. సర్వకాల సర్వావస్థల్లో ఆ స్వరం నన్ను జాగ్రత్త పరిచింది. అతని పట్ల మమకారం నాతోపాటు పెరిగింది. ఎవరితో ఎక్కువ మాట్లాడడు. అతనితో మాట్లాడాలనిపించేది. అతడు పనిమంతుడు. ఏదైనా నేర్చుకోవాలనిపించేది. చేతల్లో, పనుల్లో తెలియని ఏదో హుందాతనం కనిపించేది. అదేమిటో తెలుసుకోవాలనిపించేది. ఎవరినీ నొప్పించేవాడు కాదు. అందరినీ గౌరవించేవాడు. నా వయసు వారు అతని పాటల్ని, పద్యాల్ని తప్ప మాటలు విన్న జాడలు లేవు. వయసులో ఉన్నప్పుడు అందరితో కలివిడిగా ఉండేవాడని చెబుతారు. ఇప్పటికీ తన ఈడు వాళ్లతో మాట్లాడతాడు. అలాంటి వాళ్ళలో మా బాపు ఒకడు

వయసుడిన స్థితిలో బాపు దారిన పోయే వారిని పిలిచి హితబోధ చేస్తుంటాడు. ప్రస్తుతం తను చేసేదేమీ లేనట్లు, చేయాల్సిందంతా చేసినట్లు, కూర్చుని తినడమే పని అయినట్లు బాపు వ్యవహారం ఉంటుంది. అనుభవాలతో తల పండినట్లు, నెరిసిన తన తలను చూపి నమ్మిస్తుంటడు. రాత, గీత, బొట్టు, బోనం, మంచి, చెడు, పూజ, గీజలాంటి వాటి గురించి సుదీర్ఘంగా ప్రవచిస్తుంటడు. అంత చెప్పినా బాపులో ఆకర్షణ కనిపించదు. అతడు మాత్రం ఇందుకు భిన్నంగా కనిపిస్తుంటడు. అదే అతని వైపు నన్ను నడిపించింది. ఒకరోజు ఉండబట్టలేక

'బాపూ.. కనకాచారి ఇంటికెళ్దాం..'

'ఎవరూ, ఔసుల భక్తుడి దగ్గరకా.. ఎందుకో?'

'పొద్దున అతని పద్యం విన్నప్పటి నుండి కలవాలనిపిస్తుంది.'

'చిన్నప్పటి నుండి వింటనే ఉన్నావు కదా, ఇప్పుడు కొత్తగ ఏం కనిపించింది?'

'చిన్నప్పటినుండి అతడంటే ఇష్టం. ఇప్పుడతనితో మాట్లాడాలని ఉంది.'

'నువ్వు అడిగేదేంది, వాడు చెప్పేదేంది.'

'అట్లా తీసేయకు బాపు, అతని గొంతు నుండి ప్రాచీన ధార జాలువారుతుంది.'

'జారడమా..బోర్లబొక్కల పడుతూ, వాణ్ణి భరించలేక మొదటి పెళ్లాం వెళ్ళిపోయింది.'

'నాకు తెలిసినప్పటి నుండి ఒకామెతోనే ఉన్నడు కదా!'

'నీకేం తెలుసు.. మొన్నటి పిలగానివి. వీని పిస్స భరించలేకపోయింది.'

'అది పిస్స కాదు బాపు.. సనాతన తాత్విక స్పృహ. అది పాటగా, పద్యంగా ఆ గొంతు నుండి జాలువారుతుంది. అతని పనితనం,కళగా మారి కనువిందు చేస్తుంది.'

'ఏందిరో.. వాడి తరపున వకాల్తా పట్టినట్లున్నవు. ఇగ నువ్వు కొత్తగా అడిగేదున్నది, వాడు చెప్పేదేమున్నది.'

'చదివి పొందిన జ్ఞానంకన్నా, అనుభవజ్ఞానం గొప్పది. అది ఆయన దగ్గర ఉంది.'

'ఇప్పుడు వాని దగ్గర పని నేర్చుకొని గొప్పోనివవుతావా?'

'బాపూ.. మీరు చెప్పే వాళ్ళేకానీ, చేసేవాళ్ళు కాదు. నా మాటలు మీకు అర్థం కావు.'

'చెప్పి చేయించుకోవడమే గొప్పరా, సదువెక్కువై నువ్వు చెడిపోయినవు.'

'ఏ పనీ చేయకుండానే ఎట్లా చెడిపోతా.. ఆ మాట మీరు ఎట్లా అంటిరి.'

'నీ కర్మ అట్లా ఉంది. అది నాకు తెలుసు.'

వాదించడం ఇష్టం లేక ఇంటి నుండి బయటపడిన. కొద్దోగొప్పో అన్ని ఊర్లు మారినవి. మా ఊరు మాత్రం మారలేదు. అవే మొండి గోడలు. వాటినుండి నడిచి మేరోల్ల వాడకు చేరిన. అక్కడి నుండి కొద్ది దూరంలోనే వడ్లకమ్మరోల్ల ఇండ్లు. అవి దాటగానే కనకాచారి ఇల్లు. కావాలని, ఊరు చూడాలని, సమయం గడవాలని చుట్టూ తిరిగి ఆ ఇంటికి చేరిన. వాస్తవంగా అయితే మా ఇంటి నుండి ఆ ఇల్లు చాలా దగ్గర. అందుకే అతని పద్యాలు, పాటలు చెవుల్లో గింగురుమంటయి. మనసులో ముద్రపడతయి. ఇంటిలో పెద్ద మార్పేమీ లేదు. పాత ఇంటికి సున్నం వేయించినట్లుంది. ఇంటి కిటికీలకు ఒకతను బ్రష్‌తో రంగులు వేస్తున్నాడు. ముగ్గు బుట్టలాంటి తల వెండికొండను తలపిస్తోంది. పరిణితి చెందిన చేయి చకచకా చేస్తుంది. ఎవరీ పెద్దాయన యువకుడిలా పని చేస్తున్నాడు. మంచి పనిమంతుడిలా కనిపిస్తున్నడు అనుకుంటూ, ఇంట్లో తొంగి చూసిన. ఎవరూ కనిపించలేదు. రాకూడని సమయాన వచ్చానా? అనే అనుమానం పీడించింది.

'ఎవరూ లేరా ఇంట్లో?' పిలిచిన.

'ఎవరు కావాలి మీకు?' ఇంట్లో నుండి వినిపించింది.

తాతను కలవాలి.

'కాళ్ళురెక్కలు కడుక్కొని, లోపలికి రా'.

లోపలకు వెళ్ళిన. కట్టెకుర్చీలో కూర్చుని ఉన్నాడు. చేనేత బట్టతో కుట్టిన తెల్లటి వేసుకున్నాడు. మల్లె పువ్వు లాంటి ధోతి కట్టుకున్నాడు. తెల్లని శరీరఛాయలో బట్టలు పెనవేసుకున్నవి. ముఖంలోని ప్రశాంతత, శరీరాకృతి అతని పట్ల గౌరవాన్ని పెంచుతున్నాయి.

'ఎవరీ కొడుకువు?' కంఠం ఖంగుమంది.

'పంతులు కొడుకును'

'నువ్వానోయ్! దగ్గరకు రా, కూర్చో' అంటూ మంచం చూపెట్టిండు.

'ఆరోగ్యం బాగుందా' సంభాషణ ఎలా మొదలు పెట్టాలో తెలియక అడిగిన.

'కాడు రమ్మంటోంది. ఊరు పొమ్మంటుంది' అన్నాడు.

'అట్ల ఎందుకంటరు? మీరు నాలుగు కాలాలు బతకాలి. అప్పుడే నాలుగో తరం పిల్లలు పద్యాలు, పాటలు నేర్చుకుంటారు.

'పాటల మీద, పద్యాల మీద మీ నాయనకు లేని ఆసక్తి నీకు ఏన్నుంచి వచ్చిందయ్యా?'

'నాకైతే మీ పాట నుండి, పద్యం నుండి వచ్చింది'

'విన్నోల్లందరు నీ తీరుగ మనసుపడుతలేరు.'

'అత్తిపత్తిలాగా అన్ని ఆకులు ముడుచుకోవు.'

'నీకు తెలియకుండానే నీవు విచ్చుకుంటున్నావు.'

'నేను చెడిపోతున్నానని మా బాపు అంటున్నడు.'

'పుస్తకములు చదవటం పూర్ణత్వమబ్బదు
హృదయ సంపుటములు చదవవలయు......

అర్థమైందా.. మీ బాపు అన్నడనో, నేను చెప్పిన అనో నమ్మకు. పోతులూరి వీరబ్రహ్మం గారిని చదువు. అర్థం చేసుకో. ఆలోచించు. ఆచరించు. ఇహ నీకు వేదన ఉండదు.'

'బ్రహ్మం గారు కాలజ్ఞానం రాసిండట కదా.. అందులో ఏమున్నయి.'

'అందులో లేనివి లేవు. ఇవ్వాళ అందర్నీ ఝుడిపిస్తున్న కరోనా గురించి కూడా రాసిండు. ప్రళయకాలం వస్తుందనీ, ఆ కాలాన తాను వీరభోగ వసంతరాయలుగా అవతరించి, ధర్మాన్ని నిలబడతాననీ, పూర్వకాలపు ప్రశాంతతను స్థాపిస్తాననీ

చెప్పిండు.

'గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్ అన్నట్లు, వసంతరాయలు ఆ కాలాన్ని వెనుకకు రప్పిస్తాడా ?'

'నీకు చెప్పడం కష్టం. నారాయణా.. నారాయణా..' అంటూ నాలుగుసార్లు పిలిచిండు.

'మామను పిలుస్తున్నరా. ఎక్కడున్నడు నేను పిలుచుకొస్త..'

బయటకొచ్చి చూసిన. కిటికీలకు రంగులు వేసేది అతనే. ఏమాత్రం పోల్చుకోలేకపోయిన. మనిషి ఎంత మారిండు!

'నమస్తే మామ. తాత పిలుస్తున్నడు.'

'ఎప్పుడచ్చినవు. మంచిగ చదువుతున్నవా. మావోని తీర్ల తిరుగుతున్నవా?'

'మీ వోనికేంది పట్నంల మంచిగ పని చేసుకుని బతుకుతున్నడు.'

'మీద మెరుగులు, లోపల పురుగులు అన్నట్లుంది వాని బతుకు.'

'సిల్వర్ ఫిలిగ్రీ వర్క్ బాగనే చేస్తున్నడు. ఈయన చేసిన వస్తువులు దుబాయ్ దనుక పోతున్నయి.'

'పని దొరికితే మంచిగనే ఉంటది. కానీ గిరాకులు లేకుంటయినయి. ధనవంతులే కొనగలిగిన వస్తువులవి. చాలా ఖరీదు చేస్తయి. నవాబ్ ఖాన్దాన్ ముచ్చట లెక్క ఉంటది ఆ పని, ఆ గిరాకీ కూడా. మా దగ్గర వస్తువు తయారు చేయించి, మార్కెట్లో అంతకు రెట్టింపు ధరకు దుకాణాదారు అమ్ముతడు. సిల్వర్ ఫిలిగ్రీ వస్తువులకు ధర ఎక్కువ. కళాత్మకంగా, ఆకట్టుకునే విధంగా, వాతావరణాన్ని హుందాగా తీర్చిదిద్దేవిగా అవి ఉంటాయి. అదొక షాన్. కంసాలి జీవితం మాత్రం పరేషాన్.'

'ఇవాల్నో, రేపో జీవునం పోతది అన్నట్లు మాట్లాడతావేంది మామ.'

'బంగారం పనోళ్ళ బతుకులే అట్లున్నయి. ఒకప్పుడు సొంత నగలు ఉంటేనే పెట్టుకునేవాళ్ళు. ఆ తరువాత ఒకరి నగలు ఒకరు అరువు తెచ్చుకుని పెండ్లిల్లు, పేరంటాలు ఎల్లదీసింద్రు. ఇప్పుడేమో రోల్డ్ గోల్డ్ నగలు వచ్చినయి. అతి తక్కువ ధరకు అందుబాటులో ఉంటున్నయి. కొత్త కొత్త డిజైన్లతోటి వస్తున్నయి. వాటికి అందరూ ఎగబడ్డరు. ఆరు నెలలకో డిజైన్ మిషన్ల నుంచి తీసుడు, మార్కెట్ల పెట్టుడు. అసలు కంటే నకిలీయే ముద్దు అన్నట్లుంది. మా బతుకు బస్టాండయింది. ఈ ఊర్లె రోల్డ్ గోల్డ్ నడవదు కనుక ఇట్లా తెల్లగ బతుకుతున్నాం.'

'ఈ మధ్య దొంగ బంగారం కేసుల్ల కూడా మీ వోళ్ళు కనబడుతున్నరు.'

'పట్నంల జరిగే దొంగ బంగారం కేసుల గురించి, వాటిల్లో చిక్కుకున్న వాళ్ల గురించి పత్రికలు చెబుతయి. అవి ఎంతవరకు నిజమో తెలియదు. పల్లెల్లో జరిగే మాత్రం

తెలియవు. కానీ విచిత్రంగా ఉంటాయి. అవి మాకు పరీక్ష పెడుతయి. ఓ ఇంటి కోడలు ఉంగరం పోయింది. ఉంగరం మీ తల్లిగారింట్లనే పెట్టిన పెట్టి వచ్చినవని అత్త వాదన. భర్త, మామ మౌనంగానే ఉన్నరు. ఇంట్ల పెండ్లికాని మరిది ఉన్నడు. ఆ ఉంగరం చేసింది నేను. సమస్య నా వద్దకు వచ్చింది. కొద్ది రోజులు నానింది. అందరూ మర్చిపోయింద్రు. ఆర్నెల్ల తర్వాత ఓ పడుసుపోరి నా వద్దకు ఉంగరం తెచ్చింది. అది కోడలు పిల్లదే అని అర్థమయింది. ఈ పడుసుపోరి దగ్గరికి అదెట్లా వచ్చిందో తెలుసుకోవాలనిపించింది.

'ఇదెక్కడిది. నీ చేతికి ఎట్లా వచ్చింది?'

'తొవ్వల దొరికింది.'

'దీన్నేం చేయమంటవు?'

'జరంత అమ్మి పెట్టు. ఉంటే పైసలిచ్చి, తర్వాత నువ్వు అమ్ముకో.'

పడుచు పోరిని రెండు రోజుల తర్వాత రమ్మని, ఆ ఇంటి కోడలును పిలిపించిన. ఉంగరం చూపించిన. గుర్తుపట్టింది. 'ఇది దాని దగ్గరకు ఎట్లా పోయిందో తెలుసుకుంట' అంది. ఇంట్లో పంచాయతి పెట్టింది. తీగ లాగితే డొంకంతా కదిలినట్లు, ఆమె మరిదికి, పడుసుపోరికి ఉన్న సంబంధం బయటపడింది. తప్పు ఒప్పుకున్న మరిది వచ్చి ఉంగరం పట్టుకుపోయిండు. ఇందులో లాభపడే అవకాశం ఉన్నా నేనాపని చేయలేదు. అది వృత్తి ధర్మానికి విరుద్ధం. నేను అమ్ముకుంటే తెలిసినప్పుడు దొంగ అయ్యేవాడిని. ఇది చాలా సూక్ష్మవిషయం. ఈ ఆకలి రోజుల్లో నిజాయితీగా ఉండడం అనేది నిప్పును చేత పట్టడమే అన్నట్లుంది.'

'ఇద్దరు ఇటే ఉన్నరు. అంతగనం ఏం ముచ్చట పెడుతున్నరు' అంటు తాత బయకొచ్చిండు.

'మన కులం నియ్యతి గురించి అల్లునికి చెబుతున్న బాపూ.'

'ఇలకు దిగెడు వేళ కులమెవ్వరికి లేదు
మొదలు శూద్రుడుగను పుట్టునందు
శ్రుతులు చదివి వెనుక శూద్రుండే విప్రుడౌ
కాళికాంబ! హంస! కాళికాంబ'

కులము నియ్యతి, మనిషి నియ్యతి అని వేరువేరు ఉండది. నియ్యతి తోటే బర్కతి. అట్లనే అందరికి సమానంగ హక్కులు, బాధ్యతలు ఉంటయి. వాటిని పాటిస్తే అందరూ గొప్పోళ్ళే అవుతరు' అంటూ నన్ను కూడా భోజనానికి పిలిచిండు.

'తాతా, నీకు హక్కులు, బాధ్యతల గురించి కూడా తెలుసా?'

'దారి నడుచునట్టి వారికెల్లరకును
హక్కులొకటె యనుచు రుక్కు పలికె

హెచ్చుతగ్గులెట్లు వచ్చెనో తెలియదు
కాళికాంబ! హంస! కాళికాంబ'

'మా కులపురుషుడు పోతులూరి వీరబ్రహ్మం చెప్పిన విషయాన్నే నేను చెబుత. ఆయన చెప్పింది విని, రాసింది చదివి నేర్చుకున్న' అంటూ ఆకాశంకేసి చూస్తూ దండం పెట్టిండు.

'తాతా, నేను మా ఇంటికి పోత' అన్నాను.

'తినే యాల్లకు వచ్చినవు. రాకరాక వచ్చినవు. తినకుండా పోతవా. మా ఇంట్ల తింటె కులం చెడవు తీ' అంటూ నారాయణ మామ ఒప్పించిండు.

అందరం కాళ్ళు చేతులు కడుక్కుని ఈత చాపలపై కూర్చున్నం. ప్రతీ చాపముందు విస్తరి, మంచినీళ్ల గ్లాసు ఉంది. అమ్మ వేడి వేడి అన్నం వడ్డించింది. అది పొగలు కక్కుతుంది. చింతకాయ పచ్చడి, నెయ్యి వేసింది. అన్నం తింటూ ఉండగానే దొప్పనిండా మేక మాంసం తెచ్చిపెట్టింది. గిన్నెనిండా చింతపులుసు చారు పోసి పెట్టింది. ఆహారం అమృతంలా ఉంది. పదేళ్ల అమ్మాయి వచ్చి గ్లాసులో నీళ్ళు నింపి వెళ్ళింది.

'ఎవరీ అమ్మాయి?'

'నా మనవరాలు.'

'జగదీష్ బిడ్డనా?'

'అవును. వాడు, నీ కంటే ఎన్నేండ్లు పెద్ద?'

'దాదాపు పదేండ్లైనా తేడా ఉంటది.'

'చదువు అయిపోయిందా, ఏం చేస్తున్నవు మరి?'

'చేయడానికి ఏముంది. తినుడు, తిరుగుడే అయితంది.'

'మావోడు గంతే, పేరుకే పట్నంల ఉన్నడు. జువెల్లరీస్ చేయవట్టి పనులు తక్కువయినయి. పనులు దొరికినా కూలి తక్కువ పడుతుంది. కూటికే సరిపోతలేదు. పిల్లనేం సాదుతడని నేను తీసుకొచ్చిన. ఈ ఊర్లెనే సర్కార్ బడిల షరీక్ చేసిన. అక్కడ కొడుకు, కోడలు ఉంటరు. బంగారిపని ఎంత మంచిగ చేసినా కస్టమర్లు మెచ్చరు. పైగా ఆ పని చేసేవాళ్ళు చాలామంది ఉన్నరు. అందుకే సిల్వర్ ఫిలిగ్రీ పని నేర్చుకున్నడు. అదే చేస్తున్నడు.'

'అసలు సిల్వర్ ఫిలిగ్రీ అంటే ఏంది. అలాంటి పని చేయాలనే ఆలోచన మొదట ఎట్ల కలిగింది?'

'అది చెప్పాలంటే చరిత్ర చెప్పాల్సుంటది.'

'చెప్పండి తాత. మీరు ఏం చెప్పినా ఆసక్తిగా ఉంటది'

'పంచముఖ బ్రహ్మ ఐదు ముఖాల నుంచి ఐదుగురు కుమారులు బయటకు వచ్చింద్రు. మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞ అనేవి వారి పేర్లు. వారే విశ్వబ్రాహ్మణుల్లోని ఆయా వంశాలకు మూలకర్తలు. సానగ, సనాతన, అహభూనస, ప్రత్నస, సువర్ణస అనేవారు విశ్వబ్రాహ్మణుల గోత్ర పురుషులు. వీరు ఒక్కొక్కరు ఒక్కొక్క వృత్తిని పట్టుకున్నారు. మన సంతతి వాళ్లు కమ్మరం, మయ-వడ్రంగం, త్వష్ట-కంచరం, ప్రత్నస-శిల్పం, విశ్వజ్ఞ-స్వర్ణకార పనులను పట్టుకొని అందులో నైపుణ్యాన్ని సాధించింద్రు. మా ఐదు కులాల్ని కలిపి విశ్వబ్రాహ్మణులు అంటరు. మా ఇళ్ళల్లో పూజలకు బ్రహ్మలను రానీయం. మాలోనే అయ్యగార్లు ఉంటరు. పెండ్లిళ్లు, పురుళ్ళు, చావులకు వాళ్లే వచ్చి పూజలు చేయిస్తరు. మేం విశ్వకర్మను పూజిస్తం. మా కులదేవత బ్రహ్మంగారు. మా కులం కట్టుబాట్లు ఎక్కువ ఉంటయి. విశ్వబ్రాహ్మణులు పట్టణాలు, దుర్గాలు, యుద్ధ పరికరాలు, సింహాసనాలు అనేక ఆభరణాలు తయారు చేసింద్రు. బంగారు, వెండి పని చేసే మేం స్వర్ణకారులం. మాది చేతిపని. సృష్టికి ప్రతి సృష్టి చేస్తం. ప్రకృతిలోని అందాన్ని అందమైన ఆభరణంగా మలుస్తాం. పక్షిగూటిలో చిక్కని అల్లిక ఉంది. వెండి తీగతో అలాంటి అల్లిక చేయలేమా అనే ఆలోచన వచ్చింది. పిట్టగూడును చూసే సిల్వర్ ఫిలిగ్రీ పని పురుడు పోసుకుంది. సున్నితము, కష్టం అయిన ఈ పని చేయడానికి అందరూ ముందుకు రారు. నా మనవడు సిల్వర్ ఫిలిగ్రీ కళాకారుడు కావడం నాకు గర్వంగా ఉంది' అంటూ దమ్ము తీసుకున్నడు.

'మరి జగదీష్ సంపాదన మంచిగున్నదా?'

'మాది చేసుక బతికే కులం. చేతినిండా పని ఉంటే కడుపునిండా తిండి ఉంటది. ప్రతిదీ కొనుక్కు తినుడే. ఏరోజుకారోజు కమ్మగా కడుపునిండా తినడం అలవాటయింది. ఊర్లో మా కుటుంబాలు ఒకటి, రెండు కంటే ఎక్కువ ఉండవు కనుక మాకు సరిపోయే పని దొరికేది. వెనకటి నుండి మా వాళ్లు సుఖంగా తిని, పిల్లల్ని పెంచింద్రు. మద్యమాంసాలు మాకు అట్లనే అలవాటయినయి. రేపటి గురించి వాళ్ళు ఆలోచించలేదు. ఇప్పటోళ్ళు ఆలోచిస్తున్నరు. దానికి తగ్గట్టు పని తక్కువయింది. అందుకే ఒత్తిళ్లకు గురై అప్పులపాలవుతున్నరు. మా జగదీష్ పరిస్థితి కూడా అట్లనే ఉంది' అంటూ నిట్టూర్చిండు నారాయణ.

భోజనాలు పూర్తయ్యాక అందరి వద్ద సెలవు తీసుకుని బయల్దేరిన. 'రేపో, ఎల్లుండో మా జగదీష్ వస్తడు. వచ్చి కలువు' అన్నడు నారాయణ మామ.

జగదీష్ తాతకు తగ్గ మనవడు. మా ఊర్లో మొదటి పోస్ట్‌గ్రాడ్యుయేట్ అని అందరూ ప్రశంసిస్తుండే. అతడిపై అభిమానం పెరిగింది. ఆయనను మించి చదవాలని కోరిక కలిగింది. అట్లా మా ఇద్దరి మధ్య స్నేహాన్ని మించిన బంధం ఏర్పడింది. పై

చదువులకోసం నేను, ఉద్యోగం కోసం అతడు ఊరు విడిచినం. చదువులు పూర్తయి నేను, నిరుద్యోగిగా అతను ఖాళీగా ఉన్నం. పెండ్లయ్యాక వట్టిగ ఉంటే కుదరదు కనుక కులకశ్పి చేయడం మొదలుపెట్టిండు. నేనేమో ఊరక ఉండటం ఇష్టంలేక ఊరికి వచ్చిపడిన. కరోనా దెబ్బకు అతను కూడా ఊరికి రావడం యాదృచ్ఛికం. ఇట్లయినా కలవచ్చు అనే ఆశ కలిగింది. చదువుల్లో ఎంతో ముందున్న అతనికి ఉద్యోగం దొరకక పోవడం ఆశ్చర్యమనిపించింది. చదువులకు, ఉద్యోగాలకు మధ్య ఉన్న లంకె తెగిందనడానికి ఆయనొక ఉదాహరణ. తినబోతూ రుచిచూడడమెందుకు? అన్ని విషయాలు ఆయన్నే అడుగుదామనిపించింది. ఆ ఆలోచనతో మెదడు మీది బరువు దిగింది.

జగదీష్ వచ్చిండని తెలిసింది. రెండురోజుల్దాక వెళ్ళడం కుదరలేదు. పల్లెటూరు కనుక కరోనా ప్రభావం తక్కువే ఉంది. పట్నం నుంచి వచ్చిన కనక పదిరోజులాగి కలవాలనుకున్న. వాళ్ల ఇంటి రంగులపని జరుగుతుంది. అతడు కూడా ఇటువైపు రాలేదు. అతనొచ్చి రెండు వారాలయింది. వెళ్ళాలనుకుంటుండగా, అతనే వచ్చిండు.

'ఏం సంగతి బామ్మర్దీ.. వచ్చి కలుసుడు లేదా?' వస్తూనే అరిచిండు.

'నేనే వద్దామనుకుంటున్న. ఇంతలో నువ్వే వచ్చినవు'

'అట్లా బయటకు పోయి వద్దాం పద'

'సరే పద'

ఇద్దరం కలిసి ఊరి బయట కుంట దిక్కు పోయినం. కుంట చివర కట్ట మైసమ్మ గుడి పక్కన కూర్చున్నం. సాయంత్రమైంది. పశువులు ఊళ్లోకి పోతుంటే, మేము ఊరు బయటకు వచ్చినం. చేన్లలో పనిచేసి, పాటలు పాడుకుంటూ కూలిజనం ఊర్లోకి పోతున్నరు. ఏ పనీలేక, మనసున పట్టక మేం ఊరి బయట కూర్చున్నం. ఎక్కడెక్కడో తిరిగిన పక్షులు గుళ్లకు చేరుకున్నవి. ఏం మాట్లాడుకోవాలో దిక్కుతోచక మేం దిగాలుగున్నం. అలసిన సూర్యుడు అస్తమించిడు. మా భవిష్యత్తు ఆశలు అడుగంటినవి. ఊర్లోని విద్యుత్ బల్బులు ఒక్కసారిగా వెలిగినవి. చీకట్లను పాపడానికి సిగరెట్ వెలిగింది.

'బావా! సిల్వర్ ఫిలిగ్రీ వస్తువులు చేయడంలో నీది అందెవేసిన చేయి. మరెందుకు డల్‌గా ఉన్నవు?'

'అది తీగల అల్లకం (ఫిలిగ్రీ)లా లేదు. ఉరితాడు పేనడంలా ఉంది. బంగారం పనిని కాదని ఈ పని సంతోషంగా చేసిన. ఒకప్పుడు ఈ పని చేయడానికి మనుషులు లేరు. ఇప్పుడా పనే లేదు. నిజాం జమానా మనుషులు, మార్వాడీలు, ఖాన్‌దాన్ మనుషులు వాడే వస్తువులు ఇవి. ఈరోజుల్లో వెండి షాన్‌దాన్‌లు, ఊందాన్‌లు ఎవరు

వాడుతున్నరు. ఇంటిని వెండి వస్తువులతో అలంకరిస్తే కనబడే హుందాయే వేరు. నెమలి, చార్మినార్, తాజ్‌మహల్, బొమ్మలు, దేవతావిగ్రహాలు, వీణ, బొట్టు పెట్టె, పెన్ స్టాండ్, ఇట్లా రకరకాల వస్తువులు వెండితో చేయించుకునేవారు. ఇప్పుడలాంటి ఆసక్తి తగ్గింది. 'యూజ్ అండ్ త్రో కల్చర్' వల్ల గిల్ట్‌గిఫ్ట్‌ల అమ్మకం పెరిగింది. మా ఇండ్లల్ల వెండి గణపతి, దుర్గలు ఉండేవి. ఇప్పుడవి కరువైనవి. దొంగకు చీకటి తోడైనట్లు, పనికి లేకపోవడానికి కొవిడ్–19 జత చేరింది' అంటూ గట్టిగా సిగరెట్ దమ్ము లాగి వదిలిండు.

'ఈ అలవాటు ఎప్పుడైంది?'

'ఇదే కాదు, చాలా అలవడినయి. ఎందుకు చేసుకుంటరీ అలవాట్లు అనుకునేవాణ్ణి. తినడం, తాగడం, అప్పులు చేయడం అనివార్యంగా వచ్చి చేరినయి.'

'అదేంది బావా.. ఇష్టంగా అలవాటు చేసుకుంటేనే అవి అలవడతయి కదా!'

'పని చేస్తే తెలుస్తది నీకు.అలవాట్లు ఎందుకయితయో. ఒక విగ్రహం చేయాలంటే ఎంత తతంగం ఉంటదో నీకు తెలుసా నీకు. వెండి ముద్ద తీసుకొని కరిగించాలి. అప్పుడు కమ్మి వస్తది. కమ్మిని మిషన్‌లో వేసి సన్నపు తీగ తీయాలి. మెరుపు తీగ, కౌర్ తీగ, వడి తీగ, బేల్ తీగ, గాట్లు ఇలా రకరకాల తీగలు ఉంటవి. మనకు కావాల్సిన ఫ్రేమ్ తయారు చేసుకోవాలి. బెల్ తీగ తోటి డిజైన్ వేసుకోవాలి. ఆ డిజైన్‌లో వెండి ఫిల్ చేయ్యాలి. తరువాత వెండిరవ్వ తోటి అతకాలి. బర్నర్ తోటి హీట్ చేయ్యాలి. చివరగా ఆకురాయి తోటి రాకుకతే ఫినిషింగ్ వస్తది. సున్నితమైన పని కనుక తొందరగా కాదు. ఒక వస్తువు చేయడానికి కనీసం నాలుగు రోజులు పడతది. ఒక వస్తువు చేస్తే కూలి కింద నాలుగు వేలు కూలి పడుతది. కళ్లకు ఎక్కువ శ్రమ కలుగుతది. సుత్తె, శానం తోటి కనుగుడ్లు పెకిలించానిపిస్తది. ఎక్కువసేపు కూర్చోవడం వల్ల నొప్పి లేస్తది. అప్పుడు నడుమును పట్టెడకేసి అదిమితే హాయిగుంటది. బాధ మరవడానికి సిగరెట్ తాగక తప్పదు. మద్యం తాగడం, మాంసం తినడం ఇంటి నుండే అలవాటయింది. ఇప్పుడవి ఎక్కువయినయి. అలవాట్లు ఎక్కువయి పని తక్కువ అవడం వల్ల అప్పులు ఎక్కువయినయి' అంటూ నెత్తి కొట్టుకున్నడు.

'రాత్రయింది బావ. ఇంటికి పోదాం పద'

'ఏం చేతకతవే ఇంటికి పోయి. పెడ్లాంపిల్లలున్న నాకే తొందర లేదు. నీకెందుకు తొందర. ఇంకెప్పుడు పెళ్లి చేసుకుంటవు. ముసలోనివి అయినంక చేసుకుంటవా?'

'నాకే తిండికి దిక్కులేదు. వచ్చిన దానికి ఏం పెట్టాలి?'

'అట్లనుకుంటారోయ్.. ఏ వయసుకా సంబరం జరగాలె'

'చిన్న ఉద్యోగమైనా దొరుకుతుదనే ఆశ లేదు. నీకు మాత్రం దొరికిందా. కులకశ్పి

ఒకటి ఉన్నది కనుక నెట్టుకొస్తున్నవు. నా సంగతే బాయిలవద్ద పిల్లోలె ఉన్నది.'

'కులవృత్తికి సాటిలేదు గువ్వలచెన్నా. అది పాడుచేసుకోవడానికే బాగుంటది. వస్తువు తయారుచేసిన నా కంటే, వాటిని అమ్ముకునే, ఎగుమతులు చేసుకునే మధ్య దళారులకే ఎక్కువ గిట్టుబాటు అవుతుంది. ఆ పని చేయాలంటే పెట్టుబడి ఉండాలి. అది లేదు కనుకనే ఇంత తిప్పల. ఈ పని చేసేవాళ్ళు ఇప్పుడు తక్కువైనరు. ఎవరు కూడా తమ పిల్లలకు కులకశ్పి నేర్పుతలేరు. సన్నపు పనిచేయడం అంటే భయపడతరు. ఇగ ఏం నేర్చుకుంటరు. నేర్పెటోళ్ళు లేరు, నేర్చుకునేటోళ్ళు లేరు. నాల్రోజులైతే పని మాయమైతది. పనోళ్ళు మాయమవుతరు. అంతెందుకు నేనే ఈ పని విడిచిపెడదామనుకుంటున్నా. నేనేదైనా ప్రైవేటు కాలేజీలో, మా ఆవిడ ఏదైనా షాపులో పని చూసుకుందామనుకుంటున్నం. అట్లయితెనే బతుకుతం.'

'రాత్రయింది బావ. ఇంటికి పోదాం పద'

'సరేనయ్యా పోదాం. అయ్యగారి గుర్రానికి ఆకలెక్కువట.' అంటూ లేచిండు.

ఇద్దరం ఊర్లోకి రాగానే ఎవరింటి దారి వాళ్ళం పట్టినం.

ఆ రాత్రి కలత నిద్రగా మారింది. విశాలం, సుందరం అయిన దారొకటి నా ముందు పరుచుకొని ఉంది. దానిపై నడక అనివార్యమని అర్థమవుతుంది. దారిపై జగదీష్ నడుస్తున్నడు. రోల్‌మాడల్ అనుకున్న జగదీష్ రోల్డ్‌గోల్డ్‌గా కనబడుతున్నడు. పెద్ద చదువులు చవివిన నిరుద్యోగిగా సోయి తప్పి నడుస్తున్నడు. కులకశ్పి నిపుణుడు కూలిబాట పట్టిండు. ప్రమాదకరమైన దారిపై నడవడమే శరణ్యమైంది. నాలుగడుగులు వేశానో లేదో ఎరుక తప్పింది. అంతా కొత్తగా అగమ్యంగా తోస్తోంది. దిశ– దశ తెలియని రహదారి నడక సాగుతుంది. నాకు నేను పరాయిగా మారి పరిగెత్తుతున్న. నా లాంటి అనేక నేనులు పరిసరంగా మారడం రూపుకట్టింది. దబ్బున తెలివైంది.

## డా. బివిన్ స్వామి

డా. బివిన్ స్వామిది కరీంనగర్. ఎంఏ తెలుగు, చరిత్ర. పీహెచ్డీ చేశారు. కథలు చదవడం, రాయడం, విమర్శలు ఎంతో ఇష్టం. ఇప్పటి వరకూ అనేక కథలు రాశారు.

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 350

# ప్రశ్న

**దాసరి వెంకటరమణ**

**9000572573**

**'శివుడూ ....! ఓ.....రె.....శివుడూ.......!**

లీలగా తల్లి పిలుపు వినిపించడంతో కళ్ళు తెరిచాడు శివుడు. గుడిసె కన్నాల లోంచి ఉదయపు ఎండ నేరుగా కళ్ళలోపడి చురుక్కుమంటోంది. పక్కకు ఒత్తిగిలడానికి కొంచెం కదిలాడు. ఒంట్లో ఏమాత్రం సత్తువ లేక కదలలేక పోయాడు. కడుపులో పేగుల్ని మెలిపెడుతున్న ఆకలి. వాడు ఎపుడు లేస్తాడా, ఎప్పుడు మీద పడదామా అని ఎదురు చూస్తున్న పులి లాంటి ఆకలి.

'ఇంకా లేవవేమిరా... బడికి టైమైతుల్లా' మళ్ళీ తల్లి కేక. ఆ కేకకు గుడిసె ముందు చెట్టుకు కట్టిన ఉయ్యాలలో పసిపిల్ల ఉలిక్కిపడి లేచి ఏడుపు అందుకుంది. కాసేపటికి చెల్లెల్ని ఎత్తుకొని తల్లి లోపలికి వచ్చింది. మంచం మీద కూర్చొని, గెడ్డం పట్టుకొని బ్రతిమిలాడుతూ అడిగింది 'మా నాయన కదూ! మూడు రోజులాయె బడికి పోక .. ఇట్లాగైతే ఎట్లా జెప్పు? నువ్వు బాగా సదూకోవాల, పెద్ద ఆఫీసర్ కావాల్. మన బతుకు మారిపోవాల...'

తల్లి మాటలు వింటూంటే శివుడికి భవిష్యత్తు అందమైన కలలా కళ్ళముందు కదలాడింది. కష్టం మీద లేచి కూర్చున్నాడు. పొట్ట చేత్తో పట్టుకొని 'బాగా ఆకలిగా వుందే! శాతనైతలేదు.' మళ్ళీ తల్లి వొడిలో తల దూర్చాడు. లలిత ప్రేమగా కొడుకు తల నిమిరింది. 'సూడూ బుద్ధిగా బడికిపోతే మద్దేనం అన్నం పెడతారుకందా. నేను పన్జేసే యజమానురాల్ని అడిగినా మాపట్కి డబ్బులు ఇస్తానన్నది .. నువ్వొచ్చే పాలికి ఇన్ని నూకలు కొనుక్కొచ్చి అన్నం ఒండుతాలే, ఇయ్యాల్టికి గుళ్ళో ప్రసాదం తిని బడికి పో! మా బాబు కదూ!'

'నువ్వు డబ్బులు తెస్తే అయ్య మల్లావచ్చి గుంజుక పోతాడుగా ...'

'సచ్చినోడు రేతిరే వచ్చిపోనాడుగా అప్పుడే రాడులే' రాత్రి మొగుడు తాగొచ్చి, డబ్బులకోసం చితకబాదిన సంగతి యాదికొచ్చి, వొళ్ళు నొప్పులు తెలిసి, లలిత కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. 'ఏ దిక్కూ లేనోల్లకు దేవుడే దిక్కంటారు. మనల్ని ఆ దేవుడు సల్లగా సూసే రోజులొస్తాయి మన పని... ఎదురు సూడ్డమే' కొడుకును బుజ్జగిస్తూ, బుజ్జగిస్తూ లేపి బడికి తయారుచేసింది.

'అమ్మా మనుసులందరికీ ఆకలి ఉంటదా?'

'ఎందుకుండదూ? అందరికీ ఉంటది! '

'సమానంగా ఉంటదా?'

'ఆ! ..సమానంగా ఉంటది! '

'ఆకలి సమానంగా ఉన్నప్పుడు మరి అన్నం కూడా సమానంగా ఇయ్యలిగా ఆ దేవుడు....' లలిత ఉలిక్కి పడింది. గెడ్డం పట్టుకొని తల దువ్వుతున్నదల్లా చప్పున ఆపేసి కొడుకు మొహంలోకి చూసింది. 'చెప్పమ్మా! మనకు అన్నం ఎందుకు లేదు. ఆ కిష్టిగాడికి ఎక్కిసం వచ్చేటట్టు ఎందుకుంది? దేవుడు మంచివాడు అందర్నీ సమానంగా చూస్తాడంటావు కదా!'

'నాయనా! ఈ పెశ్న దేవున్నడుగుదామంటే ఆయన కనబడడు. ఎవుల్నడగాలో నాకూ తెల్దురా... నువ్వు బాగా సదూకొని పెద్దోడివైనాంక ... ఆ పెశ్న ఎవల్నడగాలో కనుక్కో.'

లలితకు మొగుడున్నది పేరుకే, వున్నా లేనట్టే. గంజులో హమాలి పనిజేస్తాడు. అక్కడే పనిజేసి, ఒళ్ళు నొప్పులు పోడానికి అక్కడే తాగి ... తెలివుంటే ఎదో ఒకటి తింటాడు లేదంటే అక్కడే ఎక్కడో మూలకు పడిపోతాడు. లలిత బతుకుతున్నది పిల్లలకోసం. తన ఆశాంతా పిల్లలే, వాళ్లకు ఏ లోటూ లేకుండా చూడాలని, వాళ్ళను బాగా చదివించాలని, నాలుగిండ్లలో పాచి పనిజేసి ఇల్లు గడుపు కోస్తోంది. మొగుడి సంపాదన ఎన్నడూ అడగలేదు. తనను, తన పిల్లలను తమ మానాన తమను వదిలేస్తే అదే పదివేలు అనుకుంటది. అయినా పని దొరకని రోజు మొగుడు ఇంటికి వచ్చి డబ్బులకోసం చచ్చేట్టు కొట్టి పోవడం మామూలే. అన్నీ పిల్లల కోసం భరిస్తోంది. నెలరోజుల క్రితం మొగుడు కొట్టిన దెబ్బలకు మంచానపడి మొన్ననే కోలుకుంది. అందుకే పిల్లలకింత అన్నం పెట్టలేకపోతోంది.

శివుడు గుళ్ళో పెట్టిన ప్రసాదం తిని సర్కారు బడికి వచ్చేసరికి గంట కొట్టేసినారు, రామనాథం మాస్టారు తెలుగు పాఠం మొదలెట్టేసినారు. శివుడు తలుపు దగ్గర నిలబడి, అడగడానికి కూడా శక్తిలేక, వున్నా, అడగడానికి భయమేసి, బిక్కమొగంతో మాస్టారు వంక చూస్తున్నాడు. ఆయన చూశాక దగ్గరకు రమ్మన్నట్టు తలూపాడు. శివుడు భయపడుతూ, దగ్గరికి వెళ్లి, ఆయన చేతికి అందనంత దూరంలో నిలబడ్డాడు.

**లలితకు మొగుడున్నది పేరుకే, వున్నా లేనట్టే. గంజులో హమాలి పనిజేస్తాడు. అక్కడే పనిజేసి, ఒళ్ళు నొప్పులు పోడానికి అక్కడే తాగి … తెలివుంటే ఏదో ఒకటి తింటాడు లేదంటే అక్కడే ఎక్కడో మూలకు పడిపోతాడు.**

మాస్టారు చేయి చాచి జుట్టు అందుకోబోయాడు. శివుడు అప్రయత్నంగా దూరం జరిగాడు. మాస్టారు గుడ్లురిమి 'దగ్గరికి రా!' అని గర్జించాడు. శివుడు గజగజ వణుకుతూ దగ్గరికి వెళ్ళాడు. రామనాథం జుట్టు పట్టుకొని లాగి చెంపమీద ఒక్కటి కొట్టాడు. ఆ దెబ్బకు గది మారుమ్రోగింది. శివుడికి ప్రాణం పోయినంత పనయింది. విసురుగా పోయి మూలకు పడ్డాడు. పడ్డవాడు పడ్డట్టే అలాగే ఉండిపోయాడు.

'లేచి గోడకుర్చీ వెయ్యి'

శివుడు కదలలేదు.

'డ్రామాలు చాలు.... మర్యాదగా లేచి గోడకుర్చీ వెయ్యి' రామనాథం మళ్ళీ గర్జించాడు. శివుడు ఉలిక్కిపడి మెల్లగా లేచి గోడ కుర్చీ వేశాడు. కడుపులో ఆరని ఆకలి మంటను పంటి బిగువున ఓర్చుకుంటూ గోడకుర్చీ వేశాడు.

మాష్టారు పాఠం ముగించి బయటికి వెళ్ళిపోయాడు. ఆయన బయట కాలుపెట్టిన మరుక్షణం శివుడు తన ప్రమేయం లేకుండానే డబ్బున కింద పడిపోయాడు. అట్లాగే గోడకు పడుకున్నాడు. బయటికి వెళ్ళిన రామనాథానికి శివుడి విషయం గుర్తుకు వచ్చి చప్పున లోపలి వచ్చాడు. క్షణంలో రణగొణ ధ్వనిగా మారిన తరగతి గది మరుక్షణంలో సద్దు మణిగింది. శివుడు ఆ నిశబ్దానికి మెల్లగా కళ్ళు తెరిచాడు. ఎదురుగా రామనాథం మాస్టారు. దగ్గరికి రమ్మన్నట్టు చేయి ఊపాడు. 'ఈ రోజు తన ప్రాణాలు పోయినట్టే' అనుకున్నాడు. కష్టం మీద లేచి మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చాడు. మాస్టారు చేయి తనకేసి వస్తూంటేనే ఉలిక్కి పడి దూరంగా జరిగాడు. ఈసారి మాస్టారు కొట్టలేదు. వాడి పరిస్థితి చూసి జాలి కలిగి వాడి భుజం మీద చేయి వేశాడు. 'బడికి ఎందుకు లేటుగా వచ్చావు?' అనునయంగా అడిగాడు.

మాస్టారు అలా అడగంగానే ...శివుడికి ఒక్కసారిగా ఏడుపు తన్నుకొచ్చింది. 'కొట్టనులే ఏం జరిగిందో చెప్పు' మరింత అనునయంగా అడిగాడు. శివుడు వెక్కిళ్ళ మధ్య చెప్పాడు 'కడుపునిండా అన్నం తిని మూడు రోజులయింది సార్! ప్రసాదం కోసం గుళ్ళోకెలితే లేటయింది.' రామనాథం మనసు కలుక్కుమంది. మొదటిసారి తనమీద తనకు అసహ్యం వేసింది. ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. 'కూర్చో' అన్నట్టు సైగ చేస్తూ మౌనంగా బయటికి నడిచాడు. కాసేపటికి 'సార్' అని వినపడితే వరండాలో వెనక్కు తిరిగి చూశాడు. శివుడు మెల్లగా వస్తున్నాడు.

'సార్ నా కోక సందేహం సార్ ... అడగమంటారా?'

రామనాథం అడగమన్నట్టు చూశాడు.

'దేవుడి దృష్టిలో మనుషులందరూ ఒకటే అంటారు కదా! ఆకలి అందరికీ సమానం అయినపుడు అన్నం అందరికీ ఎందుకు సమానంగా లేదు సార్?'

ఆరో తరగతి చదివే ఒక కుర్రవాడి నుండి అలాంటి ప్రశ్న ఊహించలేదు. అది మామూలు ప్రశ్న కాదు. ఆ ప్రశ్న ఆయనలో రేపిన ప్రకంపన అంతా ఇంతా కాదు. ఆయన వాడి మొహంలోకి చూశాడు. 'నా ప్రశ్నకు సమాధానం చెప్పి ఇక్కన్నుండి కదలండి' అని అంటున్నట్టుగా అనిపించింది. గిరుక్కున మొహం తిప్పుకున్నాడు. తిరిగి వాడి కళ్ళల్లోకి చూడటానికి ఆయనకు ధైర్యం సరిపోలేదు. యాంత్రికంగా అక్కడనుండి వెళ్ళిపోయాడు.

శివుడు తరగతిలోకి వచ్చాడు. వచ్చి కూర్చున్నాడే కానీ, వాడి గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. తరవాతి పీరియడ్ లెక్కలు. రుక్మాంగదరావు సారుది. పిల్లలందరూ హోం వర్క్ పుస్తకాలు టేబిల్ మీద పెడుతున్నారు. శివుడికి ముచ్చెమటలు పోశాయి. రుక్మాంగదరావు చండశాసనుడు. ఒక్కసారి లేచి ఉరికి ఇంటికి పోదామా అనిపించింది. జరుగబోయే సీన్ కళ్ళముందు మెదలుతోంది.

'హోం వర్క్ ఎవరెవరు చేయలేదో లేచి నిలబడండి' రుక్మాంగదరావు కంచు కంఠంతో శివుడు ఈ లోకంలోకి వచ్చాడు. ఒకరిద్దరు లేచి నిలబడ్డారు. అంతలో తలుపు దగ్గర స్వీపర్ ఆయమ్మ వచ్చి 'సార్ శివున్ని రామనాథం మాస్టార్ పిలుస్తున్నాడు.' అన్నది. సార్ శివుని వంక చూసి పోమ్మన్నట్టు సైగ చేశాడు. బ్రతుకు జీవుడా అనుకుంటూ వెళ్తున్న శివుడికి వెనకనుండి 'హోం వర్క్ చేసుకొచ్చావా?' అని వినిపించే సరికి మళ్ళీ గుండెల్లో రాయి పడ్డది. ఆగి, తిరిగి అవును, కాదు అని తల వూపే లోగా 'సరే! ముందు పోయి రాపో...' అనాడు.

'సారూ స్టాఫ్ రూంలో వున్నాడు వెళ్ళు' అంటూ ఆయమ్మ వెళ్ళిపోయింది. శివుడు స్టాఫ్ రూమ్ తలుపు దగ్గరికి వెళ్లేసరికి రామనాథం మాస్టారు లేచొచ్చి శివున్ని తీసుకుపోయి ప్లేట్లో తానూ ఇంటినుండి తెచ్చుకున్న క్యారియర్ తెరిచి వడ్డించి, తినమన్నాడు. శివుడికి నమ్మబుద్ధి కాలేదు. కలో నిజమో అర్థం కాలేదు. ఇంకా సంశయిస్తూ నిల్చున్న వాడిని భుజంపట్టి 'ఫర్వాలేదు..తిను' అంటూ బలవంతంగా కూర్చోబెట్టాడు. శివుడు చుట్టూ చూశాడు. ఆ గదిలో ఎవరూ లేరు. చటుక్కున కూర్చొని అన్నం కలుపుకుని ఆబగా తినసాగాడు.

బక్క పలచగా, కాస్త సామనలుపుగా, పొడుగ్గా రివటలాగా వున్న శివుడికి పదకొండు పన్నెండేళ్ళు ఉండవచ్చేమో. వేసుకున్న అంగీ నిక్కర అక్కడక్కడ చిరుగులున్నా శుభ్రంగా ఉతికి ఉన్నాయి. రామనాథానికి వాడి కళ్ళల్లో ఎదో మెరుపు కనిపించింది.

అన్నం తిన్నాక వాడిని తీసుకొని బడి ఆవరణలో ఉన్న చింత చెట్టు కిందికి తీసుకు వెళ్ళాడు. వెళ్తూ వెళ్తూండగానే అయాను పిలిచి మెల్లగా ఏదో చెప్పాడు. కాసేపటికి ఆయమ్మ విస్తరినిండా కలిపిన అన్నం తీసుకు వచ్చి వీధిలో పెట్టింది.

అది చూసి దూరంగా ఉన్న రెండు చిన్న చిన్న కుక్కపిల్లలు, ఒక ముసలి కుక్క, ఒక బక్క చిక్కిన కుక్క పరుగెత్తుకొని వచ్చి ఆబగా అన్నం తినసాగాయి. అది చూసి చాలా దూరంనుండి ఒక కుంటి కుక్క కుంటుతూ వస్తోంది. రెండే రెండు క్షణాలు అంతలో ఎక్కన్నుంచి వచ్చిందో ఒక గజ్జి కుక్క విసురుగా వచ్చి ఆ వాటిమీద పడి కరిచింది. చిన్న కుక్కపిల్లలు కుయ్యో మొర్రో అంటూ ఎగిరి దూరంగా పడ్డాయి. అందులో ఒకదాని కాలును గజ్జికుక్క కోరికినట్టుంది మొత్తుకుంటూ మూల్గుతోంది. ముసలికుక్క గజ్జికుక్కను చూడగానే దూరంగా వెళ్లి నిలబడింది. బక్క చిక్కిన కుక్క కాసేపు గజ్జికుక్కతో పెనుగులాడి గెలవలేక దూరం జరిగింది.

గజ్జికుక్క గబాగబ అన్నం తినేస్తూ మధ్య మధ్య మిగతా కుక్కల వంక మిర్రి మిర్రి చూస్తూ అరుస్తూ గుర్రుమంటూ ఉంది. అవి దానివంక చూస్తూ ఏం చేయలేక నిల్చున్నాయి. దెబ్బ తగిలిన చిన్న కుక్క కుయ్యో కుయ్యో అంటూనే ఉంది. కుంటి కుక్క దూరం నుండి ఇంకా వస్తూనే వుంది.

అంతలో ఓ నాలుగు కుక్కలు పిడుగుల్లాగా వచ్చి గజ్జికుక్క మీద పడ్డాయి. కొంతసేపు అక్కడ చిన్నపాటి యుద్ధం జరిగింది. ఆ కుక్కల ధాటికి ఆగలేక గజ్జికుక్క గుర్ గుర్ మని గొణుక్కుంటూ మాటి మాటికి వెనక్కు తిరిగి చూసుకుంటూ వెళ్ళిపోయింది.

ఆ నాల్గు కుక్కల్లో ఒక కుక్క గబగబా రెండు ముద్దలు మింగి, నాలుకతో మూతి తుడుచుకుంటూ దూరంగా నిలబడ్డ కుక్కల వంక చూడసాగింది. మూడు కుక్కలు మూడు నిముషాల్లో విస్తరి ఖాళీ చేశాయి. వెంటనే అక్కన్నుండి వెళ్ళిపోయాయి.

అంతసేపూ దూరంగా వున్న ముసలి కుక్క దగ్గరికి వచ్చి విస్తరి మూచ్చూసి వెళ్ళిపోయింది. చిన్న కుక్క పిల్లలు రెండూ అక్కడికి రావడానికి ధైర్యం సరిపోక చూస్తూ దూరంగానే నిలబడ్డాయి. దెబ్బ తగిలిన కుక్క ఇంకా చిన్నగా మొత్తుకుంటూనే వుంది. బక్క చిక్కిన కుక్క విస్తరిలో మిగిలిన అన్నం మెతుకులను ఒక్కొక్కటి ఏరుకొని విస్తరి మొత్తం నాకేసి వెళ్ళిపోయింది. అప్పుడు చేరుకుంది కుంటికుక్క అక్కడికి, అప్పటికి అక్కడ ఏమీ మిగల్లేదు.

రామనాథం శివుణ్ణి భుజం మీద చెయ్యేసి నడిపిస్తూ 'జరిగింది చూశావుగా.... దాని అర్థం ఏమిటి అని నన్ను అడక్కు. అలాగే నీకు ఏం అర్థమయ్యింది? అని నేనూ అడగను. నీకు అర్థమయితే సంతోషం. లేదంటే అర్థం అయ్యేదాక ఈ దృశ్యాన్ని మనసులోనే మననం చేసుకుంటూ వుండు.'

'నాకు అర్థం అయింది మాస్టారు. నేను బాగా చదువుకుంటాను. చాలా చాలా పెద్ద చదువు చదువుతాను.'

'ఏం చదువు చదువుతావు?'

'ఈ ప్రపంచాన్ని మార్చేంత చదువు చదువుతాను.'

'అంత వొద్దు.. నీలాగే చాలామంది ఆవేశంతో గతంలో ప్రతిజ్ఞలు చేశారు. తీరా చదువు అయిపోయాక, ఎందుకు చదువుకున్నారో మరిచిపోయారు. కొంతమంది గుర్తున్నవాళ్ళు ఏమైనా చేద్దామనుకున్నా... వాళ్ళను కూడా ఏమీ చేయకుండా అడ్డుకున్నారు'

'కానీ ఒక్క పని చేస్తానని మాటివ్వు.....'

శివుడు ఆయన వంక ఆశ్చర్యంగా చూశాడు.

'నీ చదువు బాధ్యత అంతా నాది... దానికి ప్రతిగా నీ కంఠంలో ఊపిరి ఉన్నంత వరకూ ప్రశ్నించడం మానకూడదు. ఈ రోజు నన్ను ప్రశ్నించినట్టే ప్రశ్నిస్తూనే వుండాలి. ఆ ప్రశ్న కోట్లాది ప్రజల గుండెల్లో మారుమ్రోగేలా నిరంతరం ప్రశ్నిస్తూనే ఉండు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రశ్నించడం ఆపకు. నీ ప్రశ్న ఆకలినీ, పేదరికాన్నీ, అస్తవ్యస్త వ్యవస్థలోని అసమానతలనూ వరుసగా ఛేదించే త్రిశూలం కావాలి!.'

గణగణమని గంట మ్రోగింది. పిల్లలందరూ బిలబిలమంటూ మధ్యాహ్నం అన్నం పేట్టే చెట్టు కింద లైన్లో నిలబడ్డారు. రామనాథం మాస్టారు స్టాఫ్ రూంకు వెళ్ళాడు. శివుడు లైబ్రరీ వైపు నడిచాడు.

***

## దాసరి వెంకటరమణ

దాసరి వెంకటరమణ 'ఆనందం' అనే పుస్తకానికి 2014 లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు అందుకున్నారు. 1982 నుండి కథలు రాస్తున్నారు. మొదటి కథ 1982 మార్చి చందమామలో అచ్చయ్యింది. ఇప్పటివరకు దాదాపు 500 రచనలు ప్రచురితమైనవి. వీరి మరో పుస్తకం 'అమ్మమనసు' 2006 లో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వారి ఉత్తమ బాలసాహిత్య పురస్కారం పొందింది. వీరి రచనలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగో తరగతి తెలుగు టెక్స్ట్ బుక్ లోనూ, మహారాష్ట్ర ప్రభుత్వం 8 వతరగతి, మరియూ 12 వ తరగతి తెలుగు టెక్స్ట్ బుక్స్ లోనూ చోటు చేసుకున్నాయి. కథ, మాటలు, పాటలు సమకూర్చిన 'మహాకవిభారవి' టి.వి. సీరియల్ 1998 లో దూరదర్శన్ లో 13 వారాలపాటు ప్రసారమై అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి 4 నంది బహుమతులను గెలుచుకుంది.

# స్పర్శ

**వాసవ దత్త రమణ**
**97044 44760**

అర్ధరాత్రి ఫోన్ మోగగానే మంచినిద్రలో ఉన్న సౌజన్య ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచింది. 'డాక్టర్.. ఎమర్జెన్సీ కేసు' అనగానే ఆమె మత్తు టక్కున వదిలిపోయింది.

బట్టలు మార్చుకుంటూ డ్యూటీ డాక్టర్స్‌కి సూచనలు ఇస్తుంటే,

'ఏంటి డియర్' అలికిడికి లేస్తూ అన్నాడు శశాంక్.

'ఆసుపత్రికేలెండి. పడుకోండి' భర్త నుదిటిమీద చిన్నముద్దు పెట్టి బయటకు వచ్చేసింది.

ఆసుపత్రికి చేరగానే రిపోర్ట్స్ చూస్తూ ఐసీయూకి వెళ్ళబోతుంటే రోగి తాలూకు ఆమె ఏడుస్తూ రాబోతుంటే నర్సు ఆమెను ఆగమని సైగచేస్తూ సౌజన్యకు కేసుషీట్ అందించింది.

'సుందరయ్య, తీవ్రమైన గుండెపోటు, ఎనభైమూడు ఏళ్ళు' వివరాలు చదువుతూ రోగివంక చూసి ఒక్కసారిగా కొయ్యబారిపోయింది. కోపం, కసి ఉవ్వెత్తున ఎగసి సౌజన్య మస్తిష్కాన్ని ఉక్కిరిబిక్కిరి చేయగా మనస్సులో పెనుతుఫానే లేచింది. కానీ చేదుగతం మీద వృత్తిధర్మం జయించి రోగిని పరీక్షించేలా చేసింది.

డాక్టరు స్పర్శకు అయన చిన్నగా కదిలి కళ్ళువిప్పి ఆమెను చూడగానే 'నువ్వు.. నువ్వు..?' అంటూ వణికిపోతూ ఫిట్స్ వచ్చినవాడిలా గిలగిలా కొట్టుకున్నాడు. నర్సు ఇంజక్షన్ ఇవ్వగానే మగతగా తలవాల్చేసాడు.

బయటకు రాగానే సౌజన్య కళ్ళు అతనికోసం త్రీవంగా గాలించాయి. స్తంభానికి ఒక పక్కగా దిగులుగా నిలబడి ఉన్నాడతను.

'సాగర్, నా సర్వస్వం. నా తొలిప్రేమ. అదే రూపం. చెంపలే కొద్దిగా నెరిసాయి' అతన్ని చూస్తూ శిలలాగ నిలబడిపోయింది.

ఆమె ఫోనులో ఎవరికో చెబుతున్నమాటలు వినపడుతూ ఉన్నాయి.

'మావయ్యగారికి గయలో పిండ ప్రదానం చేద్దామని బయలుదేరుతుంటే, ఒక్కగానొక్క కొడుకు నా కళ్ళముందే రాలిపోయాడు, నేనూ తర్పణం వదులుతానంటూ

తాతయ్య గట్టి పట్టుపట్టేశారు. ప్రయాణం చేయలేరంటున్నా వినిపించుకోలేదు. అప్పటికి ముగ్గురము ఫ్లైట్లోనే వచ్చాం. గయలో పూర్తి చేసుకుని కార్లో కాశీకి తిరుగు ప్రయాణంలో తాతయ్యకి గుండెపోటు ఇంతలా ముంచుకువస్తుందని అనుకోలేదు. పేరు కూడా తెలియని ఊరులో ఇలా చిక్కుపడిపోయాం.'

సౌజన్యను చూస్తూనే ఫోన్ టక్కున పెట్టేసి, 'డాక్టర్ గారు, ఎలా ఉందండి?' ఆందోళనగా అడిగింది. అతను చటుక్కున వెనక్కితిరిగి సౌజన్యను చూడగానే వెనుకడుగువేసి దిగ్భ్రాంతిగా నిలబడిపోయాడు.

'ప్రమాదంగానే ఉంది.' లోగొంతుతో అంటూ ముందుకు నడిచింది. అతను ఆమెవంక అలా చూస్తునే ఉన్నాడు. తను చెప్పేదేమీ అతను వినడంలేదని ఆమెకి అర్థమవుతోంది. ఆమె నడుచుకుంటూ ముందుకు వెళ్ళుతుంటే అతని అడుగులు ఆమెవెంటే సాగాయి.

***

'ఎన్నేళ్ళు అయింది సౌజి' కంపిస్తున్న స్వరంతో అన్నాడు. అతని కళ్ళు మాటిమాటికి చెమ్మగిల్లితూనే ఉన్నాయి.

'పదహారేళ్ళు సాగర్' చిరునవ్వును అరువు తెచ్చుకుంటూ అంది.

దూరంగా అతని భార్య బెంచిమీద కూర్చుని కునికిపాట్లు పడటం ఆమెకి కనపడుతూనే ఉంది.

'ఎక్కడ కేరళ, ఎక్కడ బీహార్? నిన్ను ఇలా కలవాలని దేవుడెంత చిత్రంగా నిర్ణయించాడు.' తనలోతాను అనుకున్నట్లుగా అస్పష్టంగా అన్నాడు.

'నిర్ణయం' ఆమె మనసు ఆ పదం దగ్గర చిక్కుపడిపోయింది. ఇద్దరి కళ్ళముందు గతం మెదిలింది.

***

ఊరి చివరగా విసిరేసినట్టున్న కాలనీలో సౌజన్య, సాగర్ కుటుంబాలు ఉండేవి. అంతస్తులబేధం ఉన్నా స్నేహంగా మసులుకునేవాళ్ళు. కలిసే బడికి వెళ్ళేవాళ్ళు. సాగర్ తల్లితండ్రులకి ఆడపిల్లలు లేకపోవడంతో సౌజన్యని ముద్దుచేస్తూ అభిమానంగా చూసుకునేవాళ్ళు. చిన్నతనం నుంచి వాళ్ళింట్లోనే ఎక్కువకాలం గడిపేది. ఆమెకు సైన్సంటే మొదటినుంచి ఇష్టం. ఆమెకు అర్థంకాని పాఠాలను సాగర్ వివరించి చెబుతూండేవాడు. వాళ్ళమధ్య చిగురించిన ప్రాణస్నేహం యుక్తవయసు వచ్చేసరికి ప్రేమగా మారింది.

వాళ్ళ తాతయ్య సుందరయ్య అంటే అతనికి ఆరోప్రాణం. తాను కుదిర్చిన సంబంధం కాదని కొడుకు వేరే కులపు అమ్మాయిని పెళ్లిచేసుకున్నాడని ఇరవైఏళ్ళపాటు

సుందరయ్య కొడుకు ఇంటిగడప తొక్కలేదు. కానీ తన పోలికలతో ఉన్న మనవడంటే ఆయనకు వెర్రిప్రేమ. అందువల్లే ఇప్పుడిప్పుడే తండ్రీకొడుకులు చేరువవుతున్నారు. సెలవులు వచ్చాయంటే సాగర్ వాళ్ళ ఊరికి వెళ్ళిపోయేవాడు. వచ్చాక మోతుబరి అయిన తాతయ్య విషయాలు ఊరికబుర్లన్నీ సౌజన్యకు పూసగుచినట్టు చెప్పేవాడు.

బామ్మగారికి పక్షవాతం రావడంతో చికిత్స కోసమని పట్నం తీసుకురావల్సి వచ్చింది. తండ్రీకొడుకులు ఇన్నేళ్ళ తరువాత కలిసారని, తాతయ్య తమ ఇంటికి వచ్చారని సౌజన్యతో చెబుతూ సాగర్ మహదానందపడ్డాడు. ఆమెను పరిచయం చేశాడు. ఆ క్షణమే ఏ అడ్డంకి లేకుండా సంతోషంగా సాగిపోతున్న ఆమె జీవితంలోనికి రాహువు ప్రవేశించాడు.

రోజులు గడుస్తున్నకొద్దీ సుందరయ్య చేసే చేష్టలు సౌజన్యకు విపరీతంగా అనిపించసాగాయి. సాగర్ ఇంట్లో చదువుకుంటున్నపుడు చుట్టుపక్కల ఎవరులేకుండా చూసి 'దా మనవరాలా' అంటూ ఆమెను పక్కగా కూర్చోపెట్టుకుంటూ మల్లెపువును నలిపినట్టు ఆమె ఒళ్ళంతా తడిమేసేవాడు. ముందు ఆమెకి అర్థమయ్యేది కాదు. కానీ చాలాసార్లు అలాగే అన్నిచోట్లా చేయివేస్తూ ఉండటంతో రానురాను ఆ స్పర్శ వెనుక దురుద్దేశం గ్రహింపుకు వచ్చాక పదహారేళ్ళ సౌజన్య భయంతో తల్లడిలిపోయింది. హేయమైన ప్రవర్తన గురించి తల్లితండ్రులకు చెప్పేద్దామనుకుంది. కానీ కుటుంబాల మధ్య చిచ్చు రేగుతుందేమోనన్న భయంతో తనలోతాను కుమిలిపోతూ భరిస్తూ వచ్చింది. ముఖ్యంగా సాగరుకి ఎలా చెప్పాలో తెలియక చాలా సతమతమైపోయింది. సౌజన్య పిరికితనం ఆయనకింకా అలుసుగా అయిపొయింది. క్రమక్రమంగా సాగర్ ఇంటికి వెళ్ళడం మానుకుంది. సాగర్ బామ్మగారి వైద్యం కోసమని ఆసుపత్రుల చుట్టూ అవిశ్రాంతంగా తిరుగుతూ హడావుడిగా ఉన్నాడు.

***

'సౌజి, నువ్వు రావడంలేదని అమ్మ అనుకుంటోంది. అమ్మేకాదు, తాతయ్య రోజూ అడుగుతున్నాడు. ఏమైంది?' తాతయ్య అనగానే ఆమె గుండెలు దడదడలాడాయి.

'సాగర్, మన ప్రేమవిషయం ఆయనకు తెలుసా?' ఆలోచనగా అంది.

'లేదు. చెప్పాలి. నెలాఖరుకు పీ.జి సీటు వస్తుందో లేదో తేలిపోతుంది. రాకపోతే ఏదో ఒక ఉద్యోగంలో చేరిపోతాను. నాన్న విషయంలో జరిగినట్టుగా మళ్ళీ కాకుండా నెమ్మదిగా ఒప్పించాలి'

'ఎందుకని, మాది కూడా మీ అమ్మగారి కులమేననా' సూటిగా అడిగింది.

'ఛ.. మధ్యలో ఈ కులాలేమిటి? తేడాగా మాట్లాడుతున్నావు. అదే పరిస్థితి ఎదురైతే నీకోసమని మా నాన్నలాగ ఎవ్వరినైనా ఎదిరిస్తాను'

అతనిలోని ధైర్యానికి, తనపైన ఉన్న ప్రేమకి కళ్లలో చివ్వుమని కన్నీళ్ళు చిమ్మాయి.

'నువ్వేదో విషయం చెప్పకుండా దాస్తున్నావు. తాతయ్య ఒప్పుకోడేమోనన్న అనుమానమేదో నీ మనసులోకి వచ్చింది. ఇక్కడ కాలేజి దగ్గరెందుకు, పద ఇంటికెళ్ళి మాట్లాడుకుందాం.' ఇంటికి రాలేనని ఎలా చెప్పాలో తెలియక బేలగా చూస్తూ ఉండిపోయింది.

చాలాసేపు బతిమాలడంతో, 'రేపు వస్తానులే' అతికష్టంగా అంది.

'సరే నీ ఇష్టం. రాలేదంటే ఇక మనమధ్య ఎప్పటికీ మాటలుండవు. నా మీద ఒట్టే.' ఆమె తలపై చేయివేసి అన్నాడు. 'ఒట్టెందుకు వేసావు' ఉలిక్కిపడుతూ అంది.

***

'ఇక దాచకుండా సాగరుకి అంతా చెప్పేయడమే మంచిది.' గట్టిగా నిశ్చయించుకుంటూ ఆ రోజు అతనింటికి వెళ్ళింది.

వీధితలుపులు తీసే ఉన్నాయి. కానీ ముందుగదిలో ఎవరూ ఉన్నట్టుగా అనిపించడంలేదు.

లోపలగదుల్లోకి తొంగిచూసి హాల్లోకి తిరిగివస్తుంటే సుందరయ్య వీధితలుపు గడియ వేస్తు కనిపించాడు.

'పిల్లా, ఇంట్లో ఎవరు లేరు. పండుగకి కొత్తబట్టలు కొనుక్కోవడానికని ఇప్పుడే వెళ్లారు.' గుంటనక్కలా ఆమెను చూస్తూ అన్నాడు.

అనుమానంగా చూసి తలుపుగడియ తియబోతుంటే, 'రావడం మానేసావే' దగ్గరకువచ్చి జబ్బ పట్టుకున్నాడు. బెదిరిపోతూ 'నేను వెళ్లిపోతాను' అంది.

'అప్పుడేనా, ఒక్కడినే ఉన్నాను. కాసేపు కూర్చో. కబుర్లు చెప్పుకుందాం' దగ్గరుకు గట్టిగా లాగుతూ అన్నాడు.

'లేదు, నేను వెళ్ళాలి. ఏంటిది, వదలండి?' అసహ్యంగా చూస్తూ విదిలించుకుంటూ తోసింది.

'ఏమిటంత పొగరు?' గట్టిగా కసిరి సోఫాలోకి మోటుగా తోసేసి ఉద్రేకంగా ఆక్రమించుకున్నాడు.

ఊపిరి ఆడక గింజుకుంటూ 'బామ్మా, బామ్మా' అంటూ భయంతో గట్టిగా కేకలు వేసింది.

'అది ఇప్పుడే లేవదులే' రొప్పుతూ ఆమెను నొక్కిపెట్టాడు.

సౌజన్య వణికిపోతూ గట్టిగా ప్రతిఘటించింది. ఆ పెనుగులాటలో ఆమె లంగాబొందు ముడి లాగేయడంతో, సిగ్గుతో చచ్చిపోతు, కోపంతో విసురుగా లేచి, బలంగా ఒక్కతోపు తోసెసి వీధితలుపు పక్కన గొడుగు కనపడటంతో, అది అందుకొని తలమీద గట్టిగా ఓ పోటు పొడిచింది. ఆ దెబ్బకి రక్తంకారుతుండగా విలవిలలాడుతూ దబ్బుమని కిందపడిపోయాడు. ఆ గొడుగుతోనే కసితీరా ఎడాపెడా బాదేసి పిచ్చిదానిలా బయటకు పరుగుతీసింది.

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 360

ఇంటికి ఎలావచ్చిందో ఆమెకే తెలియదు. లోపలికి వస్తూనే బావురుమంటూ తల్లిని గట్టిగా పట్టేసుకుంది.

'చూసావా, ఎంత ఘోరం జరిగిపోయిందో' అంటూ తల్లి ఏడుస్తుంటే అయోమయంగా చూసింది.

'సౌజి, అమ్మమ్మ పోయిందని కబురు వచ్చినప్పటినుంచి అమ్మని అసలు పట్టుకోలేకపోతున్నాను. బట్టలు త్వరగా సర్దేసేయి. రైలు అందుకోకపోతే మనకిక ఆఖరిచూపు దక్కదు.' తండ్రి హడావుడిగా అన్నాడు.

తనపై జరిగిన అఘాయిత్యాన్ని ఎవరికి చెప్పుకోలేక భోరుమని ఏడుస్తుంటే, అందరు అమ్మమ్మ కోసం ఏడుస్తోందని అనుకున్నారు. ఆమె దుఃఖం అంతా ఆ చావులో కలిసిపోయింది. దినాలు కాగానే మావయ్యల ఆస్తిపంపకాల వ్యవహారాలతో కొద్దిరోజులపాటు ఊళ్ళోనే ఉండిపోయారు.

***

సౌజన్య గాయపడ్డ పక్షిలాగ చాలారోజుల పాటు నిస్తేజంగా ఉండిపోయింది. కూతురు అసహజమైన ప్రవర్తన పట్ల తల్లికి చిన్నఅనుమానం కలిగింది. నిలదీయగానే జరిగినదంతా తల్లికి చెప్పేసేటప్పటికి ఆమెకు కాస్త బరువు తగ్గిందనిపించింది.

తల్లి దిమ్మెరపోయి సుందరయ్యను బండబూతులు తిట్టిపోసింది. తరువాత ఈడొచ్చిన పిల్ల, బుద్దిలేకుండా చదువన్నవంకతో రోజు వాళ్ళింటికెళ్ళి అలాంటి అవకాశాన్ని కల్పించావని, డబ్బున్నవాళ్ళు ఏంచేసినా చెల్లుతుందన్న తల్లి మాటలకు సౌజన్య మిన్ను విరిగిపడినట్టుగా చూసింది. యే ఆడపిల్లకయినా ఇలాంటి చేదు అనుభవాలు ఎదురైతే ఎవరికీ చెప్పుకోకుండా సహించాలని లేకపోతే తప్పునంతా ఆడపిల్లవైపే వేలెత్తి చూపిస్తారని సౌజన్యకు తొలిసారిగా అర్థమై ఆవేదనను తట్టుకోలేక భోరుమని ఏడిచింది.

ఆవిడ మనసు కరిగిపోగా కూతుర్ని అక్కున చేర్చుకుంటూ కన్నీళ్ళతో అంది.

'జరిగిందొక పీడకల అనుకుని వదిలేసేయి. నువ్వు చెప్పినా ఎవరు నమ్మరు. చదువుమీద దృష్టిపెడితే అదే నీకు మంచి జీవితాన్ని ఇస్తుంది.'

కన్నతల్లె భయపడిపోతు సర్దుకుపోమ్మంటుంటే, సాగరుకు చెప్పినా కూడా తన తాతయ్య ఇంత నీచుడని తెలుసుకుని తనలో తాను క్రుంగిపోతాడని సౌజన్య గుండెను రాయి చేసుకుంది. అలా అని అన్నీ మరిచిపోయి అతనింట్లోకి తాను ఇల్లాలిగా అడుగుపెట్టడమన్నది ఊహించుకోవడానికే ఆమెకు చాలా అసహ్యంగా అనిపించసాగింది. అతనితో బంధాన్ని తెంచుకోవడమే సరైయిన నిర్ణయంగా భావించి డాక్టర్ అవ్వాలన్న తన లక్ష్యంమీద దృష్టి మరల్చుకోవడానికి ప్రయత్నం చేస్తూ అమ్మమ్మ

మరణంతో పాటుగా తన ప్రేమను సమాధి చేసేసింది.

***

'సౌజి, ఎందుకు నన్ను తప్పించుకుని తిరుగుతున్నావు? చాలా చిక్కిపోయావు. ఏమైందసలు?' ఆవేదనగా అడిగాడు సాగర్.

'మెడికల్ ఎంట్రన్సుకి రాత్రింబవళ్ళు చదువుతున్నాను' తలతిప్పుకుంటూ అంది.

అతను కాసేపు ఆలోచిస్తూ మౌనంగా నిలబడి తర్వాత ఆమెను తనవైపుకి తిప్పుకుంటూ నీళ్ళునిండిన కళ్ళతో అన్నాడు.

'నేనేం తప్పుచేశాను చెప్పు? నన్నిలా దూరం పెట్టడం వల్ల నువ్వేమన్నా ఆనందంగా ఉన్నావా? లోలోపల క్రుంగిపోతున్నావు. నీ సంతోషమే నాకు కావలసింది. నీ మనసులో ఏముందో చెప్పు'

'నేను సంతోషంగా ఉండాలని నువ్వు నిజంగా కోరుకుంటే ఇక నన్నెప్పుడూ కలవకు. నాకు బాగా చదువుకోవాలని, పెద్ద డాక్టర్ని అవ్వాలని ఉంది. మన దారులు వేరు' అంటూ ఏడ్చేసింది. అతనెంత ప్రాధేయపడినా అందనంత దూరంగా జరిగిపోయింది.

***

సౌజన్యకి మెడికల్ సీట్ రావడంతో వీడ్కోలు చెప్పడానికి సాగర్ రైల్వేస్టేషన్‌కు వచ్చాడు.

'ఆఖరిసారిగా చూడాలనిపించి రాకుండా ఉండలేకపోయాను' క్షమాపణగా అన్నాడు.

మనిషి బాగా చిక్కిపోయాడు. చాలరోజుల తరువాత అతనిని చూడడంతో ఆమెకు కన్నీళ్ళు ఉబికివచాయి.

'ఏంటిది, ఇలా అయిపోయావు?' ఆందోళనగా అడిగింది,

అతను పేలవంగా నవ్వుతూ, 'చిన్నపటినుంచి మనం ఒకే ప్రాణంగా ఉన్నాం. నన్ను వెలివేసి భరించలేని శిక్షవేసి బతికున్న శవాన్ని చేశావు' అన్నాడు. నిస్సహాయంగా చూసింది.

'బాగా చదువుకో. నీ ఆశయాలన్ని నెరవేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'

దుఖాన్ని ఆపుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూ 'నువ్వెప్పుడు సంతోషంగా ఉండాలి. అదే నా కోరిక' గద్గదికంగా అంది. రైలు కదిలింది.

'నీకే అవసరం వచ్చినా మరుక్షణం నీముందు వాలిపోతాను. ఎప్పుడూ నీకు నేను ఉన్నాను' పరుగెడుతూ కన్నీళ్ళతో అన్నాడు. అతని రూపం కనుమరుగయ్యేవరకు బెంగగా చూస్తూ వెక్కివెక్కి ఏడుస్తూనే ఉంది.

***

'సౌజి, ఎక్కడో త్రిచూర్లో భెల్లో పనిచేస్తున్న నేను, ఇక్కడ బీహార్లో చిన్నటౌన్లో నిన్నిలా కలుసుకోవడాన్ని నేనింకా నమ్మలేకపోతున్నాను.' గతాన్ని పక్కకితోస్తూ అన్నాడు సాగర్.

మనసుకు తూట్లు పొడిచి తన కలల జీవితాన్ని చిన్నాభిన్నం చేసిన అప్పటి సంఘటనలన్నీ సౌజన్య కళ్ళముందు సజీవంగా తిరుగుతుండగా అలాగే కూర్చుండిపోయింది.

'తాతయ్య పరిస్థితి ఏమిటి?'

'కొంచెం ప్రమాదంగానే ఉంది. ఈ రాత్రి గడిస్తే గండం గట్టెక్కినట్టే.' ఆమాటకి అతను తీవ్రమైన విషాదంలో మునిగిపోయాడు.

'ఎక్కువ ఆలస్యం కూడా కాలేదు. గుండెనెప్పిగా ఉందనగానే ఈ చుట్టూపక్కల ఒక్కటే మంచి ఆసుపత్రి ఉందంటూ డ్రైవర్ అయిదునిముషాల్లోపే తీసుకొచ్చాడు'. ఆయనంటే అతనికెంత ప్రాణమో ఆమెకి తెలుసును కనుక,

'లేదు, సమయానికే వైద్యం అందింది. కానీ వయసు పెద్దదికదా. తట్టుకోవడం కష్టమేమో అనిపిస్తోంది' కుర్చీలో వెనెక్కివాలుతూ అలసటగా అంది.

'ఇంత అరాత్రి వేళ నిన్ను ఇబ్బందిపెట్టి పిలిపించారు.' అన్నాడు.

చిన్నగా నవ్వి 'ఈ హాస్పిటల్ సొంతమే. ఇందాక వచ్చిన హార్ట్ స్పెషలిస్ట్, నేనూ కలిసి స్థాపించాం. ఇల్లు కూడా బాగా దగ్గరే. మావారు ఇక్కడ ప్లాంట్లో ప్రాజెక్ట్ డైరెక్టర్' అంది.

'పిల్లలు' ఆసక్తిగా అడిగాడు.

'ఒక పాప. మరి నీకు?'

కనిపిస్తున్న భార్య వంక చూస్తూ 'లేరు. తాతయ్యకు తెలిసిన దూరపు బంధుత్వ సంబంధం మాది. జన్యు సమస్యల వల్ల ఇద్దరు పిల్లలు పుట్టి వెంటనే పోయారు.'

ఇంతలో నర్సు హడావుడిగా వచ్చి 'సుందరయ్య పేషెంట్, వెరీ సీరియస్' అంది.

లోపలికి పరుగెత్తారు. అప్పటికే ఆయన ఎగఊపిరి దిగఊపిరితో ఉన్నాడు. సౌజన్యకేసి చూస్తూ పెదాలు కదుపుతూ ఏదో చెప్పబోతు రెండుచేతులు జోడించడానికి ప్రయతిస్తూ తలవాల్చేసాడు.

'తాతయ్య' అంటూ సాగర్ ఆయన కాళ్లమీద కుప్పలా కూలిపోయాడు.

అత్యంత ప్రియమైన ఆప్తుడిని కోల్పోయిన వేదనలో కూరుకుపోయి శవం పక్కనే సాగర్ స్తబ్దుగా కూర్చుండిపోయాడు. దుఃఖాన్ని దిగమింగుకుంటూ అతని భార్యే కలియ తిరుగుతూ బిల్లులన్ని కట్టేసింది. శవపరీక్షలు పూర్తి చేసి శవాన్ని అప్పగించేటప్పటికి తెల్లవారుతూ ఉంది.

కారు బయలుదేరుతున్న సమయంలో,

'సౌజి, ఇప్పటికైనా చెబుతావా? నువ్వే నా జీవితమనుకున్న నన్ను ఎందుకంత నిర్దాక్షిణ్యంగా నెట్టేసావు? నిజం తెలుసుకునే అర్హతను నాకిప్పటికయినా ప్రసాదిస్తావా?' అర్థిస్తున్నట్టుగా అడిగాడు.

కలవరంగా చూసింది. దూరంగా అంబులెన్సులో శవాన్ని ఎక్కించడం కనిపిస్తోంది. చనిపోయిన వ్యక్తిమీద అతనికి దురభిప్రాయాన్ని కల్పించడమన్నది ఆమెకి మరోసారి ఇష్టంలేకపోయింది. నిజం చెప్పకపోవడమే సరైన నిర్ణయంగా అనిపించింది.

'చెప్పడానికి అప్పుడేమిలేదు. ఇప్పుడేమిలేదు. ఏ బంధం ఎవరిని కలుపుతుందో, ఎందుకు విడదీస్తుందో అర్థం కాదు. జీవితం మనలను ఎలా నడిపిస్తే అలా అడుగులు వేస్తూ కడవరకు సాగిపోవలసిందే' జ్ఞాపకాల గాయాలు మంటలను రగిలిస్తున్నా అదిమి పెట్టుకుంటూ అంది.

'నీ మనసులోతును నేనెప్పుడూ సరిగా కొలవలేకపోతున్నాను' అంటూ నిరాశగా

'మళ్ళీ మనం ఎప్పుడు కలుస్తామో?' అన్నాడు.

'కాలం నిర్ణయించినప్పుడు' చెమ్మగిల్లిన కళ్ళతో భారంగా కదిలింది. ఆమె వెళ్ళుతున్న వైపు బాధగా చూస్తూ చాలాసేపు నిలబడిపోయాడు.

కేరళ వెళ్ళిన వెంటనే కలవమంటూ సౌజన్య ఇచ్చిన సంతానసాఫల్య డాక్టరయిన ఆమె ప్రాణస్నేహితురాలి చిరునామా కాగితం అతని చేతిలో రెపరెపలాడుతోంది.

***

కారు మలుపు తిరగగానే వెనుకకు యధాలాపంగా తలతిప్పి చూస్తుంటే 'సాగర్ హాస్పిటల్' అన్న ఆసుపత్రి పేరు సూర్యకిరణాల మధ్య తళ్ళుక్కుమంటూ సాగర్ కళ్ళముందు మెరుపులా మెరిసి అతనిని క్షణంపాటు అచేతనుడిని చేసింది.

'ఆసుపత్రికి నా పేరు పెట్టిందా' కనుమరుగవుతున్న ఆసుపత్రి పేరులో తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ,

'అయ్యో.. సౌజి, నాకు శాపాన్నిచ్చావని బాధపడుతున్నాను. కానీని ఇన్నాళ్ళబట్టి నువ్వు దహించుకుపోతున్నావని గ్రహించుకోలేకపోయాను.' రెండుచేతులతో ముఖాన్ని కప్పుకుంటూ భోరుమని ఏడ్చాడు. ఇన్నేళ్ళయినా ఆమె తనను మరువలేదన్న ఆమె ప్రేమసంకేతం అతని మనసుని మరింత లోతుగా మదనం చేస్తూ అతనిలోని ఎన్నో శేష ప్రశ్నలకు ఇంకొక ప్రశ్నని కొత్తగా జతకలిపింది.

'ఏంటి, మీరిక్కడ' కారు పార్కింగ్ పక్కన కనిపించిన భర్తను ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది సౌజన్య.

'పార్కుకి వెళ్ళకుండా ఇటువైపుగా వాకింగ్ చేస్తూ వచ్చాను' శశాంక్ తడబడుతూ అన్నాడు

'కాదులెండి. ఇవాళ కోర్టు తీర్పుందని వచ్చారు' అతనెంత బలమైన నైతికమద్దతునిస్తూ తన వెన్నంటి ఉంటాడో ఆమెకి బాగా తెలుసు.

దొరికిపోయినట్టుగా చూసి 'నువ్వు కోర్టుకి వెళ్ళాలి కదా. రాత్రంతా నిద్ర ఉండి

ఉండదు. అందుకని..' అన్నాడు.

సౌజన్య ఇంట్లో పనిచేసే పనిమనిషి తొమ్మిదేళ్ళ కూతురును అమానుషంగా పాడుచేసి, చంపేసిన ఇద్దరు మృగాళ్ళ శిక్షపై కోర్టుతీర్పు వచ్చే రోజది. మూడేళ్ళక్రితం జరిగిన ఆ ఘోరానికి కదిలిపోయిన సౌజన్య న్యాయం చేయాలని తిరుగుతూ ఆ కుటుంబానికి అన్నివిధాలుగా మద్దతుగా నిలబడింది.

'ఖాయంగా ఉరిశిక్ష పడుతుంది' విశ్వాసంగా అంది.

'మా', 'జీ' అంటూ తనని పిలుస్తూ చెంగుచెంగున లేడిపిల్లలా గెంతుతూ రంగురంగుల గౌనులు వేసుకుని తల్లితో తన ఇంటికి వచ్చిపోతుండే చనిపోయిన ఆ చిన్నారి అమాయకపు లేతరూపం ఆమె కంటిముందు తళ్ళుక్కున మెరిసి కంట్లో నీరు నిలిచింది.

'నీకు విశ్రాంతి కావాలి. నేను కారు డ్రైవ్ చేస్తాను' ఆమె ముఖంలోని అలసటను గమనించి అపురూపంగా నడిపిస్తూ కూర్చోపెట్టాడు.

సీట్లో జారగిలపడి రాత్రినుంచి అనుభవిస్తున్న సంఘర్షణని, కంటిరెప్పల కింద కన్నీళ్ళని పైకి కనిపించనివ్వకుండా కళ్ళు గట్టిగా మూసుకుంది.

***

తొలిప్రేమ బలమైనది. సాగర్ని ఎంతగా ప్రేమించింది. ఒక పశువు వల్ల తన కలల జీవితం కుప్పలా కూలిపోయింది. ఎన్నో ఏళ్ళపాటు ఆ దుర్మార్గుడు మీదకు వచ్చి చెరుస్తున్నట్టుగా రాత్రిళ్ళు వచ్చే పీడకలలతో భయంతో వణికిపోతూ లేచి తెల్లవార్లు హాస్టల్లో ఏడుస్తూ కూర్చునేది. ఎవరితోనూ బాధను పంచుకోలేక కుమిలిపోయేది. నెమ్మది నెమ్మదిగా ధైర్యాన్ని తెచ్చుకుంటూ, ఎదుగుతున్నకొలది తనని తాను బలమైన వ్యక్తిగా మలుచుకుంటూ మంచి వైద్యురాలిగా, సామాజిక కార్యకర్తగా సమాజంలో పేరు తెచ్చుకుంది.

ఆమె అదృష్టం కొద్ది తనను ప్రాణంకన్నా మిన్నగా చూసుకుంటూ, ఆకాశమంత ప్రేమను కురిపించే దేవుడులాంటి శశాంక్ సహచర్యం లభించింది.

***

'ఈ బట్ట నీది, ఈ గాజులు నీవి, ఈ పుస్తకం నీది అంటూ చిన్నచిన్న వస్తువుల పైనే జాగ్రతలు చెబుతూ తల్లితండ్రులు ఆడపిల్లని బయటికో, బడికో పంపుతారు. ఏదైనా పోతే ఫిర్యాదుచేసి దొంగిలించినవాళ్ళకు గట్టిశిక్ష వేయించాలని చిన్నతనం నుంచి నేర్పుతారు. అదే కూతురుని వేధిస్తే పరువుపోతుందన్న భయంతో ఫిర్యాదు చేయడానికి తల్లితండ్రులే వెనకడుగు వేస్తున్నారు? క్షమయా ధరిత్రి అంటూ క్షమించి సహించాలంటున్నారు.

అసలు ఇన్నాళ్లుగా అపురూపంగా, ప్రేమగా, సంరక్షిస్తున్న అమ్మాయి లేత శరీరాన్ని ఇష్టం వచ్చినట్టుగా తడిమేయడానికి, పాడుచేయడానికి ఆ పశువులకు హక్కేవరిచ్చారు? తప్పుచేసిన మృగం ధైర్యంగా తలెత్తుకుని తిరగగలుగుతోంది. సాహసించి ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితురాలికి దక్కేవి పెదవి విరుపులు, చులకన చూపులునా? ఇదెక్కడి ఆటవిక సమాజంలో మనం బతుకుతున్నాం?'

దేశంలో ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపుల గురించి విన్నప్పుడల్లా ఈ ప్రశ్నలన్నీ సౌజన్యను చాలాకాలం వేధించాయి. లేత పిందెలపై జరుగుతున్న ఆకృత్యాలు ఆమెను మరింత కదిలించసాగాయి. అందుకే సౌజన్య మనసు చెదిరిపోయిన బాధితులకు అండగా నిలిచి, న్యాయ పోరాటాలకు తోడ్పడుతూ, ధైర్య వచనాలు చెబుతూ వాళ్ళకు జీవితంమీద మళ్ళీ ఆశ చిగురించేలా చేస్తోంది. సమాజంలోని అతి దారుణమైన వికృత చేష్టలకు శాశ్వత పరిష్కార మార్గాల అన్వేషణ దిశగా ఆమె ఆలోచనలు క్రమంగా సాగడం మొదలుపెట్టాయి.

అసలు అత్యాచారం సంగతి దేముడెరుగు, ఆడపిల్ల శరీరంలోని ఏ భాగాన్ని స్పర్శించడానికి కూడా ప్రతీ మగవాడు భయపడి తీరాలని, ఒంటి మీద చేయి వేయడానికి వీలులేని కఠినమైన చట్టాలు రూపొందించాలని, కావాలని తాకిన భ్రాష్టులపై ఏమాత్రం వెనుకంజ వేయకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయడానికి, సత్వరమే న్యాయచర్యలు చేపట్టడానికి, బలమైన వ్యవస్థను ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదనలతో మరొక కొత్త పోరాటానికి ఆమె సమాయుత్తమవుతోంది.

***


## కామరాజుగడ్డ వాసవదత్త రమణ.

వాసవదత్త రమణ... కథ, నవలా, నాటక రచయిత్రి. టీవీ పరిచయకర్త. తెలంగాణా బెవేరేజేస్ కార్పొరేషన్ లో డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ గా ఉన్నారు. ఇప్పటి వరకూ 8 పుస్తకాలను ప్రచురించారు. కళా పీఠం వారు 'ఉగాది పురస్కారం', యద్దనపూడి సులోచనారాణి స్మారక పురస్కారం అందుకున్నారు. సాహిత్యం అంశం పై పరిశోధన చేస్తున్నారు.

# అమ్మ వస్తున్నది

**ఐవీఎస్ కృష్ణ కుమారీ**
**94945 10994**

'వాట్ దీప్తీ, ఎంతోమంది, ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న అవకాశం, ఇప్పుడు నీకు వచ్చింది. ఆ అదృష్టాన్ని చేతులారా పాడుచేసుకుంటావా?' నచ్చచెపుతున్నట్లు అన్నది టీమ్ మేనేజర్ యామిని, దీప్తితో.

'నిజమే యామిని ఎవరికైనా అమెరికా ఛాన్స్ అంటే ఆనందమే. కానీ, నా పరిస్థితి మీకు తెలుసుగా. పాపకి ఇప్పుడు ఆరో నెలే. ఇంత చిన్నపాపను వదలి నేను వెళ్ళలేను.' అన్నది దీప్తి.

'ఏం మాట్లాడుతున్నావు దీప్తీ, పాపకి నీ ఫీడింగ్ లేదు. ఇంట్లో మీ అత్తగారు, మామగారు ఉన్నారు. మీ హజ్బెండ్ ఎలానూ చూస్తారు. ఓన్లీ ఫర్ టూ మంత్స్. ఇప్పుడు రిజక్ట్ చేస్తే మళ్లీ ఛాన్స్ ఎప్పుడు వస్తుందో! ఒక విజయం సాధించాలంటే కొన్ని త్యాగాలు తప్పవు.' అంది యామిని.

'యామిని, ఏ త్యాగం చేయటానికైనా నేను వెనుకాడను. కానీ, నాకోసం నా బిడ్డచేత తల్లిప్రేమను త్యాగం చేయిచటం నాకిష్టం లేదు. అయామ్ సారీ యామిని.' దీప్తి అక్కడనుండి వెళ్ళిపోయింది.

దీప్తి వెళ్ళిన వైపే చూస్తూ ఆమె అన్నమాటను పునశ్చరణ చేసుకోసాగింది యామిని.

అసలు ఈ పిల్లని చూస్తుంటేనే ఎప్పుడూ తనలో ఏదో తెలియని అలజడి కలుగుతుంది. దీప్తి తన టీమ్‌లో చేరి రెండు సంవత్సరాలు అయింది. మంచి టాలెంట్ ఉన్న అమ్మాయి. ఉద్యోగం పట్ల ఎంత నిబద్ధత కలిగి ఉంటుందో, తన కుటుంబం పట్ల కూడా అంత బాధ్యతగా ఉంటుంది. ఈ విషయం ఆమె మాటల్లో గ్రహించింది.

**వీసా స్టాంపిగ్ అయిపోయింది. యు. ఎస్ వెళటానికి ముందు రోజు రాత్రి పాపను గుండెలకి హత్తుకునే పడుకుంది. ఆ మర్నాడు ఎయిర్ పోర్ట్ లో మాత్రం తనకి ఏడుపు ఆగలేదు. అప్పటిదాకా ఉన్న బింకం సడలిపోయింది. ఆమెలోని మాతృహృదయం అప్పుడు బయటపడింది. భార్గవ్ ఓదార్చాడు.**

ఒకొక్కసారి ఆ పిల్ల మాట్లాడే మాటలు సూటిగా తనకి తగిలి వస్తాయి. ఈరోజు అదే పరిస్థితి. తనని తను ప్రశ్నించుకోసాగింది.

***

'కంగ్రాట్స్ యామినీ, యు.ఎస్. లో మన కంపెనీ తరపున డెమో ఇవ్వటానికి నిన్ను సెలక్ట్ చేసాం. స్లాటు బుక్ చేస్తున్నాం, నెక్ట్స్ ఫ్రైడే వీసా ఇంటర్వ్యూకి వెళ్ళాలి.' మేనేజర్ మాటలతో యామిని ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయింది. తన కల నెరవేరబోతున్నది. అమెరికా వెళ్ళాలి అనేది తన కోరిక.

ఈ శుభవార్త వెంటనే భర్తకి ఫోన్ చేసి చెప్పింది. ఇంటికి వెళుతూ స్వీట్ ప్యాకెట్ తీసుకెళ్ళింది. అత్తగారికి, మామగారికి కూడా ఈ వార్త చెప్పింది. అత్తగారు కంగ్రాట్స్ చెప్పారు. కానీ, అన్నీ ప్రాక్టికల్‌గా ఆలోచించే మామగారు మాత్రం,'మరి పిల్లని ఏం చేస్తావు? చిన్నదానికి రాత్రిపూట ఇంకా నీ ఫీడింగే. నెలరోజులు మరి అది నిన్ను వదిలి ఉండగలదా?' సందేహం వెలిబుచ్చాడు.

అంతే, ఒక్కసారి తన ఆనందం అంతా ఆవిరైపోయింది. తనకి అసలు కూతురు అనన్య గురించి ఆలోచన రాలేదు. ఎలా ఇప్పుడు? బెడ్రూంలోకి వెళ్లి దిగులుగా కూర్చుంది. ఈలోగా భర్త వచ్చాడు. వాతావరణం గంభీరంగా ఉండటం చూసి తన దగ్గరకు వచ్చాడు. మామగారు అన్న మాటలు చెప్పింది.

'ఎంబీఏ చదివినవాళ్ళకి ఎబ్రాడ్ ఛాన్సెస్ తక్కువ ఉంటాయి. అదృష్టం కొద్దీ నాకు ఆ ఛాన్స్ వచ్చింది.' అన్నది. భార్గవ్ ఏమీ మాట్లాడలేదు.

ఆ రాత్రి అందరూ భోజనాలు చేస్తున్న టైంలో 'ఒక్క నెలేకదా నాన్న, నేను మానేజ్ చేస్తాను. పగలంతా మీ దగ్గరే అలవాటు, ఎటొచ్చీ రాత్రిపూట కొంచం ఇబ్బందిపడాలి అంతే. నేను చూసుకుంటాలే.' అన్నాడు భార్గవ్.

వీసా స్టాంపిగ్ అయిపోయింది. యు.ఎస్ వెళ్ళటానికి ముందురోజు రాత్రి పాపను గుండెలకి హత్తుకునే పడుకుంది. ఆ మర్నాడు ఎయిర్పోర్ట్లో మాత్రం తనకి ఏడుపు ఆగలేదు. అప్పటిదాకా ఉన్న బింకం సడలిపోయింది. ఆమెలోని మాతృహృదయం అప్పుడు బయటపడింది. భార్గవ్ ఓదార్చాడు.

అక్కడికి వెళ్ళిన తరువాత ఉదయం, సాయంత్రం ఫోన్ చేస్తూనే ఉండేది.

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 368

ఇప్పట్లోలాగా అప్పుడుస్మార్ట్‌ఫోన్స్ లేవు.

నెల కాగానే తను యు.ఎస్ నుంచి వస్తున్నప్పుడు ఆ నెల తన సంపాదనలో సగం పాప డ్రెసెస్, బొమ్మల కోసమే ఖర్చుపెట్టింది. వచ్చిన మర్నాడు అత్తగారు చెప్పింది, తను వెళ్లిన రెండు రోజులకి అనన్యకి జ్వరం వచ్చింది. భార్గవ్ ఇ.ఎల్.పెట్టి పదిహేను రోజులు పాపను చూసుకున్నాడని.

అది విని తల్లడిల్లి పోయింది. ఇక ఇంకోసారి అనన్యని వదలి వెళ్ళకూడదు అని గట్టిగా నిశ్చయించుకుంది. అన్నట్లుగానే ఆరునెలల తర్వాత మళ్లీ వెళ్లాలి అన్నప్పుడు తనురిజక్ట్ చేసింది.

అనన్యకి మూడేళ్ళు వచ్చాయి. తనకి రెండోసారి బాబు పుట్టాడు. రెండుసార్లు ఆఫర్ వచ్చినా వదులుకుంది. బాబుకి ఏడాది వయసప్పుడు తనకి ప్రమోషన్ వచ్చింది. అయితే ఇప్పుడు తప్పనిసరిగా తను తన ప్రాడక్ట్ డెమోకోసం వివిధ దేశాలు వెళ్ళాలి లేదాప్రమోషన్ వదులుకోవాలి.

మళ్లీ అదే పరిస్థితి. కుటుంబమా లేక తన కెరీరా? భర్తకి చెప్పింది. నిర్ణయం నీదే అన్నాడు. అత్తగారు, మామగారు ఉదాసీనంగా ఉండిపోయారు. తన సంఘర్షణ చూసి తన కొలీగ్ సలహా ఇచ్చింది, 'నీఅభివృద్ధి నీ పిల్లలఅభివృద్ధికి దోహదపడుతుంది. తాత్కాలికంగా బాధ అనిపించినా భవిష్యత్తు ఎంతో బాగుంటుంది. భార్గవ్‌కి ట్రాన్స్ఫర్స్ ఉండవుకాబట్టి నీవు లేనప్పుడు పిల్లల బాధ్యత తను చూసుకుంటాడు.'అని.

నిజమే ఒక విజయం సాధించాలంటే కొన్ని త్యాగాలు తప్పవు అని మనసుకు సర్ది చెప్పుకొంది.

***

గతం ఆలోచిస్తూ టైము చూసుకోలేదు.ఆరు దాటింది. ఇంటికి వచ్చింది. అప్పటికే భార్గవ్ వచ్చి చపాతీపిండి కలిపి, కర్రీ తయారుచేస్తున్నాడు. తను ఎన్నోసార్లు అన్నది ఒక వంటమనిషిని పెట్టుకుందామని. కానీ వినడు. 'ఇద్దరు మనుషులకోసం అవసరమా, నీకు ఓపిక లేకపోతే నేను చేస్తాగా..' అంటాడు.

ఇద్దరి మధ్య ఏ మాటలు ఉండవు. అలాగని అతని ప్రేమలో ఏ లోపం ఉండదు.

***

గాఢనిద్రలో ఉన్న యామినికి, ఫోన్ రింగవటంతో మెలకువ వచ్చింది. విసుగ్గా పక్కనే ఉన్న ఫోన్ తీసుకుని చూసింది. కస్టమర్ కాల్. కట్ చేసి టైం చూసింది. సాయంత్రం ఐదు.

లేచి ఏ.సీ ఆఫ్ చేసి, విండో కర్టెన్ తొలగించి చూసింది. ఎండాకాలం కావటంతో ఐదుగంటలయినా ఎండవేడమి ఇంకా తగ్గలేదు. అంత ఎండలోనూ భర్త భార్గవ్ దీక్షగా

తన పని చేసుకుపోతున్నాడు. కాంపౌండ్ వాల్ గేటునుంచి ఇంటిగుమ్మం వరకు వేసిన రాళ్లకి అక్కడక్కడ సిమెంటుపోతే సిమెంటు వేస్తున్నాడు. మేస్త్రీని పిలవచ్చుగా అంటే, 'ఇంత చిన్నపనికి వాళ్ళని పిలవటం అవసరమా! నే చేస్తాలే' అంటాడు. రూం తలుపు తీసుకుని కింద హాల్లోకి వచ్చి సోఫాలో కూర్చుంది. హాల్లోని షోకేస్లో ఒక ఎమ్. ఎన్.సీ.లో బెస్ట్ ఎంప్లాయీగా తను అందుకున్న అవార్డులు తనని చూసి నవ్వుతున్నట్లు అనిపిస్తున్నది.

ఏం సాధించింది తను? నెలక్రితం దీప్తి అన్న మాటలకి తనలో రేగిన అశాంతి నిన్న కూతురు అడిగిన ప్రశ్నతో తుఫానుగా మారి మనసును అల్లకల్లోలం చేస్తున్నది. తల్లిగా తను ఓడిపోయిందా? మళ్ళీ గతం నెమరువేసుకోసాగింది.

***

భార్గవ్‌తో చెప్పింది తన నిర్ణయం. పాపని స్కూల్లో చేర్పించారు. అత్తగారు, మామగారు పెద్దవాళ్ళు అయిపోయారు. వాళ్ళకి భారం కాకూడదని బాబుని చూసుకోవటానికి ఒకపిల్లను ఇంట్లోనే ఉండేట్లు ఏర్పాటుచేసింది. నెలకి ఒకసారి తను బయటకు వెళ్ళాల్సివచ్చేది. వారం రోజులు, రెండు వారాలు, ఒకొక్కసారి నెల టూర్ ఉంటుండేది. మొదట్లో ఏడ్చినా, క్రమేణా పిల్లలకీ అలవాటు అయింది. పిల్లలమీద తనప్రేమ వాళ్ళకి ఖరీదైన వస్తువులు, డ్రెసెస్ కొనటంలో చూపించేది. పిల్లలు పెద్దవాళ్ళు అయినారు. అత్తగారు, మామగారు చనిపోయారు. సహజంగానే పిల్లలిద్దరూ భార్గవ్‌కి బాగా దగ్గరయ్యారు. ముఖ్యంగా కూతురు. అలాగని తనంటే ప్రేమలేదని కాదు. తను టూర్ నుంచి రాగానే ఆరోజు అసలు తనని ఒక్కపని చేయనీయదు. 'అమ్మా, బాగా అలసిపోయి ఉంటావు రెస్టుతీసుకో.' అని తనకి సేవలు చేస్తుంది. ప్రతిరోజూ రాత్రిపూట తనే వంటచేసి పెడుతుంది. తమ్ముడుకి తను లేనప్పుడు తల్లే అయ్యేది. అసలు అనన్య పెద్దదయ్యాక తను నిశ్చింతగా ఉద్యోగం చేసుకోసాగింది. కానీ, ఏదైనా సమస్య ఉన్నా, ఏదైనా కావాలన్నా తండ్రిని అడిగినంత చనువుగా తనని అడగదు.

అనన్య బీ.టెక్. ఫైనల్ ఇయర్‌కి వచ్చినప్పుడు తను అడిగింది ఎమ్. ఎస్ చేయటానికి కోచింగ్‌కి వెళ్ళమని. తనకి ఇష్టంలేదు అని, అసలు తనకి జాబ్ చేయటం కూడా ఇష్టంలేదని నిర్మొహమాటంగా చెప్పినప్పుడు తనకి పట్టరాని కోపం వచ్చింది. భార్గవ్‌మీద అరిచింది 'నీ పెంపకంలో దాన్ని వంటింటి కుందేలులా చేశావు' అని.

బీ.టెక్ కాగానే భార్గవ్ పట్టుదలతో సంబంధాలు చూడటం మొదలుపెట్టాడు. పెద్ద కష్టపడాల్సిన పనిలేకుండా దూరపు బంధువుల్లో మంచి సంబంధం దొరికింది. అబ్బాయి యు.కే.లోజాబ్.

'నాన్నా, నీకు ఇష్టమేనా. నీవు ఓ.కే.అంటే నేను చేసుకుంటాను.' సంబంధం గురించి

చెప్పగానే అనన్య అన్నమాటతో మొదటిసారి తనలో అంతర్మథనం మొదలయింది. భర్త, పిల్లలు తనని పరాయిదానిలా చూస్తున్నారు అనే భావన కలిగింది.

పెళ్లికాగానే భర్తతో కలసి యు.కే. వెళ్తున్నప్పుడు తండ్రిని పట్టుకొని అనన్య ఏడుస్తుంటే, ఎప్పుడూ స్థితప్రజ్ఞుడిలా ఉండే భార్గవ్ కళ్ళలో నీరు తిరగటం చూసి అందరి మనసులు భారమయ్యాయి. తనతో 'అమ్మా, నాన్న జాగ్రత్త.' అన్నప్పుడు, మొదటిసారి తను అమెరికా వెళ్లినప్పుడు అనన్యను భార్గవ్ చేతిలో పెడుతూ తనన్న ఇదేమాట గుర్తొచ్చి, కూతురిలో తల్లిహృదయాన్ని చూసింది.

**అనునయంగా స్నేహితురాలు భుజం మీద చెయ్యి వేసి, 'ఇప్పుడు నీవు ఇలా ఆలోచించటం గతజల సేతు బంధనంలా ఉంది. నీ మనసుకి తెలుసు నీవు ఇప్పుడు అన్న మాటలు, ఆరోపణలు ఎంత అర్థం లేనివో. భార్గవ్ నీ నిర్ణయం నీవు తీసుకొనే స్వేచ్ఛ నీకు ఇచ్చాడు. భర్తగా నీ అభిప్రాయాలను గౌరవించాడు.**

అనన్య పెళ్లిఅయిన ఏడాదికి బాబుఎమ్మెస్ చేయటానికి అమెరికా వెళ్ళాడు. తనిక ఇండియాకే పరిమితమైంది. అనన్య నెలతప్పింది అన్నమాట విని భార్గవ్ చంటిపిల్లాడిలా గంతులేసాడు. తనకి కూడా తన కూతురు తల్లి కాబోతోంది అంటే అనిర్వచనీయమైన ఆనందం కలిగింది. తను ఇక లీవ్ అప్లై చేసుకోవాలి. అప్పటికప్పుడు లీవ్ అంటే కష్టం.

నిన్న వీడియోకాల్లో మాట్లాడుతూ, 'నాన్నా, మీకు అమ్మకి టికెట్స్ నాకు ఏడోనెల రాగానే బుక్ చేస్తాను. అమ్మా, నీకు వీలైతే నాన్నతోరా, లేదంటే కనీసం డెలివరీ టైంకి వచ్చేట్టుగా ప్లాన్ చేసుకోగలుగుతావా?' అడిగింది.

చాచి మొహంమీద కొట్టినట్లు అయింది. మౌనంగా లేచి వచ్చింది. కూతురు ఇంకా ఏదో మాట్లాడుతున్నది. తనని, తమ్ముడుని ఎలా ఆడించాడో అలాగే తన పిల్లలని కూడాఆడించాలని, అనన్య అంటుంటే భార్గవ్ పరవశంతో వింటున్నాడు.

***

భార్గవ్ లోపలికి వచ్చాడు. నిన్న అనన్య అన్న మాటలను పదేపదే గుర్తుచేసుకుంటూ పరధ్యానంగా ఉన్న యామినిని చూసి, తనే వెళ్ళి ఇద్దరికీ కాఫీ కలిపితెచ్చాడు. చేతలే తప్ప అతను ఎక్కువ మాట్లాడడు. ఆమెకు మనసు బాగాలేనప్పుడు, గుర్తొస్తుంది ఆమె స్నేహితురాలు ప్రసన్న.వెంటనే ఫోన్ చేసి, 'ఫ్రీగా ఉన్నావా, వద్దామనుకుంటున్నా.' అడిగింది.

ఇద్దరూ మంచి ఫ్రెండ్స్. మనసు బాగాలేనప్పుడో లేక ఏదైనా సలహాకోసమో ఫోన్

**కథలు చెపుతూ జోకొట్టి నిదురబుచ్చాడు.వాళ్ళ హోంవర్క్ చేయిస్తూ ఉపాధ్యాయుడైనాడు. ఆడించాడు, లాలించాడు. అంతేకాదు పనఅమ్మాయి రాకపోతే గిన్నెలు కడిగేవాడు, ఇల్లు తుడుచుకున్నాడు. సర్వం తనే అయినాడు. ఇన్ని చేస్తూ తన ఉద్యోగ బాధ్యతలు నిర్వహించేవాడు. తన విధినిర్వహణలో ఏ చికాకులు వచ్చినా పిల్లలని నిర్లక్ష్యం చేయలేదు.**

చేస్తే అడిగే ప్రశ్న అది. 'ఖాళీగానే ఉన్నా, రా.' అనగానే భర్తకి చెప్పి వెళ్ళింది. యామిని వచ్చి కూర్చోగానే, 'ఏమిటి విషయం? ఆమెకూడా ఏ అనవసర ప్రశ్నలు వేయకుండా అడిగింది.

'జీవితంలో ఏదో సాధించాలన్న తపనతో ఎన్నో అనుభూతులు పోగొట్టుకున్నాను అనిపిస్తోంది.' అంటూ దీప్తి, తనకూతురు ఇద్దరు అన్నమాటలు, ఈమధ్య తనలో రేగుతున్న ఘర్షణ చెప్పి, 'నేను పిల్లలు ఏదడిగితే అదిచ్చాను. కానీ వాళ్ళు ఎందుకో నాకు దగ్గర కాలేదు. నా ఉద్యోగధర్మంగా నేను వాళ్ళకి దూరంగా ఉండాల్సి వచ్చినప్పుడు ఎంత క్షోభ అనుభవించానో అర్థం చేసుకోవటం లేదు .నా కుటుంబాన్ని, నా సరదాలు అన్నీ త్యాగం చేశాను. అసలు నేను ఆ రోజుభార్గవ్‌ని సలహా అడిగాను. నీదే నిర్ణయం అన్నాడు. తను వద్దు అని ఉంటే బాగుండేది. తను అలా అనలేదు. చివరికి ఒంటరిదాన్ని అయ్యాను.' మొదటిసారి యామిని కంటనీరు పెట్టటం చూసింది ప్రసన్న.

అనునయంగా స్నేహితురాలు భుజంమీద చెయ్యివేసి, 'ఇప్పుడు నీవు ఇలా ఆలోచించటం గతజల సేతుబంధనంలా ఉంది. నీ మనసుకి తెలుసు నీవు ఇప్పుడు అన్నమాటలు, ఆరోపణలు ఎంత అర్థం లేనివో. భార్గవ్ నీ నిర్ణయం నీవు తీసుకొనే స్వేచ్ఛ నీకు ఇచ్చాడు. భర్తగా నీ అభిప్రాయాలను గౌరవించాడు. నీవు ఆరోజు తల్లిగా కంటే బాధ్యతగల ఉద్యోగిగా ఆలోచించావు. నిజానికి అన్ని విషయాలను నాతో పంచుకొనే నీవు నన్ను అప్పుడు సలహా అడగలేదు. ఎందుకంటే నీ నిర్ణయం కాదంటానేమో అని. ఇక, నీవన్న ఇంకోమాట 'త్యాగం' అని. నీకు కోపం వచ్చినా సరే, నీ కెరీర్లోనే ఆనందాన్ని వెతుక్కోవాలి అనుకున్న నీవు త్యాగం అనే మాటను వాడటంలో అర్థం లేదు. తప్పని పరిస్థితులలో, రెండోఆప్షన్ లేనప్పుడు చేసేపని త్యాగం అవుతుంది. నీకు ప్రమోషన్ తర్వాత వచ్చేదేమో! నీవు స్వచ్ఛందంగా ఎన్నుకున్న మార్గం అది. మూడో విషయం తల్లితోడు అవసరం అయిన సమయంలో, నీవు వాళ్ళకి దూరంగా ఉన్నావు. పిల్లలు వాళ్ళ ఆనందాలు, బాధలు అన్నీ తల్లితో షేర్ చేసుకోవాలి అనుకుంటారు. నీవు నీకు వీలైనప్పుడు వీకెండ్స్ వాళ్ళతో కలసి షాపింగ్స్‌అనీ,

మూవీస్‌కనీ వెళ్ళేదానివి. అది వాళ్ళు ఎంజాయ్ చేశారు. కానీ, మానసికంగా దగ్గర కాలేకపోయినారు. భార్గవ్ వాళ్ళకి తల్లీ, తండ్రి తనే అయినాడు. వాళ్ళకి స్నానం చేయించాడు. గోరుముద్దలు తినిపించాడు. కథలు చెపుతూ జోకొట్టి నిదురబుచ్చాడు.వాళ్ళ హోంవర్క్ చేయిస్తూ ఉపాధ్యాయుడైనాడు. ఆడించాడు, లాలించాడు. అంతేకాదు పనఅమ్మాయి రాకపోతే గిన్నెలు కడిగేవాడు, ఇల్లు తుడుచుకున్నాడు. సర్వం తనే అయినాడు. ఇన్ని చేస్తూ తన ఉద్యోగ బాధ్యతలు నిర్వహించేవాడు. తన విధినిర్వహణలో ఏ చికాకులు వచ్చినా పిల్లలని నిర్లక్ష్యం చేయలేదు. కానీ ఏనాడూ అతను వీటిని త్యాగం అనుకోలేదు. నా బాధ్యత అని కూడా అనుకోలేదు. తన కుటుంబాన్ని ప్రేమించాడు అంతే. కాబట్టే పిల్లలు అతనికి దగ్గరైనారు. యామినీ, ఇప్పటికీ మించిపోయింది లేదు. అనన్య నీకు ఒక అవకాశం ఇచ్చింది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని తల్లిగా తృప్తిని పొందు.' ప్రసన్న మాటలతో తేలికపడిన మనసుతో ఇంటికివస్తూనే కూతురుకి వీడియో కాల్ చేసి, 'అమ్మలూ, నేను నాన్నతో పాటుగా వస్తాను.' యామినిమాట పూర్తికాకముందే అనన్య, 'ఏమండీ, అమ్మకూడా వస్తున్నదండీ. మా అమ్మ వస్తుందిట.' అంటూ గట్టిగా అరిచి భర్తకి చెప్పింది.

కూతురు కళ్ళలో కనపడ్డ మెరుపు యామిని మనసులో చీకట్లను తొలగించింది.

***

# కృష్ణ కుమారి

పీ. వీ. యస్. కృష్ణ కుమారి. తుర్కయాంజాల్ లోని శ్రీవాణి మోడల్ హైస్కూల్ ప్రిన్సిపాల్అండ్ కరస్పాండెంట. 2018 నుంచి ఉషోదయ వెలుగు , పాలపిట్ట మ్యాగజైన్ లతో పాటు వేర్వేరు వేదికల్లో 40కి పైగా కథలు రాశారు. నమస్తే తెలంగాణ ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం వారు ప్రచురిస్తున్న,'కథ2020' లో నా కథ ప్రచురిస్తున్నందుకు ఆనందంగా ఉంది'.

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 373

# అమ్మ కడుపు చల్లగా

**శ్రీమతి పీవీ శేషరత్నం**
**94929 25291**

పనిమనిషి సుబ్బులు సింక్‌లో ఉన్న గిన్నెలన్నీ తోమేసి వంటింట్లో పాత్రలు పెట్టుకునే అరల్లో చక్కగా సర్దేసింది. గ్యాస్ పొయ్యి ప్రక్కనే తనకోసం అమ్మగారు మూత పెట్టి ఉంచిన చిన్న స్టీలుగిన్నెను చూసి 'సుగాత్రి అమ్మగారు ఎంత మంచోరో!' అని మురిసిపోయింది.

ఇందాక రాగానే 'ఈ మధ్యన ఏం తిన్నా సయించడం లేదమ్మా. నోరంతా అదోలా అయి పోయింది' అని చెప్తే నవ్వింది ఆమ్మగారు.

'నీళోసుకున్నావుకదా సుబ్బులూ.. ఈ సమయంలో అలానే ఉంటుందిలే. నిన్ననే మాఅమ్మ తమ్ముడితో పాత మాగాయ, పాత నిమ్మకాయ పచ్చడి పంపించింది. నువ్వు గిన్నెలు తోమి బోర్లించేలోగా చిన్న గిన్నెలోకి నిమ్మకాయ పచ్చడి తీసి ఉంచుతాను. తీసుకెళ్తువుగాని. వేడివేడి అన్నంలో కలుపుకుని తింటే నోటికి అరుచి పోతుందిలే' అంది.

అప్పుడే తనకోసం తీసి పెట్టడం కూడా అయిపోయిందన్నమాట 'ఎల్గొత్తాను. తలుపేసుకోండమ్మా!'అని అమ్మగారికి చెప్పడానికి హాల్లోకి వెళ్లిన సుబ్బులు అరమోడ్పు కళ్లతో తన్మయంగా ఆనందంగా కూతురికి పాలిస్తున్న సుగాత్రిని చూసి అలాగే విస్మయంగా చూస్తూండి పోయింది.

ఎవరో తననే తధేకంగా చూస్తున్నట్టనిపించి సుగాత్రి కళ్లు తెరచి సుబ్బులుని చూసి నవ్వులు చిందిస్తూ 'ఏంటలా చూస్తున్నావు ! ఓ నెల కళ్లు మూసుకున్నావంటే నీకూ ఇలాంటి భాగ్యం కలుగుతుందిలే' అంది.

తన పొట్టకేసి ఆనందంగా చూసుకుంటూ సుబ్బులు సిగ్గుపడుతూనే అడిగింది. 'బిడ్డకు పాలిస్తూంటే అంత ఆనందంగా ఉంటుందా అమ్మా! నేను ఇక్కడికి వచ్చి పది నిమిసాలయినా మీరు నన్ను చూడనే లేదు'

‘అవును సుబ్బులూ! బిడ్డకు పాలివ్వడం మాతృమూర్తికి ఓ వరం అనుకో.. అంతేనా, తల్లి ప్రేమనంతా రంగరించి ఇచ్చే అమ్మపాలు బిడ్డకు అమృతంలాంటివి తెలుసా? అందులోనూ బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలలో రోగనిరోధక శక్తి ఉండి అవి పిల్లలను విరేచనాలు, వాంతులు, జలుబు జ్వరాలనుండి కాపాడుతాయి’

మీకెన్ని సంగతులు తెలుసమ్మా!’ ఆశ్చర్యంగా చెంపన చెయ్యేసుకుని వింది సుబ్బులు.

**సుబ్బులు ఆరాటం చూసి సుగాత్రి కళ్లు చెమర్చాయి. బిడ్డ కడుపున పడినదగ్గరనుంచీ పుట్టబోయే వాడి గురించి తల్లికి ఎన్ని మధురమైన స్వప్నాలు వస్తాయో ఆమెకు తెలియనిది కాదు.**

సుబ్బులు కంటె సుగాత్రి ఐదారేళ్లు చిన్నదే అయినా చదువుకున్న యువతి కావడంతో గర్భవతిగా ఉన్న సుబ్బులుకి అవకాశం దొరికినపుడల్లా ఏదో ఒక కొత్త విషయం చెబుతూనే ఉంటుంది. కుంటిసాకులతో పనికి నాగాలు పెట్టదు సుబ్బులు. పైగా బిడ్డతల్లి అయిన తను ఒక్కతీ పనులు చేసుకోలేదని తమకీ వాళ్లకీ కూడా కరోనా మహమ్మారి సోకకుండా తను చెప్పిన జాగ్రత్తలన్నీ పాటించే సుబ్బులంటే సుగాత్రికి ఎంతో అభిమానం.

పిల్లలంటే సుబ్బులుకి ఎంత ఇష్టమో! పెళ్లయిన ఏడేళ్లకి కడుపు పండబోతోంది. అందుకే ఎంతో అపురూపంగా తన పొట్టని తాకుతూ అడిగింది.

‘మీదగ్గర దాపరికమెందుకుగాని నాకు మాత్రం ఎప్పుడెపుడు మీలా నా బిడ్డను ఒళ్లో పెట్టుకుని పాలిస్తానా అని ఆత్రంగా ఉందమ్మా!’

సుబ్బులు ఆరాటం చూసి సుగాత్రి కళ్లు చెమర్చాయి. బిడ్డ కడుపున పడిన దగ్గరనుంచీ పుట్టబోయే వాడి గురించి తల్లికి ఎన్ని మధురమైన స్వప్నాలు వస్తాయో ఆమెకు తెలియనిది కాదు.

‘ఊ..ఊ.. కబుర్లు బాగానే నేర్చావుగాని త్వరగా ఇంటికెళ్లు. ఇవాళ మీ మావ లారీ డ్యూటీ దిగి వస్తాడన్నావుకదా! చిలకా గోరింకల్లా పుట్టబోయే బాబు గురించి ఇద్దరూ తెల్లవార్లూ కబుర్లు చెప్పుకోండి’

‘పోండమ్మా మీరు మరీను. ఆడికి ఈమద్దిన నాకంటె కూడా పుట్టబోయే బిడ్డమీదే పేమ ఎక్కువయిపోయింది. ఎప్పుడూ బిడ్డ ఊసే! ఇదివరకయితే సుబ్బులూ నీకోసం ఎర్రగాజులు తెచ్చానే అనో లేకపోతే దారిలో తాటిముంజులు కొన్నానే అనో చెప్పేవోడు’

**సూదిమందంటే మహా చెడ్డ భయమేమో అల్లంత దూరంనుండి డాక్టరమ్మని గమనించగానే చేతుల్లో చెమటలు పట్టాయి సుబ్బులుకి. 'నాకేటో గుండెల్లో గుబులవుతోంది మావా!'**

అంది సుబ్బులు.

ఎరుపెక్కిన సుబ్బులు చెక్కిళ్లు చూసి మనసారా నవ్వుకుంటూ 'అన్నట్టు రేపు పొద్దుట 'మదర్' ఆసుపత్రిలో మళ్లీ పరీక్ష చేయించడానికి మీమావ తీసుకెళ్తానన్నాడన్నావుకదా! పొద్దుటే రాకు. రేపు సాయంత్రం వచ్చి తోముదువు గానిలే' అంది సుగాత్రి.

'మీలాగే ఆ కోమలి డాౖక్టరమ్మగోరు కూడా ఎంత మంచోరో! మాలాటి పేదోల్లకి పైసా తీసుకోరు సరికదా ఎల్లినపుడల్లా పళ్లు, పాలు, మందులు ఊరికే ఇత్తన్నారమ్మా' అంటూ మూతికి కట్టుకున్న మాస్కుని సర్దుకుంటూ ఊరగాయ గిన్నె తీసుకుని వెళ్లిపోయింది సుబ్బులు.

***

పొద్దుటే తయారయి పెనిమిటి రాజయ్యతో కలిసి ఆసుపత్రికి వచ్చేసి బయట బెంచీ మీద డాక్టరు కోసం ఎదురు చూస్తోంది సుబ్బులు. మూతికి రంగురంగుల గుడ్డలు కట్టుకున్న తనలాంటి సూలింతలను, వాళ్లకు తోడు వచ్చినవాళ్లను చూసి భారంగా నిట్టూర్చింది.

'మాయదారి కరోనా ఎప్పుడు వదిలిపోతుందోగానీ ఈ మూతి గుడ్డ కట్టుకుంటే ఊపిరి తియ్యడం ఎంత కట్టమో!' అనుకుంది.

'ఏంటే సుబ్బులూ! కూచోలేకపోతున్నావా? డాక్టరమ్మగారు రౌండ్లు కెల్లారంట. ఇంకో పావుగంటలో వచ్చేస్తారని కాంపౌండరుబాబు చెప్పాడు' అన్నాడు రాజయ్య సుబ్బులు ఆపసోపాలు పడడం చూసి.

'అబ్బో ఇదంతా నీ కొడుకు మీద ప్రేమే!' మోచేత్తో మొగుణ్ణి పొడిచింది సుబ్బులు ముసిముసిగా నవ్వుతూ. 'ఊరుకోయే.. నీకు మాత్రం ఏం తక్కువ సేసాను?' అన్న రాజయ్యతో 'ఏమో మావా! నీకు నాకంటే నాకడుపులోని నీ బిడ్డమీదే ఎక్కువ ప్రేమ అనిపిత్తోంది' కొంటెతనం తొంగిచూసింది సుబ్బులు మాటల్లో.

'నిజం చెప్పు నీకు మాత్రం ఆడంటే ప్రేమ లేదూ? రోజూ నిద్దర లేవగానే అద్దంకాడ నిలబడి పొట్ట ఎంత పెరిగిందా అని సూసుకుంటావు కదా!నేను గమనిత్తూనే ఉన్నాలే'

'పో మావా! అయితే నిద్దర వంకతో నువ్వు దొంగసూపులు సూత్తన్నావన్నమాట. అయినాగానీ ఇదివరకు నేను ఎంత గోలెట్టినా ఇంటిపట్టున ఉండేవోడివా సెప్పు?'

'నన్నేటి చెయ్యమంటావే. లారీ డ్రయివరు ఉద్యోగం.. వారం రోజులు బయట తిరిగితే రెండు రోజులు ఇంట్లో ఉంటాను. అది లేకపోతే మనకి బతుకు గడిచేదెట్టాగే సుబ్బులూ?'

'నాకు తెలవదా ఏటి మావా? పెళ్లయిన ఏడేళ్లకి మనకీ నలుసు కడుపున పడ్డాడు. ఆడిని ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఇద్దరికీ ఉంది'

'అవునే.. డూటీ దిగాక ఇన్నాల్లూ పులిసిపోయిన ఒంటినెప్పులు తగ్గేదాకా ఇంటికొచ్చిన రెండ్రోజులూ ఎప్పుడూ నిద్రపోతూనే ఉండేవోడినా? ఇప్పుడేమో నీ కడుపులో ఉన్న మనోడితో ఊసులాడాలని ఇంటికొచ్చినా నాకు నిద్దరే రాటం లేదు'

సూదిమందంటే మాచెడ్డ భయమేమో అల్లంత దూరంనుండి డాక్టరమ్మని గమనించగానే చేతుల్లో చెమటలు పట్టాయి సుబ్బులుకి. 'నాకేటో గుండెల్లో గుబులవుతోంది మావా!'

'ఛ ఊరుకో.. ఇయాల పేషెంట్లు తక్కువగా ఉన్నారు. మన అదురుట్టం అని నేననుకుంటా ఉంటే నీకెందుకే బయం. సూదిమందు ఇచ్చేటపుడు నేను నీ పక్కనే ఉంటానుగా'

సుబ్బులు నీళోసుకున్ననాటినుంచీ అపుడే నాలుగైదుసార్లు వచ్చారేమో డాక్టరు కోమలి వాళ్లను చూసి మెత్తగా నవ్వింది. 'ఏం రాజయ్యా.. ఎలా ఉన్నాడు నీ

రాబోయే కొడుకు?' 'అంతా తమ దయ డాక్టరమ్మా' అన్నాడు రాజయ్య వినయంగా. 'దండాలు డాట్టరమ్మా!' భయంభయంగా నమస్కారం పెట్టింది సుబ్బులు. లోపల అప్పటికే ఒక ఆంగ్లో ఇండియన్ జంట లేచి డాక్టరుతో కరచాలనం చేయబోయి ఆగి నమస్కారం చేశారు. కోమలి నవ్వి చెప్పింది. 'దటీజ్ గుడ్ మిస్టర్ రాబర్ట్ అండ్ బ్లెస్సీ!'

వాళ్లు ఆసక్తిగా చూస్తుంటే సిగ్గుపడుతున్న సుబ్బులుని వాళ్లకు పరిచయం చేస్తున్నట్టు 'షి ఈజ్ కంప్లీటింగ్ నైన్ మంత్!' అంటూనే డాక్టర్ కోమలి 'ఏం సుబ్బులూ! కాస్త చిక్కినట్టున్నావే. ఈ మధ్య కనబడనే లేదు. ప్రతినెలా పరీక్ష చేయించుకోవాలని చెప్పానా లేదా? ఏం రాజయ్యా!' అంది మందలింపుగా.

డాక్టరమ్మ భర్తను చివాట్లేస్తుందేమోనని వెంటనే అడ్డుకుంది సుబ్బులు. 'అబ్బే, మావ తప్పేం లేదమ్మా! జొరం నీరసమేనని నేనే మావకి సెప్పలేదు డాక్టరమ్మా!'

'ఈ రోజుల్లో చిన్న జ్వరాన్ని కూడా అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. రాజయ్యా.. నేను కొన్ని పరీక్షలు రాస్తాను. పక్క బిల్డింగులో అవి చేయించి తీసుకురా. మందులు రాస్తాను. సుబ్బులూ! ఇదిగో నీ కొడుకు పనసపండులా ఉండాలంటే ఈలోగా ఈ ఐరను మాత్రలు, కాల్షియం మాత్రలూ క్రమం తప్పకుండా వేసుకోవాలి.

అర్థమయిందా?' సాలోచనగా అంది డాక్టర్ కోమలి నిండుకుండలా ఉన్న సుబ్బులుతో.

మాత్రలనగానే బెదురుపోయి హుషారొచ్చింది సుబ్బులుకి. 'మాత్రలు ఎన్నయినా మింగేత్తానమ్మా. సూదిమందంటేనే నాకు బయం' 'అవును డాక్టరమ్మా... అసలు కొన్నాల్ల కితం ఇంజెచ్చను సూత్తేనే కల్లు తిరిగి పడిపోయేది ఈ పిచ్చిది' 'కడుపులో బిడ్డ కోసం ఏది అవసరమయితే అది భరించాల్సిందే. ఏమంటావు సుబ్బులూ?'

'మామావకి నేనంటే ఎటకారం డాక్టరమ్మా. నేను పండంటి బిడ్డని కని మామావ సేతిలో ఎట్టడంకోసం ఎన్ని సూదిమందులయినా బరించేత్తానమ్మా!'

సుబ్బులు అమాయకపు తల్లి హృదయానికి సంతోషించింది డాక్టరు కోమలి. 'అదీ అలాగుండాలి. ఆ.. రాజయ్యా ఈ రక్తపరీక్ష చేయించి ఆ రిపోర్టులు వచ్చాక రేపు సుబ్బులుని తీసుకురా. ఇదిగో నువ్వు కూడా ఈ పరీక్షలు చేయించుకుని రా'

'అలాగేనమ్మా!' భక్తిగా చీటీ పట్టుకుని వెళ్తున్న దంపతులకేసి జాలిగా చూసింది డాక్టరు కోమలి. ఎందుకోగాని ఆమె మదిలో ఏదో అనుమానం రూపుదిద్దుకుంది. తర్వాత ముచ్చటైన జంటను చూసి సంతృప్తిగా తలలూపుతున్న రాబర్టు దంపతులతో మాట్లాడి వాళ్ల అనుమానాలు తీర్చింది.

***

'సుబ్బులూ! నువ్విక్కడే కూచో. నేను డాక్టరమ్మగారితో మాట్లాడి వత్తాను'

ముందురోజు మళ్లీ తనని వెనక్కి పిలిచి డాక్టరు కోమలి ఆదేశించినట్టు తనని బయటే కూర్చోబెట్టి రిపోర్టు కాగితాలతో లోపలి కెళ్తున్న భర్తను ఆపింది సుబ్బులు నీరసంగా.

'అదేటి మావా.. కడుపులో బిడ్డ ఉన్నది నాకయితే నువ్వా పరీచ్చలు సేయించుకుంటన్నావు. నాకు బయమేత్తోంది'

'నీకు పెతీదానికీ బయమేనే! మనబిడ్డ సల్లగా ఉండడం మనకు కావాలి అంతేగాని ఊరికే దిగులు పడకు. నువ్వికక్డే కూచో.. డాట్టరమ్మ పిలిచాక వద్దువుగాని'

'ఏటో ఈ పెద్దమనిసి. కొడుకును తలుసుకుని తలుసుకుని మతిగానీ పోయిందో ఏటో?' తనలో తనే గొణుక్కుని కరోనా భయంతో ముందు జాగ్రత్తగా దూరదూరంగా కూర్చున్న తక్కిన పేషంట్లను పరిశీలించడంలో మునిగిపోయింది సుబ్బులు.

'అబ్బా! ఎంతమంది తల్లులూ పిల్లలూనో! పుట్టిన బిడ్డలు జొరాలతో దగ్గులతో తెగ ఏడుత్తున్నారు' పిల్లల ఏడుపులకు సుబ్బులు మనసు కదిలిపోతోంది.

'దండాలు డాక్టరమ్మా!' లోపలకి వచ్చి తనకు నమస్కరించిన రాజయ్య తెచ్చిన రిపోర్టులను పరీక్షగా ఒకటికి రెండుసార్లు చూసింది డాక్టరు కోమలి.

'ఇదేటి డాట్టరమ్మా నాకూ రకత పరీచ్చలు రాసారు. మా సుబ్బులు ఒకటే ఏలాకోలం.

'ఇది వేళాకోళం వ్యవహారం కాదు రాజయ్యా.. కాస్త సీరియస్ వ్యవహారమే. నీకు

ఈ మధ్య జ్వరం దగ్గు వచ్చాయికదూ?' రాజయ్యకేసి సూటిగా చూసింది కోమలి.

'అవును డ్యూటీమీద ఎల్లినపుడు జొరం వచ్చి తగ్గిపోయిందమ్మా! పదేనురోజులు పైనే అయింది' రాజయ్య కళ్లల్లో బెదురు. 'అందుకే అనుమానంతో పరీక్షలు రాశాను. మీయిద్దరికీ కరోనా సోకినట్టుగా ఈ రిపోర్టుల్లో ఉంది' రాజయ్య రెండు చేతుల్లోను మొహం దాచుకుని ఏడ్చేసాడు చిన్నపిల్లాడిలా.

'అలా అధైర్యపడకు రాజయ్యా! కరోనా వచ్చినంత మాత్రాన చచ్చిపోరు. వెంటనే ఇద్దరూ ఆసుపత్రిలో చేరి మందులు వాడితే తగ్గిపోతుంది'

'మాదగ్గర అంత డబ్బులేదు తల్లీ!' 'మదర్ ఆసుపత్రి ఇలాంటివారికోసమే.. పైగా సుబ్బులంటే నాకు ప్రత్యేకమైన అభిమానం. కరోనా అంటువ్యాధి అని నీకూ తెలుసుకదా!' 'మరి మా బిడ్డకి కూడా ఇది వచ్చేస్తుందా డాట్టరమ్మా!' రాజయ్య గొంతులో ఈసారి వణుకు. 'ప్రసవం సమయంలో తల్లినుంచి బిడ్డకు సోకే అవకాశం ఉంటుంది. పాలిచ్చేతల్లినుండి కూడా రావచ్చు'

'డాట్టరమ్మా! బిడ్డకు పాలివ్వాలని మా పిచ్చి సుబ్బులు ఎన్ని కలలు కంటోందోనమ్మా! ఈ మాట వింటే సచ్చిపోతుందని బయమేత్తోందమ్మా' అని రెండు చేతుల్లో మొహం దాచుకుని బావురుమన్నాడు రాజయ్య.

'నీకా భయం అక్కర్లేదు. బిడ్డ ప్రాణం కోసం తల్లి ఎంతటి త్యాగానికయినా సిద్ధపడుతుంది. కష్టమొచ్చినపుడే ధైర్యంగా నిలదొక్కుకుంటే అది ఎంతటిదైనా జయించవచ్చు. సరే !ఇప్పుడు నువ్వు ఇంటికి వెళ్లి నెమ్మదిగా సుబ్బులుకి ఈ విషయం చెప్పి నచ్చజెప్పి తీసుకురా. మీ పుట్టబోయే బిడ్డ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో నేను తనకి నెమ్మదిగా అర్థమయేలా వివరిస్తాను'

***

సుబ్బులు ముఖంలోకి చూసింది డాక్టర్ కోమలి. విషయం ఎంత బాధాకరమో ఆమెకు తెలియనిది కాదు.

'దండాలు డాక్టరమ్మా!'

సుబ్బులు తన కంఠంలో బేలతనంతో పాటు బలవంతాన బాధను దిగమ్రింగుకున్నట్టు తెలుస్తోంది. బిడ్డ భవిష్యత్తే ఎక్కువ కలచి వేస్తోందనే విషయాన్ని ఆమె ముఖంలోని భావాలను బట్టి గ్రహించేసింది అనుభవజ్ఞురాలయిన డాక్టర్ కోమలి.

'రా సుబ్బులూ!' ఆ పిలుపులోని ఆప్యాయతకు ఏడుపొచ్చేసింది సుబ్బులుకి. కన్నీరు మున్నీరయిపోయింది. 'నా అదురుట్టం ఎలా తిరగబడిపోయిందో సూడండమ్మా.. ఇన్నాల్లూ పెల్లయి ఏడేల్లు దాటినా బిడ్డలు పుట్టలేదే అని పిల్లల కోసం ఎన్నో గుళ్లూ గోపురాలు తిరిగాం. కనిపించిన చెట్టుకీ, పుట్టలకు ఎన్నో మొక్కులు

మొక్కాను. నెల తప్పగానే దేవుడు నామొర ఆలకించాడు కనకనే నాకు బిడ్డనిత్తున్నాడు అని పొంగిపోయాను. నా అంత అదురుట్టవంతురాలు లేదనుకున్నాను. కాని ఏజనమలో పాపమో మాయిద్దరికీ ఈ మాయదారి జబ్బు పట్టుకుంటుందనుకోలేదు డాట్టరమ్మా!'

'ఊరుకో.. ఇలాంటప్పుడే ధైర్యం తెచ్చుకోవాలి. బాధపడి ప్రయోజనమేమిటి?'

'నేను బాధపడేది నాకీ పాడు జబ్బు వచ్చిందని కాదమ్మా. నేను సచ్చిపోయినా పర్లేదు, నా బిడ్డ మాత్రం సల్లగా ఉండాలి తల్లీ. నాబిడ్డకీ ఈ పాడు జబ్బు వత్తుందేమోనని మావకీ నాకూ రేత్రి అంతా కునుకు లేదమ్మా!'

'జరిగిపోయినదానికి విచారించడం కంటే జరగబోయేది ఆలోచించడం మేలుకదా. ఈ వ్యాధి నీనుండి నీ బిడ్డకి సోకకుండా ఎట్టి పరిస్థితుల్లోను ఆసుపత్రిలోనే నీ ప్రసవమవాలి సుమా... అలాగయితేనే నీ పురిటి సమయంలో మేమూ జాగ్రత్తలు తీసుకోగలుగుతాం. నువ్వు నిశ్చింతగా ఉండు'

'నువ్వే మాపాలిటి దేవతవమ్మా. ఎలాగయినా నాబిడ్డ బతికితే అంతేసాలు మాకు'

'అలాగే.. అన్నీ నేను చూసుకుంటాగా. మందులన్నీ జాగ్రత్తగా వాడితేనే ఈ జబ్బు నీ కొడుక్కి రాకుండా ఉంటుంది. మరి కొన్ని సూదిమందులు కూడా..'

సుబ్బులు చేతులెత్తి మొక్కి 'నువ్వు నిప్పుల్లో దూకమన్నా దూకుతానమ్మా. నా ఒల్లు తూట్లు పొడిచినా పరవాలేదు. నాబిడ్డని కాపాడండి. అదే పదివేలు' 'అలాగే సుబ్బులూ! భారం నామీద పెట్టావుగా ఇంక అన్నీ నాకు వదిలెయ్'

అంతకు ముందు లేడిపిల్లలా హుషారుగా ఉండే సుబ్బులు బెడ్ మీద సర్వం కోల్పోయినదానిలా పడుకోవడం చూసి గాఢంగా నిట్టూర్చింది డాక్టర్ కోమలి.

***

'సుబ్బులూ! నీకో శుభవార్త' కాళ్లు చేతులు ఆడిస్తున్న బాబును సుబ్బులుకి చూపిస్తూ అంది డాక్టర్ కోమలి. సుబ్బులు నీరసంగా నవ్వింది.

'పండంటి బిడ్డని మా చేతిలో పెట్టారు. పొద్దుటేలనుండి మామావ కొడుకుని సూసుకుని ఎంత సంబరపడిపోతన్నాడో. ఇంక ఇప్పుడే తను చచ్చిపోయినా పరవాలేదంటున్నాడమ్మా. నాకూ అలాగే ఉంది. బిడ్డను కళ్లారా చూసుకున్నదానికంటె శుభవార్త మాకే ఏముంటుందమ్మా?'

'అలాక్కాదు సుబ్బులూ! నీకొడుకు చాలా అదృష్టవంతుడు. నువ్వు వాడిన మందుల కారణంగా వాడికి ప్రసవసమయంలో కరోనా సోకలేదని ఇపుడే పెద్ద డాక్టరుగారు చెప్పారు'

సుబ్బులు ముఖంలో వెలుగు. 'అయితే ఇకముందు కూడా మాబాబుకి కరోనా

రాదుకదమ్మా?' 'అది మాత్రం నీ చేతిలోనే ఉంది'

'నా చిట్టితండ్రి కోసం ఎంతయినా కష్టం బరిత్తాను తల్లీ! అయితే బిడ్డను తాకాలని, ఒళ్లోకి తీసుకోవాలని తపించిపోతున్నాను డాట్టరమ్మా! కాని పాపిట్టిదాన్ని నా పాడు సేతుల్తో ముట్టుకుంటే నా బాబుకి ఆ పాడు జబ్బు సోకుతుందేమోనని అడిలిపోతున్నాను'

సుబ్బులు కళ్లవెంబడి ధారగా కన్నీరు పైటను తడిపేస్తోంది. ఆ మాతృహృదయం పడుతున్న క్షోభ అర్థమయింది కోమలికి.

'బిడ్డ కడుపున పడింది మొదలు నాకు ఒక్కటే కోరిక తల్లీ.. ఒక్కసారి నా బిడ్డను తనివితీరా గుండెలకు హత్తుకుని నా నెత్తురును పాలగా మార్చి వాడి ఆకలి తీరితే ఆ తరవాత నేను కన్ను మూసేసినా నాకేం బాధ లేదమ్మా!'

సుబ్బులు పైట పాలధారతో తడిసిపోతోంది. సుబ్బులుకి తెలివొచ్చింది. కళ్లు తెరిచి కొడుకు కోసం పక్కను తడుముకుంది. బాబు కనిపించలేదు. ఇదంతా కలా? కలలో తనబాబు ఎంత ముద్దుగా ఉన్నాడు? 'సుబ్బులూ!' రాజయ్య గొంతులో విషాదానికి భయమేసింది సుబ్బులుకి. 'సుబ్బులూ బాగా తెలివొచ్చిందా? నాకేసి చూడు' డాక్టర్ కోమలి కంఠం ఆమెను ఈలోకంలో పడేసింది. 'ఇలాంటప్పుడే బాగా ధైర్యంగా ఉండాలి సుబ్బులూ! బాబుకి కూడా కరోనా సోకింది. ఎంత ప్రయత్నించినా కాపాడలేకపోయాం' సుబ్బులు పిచ్చిపట్టినదానిలా కోమలికేసి చూసి ఒక్క ఉదుటున లేవబోయింది. 'లేవకు.. కుట్లు కదిలిపోతాయి. నీకింకా బోలెడు వయసుంది. మళ్లీ నువ్వు తప్పకుండా తల్లివవుతావు' డాక్టర్ కోమలి మాటలు సుబ్బులు చెవినబడడం లేదు. తన బాబు చచ్చిపోయాడా? 'బాబూ!' ఆమె మాతృహృదయం తల్లడిల్లిపోతోంది. రాజయ్య నోట్లో గుడ్డ కుక్కుకుని విలపిస్తున్నాడు. సుబ్బులు భుజం తట్టి వెనుదిరిగిన డాక్టర్ కోమలి సుగాత్రి చేతిలోని పసిబిడ్డని చూసి త్రాచుపామును చూసినట్టు చేష్టలుడిగిపోయింది. 'డాక్టర్ కోమలీ! ఈ పసివాడేనా చనిపోయారని చెబుతున్నారు సుబ్బులుతో?'

సుగాత్రి మాట విన్న సుబ్బులు నాగస్వరం విన్న నాగుపాములా మంచం దిగి పరుగున సుగాత్రి చేతిలోని బిడ్డను అందుకుని గుండెలకు హత్తుకుంది. కొడుకును ముద్దులతో ముంచెత్తింది.

'సుబ్బులూ! నువ్వు ఎప్పటికప్పుడు ఈ డాక్టరు చెప్పిన విషయాలను నాకు చెప్పడం ఎంతో మంచిదయింది. నీకు రాజయ్యకు కరోనా అని చెప్పగానే అనుమానం కూడా వచ్చింది. ఎందుకంటే కరోనా పరీక్షలకు అనుమతించిన ఆసుపత్రులలో మదర్ ఆసుపత్రి లేదని నాకు తెలుసు. ఎక్కడో ఏదో గూడుపుఠాణీ జరుగుతోందని

పోలీసాఫీసరయిన మావారికి చెప్పాను. ఏడాది క్రితమే ఈ ఊళ్లో వెలసిన మదర్ ఆసుపత్రి మీద అప్పటికే అనుమానాలయితే వచ్చాయిగాని ఇంతవరకు ఆధారాలు దొరకలేదని చెప్పి నీద్వారా ప్రయోగం చేశారు పోలీసులు'

సుగాత్రి వెనుకే ఆంగ్లో ఇండియన్ దంపతులతో పోలీసులు రావడంతో డాక్టర్ కోమలి కంగుతింది.

'ఉచితం పేరుతో మీలాంటి అమాయకులు, నిరక్షరాస్యులయిన పాతికమంది దంపతులను ఆకర్షించి ఏదో సాకుతో ప్రసవం వేళకు మదర్ ఆసుపత్రిలో చేరుస్తోంది కోమలి. మీకు బిడ్డలు చనిపోయారని చెబుతూ సంతానం కోసం అర్రులు చాచే దంపతుల నుండి లక్షలకు లక్షలు వసూలు చేసి మీ బిడ్డలను వాళ్లకు అమ్మేస్తున్నారు. ఇదంతా ఓ పెద్ద ముఠా.. ఇదిగో నీ బిడ్డను బేరం పెట్టింది వీళ్లకే'

సుబ్బులు, రాజయ్య నోళ్లు తెరిచేసారు. 'డాట్టరమ్మ ఎంత ప్రేమ కురిపించి తమని బుట్టలో పడేసింది?' ఆంగ్లో ఇండియన్లను చూడగానే వాళ్లిద్దరికీ గుర్తొచ్చింది. 'అవును. ఆరోజు పరీక్షలు చేయించుకోవడానికి వచ్చినపుడు డాక్టరమ్మ వీళ్లకి తమని చూపించి ఇంగ్లీషులో మాట్లాడింది' సుబ్బులు కళ్లు ఎర్రబడ్డాయి. రాజయ్య గుప్పిళ్లు బిగుసుకున్నాయి. కానీ అప్పటికే ఆసుపత్రి మొత్తంగాలించి రికార్డులు స్వాధీనం చేసుకున్న పోలీసులు డాక్టర్ కోమలి చేతికి బేడీలు వేశారు.

బాబుని గట్టిగా గుండెలకు హత్తేసుకున్న సుబ్బులు ఒంటిలోకి ధైర్యాన్ని ప్రవహింపజేసేలా ఆమె భుజం తట్టింది సుగాత్రి. 'కొడుకు పట్ల ఇపుడు నీ బాధ్యత మరింత పెరిగింది సుబ్బులూ!'

సుబ్బులులో భయం తొంగిచూసింది. 'కరోనా రావడంవల్ల నాపాలు కూడా నాబిడ్డకి విషమైపోతాయంటారా అమ్మగోరూ! పాలివ్వనులెండి. నా కోరిక కంటే కూడా అమ్మగా నాకు నా బిడ్డ పదికాలాలు ఆరోగ్యంగా బతకాలనేదే ముఖ్యమమ్మా!'

ఆ మాటలంటున్నపుడు గొంతు గాద్గదికమయినా ఆమె ముఖంలో విచారపు ఛాయలు లేవు. ఆమె కళ్లలో బిడ్డ భవిష్యత్తు పట్ల దృఢమైన దీక్ష, పట్టుదల కనిపిస్తున్నాయి.

సుగాత్రికి సుబ్బులు నిర్ణయానికి కళ్లు చెమర్చాయి. బిడ్డ కడుపున పడ్డప్పటినుంచి.. తన గుండెల్లోని రక్తాన్ని పాలగా మార్చి ఆ అమృతధారను వాడి నోటికి ఎప్పుడెప్పుడు అందిద్దామా అని సుబ్బులు ఎంతగా తపస్సు చేసిందో అమెకు తెలుసు.

'ఏతల్లికైనా బిడ్డకు స్తన్యమిస్తేనే జన్మ ధన్యమైనట్టు అనిపిస్తుందనే విషయం బిడ్డ తల్లిని నాకంటె ఎవరికి తెలుసు. ఎక్కువ చదువుకోకపోయినా తల్లి అనే మాటకే శాశ్వతమైన అర్థాన్నిచ్చావు సుబ్బులూ! నువ్వు ఇంక ఏవిధమైన దిగులు పెట్టుకోకుండా

నీకొడుకును గుండెల్లో పెట్టుకుని..'

'కానీ నాకు కరోనా..?'

సుగాత్రి నవ్వింది. 'నీకే కాదు, రాజయ్యకూ కరోనా లేదు. అదంతా మీరిద్దరూ తనపట్టులోనే ఉండేందుకు మీ నుండి బిడ్డను దూరం చేసేందుకు డాక్టరు కోమలి కల్పించిన మాయరోగం'

'పేణం పోసేవోల్లు డాక్టర్లుగానీ తీసేవోల్లు డాక్టరేంటమ్మా? మీపున్నెమా అని మాబాబు మాకు దక్కాడు. ఆవిడది తల్లి మనసు అయితే మా బాధ ఆవిడకు తెలిసేది'

సుబ్బులు మాటలకు భారంగా నిట్టూర్చింది సుగాత్రి. అవును నిజమే. మాతృమూర్తి అంటే అనంతమైన ప్రేమ, బాధల బరువు, విషాదం, నిరాశ, నిస్పృహ, త్యాగం అన్నీ కలగలసిన రూపం.

సుగాత్రికి సోదరి నివేదిక వాక్యాలు గుర్తొచ్చాయి.

*'A yearning love that can never refuse us, a benediction that forever abide with us, a presence from which we cannot go away, a heart in which we are always safe, sweetness unfathomed, bond unbreakable, holiness without a shadowall these indeed and more is Motherhood'*

***

## పి. వి.శేషారత్నం

శేషారత్నం పుట్టింది రాజమండ్రి. తెలుగు సాహిత్యంలో ఎం.ఎ. జర్నలిజంలో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో చేశారు.

ఆకాశవాణి హైదరాబాద్ విశాఖపట్నం కేంద్రాల్లో వ్యాఖ్యాత్రిగా 40 ఏళ్ల పని చేశారు. మాతృ సంస్థ న్యూఢిల్లీ ప్రసార భారతి ఆల్ ఇండియా రేడియో వారిచే 'జీవని' 'గంగజాతర ' నాటకీకరణలకు ప్రథమ బహుమతులు అందుకున్నారు. ఇప్పటి వరకు 10 కథా సంకలనాలు పన్నెండు నవలలు వెలువరించారు.

# ఊషర క్షేత్రం

**పోతుబరి వెంకట రమణ**
**87906 39446**

'మంచివారి స్నేహం'లా నీడలు పొడుగ్గా సాగుతున్నాయి. కంకర రోడ్డు మీదుగా లేచిన 'గోధూళి' ఎర్రగా పరచుకుంటోంది. 'రావోయ్! పార్థసారధి రా రా !' అంటూ కుర్చీ చూపించి,

'ఏమోయ్! సారధి వచ్చాడు కాఫీ పెట్టు' అని లోనికి కేకేసాడు లక్ష్మీపతి.

'అన్నయ్యా! బావున్నారా? ఎవరన్నా ఇంటికొస్తే చిన్న పిల్లాడైపోతారనుకో' పైటచెంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చింది వసుంధర.

'ఆ అది ఇంకోసారి కాఫీ తాగొచ్చని చెల్లెమ్మా' నవ్వుతూ మేళమాడాడు సారధి.

'ఊరుకోవోయ్! మరీను. ఏదో నాలుగిళ్లవతల నుండి కష్టపడి మేనీడ్చుకొచ్చి అలసిపోయావని కాఫీ ఇద్దామనుకుంటే నువ్వు మీ చెల్లెమ్మ పక్షాన చేరిపోయావు' మూతి బిగించి అన్నాడు లక్ష్మీపతి.

'సరేలెండి! మీ ఇద్దరికీ ఎప్పుడూ ఉన్నదేగా' అని నవ్వుతూ లోనికెళ్ళింది వసుంధర.

'ఆc. ఏంటోయ్! నిన్న మంచి వర్షం పడిందిగా. ఉదయం పొలంవేపు ఏమన్నా వెళ్లావా?' 'వర్షం అంటే వర్షమా! రెండు 'మడికట్ల వాన' పడింది. కానీ ఏం లాభం? ఒక్కచుక్క నిలబడలేదు. అంతా క్రిందికే పోయింది. ఈ ఊరి గ్రహచారమే అంత' సారధి మాటలలో నైరాశ్యం తొంగిచూసింది.

‘ఎందుకంత బాధ పడతావు? మన ఒక్కరి పొలాలే కాదు, ఊరంతా అలానే ఉంది కదా!’ ‘అవునురా పతీ! దశాబ్దాలుగా ఇలానే ఉంది. ఎదుగూ బొదుగూ లేకుండా ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లుగా’ మరింత విరక్తితో అన్నాడు సారధి.

‘దీని భౌగోళిక పరిస్థితికి మనమేం చేయగలం చెప్పు’ అది ఓదార్పో..లేక నిరాశో మరి.

‘అన్నయ్యా.. కళ్యాణ్ ఫోన్ చేస్తున్నాడా ?’ కాఫీ కప్పు అందిస్తూ అడిగింది వసుంధర. ‘చేస్తున్నాడమ్మా. ఏమిటో ఈ పరుగులు? ఒక్కగానొక్క కొడుకు.. వందలమైళ్ళ దూరం. వాళ్లిక్కడకు రాలేరు. మనం అక్కడ ఇమడలేం’ చేతులు పైకెత్తుతూ దీర్ఘంగా నిట్టూర్చాడు సారధి.

‘వాళ్ళు గొప్పోళ్లురా! మనం సంతలో వంకాయలు కొనే కంట్రీబ్రూట్స్‌మి. వాళ్ళు మాల్స్‌లో బ్రింజాల్స్ కొనే కల్చర్డ్ పీపుల్. వాళ్ళకళ్లకి మనమేం ఆనతాం చెప్పు’ ఆవేదన వెళ్లగక్కాడు లక్ష్మీపతి.

‘సర్లేరా! మనిద్దరివీ రైలు పట్టాల్లా సమాంతరంగా సాగిన జీవితాలు. ఇద్దరం ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి, ఇక్కడే చదువుకున్నాం. ఉద్యోగం పేరుతో నువ్వు, కాంట్రాక్టర్ అవతారం ఎత్తి, నేను పట్టణాల బాట పట్టాం. మన ఆశల్ని చంపుకొని, పిల్లల మీద ఆశలు పెంచుకొని వాళ్ళను మోసాం. రెక్కలొచ్చిన వాళ్లకు ఇప్పుడింక మన రెక్కల అవసరం లేదని ఎగిరిపోయారు. మనకి సాయంత్రం అయింది. భూమి గుండ్రంగా ఉంది అన్నట్లు మనం తిరిగి మన గూటికి చేరుకున్నాం ప్రశాంతంగా’ లక్ష్మీపతి గొంతులో కించిత్ బాధ తొణికిసలాడింది. ‘ఇదన్నయ్యా వరస.. మనకేం తక్కువ? బ్రతికినన్నాళ్లూ బతుకుతామా? కాలూ చెయ్యీ ఆడినంతవరకు ఒకరిమీద ఆధారపడ్డం ఎందుకు? కొడుకులు మనవాళ్ళైతే కోడళ్ళు మనవాళ్లు కాదుకదా’ పక్కనే తనూ ఓ కుర్చీలో కూచొని కాఫీ తాగుతూ అంది వసుంధర.

‘కోడళ్ళు వచ్చిన తరువాత కొడకులూ మనవాళ్లు కాదులే! చెల్లెమ్మా’ అలా అన్నప్పుడు ఓ శుష్క దరహాసం సారధి పెదవులమీద మెరిసి విరిగింది.

‘వాళ్ళు గొప్పోళ్లురా! మనం సంతలో వంకాయలు కొనే కంట్రీబ్రూట్స్‌మి. వాళ్ళు మాల్స్‌లో బ్రింజాల్స్ కొనే కల్చర్డ్ పీపుల్. వాళ్ళకళ్లకి మనమేం ఆనతాం చెప్పు’ ఆవేదన వెళ్లగక్కాడు లక్ష్మీపతి.

‘డోలు వచ్చి మద్దెలతో మొరపెట్టుకున్నట్లుంది రా పతీ!నీకు తెలీంది ఏముంది చెప్పు. ఎంత అపురూపంగా పెంచుకున్నాం పిల్లల్ని క్రమశిక్షణతో! అదే ఇప్పుడు చాదస్తమై

కూచుంది వాళ్ళకి. మనం ఉదయం ఐదింటికి లేచి రాత్రి తొమ్మిదింటికి మేను వాలుస్తాం. వాళ్ళు ఉదయం పది గంటలకు లేచి రాత్రి రెండు గంటలకు నిద్ర పోతారు. మనం పగలు పని చేస్తే వాళ్ళకు చిరాకు. వాళ్ళు రాత్రి పనిచేస్తే మనకు పరాకు. ఎంత సర్దుకుపోదామన్నా వాళ్ళతో 'రాజీ' మనకు 'నామా' లే కదా' సారధి ఎటో చూస్తూ అన్నాడు.

'సరేలేరా! జోగీ జోగీ రాసుకుంటే బూడిద రాలుతుంది' ఇంతకూ ఏదో చెబుదామని వచ్చినట్లున్నావు. చల్లకొచ్చి ముంత దాచటమెందుకు చెప్పు' నవ్వుతూ అన్నాడు లక్ష్మీపతి .

'మా ఇంట్లోనే రెండు ఆవులున్నాయిరా! నీ చల్ల నాకెందుకు? నువ్వు 'చల్ల' గుంటే అంతే చాలు' నవ్వుతూ అన్నాడు సారధి.

'చూసారా! కామయ్యా ముందా కయ్ కుయ్‌ఁలు అన్నట్లు మా అన్నయ్య ముందా మీ స్కిప్పింగ్‌లు?' అంది వస్తున్న నవ్వుని ఆపుకుంటూ వసుంధర.

'ఏం లేదురా పతీ.. ఇందాకే చెప్పాను కదా! ఉదయం పొలంకి వెళ్తే భూమి తడిగా ఉందిగానీ నీరు ఎక్కడా నిలబడలేదు. అంత వానా ఎక్కడికి పోయిందో మరి. ప్రాణం ఉసూరుమంటుంది. అసలే మానవుని అత్యాశ వలన, ప్రకృతిని ధ్వంసం చేయడం వలన వానలు తగ్గిపోతున్నాయి. కురిసిన వానచినుకు కూడా నిలవకుండా పోతోంది. అందుకే వలసలు పెరిగిపోయి, గ్రామాలు వెలవెలబోతున్నాయి. ఈ మధ్య వార్తాపత్రికలలోనూ, టి.వి.ల్లోనూ 'వాటర్ షెడ్' పథకాల గురించి, బయోగ్యాస్ పథకాల గురించి చూస్తున్నాం కదా! వాటిని మన గ్రామంలో అమలుపరచి, మనం ఏమన్నా అలా మన ఊరికి ఉపయోగపడగలమా! అని బుర్ర తొలిచేస్తుంటే నీ దగ్గరకు వచ్చాను. మన గ్రామానికి మనం ఏదో ఒకటి చెయ్యాలిరా. ఇప్పుడు పట్టణాలలో బ్రతుకులు మాత్రం ఏమంత బాగుంటున్నాయి? కడుపాత్రం కొద్దీ వలసపోయినవాళ్లు ఏం బావుకుంటున్నారు? ఎటు చూసినా కాలుష్యం, అరకొర పనులు, చాలీచాలని బతుకులు. మనతరం ఎలాగూ అయిపోయింది. తరువాత తరాలైనా వలసల బారిన పడకుండా ఏమీ చేయలేమా? మన జీవిత సాయంసంధ్యని ఈ గ్రామ

**'సర్లేరా! మనిద్దరివీ రైలు పట్టాల్లా సమాంతరంగా సాగిన జీవితాలు. ఇద్దరం ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి, ఇక్కడే చదువుకున్నాం. ఉద్యోగం పేరుతో నువ్వు, కాంట్రాక్టర్ అవతారం ఎత్తి, నేను పట్టణాల బాట పట్టాం.**

ఉదయసంధ్యగా మార్చలేమా? అవసరమైతే నా ఆస్తి మొత్తాన్ని ఖర్చుచేయడానికి సిద్ధమే' సారథి ప్రతిమాటలోనూ ఆవేదన, గ్రామంపట్ల ఆరాధన లక్ష్మీపతిని కుదిపేస్తున్నాయి.

'అవునండీ! పుట్టిపెరిగిన ఊరికి సేవ చేసే అదృష్టం ఎవరికోగానీ రాదు. అది మన ఊరికి మనమే ఎందుకు కాకూడదూ? మనకి ఎలాగూ ఇక్కడ చెయ్యాల్సిన పనులు ఏమీ లేవు. పిల్లలు ప్రయోజకులై లక్షలు సంపాదిస్తున్నారు. ఇక మన సంపాదన ఊరికే ఇసుకలో నీళ్ళులా ఇంకిపోకుండా ఊరికి ఉపయోగపడితే పేరు నిలుస్తుంది. ఇక్కడ ఊరికే ఉండేబదులు ఊరికి మేలుచేయడం గొప్ప కదూ!' అంది వసుంధర మెరిసే కళ్లతో.

మౌనంగా ఆలోచిస్తూ తల పంకించాడు లక్ష్మీపతి. నిశ్చలంగా ఉన్న చెఱువులో రాయి పడింది. సారథి వెళ్ళిపోయినా ఆలోచనలు సుడులు తిరుగుతూనే ఉన్నాయి. 'ఆ పల్లెటూరిలో ఏముంది డాడీ? ఎప్పుడూ కలవరిస్తుంటారు?' కొడుకు సుదర్శన్ ఈసడింపు చెవులలో మోగుతోంది. 'గ్రామానికి ఏదోఒకటి చెయ్యాలిరా' సారథి పరివేదన. 'పుట్టిన ఊరికి సేవ చేసే అదృష్టం అందరికీ రాదు' వసుంధర ప్రోత్సాహం.

భోజనం చేసిన తరువాత తన లాప్‌టాప్ తెరిచాడు. రాత్రంతా ఆలోచనలలో పరిభ్రమిస్తూనే ఉన్నాడు. తొలకరి నుండి కురుస్తున్న వర్షాలతో భూమి ఆకుపచ్చ తివాచీ పరచుకొంది. మెత్తని గడ్డి పాదాలకి మృదువుగా తగులుతోంది. లక్ష్మీపతి, పార్థసారథి పాత జ్ఞాపకాలను తవ్వుకుంటూ పొలం గట్ల వెంట తిరుగుతున్నారు. పంచాయతీ ప్రెసిడెంట్ మహలక్ష్మి నాయుడు, నీటిపారుదల ఏ.ఈ. మాధవరావు మరికొంతమంది గ్రామపెద్దలు వారితో మధ్యమధ్యలో ఏవేవో గుణించుకుంటూ చర్చలు సాగిస్తూ నడుస్తున్నారు. మాధవరావు వాననీరు నేలపై కాలువలుగా మారి విడిచిన నీటి జాడలను గమనిస్తూ నడుస్తున్నాడు.

ఉదయం ప్రారంభమైన వారినడక మధ్యాహ్నం ఒక గమ్యానికి చేర్చింది. ఆలోచనలు ఒక రూపానికి ఆకారాన్ని కూర్చసాగాయి. దారిలో మైదానంగా మారిన చేలలో ఊరి యువకులు సీరియస్‌గా క్రికెట్ ఆడేస్తున్నారు. మధ్యలో నడుస్తున్న వీళ్లని చూసి కొద్దిసేపు ఆట ఆపి మళ్లీ తమ ఆటలో మునిగిపోయారు.

అందరూ పంచాయితీ కార్యాలయ భవనానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి గ్రామపెద్దలు చేరారు. అందరినీ ఉద్దేశించి పార్థసారథి మాట్లాడటం మొదలుపెట్టాడు.

'అందరికీ నమస్కారం. మీ అందరికీ తెలుసు మనందరం ఇప్పుడు ఇక్కడ ఎందుకు సమావేశమైనామో. మన గ్రామానికి అనేక సమస్యలున్నాయి. ముఖ్యంగా నీటి సమస్య. దేనికైనా ఒక కాలం (టైమ్ ) అంటూ ఉంటుంది. ఇప్పుడు ఆ టైమ్ మన గ్రామానికి

వచ్చిందని అనుకొంటున్నాను. ఆధునిక పద్ధతులను ఉపయోగించుకొని, వినూత్నంగా ఆలోచిస్తూ చౌడుబారిన ఊషర క్షేత్రాలను కూడా సస్యశ్యామలం చేసుకుంటున్నాయి చాలా గ్రామాలు. మరి మనం మన గ్రామానికి ఏం చేయలేమా? అని లక్ష్మీపతితో నా ఆలోచనలను పంచుకున్నాను. ఇద్దరమూ లాప్‌టాప్ ముందు కూర్చొని 'వాటర్ షెడ్' పథకాల గురించి పరిశోధించాం. ఆ తరువాత ప్రెసిడెంట్ మహాలక్ష్మీ నాయుడుతో కలిసి జిల్లా కేంద్రానికి వెళ్ళి నీటిపారుదల శాఖని సంప్రదించాం. మన ఉత్సాహాన్ని గుర్తించి ఈ రంగంలో నిపుణులైన మాధవరావుని పంపారు. గ్రామ నైసర్గిక పరిస్థితులు దృష్టిలో పెట్టుకొని ఒక 'రూట్ మేప్'ని తయారు చేశాం. అందరి సహకారంతో మన గ్రామాన్ని ఒక ఆదర్శ గ్రామంగా మలచుకుందాం' ఉద్వేగంగా చెప్పాడు సారధి.

తరువాత మరికొన్ని విషయాలు చర్చించి కార్యాచరణ ప్రణాళికను తయారుచేసుకున్నారు. ఆ సమావేశం అక్కడున్న అందరిలోనూ నూతన ఉత్తేజం కలిగించింది. మబ్బు తెరల చాటు నుండి సూర్యుడు ఒక్కసారి తళుక్కుమన్నాడు.

ఒక్క అడుగు.. గ్రామ ప్రగతివైపు..

గ్రామంలో చైతన్యం రాజుకుంది. మాధవరావు సూచనల ప్రకారం వాన నీరు నిలవడానికి అనువైనచోట కందకాలు తవ్వి, గట్లు కట్టారు. ఇళ్లలో కూడా ఇంకుడు గుంతలు తీయించారు.

ఊరిలో ఓ కొత్త ఉత్తేజం కదనుతొక్కుతోంది. ఓ రోజు సాయంత్రం లక్ష్మీపతి, పార్థసారధి ఏదో విషయాన్ని చర్చించుకొంటున్నారు కాఫీ తాగుతూ.

అదే సమయంలో కొంతమంది యువకులతో కలసి వచ్చాడు గ్రామపెద్ద పురుషోత్తమరెడ్డి కొడుకు శ్రీహరి .

'ఏంటోయ్ శ్రీహరి! ఈరోజు క్రికెట్ ఆటకి వెళ్ళలేదా? అందరూ కలసి ఇటొచ్చారు?' చిరునవ్వుతో అన్నాడు మూర్తి.

'ఆ ఆట ఎప్పుడూ ఉండేదే అంకుల్. మీతో మాట్లాడదామనే వచ్చాం' అన్నాడు శ్రీహరి .

'అవునండీ.. పాతికేళ్లు ఊరికి దూరంగా ఉండి వచ్చిన మీరే గ్రామం గురించి ఇంత పాటుపడుతుంటే పాతికేళ్లుగా గ్రామంలో ఉండి కూడా ఏమీ పట్టనట్లు మా ఆటలు మేం ఆడుకోవటం గిల్టీగా అనిపిస్తుంది. మేం కూడా మీతో చేయి కలుపుతాం. చెప్పండి ఏం చేయాలో' ఆవేశంగా అన్నాడు మురహరి.

'మీలో ఈ ఆలోచన వచ్చినందుకు సంతోషం అబ్బాయిలూ! చేయీ చేయీ కలిస్తే ఏదైనా సాధించొచ్చు' అన్నాడు లక్ష్మీపతి.

'సార్.. మీరు రైతుల గురించి ఆలోచిస్తున్నారు బాగుంది. అలాగే మన ఊరి

గ్రంథాలయాన్ని కూడా పునరుద్ధరిస్తే మేం ఊరికే ఊసుపోని ఆటలు మాని పోటీపరీక్షలకు ప్రిపేర్ అవుతాం' అన్నాడో యువకుడు ఆవేదనతో.

'అవును సార్.. స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంటే మాకు కంబైండ్ స్టడీకి, డిస్కషనల్స్‌కి ఉపయోగపడుతుంది' ఇంకో యువకుని అభ్యర్థన.

'మరి మన ఊరి గ్రంథాలయానికి భవనం లేకనే కదా.. పంచాయితీ కార్యాలయంలో ఒక మూల గదిలో పెట్టారు?' అనుమానం వ్యక్తం చేశాడు లక్ష్మీపతి. 'అవును సార్. అదేకదా మా బాధ. అసలే ఆ గది చీకటి గుయ్యారంలా ఉంటుంది. దానికితోడు ఎప్పుడూ ఎవరో ఒకరు వస్తూపోతూనే ఉంటారు. ఇంక ఏకాగ్రత ఏం ఉంటుంది?' నిరాసక్తంగా అన్నాడు శైలేష్.

**'అవునండీ! పాతికేళ్ళు ఊరికి దూరంగా ఉండి వచ్చిన మీరే గ్రామం గురించి ఇంత పాటుపడుతుంటే పాతికేళ్ళుగా గ్రామంలో ఉండి కూడా ఏమీ పట్టనట్లు మా ఆటలు మేం ఆడుకోవటం గిల్టీగా అనిపిస్తుంది. మేం కూడా మీతో చేయి కలుపుతాం. చెప్పండి ఏం చేయాలో?' ఆవేశంగా అన్నాడు మురహరి.**

'ఏం చేద్దాం?' అన్నట్లు పార్థసారధి వైపు చూసాడు లక్ష్మీపతి.

'ఇదీ ఆలోచించాల్సిందే! సరే దానికి ఒక మార్గం చెబుతాను. మా ఇల్లు పై పోర్షన్ ఎలాగూ ఖాళీగా ఉంది. మావాడు వచ్చినప్పుడు తడుముకోకుండా ఉంటుందని కట్టించాను. వాడు ఎప్పుడో సంవత్సరానికోసారి వస్తాడు. అప్పటి సంగతి అప్పుడే చూసుకోవచ్చు. అందాక దాన్ని గ్రంథాలయం చేసుకుందాం. ఏమంటావు?' అప్పటికప్పుడే తన ఆలోచనను చెప్పాడు సారథి.

'సరే అయితే! అవసరమైన మోడిఫికేషన్స్ ఏమన్నా ఉంటే చేద్దాం' అన్నాడు లక్ష్మీపతి. యువకులందరూ చప్పట్లు కొట్టారు ఆనందంతో. మనసుంటే అదే మార్గాన్ని సూచిస్తుంది.

కావలసిన కుర్చీలు మొదలగు సరంజామా, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో పాటు జనరల్ నాలెడ్జ్, పిల్లల పుస్తకాలు కూడా కొలువయ్యాయి అక్కడ అందరి సహకారంతో. 'ఈ పయనం ఆగదు', 'ఆకాశం మన హద్దు', 'ఎవరో వస్తారని ఎదురు చూడొద్దు', 'నీ భవిత నీ చేతుల్లోనే'.. మొదలైన సూక్తులు గ్రంథాలయ గదిలో గోడలను అలంకరించి కర్తవ్యాన్ని గుర్తుచేస్తూనే ఉన్నాయి నిరంతరం. గ్రామాభ్యుదయంలో మరో అంకం చేరింది.

గ్రామంలో ఉన్న పాఠశాలలు కూడా జవసత్వాలు పుంజుకుని, చదువుల గుడులుగా మారాయి. ఎంత దూరప్రయాణానికైనా మొదటి అడుగే ముఖ్యం. అది పడిన తరువాత

గమ్యం అదే చేరువ అవుతుంది.

***

విజయం ఒక గమ్యం కాదు. విజయం ఒక ప్రయాణం ఆ యేడు వర్షం ఇబ్బడిముబ్బడిగా కురిసింది. అందరి చూపూ తాము చేపట్టిన 'వాటర్ షెడ్' పైనే. క్రమంగా హేమంతం నుండి శిశిరానికి మారింది. ఆశ్చర్యం! ఎప్పటిలా బోర్లు నోరు తెరచి బావురుమనలేదు. నీటి గలగలలు విన్పిస్తూ ఆనందాన్ని పంచుతున్నాయి 'శ్రమ యేవ జయతే!' ఒక స్వప్నం సాక్షాత్కారమైంది. వాటర్ షెడ్ ఫలించింది. అందరిలోనూ ఒకరకమైన ఉద్వేగం ఊసులాడ సాగింది. అదే సమయంలో ఓ నేషనల్ బ్యాంక్‌కి పి.ఓగా సెలక్ట్ అయ్యాడు శైలేష్. గేట్‌లో మంచి ర్యాంక్ తెచ్చుకుని ఐఐటీ సీటు సాధించాడు మురహరి. అంతే.. గ్రామ రూపురేఖలే మారిపోయాయి. యువకులలో 'మేమూ గెలుస్తాం' అన్న ఆత్మ స్థైర్యం పెరిగింది. రైతులలో 'తమ పొలాలు పండుతాయి' అనే నమ్మకం కలిగింది. ఆ యేడాదే శ్రీహరి అగ్రికల్చరల్ బి.యస్సీ. కోర్సు పూర్తయ్యింది .

**విజయం ఒక గమ్యం కాదు. విజయం ఒక ప్రయాణం ఆ యేడు వర్షం ఇబ్బడిముబ్బడిగా కురిసింది. అందరి చూపూ తాము చేపట్టిన 'వాటర్ షెడ్' పైనే. క్రమంగా హేమంతం నుండి శిశిరానికి మారింది. ఆశ్చర్యం! ఎప్పటిలా బోర్లు నోరు తెరచి బావురుమనలేదు.**

వ్యవసాయంలో వస్తున్న కొత్త కొత్త పద్ధతులను ఆకళింపు చేసుకొని తన గ్రామాన్నే ప్రయోగశాలగా మార్చుకున్నాడు.

అవసరమైన సహకారం అందించటానికి సారథి, లక్ష్మీపతి ఉండనే ఉన్నారు. 'మనం ఒకడుగు విజయంవైపు వేస్తే విజయం పదడుగులు మనవైపు వస్తుంది' ఎందుకూ పనికిరావనుకొన్న భూముల్లో ధాన్యపురాసులు కురుస్తున్నాయి.

***

ఉదయం పదిగంటలయ్యింది. ఎర్రని కంకర ధూళిని రేపుకుంటూ వచ్చిన ఇన్నోవా కారు పంచాయితీ కార్యాలయం ముందు ఆగింది.

కారుదిగిన వ్యక్తి సరాసరి ఎమ్మార్వో గదిలోకి దారితీశాడు. తలెత్తి చూసిన అధికారి ఒక్కసారిగా లేచి నిల్చొని తన సీటులోకి ఆహ్వానించి పక్కనే వినయంగా నిలుచున్నాడు.

ఆయన జిల్లా కలెక్టర్ ఆనంద కుమార్. చిన్న వయసులోనే ఉత్తమ కలెక్టర్‌గా

పేరుపొందిన వ్యక్తి. నెలలో ఒకరోజు మాత్రం ఎవరికీ చెప్పకుండా సడన్ విజిట్స్‌తో తనదైన శైలిలో పర్యటిస్తుంటారు. అలా ఈ గ్రామాన్ని ఈరోజు ఎంచుకున్నారు.

నిముషాలలో వార్త గ్రామమంతా పాకిపోయి, అరగంటలో ఊరిపెద్దలందరూ కార్యాలయానికి చేరుకున్నారు. 'జిల్లాలో మీ గ్రామం గురించి , స్వావలంబన కోసం మీ గ్రామస్థులంతా కలసి క(జ)ట్టుగా మీరు చేస్తున్న కార్యక్రమాలు గురించి విని ఈరోజు ఇక్కడకు వచ్చాను. కృష్ణార్జునులలా మీకు లక్ష్మీపతి, పార్థసారధులు లభించారు. చాలా సంతోషం. జిల్లా కలెక్టర్‌గా నానుండి మీరు ఏమైనా కోరుకుంటున్నారా చెప్పండి నాపరిధిలో అయితే వెంటనే చేస్తాను' హామీ ఇచ్చారు కలెక్టర్ ఆనంద కుమార్.

'కలెక్టర్ గారూ! ఇలా మీరు మా ఊరికి అనుకోని అతిథిగా రావడం మాకు ఎనలేని ఆనందాన్ని కలుగజేసింది. గ్రామానికి 'పాడి – పంట' రెండూ రెండు కళ్లులాంటివి. గ్రామస్థుల సహకారంతో చేపట్టిన 'వాటర్ షెడ్' ఫలించింది. దానికి పాడి పరిశ్రమ కూడా తోడైతే గ్రామం స్వావలంబన దిశగా ప్రగతి సాధిస్తుంది' నర్మగర్భంగా చెప్పాడు పార్థసారధి.

'యస్! యు ఆర్ రైట్! మీరు ఒక గ్రూపుగా ఏర్పడి ఒక సహకార సంఘం (మిల్క్ కో – ఆపరేటివ్ సొసైటీ) రిజిస్టర్ చేయండి. కొన్ని ఆవులు, గేదెలకు సబ్సిడీపై లోన్‌కి నా పరిధిలో నేను సహకరిస్తాను' అని హామీ ఇచ్చారు కలెక్టర్ ఆనంద కుమార్.

ఆరోజే 'గోపబాల పాల సహకార సంఘం' రిజిస్టర్ అయింది. కొద్దిరోజులలోనే కలెక్టర్ సహకారంతో ఆ కల కూడా సాకారమైంది. మిల్క్ కూలింగ్ సెంటర్‌ని ప్రారంభించడానికి పాడిపరిశ్రమల మంత్రి వచ్చారు. దారి పొడుగునా రేగుతున్న కంకరరోడ్డు ధూళి ఎర్రగా పరచుకోవడం మంత్రిగారికి చికాకు తెప్పించింది.

ప్రారంభోత్సవం జరిగిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో అదే విషయాన్ని ప్రస్తావించి గ్రామానికి తనవంతుగా బి.టి. రోడ్డు మంజూరు చేశారు.

***

'ఏమోయ్! సారధి వచ్చాడు. కాఫీ కలుపుతావేంటి' లోనికి కేకేసాడు లక్ష్మీపతి.

'చాల్లేవోయ్! నీకు కావాలనుకుంటే చెల్లెమ్మ కలపదా? ఊరికే పేరు నాది' నవ్వుతూ వచ్చి కూచున్నాడు పార్థసారధి .

'సరేలెండి మీ ఇద్దరికీ రోజు ఉన్నదేగా! కూచో అన్నయ్యా! అయిదు నిముషాల్లో తెస్తాను' లోనుంచే చెప్పింది వసుంధర.

'పతీ.. నాకెంతో ఆనందంగా ఉందిరా! ఒకప్పుడు ఈ ఊరి పేరు చెబితే పిల్లనివ్వడానికి కూడా జంకేవారు. ఇప్పుడు రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా కొనియాడబడుతోంది' సారధి సంతృప్తి నిండినకళ్ళతో అన్నాడు.

'నిజమే సారథీ! కానీ మన ప్రయాణం ఇక్కడితో ఆగకూడదు. డైరీలోని వ్యర్థాలతో 'గేస్ ప్లాంట్ ' అలాగే 'సోలార్ ప్లాంట్' ఏర్పాటు చేసుకొని కరంటు తెచ్చుకోవాలి. ఒక శీతల గిడ్డంగి నిర్మించుకుంటే మన పంటలను మనమే ధరవరుల నుండి, దళారుల నుండి రక్షించుకోవచ్చు..' లక్ష్మీపతి కళ్ళలో కలల మెరుపులు.

'అంకుల్ సరిగ్గా మా విజన్ కూడా అదే. మీ తోడ్పాటుతో అవన్నీ సాధిస్తాం' అన్నాడు మిత్రబృందంతో వచ్చిన శ్రీహరి. వారానికి ఒకసారైనా అందరూ కలసి చర్చించుకోవటం ఆనవాయితీగా మారింది.

'తథాస్తు.. సాయంకాలం ఆకాశంలో తథాస్తు దేవతలు తిరుగుతుంటారట. అప్పుడు తలచినవి నెరవేరాలని దీవిస్తారట' లోనుండి వచ్చిన వసుంధర అంది.

'మన జీవితాలకు సాయంత్రం అయింది' అనుకొని ప్రశాంతంగా గడుపుదామని ఇక్కడకు వచ్చాము' అన్నాడు లక్ష్మీపతి.

'కాదంకుల్! మీ రాక దైవనిర్ణయం' అన్నాడు శైలేష్. 'అవును! మీరాక గ్రామానికి మహోదయం' అన్నాడు మురహరి. 'ఈపయనం ఆగదు' అన్నాడు అప్పుడే వచ్చిన ప్రెసిడెంట్ మహలక్ష్మీ నాయుడు. జీవితం ఎప్పుడు ఎవరికి ఏమిస్తుందో ఎవరికి తెలుసు?

***

# పోతుబరి వెంకట రమణ

వెంకట రమణ స్వస్థలం విజయనగరం జిల్లా, సాలూరు. ఎంఏ సంస్కృతం, ఎంఏ తెలుగు చదివారు. జిల్లాపరిషత్ సంస్కృత పాఠశాల లో సంస్కృత పండితునిగా పన్నెండు సంవత్సరాలు పని చేశారు. తరువాత ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ గాను , ప్రిన్సిపాల్ గాను పనిచేసి 2018లో పదవీ విరమణ చేశారు. 1980 నుండి రచనారంగంలో ఉన్నారు. 60కి పైగా కథలు , ఒక నవల అచ్చువేశారు. 'నా రచనా వ్యాసంగం కుటుంబసభ్యుల ప్రోత్సాహంతోనే ముందుకు సాగుతోంది. బహుమతి ఇచ్చి ప్రోత్సహించిన నమస్తే తెలంగాణా పత్రికకు, ముల్కనూరు ప్రజా గ్రంథాలయానికి ధన్యవాదాలు'

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 392

# వానకారు కోయిల

**ఉమా మహేశ్ ఆచళ్ల**
**98493 03247**

ఆకాశం షార్ట్ హ్యాండ్ నేర్చుకుంటున్నట్టు వాన చినుకులు ఏటవాలుగా పడుతున్నాయి.

హాస్పిటల్ నాలుగో ఫ్లోర్ రూమ్ కిటికీలోంచి బయటకి దిగులుగా చూస్తున్నాడు రమణ. వర్షం వల్ల గూటికి చేరుకోలేకపోయిన ఓ పక్షి ఎదురు కిటికీ సన్‌షేడ్ మీద తడిసి ముద్దై వణుకుతోంది. మూడ్రోజులనించి పడుతున్న వానవల్ల అల్లాడుతున్న దాని బాధ ఎవరికీ పట్టదు. దానికీ తనకీ తేడా ఏమీ కనబడలేదా క్షణం రమణకి.

అతని తల్లిన రేపు డిశ్చార్జ్ చేస్తారన్న సంతోషంలో ఆదమరిచి నిద్రపోతోంది. ఆరు పురుళ్లలో పోయిన రక్తం పోగా, బతికిన ముగ్గురు పిల్లలకీ పంచిన రక్తం పంచగా, మిగిలిన కొద్దిపాటి రక్తం ఈ నాలుగురోజుల్లో అడపాదడపా టెస్టులు పేరు చెప్పి తీసేసిన నీరసం ఆమె మొహంలో కనబడుతోంది.

నాలుగురోజుల క్రితం కోమాలో కి వెళ్లిపోయిన మాణిక్యమ్మ అనూహ్యంగా కోలుకుంది. రేపే డిశ్చార్జ్. రమణ దిగులుకి అదే కారణం.

అంతలోనే పి.పి.ఈ కిట్‌లో డాక్టర్ వచ్చాడు. పేషెంట్ ఫుల్‌గా రికవర్ అవటంతో అతను చాలా సంతోషంగా ఉన్నాడు. డిశ్చార్జ్ సమ్మరీ తయారు చెయ్యమని నర్స్‌తో

చెబుతున్నప్పుడు రమణ నెమ్మదిగా 'డాక్టర్, ఇంకొక్క వారం రోజులు ఇక్కడే ఉంచితే మంచిది కదా. ఆవిడ పూర్తిగా కోలుకుంటుంది' అన్నాడు ప్రాధేయపడుతూ.

దానికి డాక్టర్ నవ్వి, 'చూడండి.. ఆవిడని తీసుకొచ్చిన కండిషన్ మీకు తెలుసు. నా పదిహేనేళ్ల సర్వీస్‌లో నాలుగొందల షుగర్, వన్ ఎయిటీ బై వన్ సిక్స్టీ బి.పి, బ్రెయిన్‌లో అక్యూట్ ఇంఫ్రాకట్స్ వల్ల ఆగకుండా వచ్చే ఫిట్స్ వంటి మల్టిపుల్ కాంప్లికేషన్స్ ఉన్న డెబ్బై ఐదేళ్ల పేషెంట్ కేవలం నాలుగు రోజుల్లో ఆల్మోస్ట్ నార్మల్‌కి రావటం ఇదే ఫస్ట్ టైం. అలాంటి పెద్దావిడని హ్యాపీగా ఇంటికి తీసుకెళ్లటం మానేసి ఈ పాండమిక్ సిట్యుయేషన్లో, కంటైన్మెంట్ జోన్‌లో ఉన్న హాస్పిటల్‌లో ఇంకో వారం ఉంచమంటున్నారు. యు బెటర్ బి ప్రౌడ్ ఆఫ్ హర్ విల్ పవర్ ఎట్ దిస్ ఏజ్ ' అంటూ మాణిక్యమ్మ వైపు తిరిగి, భుజం తట్టి 'ఏం పర్లేదమ్మా.. మీరు సెంచరీ కొడతారు. నెల్లాళ్ళకి మందులు రాస్తాను. ఆ తర్వాత నాకు వీడియో కాల్ చెయ్యండి చాలు' అంటూ నర్స్‌కి డిశ్చార్జ్ సమ్మరీ రెడీ చెయ్యమని చెప్పి వెళ్ళిపోయాడు.

డాక్టర్ వెళ్ళగానే మాణిక్యమ్మ హుషారుగా 'ఏరా ముందు అక్క వాళ్ళింటికెళ్లాలా లేక మీ ఇంటికెళ్లాలా? మీఇంటికొస్తే బావ కోప్పడతాడు. వాళ్ళింటికెళ్తే మీ ఆవిడ ఏమైనా అనుకుంటుంది. నువ్వే అలోచించి చెప్పు' అంది.

బదులుగా రమణ 'ఇంకా రేపటి వరకూ టైముంది కదా. చూద్దాంలే అమ్మా' అంటూ అటు తిరిగి పుస్తకం చదవసాగాడు ఇంక వినటం ఇష్టం లేదన్నట్టు. మాణిక్యమ్మ టి.వి చూస్తోంది పడుకుని.

రమణ కళ్ళల్లో నీళ్ళు నిండి అక్షరాలు కనబడ్డం లేదు. అతనికి గత నాలుగురోజులూ జరిగిన సంఘటనలు వరుసగా గుర్తొచ్చాయి.

* * *

అమ్మకి ఒంట్లో బాగుండటం లేదని అన్నయ్య చెప్పటంతో, ఓ పూట ఆఫీస్‌కి సెలవు పెట్టి భార్య రానంటే ఒంటరిగా బయల్దేరాడు రమణ.

'అమ్మా.. ఎవరొచ్చారో చూడు.' అన్నాడు హరిబాబు రమణని చూపించి. ఊగుతున్న తల తిప్పి, 'ఎవరూ?' అంది మాణిక్యమ్మ నెమ్మదిగా. రమణకి దుఃఖం పొంగుకొచ్చింది. 'అమ్మా.. నేను' అన్నాడు చెయ్యి పట్టుకుని. 'రమణా, నువ్వెప్పుడో మధ్యాన్నం వస్తావన్నారు అందుకే నువ్వనుకోలేదు. రా భోంచెయ్యి ముందు. మీ ఆవిడ ఏం టిఫిన్ పెట్టిందో పొద్దున్నే .. బ్రెడ్డు, జామా, ఓట్లా?' అంది రమణని తడుముతూ. 'తింటాలే, నీ ఆరోగ్యం ఎలా ఉంది?' అన్నాడు రమణ అమ్మనే తధేకంగా చూస్తూ. 'ఇదిగో ఇలా ఉంది' అంది ఊగుతున్న తలని ఏటో తిప్పుతూ. పెద్దకోడలికి చెప్పి చక్రపొంగలితో సహా రమణకి ఇష్టమైనవన్నీ చేయించింది. భోజనం చేస్తున్నంతసేపూ

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 394

మాణిక్యమ్మ రమణతో మాట్లాడుతూనే ఉంది.

భోజనాలయ్యాక అమ్మని కాసేపు పడుకోమని, అన్నయ్య వాటాలో కిందగదిలో మంచం మీద పడుకుని అన్నదమ్ములిద్దరూ కబుర్లలో పడ్డారు.

'అన్నయ్యా, అమ్మ పరిస్థితి కొంచెం సీరియస్‌గానే ఉంది. నా పరిస్థితి నీకు తెలుసు. నా కోటకి నేనో బానిసని. తీసుకెళ్లి నా ఇంట్లో పెట్టుకోలేని పరిస్థితి. ఈ టైంలో మా ఊళ్ళో ట్రీట్మెంట్ కొంచెం ఇబ్బందే. ఏం చేద్దాం?' అన్నాడు రమణ.

> **ఏమండీ నన్ను చెడ్డ చెయ్యడానికి కాకపోతే, ఇలాంటి టైం లో చిన్న పిల్లలున్న ఇంటికి హాస్పిటల్ నించి పేషెంట్ ని తెచ్చి మంచి కొడుకు కాగలరేమో కానీ మంచి తండ్రి కాలేరు. నాలుగు రోజులుగా హాస్పిటల్ లో దగ్గరుండి మీరు చెయ్యగలిగినంతా చేశారు. నేనూ క్యారేజీలు కట్టాను.**

'రమణా, ఇన్నాళ్లూ ఇక్కడ జరిగిన వైద్యంతోనే కాలక్షేపం చేశాం. వారం క్రితం వరకూ బానే ఉండేది. తన పని తాను చేసుకునేది. ఇప్పుడు కొంచెం పరిస్థితి విషమంగా ఉంది. ఒకటీ, రెండూ కూడా చెప్పలేకపోతోంది. కళ్ళు కనబడ్డం లేదు. ఎరుగున్న డాక్టర్‌ని పిలిచా. ఇన్సులిన్ పెట్టి చూద్దాం అంటున్నారు. నాకా స్టెంట్‌లు పడి కాలక్షేపం చేస్తున్నాను. నువ్వే చెప్పు ఏం చేద్దామంటే అదే చేద్దాం.' అన్నాడు హరిబాబు. అతను పెద్దగా చదువుకోలేదు. ఊర్లోనే వ్యవసాయం చేస్తున్నాడు. మాణిక్యమ్మ, హరిబాబు, పక్కపక్క ఇళ్లలోనే ఉంటారు.

'ఏం.. మాత్రలు సరిగా వేసుకోవటం లేదా?' అడిగాడు రమణ.

'ఏం మాత్రలు రా. ఇవాళ నీరసంగా ఉంది అర మాత్ర చాలు, ఇవాళ స్వీట్ తిన్నాను, ఒకటిన్నర వేసుకోవాలి అంటూ అంతా సొంత వైద్యమే. నువ్వు చెబితే నమ్మవు. వారం రోజులుగా పగబట్టినట్టు ఓ రోజు బొబ్బట్లు, ఓ రోజు బూర్లు, ఓ రోజు పూరీ చేసుకుని తింది. ఈ వయసులో అంత తిండి యావ ఏంటి చెప్పు. నిండా యాభై రాని మనమే జావలు, జామకాయలు తిని బతుకుతున్నాం . ఆవిడకి మాత్రం ఇంకా జిహ్వా చాపల్యం తగ్గలేదు. ఏదైనా అంటే, 'తల్లి తింటే చూసి ఏడ్చేవాణ్ణి నిన్నే చూశాను. మిమ్మల్ని నాలుగురకాలు పెట్టి ఆకలి ఎరక్కుండా పెంచినందుకు, నన్ను ఇన్ని మాటలంటావా. అయినా నా మొగుడి పెన్షన్ డబ్బులతో నా తిండి నేను తింటూ నా ఇంట్లోనే ఉంటున్నాను' అని నా పరువు తీస్తోంది. ఏం చెయ్యమంటావో చెప్పు.' అన్నాడు హరిబాబు. నువ్వు తీసుకెళ్ళు తెలుస్తుంది అన్న అర్థం అందులో ఉంది. తమ్ముడు తీసుకెళ్లలేని అసమర్ధతని ఎత్తి చూపని ఔదార్యం కూడా ఉంది.

కాసేపు అవీ ఇవీ మాట్లాడుకుని లేచి టీ తాగి, అమ్మని జాగ్రత్తగా ఉండమని చెప్పి

తిరిగి బయల్దేరిపోయాడు రమణ.

వైజాగ్ చేరిన అరగంటకే హరిబాబు నుంచి ఫోను. అమ్మ పడుకుని లేస్తూనే ఫిట్స్ వచ్చి పడిపోయిందట. లోకల్ గవర్నమెంట్ హాస్పిటల్ కి తీసుకెళ్తే అర్జెంటుగా వైజాగ్ తీసుకెళ్ళిపొమ్మన్నారట. తన కొడుకునిచ్చి అంబులెన్సులో పంపుతున్నాను, అక్కడ ఎవరో ఒక డాక్టర్‌తో మాట్లాడి హాస్పిటల్‌లో అడ్మిషన్ చూడమని.

వెంటనే ఓ ఫ్రెండ్‌కి తెలుసున్న డాక్టర్‌తో మాట్లాడి ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో అడ్మిషన్‌కి ఏర్పాటు చేసి, ఇంటికెళ్లి భార్యకి విషయం చెప్పాడు.

రాబోయే అసౌకర్యం, ఖర్చు, తల్చుకుని జలజ ఒక్క క్షణం బాధపడినా, ఊర్లో డాక్టర్ ఆల్రెడీ పెదవి విరిచాడని తెలియడంతో పాడేసిన చీటీ ఆఖరి ఇన్స్టాల్మెంట్ కడుతున్నట్టు అనుకుని సరిపెట్టుకుంది.

వైజాగ్‌లోనే ఉండే అక్కకి విషయం చెప్పాడు రమణ. హాస్పిటల్‌లో ఓ నాలుగు రోజులుండాలని తెలిసి డబ్బేమైన కావాలంటే అడగమని, భోజనం క్యారేజ్ తను పంపిస్తానని చెప్పింది కళ్ళ నీళ్ళు పెట్టుకుని.

అలా ముగ్గురు పిల్లలూ ఆశలేకపోయినా ఆఖరి ప్రయత్నంలో ఉండగా, ఎప్పుడూ ఆటో కూడా ఎక్కని మాణిక్యమ్మ మొదటిసారి అంబులెన్సులో పొలిమేర దాటి, సిటీలో రెడ్ లైట్లని తోసిరాజని, హాస్పిటల్‌లో చేరింది.

రెండోరోజుకు మాణిక్యమ్మకి కొద్దిగా తెలివొచ్చింది. చూడ్డానికి రమణ భార్య, అక్క , బావ మాస్కులు వేసుకుని వచ్చారు.

వీల్ చైర్‌లో ముక్కుకి ఫీడింగ్ ట్యూబ్, దానిమీద ఆక్సిజన్ మాస్క్, కిందన వేలాడుతూ యూరిన్ బ్యాగ్, చేతికి ఐ.వి కాన్యులాతో సగం మత్తులో మాట ముద్దగా వస్తోంది. పిల్లల్ని అతి కష్టం మీద గుర్తుపట్టింది. మాణిక్యమ్మని అలాంటి స్థితిలో చూసేటప్పటికి కన్నవాళ్ళిద్దరూ ఆమెకి దగ్గరగా వచ్చారు. వాళ్ళని కట్టుకున్నవాళ్ళు ఓ అడుగు వెనక్కేసారు.

అప్పుడే రౌండ్స్‌కి వచ్చిన డాక్టర్ ఆమెను వరండాలో చూసి, 'వెరీ గుడ్, మరో రెండు రోజుల్లో ఈవిడ నార్మల్ అవుతుంది. ఐదోరోజు ఇంటికి తీసుకెళ్లిపోవచ్చు' అని చెప్పి, రూమ్‌కి షిఫ్ట్ చెయ్యమని నర్స్‌కి చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రికే రమణకి వరుసగా ఫోన్లు వచ్చాయి.

ముందుగా హరిబాబు 'రమణా, డాక్టర్‌గారు మరో మూడురోజుల్లో ఇంటికి తీసుకెళ్లొచ్చన్నారట కదా. అమ్మకి పూర్తిగా తెలివి రాలేదట కదా. తీరా ఇక్కడకి తెచ్చేసాక మళ్ళీ ఏదైనా సమస్య వస్తే పరిగెత్తుకుంటూ రావాలి. అంచేత నా సలహా ఏంటంటే ఈ ఒక్కసారికీ మీ ఆవిణ్ణి ఒప్పించి, ఓ వారం రోజులు అక్కడే ఉంచు. ఆ తర్వాత డాక్టర్

గారికి చూపించి అప్పుడు తీసుకురా. నేను చూసుకుంటాను. అంతేకానీ సగం సగం ట్రీట్మెంట్ చేయంచి ఇక్కడ దింపేస్తే నేను ఇబ్బందిపడిపోతాను. ఆలోచించు' అన్నాడు. అతను చెప్పింది సబబుగానే ఉండటంతో 'సరే' అన్నాడు రమణ.

ఆ ఫోను పెడుతూనే మరో ఫోను. ఈసారి బావ. 'ఒరేయ్ రమణా, నేనో మాట చెబుతాను. నువ్వు మరోలా అనుకోకు. మీ అమ్మ పూర్తిగా తేరుకోలేదు. ఆవిణ్ణి బాత్రూంకి రెక్క పట్టుకుని తీసుకెళ్లాలి. ఓ మనిషి పెర్మనెంట్‌గా పక్కనే ఉండాలి. మా ఇంటికి లిఫ్ట్ కూడా లేదు. నాకు అరవై ఏళ్ళు. దానికీ దగ్గరదగ్గర అరవై వస్తున్నాయి. మీ అమ్మని చూడ్డానికి నాకేమీ అభ్యంతరం లేదుకానీ మేము చెయ్యలేమేమో అని చిన్న భయం. మీ అక్కకి చెబితే వినటం లేదు. అలా అని ఈ పరిస్థితిలో ఆవిణ్ణి ఊరు పంపటం కూడా కరెక్ట్ కాదు. టికెట్ కొనకుండా లాటరీ, తిరుగుబాటు లేకుండా లిబర్టీ ఆశించకూడదు. బతిమాలో, బెదిరించో మీ ఆవిణ్ణి ఒప్పించి మీ ఇంటికి తీసుకెళ్లి ఓ వారం ఉంచు. కావాలంటే ఆ తర్వాత ఆవిడ లేచి తన పనులు తాను చేసుకోగలిగితే మా ఇంట్లో ఓ నెల్లాళ్ళు ఉంచినా నాకభ్యంతరం లేదు. అంతా బావుంది అంటే అప్పుడు తీసుకెళ్లి దింపు. నేనిలా ఫోన్ చేసినట్టు మీ అక్కకి చెప్పకు. ఐ హోప్ యు అండస్టాండ్ ఉంటాను' అంటూ ఫోన్ పెట్టేసాడు బావ.

బావ చెప్పింది కూడా న్యాయమనిపించటంతో ఇక లాభంలేదని రమణ భార్యకి ఫోన్ చేశాడు. అన్నయ్య, బావ ఏమన్నదీ చెప్పాడు. తిరగబడలేదు కానీ తెగ బతిమాలాడు.

జలజ చెక్కు చెదరలేదు, గుక్క తిప్పుకోలేదు.

'ఏమండీ నన్ను చెడ్డ చెయ్యడానికి కాకపోతే, ఇలాంటి టైంలో చిన్న పిల్లలున్న ఇంటికి హాస్పిటల్ నించి పేషెంట్‌ని తెచ్చి మంచి కొడుకు కాగలరేమో కానీ మంచి తండ్రి కాలేరు. నాలుగు రోజులుగా హాస్పిటల్‌లో దగ్గరుండి మీరు చెయ్యగలిగినంతా చేశారు. నేనూ క్యారేజీలు కట్టాను. చక్కగా తీసుకెళ్లి ఆవిణ్ణి ఆవిడింట్లో దింపి రండి. అంతా బావుంటుంది. నా మాట వినండి . ఇంతకన్నా నాతో ఆర్గ్యు చెయ్యకండి. నాకు గుండెల్లో నొప్పిగా ఉంది.' అంటూ ఫోన్ పెట్టేసింది జలజ.

* * *

'రమణా.. ఆకలేస్తోందిరా' అన్న మాణిక్యమ్మ పిలుపుకి ఆలోచలనల్లోంచి బైటకొచ్చాడు రమణ. క్యారేజీ ఓపెన్ చేసి బాక్స్‌లోనే స్పూన్ వేసిచ్చాడు. మాణిక్యమ్మ అన్నంతింటూ, 'అదేం రా ఈరోజు మొత్తం అక్కా రాలేదు, మీ ఆవిడా రాలేదు. మీ పిల్లల్ని ఓసారి తీసుకురావొచ్చు కదా' అంది.

'ఊరంతా కరోనా కదమ్మా. అంతమంది హాస్పిటల్‌కి ఎందుకనీ..' అన్నాడు రమణ

**' ఆరేళ్ళొచ్చాయి, కుంకుడు పులుసు రాసుకుని పాలు తాగడం మాన్పించు' అని అందరూ చెప్పినా, పళ్లతో కొరికిన నొప్పిని పంటి బిగువున దాచి, నవ్వుతూ కొంగు చాటున పాలు పట్టిన తన గారాల కొడుకు, స్కూల్ కి వెళ్ళేటప్పుడే ఇంటికొచ్చాక తినడానికి ఏం కావాలో చెప్పే కొడుకు, రెండు లీటర్ల పాలతో జున్ను చేసి ఉట్టిలో పెడితే ఆడుకుంటూ అటూ ఇటూ తిరిగి మెం-త్తం తినేసి రాత్రి కడుపు నొప్పని ఏడ్చిన కొడుకు, ఈరోజు తనని తన తిండి గురించి కఠినంగా చెప్తున్నాడు.**

తనుకూడా అన్నం తింటూ.

'ఆ.. గాడిదగుడ్డు. అది మనల్నేం చేస్తుంది. ఓసారి వచ్చి వెళ్తే ఏమైపోతుంది.' అంది టి.వి కేసి చూస్తూ.

అంతే, టైముకి రాని ట్రైన్‌ని ఏమీ చెయ్యలేక నొప్పిని కూడా చెప్పలేని నెయిల్స్‌ని కసిగా కొరికేసే ప్రయాణీకుడిలా ఒక్కసారి తల్లిమీద విరుచుకుపడ్డాడు రమణ.

'అమ్మా, డెబ్బై అయిదేళ్ళొచ్చాయి. ఇంకా నీకు ఒకరు చెప్పాలా. నీ ఆరోగ్యం నువ్వు చూసుకోలేవా. నువ్వేం చిన్న పిల్లవా. అక్కకి అరవై వస్తున్నాయి. దానికి షుగరు. దాని పిల్లకి అనారోగ్యం. అన్నయ్య మొన్నే స్టెంట్‌లు వేయించుకున్నాడు. నలభై వస్తూనే రోజుకి రెండు బి .పి మాత్రలు వేసుకుంటున్నాను. ఉద్యోగంలో రాని ప్రమోషన్లు, వద్దన్నా వెంటపడే టెన్షన్లు. లోన్లు, ఈ.ఎం.ఐలు, పిల్లల చదువులు, ర్యాంక్‌లు, అడ్మిషన్లు. ఇవన్నీ చాలవన్నట్టు నువ్వు ఏరి కోరి తెచ్చి చేసిన సంబంధం. నీ ముద్దుల కోడలి అతి జోక్యంతో నా అంతట నేను ఏ నిర్ణయమూ తీసుకోలేని అసహాయత. ఆపైన ఇదిగో ఈ పాండమిక్ టైంలో నువ్వు కోరి తెచ్చుకున్న అనారోగ్యం' అంటూ తింటున్న అన్నం ప్లేట్ విసురుగా పక్కన పెట్టేసి, 'నీకో విషయం తెలుసా, నేను స్వీట్ తిని ఆర్నెల్లయింది. నోరారా ఓ బిర్యానీ తిని నెలలౌతోంది. చప్పిడి, చోడంబలి, తిని గడుపుతున్నాను. ఎందుకోసం? నావల్ల నా కుటుంబం ఇబ్బంది పడకూడదని. ఏం నలభై ఏళ్ల వాణ్ణి నాలుక కట్టుకోగా లేనిది ఇన్నేళ్ళొచ్చాయి, అంత జిహ్వా చాపల్యం ఎందుకు. మమ్మల్ని చంపటానికి కాకపోతే. ఈ టైంలో ఇలా హాస్పిటల్‌లో ఉండటం ఎంత రిస్కో తెలుసా నీకు. పైగా మాటిమాటికీ చూడ్డానికి మీ ఆవిడ రాలేదేం, మీ పిల్లలు రాలేదేం అని అడుగుతున్నావు. బైట పరిస్థితి నీకెలా చెబితే అర్థమౌతుంది..' అంటూ అతను రొప్పసాగాడు.

ఎప్పుడూ మాట్లాడ్డం ఎరగని కొడుకు, తన కొంగు పట్టుకుని తిరిగిన వాడు, అంత పరుషంగా ముఖ్యంగా తను తిండి గురించి అంత కఠినంగా మాట్లాడుతూ ఉంటే మాణిక్యమ్మకి చాలా సిగ్గనిపించింది.

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 398

చిన్నప్పుడు కూరి కూరి తినిపించిన గోరు ముద్దలు గుర్తొచ్చాయి. 'పడ్డలా ఆరేళ్ళొచ్చాయి, కుంకుడు పులుసు రాసుకుని పాలు తాగడం మాన్పించు' అని అందరూ చెప్పినా, పళ్లతో కొరికిన నొప్పిని పంటి బిగువున దాచి, నవ్వుతూ కొంగు చాటున పాలు పట్టిన తన గారాల కొడుకు, స్కూల్‌కి వెళ్ళేటప్పుడే ఇంటికొచ్చాక తినడానికి ఏం కావాలో చెప్పే కొడుకు, రెండు లీటర్ల పాలతో జున్ను చేసి ఉట్టిలో పెడితే ఆడుకుంటూ అటూ ఇటూ తిరిగి మొత్తం తినేసి రాత్రి కడుపు నొప్పని ఏడ్చిన కొడుకు, ఈరోజు తన తిండి గురించి కఠినంగా చెప్తున్నాడు.

**అందరి దృష్టి నా తిండిపైనే. ముసలిదాన్ని నా చుట్టూ మూగి ఇది తినొద్దు, అది తినొద్దు అంటూ నా నోరు కట్టేస్తున్నారు. నా తోటి వాళ్లంతా నచ్చినవి తిని హాయిగా ఉంటున్నారు. అయినా నేనేమన్నా బొబ్బట్లు, చంద్రకాంతాలు నాకోసం చేసుకున్నానా. కళ్ళముందు మనవలు తిరుగుతున్నారు.**

చూడ్డానికి సీతాకోకచిలుకలా ఉండే ఐ .వి కాన్యులా తేలు కొండిలా ఉండుండి చురుక్కు మంటోంది. ముద్దుల కొడుకు మాటల్లా. మారు మాట్లాడకుండా, అటు తిరిగి పడుకుంది. ఆమె కళ్ళవెంట నీరు సెలైన్ కంటే వేగంగా కారుతూ తలగడని తడిపేస్తోంది.

రమణ కిటికీ దగ్గర కుర్చీ వేసుకుని కూర్చుని తెచ్చుకున్న పుస్తకం తెరిచి చదవసాగాడు. అతనికి అందరిమీదా ఏదో తెలియని కోపంగా ఉంది. ఓ వాక్యం అండర్లైన్ చేసి మళ్ళీ మళ్ళీ అదే చదువుతూ ఉంటే కళ్ళవెంట నీరు ధారలా కారుతోంది.

***

తెల్లవారటం ఎవరికి నచ్చినా నచ్చకపోయినా తనకి తప్పదని సూర్యుడు డ్యూటీ ఎక్కాడు. మాణిక్యమ్మ లేచి తయారవుతూ గొణుక్కోసాగింది.

'అందరి దృష్టి నా తిండిపైనే. ముసలిదాన్ని నా చుట్టూ మూగి ఇది తినొద్దు, అది తినొద్దు అంటూ నా నోరు కట్టేస్తున్నారు. నా తోటి వాళ్లంతా నచ్చినవి తిని హాయిగా ఉంటున్నారు. అయినా నేనేమన్నా బొబ్బట్లు, చంద్రకాంతాలు నాకోసం చేసుకున్నానా. కళ్ళముందు మనవలు తిరుగుతున్నారు. పెద్దదాన్ని ఇంట్లో ఉండి వాళ్లకి ఏమీ చేసిపెట్టకుండా ఎలా ఉంటాను. చేసినప్పుడు ఏదో తీపి సరిపోయిందో లేదో అని ఓ పిసరు నోట్లో వేసుకున్నాను. మావిడికాయల సీజన్లో అవకాయలు పెట్టుకోమా. నా ఆవకాయ అమెరికా వరకూ వెళ్తుంది. రోజూ ఓ రకం పెట్టినప్పుడు ఓ పిసరు అన్నంలో

కలుపుకుని తినకుండా ఉంటామా. అలా ఉప్పు రవ్వ లేకుండా వందేళ్లు బతికి ఏం చెయ్యాలి. చిన్నప్పుడు వీళ్ళకి అన్నం పెట్టేటప్పుడు ఇన్ని ఆలోచించి ఉంటే ఇప్పుడు ఇన్ని మాటలు అనేవారు కాదేమో.

సరేలే, అయిందేదో అయిపోయింది. ఇన్నాళ్ళైనా ఒక్కనాడు ఇలా జ్వరమనైనా మంచం మీద లేను. ఆఖరికి పురుళ్ల నాడు కూడా పొద్దున్న పిల్లని కని సాయంత్రానికి నూతిలో నీళ్లు తోడుకునే దాన్ని. ఏదో నా ఖర్మకాలి హాస్పిటల్ కొస్తే, అందరూ నన్నో దోషిలా చూస్తున్నారు. నా తిండేగా అందరికీ భారం. దాన్ని నేనే కట్టేసుకుంటాను. మీరు ఏది పెడితే అదే తింటాను. పద, నేనెవ్వరింటికీ రాను. నా ఇంట్లో నన్ను దింపేయ్. నా తిప్పలేవో నేను పడతాను' అంటూ కళ్ళు తుడుచుకుని బ్యాగ్‌లో తన బట్టలు, మిగిలిన మందులూ సర్దుకోవడం మొదలెట్టింది మాణిక్యమ్మ. రమణ అటు తిరిగి పడుకుని ఉన్నాడు . ఓ రెండు నిమిషాలాగి కళ్ళు తుడుచుకుని, 'రమణా లేచి వెళ్లి బిల్లు సెటిల్ చేసి రారా' అంది.

తెల్లారితే అమ్మని ఎక్కడికి తీసుకెళ్ళాలో తెలియక రాత్రంతా మథనపడి, ఏ తెల్లవారుఝామో నిద్రపోయాడు రమణ. కదిపి చూసింది. అతను కదల్లేదు కానీ అతని ఒళ్ళో ఉన్న పుస్తకం జారి కింద పడింది. 'కృష్ణ పక్షం' లో తెరిచిన పేజీలో ఓ వాక్యం 'నా కొరకు చెమ్మగిలు నయనమ్ము లేదు' కింద ముద్దలా అలుక్కుపోయిన ఇంకు వానకారు కోయిలలా.

***

## ఉమా మహేష్ ఆచాళ్ళ

ఉమా మహేష్ ఆచాళ్ళ విశాఖపట్నం కస్టమ్స్ డిపార్ట్మెంట్ లో ఆఫీసర్ గా పనిచేస్తున్నారు. 2016 నించి ఇప్పటి వరకూ వీరు రాసిన ముప్పై కి పైగా కథలు ఈనాడు, ఆంధ్రజ్యోతి, సాక్షి, స్వాతి వంటి ప్రముఖ పత్రికల్లో ప్రచురితం అయ్యాయి. నమస్తే తెలంగాణ– ముల్కనూరు వారి 'కథ 2020' తో పాటు ఈనాడు కథావిజయం 2019, 2020 లో కూడా వరుసగా బహుమతులు అందుకున్నారు. 'నా కథలవల్ల ఎవరు మారారో తెలియదు. నేను మాత్రం మారాను' అంటారీయన.

# మా రోజులు మారిపోయాయి

–వియోగి, 77948 20104

**'సాంబయ్యా!** అదేంటి ఇంకా యిలా కూర్చున్నావు. బట్టలు మార్చుకోలేదు. అస్సలు బట్టలు సర్దుకున్నావా? మన ఊరివాళ్ళంతా బస్సు ఎక్కి రెడీగా ఉన్నారు. నువ్వు బస్సెక్కితే బయలు దేరడమే! నువ్వు ఆలశ్యం చేస్తే అక్కడ పెళ్ళి ముహూర్తానికి అందుకోలేము.' కరణం శివరాం సాంబయ్యను తొందరపెట్టాడు. కరణీకాలు పోయినా, శివరాం వాళ్ళ పూర్వీకులు అంతా కరణీకం చేసిన వాళ్ళే! అందుకే ఆ గ్రామంలో అతన్ని కరణంగారనే పిలుస్తారు, యిప్పటికీ.

సాంబయ్యకు ఏడుపు ఒక్కటే తక్కువ! ఏం చెప్పాలి? ఏదో చెప్పాలి! అది కూడా అతికేట్లు ఉండాలిగా!

'నేను రాలేనురా శివరాం! నాకు ఒంట్లో బాగోలేదు.'

'నీ మొహం! కొడుకు పెళ్ళి నువ్వు రాకుండా ఎలా జరుగుతుంది! ఆ మహాతల్లి బ్రతికి ఉంటే వారం క్రిందటే కొడుకు దగ్గరికి వెళ్ళేది నిన్ను తీసుకుని. లే! లే! తయారుగా! అస్సలు నువ్వు కూడా పదిరోజుల ముందు బయలుదేరి వెళ్ళవలసింది' కోప్పడ్డాడు శివరాం!

'ఆ! ఆ! నేను పోతే ఇక్కడి పొలం పనులు ఏమవుతాయి?'

'మేము లేమూ– మీ పాలేర్లు లేరూ! నీ చాదస్తం ఎక్కువై దగ్గరుండి పొలం పన్లు చేస్తున్నావు? నీ పొలాన్ని ఏ దొంగలు ఎత్తుకుపోరు గాని బయలు దేరు' కరణం శివరాం అతన్ని కుర్చీలోంచి లేవదీయబోయాడు చనువుగా.

'చెప్పానుగా నాకు ఒంట్లో బాగోలేదని – మీరు పోండి!'

'అరే! నీకు ఏమైందిరా!' ఆశ్చర్యంగా, కోపంగా అడిగాడు శివరాం.

'ఏమో! ఒకటే విరేచనాలు! గంటగంటకి పోవలసి వస్తున్నది. పైగా కడుపునెప్పి!' కొంచెం మూలుగుతూ చెప్పాడు సాంబయ్య అభినయిస్తూ.

'సాంబయ్యా! మందులు కొని వేసుకుందాము పద!'

'వద్దు! నాకోసం మిమ్మల్నందరిని ఇబ్బంది పెట్టలేను. మాటి మాటికి బస్సు ఆపడం పద్ధతి కాదు. మీరు వెళ్ళండి. తగ్గిన తరువాత నేను బయలుదేరి వస్తాను' సాంబయ్య

చెప్పాడు, తప్పించుకోవడానికి.

'అరే, నాన్నగారు రాలేదా అని మల్లికార్జున అడిగితే ఏం చెప్పాలిరా! కాస్త ఆలోచించు. ఇది మా యింట్లో పెళ్ళికాదు. మీ యింట్లోది. నువ్వే పెళ్ళి పెద్దవి! అక్కడ మీ వియ్యంకులు ఎలా ఫీలవుతారు?'

'సారీ! నువ్వెన్ని చెప్పినా వచ్చే ఓపిక నాకు లేదు. మన సుబ్బరాజు డాక్టరుకు ఫోను చేశాను. కాసేపటికి ఇంటికి వచ్చి బాటిల్సు పెడతానన్నాడు. నాకు తగ్గేదాకా యిక్కడే ఉంటాడట! తగ్గింతర్వాత నేను కారు మాట్లాడుకుని వస్తాలే! ఆలశ్యమవుతున్నది– మీరు బయలు దేరండి!'

శివరాం ఎంత బలవంతపెట్టినా లొంగక అలాగే ఉండిపోయాడు. అతనికోసం యాభై మందిని బస్సులో నిలబెట్టడం బాగుండదని శివరాం వెళ్ళిపోయాడు, అతని మూర్ఖత్వానికి విచారిస్తూ, మొండిమనిషి అని తిట్టుకుంటున్నాడు.

అతను పోగానే సాంబయ్య దుఃఖం కట్టలు తెంచుకుంది.

సాంబయ్య, పార్వతమ్మలకు లేక లేక కలిగిన సంతానం మల్లికార్జున్! అతనిమీద ఎన్నో ఆశలు పెట్టుకుని పెంచారు. మంచి చదువుకావాలంటే గ్రామంలో బడి స్థాయి సరిపోదని చిన్నప్పటినుండే పట్టణంలో రెసిడెన్షియలు స్కూలులో ఉంచి చదివించాడు. ఆపైన మంచి మంచి కాలేజీ చదువులు చెప్పించాడు. సాంబయ్య పొలాలు ఒక ఏడు పండితే యింకో ఏడు పండవు. వర్షాధారిత పొలాలు! నీటి సౌకర్యం తక్కువ. బోరు వేసినా సరిగా నీటి లభ్యత లేదు. అయినా కూడా కొడుక్కు ఎటువంటి లోటు కలుగచేయకుండా పెద్ద చదువులు చదివించాడు. అమెరికాలో యం.యస్. చేస్తానంటే కొన్ని ఎకరాలు అమ్మి అతన్ని అమెరికా పంపించాడు. ఐదు సంవత్సరాల తర్వాత అమెరికా నుండి వచ్చాడు. కాని తండ్రిని చూడ్డానికి అతనికి టైము దొరకలేదు. తనే పట్టణంకు పోయి చూసి వచ్చాడు.

ఇంకో సంవత్సరానికి అతనికి అమెరికా సంబంధం కుదిరింది. గౌరి డెప్యూటేషన్ మీద అమెరికాలో జాబు చేస్తున్నది. ఆఫీసులో పరిచయం పెంచుకుని ప్రేమలో పడ్డాడు ఆమెతో. ఆమె కూడా అతని ప్రేమను అంగీకరించింది. ఆమె తల్లిదండ్రుల అభీష్టానికి విలువ యిచ్చి ఇండియాకు వచ్చి పెళ్ళికి సిద్ధమయింది.

అసలు సమస్య యిక్కడే వచ్చింది. గౌరీ తల్లిదండ్రులు యూనివర్సిటీ ప్రొఫెసర్లు. సాంబయ్యకు చదువు రాదు. స్టేటస్సు లేదు. గౌరీ అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు కూడా మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. వారికి సాంబయ్యతో వియ్యమందడం యిష్టం లేదు. అది గౌరీ మల్లికార్జునకు చెప్పింది.

గౌరీ మోజులో వున్న మల్లికార్జునుడు తండ్రితో సంప్రదించకుండానే పెళ్ళి

నిశ్చయించుకున్నాడు. పెళ్ళిలో తన తండ్రి ఎలా మెసలుతాడోనని భయపడుతున్నాడు. అత్తగారి వాళ్ళ ముందు చదువురాని తండ్రితో తలవంపులు వస్తాయని అతని భయం! తల్లి పదేళ్ళ క్రిందట మరణించింది కాబట్టి ఆమె గురించి దిగులు లేదు. ఎటొచ్చి తండ్రి మొరటు మనిషి. నాగరికత తెలియదు.

నిజానికి ఎవరికీ చెప్పకుండా చేసుకుందామనుకున్నాడు. కానీ చివరి నిమిషంలో మామగారు నీ తరుపున కనీసం యాభై మంది అన్నా రాకపోతే మాకు తలవంపులుగా ఉంటుందని హెచ్చరించాడు. పెళ్ళి నాలుగు రోజులలో ఉంది. కొనవలసినవి చాలా ఉన్నాయి. తన యూనివర్సిటీ ఫ్రండ్సును, కాలేజీ ఫ్రెండ్సును స్వయంగా పోయి పిలవాలి! ఈ బిజీ షెడ్యూలులో సాంబయ్యకు ఫోను చేసి చెప్పాడు – తమ గ్రామం నుండి ఒక బస్సు జనాల్ని పెళ్ళికి తోలమని. కొడుకు మాటలు చెవిలో గింగురుమంటున్నాయి. 'నాన్నా! నా పెళ్ళికి మన ఊరి నుండి కనీసం యాభైమంది అన్నా రావాలి! లేకపోతే యిక్కడ నాకు పరువు పోతుంది. మీ ఫ్రండు శివరాంకు చెప్పి ఒక బస్సు మాట్లాడి పంపే బాధ్యత నీది! నువ్వు వచ్చేట్లయితే ఆ ముతక బట్టలు మానేసి కొంచెం డాబుసరి బట్టలు వేసుకుని రావాలి! వస్తే మటుకు యిక్కడ ఎవరితోను అనవసరంగా మాట్లాడమాకు. ఒక చిరునవ్వుతో ఓ మూలన కూర్చో! నేను పరిచయం చేస్తే హలో అను చాలు! పెళ్ళిలో ఏ మాత్రం పొరపాట్లు జరిగినా గౌరీకి యిష్టముండదు. ఆమె ముక్కోపి! వాళ్ళ ప్యారెంట్సుకూడా చాలా కల్చర్డు పీపులు! మట్టి పిసుక్కునే వాళ్ళంటే వాళ్ళకు అసహ్యం! కాబట్టి చాలా జాగర్తగా ఉండాలి! ఇక్కడ నేను స్టార్‌హోటలులో ఉన్నాను! మాకు సెలవలు అయిపోవచ్చాయి. మూడు రోజుల్లో తిరుగు ప్రయాణం! అందుకే ఈసారి మనింటికి రాలేక పోయాను. ఏమీ అనుకోవద్దు!' ఇంకా ఏవేవో అన్నాడు గాని యింక విని జీర్ణించుకునే శక్తి సాంబయ్యకు ఆ భగవంతుడు యివ్వలేదు.

కాసేపటికి సుబ్బరాజు వచ్చాడు. అతను ఆర్.యం.పి. డాక్టరు. డిగ్రీ లేకపోయినా అనుభవం బాగుంది. మరీ సీరియస్సుగాని సాధారణ జబ్బులకు బాగానే వైద్యం చేస్తాడు. పెద్ద డాక్టర్ల దగ్గరకు పోవాలంటే చాలా సమయం పడుతుంది. వెయిటింగు పడుతుంది. వాళ్ళు వాళ్ళ హాస్పిటల్స్‌లో చేసే వైద్యాన్ని సుబ్బరాజు కాస్త ఎక్కువ డబ్బులిస్తే యింటికి వచ్చి చేస్తాడు.

రాగానే ఫ్లూయిడ్సు పెట్టాడు. కొన్ని రకాల యింజెక్షన్లు ఆ బాటిల్‌కే యిచ్చేశాడు. సాంబయ్య పల్సు చూశాడు. ఎన్నిసార్లు అయిందని ఎంక్వయిరీ చేశాడు.

'నిన్న ఏం తిన్నారు? ప్రొద్దున ఏం తిన్నారు? మోషన్సు ఎన్ని సార్లు అయింది? ఎప్పటినుండి.' రకరకాల ప్రశ్నలు కురిపించాడు సుబ్బరాజు.

'సారీ డాక్టరు! ఇది నా స్వయంకృతం! నాకు చదువురాదు గదా! నేను ఎందుకూ పనికిరాను. ప్రొద్దున తలనెప్పి మాత్రలు అనుకుని మోషను ట్యాబ్లెట్లు వేసుకున్నాను. విరేచనాలు మొదలయిన తరువాత నేను చేసిన తప్పు నాకు తెల్సి వచ్చింది. జ్వరం, తలనెప్పి తగ్గలేదు కాని అనవసరంగా ఇదొకటి తగిలింది.' సాంబయ్య చెప్పాడు. దాంలో కొంత నిజం వుంది, కొంత అబద్ధం వుంది.

'ఏం ఫర్వాలేదు ఈ సుబ్బరాజు ఈ గ్రామంలో వున్నంతవరకు ఎవరూ భయపడవలసినపని లేదు. కరణంగారు ఫోను చేసి మీకు వెంటనే తగ్గించి కారు మాట్లాడి చెన్నై పంపమన్నాడు.' సుబ్బరాజు యధాలాపంగా చెప్పాడు. సాంబయ్య మవునం వహించాడు. కాసేపాగి –

'అవును రేపుదయం మా అబ్బాయి పెళ్ళి ఉంది. కాని ఈ కండీషనులో నేనెలా పోగలను. పోయి అందరికీ ఎలా యిబ్బంది పెట్టగలను?' బేలగా అన్నాడు సాంబయ్య.

'అదీ పాయింటే! ఇంకో జబ్బయితే ఫర్వాలేదు. ఇది చాలా డేంజరసు! అప్పుడే డీహైడ్రేషన్ మొదలయింది.' చర్మాన్ని సాగదీస్తూ చెప్పాడు సుబ్బరాజు.

'అది ఆ కరణం గాడికి అర్థం కాదు!' నిష్ఠూరంగా చెప్పాడు సాంబయ్య.

'వర్రీ కాకండి! నేను చెబుతాను. రెండు బాటిల్సు ఎక్కించి వెళతాను. మళ్లీ రాత్రికి రెండు ఎక్కిస్తాను. రేపుదయంకునార్మల్ అవుతుంది. అప్పుడు పెళ్ళికి వెళ్ళండి' చెప్పాడు సుబ్బరాజు.

'కానీ, పెళ్ళయిన తరువాత వెళితే నన్ను చూసి లోకం ఏమనుకుంటుంది? రేపు కూడా బాటిల్సు ఎక్కించు!' అర్థించాడు సాంబయ్య.

'చూద్దాం! రేపు పరిస్థితి బట్టి నిర్ణయిస్తాను.'

ఓ గంట తర్వాత సుబ్బరాజు వెళ్ళిపోయాడు.

సాంబయ్య ఒంటరిగా ఉండటంతో ఆలోచనలు చుట్టు ముట్టాయి. 'తను చేసిన తప్పు ఏంటి? చిన్నప్పటినుండి మల్లిగాడిని గారాబంగా పెంచడమా? వాడికి బాగా చదువు రావాలని వేరేచోట పెట్టి చదివించడమా? పై చదువులకు అమెరికా పంపడమా? అస్సలు చిన్నప్పుడే వీడిని రెసిడెన్షియలు స్కూలులో వదలడం వలన వీడికి ఆత్మీయత, అనుబంధాలు తగ్గిపోయాయి. సెలవులకు యింటికి వచ్చినా ఈ యింటి వాతావరణం, ఈ గ్రామం నచ్చక ఎప్పుడెప్పుడు పట్టణానికి పారిపోదామని చూస్తూ ఉండేవాడు. కనీసం పార్వతి అన్నా వాడి మనస్తత్వం గుర్తించలేదు. తను చనిపోయినప్పటినుండి వీడి ప్రవర్తన చాలా దారుణంగా మారిపోయింది. తండ్రి అంటే కొంచెం కూడా గౌరవం చూపడు. వాడికి తన ఆస్తి కావాలి కాని తను

అక్కరలేదు. కనీసం ఫోనులో కూడా పలుకరించడు. ఏదో మొక్కుబడిగా పెళ్ళికి పిలుస్తాడు. తండ్రిని పిలిచే పద్ధతి అదేనా! తను అక్కడికి పోతే నలుగురి ముందు చులకన చేస్తే ఈ గ్రామంలో తన పరువు ఏం కావాలి! తల ఎక్కడ పెట్టుకోవాలి! అందుకే తను పెళ్ళికి పోలేక పోయాడు. తను వాడి పెళ్ళి చూడకపోయినా నష్టం లేదు. వాడు సుఖంగా ఉంటే చాలు. కోడలు బుద్ధిమంతురాలైతే చాలు. కాని ఈ సంబంధం తమ అంతస్తుకు మించింది. అస్సలు వీడిని గౌరవిస్తారో లేదో! చదువు చెప్పించకపోయినా తన కళ్లముందు వ్యవసాయం చేసుకుంటూ ఉండేవాడు. ఇన్ని ఎకరాలు అమ్ముకోవలసిన పరిస్థితి వచ్చేది కాదు.' ఆ రాత్రి శివరాత్రి అయింది సాంబయ్యకు.

తెల్లారిన తరువాత రాములోరి గుడికి పోయి కొడుకు పేరు మీద కళ్యాణం చేయించాడు. అందరికీ పళ్లు పంచి పెట్టాడు.

ఆ మరునాడు శివరాం వచ్చాడు. పెళ్ళి విశేషాలు చెప్పాడు. తన సెల్లులో తీసిన ఫోటోలు చూపించాడు. మల్లికార్జునుడు దొరబాబులాగా సూటులో మెరిసిపోతున్నాడు. కోడలు గౌరి మహాలక్ష్మిలాగా ఒంటినిండా బంగారంతో ధగధగ మెరిసిపోతున్నది. వియ్యంకుడు, వియ్యపురాలు పెద్ద జమీందారుల్లాగా వైభవంగా ఉన్నారు. కళ్యాణమండపం తన ఊహకు అందనిది. భోజనాలు ఎన్నో రకాలు! అన్ని రకాలుంటాయని సాంబయ్యకు తెలియదు. వేలమంది అతిథులు హాజరయ్యారు. వైభవంగా జరిగింది.

అన్నీ చూపించి సాంబయ్యకు బట్టలు యిచ్చాడు వియ్యంకులు యిమ్మన్నారని చెప్పి. కవరు విప్పి బట్టలు బయటకు తీశాడు. అతిసాధారణమైన ముతక పంచెలు!

'ఇవ్వేం బట్టలు శివరాం?!' అడిగాడు సాంబయ్య విస్మయంగా.

'బస్సులో వెళ్ళిన వాళ్ళందరికి కూడా ఇలాంటివే పెట్టారులే మన వాళ్ళు మురిసిపోయారు.' శివరాం చెప్పాడు.

'నిజమే కాని, ఇవి వాళ్ళ స్థాయికి తగ్గట్టు లేవుగా!'

'అబ్బే! వాళ్ళు వచ్చిన వాళ్ళస్థాయి బట్టి మంచి మంచి బట్టలు పెట్టారు. మనం మట్టి పిసుక్కునే మనుషులం గదా! మనకెందుకు పట్టువస్త్రాలని రోజూ పనికొచ్చే బట్టలు పెట్టారు ఘనంగా. సంతోషించు.'

'సరేలే! ఎవరి పెళ్ళన్నా జరిగితే నేను యింతకంటే మంచి బట్టలే పెడుతూంటాను గదా! ఇవి మా పాలేరులకు యిచ్చినా నా పరువు పోతుంది. ఇంట్లో అలుగు గుడ్డలుగా ఉపయోగపడతాయిలే! ఇంతకూ మా వాడు ఏమన్నాడు' ఆతృతతో అడిగాడు సాంబయ్య.

శివరాం తడబడ్డాడు. చెప్పాలా, వద్దా అన్నట్లు ఆలోచించి తలూపాడు. సాంబయ్య అది కనిపెట్టి 'ఫర్వాలేదు చెప్పు' అని సైగ చేశాడు.

'నాన్నకు థ్యాంక్సు చెప్పమన్నాడు. ఈ సారి వచ్చినప్పుడు తప్పకుండా వస్తానన్నాడు. ఈ సారి పట్టణంలో ఇల్లు కొంటానన్నాడు. రెండు రోజుల్లో అమెరికాకు వెళ్ళాలన్నాడు. చేరినతరువాత ఫోన్ చేస్తానన్నాడు' అంటూ శివరాం తల తిప్పుకున్నాడు.

'చాలు! చాలు! వాడి సుఖమే నేను కోరుకునేది' సాంబయ్య అన్నాడు.

ఒక వారం రోజులు గడిచిపోయాయి. సాంబయ్య కొడుకు ఫోను కోసం ఎదురు చూస్తున్నాడు.

ఒక సాయంత్రం సెల్లు రింగయింది. హలో అన్నాడు.

'ఎవరు మాట్లాడుతున్నది? సాంబయ్యా?' అట్నించి దర్పంగా అడిగారు.

'అవును, మీరెవరు?'

'నేను గౌరి ఫాదర్ని!'

'నమస్కారం వియ్యంకులు గారు, బాగున్నారా?'

'ఆ! ఆ! నమస్కారాలకేం గాని అర్జెంటుగా నీకో విషయం చెప్పాలి.'

'అంతా బాగున్నారా బావగారు!'

'నన్ను చెప్పనియ్యవయ్యా! నువ్వు వెంటనే బయలు దేరు.'

'ఎక్కడికి? అమెరికాకా?'

'కాదు, చెన్నయికి – నీ కొడుకు నీకోసం కలవరిస్తున్నాడు.'

'ఏదో రాంగునెంబరు లాగుంది. నా కొడుకు అమెరికాకు వెళ్ళాడు.' ఫోన్ పెట్టేశాడు సాంబయ్య.

కాసేపటికి మళ్లీ రింగయింది.

'హల్లో సాంబయ్యా! మాట్లాడుతూంటే ఫోన్ పెట్టేస్తావేంటి! చెప్పేది విను. అర్జెంటుగా బయలుదేరి చెన్నైకి రావాలి!'

'ఎందుకు?' విసుగ్గా అడిగాడు సాంబయ్య.

'నీ కొడుకు మల్లికార్జున్ పిలుస్తున్నాడు.'

'అబ్బే! మా వాడు అమెరికాకు...'

'ఆగు! అతను అమెరికా పోలేదు. పోబోయేముందు యాక్సిడెంటు అయింది. ఓ కార్పోరేటు హాస్పిటల్లో అడ్మిట్ అయ్యాడు. కండిషను పెద్ద సీరియస్సు ఏం కాదు కాని... లాంగు ట్రీట్‌మెంటు తీసుకోవాలి! అర్థం అయిందా! నేను గౌరీ తండ్రిని ప్రొఫెసర్ని!' అట్నించి దబాయింపు.

'అయ్యో! నా బాబుకు యాక్సిడెంటా! ఎలా ఉన్నాడు?'

'ఫర్వాలేదు. ఔట్ ఆఫ్ డేంజరు అన్నారు కాని వెన్నెముకకు ఫ్రాక్చర్ అయింది. కోలుకోవడానికి టైము పడుతుంది. హాస్పిటల్లో ఉన్నాడు. అక్కడ అతనికి చేసేవాళ్ళు ఎవరూ లేరు. నువ్వు వస్తే...'

'హలో మా కోడలు గౌరీ ఉందిగా అక్కడ.' ఆదుర్దాగా అడిగాడు.

'లేదు! ఆమె అమెరికా వెళ్ళిపోయింది ఎప్పుడో!'

'అదేంటి మొగుడికి యిలా ఉంటే ఎలా వెళ్ళింది?' దిమ్మెరపోయి అడిగాడు.

'ఆమెకి లీవు దొరకలేదు – అందుకే వెళ్ళిపోయింది.' తాపీగా జవాబు.

'అరే వాడికి బావమరుదులు, మరదళ్ళు, అత్తామామలున్నారుగా చూసుకోవడానికి, నేనెందుకు!' కాస్త బాధగా అడిగాడు.

'ఎంతయినా సొంత వాళ్ళు ఉంటే బాగుంటుంది. మా అందరికి ఎవరి పనులు వాళ్ళకున్నాయి. అప్పటికీ ఒకరోజున్నాం! నిన్న స్పృహలోకి వచ్చినప్పటినుండి నిన్ను కలవరిస్తున్నాడు – వచ్చెయ్యి!'

'అయ్యా! నాకు చదువురాదు. మొరటువాడిని. ఏదో సేద్యం చేసుకుంటూ బ్రతుకుతున్నాను. వాడికి ఎలా సేవ చెయ్యాలో కూడా నాకు తెలీదు. చదువుకున్న పెద్ద మనుషులు మీరే వాడ్ని చూసుకుంటే బాగుంటుంది.' అంటూ ఫోన్ పెట్టేశాడు సాంబయ్య ఒళ్ళంతా కంపరం పుడుతూంటే!

మళ్ళీ రింగయింది. ఎత్తలేదు. ఫోన్ ఆగిపోయింది.

ఓ గంటికి శివరాం వచ్చాడు. 'అదేంటిరా చెన్నైకి ఫోనన్నావుట!' ఆశ్చర్యంగా బాధగా అడిగాడు.

'ఏం ఆ వెధవ నీకు ఫోన్ చేశాడా?' సాంబయ్య అడిగాడు.

'ఆ! చెయ్యక ఛస్తాడా? కన్నతండ్రివి అయి ఉండి కొడుకు కోసం అక్కడికి పోనన్నావుట– నువ్వేం మనిషివని మీ వియ్యంకుడు ఆశ్చర్యపోతున్నాడు. ఆ మాత్రం ప్రేమ లేదాని అడిగాడు.' కరణం శివరాం లాజిక్కు తెచ్చాడు.

'ఆ! తండ్రి ఉన్నాడని వాడికి యిప్పుడు గుర్తుకొచ్చిందా? వాళ్ళు చదివినంత గొప్ప చదువులు, పోనీ ఆమాటకొస్తే, చదువే చదవలేదు. కానీ మానవత్వం వున్న ఎవరైనా వియ్యమందుతున్నప్పుడు, కనీసం పెళ్ళి అప్పుడయినా, వియ్యంకుడిని గౌరవిస్తారు. నా అనుమతి లేకుండా పెండ్లి నిశ్చయం చేసుకున్నారు. తాంబూలాలు పుచ్చుకున్నారు. కనీసం సమాజం కోసమన్నా నాకు ఆహ్వానం పంపలేదు. అల్లుడు వస్తే చాలనుకున్నారు. కాని ఈ రోజు అల్లుడుకు యాక్సిడెంటు అయితే అతని తండ్రి గుర్తుకొచ్చాడు. ఎందుకు? సేవలు చేయడానికి! మళ్ళీ అల్లుడు బాగుకాగానే వాడి

తండ్రిని ఎడం కాలుతో తన్నడానికి.' సాంబయ్య కళ్లు వర్షించాయి.

కరణం శివరాం ఎంతో సేపు అతన్ని ఓదార్చాడు. ఎంతో చెప్పి ఒప్పించి బయలు దేరతీశాడు.

కారు మాట్లాడుకుని డాక్టరు సుబ్బరాజును తోడు తీసుకుని శివరాం, సాంబయ్యను చెన్నైకి తీసుకు వెళ్ళాడు.

హాస్పిటల్లో దిక్కులేని వాడిలాగా మల్లికార్జునుడు పడివున్నాడు. అక్కడ అతన్ని చూడ్డానికి ఎవరూ లేరు. వార్డు బాయిస్, నర్సుల దయమీద ఆధారపడి ముక్కుతూ, మూలుగుతూ యమ బాధలు పడుతున్నాడు.

తండ్రిని చూడగానే భోరున ఏడ్చేశాడు మల్లికార్జున్.

అంతకంటే ఎక్కువ సాంబయ్య ఏడ్చాడు. శివరాం ఏడ్చాడు.

డాక్టర్లు వచ్చి గట్టిగా కోప్పడేదాకా ఆ ఏడ్పులు ఆగలేదు.

'ఏంటి పరిస్థితి డాక్టరుగారు?' సుబ్బరాజు అక్కడికొచ్చిన డాక్టరును అడిగాడు.

'ఔట్ ఆఫ్ డేంజర్! కాని చాలాకాలం ట్రీట్‌మెంటు తీసుకోవాలి! మా హాస్పిటల్లోనే కనీసం ఒక నెల ఉండాలి. ఇంటిదగ్గర ఆరునెలలన్నా మందులు వాడుతూ, ఫిజియోథెరపీ తీసుకుంటూ రెస్టు తీసుకోవాలి! అతను డ్యూటీలో చేరాలంటే ఒక సంవత్సరం పట్టచ్చు.'

డాక్టరు టెక్నికలుగా యింకా ఏవో వివరించాడు. అవి సాంబయ్యకు, శివరాంకు అర్థం కాలేదు. సుబ్బరాజుకు ఎంతవరకు అర్థమయిందో కూడా వీరికి అర్థం కాలేదు. ఎందుకిలా అయిపోయింది వాడిబతుకు!

'డాక్టర్ ! అతను మామూలు మనిషి అయి మామూలు జీవితం గడుపుతాడా? అమెరికాకు వెళ్ళి ఉద్యోగం చేసుకోగలడా?' సాంబయ్య ప్రశ్న.

'అది చెప్పలేము. దేవుడి దయ!' నిర్లిప్తంగా వెళ్ళిపోయాడు.

'నాన్నా! నన్ను క్షమించు. ఈ వయసులో నీకు శ్రమ కలిగించాను.'

'మల్లీ ! నాదేముంది! నువ్వు ప్రేమించిన గౌరీ ఏం చేస్తుందో!' సాంబయ్య ప్రశ్న.

## వియోగి (కోపల్లి విజయ ప్రసాద్)

వియోగి కలం పేరుతో రచనలు చేస్తున్న రచయిత కోపల్లి విజయ ప్రసాద్. తెనాలిలో జన్మించారు. బీఎస్సీ వరకూ అక్కడే చదివారు. 2012లో ఉద్యోగ విమరణ చేశారు. 35 సంవత్సరాల నుంచి కథలు రాస్తున్నారు. 300లకు పైగా కథలు, 75నాటికలు, 7 నవలలు రాశారు.

# ఒక గీత ఆత్మ కథ

**డాక్టర్ రమణ యశస్వి**
**98480 78807**

గీత అరచేతులు చూసుకుంటోంది పరీక్షగా. మొదటిసారి గీత ఇంతలా తన చేతుల్లోని గీతలను చూడటం. 'నా చేతుల్లో గీతలు గజిబిజిగా ఉన్నాయి నా జీవితం లాగానే' అని సన్నగా నవ్వుకుంది.

'నా ఆత్మస్థైర్యంతో ఈ గీతలన్నీ ఈపాటికి చాలావరకు సర్దిపోయి ఈ స్థాయికి చేరి ఉంటాయి. ఇప్పుడు ఒక ప్రభుత్వ ఉద్యోగిగా నేను బిజీ అయిపోతాను గజిబిజీలో బిజీనే మిగిలేలా నా జీవితాన్ని తీర్చిదిద్దుకుంటాను. చేతులే లేకుండా పుట్టిన మిస్టర్ నిక్ ఆ దేవుడు రాసిన రాతను కూడా మార్చి ఉంటాడు తన కృషి, పట్టుదలతో..' ఇలాంటి ఆలోచనలతో ఒక్క ఉదుటున లేచింది, ఒక్కసారిగా తూలి ఒంటికాలిపై నిలదొక్కుకుంది. రెక్కతెగిన సీతాకోకచిలుకలా ఎగురుకుంటూ వెళ్ళింది.

'జాలిపడకండి–గర్వపడండి' అని తన ఎదురుగా రాసిపెట్టుకున్న కాగితాన్ని తడిమిచూసుకుని నిజంగానే ఒకింత గర్వపడింది. అలాంటి స్లోగన్లు ఆ రూంలో ఎన్నో ఉన్నాయి. గోడకు తగిలించి ఉన్న మయూరి ఫేమ్ సుధా చంద్రన్, నికోలస్ (నిక్) ఫోటోలకు దణ్ణంపెట్టి స్నానాల గదిలోకి వెళ్లి స్నానం చేసింది.

తనకిష్టమైన పింక్ కలర్ డ్రెస్ కట్టుకుంది. పింక్ బిందీ పెట్టుకుంది. అద్దంలో తనను తాను చూసుకుని మురిసిపోయింది. 'మంచి రంగు, కళ కలిగిన ముఖకవళికలు, మంచి చనుకట్టు, దేవుడు దీని కాలు తీసుకెళ్లి అన్యాయం చేశాడుకానీ, లేకపోతే దీనికోసం రెక్కలగుర్రం మీద రాజకుమారుడు వచ్చేవాడు' ఇంటర్మీడియెట్ చదువుతున్నప్పుడు తన గురించి అమ్మతో అమ్మమ్మ ఇలా అనడం, అది తనకు వినపడటం ఇంకా బాగా గుర్తు.

'మా అమ్మమ్మ నాలో ఆత్మస్థైర్యం నింపడానికి నా అందాలను తానే పొగుడుతూ నీ కాలుందో లేదో చూడకుండా నీ అందం చూసి నిన్ను చేసుకునే వాడు వస్తాడే అని ధైర్యం నాలో కలిగించేది అవకాశం దొరికినప్పుడల్లా'

తయారై కూర్చుని మోకాలికి కిందదాకా తీసేసివున్న కాలుకి కృత్రిమ కాలు పెట్టుకుంటుంటే కళ్ళల్లో నీళ్లు సుళ్ళు తిరిగాయి ఆలోచనలు గతంలోకి జారుకున్నాయి.

***

మాది గుంటూరు జిల్లాలోని ఓ పల్లె. తాగుబోతు నాన్న చెక్కరిక్షా వేసేవాడు. ఇంట్లో ఇచ్చేవాటికన్నా చిన్నా చితక అబద్ధాలు చెప్పి తీసికెళ్ళే సొమ్మే ఎక్కువ. అమ్మ, అమ్మమ్మ చెమటోడ్చి కూలిపనులు చేసి సంపాదించిన దాంట్లో పొదుపుచేసి, నాన్నని సమర్థించుకుంటూ సంసారాన్ని గుట్టుగా జరిపేవారు.

అన్నకు నాకు ఆరేళ్ళు తేడా. అన్న తర్వాత మళ్ళీ పిల్లలకోసం మందులు వాడితే నేను పుట్టానట. అమ్మమ్మ, అమ్మా మంచి రంగు. నాన్న చామన ఛాయ.

తాగి తాగి రంగు విరిగిపోయింది అని అమ్మ వాపోయేది. నాకు మూడు, అన్నకు తొమ్మిదేళ్ళప్పుడు నాన్న కల్తీ సారా తాగి చనిపోయాడు. నాన్న చనిపోయిన ఆరేళ్ళ తర్వాత మా కుటుంబం చిన్నాభిన్నమైపోయింది. అన్న సైకిల్ బాగా తొక్కుతాడు. నేను తన వెనక కూర్చుంటే ఇద్దరం బడికి వెళ్లేవాళ్ళం. అన్న పదో తరగతి, నేను ఆరో తరగతిలో ఉన్నాం అప్పుడు. అన్న వెనక కూర్చుని మేము సైకిల్‌పై వెళ్తుంటే తాగి ఆటో నడిపిన ఆటో వాడి తప్పువల్ల అన్న అక్కడికక్కడే చనిపోయాడు. నాకు కుడికాలు నుజ్జు నుజ్జయ్యింది. నన్ను జనరల్ ఆస్పత్రిలో చేరిస్తే ఉంచే పరిస్థితి లేక మోకాలు కిందివరకు తీసేశారు. అన్న చనిపోవడంతో మేము ముగ్గురం సగం చచ్చిపోయాం. అన్న హీరోలాగా ఉండేవాడు. బాగా చదివేవాడు. అంతా మట్టిలో కలిసిపోయింది. అన్నకు గాంధీ, అబ్దుల్ కలాం,అంబేడ్కర్ ఆశయాలు బాగా నచ్చేవి. కులం గురించి మాట్లాడితే చిరాకు పడేవాడు.

అమ్మవాళ్ళ అన్నయ్య గుంటూరులో ఒక అపార్టుమెంటులో కాపలా ఉద్యోగం చూపించాడు. అమ్మమ్మ, మేము గుంటూరు చేరాం. అక్కడంతా శుభ్రంగా ఉంచి, కాపలా ఉంటూ వచ్చే, పోయేవాళ్లకు సమాధానం చెప్పడమే మా పని. కొన్నిరోజులు బాగానే గడిచింది. ఆ అపార్టుమెంటులో కొంతమంది పొద్దున్నే కుంటిపిల్లను చూడాల్సి వస్తుంది, కావాల్సిన పనులు అవ్వడం లేదు వీళ్ళను తీసేసి కొత్తవాళ్ళను పెట్టమని తీర్మానించి మమ్మల్ని తీసేశారు. వారి సమావేశంలో కొందరు మా కులం ప్రస్తావన కూడా తెచ్చారట. మనమీద కేసులు కూడా పెడతారు ఎంత తొందరగా వీళ్ళను వదిలించుకుంటే అంత మంచిదని వారు వాదించారట.

ఇక మళ్ళీ పల్లెటూరెళ్లలేక, వెళ్లే ఇష్టం కూడా లేక ఆ పట్నంలోనే నా బడికి దగ్గర్లో చిన్న ఇల్లు అద్దెకు తీసుకొని అమ్మావాళ్ళు ఇళ్లల్లో పాచిపనికి కుదిరారు. నాలుగైదు ఇళ్లల్లో పని చేయడం వల్ల డబ్బులు బాగానే వచ్చాయికానీ వాళ్ళిద్దరి ఆరోగ్యం గుల్లవుతూ వచ్చింది.

నేను పదోతరగతి ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాను. నేను ఎక్కడా కులం చెప్పడానికి ఇష్టపడలేదు. హెడ్మాస్టర్, నీది మంచి రిజర్వేషన్ వచ్చే కులం. నీకు చదువు, ఉద్యోగం అన్నిచోట్లా అది ఉపయోగపడుతుంది అని చెప్పినా నేను వినలేదు.

కుల ప్రస్తావన లేకుండా అప్లికేషన్ పూర్తి చేసాను. కులధ్రువీకరణ పత్రం కూడా తీసుకోలేదు. కొన్ని సందర్భాలలో అన్న ఉంటే ఎంత బాగుండేది అనిపిస్తుంది. అన్న లేకపోవడంతో ఒక్కోసారి రెండోకాలు కూడా పోయింది అన్నంత బాధ వేస్తుంది.

కాలు కోల్పోవడం వల్ల నాకు మనోనిబ్బరం, సహనం, జ్ఞానం సకలాంగులకన్నా ఎక్కువగా అబ్బినట్లు అనిపిస్తుంది. ఇంటర్మీడియట్ చేశాను. స్నేహితులతో పాటు పుస్తకాలతో కూడా సమయాన్ని గడుపుతున్నాను.

గాంధీ ఇష్టం అంటే.. ఒక కులం అంటగడుతున్నారు. అంబేడ్కర్ ఆశయాలు ఇష్టం అంటే ఇంకో కులం అంటగడుతున్నారు. నాలాంటి వికలాంగులైన వాళ్ళను స్ఫూర్తిగా తీసుకోవాలని మయూరి ఫేమ్ సుధాచంద్రన్ గురించి నెట్‌లో చదువాను.

అలాగే 'నిక్' అని కాళ్ళు, చేతులు లేకుండా పుట్టిన ఆస్ట్రేలియన్ మోటివేషనల్ స్పీచెస్ కూడా విన్నాను. నిజానికి నేను ఎప్పుడూ మోటివేట్ అయి ఉండటానికి, సుధాచంద్రన్, నిక్ ఫోటోలు నా బాగ్‌లో పెట్టుకుని తిరిగాను.

అలా నా ఇంటర్ అయి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నప్పుడు నాకు ఒక సంబంధం వచ్చింది. అమ్మమ్మ బాగా పట్టుపట్టింది తన ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉంది . అంతా సవ్యంగా ఉండే సంబంధం అయితే పెళ్లి అయిన తర్వాతా కూడా చదువు కోవచ్చని నాకు నచ్చచెప్పి పెళ్లిచూపులు పెట్టించింది. నా మీద అమితమైన ప్రేమ, తాను ఉండగానే నన్నొక ఇంటిదాన్ని చెయ్యాలనే పట్టుదల, అమ్మ ఒక్కతే చెయ్యగలదో లేదో అనే భయంతో మధ్యవర్తిని ఎక్కువగా నమ్మిన అమ్మమ్మ వచ్చిన పెళ్ళికొడుకుని చూసి అమ్మతో చెప్పింది. 'ఇతను మనకొద్దు బాగా పెద్దగా ఉన్నాడు, ముదురు మనిషి' తప్పదు కదా అని టిఫిన్లు, కాఫీలు అయిన తర్వాత ఆయన మాటలు విని అమ్మమ్మకు పిచ్చికోపం వచ్చి బాగా తమాయించుకొని మర్యాదగా బయటికి పంపించింది.

ఆయన గారికి ఇది రెండో పెళ్లట. 'వీళ్ళింట్లో ఒక బాగున్న పిల్ల ఉంది ఆ అమ్మాయికి ఒక కాలు కూడా లేదు' అని పనివాళ్ల ద్వారా తెలుసుకుని అమ్మమ్మకి తన వయసు,

తనకు పెళ్లి అయిందని దాచిపెట్టి చూపులకు వచ్చాడు.

ఆ పెళ్లికొడుకు మాటలని చెప్తూ అతడ్ని తిట్టి పోస్తోంది. పెళ్ళానికి ఆరోగ్యం బాగాలేక ఇద్దరుపిల్లల్ని హాస్టల్లో ఉంచి చదివిస్తున్నాడుట.

రోగిష్టి పెళ్ళానికి బదులు చుక్కలాంటి నా మనవరాలిని మనువాడుతాడా ? వాణ్ణి దేవుడు కచ్చితంగా శిక్షిస్తాడు.

ఇంక పైగా వాడికి కట్నం వద్దుటగానీ, 'ఆ కాలు సంవత్సరానికి ఒకసారి మార్చినా నాతో ఉన్నంత కాలంలో కనీసం ఆ కాలుకి 3 లక్షలు అవుతాయి. అవి ఇవ్వండి చాలు' అంటూ అక్కడ పెట్టిన కాలుని చూపించి అన్నాడుట. 'వాడే మానసిక వికలాంగుడు. మన పిల్ల దివ్యాంగురాలు. మంచి మనసున్న దేవత. వాడి మొహానికి కాలు ఖర్చులు ఎదురువ్వాలిట. తనకు జీవితాంతం ఇబ్బంది లేకుండా చూసుకుంటాడట ఆ డబ్బు ఇస్తే. పిల్లలు పుట్టినా తనే సాక్కుంటాడట. బీదోళ్లులే వెంటపడతారు అనుకుని ఇన్ని ఆలోచనలు చేసుకొని వచ్చాడు. వెధవాలోచనలూ వీడూను'

ఈ పెళ్లి చూపుల తతంగంతో నాకు కూడా ఒక పట్టుదల పెరిగింది. ఇక ఎప్పటికీ పెళ్ళిచూపుల్లో కూర్చోకూడదని. కాలు ఖర్చులు అడగటం చాలా అసహ్యంగా అనిపించింది.

ఒక దివ్యాంగురాలి పైన అతని నైజం బయటపడింది. ఇలాంటి వాళ్ళు లోకంలో, అలాగే మగవాళ్ళలో ఎక్కువగా ఉంటారనిపించింది. అందుకే నన్ను ఇష్టపడేవాడు దొరికితే ప్రేమించి పెళ్లి చేసుకోవడంగా నిర్ణయించుకున్నాను నా మనసులో. అందుకే నా పెళ్లి విషయం దాటేస్తూ వచ్చాను అప్పటినుండి. అయితే అమ్మమ్మ బాగా దిగులుపడి రెండు నెలల్లోనే మంచం, మరణం అయిపోయింది. పాపం అమ్మమ్మ. నా గురించే ఆలోచించే నా ప్రేమప్రాణి నాకు దూరమైపోయింది. నేను, అమ్మే మిగిలాం. ఆమె మరణం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. జీవిత పోరాటాన్ని, ప్రేమ తత్వాన్ని ఒంటపట్టేలా చేసింది.

డిగ్రీ కూడా పూర్తి చేశాను. అమ్మని చూసుకుంటూ ఆలోచనలు ఎటూ మరలకుండా చూసుకున్నాను. అప్పుడప్పుడు వయసు చేసే చిలిపి ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి అయ్యేది. కాళ్ళూ చేతులు లేని 'నిక్' ని ఒకమ్మాయి ప్రేమించి పెళ్లిచేసుకోలా? తోడుంటే బాగుణ్ణు. హాయిగా కబుర్లు చెప్పుకుంటూ సరదాగా గడపటానికి ఒక మగ స్నేహితుడు ఉంటే? ఇలాంటి ఆడమనసు ఆలోచనలు సహజమే అని సర్దిచెప్పుకుంటూ, ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ గ్రూప్ పరీక్షలకు చదవడం మొదలు పెట్టాను.

ఒకరోజు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి కృత్రిమ కాలుపెట్టే మొండెం నొప్పి పుడుతుందని చూపించుకొని వచ్చాను. మాత్రలు రాసి ఇచ్చారు. వాక్ ఫౌండేషన్‌లో కృత్రిమ కాళ్ళు

మంచివి ఉచితంగా ఇస్తారు అని చెప్పి వాళ్ళ అడ్రస్ ఇచ్చాడు ఆ డాక్టర్. చాలా హెల్పింగ్ నేచర్ ఉన్న డాక్టర్‌లా ఉన్నాడనిపించింది. వాళ్ళిచ్చిన కాలు పెట్టుకొని మళ్ళీ ప్రశాంతంగా చదువుకున్నా. కులం ఎవరికీ చెప్పలేదు. రిజర్వేషన్ పరీక్షలకు కూడా వాడలేదు. పట్టుదలగా ఓపెన్ కేటగిరీలోనే గ్రూప్ వన్ ఉద్యోగం కొట్టాలనుకున్నా. ఆఖరుకి మహిళా కోట, వికలాంగుల కోటా కూడా ఆశించకుండా నేనేమిటో నిరూపించాలని సవాలుగా స్వీకరించి శిక్షణ తీసుకున్నా.

***

ఆలోచనా తరంగాలు మళ్ళీ జీవితం ఒడ్డున తెచ్చి పడేశాయి. తనకి తహసీల్దారు లద్యోగం వచ్చింది ఇవ్వాళే చేరబోతోంది. కలెక్టర్ ఆఫీసులో రిపోర్టు చేసి ఒక మండల కేంద్రానికి అధిపతిగా ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతలు చేపట్టింది గర్వంగా. మొదటి సంతకం ఒక వికలాంగురాలు కులం ధ్రువీకరణ పత్రం మీద పెట్టాల్సి వచ్చి నవ్వుకుంది. డబ్బులు ఇవ్వలేను అని టెన్షన్ పడుతూ బయట నిల్చున్న ఆ దివ్యాంగురాల్ని పిలిపించుకొని ధైర్యంతోపాటు బెస్ట్ విషెస్ చెప్పి పంపింది. అవినీతికి ఆమడ దూరం జరిగినట్లు అనిపించింది.

ఆ రోజు ఆఫీస్ అయిన తరువాత సాయియంత్రం ఇంటికెళ్తుంటే 'గీతా' అని పిలిచిన మగ గొంతు విని వెనుదిరిగి చూశా. అతన్ని పోల్చుకోలేకపోయా.

'నేనండీ మిమ్మల్ని ప్రభుత్వాసుపత్రిలో చూసి మందులు రాసిచ్చిన ఆర్థో డాక్టర్ని. ఇందాక మీరు సంతకం చేసింది మా కజిన్‌కే. తనకు తెలీదంటే నేను తీసుకొచ్చాను లోపలికి రాలేదుకానీ సీట్లో మిమ్మల్ని చూసి చాలా ఆనందించాను. తనని దింపేసి మిమ్మల్ని కలుద్దామని వచ్చేసరికి మీరు బయలుదేరి పోతున్నారు'

అప్పుడు గుర్తొచ్చింది తనకు ఆరోజు ఈ యువ డాక్టరే మందులు రాసిచ్చింది. 'మీరు నడుస్తుంటే మయూరి నడిచినట్లే ఉంది. మీలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతుంటే చూడముచ్చటగా ఉంది అన్నట్లు నా పేరు చెప్పలేదుగా రవి కిరణ్. మీ పేరు గీత అని మీ గది ముందు చూశాను'

మనసులో ఏదో అలజడి. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటే ఏమిటో నాకు తెలుస్తోంది.

ఇద్దరం అనుకోకుండా మా ఇంటిదాకా నడిచే వెళ్ళాం. తన బైక్ ఎక్కమన్నాడు కానీ నా అన్న సైకిల్ ఎక్కడం తప్పించి ఇప్పటిదాకా ఎవరి వెనక కూర్చుని నేను వాహనాల మీద వెళ్ళలేదు. ఏదో అనుకోని భయంతో ఎక్కను అని చెప్పేశాను.

తనుకూడా కష్టపడి మెడికల్ సీట్ కొట్టాడట. ఆ తర్వాత ఆర్థో పీజీ సీట్ ఇక్కడ గుంటూరు వైద్య కళాశాలలో వచ్చిందిట. ఇప్పుడు ఫైనల్ ఇయర్‌లో ఉన్నాడట. ఆ రోజు చూసినదగ్గర్నుండి మళ్ళీ ఒక్కసారన్నా కలవాలని అనుకున్నాడట. కానీ ఇల్లు, ఉండే

చోటుకానీ తెలియక పోవడంవల్ల కలవలేకపోయాడట. ఇప్పుడు అనుకోకుండా ఒక మంచి పనిచేయడానికి వచ్చినప్పుడు నేను కనపడటంతో అదొక శుభ సూచకంగా అనిపిస్తోందిట.

తన నంబరు ఇచ్చి ఏ అవసరం వచ్చినా ఫోన్ చెయ్యొచ్చని చెప్పి వెళ్ళిపోయాడు. నేను మా ఇంట్లోకి వెళ్ళేదాకా నన్ను గమనించడం నేను ఓరకంట గమనించి సిగ్గుల మొగ్గే అయ్యాను.

అలా మొదలైన మా పరిచయం ఎన్నో ఊసులతో, ఎన్నో విషయాల చర్చలతో మంచిగా రెండేళ్లు సాగింది. తనకు కూడా కులం, మతం అంటే నమ్మకం లేదుట. తనకు అమ్మ చిన్నప్పుడే పోయిండట. తండ్రి వేరే పెళ్లి చేసుకొని వెళ్లి చాలా రోజులయింది తనకు కనపడక. ఇక హాస్టల్ బతుక్కి పుస్తకాలకి అలవాటు పడి చదువు చివరికి వచ్చేశాడట.

రవిని అమ్మకు కూడా పరిచయం చేశాను. ఇద్దరి మనసులు కలిశాయని, అభిరుచులు అభిప్రాయాలు కూడా ఒకటేనని చెప్పాం. అమ్మ సమక్షంలో ఆర్య సమాజంలో పెళ్లి చేసుకున్నాం. మాకు ఒక అబ్బాయి పుట్టాడు. వాడి పేరు మిళిత్. మేము కులమే లేని ప్రేమికులం. వాడు దళితుడు కాదు, పెద్ద కులపోడు అసలే కాదు. కులాలని మట్టుపెట్ట పుట్టిన మిళితుడు. అందుకే మిళిత్ అని పేరు పెట్టాం. వాడు పుట్టిన నెలకే నాకు ఐఏఎస్ సెలక్షన్ వచ్చింది. రవికి ఆర్థో విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం వచ్చింది. ఇద్దరం సమాజంలో మార్పు కోసం చాలా కష్టపడుతున్నాం. ముఖ్యంగా దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపడానికి కృషి చేస్తున్నాం. కులరహిత సమాజం కోసం పాటుపడుతూ మిళితులు అని వారిని పిలుస్తూ సంఘంలో వారి సంఖ్య పెరిగేలా చూస్తున్నాము. 'నిక్' లా మోటివేషనల్ ప్రసంగాలతో యువతని, వికలాంగులని ప్రభావితం చేస్తున్నాం.

జీవితమొక ఉత్సవం.. సాగుతూనే ఉంటుంది.

***


## రమణ యశస్వి

కళారత్న డాక్టర్ రమణ యశస్వి ,ఆర్తో పెడిక్. గుంటూరు వైద్య కళాశాలలో పని చేస్తున్నారు.

# రుణం

డాక్టర్ సిద్దెంకి యాదగిరి
– 94412 44773

మనిషిని మనిషి సూస్తే ఎగ్రిలేసే కాలం. మిన్నిరిగి మీదపడ్డట్లు లాక్‌డౌన్‌తోటి పబ్లిక్ లాక్కోలేక పీక్కోలేక తండ్లాడుతుండ్రు. సినిమాలు, కల్లుదుకుణాలు, వైన్‌షాపులు సకులం బందయినయి. బతుకు బండకింద చెయ్యిరికినట్లు, కొనవోతే కొరివి అమ్మవోతే అడివిలా తయారైంది. మందుసారాలు తాగి తాగి తానంజేసినోల్లు దొరుకకపోయెవరకు ఔలలపడ్డరు. పెయ్యంత పెంకాసులతోటి రాక్కుంటుండ్రు. తల్కాయె గుద్దుకుంటె బొడుసు పొడుత్తుంది. గొంతికె కోసుకునేటోల్లు మోపైతండ్రు.

అది కుక్కమూతి ట్రాలీఆటో, క్యాబిన్లో డ్రైవర్‌తో ముగ్గురున్నరు. వెడల్పైన ట్రాలీలో మనుషుల్లాంటి పాతబట్టల ముల్లెలు రెండున్నాయి. కదులని మల్లెలాగ ఓ మనిషి. పీనుగు తీర్గయిన మనిషి తూట్లుపడ్డ బొంత పురాగ కప్పుతలేదు. ఆ మనిషికి క్యాలిలేదు. గాలిని చీల్చుతూ దూసుకెల్లే ఆటో రువ్వడికి కప్పిన బొంత సగం కోసిన యాటలా కొట్టుకాడుతంది.

ఆటో చెవులు కోసిన కుక్కవోలే ఊల్లెకు అడుగువెట్టింది. ఇచ్చంత్రాల ఊరు ఉట్టిగుంటదా? పొద్దుతిరుగుడు సేన్ల రామసిల్కలు చేరినట్లు చౌరస్తాలో గుమికూడింద్రు. జాండసుట్టూ జెమ్మటాలు గొడ్తరు. ఎప్పటికీ మంది తెగని తీర్తమోలే గుంపులు గుంపులు ముచ్చెట్లు పెడుతరు. లోకమ్మీది సుద్దులు, ఎతలు ఎల్లవోసుకుంటరు.

అంబేద్కర్ చౌరస్తా నుంచి రాజేశునిగుడి, మసీద్, బుట్లుపెట్టిన బంతిగోదల్లాగ జాండ దగ్గర మంది మూతులకు బట్టకొని మొగులకు మొకం పెట్టి ముచ్చెట్లతో నిలవడ్డరు.

'ఏ ఊరు ఆటో? ఎటువోతుంది? ఎందుకు వోతుంది? ఆటోల ఎవలు? ఇటెందుకు వొస్తండ్రు?' అని ప్రశ్నించుకుంటూ రెప్పకొట్టని చూపుల సూదులు ఫోకస్ దీపాలోలే కుట్ కుట్ సప్పుడుతో వస్తున్న ఆటోను తకాంచి తకాంచి సూత్తున్నయి.

ఏనుగులు వోతుంటె కుక్కలు మొరుగయన్నట్లు ఏం పట్టించుకోకుంట ఆటో పోతనే ఉంది. టెంట్ ఏసినట్లున్న రాయిచెట్టు మీది కొంగలు ఆటో సప్పుడుకు అదురుతలేవు,

బెదురుతలేవు. ఆటోను సూసిన మనుషులు బెజ్జంకి తీర్తంల మంద బెదిరినట్టె బెదురుతుంట్రు. రాయిచెట్టు చెత్తిరికింద పురాతన హనుమాండ్ల గుడి పక్కనుండి ఆటో పోతున్నప్పుడు రామలీలలు వినుమని మైక్ ఒక తీరుగ పాడుతంది.

కుట కుట కుట అనుకుంట ఉప్పునీళ్ల బాయికాడ ఆగి, ఎండలోల్ల ఇండ్లదిక్కు తిరిగింది. వాడకట్టులో కొమ్మలు కొట్టేసిన చెట్టులా పాతగోడలు మొండిగా నిలుసున్నై. మూడొంతుల కూలిన ఇల్లు. దయ్యమోలె మొలిచిన చీదులు. ఆటో ఆ ఇంటి ముంగట ఆగింది. కన్నుమూసి తెరిసే వరకు కానిపని దప్పుసాటింపు చేసినట్లు సాకలివాడకు, ఊల్లెక్కాడ దప్పు దాటిచ్చినట్లు ఎర్కయింది. ఇగ బొద్దూడని పిల్లకాన్నుంచి సూసెతందుకు కదిలొచ్చింట్రు. రాల్లగోడ పేర్చినట్టు కటారకట్టి సూత్తంట్రు.

దగ్గు, దమ్ము, జరంతో క్యాలిదప్పింది మడేల్. ఎనుకట ఊల్లెకేలి ఎల్లిపోయినపుడు ఎత్తూ, పొడుగూ నల్లటి మనిషి. నల్గురినైన ఎదుర్కొనే బలమీమ్మదున్నడు. ఇప్పుడు ఎన్ని బొక్కలున్నయో లెక్కపెట్టేట్లున్న బొక్కలగూడుకు అతుక్కపోయిన తోలు. చీకేసిన మామిడిపండు తీరు దివాలదీసిండు. ఆటోలో వొచ్చిన మనుషులు తల్కాయె ఒకలు, కాల్లు ఒకలు పట్టి దించుతుంటె తెల్లటి గడ్డం ఎండి దారల్లా మెరుస్తాంది.

బీమారిపడ్డ మనిషిని ఎవలు గుర్తించలే. 'ఈ మనిషెవలు?' అని గుసగుసలు పెట్టుకుంటంట్రు.

'ఈయెన మడేల్. కడింటి మైసయ్య అన్న కొడుకు మనోడే గాదు.' ఆఖరికి సాకలి పెద్దెల్లవ్వ పశ్నత్‌పట్టి చెప్పె.

'ఎవలు?' అని తీవ్రస్వరంతో ఒక ఆడగొంతు ధైర్యంగా ఆటో డ్రైవర్ను ప్రశ్నించింది.

'ఈయెన సాకలి మడేల్. ఈ ఊరేనట. మా గల్లిల మోరిమీద డబ్బ పెట్టుకున్నడు. ముప్పైఏండ్లుగా మా బట్టలు పిండిండు. ఇస్తిరి చేసిండు. వొచ్చిన పైసలు ఉన్నంతల దానధర్మం చేసిండు. మనిషి సాకలి. మనసు పూజరి.' అని డ్రైవర్ చెప్పుతుండు.

'పూజారైతే నడింట్ల పెట్టుకోపోయినవ్? ఎందుకు దించుతున్నవ్' అడ్డుపడుతూ దబాయించుతుంది.

'ఇగ బాగా దగ్గు, సడిది, జరమొచ్చింది. జర్ర మాట్లాడుతున్నప్పుడు. ఈ మడేల్‌ను అడిగితే నా పాణం ఎటో అయితంది. నన్ను మా ఊరికి తీసుకపోంన్డి. నేను అక్కన్నే సత్త. అని క్యాలిల ఉన్నపుడు ఒక్కతీరుగ బతిలాడిండు. ఇప్పుడు కూడా కలవరిత్తండు. రోడ్‌మీద శాపపిల్లోలె కొట్టుకాడుతుండు. మా నాసర్‌పుర గల్లీవాల్లం మనిషిన్ని ఏసుకొని ఈ ఆటోల ఇక్కడికి తెచ్చినం.' అని చెప్పుతండు డ్రైవర్‌తో వొచ్చినతను. మాట్లాడేది మాట్లాడుతుండంగా వేరేవాళ్లు ఆ ముల్లెలు ఆటోలోంచి దించింట్రు.

'సచ్చెటోన్ని సావనియ్యక ఇక్కడికెందుకు తెచ్చింట్రు? ఎవ్వల్ల

సంపుతవనుకుంటుండ్రు? ఎవడు తెమ్మన్నడు. ఎందుకు తెచ్చిండు? మనిషిగాలి మనిషికి పడని కాలం. కసాయి కరోనా కాలం. మా వాడకట్టంత సావాలని తెచ్చినవా? ఏయ్ తెచ్చినట్టు వాన్ని తీసుకపోతనే గని నీ ఆటో ఉండది, నువ్వుండవు? ఆగు నేను నా పెనిమిటికి ఫోన్ చేస్తన్న ఆగు. నీ పాసంగం ఏందో నువ్వేందో బయటపడ్తది.' అని ఒగ నడీడు ఆడమనిషి లొల్లిపెడుతూ ఫోన్ కలిపి చెవుకాడ పెట్టుకుంది.

'హల్లో రావయ్యా! రా.. మనింటికాడ పీనుగు తెచ్చి ఏత్తుర్రు.రా..' అని ఫోన్ పెట్టింది.

ఆటో డ్రైవరుకు కాళ్లుపాయి కడుపుల పడ్డయి. 'లొల్లిల ఎల్లి కాటగలిసినట్లు. ఇదే సందు. అందరు ఒక్కటై కొట్టినా కొడుతరు. ఎందుకొచ్చిన కైలాట్కం. ఆలస్యమైతే పోలీసులకు ఫోన్ చేస్తరు. అసలే ఈ ఆటోకు ఫిట్‌నెస్‌లేదు. పట్టుకున్నరనుకో నా బతుకు పెనమ్మీదికేలి పొయిల పడ్డట్లయితది. నేను, నా ఆటో గోవింద.' అని అనుకొని 'ఎక్కుండ్రి ఎక్కుండ్రి' అని డ్రైవర్ అన్నడు. ఆటోల వొచ్చినోల్లు రయ్యన గాలి సొచ్చినట్లు ఎక్కిండ్రు.

ఆగంల క్లచ్‌పట్టి ఏసిన గేరును లటుక్కున వొదిలిండు డ్రైవర్. ఆటో జట్కిచ్చి జంపుజేసి దుంకి గాలిమేఘమోలే సిమెంట్ రోడ్డు మీంచి వొచ్చిన తొవ్వెంట మర్రిసూడని పిరికి కుక్కోలే ఒక్క తీర్గ ఉరుక తలిగింది. పొలిమేర దాటి పెద్దరోడ్డు ఎక్కంగనే గండంల కేల దాటి బతికితిమిరా అనుకున్నరు ఆటోల ఉన్నోల్లు.

ఫోన్‌ల మీద ఫోన్ కొడ్తనే ఉన్నరు. ఊరుఊరంత సాకలి మడేల్ వార్త గప్పుమన్నది. ఊరు ఉసికె ఉడికినట్లు ఉడుకుతుంది. తలిస్తే మొలిచినట్టు సర్పంచి, ఉప సర్పంచి, వార్డు మెంబర్లు, ఆశ కార్యకర్తలు, పారిశుద్ధ కార్మికులు, మస్కూర్లు ఒకలెనుక ఒకలు అందరొచ్చిండ్రు. అందరు వొత్తండ్రు.

'అరేయ్! దూరం నుంచి పిలువుపోరా! పలుకుతడేమో?' అని సర్పంచి సుంకరి శివయ్యను గెదిమిండు.

'వానికి క్యాలి లేదు. వాడేం మాట్లాడుతడు?' అని ఓ వయసుడిగిన పెద్ద మనిషి మాటలు.

'ఏమన్నగాని పోరా! పో.. పోయి సూడుపో..' అని సర్పంచి అన్నడు.

సర్పంచి మాటకు ఎదురుచెప్పలేక సుంకరి శివయ్య అడుగులో అడుగేస్తూ ఊసరెల్లి లెక్క భయపడుకుంట పోతండు. ఒగ పదిగజాల దూరంలో నిలుచుండి 'ఓ.. మడేల్.. మడేలో.. మడేల్ ' అని పిలుస్తుండు.

కుయ్యి కుటుక్కు ఏదీలేదు. ఒక్క తీర్గ 'ఊ.. ఊ.. ఊ.. ' అని మూలుగుతుండు.

'ఓ' అని అంటడేమోనని అక్కడ చేరిన గుంపు ఊపిరి బిగపట్టి సూత్తుంది. శివయ్య

మళ్ళీ మళ్ళీ పిలుస్తండు.

పెయ్యంత ఒణుకుడు. వానకు తడిసిన ఒక్క ఎద్దోలే తామూటుగాని వొణుకుడు. మడేల్‌ది బొక్కలోంచి వినవడే మూల్గల రాగమే ఇనవడుతుంది.

'అరేయ్ శివ్వా! ఇగవటు దీంతో పొడువు.' అని బ్యాగరి బూమయ్య గైకట్టె సేతికిచ్చిండు.

గైకట్టెను పట్టుకొని కట్టె పొడుగూత సూసి 'దీంతోటి పొడిస్తే బతుకుతడా? అయింత చచ్చిపోతే ఎట్లా? నేను ఆ పాపం మూటగట్టుకోవన్నా?' అని శివయ్య జవాబిచ్చిండు.

ఊరంత వొడిసుడి పడుత్రా అంటే పాపమంటవేందిరో? నా తెడ్డువాయే గూత్తే. పొడువనైతే పొడువు.' అని ఈడు మల్లిన పెద్దమనిషి ఈరయ్య బెదిరించిండు.

శివయ్య మడేల్ దిక్కు సర్పంచి దిక్కు సూసిండు. సమిజైతలేదు. సర్పంచి కానీ.. కానీ అన్నట్లు బొమ్మలు ఎగరేసిండు.

రంగారెడ్డి జిల్లాలో గడ్డివాముల అంటు పెట్టి రాగోలతోటి ఆ మంటల్లకు ఎగతోస్తున్న సంఘటనే గురుతొచ్చింది. 'వొద్దొదు పొడువకుండ్రి.' అని అన్నల్లవోయి లొంగిపోయిన లచ్చుమయ్య కోరలు పీకిన పాములెక్క బుసకొడుతున్నడు.

'ఎవడ్రా వొద్దనేది? లేసిలేవలేని మాటలెనీయిరా? వొంగవెట్టి తన్నతా' గట్టిగ బెదిరించేవరకు ఆ మందిల లచ్చుమయ్య మాటలు ఎవలకు వినవల్లేదు. లచ్చుమయ్య కూడా సాలిచ్చుకున్నడు.

'శంకరా! ఎట్ల పొడుత్తు? అనుకుంటూనే పొడుత్తండు. మడేల్ అని భయపడుకుంట ఈపుల పొడిసిండు. సడిలేదు, సప్పుడు లేదు. బిగపట్టిన పండ్లతో దొక్కలో పొడుస్తున్నపుడు తన అక్క ఇంట్ల క్రిస్మస్‌నాడు టీవిల యేసుదేవున్ని బర్సికట్టెతో పొడిసిందే యాదికొచ్చింది శివయ్యకు. దొక్కలో పొడుస్తున్నపుడు మడేల్‌లో చిన్న కదిలిక.

'నేం చెప్పలే. గైకట్టెతో పొడిస్తే పానం తకరారు తెలుస్తది. నేం చెప్పలే. అరేయ్ శివ్వా! మాట్లాడుకుంట పొడువురా?' అని గొప్ప ఉపాయమేదో చెప్పినట్లు బ్యాగరి బూమయ్య చెప్పుతనే ఉన్నడు.

'పొడువు, పొడువు.' గుంపులోంచి అల్లరి.

అటీటు బిత్తర సూపులు సూత్తండు శివ్వయ్య. మనిషికొక మాటనేవరకు ఏం చెయ్యాల్నో తోయలే. 'మడేల్, మడేల్ అని పొడుస్తున్నపుడు' అంబేద్కర్ కాన్నుంచి కుయ్యి కుయ్యి అనుకుంటూ పోలీస్‌జీప్, అంబులెన్స్ రెండూ సౌండ్‌తో వస్తూనే ఉన్నాయి. 'ఇక్కడికి ఇంత నయం.' అని శివ్వయ్య సాలనుకున్నడు. అందరు జీప్ సౌండ్‌ను సెవులు నిక్కించి ఇంటండ్రు.

పెద్దగుండు వాగు ఉరికొచ్చి చెక్‌డ్యాంను గుద్దుకొని నిండుకున్నట్లు రయ్యాన ఉరికొస్తున్న పోలీస్ జీప్ బ్రేక్‌లు తొక్కంగనే అడుగుల ఆగింది. టక్కన డోర్‌తీసుకొని కాకిబట్టల కదర్‌తోని టోపి సరిజేసుకుంటూ దిగి పొడవున్న ఎస్సై పెద్దపీరిలా నడిచి వొస్తున్నాడు.

పోలీస్ హారన్ అదేపనిగా మోగుతుంది.

ఎస్సై రాకడను గమనించిన సర్పంచి లేసి ముసిముసిగా నవ్వుతూ నిలపడ్డడు. ఇద్దరు విష్ చేసుకున్నరు. ఎస్సై ప్రశ్నలు అడుగుతున్నడు. సర్పంచి మడేల్ తాలూకు విషయాలు వివరిస్తున్నాడు. స్టేషన్ రైటర్ సమాధానాలు ఒక్కొకటిగా బుల్లెట్ పాయింట్‌లాగా రాసుకుంటున్నాడు.

'ఉయ్యి ఉయ్యి అనుకుంటూ అంబులెన్స్ కూడా వచ్చి ఆగింది. మిలమిల మెరిసే ధవళ వస్త్రంతో దేవకన్యల్లా పీపీఈ కిట్‌లు ధరించిన ఇద్దరు సిస్టరమ్మలు, ఇద్దరు డాక్టర్లు దిగిండ్రు. దిగుతూనే తమ డ్రెస్సులు సరిచేసుకొని వైద్య సరంజామతో మడేల్ దిక్కు నడుస్తున్నరు.

మడేల్ పైన బట్టని తీసి చూస్తే కారిన నెత్తురు మరకలు. కవుసుతున్న నెత్తురు. ఎగపోత, దుమ్ము, దగ్గు, సలిజరం లక్షణాలతో మొస తీయలేక తండ్లాడుతున్నడు. బీపి, ఆక్సీపల్స్ మీటర్ ఎచ్చు తగ్గులు. మంచి వైద్యంకోసం మడేల్‌ని సిద్ధిపేట ఐసోలేషన్ వార్డుకు తరలిస్తున్నమని చెప్పిండ్రు.

ఎస్సై, సర్పంచ్ 'సరే' అన్నరు. వాడకట్టంత ఒక్కసారి ఊపిరి తీసుకున్నట్లున్నది.

స్ట్రెచ్చర్ మీద మడేల్‌ని అంబులెన్స్‌లో ఎక్కించుకున్నరు. అంబులెన్స్ కదిలే ముందు 'ఈ పెషెంట్ సంబంధీకులు ఎవరున్నరు?' అని అడిగిండు.

'ఎవ్వల్లేరు.'

'ఈ పెషెంట్ వయసు ఎంత?'

'ఎవలకెరుక? ఏమో తెల్వది. మా నాయినకంటే పెద్దోడు. డెబ్బయేండ్ల మీదుంటడు.' అని చెప్పిండు మడేల్ కులపాయన. రాసుకున్నరు.

ఇంకొన్ని వివరాలు సర్పంచికి చెప్పేది చెప్పుతుండంగనే అంబులెన్స్ కదిలింది. నిమిషాల్లో తన వేగాన్ని అందుకున్నది. ఉయ్యి ఉయ్యి అని శబ్దం చేసుకుంటూ ఊరు దాటింది. మడేల్ ఐసోలేషన్‌కు తరలించబడ్డడు.

'ఆ పెషెంట్ సంబంధీకులు ఎవరున్నరు?' అని ఎస్సై అడిగితే మౌనమే సమాధానమైంది.

'కానీ మడేల్ అన్న కొడుకు కొంరయ్య ఉన్నడు సార్' అని సాకలి సాయిలు చెప్పిండు.

కొంరయ్యకు సర్పంచి ఫోన్ కలిపిండు. ఫోన్ లౌడ్‌స్పీకర్ ఆన్ చేసి 'బిడ్డా! మీ సినబాపు మడేల్‌ను దావఖానకు తీసుకపోయింఙ్రు. మడేల్ సంబంధీకులు ఎవరున్నరు' అని ఎస్సై ఆరా తీస్తే నీకు ఫోన్ చేస్తున్న.

'రిలేషన్ కింద నీ పేరు రాస్తున్నమంటుండు సార్..' అని చెప్పుతుండు.

'సర్పంచి సాబ్! చుట్టాలనీ, పక్కాలనీ ఏదీ రాయకుండ్రి. సత్తె అనాథశవం కింద సందం చెయ్యిమను. మాకు సిన్నాయిన లేడు. వానికి మేం లేం. మాకు వాడు లేడు. గోసిగాడు గొంగడిగాడు ఎవ్వడు లేడు. ఎన్నడో వోయిండు ఎనుకట. మాకు వానికీ ఏం లేదు.' అని కొంరయ్య కట్టిరిసినట్లు మాట్లాడుతున్నడు.

'చట్టమంటే ఏమనుకుంటుండు వాడు. ఇన్ఫర్మేషన్ ఇయ్యాలే. తప్పించుకుంటండు వాడు.' గుడ్లురుముతూ ఎస్సై 'వాని డిటెల్స్ రాసుకున్నవా?' అని రైటర్‌ను అడిగిండు.

'రాసుకున్న సార్' అని తలూపిండు రైటర్.

పారిశుద్ధ కార్మికులు కొంతమంది చెత్తను ఎత్తిపోత్తుంఙ్రు. మరొకరు మందు పిచికారి చేస్తంఙ్రు. డాక్టర్ కత్తి మల్లయ్యగారి పర్యవేక్షణలో సిద్ధిపేట ఐసోలేషన్ వార్డులో తన సిబ్బందితో కలిపి చికిత్స చేస్తున్నరు. రోగుల్ని కంటికి కనుపాపలా చూస్తడు. డాక్టర్ కత్తి మల్లయ్య ఎంతోమంది రోగులకు వైద్యమేకాదు, గుండె ధైర్యాన్ని, మొండి ధైర్యాన్ని, మానసిక చైతన్యాన్ని నింపుతడు. రోగితోని ఇంట్లోల్ల లెక్క ముచ్చటవెడుతడు. అంతకుమించి చికిత్స చేస్తడు. కేస్‌షీట్‌లో స్పష్టంగా రాస్తడు. ఆకరి ఘడియల్లో ఉన్న అనేక మందిని బతికించిండు. సావవోయే యాల్ల కత్తి మల్లయ్య సార్ సేతులపడితే సాలు బతుకుతమనే పేరువోయింది.

కరోనా పేషెంట్లు కొత్తవాల్లు వస్తున్నారు. కోలుకున్నోల్లు డిశ్చార్జ్ అయి వెళుతున్నారు. పదిహేను రోజుల తర్వాత మడేల్ కోలుకున్నాడు. టెస్టులో నెగెటివ్ వచ్చింది. మంచిగైండు. అతన్ని డిశ్చార్జ్ చేస్తుంఙ్రు.

డిశ్చార్జ్ లిస్టు చూస్తే మడేల్ పేరు కనవడ్డది. అతని వయసు డెబ్బై ఏళ్లు, అని రాసి ఉన్నది.

కత్తి మల్లయ్య సార్ మడేల్ బెడ్ దగ్గరికి వోయిండు.

'మడేల్! పానం ఎట్లున్నది?' డాక్టర్ ప్రశ్న.

'ఆ.. మంచిగనే ఉన్నది. సార్! మీరిచ్చిన పానం. సచ్చినా పీడపోవు. ఎందుకు బతికిచ్చింఙ్రు. పిల్లలోన్నా. ఉన్నా. ఒక్కన్ని, పోయినా ఒక్కన్ని' అని విరక్తితో మడేల్ జవాబిస్తుండు.

'ఇచ్చిన దేవుడు కొంటవోయిన్నాడు ఏ డాక్టర్ ఆపడు. ఇపుడెట్లుందో చెప్పరాదూ?' డాక్టర్ మళ్లీ ప్రశ్నిస్తూ కేస్‌షీట్ చూస్తండు.

'మంచిగనే ఉంది. నేను గుడ్డికన్నసంటోన్ని. బతికినా లాభంలేదు. సత్తెనే ఒక్క సిత్తమవు. బతికితే బూదేవరకు నష్టమే. నా కంటే కుక్క నయం.' అంటున్నపుడు కేస్‌షీట్‌లో గోనెపల్లి అని పేరు కనపడ్డది.

'ఏ ఊరు మీది? నీ గురించి చెప్పు?' అని డాక్టర్ అడిగిండు.

మనిషి తాతిపరానికొచ్చి (నెమ్మదికి), బాగోతం బాణి అందుకొని 'ఎవరి గతి ఎటుల ఉన్నదో ఓ మాయ మనసా! ఎవరికైనా తెలియదాయెనో ఓ మాయ మనసా!' అని తత్వం పాడుతన్నడు.

పనిలో తలమునకలయ్యే డాక్టర్‌కు, నర్సులకు ఎగ్జైటింగ్‌గా అనిపించింది.

'చెప్పు.. చెప్పు పూర్తిగ చెప్పు.' డాక్టర్ అడుగుతుండు.

'నాకో ఊరున్నాది, నాకో సంసారమున్నాది? ఏ ఊరని చెప్పొత్తది బాంచెన్? పుట్టి పెరిగింది గోనెపల్లిల. ఇదే సిద్దిపాట్ల బట్టలుతుక్కుంట బతికిన. సట్టున్నపుడు సుట్టు తిరిగిండ్రు. నేను చేసినన్ని రోజులు నా పైసలు తీసుకున్నరు. నా కాల్రెక్కలు మూలకు వడ్డయి. నా బతుకు ఆగమైంది. నా ముసల్ది వోయింది బతుకు చీకటైంది. అడివిల పొద్దూకింది. అడివిల తెల్లారింది. నా గతి తలకు పాసిన ఎంటిక ఏ రేవుకు వొతేంది? అన్నట్లైంది.'

'ఏ పెద్దమనిషి.. ఊల్లెకేలి ఎట్లెల్లినవు? నీ గతం చెప్పు.' అని డాక్టర్ అడిగిండు.

'అది కీలకనామ సంవత్సరం. కానోడు కరువుల సత్తడన్నట్లు మా దండి కరువు. ఆకులు అలములు తినిబతుకుతున్న యాల్ల. శాతం దినం. మాదిగోల్లు కూడా మాకు ఆసాములే. మాదుగులకు మేం బట్టలుతుకుతున్నం. గుడ్ల రామని కొడుకులు ఏడుగురు. బవుగనే బతుకుతుండ్రు. వాల్ల తాతకు తురక జాగీరోడు ఇరువై ఎకురాల ఇనాం జాగిచ్చిండు. ఆళ్లు ఎవనికి ఆసపడక బతుకుతుండ్రు.

మాదిగోడు గెట్టుపక్కకు ఆనుకొని ఉండుడు కాపోల్లకు కండ్లు మండినయి. మాదిగొల్లు జాగబూములున్నా మాయితనాలు జేస్తండ్రు. రాజయ్య పెద్దకొడుకు బూమయ్య గెట్టుకాడ మా ఊరి పెద్దకాపుతోటి మాట బెణికింది. ఇయ్యర మయ్యర తిట్టుకున్నరు. కొట్టుకున్నరు. దడ్వతులు దండుగలయినయి. తీటది ఉన్నకాడ నిత్తె కయ్యమన్నట్లు ఊకే జవుడాలు అయినయి.

కాపొల్లకు, దొరలకు మంచి సోపతి. దొరల బిర్రు సూసుకొని కాపోడు తాపకు ముందు మాదిగొల్ల మీద కాలుదిద్దుతుండు. ఉషారు పిట్ట బూమయ్య. నమ్మిచ్చి మొసమర్రకుంట గుద్దినట్లు సూసి సూసి పోలీస్ టౌన్ల కేసు వెట్టిండు. కాపోల్లు దక్కన్న దేశం దిరిగిండ్రు. కాపొల్లకంటే ఎక్కువ దొరల ఇజ్జతి వోయింది.

కరువుకాలంల మంగలోల్లు బతకలేక మా ఊరి శాలలోల్లతోటి బీవండి

బతుకవోయింద్రు. ఊల్లె మంగలోల్లు లేరు. మంగలోల్ల మంత్రసాని పనిని ఊరోల్లు మమ్ముల చెయ్యిమన్నరు. కరువుకు కడుపుకు బతుకుడే కట్టమని కాదనక మేం సరే అని ఒప్పుకున్నం. అట్లే చేస్తున్నం. మేం వొరుసలు పెట్టుకొని పిలుసుకుందుం. బూమయ్య తమ్ముని పెండ్లాం నీళ్లు వోసుకున్నది.'

నడ్మ నడ్మ డాక్టర్ కత్తి మల్లయ్య ఊ కొడుతుండు.

'పంచాది పెట్టినా, తశ్వ చేసినా, తప్పుచేసినా మనమేం అనుకుంటే గదే నాయం. మునాసం. పంచాది మమ్ముల కాదనీ ఊరు దాటుతదా? సుట్టూ పది ఆమెడ పెట్టు పేరెల్లిన దొరలం. పుల్ల ఏత్తే పుట్టెడు నీళ్లాగుతయి. ఈ మాదిగోడు ఆగడా? మనల కాదని పొరుగూరి కుక్క మన పొలిమెర తొక్కది. మన పేరు జెప్పితే మనుషులే కాదు కుక్కలే భయపడ్తయి. ఐనా కుక్కలకున్న విలువ మాద్గులకున్నదా? మాదిగోడు ఊరు దాటితే పోగుపోత్తడా?' అని మీసాలు వొడివెట్టుకుంట కక్ష కట్టింద్రు.

మాదిగోల్లను పిల్సి, రామనితోటి ఉంటరా? మాతోటి ఉంటరా? అని అడిగింద్రు. 'దొరల, కాపొల్ల జాగ తొక్కంది, శాతలు చెయ్యంది బతుకం.' అని ఆలోచించుకొన్నరు.

'నువ్వెట్ల చెప్పితే గట్లనే దొరా!' అని పెద్దొరకు సెప్పింద్రు. పెద్దొర ఆనతి మీదికెలి మాద్గులంత ఏకమై రామయ్యకు కులం బందు పెట్టిచ్చింద్రు. ఊరుమొత్తం కట్‌బంద్ అయింద్రు. ఊల్లె ఉప్పురాళ్లు కాదుకదా అగ్గికూడా పుట్టకుంట సేసింద్రు. ఇంకొగలైతే ఉరివెట్టుకొని సచ్చెటట్టు చేసింద్రు. అయినా రామయ్య, అతని కొడుకులు ఈసమెత్తు కూడా బయపల్లేదు.

దొరలు, కాపోల్లు 'ఊరు పావంది దాటినందుకు రామయ్య కొడుకులకు పట్టిన గతే ఎవలకైనా పడుతది.' అని ఇనసెప్పింద్రు.

మా ఊల్లె మంగలోల్లు లేరు కదా! నా పెండ్లాం మంత్రసాని పనిసేత్తంది. ఇగ మేం జేసిన తప్పేంది అంటె రామయ్య కోడలు నీళ్లాడెతందుకుండె. ఆపతిపడి తండ్లాడుతుంది. మేం పోవొద్దని దీర సేసుకున్నం.

రామయ్య కోడలు పేరెత్తంగనే మల్లయ్య డాక్టర్‌కు మనసు కూలిన పాతగోడల్ని పెకిలించినట్లైంది.

'సెప్పు, సెప్పు మంత్రసాని అంటే మేం జేసే నర్సింగే కదా!' అని సిస్టర్లు తొందరపెడుతుంద్రు.

'నాతోటి ముచ్చెట పెట్టెటోల్లే ఉండరు. నన్నడిగితే ఎట్లూకుంట' అనుకొని మడేల్ శ్యాట సెరిగినట్లు సెప్పుతండు. 'మల్లక్కా! నీ కాల్లు మొక్కుత బాంచన్. మా యారాలు ఆగయ్య పెండ్లాం లస్మి ఆపతిపడ్తూ సావుబతుకుల నడ్మ కొట్టుకాడుతుంది. ఆడిదాని ఆపతి ఆడిదానికెరుక అక్కా! పవురుషాలు పెంచుకున్నరు. వాల్ల పగల మన్నువడ.

పానం బోయేతట్టున్నదే అక్కో! వాల్లు పంచాది పెట్టుకున్నా మనల్నే తిడ్తరే అక్కో! మా చెల్లె లస్మిని నువ్వే బతికించాలే అక్కా! తక్లీప్ కాన్పులు చేసిననవే అక్కా! తల్లిని పిల్లను నొక్కవోకుంట కాపాడినవే అక్కా! పసిద్దలకు దేవతవే అక్కో' అని పట్టుకున్న కాల్లను ఇడ్వకుండ బూమయ్య పెండ్లమొచ్చి నా పెండ్లాం కాల్లమీద పడి ఒక తరీక ఏడుస్తంది. నా పెండ్లాం కప్పూరమోలే కరిగిపోయింది.

నా పెండ్లాం ఒంగి కొనకొంగు తీసుకొని 'ఓ పోరీ! ఎందుకేడుత్తున్నవే? ఊకో జర సైసు' అని ఊకుంచుతూ ధైర్నం మాటలు చెప్పుతూ 'ఆడిదై పుట్టెబదులు అడివిల మానై పుడితె బాగుంది అని ఎందుకంటరు అనుకున్నవు? గిందుకే. ఆడిదంటెనే ఆపతి బతుకు. కాన్పు అంటే ఏందునుకున్నవ్? కత్తుల పరుపుమీద పొర్లినట్లు? పసిద్దందే? సచ్చి మల్ల పుట్క పుట్టినట్లు కాదే! గాయింత దానికే ఏడుత్తావే. దిక్కు లేనోల్లకు బగవంతుడే దిక్కు. మల్లి మంచిగనే ఉంటది. లస్మికి పుట్టేటోల్లు కూడా బాగానే ఉంటరు. ఎవడాగవడుతడో నేనొత్తపా. మనిషి సావంగ సూత్తారు? పా.. పా..' అని ఊకించింది. రాజయ్య భార్య ఊకున్నది.

కానుపు చేసేతందుకు బయలు ఎల్లుతుంటే 'వొద్దొద్దు' అని నేను సెప్పిన.

'ఆడిదాని కట్టం ఆడిదానికెరుక. నీకేమెరుక? నువ్ నొప్పులీసి కంటె అనపోదువు. థూ.. మీ మొగజాతే గంత. ఏడికి వోతది ఎనుపరీతి. నేను ఆపతి పడ్డపుడు నువ్వు సుట్టతాక్కుంట నిమ్మలంగ కూసున్నవు. ఆర్తివా, తీర్తివా? నే కాన్పు చేసెతందుకు వోతన్న. వొద్దున్నవనుకో మర్యాద ఉండది. నువ్వు కులం. నేను కులం. నీకు నాకూ ఇడుపుకాయిదమైనా సరే! ఉండనే ఉండ. కట్టేసినా తెంపుకొని వోతా! ఇగ వొతున్న.' అని తెగాంచి నా భార్య మల్లవ్వ, బూమయ్య భార్య ఇద్దరు కలిసి దమ్ముపట్ట మాదిగిండ్లకు ఉరికింద్రు. కానుపు చేసింద్రు.

సీకట్ల సెంద్రదీపమోల్గే మొగపిలగాడు పుట్టిండు. పుడితె పుడితెనే దనులెల్ల ఏడుస్తుంటే అందరు నవ్వింద్రు.

ఆగయ్యకు తోడుబుట్టి ఏడుగురు అన్నదమ్ముల ఆనందం తూరుపున పొడిసిన సింగిడైంది.'

డాక్టర్‌కు మనసులో ఏదో అలజడి. అది తనదా? తన వృత్తిదా? అక్కడివాళ్లెవరికీ అర్థమైతలేదు.

'మా బతుకుల్ల సీకటి అలుముకుంది. మమ్ముల ఊరంత పగవట్టింది. మాకూ కులంబంద్ పెట్టింద్రు. ఎలేసింద్రు. తెల్లారినుంచి మా ఆసాముల బట్టలు పిండవోతే బట్టలు ఎయ్యలే. బట్టలెయ్యనోల్లు బువ్వ ఏత్తరా? ఎయ్యలే. చెరువు మీద అలిగితే చెరువు ఎండుతదా? మనమెండుతమా? మనమే ఎండుతమని బతిలాడుకుంట

వోయినం. ఎవలకి శమధర్మం పుట్టలే. రాయికన్న ఇంత త్యామ(తేమ) ఉంటది కని వాల్లకు కనికరం లేపాయే. ఆ పొద్దు ఆకలితో కడుపు మాడ్సుకున్నం. కన్నీళ్లు మింగినం. పొయిమీదికి కుండ ఎక్కలే. పొయిల పిల్లిలేవలే. ఆకలి బతుకు ఆగమైంది.

రామయ్య కొడుకులు ఆగయ్య, బూమయ్య అన్నదమ్ములు దొరలను, కాపులను ఎదురు తిరిగినట్లు తిరిగేంత దమ్మో దైర్నంలేదు. వాల్ల లెక్క కాకిబలగం లేదు. బలం అంతకన్నా లేదు. దొప్పెడు జాగభూమి లేదు. మాకు సపోట్ చేసేటోల్లు లేరు. మేం కన్నీళ్లల్ల తడిసిన పచ్చులైనం. పుల్కాషులమైన మమ్ముల సూసి బాధపడ్డరు. చేసుక బతుక ఎకురం భూమి ఇస్తాన్నరు. ఎలేసినోల్లం ఒక్క దగ్గరుందాం రాంఢ్రి అని ఆగయ్య, బూమయ్యలు పిలిసింఢ్రు.

మాకే మనసొప్పలే. మేం పోలే. బతుకు దరిలేని బాయిలపడ్డది. పడగ నీడకింద ఎన్నొద్దులు బతుకుతం? కత్తులు పక్కల పెట్టుకొని పండుకునే బదలు. కన్నీలు మింగుతూ కాల్లు కడుపులకు ముడుసుకొని పండుకోవాలనుకున్నం. అందుకోసం ఊరిడువాలనుకున్నం. ఊరు గొడ్డువోతే దేశం గొడ్డువోతదా? ఈడ కాకపోతే ఇందూర్ల బతుకుతమని ముల్లే మూట సదురుకొని సిద్దిపాట తెల్లార చేరినం.

బస్టాండ్లకు వోయి నిల్సున్నం. పొద్దటిపూట ఒకమనిషి వొచ్చి చేరదీసిండు. సిద్దిపాట్లనే ఉన్నం. సందులో, మన్నో మసాడమో తగిలి ఉన్న కొడుకు నవిసిండు. కొన్నిదినాలకు గిసొంటిదే ఓ పెద్దరోగంల ఉన్నొక్క మెతుకు గంజిల వోయింది. నా కొడుకు సచ్చిపోయిండు.' అని పక్కన పల్గి ఏడిసిండు మడేల్ .

'ఊకుండు.. ఊకుండు..' అని ఓదార్చుతున్నరు. మడేల్ ఏడుస్తున్నడు. అందరి కల్లు చెమ్మగిల్లినయి. వల్లపోత మేఘం కమ్మింది. డాక్టర్ కత్తి మల్లయ్యా కూడా ఏడుస్తున్నడు. మడేల్ కండ్లు తూడుసుకున్నడు. సిస్టర్ల కండ్లు పొంగుతున్నయి.

మడేల్ సెప్పుతుంటే డాక్లర్ కత్తి మల్లయ్యకు తన తల్లి ఎప్పుడు గురుతు చేసే సాకలితల్లి మల్లవ్వ లీలగా గురుతుకొస్తుంది. 'చెప్పు చెప్పు' అని డాక్టర్ అడుగుతుండు.

'ఆగయ్య కొడుక్కు నా పెండ్లాం పేరే పెట్టుకున్నరట మల్లయ్య అని. బతికినన్ని రోజులు మల్లవ్వ, రామవ్వ అక్కా చెల్లెండోలే కూడి ఉన్నరు. కులాలు ఏరైనా రామవ్వ కొన్నిరోజుల్దాక సుట్టపు సూపోలే సిద్దిపాటకు వొచ్చినప్పుడల్లా వొచ్చిపోవు. అక్కా నీ రుణం నేను తీర్చుకున్నా నా కొడుకు తీరస్తడు. అని చెప్పు.

నా పెండ్లాం బాగాలేకుంటైంది. ఇంకొన్ని దినాలకు నా ముసల్ది అడివిల కాటగలిపి ఆవలపడ్డది. ఆమెతో సుట్టాలు పక్కాలు అందరు పోయింఢ్రు. సుతులు పోయినయి. గతులుపోయినయి. బట్టలు పిండుకుంట బతుకుతున్న. నా సావు గోనెపల్లిల కావాలని పోయిన గంతే. ఇగో గిదంత జరిగింది.' అని ముగించిండు మడేల్ ఎతలో అందరు

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 424

బొందిగెల మందం మునిగిపోయింద్రు.

కత్తి మల్లయ్య డాక్టర్ కళ్లు మూసుకున్నడు. మనసు కలుక్కుమన్నది. బాల్యమంతా సినిమా రీల్‌లా కనవడుతుంది. 'మల్లక్క నాకు సేవచేసి నిన్ను బతుకిచ్చిన దేవత. నువ్వు పుట్టెతందుకు ఊరిడిసింది. మల్లక్కలెక్క నువ్వు వైదుగం చెయ్యాలే. పుట్టవోయెటోల్ల బతికించాలే.' అని తల్లి సెప్పిన మాటలు సెవుల నిండా ప్రతిధ్వనిస్తున్నై.

'తల్లి మాటకే కద నేను డాక్టర్‌నైన. నన్నూ, నా తల్లిని బతికించిన తల్లి రుణం ఇట్లా తీర్చుకుంటా.. నా వల్ల జరిగిన నష్టాన్ని బర్తీ చేస్త' అని కళ్లు తెరిచిండు. అప్పటికే కారుతున్న కన్నీటి ధారలను తూడ్సుకుంటూ.

పీపీఈ కిట్‌లో ఉన్న డాక్టర్ కత్తి మల్లయ్య వొంగి మడేల్ కాళ్లకు దండం పెట్టిండు. 'బాపూ! నేనే ఆనాటి శిశువును. నేనే ఆగయ్య కొడుకును. మా తల్లే లస్మవ్వ. మా తల్లికి కాన్పుచేసింది మల్లవ్వనే. నన్నూ, నిన్నూ బతికించింది సాకలి మల్లక్కనే అని సెప్పేది. ఆమె పేరే నీకు పెట్టిన బిడ్డా!' అని చెప్పుతుండే.

'నీకు ఎవ్వల్లేరనకు బాపూ.. నేనున్న. ఇయ్యాల్టి నుంచి నువ్వు మాతోనే ఉండు.' అని బొంగు వోయిన గొంతుతో డాక్టర్ పిడికెడు గుండెలో దాగిన దుఃఖం సునామిలా పొంగింది. మడేల్ పొగిలి పొగిలి ఏడుస్తండు. అవ్వి కన్నీళ్లు కాదు ఆనంద భాష్పాలు.

తనబార్యకి ఫోన్‌చేసి బాపుకాని బాపు మడేల్‌ను పంపిస్తున్నడు 'నియ్యతి నీల్లల్ల ఏసినా చెడది అంటే గిదే. చేసిన మంచి అటు దిరిగి, ఇటు తిరిగి, ఆఖరికి మంచే జరిగిస్తది' అని గుసగుసలు పెట్టుకుంటుర్రు.

కరోనా పేషెంట్లతో వ్యాన్ రాంగనే డ్యూటీల్లోకి బెల్లం దగ్గరికీ ఈగెలురికిట్లే ఉరికింద్రు.

***

## డా. సిద్దెంకి యాదగిరిది

డా. సిద్దెంకి యాదగిరిది చిన్న కోడూరు, సిద్దిపేట జిల్లా. మా తొవ్వ, బతుకు పాఠం–, అచ్చు.. – కవిత్వాలు రచించారు. 'తొలి తెలుగు దళిత కథా వార్షిక – 2020', 'తొండం బొక్కెన'కు సంపాదకులుగా ఉన్నారు.

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 425

# ముక్కలైన రెక్కల కష్టం

**వేముగంటి మురళీకృష్ణ**
**9676598465.**

తెట్టన తెల్లారింది. మబ్బులనే చెట్టుమీద పడ్డ మంచు, పొద్దున సుర్యుని కిరణాలతోని ముత్యంలెక్క మెరుస్తున్నది.

చిన్న మంగళారం ఊరు మబ్బులనే లేచింది.

రాజవ్వ హోటల్ ముందటున్న చెత్తను ఊడ్చేసి చీపురు పుల్లల్ని మంచిగ చేసి ఎప్పటిలెక్కనే మూలకు పెట్టింది.

'రాజవ్వ, ఓ రాజవ్వ యాడున్నవ్' అని లాశిగ అంటున్న మొగని మాట విని, 'ఆకిలి ఊడ్చి కట్టెల పొయ్యి ముట్టిత్తున్న, మంచం దిగవా' అని బెదిరించినట్టే మొగని పిలుపుకు జవాబిచ్చింది.

మెల్లెమెల్లగ నాగండ్లు ఊరుదాటి పొలం తొవ్వ వడుతున్నె.

కొందరు చాతాగనీకి రాజవ్వ హోటల్ కట్టె

బేంచీలమీద కూర్చున్నరు.

నిన్నటి పేపర్ల తలకాయపెట్టిన ఆగమయ్య నోట్ల నోట్లనే ఏదో అనుకుంటుంటే, ఉఫ్ ఫ్ మని ఊదుకుంట చాతాగుతున్న కిష్టయ్య 'ఏందోయ్ ఎన్నడులేంది కొత్తగ పేపర్ చదువుతున్నవ్' అని ఆగమయ్యని అడిగిండు.

పేపర్ సదవనీకి కొత్త పాతేందే కిష్టయ్య మామా, అండ్లున్న ముచ్చట కొత్తగనిపిస్తె సదువుతం, సరే నువ్వు అండ్ల ఏముందో అడగక మునుపే నేనే చెప్తున్న వ్యవసాయం చేసుడు దండుగనట. వరిపంటలుగాకుంట పత్తి, పొగాకసొంటి పంటలేసుకోమని పుక్యానికొచ్చిన సలహా ఇస్తున్నడు మామను బలవంతంగ దించి కుర్చెక్కిన కొత్త

ముఖ్యమంత్రి. ఇగో సూడుపటుమని పేపర్ల వచ్చిన వార్తని కిష్టయ్యకి చూపిచ్చిండు.

'ఆయ్నగుడా వ్యవసాయం చేసినోడు కదనోయ్ అల్లుడూ, మరిగిట్లెందుకటుండో మరి' అన్నడు కిష్టయ్య.

'గీ ముచ్చట గాయన నోట్లెకేలి వచ్చింది కాదు. అమెరికోడు మనకు అప్పులిచ్చి తిప్పలు వెట్టనీకి, గిసంటి ముఖ్యమంత్రుల్ని గద్దెమీదికెక్కించి, వ్యవసాయంమీద గిటువంటి తిక్క తిక్కమాటల్ని అనిపిస్తరు' ఒత్తి ఒత్తి చెప్పిండు ఆగమయ్య.

'లావ్ అన్ని చూసినట్టే మాట్లాడుతున్నవ్.

నువ్వెప్పుడు గీ హెూటల్ల పేపరేసూడవ్' అన్న మాట కిష్టయ్యనోట్లకేలి రాంగనే పక్క బేంచి మీద చుడ్వ బుక్కుతున్న లచ్చయ్య వీళ్లిద్దరి మాటల మధ్యకుజొర్రి, గీడనే ఉంటదా పేపరు గా డిష్ సీనుషాపులకు గుడ పేపరొస్తది. మన ఆగమయ్య రోజు ఆడనే ఎక్కువ కుసుంటడు. గక్కడనే వార్తలుగుడ టీవీల చూస్తనని నాకు మస్తుసార్లు చెప్పిండు.

'ఎవరెట్లనన్న అనుకోని, ఏట్లకు పోని, మన బతుకంత యవుసం చుట్టే తిరుగుతది. యాడాదికి రెండు పంటల్ని ఏసుడు ఏసుడే ఎన్ని పైసలు తుట్టి రాని' అన్నడు ఆగమయ్య.

'ఎవరోయి ఈ జోర్ దార్ మాటలంటున్నది' తానుతాగుతున్న కరీంబీడీని పారేసి, హెూటల్ రాజవ్వ మొగడు పెంటయ్య అన్నడు లోపటినించి.

మన భూమయ్య కొడుకులేడా ఆగమయ్య గాయిన్నే గీ మాటలంటున్నది అని గడ్డమీద బాయున్న పోశయ్య అన్నడు.

'పంట వానకుతడిశిందని ఒగలేడుస్తుంటె

బియ్యంనింపనీకి ఎన్ని బస్తాలు కావాలని మునుపటికి ఒక సేటన్నడట గట్లున్నది మీ ముచ్చట' అని ఇరవై ఎకురాల ఆసామి మల్లెడ్డన్నడు.

మల్ల తనే 'మనకు ఎన్ని తక్లీఫ్లొచ్చినా యవుసంచేసుడాగదు మల్ల గిట్లనే రాజక్క హెూటల్ల ఒకల్లకొకలం మాటలనుకోక తప్పదు.

సూర్యుడు ఆకాశం పొయ్యిమీద రొట్టెలెక్క మండుతున్నడు.

రాజవ్వ గుడిసె హెూటల్ల కట్టెల పొయ్యిమీద చాయి ఉడుకుతనే ఉన్నది. వచ్చెటోల్లు వస్తనే ఉన్నరు. పొయ్యేటోల్లు పోతనే ఉన్నరు.

ఊరు పంచాయితీ ఆఫీసుకంటెక్కువ మంది గీ హెూటల్లనే కూడి గవి గివనకుంట లోకంలున్న అన్ని ముచ్చట్లు మాట్లాడుకుంటరు.

* * *

'ఓ పెంటయ్య బావ! హొటలు ఉరుస్తున్నది వానకు. ఇల్లెక్కి గా బెంగుళూరు గూనను మంచిగ సదిరిరాపో' అన్నది రాజవ్వ.

తాగుతున్న బర్కిలీ సిగరేట్ ని కాళ్లకింద నలిపేసి

నిచ్చెనేసుకొని గూనను మంచిగ జరిపి కిందికిదిగిండు.

'రాజవ్వత్త! సమోసా గరముంటె సింగల్ ప్లేట్ పట్కరా' అన్నడు కిష్టయ్య భూమి కొన్న పక్కూరు

పరమేశ్వర్ రెడ్డి. ఇనుప కుర్చి జరుపుకొని కుసోని పేపరును మర్లేసుకుంట అండ్లున్న వార్తల్ని జ(రంత మెల్లగ మీదికే చదువుతున్నడు.

హొటల్ మనుషులతోని నిండి మత్తడి దుంకడాని సిద్ధంగున్న చెరువులెక్కున్నది.

డాంబర్ రోడ్డుమీదున్న నీల్లను చిత్తుకుంట కొత్త హీరోహోండా బండి రయ్యున పోయింది. తొవ్వల నడుస్తున్న చింతకింది నర్సవ్వ మీద నీళ్లు పడ్డట్టునై, శాపనార్థాలు పెడుతున్న శబ్దం చిన్న మంగళారం సర్పంచ్ మొగిలయ్య చెవులవడ్డట్టున్నది.

'ఓ నర్సక్క! గట్ల తిట్టకు ఇవాల్ల రేపు మాటలెవరు పడతలేరు అంత మోరుదొప్పు కాలమున్నది' అన్నడు.

'నువ్వా మొగిలయ్య! ఎవల కొడుకు గా పోరడు నీకెర్కేనా' అన్నది నర్సవ్వ.

వాడా! సైడునుంచి చూస్తె మన ఆగమయ్య లేడు గాయ్న కొడుకులెక్కనే కొట్టింది. నాయ్న యవుసం భూములన్ని పిలాట్లుగొట్టి మస్తు పైసలు కమాయిస్తె, కొడుకు బలాదూర్ తిరుగుళ్లు తిరుగుతున్నడు' ఎటో మొకం పెట్టి అన్నడు మొగిలయ్య.

నువ్వన్నది నువద్దెనే ఆరేండ్లకిందట ఆగమయ్య లవ్ జోరుగ యవుసం చేస్తున్నప్పుడు మంచిగనే ఉండేటోడు. గీ భూమిజాగల రేట్లు పెరిగిన సంది గిట్లతయారై, కొడుకును గుడా గిట్ల పెంచినట్టున్నది. అవు మర్చిన నా గుడ్డంలకు ఆగమయ్య సగంలకొచ్చినహూంచాది నీ కాడనే ఉన్నది కదా మొగిలయ్య' అన్నది నర్సవ్వ.

మొగిలయ్య గింతగుడా మాట్లాడలేదు.

'కాలానికి కత్తెర్లేసుడు మనతోనయ్యే పనేనా' అని గ్యాస్సూనె స్టవ్ మీద సమోసాల్ని గోలిచ్చుకుంట 'రాజవ్వన్నది.

జరన్ని జగ్గుతోని నీళ్లియ్యక్క కొంగుకు బురుజంటింది కడుక్కుంట అన్నది నర్సవ్వ.

అంటిన బురుజని కడుక్కొని కొంగును మంచిగ పిండి, 'రాజవ్వ! ఒక గరం చాయి ఇయ్యే' అనుకుంట మొగులయ్యకెదురుంగకుసున్నది.

రోడ్డుమీద బండ్లు తిరుగుడు ఎక్కువయ్యింది. కొత్త కొత్త బండ్లు. ఎన్నడు మొకమె–రుగనోల్ల లెక్క గుడ్లప్పగించి చూస్తున్నరు హొటల్లకొందరు.

గరం చాయి తాగి లేసుకుంట అన్నది నర్సవ్వ మొగిలయ్యతోని ' ఒక మంచి ముచ్చట చెప్త తమ్మి! బతుకుదేమున్నది ఇవ్వాల ఇంట్ల, రేపు మంట్ల అన్నట్టుంటది. పైసల్తోని కాలాన్ని మేపం. గీ ఆగమయ్య వాళ్ల నాయ్న భూమయ్య ఒక్కెకురం పొలం దున్నుకానికి ఎంత హరిగోస వడ్డడో నాకెరుకే. ఇయ్యల్ల జరన్ని పైసలొచ్చి భూమిజాగల్ని బాగ పైసలకు అమ్ముకొని నీల్గుతుండొచ్చు. నాగలితోని భూమిని దున్ని, పండిచ్చిన పంటతోని కమాంచిన పైసలకే బర్కతుంటది. అడ్డగోలు భూమిని ముక్కలుజేసి సంపాంచిన పైసలకు రీతుండదు ప్రీతుండదు' అని కొంగును ఒక్కసారి దులిపి, చా పైసలు ఇచ్చి పోయింది నర్సవ్వ.

జీవిత సత్యంచెప్పిన నర్సవ్వదిక్కే మొకాలు పెట్టిండ్రు హొటల్ల ఉన్న అందరు.

నర్సవ్వ మాటలు మొగిలయ్య కుడిచెవిలకు దూరి ఎడమ చెవిలనుంచి జారి గాలిల కలిసిపోయినై.

మెల్ల మెల్లగ సూర్యుడు మబ్బుల గొంగడి కప్పుకొని పడమరదిక్కు నడుస్తుంటే, కొందరు వయసు పోరగాండ్లు బ్రాంది షాప్‌ల దిక్కు ఉరుకుతున్నరు.

* * *

నల్లత్రాచు లెక్క రోడ్డు చంకాయిస్తున్నది.

ఊరు భూ(మి)కంపమొచ్చినట్టు ఊగిపోతున్నది. కార్లు డాంబర్ రోడ్డుమీద విచ్చలవిడిగా తిరుగుతున్నై. మూడంత్రాల బంగ్లాలు, నాలుగంత్రాల బంగ్లాలు గల్లిగల్లీల నిండ మొలిచి గమ్మతిగమ్మతి కొడుతున్నది.

సూర్యుడు ఓజోన్ పరదా చీల్చుకొని బయట కొచ్చి నెత్తిమీద లావాలాంటి కాళ్లతోని నాట్యం చేస్తున్నడు.

స్పీడ్ గా ఒక ఆడి కారొచ్చి రెండంత్రాలున్న పంచాయితి ఆఫీసు దగ్గర ఆగింది. అండ్లనుంచి కోటు బూటేసుకున్న ఒక మనిషి దిగి, ఇక్కడ సర్పంచిల్లెక్కడ అని ఎవరినో అడుగుతుంటే చెయ్యివెట్టి ఎవరో బడిపిల్లగాడు సందులున్న మూడంత్రాల బంగ్లాను చూపెట్టి, ఎప్పటి లెక్కనే హెడ్ ఫోన్ చెవులల్ల పెట్టుకొని పాటెర్రిల పడిపోయిండు.

పెద్దకార్లొచ్చినాయిన సర్పంచ్ ఇంట్లకుపొయ్యి కాలింగ్ బెల్ కొట్టిండు.

మంచి చీరకట్టుకొని, పదితులాల బంగారం దిగేసుకున్న మొగిలయ్య భార్య బయటికొచ్చి 'ఎవరుగావాలె' అన్నది వచ్చిన పెద్ద మనిషితోని.

'మొగులయ్య లేడా ఇంట్ల, ఎన్నిసార్లు తన సెల్ఫోనికి చేసినా స్విచ్ఛాఫ్ అని వస్తున్నది.' అన్నడు.

'నిన్న బొంగులూరుకాడ ఏదో జాగ సెటిల్మెంట్ ఉండెనట. దాభాలనే తినొచ్చే సరికి రాత్రి పన్నెండుగొట్టింది. ఫోన్ చార్జింగ్ పెట్టుడు మర్సినట్టున్నడు'అన్నది.

'ఇప్పుడు ఊర్లదొరకడా' అన్నడు ఆడి కార్లో వచ్చిన పెద్ద మనిషి.

మొగిలయ్య భార్య నవ్వుకుంట 'గీ టైంల ఊర్లెవరుంటున్నరు. అందరు గా ఇబ్రహీంపట్నంల ఉన్న రిజిస్ట్రేషన్ ఆఫీసులకాడనే ఉండవట్రి. మా సర్పంచ్ సారుగుడా గాడనే దొరుకుతడు. జల్దిన పోంగ్రి మల్లెటన్న పోదిక్క దావత్ లు గీవతులని' అని మొకం ముంగటనే తలుపేసుకున్నది.

* * *

ఇబ్రహీంపట్నం మండల ప్రధాన కేంద్రం కళ కళలాడుతున్నది. రోడ్డు మధ్యల బటరుఫ్లై లైట్లు ఊరు యవుసాన్ని రెండుగ చీల్చి, మస్తి ఉడాయించుకుంట వెలుతురు ఫోజు కొడుతున్నది. కార్లొచ్చిన పెద్ద మనిషి, గ్రామ సర్పంచ్ మొగిలయ్యను దొరకవట్టుకొన్నడు ఎట్లోకట్ల .

ఊర్ల, పట్నంల పెద్ద పెద్ద బంగ్లాలుండి పెద్ద మనిషిగ పిలవబడుతున్న ఆగమయ్య, మొగిలయ్య, ఆ పెద్దమనిషి రిజిస్ట్రేషన్ ఆఫీసు దగ్గరున్న దాభాల కూర్చున్నరు. 'నువ్వెన్నన్న చెప్పు మొగిలయ్య మామా! గా జాగ గంత అగ్వలరాదే, రెండు కోట్లకు తక్కువైతె పడ్తల్ వడదే, నేనే ప్లాట్లుకొట్టి గజానికి పదివేల లెక్కన ఎన్ని అమ్మలేదు. గిప్పుడేమో ఆదిబట్ల కాడ సాఫ్టువేరు కంపెనీలు గుడా వస్తున్నయాయె. తక్కువ పైసలైతె బ్యారం కుదరదే ఏమనుకోకు. పొద్దున లెవ్వంగనే ఊర్ల ఒగలమొకం ఒగలం చూసుకునేటోల్లం' అని ముచ్చట ఖతం చేసిండు ఆగమయ్య.

ఆ పెద్దమనిషి రేటు పెంచుతలేడు. ఈ ఆగమయ్య దంగుతలేడు. బ్యారం కుదురుత లేదు.

మద్య మధ్యల మొగిలయ్య ఫోన్ పట్కోని బయిటికి పోతున్నడు, వస్తున్నడు. ఆగమయ్యకు కన్నుతోని ఏదో సైర జేస్తున్నడు.

ఆగమయ్య ఫోన్ల మెస్సేజ్లమీద మెస్సేజ్లు వస్తున్నై. అవన్ని ఫోన్ పట్కోని బయిటికి పోయిన మొగిలయ్య పంపినవే.

'ఒరే ఆగమయ్య! సారుని కారెక్కించొస్త, గప్ చుప్ గ గీడనే కుసో. అటు ఇటు

తిర్గకు. నీతోని మాట్లాడాలే' అని పెద్దసారుతోని బయిటికి నడిచిండు మొగిలయ్య.

'సారు! మీరు ఇంటికైతే పోండి. నేను అంతా సెట్ చేసి రాత్రికి ఫోన్ చేస్తా. మావోడు గట్లనే జిద్దు చేస్తడు.వానిని జుట్టు నా చేతులున్నది. మావూరి నర్సవ్వ జాగలకు కొంచం జరిగిండు. గా గెట్టు పంచాది పదేండ్ల సంది నా కాడనే ఉన్నది. గీడ తొవ్వకు రాకపోతె గాడ ఒత్తుతా. మీరు నిమ్మళంగ కారెక్కిపొండి. గా జాగ మీదయిపోయిందనుకోండ్రి, రెండు కోట్లకు గాకపోతే మూడుకోట్లకైనా వాడిని ఒప్పిస్త' అన్నడు మొగిలయ్య. పెద్దమనిషి ఇంకేదో చెప్పవోతుంటే మీరు చెప్పవోతున్నది నాకెరుకే బంగారంగడ్డసొంటి జాగసార్ అది. దాన్ని వదులుకోకుండ్రి ఒకటి దగ్గర' అని కారెక్కిచ్చిండు మొగిలయ్య గా పెద్ద మనిషిని.

* * *

చిన్న మంగళారం సర్పంచ్ ఇంటి గడియారం రాత్రి పది గంటలుగొట్టింది.

మొగిలయ్య, ఆగమయ్య ఇద్దరుగూడి రాజవ్వ హోటల్ ముంగట కారాపి దిగిండ్రు.

రాజవ్వ గ్యాస్ స్టవ్ మీద చికెన్ మంచూర్యా చేస్తుంటే, పెంటయ్య ప్లాస్టిక్ కుర్చీలమీద కుసోని, మందుతాగుతున్న వాళ్లకు దాన్ని సప్లై చేస్తున్నడు. హోటల్ నిండ రంగురంగుల ట్యుబులైట్లు అమర్చి ఉన్నై. అది రెండంత్రాల చెత్తుపోసిన బంగ్లా. ఎవల కంటికి కనవడకుంట తాగెటోల్లకు స్పెషల్ రూం మీద గట్టిచ్చిండు పెంటయ్య.

కారు ఆగింది చూసిన రాజవ్వ' మొగిలయ్యన్న! పైన మిద్దెమీద రూము ఖాళీగనే ఉన్నది కుకోపొండ్రి. అన్ని పెంటయ్యతోని పంపుత' అన్నది.

ఇద్దరు మంచిగ కుసోని ఇబ్రహీంపట్నంల గొన్న విస్కీ బాటిల్ మూతదీసి రెండుగ్లాస్లల్ల పోసుకున్నరు.

సోడా మూత ఓపెన్ చేసి ఆగమయ్య మందు గ్లాసుల పోసుకుంట 'మనమిద్దరం కలిసి ఊరవుతల ఉన్న రాజవ్వోల్ల గుడ్డాన్ని మంచి రేటుకి హైద్రాబాద్ పార్టీకి అమ్మెపటికే గింతమంచి బిల్డింగ్ కట్టి, దాభా చేసింది. మనమే లేకుంటెనా గదే నల్ల మూకుడుమీద

మిర్చి బజ్జీలేసుకుంట ఉండెటోల్లు' అని మొగిలయ్య అంటున్నంతలనే, రాజవ్వ కొడుకు కిశోర్ ఫిష్ పకోడ ప్లేటుల తెచ్చి ముంగట పెట్టిండు. ఇంకేమన్న అక్కెర ఉంటె పిలువుండ్రి. జప్పన ఉరికొస్త అన్నా అనుకుంట తంతెలుదిగిండు.

గ్లాసుల ఉన్న మందుని ఎడమచేతిల పట్టుకొని ఆగమయ్య మొగిలయ్యకు షేక్

హ్యాండు ఇచ్చుకుంట 'మస్తుగతింపినవే చక్రం. రెండుకోట్లుగుడా రావనుకున్న గా పొలానికి రెండున్నర ఇప్పిస్తున్నవ్. నీకు మంచి కమీషన్ ఇస్త. మల్ల తాపకు నిన్ను మండలాధ్యక్షున్ని చేస్త. తాగుతున్న గీ టీచర్స్ చాయిస్ మీద ఒట్టు. లేకుంటె మల్ల

గీ యవుసం మీద బతుకే కాలమా ఇది. కాగులు బియ్యంతోని కాదునోట్ల కట్టలతోని నిండాలె' అనుకుంట సర్పంచ్ మొగిలయ్య గ్లాసుకు చీర్స్ కొట్టిండు.

రాజవ్వ దాభాకు ఎదురుంగ చిన్న కల్లు దుకాణమున్నది. దాని ముంగట సీకులమ్ముతున్న నర్సవ్వ కుంపటిల బొగ్గులు మండుతున్నట్టు మండుతున్నది. కారు ఆగిన సంది అన్ని గమనించుకుంటున్నది, ఉన్న ఎకురం పొలంల సగానికి కబ్జాచేసి, ఇద్దరుగూడి ఎట్ల మందు తాగుతున్నరో అనుకొని, మనసులనే తిట్టుకున్నది.

ఆకాశంలున్న సగం చంద్రుడు నర్సవ్వ వెలిగించిన బొగ్గుల కుంపటిల కత్తిని నూరుతున్నట్టు ఉన్నది దృశ్యం అప్పుడు.

* * *

## వేముగంటి మురళీకృష్ణ

మురళీకృష్ణ పుట్టింది సిద్దిపేటలో 1972లో. ప్రస్తుతం తెలుగు ఉపాధ్యాయునిగా కొల్లూరులో పనిచేస్తున్నారు. కవిత్వం 1994 నుండి రాస్తున్నారు. 1997 రంజని కుందుర్తి అవార్డు అత్యుత్తమ కవితకు గాను పొందారు. 2009లో ఉపాధ్యాయ మాసపత్రిక కథలపోటీలో 'జాతర' అనే కథకు ప్రోత్సాహక బహుమతి లభించింది. 2010 'అలుకుబోనం' కవిత్వ సంపుటి మంజీరా రచయితల సంఘం ప్రచురించింది. 2012 జయశిఖరం కవిత్వ సంకలనానికి ప్రధాన సంపాదకత్వం, పుష్కరకవిత్వం 'మునుం' సంపాదకులలో ఒకరు. 2014లో మెదక్ జిల్లా కథా సంకలనం 'మెతుకు కతలు' సంపాదకులలో ఒకడిగా పనిచేశారు.

# మిత్రమా క్షమించు...

–జీడిగుంట రామచంద్రమూర్తి

'పూజకొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు' అని పెద్దవాళ్లు చెబుతూ ఉంటారు. ఆ సామెతకు మరో కొసమెరుపు చేర్చి 'పూర్వజన్మ సుకృతం కొద్దీ మిత్రులు చేకూరుతారు' అని వాళ్ల ముగ్గుర్నీ చూసినవాళ్లు అంటుంటారు.

'ఎవరయ్యా ఆ ముగ్గురు?' అని అడిగితే..

'మొదటివాడు సత్యం, రెండవవాడు శివం, మూడోవాడు సుందరం..' అని కూడా చెప్పేస్తారు.

ఆ మూడు పేర్లూ వాళ్ల నామకరణం నాడు తల్లిదండ్రులు పెట్టిన పేర్లు కాదు, అవి వేరే ఉన్నాయి. సత్యం అసలు పేరు సత్యమూర్తి. శివం అసలు పేరు శివరావు. ఇక సుందరం అసలు పేరు సుందరరావు. వాళ్ల ముగ్గురి స్వస్థలం హైదరాబాదే! ఆరో తరగతిలోకి వచ్చేవరకూ వాళ్లను ఆ పేర్లతోనే పిలుచుకునేవారు కూడా! అయితే వాళ్లు ఆరో తరగతిలో చేరినప్పుడు 'అటెండెన్స్ మార్క్' చేసే క్లాసు టీచర్, వాళ్ల పేర్లు చదువుతూ..

'మీ పేర్లు చాలా బాగున్నాయర్రా.. కానీ, నేను మాత్రం మిమ్మల్ని 'సత్యం, శివం, సుందరం' అని పిలుస్తాను. మీ ముగ్గుర్ని ఒకే బెంచీమీద కూర్చోపెడతాను. వెరైటీగా ఉంటుంది' అన్నారు.

అప్పట్నుంచీ ఆ పేర్లతోనే పిలువబడుతూ, ఒక బెంచీమీదనే కూర్చుంటూ పదో క్లాసుదాకా చదివి పాసయ్యారు. తర్వాత కూడా ఒకే జూనియర్ కాలేజీలో చేరి ఇంటర్ చదివారు. ఆ రోజుల్లోనే ఓ సంఘటన జరిగింది. ముగ్గురూ కలిసి ఓ ఆదివారం సాయంత్రం గండిపేట చెరువులో స్నానం చేద్దామని వెళ్లారు. నీళ్లలో సత్యం ఓ అడుగు ముందుకు వేసి, అక్కడ కాలు నేలకు అందక ప్రవాహంలో మునిగిపోయాడు. దాంతో భయపడి, రెండు చేతులూ పైకెత్తి..

'హెల్ప్ మీ.. హెల్ప్ మీ..' అంటూ కేకలు పెట్టాడు.

అప్పుడు సుందరం ఒక్క క్షణమైనా ఆలస్యం చేయకుండా అతనివైపు ఉరికి ఓ చేయి పట్టుకొని ఒడ్డుకు లాక్కొని వచ్చాడు. గట్టుమీద అతన్ని వెల్లకిలా పడుకోబెట్టి,

పీకలదాకా మింగిన నీళ్లను బయటకు కక్కించి ప్రాణాలు నిలబెట్టాడు. అదే జరిగి ఉండకపోతే ఆ ముగ్గురు మిత్రుల్లో ఇద్దరే మిగిలి ఉండేవారు. అప్పట్నుంచీ సత్యానికి సుందరం పట్ల గౌరవంతోపాటు ప్రేమాభిమానాలు కూడా ఎక్కువయ్యాయి. అప్పటినుంచీ సుందరాన్ని చూసినప్పుడల్లా 'ప్రాణదాతకు ప్రణామాలు' అంటుండేవాడు సత్యం. 'అలా అనవద్దు' అని సుందరం వారించేవాడు.

ఇంటర్ పూర్తయ్యాక ముగ్గురూ కాలేజీలు మారిపోయారు. సత్యం డిగ్రీ కాలేజీలో చేరితే, శివం మెడికల్ కాలేజీలో చేరాడు. ఇక సుందరం ఇంజినీరింగ్ కాలేజీలో జాయిన్ అయ్యాడు. కానీ, స్నేహితులుగా మాత్రం వాళ్లు విడిపోలేదు. ముగ్గురూ ఒకే కాలనీలో ఉండేవాళ్లు. కనుక, రోజూ కలుస్తూనే ఉండేవారు. సినిమాలకు, షికార్లకూ కలిసే వెళ్తుండేవాళ్లు. ఎవరైనా తెలిసినవాళ్లు ఈ ముగ్గుర్నీ ఒకేచోట చూసినప్పుడు..

'మీ చదువులు వేరైనా మీరు మాత్రం వేరువేరుగా కనిపించరేమిటయ్యా?' అని ప్రశ్నిస్తే, దానికి ముగ్గురూ ఒకే సమాధానం చెప్పేవారు..

'మన జీవితంలోని ప్రతి దశలోనూ స్నేహితులనేవాళ్లు దొరుకుతూనే ఉంటారండీ! కానీ, జీవితాంతం కలిసి ఉండే స్నేహితులే నిజమైన స్నేహితులండీ.. ఆ స్నేహమే మా మధ్య ఉంది!' అని.

ఆ స్నేహపూరిత వాతావరణంలో వాళ్లమధ్య రోజులు, వారాలు, నెలలూ, ఏళ్లుగా మారిపోతున్నాయి. అలా మారిపోయిన పదేండ్ల వ్యవధిలో వాళ్ల జీవితాల్లో అనేక సంఘటనలు జరిగాయి. సత్యం పబ్లిక్ సర్వీస్ పరీక్ష రాసి సెక్రటేరియట్‌లో ఉద్యోగం సంపాదించుకున్నాడు. మెడిసిన్ చదివిన శివం, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డాక్టర్‌గా చేరిపోయాడు. ఇంజినీరింగ్ పట్టా తీసుకున్న సుందరం మాత్రం ఢిల్లీలోని ఓ 'ఐటీ కంపెనీ'లో ఉద్యోగంలో చేరాడు.

ముగ్గురికీ అటూఇటుగా నాలుగేండ్ల వ్యవధిలో పెండ్లిళ్లుకూడా జరిగిపోయాయి. పెండ్లయిన రెండేండ్లకే సత్యం దంపతులకు ఒక మగపిల్లాడు కలిగాడు. ఆరేడేండ్లయినా శివానికీ, సుందరానికీ 'తండ్రి' హోదా లభించలేదు. సత్యం, శివం హైదరాబాద్ మాదాపూర్‌లో ఉన్న గేటెడ్ కమ్యూనిటీలోని అపార్ట్‌మెంట్‌లో పక్కపక్కనే చెరో ఫ్లాట్ కొనుక్కొని, ఒకేసారి గృహప్రవేశం చేసుకున్నారు. ఆ వేడుక చూసేందుకు ఢిల్లీ నుంచి సుందరం వచ్చాడు.

'నేను కూడా హైదరాబాద్ వచ్చేసి, ఇక్కడే వేరే 'జాబ్' చూసుకుంటానర్రా.. మీ ఫ్లాట్స్ పక్కనే మరొకటి ఖాళీగా ఉంటే చూడండి. అప్పుడు మనం ముగ్గురం ముచ్చటగా ఒకేచోట ఉండొచ్చు!' అన్నాడు సుందరం.

'నువ్వు రావాలే గానీ, మాకు అంతకంటేనా..' అన్నాడు సత్యం.

'అలా మాట వరుసకు అంటున్నాడే కానీ, అంతమంచి జాబ్ ఈ హైదరాబాద్‌లో ఇప్పటికిప్పుడు దొరకొద్దూ..?' అలా అంటే అయినా పౌరుషం వచ్చి సుందరం ఆ ప్రయత్నంలో పడతాడనుకున్నాడు శివం.

మొత్తానికి ఢిల్లీనుంచి వచ్చిన సుందరం మాత్రం సత్యం కొడుకుతో అక్కడున్న మూడు రోజులూ కాలక్షేపం చేసి మురిసిపోయాడు. వాణ్ని ఎత్తుకొని టాక్సీ ఎక్కించి ఊరంతా తిప్పాడు. వాడికి కొత్త డ్రెస్సులూ, రకరకాల బొమ్మలూ కొనిచ్చాడు.

'ఎందుకన్నయ్యా ఇంత డబ్బు ఖర్చు చేసి అవన్నీ కొనడం?' అని అడిగింది లలిత.

'నీకు తెలీదమ్మా! సత్యం నాకు స్నేహితుడే కాదు. తమ్ముడిలాంటివాడు. అప్పుడు నువ్వు వరుసకి మరదలు అవుతావ్. అయినా నిన్ను మాత్రం 'చెల్లెమ్మా' అని పిలుస్తున్నాను. అలాంటప్పుడు మీ బాబీగాణ్ని నేను పరాయివానిగా ఎలా చూసుకుంటానమ్మా.. అయినా వాడికోసం నేను చేసింది కూడా ఓ ఖర్చేనా..' అన్నాడు సుందరం.

నాలుగో రోజున అతను తిరిగి ఢిల్లీ తిరుగు ప్రయాణం అయినప్పుడు వీడ్కోలు చెప్పేందుకు అందరూ ఎయిర్ పోర్టుకి వెళ్లారు. అప్పుడు కూడా టాక్సీలో బాబీని, సుందరం తన పక్కనే కూర్చో పెట్టుకున్నాడు.

'అంకుల్! నువ్వూ, శివం బాబాయ్ మా నాన్నకు మంచి స్నేహితులట కదా..?' సుందరాన్ని అడిగాబు బాబి.

'మేం ముగ్గురం మంచి స్నేహితులం మాత్రమే కాదురా! ప్రాణస్నేహితులం. నీకు తెలుసో లేదో ఓసారి మేం ముగ్గురం చెరువులో స్నానానికి వెళ్లినప్పుడు నేను ఈత కొడుతూ, ఆ నీళ్ల ప్రవాహంలో మునిగిపోతే అప్పుడు ఈ సుందరం అంకులే నన్ను బయటకు లాగి ప్రాణాలు కాపాడాడు!' చెప్పాడు సత్యం.

'ఓఁ! గ్రేట్. అయితే సుందరం అంకుల్ హీరో అన్నమాట!' చప్పట్లు కొడుతూ అన్నాడు బాబి.

'మామూలు హీరో కాదురా! సూపర్ హీరో' పక్కనే కూర్చున్న శివం చెప్పాడు.

టాక్సీ ఎయిర్‌పోర్టుకి చేరుకోగానే తన సూట్‌కేసు తీసుకొని కిందకు దిగాడు సుందరం.

'ఉంటాను రా! అప్పుడప్పుడూ మీ బాబీగాడితో ఫోన్‌లో మాట్లాడిస్తూ ఉండూ' అని సత్యానికి చెప్పి, లోపలకు వెళ్లి పోయాడు.

ఇక శివం సంగతి సరేసరి! పక్కపక్క ఫ్లాట్లలోనే ఉంటున్నారు కనుక సత్యం దంపతులతో అతని స్నేహం మరింత బలపడింది. బాబీతో చనువుకూడా ఎక్కువైంది. ప్రతిరోజూ హాస్పిటల్‌కి వెళ్లేటప్పుడు ఓసారి వాడి బుగ్గగిల్లి ముద్దు పెట్టుకొని 'బై'

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 435

చెప్పేవాడు. మళ్లీ సాయంత్రం హాస్పిటల్ నుంచి తిరిగి రాగానే 'హాయ్ బాబీ' అంటూ పలుకరించేవాడు. బట్టలు మార్చుకొని వచ్చి, తన దగ్గరే కూర్చోబెట్టుకునేవాడు. రోజూ వాడు చేసే చిలిపి పనులగురించి సుందరానికి ఫోన్‌లో చెప్తూ ఉండేవాడు. వాడితో తీసుకున్న సెల్ఫీలూ, ఫొటోలు వాట్సప్‌లో నిత్యం అతనికి పంపుతూ ఉండేవాడు.

**'చూశావా లలితా! మనం అంటే శివానికీ, సుందరానికీ ఎంత ప్రేమో! పాపం.. వాళ్లిద్దరికీ పెండ్లిళ్లయి ఇంతకాలమైనా పిల్లలు కలుగలేదు. ఆ ఏడుకొండల వెంకన్న దయవల్ల రేపోమాపో వాళ్లకు కూడా పిల్లలు కలగాలోయ్. అప్పుడు మనం కూడా తిరుపతి వెళ్లి ఆ స్వామిని దర్శించుకుందాం.**

రోజులు అలా గడుస్తుండగా, ఓసారి బాబీకి టైఫాయిడ్ జ్వరం వచ్చింది. సత్యం కంటే శివం ఎక్కువ ఖంగారు పడిపోయాడు. వెంటనే తాను పనిచేస్తున్న హాస్పిటల్‌కి తీసుకెళ్లి అడ్మిట్ చేశాడు. చిల్డ్రన్ స్పెషలిస్టులతో వైద్యం చేయించాడు. తనూ, తన భార్య కలిసి ఆ పది రోజులూ హాస్పిటల్‌లోనే సత్యం దంపతులకు సాయంగా ఉండి సపర్యలు చేశారు. ఆ విషయాన్ని ఢిల్లీలో ఉన్న సుందరానికి ఫోన్‌లో చెప్పేసరికి అతనుకూడా ఖంగారు పడిపోయాడు. రోజుకు రెండుసార్లయినా శివానికి ఫోన్ చేసి, వాడి ఆరోగ్యం గురించి వాకబు చేసేవాడు.

'త్వరగా బాబీకి జ్వరం తగ్గిపోయి, క్షేమంగా ఇంటికి చేరిపోతే ఈసారి హైదరాబాద్ వచ్చినప్పుడు అక్కణ్నుంచి తిరుపతి వెళ్లి ఆ స్వామికి తలనీలాలు సమర్పించుకుంటా' అని మొక్కుకున్నాడు. మాటల సందర్భంలో ఆ సంగతి సత్యానికి చెప్పినప్పుడు, అతని కండ్లు చెమర్చాయి.

'చూశావా లలితా! మనం అంటే శివానికీ, సుందరానికీ ఎంత ప్రేమో! పాపం.. వాళ్లిద్దరికీ పెండ్లిళ్లయి ఇంతకాలమైనా పిల్లలు కలుగలేదు. ఆ ఏడుకొండల వెంకన్న దయవల్ల రేపోమాపో వాళ్లకు కూడా పిల్లలు కలగాలోయ్. అప్పుడు మనం కూడా తిరుపతి వెళ్లి ఆ స్వామిని దర్శించుకుందాం. నేనైతే నా తలనీలాలు సమర్పించుకుంటాను' అన్నాడు సత్యం.

'స్నేహం అంటే మీదేనండీ!' అంది లలిత అతనివైపు మెచ్చుకోలుగా చూస్తూ..

'లలితా.. ఏం చేస్తున్నావ్. నీకో శుభవార్త చెప్పబోతున్నాను. త్వరగా రావాలి' ఆఫీసునుంచి అప్పుడే ఇంటికొచ్చి.. హాల్‌లోకి అడుగుపెట్టిన సత్యం పిలిచాడు.

'వస్తున్నానండీ..' వంటింట్లోంచి బదులిచ్చింది లలిత.

'ఏమిటి డాడీ ఆ శుభవార్త? నీకు ఆఫీసులో ప్రమోషన్ వచ్చిందా..?' అక్కడే

సోఫాలో కూర్చుని సెల్‌ఫోన్‌లో 'గేమ్' ఆడుతున్న బాబి అడిగాడు.

'అంతకంటే మంచి వార్తరా!'

'ఏమిటండీ ఆ వార్త?' వంటింట్లోంచి వస్తూ అడిగింది లలిత.

'రేపు నేను మా సుందరం గాణ్ని కలుసుకోబోతున్నానోయ్' సంతోషంతో చెప్పాడు సత్యం.

'అలాగా! ఇక్కడికి వస్తున్నట్టు అన్నయ్య ఫోన్ చేశాడా..?'

'లేదోయ్! వాడు ఇక్కడకు రావడం కాదు. నేనే ఢిల్లీ వెళ్తున్నాను. రేపూ ఎల్లుండీ శని, ఆదివారాలు కదా.. హాయిగా వాడితో గడిపేస్తాను. మా ఆఫీసునుంచి కొన్ని ముఖ్యమైన ఫైళ్లు అక్కడి సెక్రటేరియట్‌లో నన్ను పర్సనల్‌గా ఇచ్చి రమ్మన్నారు. సోమవారం ఆ పని పూర్తి చేసుకొని మళ్లీ మంగళవారం బయల్దేరి వచ్చేస్తాన్లే! ఫ్లయిట్ టిక్కెట్లు ఆఫీసువాళ్లే అరేంజ్ చేశారు'

'మేం కూడా వస్తామండీ' పక్కనే కూర్చొని అడిగిందామె.

'మీరా..?'

'అవునండీ.. మన పెండ్లి అయ్యాక హనీమూన్ తీసుకెళ్తానని చెప్పారు గుర్తుందా..? ఇదిగో వెళ్దాం.. అదిగో వెళ్దాం.. అంటూ పదేండ్ల నుంచీ వాయిదాలమీద వాయిదాలు వేసేశారు. మనకు బాబిగాడు కూడా పుట్టేసి ఎనిమిదేండ్లు అయిపోయింది. ఇప్పుడైనా తీసుకెళ్లండీ! పైగా నేను ఎప్పుడూ విమానం ఎక్కలేదు కూడానూ..' గారాలు పోతూ చెప్పింది.

'ఇప్పటికిప్పుడు అడిగితే ఎలాగోయ్? టికెట్స్ దొరకొద్దూ?'

'మీ స్నేహం పవిత్రమైందే అయితే తప్పకుండా దొరుకుతాయి. నెట్‌లో చూడండి'

'ఔను డాడీ! తప్పకుండా దొరుకుతాయి. నేను దేవుడికి దండం పెట్టుకుంటాను. నాక్కూడా సుందరం అంకుల్‌ని చూడాలని ఉంది. చూడు డాడీ' అంటూ దగ్గరకొచ్చి కంప్యూటర్ ఓపెన్ చేసి అడిగాడు బాబి.

'తప్పదా?' అంటూ నెట్ ఓపెన్ చేసి చూశాడు సత్యం.

ఫ్లయిట్‌లో చాలా ఖాళీలే ఉన్నట్లు

గమనించాడు.

'ఓఁ! చాలా ఖాళీలున్నాయి. శివంగాణ్ని కూడా అడిగితే బాగుంటుందేమో.. వాడుకూడా వస్తాడు'

'అడగండి!' సెల్‌ఫోన్ అందిస్తూ చెప్పింది లలిత.

'ఏమిటి చెల్లెమ్మా.. అడగమంటున్నావ్! ఎవర్నీ?' అప్పుడే ఆ ఇంట్లోకి అడుగుపెట్టిన శివం అడిగాడు. అక్కడే ఉన్న సోఫాలో కూర్చుంటూ..

'నిన్నేరా.. సమయానికి వచ్చావ్! నేను ఫ్యామిలీతో రేపొద్దున ఫ్లయిట్‌లో ఢిల్లీ వెళ్తున్నాను. నువ్వూ, మీ ఆవిడా కూడా వస్తే బాగుంటుందనుకున్నాం. నాలుగు రోజుల్లో వచ్చేద్దాం. అఫ్‌కోర్స్! అక్కడ సెక్రటేరియట్‌లో నేను ఓ రోజు పని చూసుకోవాలనుకో.. మిగతా మూడు రోజులూ సుందరంతో కలిసి గడిపేయొచ్చు' హుషారుగా చెప్పాడు సత్యం.

'సారీరా.. నేను రాలేను..'

'అదేమిట్రా.. స్పృహలో ఉండే ఆ మాట చెప్పావా..?' అడిగాడు సత్యం.

'స్పృహలో లేకపోయినా బాగుండేది!'

'అంటే.. ఏమిటి నీ ఉద్దేశ్యం?'

'నువ్వు కూడా సుందరం ఇంటికి వెళ్లేందుకు వీల్లేదు' అంటూ సోఫాలోంచి చివాల్న లేచాడు.

'జోకులెయ్యకు! నువ్వు రావాల్సిందే. అస్తమానూ మనం సుందరాన్ని వీడియో కాల్స్‌లో చూసుకోవడమే తప్ప పర్సనల్‌గా కలువలేకపోయాం. ఎప్పుడో ఏడాది క్రితం మన ఇండ్ల గృహప్రవేశానికి వచ్చాడు'

శివం మాట్లాడలేదు. అతని కండ్లు చెమ్మగిల్లుతున్నాయని గ్రహించాడు సత్యం.

'ఏమైందిరా? మీ మధ్య ఏమైనా మనస్పర్ధలు వచ్చాయా?' అడిగాడు మళ్లీ.

'ఆఁ! అవును. అలాంటివే. నువ్వు వాడి ఇంటికి వెళ్తే మనమధ్య కూడా వస్తాయి!'

ఈసారి సత్యం కండ్లు చెమ్మగిల్లాయి.

'ఏమైందిరా! వాడితో మనస్పర్ధలా? పైగా నన్ను కూడా కలవద్దంటావా..? ఎందుకిలా మాట్లాడుతున్నావ్?'

'ఎందుకో నువ్వు తిరిగి వచ్చాక చెప్తాను. నువ్వు మాత్రం ఈ ట్రిప్పులో వాణ్ణి కలవడానికి వీల్లేదు. కలిశావంటే.. నామీద ఒట్టే!' గబగబా బయటకు నడిచాడు శివం.

నిశ్చేష్టుడై అటే చూస్తూ తలపట్టుకున్నాడు సత్యం.

మర్నాడు పొద్దున్నే కుటుంబంతో కలిసి ఎయిర్‌పోర్టుకి వెళ్లాడు సత్యం. విమానం ఎక్కి మధ్యాహ్నం రెండయ్యేసరికి ఢిల్లీకి చేరుకొన్నారు. ఆ రోజంతా రెస్టు తీసుకొని తర్వాత రెండు రోజుల్లో అక్కడ చూడాల్సిన ప్రదేశాలన్నీ చూసేశారు. సోమవారం ఆఫీసు పని పూర్తి చేసుకొని హెూటల్ రూమ్‌కి వచ్చాడు సత్యం.

'పని అయిపోయిందిగా.. ఇంక సుందరం అంకుల్ ఇంటికి వెళ్దాం డాడీ!' అడిగాడు బాబి.

'ఇప్పుడు వెళ్లడం కష్టం రా! వాడిల్లు ఇక్కడికి చాలాదూరం'

'అయితే మాత్రం టాక్సీలో వెళ్లొచ్చు కదా..'

'ఇప్పుడు ఓపిక లేదు నాన్నా' చెప్పాడు సత్యం.

'అదేం కాదులే. నాకు తెలుసు. అక్కడకు వెళ్ల వద్దని శివం అంకుల్ చెప్పాడుగా! నేను విన్నాను..'

'మరింకేం.. అందుకే వాళ్లింటికి వెళ్లదల్చుకోలేదు. పైగా తనపైన ఒట్టుకూడా వేసుకున్నాడు!'

'అయితే ఏం? ఒట్టు తీసి గట్టున పెట్టవచ్చుట డాడీ. ఓసారెప్పుడో మమ్మీ చెప్పింది'

'గట్టున పెట్టే ఒట్టు కాదురా మాది. కట్టుబడి ఉండే ఒట్టు!' చెప్పాడు సత్యం.

'అయితే ఓసారి అంకుల్‌కి ఫోన్ చేసివ్వు. నేను మాట్లాడుతాను. ఢిల్లీ వచ్చామని చెప్తాను. అప్పుడు తనే మనల్ని చూడటానికి వస్తాడు' సలహా ఇచ్చాడు బాబి.

ఈ సలహా సత్యానికి నచ్చింది. వెంటనే ఫోన్ తీసి సుందరం నంబర్‌కి కాల్ చేశాడు. స్విచ్ ఆఫ్' అని వచ్చింది.

ఆ మాటే బాబికి చెప్పి, 'ఇంక వదిలెయ్' అన్నాడు.

మర్నాడు ముగ్గురూ కలిసి హైదరాబాద్ తిరుగు ప్రయాణం అయ్యారు. విమానంలో కూర్చున్నాడన్న మాటేగానీ, సుందరాన్ని కలుసుకోలేదన్న బాధతో సత్యం మనసంతా అల్లకల్లోలమైపోయింది. అసలు సుందరాన్ని శివం ఎందుకు కలుసుకోవద్దన్నాడో..? ఇద్దరి మధ్యా మనస్పర్థలు ఎందుకొచ్చాయో..? ఒకవేళ వచ్చాయే అనుకున్నా.. తనను కలవద్దనడానికి కారణం ఏమిటో..? ఎంత ఆలోచించినా సమాధానం దొరకలేదు.

ఆ కలవరపాటుతోనే హైదరాబాద్ చేరుకొని ఇంటికి వచ్చాడు సత్యం.

రాగానే వాళ్లను చూసిన శివం.. 'వచ్చేశారా' అంటూ ఆనందంతో బాబిగాణ్ని దగ్గరకు తీసుకున్నాడు.

'ఇదేమిట్రా? ఈ నాలుగు రోజుల్లోనే వీడు ఇంతగా చిక్కిపోయాడు..' అడిగాడు సత్యాన్ని.

'చిక్కిపోలేదు. సుందరాన్ని చూడలేక పోయినందుకు బెంగ పెట్టుకున్నాడు' ముఖం పక్కకు తిప్పుకొని చెప్పాడు సత్యం.

'సారీరా.. నన్ను క్షమించు. నా మాట విని వాడి దగ్గరకు వెళ్లలేదు!'

'అదే! వాడి దగ్గరకు ఎందుకు వెళ్లవద్దన్నావో ఇప్పుడైనా చెప్పు. వచ్చాక చెప్తానన్నావ్‌గా! మీ మధ్య మనస్పర్థలు ఎందుకు వచ్చాయ్?' అడిగాడు సత్యం.

'మనస్పర్థలు కాదురా.. వాడికి.. అదే సుందరానికి కరోనా వైరస్ సోకిందిరా.. ఆసుపత్రిలో ఉన్నాడు!' కంటతడితో చెప్పాడు శివం.

అంతే.. నోట మాట రాలేదు సత్యానికి. అక్కడే ఉన్న సోఫాలో కూలబడి పోయాడు.

'అయ్యో..' అంటూ లలితకూడా అతని పక్కనే కూర్చుండిపోయింది.

'ఎ.ప్పు.డు.' నెమ్మదిగా అక్షరాల్ని కూడదీసుకుంటూ అడిగాడు సత్యం. దిగులుగా చూస్తూ..

'అప్పుడే పది రోజులైందిరా.. మీ ఢిల్లీ ప్రయాణానికి ముందు యథాలాపంగా వాడికి ఫోన్ చేశాను. వాడు ఎత్తలేదు. చెల్లెమ్మ ఫోన్ తీసింది. 'ఆయనకు కరోనా సోకింది అన్నయ్య గారూ! ఆసుపత్రిలో చేర్పించాను. నాలుగు రోజులైంది. అసలు తనకు కరోనా వచ్చిన విషయం ఎవరికీ చెప్పవద్దన్నాడు. ముఖ్యంగా మీకు చెప్పి, మిమ్మల్ని బాధ పెట్టడం ఆయనకు ఇష్టం లేదు' అని చెప్పింది. నేను షాక్ అయ్యాను' తన బాధను హృదయంలో దాచుకుంటూ చెప్పాడు శివం.

'అయితే మనం అర్జంటుగా చెల్లెమ్మతో మాట్లాడాలిరా.. ఓసారి వీడియో కాల్ చేసి వాణ్ని చూపించమందాం..' అన్నాడు సత్యం.

'సాయంత్రం ఐదింటికి విజిటింగ్ అవర్స్ ఉంటాయి. అప్పుడు చెల్లెమ్మ ఆసుపత్రిలో ఉంటుంది' చెప్పాడు శివం.

ఆ రోజంతా 'సాయంత్రం ఎప్పుడవుతుందా?' అని ఎదురు చూస్తూ గడిపేశారు. పది నిమిషాల ముందే సుందరం భార్యకు వాట్సప్ద్వారా వీడియో కాల్ చేశాడు శివం. ఆమె ఫోన్ ఎత్తింది.

'హలో..!'

'ఏమిటి చెల్లెమ్మా ఈ దారుణం? సుందరానికి కరోనా సోకిందనీ, వాణ్ణి ఆసుపత్రిలో చేర్పించారని శివం చెప్పాడమ్మా.. ఇప్పుడు ఎలా ఉన్నాడు?' ఆందోళన నిండిన స్వరంతో అడిగాడు సత్యం.

'ఎలా ఉన్నారంటే ఏం చెప్పమంటావ్ అన్నయ్యా.. ఆ భగవంతుణ్నే అడగాలి!' దుఃఖాన్ని ఆపుకొంటూ చెప్పిందామె.

'ఏమిటమ్మా నువ్వు అంటున్నదీ?'

కంగారుగా అడిగాడు.

'ఆయన.. ఆయన.. వెళ్లిపోయారు అన్నయ్యా.. నాలుగు రోజుల్నుంచీ అసలు స్పృహలోనే లేరు. ఐ.సి.యులో ఉంచి వెంటిలేటర్ద్వారా ఆక్సిజన్ అందించారు. ఇవాళ పొద్దున్నే ఊపిరి ఆగిపోయింది. అంతా అయిపోయింది అన్నయ్యా!' ఏడుస్తూ చెప్పింది.

'అయ్యో.. భగవంతుడా!' అంటూ మరోమాట మాట్లాడలేకపోయాడు సత్యం.

'మరి.. అంత్యక్రియలు..' అని శివం అడగబోయాడు.

'ఇంకా కాలేదన్నయ్యా.. మార్చురీలో ఉంచారు'

'వాడి అన్నయ్య కొడుకు ఢిల్లీలోనే ఉన్నాడుగా.. కబురు పెట్టావా..?'

'కబురు పెట్టాను. కానీ, రాలేనన్నాడు. కరోనా అంటువ్యాధి కదా?'

'అయితే మాత్రం.. మాస్క్ పెట్టుకొని దూరంగా కూర్చోవచ్చుగా.. కొడుకుతో సమానం'

'వాళ్ల పెద్దవాళ్లు వద్దన్నారట. మనం ఏం చేయగలం' చెప్పిందామె.

'మరేం ఫర్వాలేదమ్మా.. నేనూ సత్యం రేపొద్దునే వచ్చేస్తాం. అంతవరకూ మార్చురీలోనే ఉంచమని డాక్టర్లకు చెప్పు. వాడి అంత్యక్రియలు మేం చేస్తాం!' అంటూ కాల్ కట్ చేసి, వెంటనే కంప్యూటర్‌లో మర్నాడు ఉదయం ఢిల్లీ ప్రయాణానికి ఫ్లయిట్ టిక్కెట్లు బుక్ చేశాడు శివం. ఆ మధ్యాహ్నం మూడు గంటలకు ఇద్దరూ ఢిల్లీ చేరుకున్నారు. వెంటనే సుందరం భార్యకు ఫోన్ చేసి, ఆసుపత్రికి చేరుకున్నారు. బరువెక్కిన హృదయాలతో, పెల్లుబికి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ.. మార్చురీలో ఉన్న సుందరం భౌతిక కాయాన్ని అంబులెన్స్‌లో పెట్టించి శ్మశానవాటికకు తీసుకెళ్లారు. చితి పేర్పించారు.

'ఒరే సుందరం! నిన్ను పోగొట్టుకోవడం మా దురదృష్టం రా! నేను ఢిల్లీ వచ్చికూడా నిన్ను చూడలేకపోయాను. నన్ను క్షమించు!' అంటూ చితిమీద పడుకోబెట్టిన సుందరం పార్థివదేహానికి నమస్కరించి నిప్పు అంటించాడు సత్యం.

'నేనూ తప్పు చేశాన్రా.. సత్యం ఢిల్లీ వెళ్తున్నాడని తెలియగానే, నిన్ను కలవడానికి వీల్లేదని ఆంక్ష విధించాను. నన్ను కూడా క్షమించు!' సత్యం వెనకాలే చితిచుట్టూ ప్రదక్షిణ చేస్తూ అనుకున్నాడు శివం.

చితి మంటలు ఉవ్వెత్తున పైకి లేచాయి.

'ఈశ్వరా! మా ప్రాణ స్నేహితుని ఆత్మకు శాంతిని చేకూర్చు. అప్పుడే మాకు ఆత్మ సంతృప్తి లభిస్తుంది' అంటూ కనిపించని ఆ పరమేశ్వరునికీ, ఎదురుగా కనిపిస్తున్న అగ్ని దేవుడికీ నమస్కరించారు. కన్నీళ్లు నిండిపోయిన వారిద్దరి కండ్లకూ ఆ చితిమంటలు మసకమసకగా కనిపించాయి.

మర్నాడు పొద్దున్నే కుటుంబంతో కలిసి ఎయిర్‌పోర్టుకి వెళ్లాడు సత్యం. మధ్యాహ్నం రెండయ్యేసరికి ఢిల్లీకి చేరుకొన్నారు. ఆ రోజంతా రెస్టు తీసుకొని తర్వాత రెండు రోజుల్లో అక్కడ చూడాల్సిన ప్రదేశాలన్నీ చూసేశారు. సోమవారం ఆఫీసు పని పూర్తి చేసుకొని హొటల్ రూమ్‌కి వచ్చాడు సత్యం.

'పని అయిపోయిందిగా.. సుందరం అంకుల్ ఇంటికి వెళ్దాం డాడీ!' అడిగాడు బాబీ.

'కష్టం రా! వాడిల్లు చాలాదూరం'

'టాక్సీలో వెళ్లొచ్చు కదా..'

'ఇప్పుడు ఓపిక లేదు నాన్నా' చెప్పాడు సత్యం.

'మరేం ఫర్వాలేదమ్మా.. నేనూ సత్యం రేపొద్దునే వచ్చేస్తాం. అంత వరకూ మార్చురీలోనే ఉంచమని డాక్టర్లకు చెప్పు. వాడి అంత్యక్రియలు మేం చేస్తాం!' అంటూ కాల్ కట్ చేసి, వెంటనే కంప్యూటర్‌లో మర్నాడు ఉదయం ఢిల్లీ ప్రయాణానికి ఫ్లయిట్ టిక్కెట్లు బుక్ చేశాడు శివం. ఆ మధ్యాహ్నం మూడు గంటలకు ఇద్దరూ ఢిల్లీ చేరుకున్నారు. వెంటనే సుందరం భార్యకు ఫోన్ చేసి, ఆసుపత్రికి చేరుకున్నారు. బరువెక్కిన హృదయాలతో, పెల్లుబికి వస్తున్న కన్నీటిని ఆపుకొంటూ.. మార్చురీలో ఉన్న సుందరం భౌతిక కాయాన్ని అంబులెన్స్‌లో పెట్టించి శ్మశానవాటికకు తీసుకెళ్లారు. చితి పేర్చించారు.

## జీడిగుంట రామచంద్రమూర్తి

నాటక రచయితగా, ఆకాశవాణి ప్రయోక్తగా చిరపరిచితులైన జీడిగుంట రామచంద్రమూర్తి, ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులో జన్మించారు. విద్యాభ్యాసం తర్వాత వరంగల్ సహకార బ్యాంకులో, విద్యాశాఖలో కొన్నాళ్లపాటు పనిచేశారు. 1971లో ఆకాశవాణిలో ప్రయోక్తగా చేరి, పూర్తిస్థాయి రేడియో కళాకారుడిగా మారారు. ఆయన రాసిన తొలి కథ 'హంస గమన'. ఆ తర్వాత 400 కథలు, 40 నాటకాలు, 8 నవలలు రాశారు. కొన్ని సినిమాలకు మాటలు అందించారు. ప్రసారమాధ్యమ రచనలో జీడిగుంటది అందె వేసిన చేయి. రేడియో, టెలివిజన్, సినిమాలద్వారా ఆయన రచనలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. రెండుసార్లు నంది బహుమతి అందుకున్నారు. కళారత్న పురస్కారంతోపాటు అనేక అవార్డులూ దక్కించుకున్నారు. అనారోగ్యంతో నవంబర్ 2020లో కన్నుమూశారు. ఆయనకు నివాళిగా ఈ కథ..

**నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం నిర్వహించిన 'కథల పోటీ-2020'లో దివంగత జీడిగుంట రామచంద్రమూర్తి సంస్మరణార్థం ప్రత్యేక బహుమతికి ఎంపికైన కథ.**

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 442

# ముల్కనూర్, నమస్తే తెలంగాణ కథల పోటీ
# బహుమతుల ప్రదాన కార్యక్రమం
# 2019, 2020



23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 443







23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 444








23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 445












ములుకనూరు ప్రజా గ్రంథాలయం
భీమదేవరపల్లి మండలం, వరంగల్ అర్బన్ జిల్లా
సెమినార్ హాల్ ప్రారంభోత్సవము
మరియు
నమస్తే తెలంగాణ - ముల్కనూరు ప్రజా గ్రంథాలయం నిర్వహించిన
జాతీయస్థాయి కథల పోటీలు-2019 విజేతలకు
బహుమతి ప్రదానం

23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 447








23-50-1_Layout 1 9/25/2021 3:34 PM Page 448

# కథ 2020

## ముల్కనూరు ప్రజా గ్రంథాలయం,
## నమస్తే తెలంగాణ